# టి. దేవేందర్ గౌడ్
# శాసనసభ ప్రసంగాలు

**(2004-2009)**

**Part - I**

**దేవేంద్ర ఫౌండేషన్**
8-2-50, రోడ్ నెంబర్ 7, బంజారాహిల్స్,
హైదరాబాద్ - 500034,
తెలంగాణ రాష్ట్రం

**Selected Assembly Speeches of**
**Sri T. Devender Goud 2004-2009 (Part -1)**

**First Edition:**
December 2015

**Copies:** 3000

**Price:** ₹ 200/-

Published by:
**Devendra Foundation**
8-2-503,Road No. 7,
Banjara Hills, Hyderabad.
Pin:500034
Telangana, India

**Design & Layout:**
Visishta Graphics

**Printed at:**
Naren Communications
Uppal, Hyderabad

“ తమ ప్రవర్తనతో, ప్రసంగాలతో చట్టసభల
ఔన్నత్యాన్ని పెంచి ఆదర్శప్రాయంగా
నిలిచిన మహానుభావులకు
ఈ పుస్తకం అంకితం ”

# నా మాట ...

మూడున్నర దశాబ్దాలు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండడమే కాకుండా ఎక్కువ కాలం అధికారంలో కొనసాగే అవకాశం కలిగింది నాకు. జడ్పీ చైర్మన్‌గా 5 సంవత్సరాలు, రాష్ట్ర కేబినెట్ మంత్రిగా పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి పరిపాలనలో భాగస్వామిని కాగలిగాను. ఆ సమయంలో ప్రజల ఆర్థిక, సామాజికాభివృద్ధికి దోహదం చేసే పలు కీలక విధానపర నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అలాగే పరిపాలనా సౌలభ్యానికి, శాంతి భద్రతల పరిరక్షణ కోసం సంబంధిత మంత్రిగా అనేక సంస్కరణల్ని ప్రవేశపెట్టి, పరిపాలనా విధానాలలో గుణాత్మక మార్పులకు దోహదం చేయడం జరిగింది. ముఖ్యంగా అభివృద్ధి ఫలాలకు ఆమడ దూరంలో వుండిన బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేందుకు, అభివృద్ధి పరిధిలోకి ఆయా వర్గాలను తెచ్చేందుకు నావంతు కృషి చేశాను. పాలనలో ప్రజాస్వామికీకరణ, వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చాను. ఆ విధంగా అధికారంలో కొనసాగినన్నాళ్లు సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిరంతరం చిత్తశుద్ధితో పాటుపడ్డాను.

ఈ కృషి అంతా ఒక ఎత్తయితే, నా రాజకీయ జీవితంలో ప్రతిపక్ష సభ్యుడిగా 2004 అసెంబ్లీ (12వ శాసనసభ)లో పోషించిన పాత్ర  మరొక ఎత్తు. నా రాజకీయ జీవితంలో అత్యంత క్లిష్టమైన దశ బహుశా అదేనేమో! 2004 అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాదాపు 10 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ అధికారంలో కొనసాగింది.  ఆ సమయంలో రాష్ట్రంలో కొన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, అవాంతరాలు ఏర్పడినా కీలక రంగాల్లో అనూహ్యమైన అభివృద్ధి జరిగింది. అయితే ఆ సమయంలో రెండో దశ ఆర్థిక సంస్కరణల అమలువల్ల కొన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలను జీర్ణించుకోలేక పోయారు. దానికి తోడు రాష్ట్రంలో ఏర్పడిన కొన్ని ప్రత్యేక రాజకీయ పరిస్థితుల కారణంగా తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఓడిపోయి కేవలం 46 మంది శాసనసభ్యులతో ప్రతిపక్షంలో కూర్చోవలసి వచ్చింది. ఆ దశలో పాలక పక్షం.. తమకు ఎదురేలేదన్న రీతిలో ప్రధాన ప్రతిపక్షాన్ని అవమానపర్చడం, చిన్న బుచ్చడం, వివక్ష ప్రదర్శించడం వంటి కవ్వింపు చర్యలకు పాల్పడింది. అంతే కాకుండా, బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని విస్మరించి తాము ఏర్పర్చుకొన్న సొంత ప్రాధాన్యతలు అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షంగా పేదల గొంతుకగా మారి,  వారి ఆవేదన, అలజడి, అసంతృప్తులను

వినిపించడానికి ప్రతి వేదికను సద్వినియోగం చేసుకోవడం జరిగింది. ముఖ్యంగా, ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక అయిన 'అసెంబ్లీ' లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అవినీతి కార్యక్రమాలను ఎత్తి చూపుతూ రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను పరిరక్షించడానికి ధర్మబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రాజీలేని పోరాటం చేయడం నాకెంతో సంతృప్తి కలిగించే విషయం.

అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనాయకుడిగా ఉన్నన్నాళ్లూ ఒక్క క్షణాన్ని కూడా వృధా పర్చలేదు. సభాకార్యకలాపాల ప్రారంభంలో వచ్చే వాయిదా తీర్మానం మొదలుకొని ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, కాలింగ్ అటెన్షన్, షార్ట్ డిస్కషన్, బిల్స్ ఇంట్రడక్షన్ ఇలా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాను. అనేక సందర్భాలలో మైక్ దొరకడం కష్టం అయింది. దొరికినా, ఎక్కువ సమయం లభించని పరిస్థితి. అయినా ప్రతి నిమిషాన్ని ప్రజా సమస్యలపై చర్చించడానికే ప్రయత్నించాను. ఆ క్రమంలో, అధికారపార్టీ సభ్యుల నుంచి అనేక మాటలు పడాల్సి వచ్చింది. ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా కొన్ని సంఘటనలు జరిగాయి. వాటిని నేను వ్యక్తిగతంగా తీసుకోలేదు. ఎవ్వరిపట్లా ద్వేష భావం పెంచుకోలేదు. సహనంతో, సంయమనంతో, సమయస్ఫూర్తితో ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వాటినన్నింటినీ భరించాను.

పార్టీల పరంగా భిన్నాభిప్రాయులు ఉన్నప్పటికీ క్షణికావేశంలో భావోద్వేగాలతో కొన్నిసార్లు పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకొన్నప్పటికీ, అన్ని పార్టీలకు చెందిన సభ్యులు నా పట్ల గౌరవం, అభిమానం చూపడాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను.

ముఖ్యమంత్రి, మంత్రులు సైతం నేను లేవనెత్తిన ఆయా అంశాల్లో సహేతుకతను గుర్తించి అన్ని సందర్భాలలో కాకపోయినా కొన్నిసార్లు వాస్తవాల్ని స్వీకరించి తదనుగుణంగా విధానపరమైన నిర్ణయాలలో మార్పులు చేసుకొన్నారు. బలహీనవర్గాల సంక్షేమానికి సంబంధించి నిధుల కేటాయింపులలో అన్యాయాల్ని నిలదీసినప్పుడు ప్రభుత్వపరంగా సానుకూలత వ్యక్తం అవడం నాకు తృప్తినిచ్చే అంశాల్లో ఒకటి. చట్టాల్ని రూపొందించడానికి సంబంధిత 'బిల్స్' కొన్నింటిని ఆమోదం కొరకు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు నా అనుభవంలో వున్న విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. భవిష్యత్తులో ఏరకమైన ఇబ్బందులొస్తాయో చెప్పినప్పుడు ప్రభుత్వం సానుకూలతతో వాటిని పరిగణనలోకి తీసుకొన్న సందర్భాలు ఉన్నాయి.

నిజం చెప్పాలంటే 12వ శాసనసభలో నేను ప్రస్తావించని అంశమే లేదంటే అతిశయోక్తికాదు. సంక్షేమ హాస్టళ్లలోని దుర్భర పరిస్థితులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మైనార్టీలకు రిజర్వేషన్లు, రైతాంగ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల్లో

అవినీతి, కృష్ణా, గోదావరి జలాల వినియోగం, అంతర్రాష్ట్ర జల వివాదాలు, 610 జీవో, తెలంగాణ ప్రాంత సమస్యలు, ఔటర్ రింగ్ రోడ్డు అవకతవకలు, భూముల కేటాయింపుల్లో అక్రమాలు మొదలైనవి కొన్ని ఉదాహరణలు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు జరిగిన అన్యాయాలను సభలో ప్రస్తావించాను. ప్రభుత్వాన్ని నిలదీశాను. చివరకు తెలుగుదేశం పార్టీ నాయకులు కొందరు దారుణంగా చంపబడితే, ఆ హత్యలపై కూడా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసి ప్రజల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

ప్రతిపక్ష సభ్యుడిగా ఉన్న ఆ దశలో ప్రభుత్వం నుంచి తగిన సమాచారం లభించడం కష్టమైంది. ఆ నేపథ్యంలో పార్టీపరంగా, వ్యక్తిగతంగా సమాచార సేకరణ చేసుకొని, దానిని అధ్యయనం చేస్తూ.. అవసరమైన సందర్భాలలో ఆయా రంగాలకు చెందిన నిష్ణాతుల్ని కలవడం, కొందర్ని పిలిపించుకొని చర్చించుకోవడం ఇలా ఎంతో హోంవర్క్ చేయడం జరిగింది. ఎన్నడూ అసెంబ్లీకి అరకొర సమాచారంతో వెళ్లలేదు. సమగ్ర సమాచారంతో దాదాపుగా ప్రతి అంశంపైన సాధికారితతో మాట్లాడానని భావిస్తాను. అలాగే ఎంతటి ఉద్విగ్న పరిస్థితుల్లో కూడా లక్ష్మణ రేఖ దాట లేదు. శాసనసభ ఔన్నత్యాన్ని, సంప్రదాయాలను కాపాడడంలో ఎప్పుడూ ముందున్నాను. ఆ సమయంలో ప్రతిపక్షాల కృషికి తోడుగా మీడియా కూడా తగిన విధంగా స్పందించింది.

ఆ విధంగా నేను 12వ శాసనసభలో ప్రతిపక్ష సభ్యుడిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో చేసిన ప్రసంగాలలో కొన్ని విలువైన అంశాలు ఉన్నాయని వాటిని సంకలన పరిచి పుస్తక రూపంలో తెచ్చినట్లయితే ఒక రికార్డుగా ఉండటమే కాకుండా భావితరాల వారికి ఉపయోగ పడతాయని కొందరు మిత్రులు సలహా ఇచ్చారు. వారి సూచన మేరకు కొన్ని ప్రసంగాలను సంకలనం చేసి పుస్తక రూపంలో మీ ముందుకు తెస్తున్నాము. వివిధ సందర్భాలలో సభలో చేసిన ప్రసంగాలను పాఠకుల సౌలభ్యం కోసం సబ్జెక్టు వారీగా ఒక చోటుకు తేవడం జరిగింది. పార్ట్-1, పార్ట్-2 గా ప్రచురిస్తున్న ఈ నా ప్రసంగాలు ఏ కొద్ది మందికైనా ఉపయోగపడితే సంతోషిస్తాను. ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన మిత్రులందరికీ పేరుపేరున కృతజ్ఞతలు, అభినందనలు.

(టి. దేవేందర్ గౌడ్)

# ప్రసంగాల పరంపరలో....

## 1. గవర్నర్‌గారి ప్రసంగానికి ధన్యవాద తీర్మానాలు

### బడ్జెట్‌లు, ద్రవ్య వినిమయ బిల్లులపై ప్రసంగాలు


| | | |
|---|---|---|
| 1. | గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం (4-6-2004) | 13 |
| 2. | ద్రవ్య వినిమయ బిల్లు (29-07-2004) | 25 |
| 3. | ద్రవ్య వినిమయ బిల్లు (30-5-2005) | 34 |
| 4. | బడ్జెట్ పై చర్చ (21-2-2007) | 63 |
| 5. | బడ్జెట్ పై చర్చ (22-2-2008) | 98 |
| 6. | అవిశ్వాస తీర్మానంపై చర్చ (1-4-2008) | 133 |
| 7. | రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (5-12-2005) | 157 |
| 8. | రైల్వే బడ్జెట్ - రాష్ట్రానికి మొండిచేయి (27-2-2007) | 164 |


## 2. సంక్షేమ రంగంపై ప్రసంగాలు


| | | |
|---|---|---|
| 1. | బీసీ సంక్షేమంపై (26-07-2004) | 169 |
| 2. | సంక్షేమ హాస్టళ్ల దుస్థితి (12-11-2007) | 173 |
| 3. | స్కాలర్‌షిప్‌లు, వసతిగృహాలలో సౌకర్యాలు (5-12-2005) | 175 |
| 4. | బీసీ సమస్యలపై చర్చ (7-11-2005) | 177 |
| 5. | బీసీల జనాభా (25-3-2006) | 179 |
| 6. | స్కాలర్‌షిప్‌ల చెల్లింపులపై (22-8-2006) | 183 |
| 7. | పెన్షన్ల పంపిణీ (15-3-2005) | 186 |
| 8. | ఐఐటీ ఏర్పాటు (28-3-2008) | 187 |
| 9. | రాజీవ్ టెక్నాలజీ యూనివర్సిటీ (19-3-2008) | 188 |
| 10. | చేతి వృత్తులకు నిరాదరణ (14-11-2007) | 195 |

11. గీత కార్మికుల సమస్యలు (28-3-2008) 198
12. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం - సమస్యలు (26-02-007) 200
13. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు, చర్చ (18-7-2007) 202
14. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ (15-11-2007) 214
15. ఎస్సీ హాస్టళ్ల స్థితిగతులు (16-11-2007) 219
16. జస్టిస్ పున్నయ్య కమిషన్‌పై చర్చ (13-12-2007) 222
17. మైనార్టీ బడ్జెట్ (5-07-2004) 224
18. మైనార్టీల సంక్షేమం (13-7-2004) 225
19. మైనార్టీలకు రిజర్వేషన్లు (7-12-2005) 229

## 3. వ్యవసాయం - అనుబంధ రంగాలపై ప్రసంగాలు

1. వ్యవసాయం - రైతాంగ సమస్యలు (22-06-2004) 237
2. వ్యవసాయ రుణ ప్రణాళిక (21-7-2004) 243
3. రైతులకు కనీస మద్దతు ధరలు (18-3-2005) 247
4. వరికి కనీస మద్ధతు ధర (20-11-2007) 249
5. ఎరువుల కొరత (16-2-2008) 251
6. సహకార సంఘాల బిల్లు (21-6-2004) 253

## 4. విద్యుత్ రంగం

1. విద్యుత్ రంగం (20-07-2004) 256
2. విద్యుత్ బిల్లుల మాఫీ (14-3-2005) 258
3. హైడల్ పవర్ ప్రాజెక్టులు (11-03-2005) 260
4. విద్యుత్ కొరత, కోతలు (24-02-2006) 266
5. గోదావరి నదిపై జల విద్యుత్ ప్రాజెక్టులు (9-12-2005) 268

# బడ్జెట్ అంశాలపై ప్రసంగాలు

బడ్జెట్ సమావేశాల్లో ప్రధానమైన ఘట్టం ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టాక ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీలో తెలియజేసే స్పందన. ప్రజల అవసరాలకు, అధికార పార్టీ ఇచ్చిన హామీలకు అనుగుణంగా కేటాయింపులు జరిగాయా? సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎలా ఉన్నాయి? మొదలగు అంశాలపై ప్రతిపక్షాలు చేసే ఉపన్యాసాలు చాలా కీలకం. ప్రజలపై ప్రభుత్వం ప్రత్యక్షంగా, పరోక్షంగా మోపే భారం, వివిధ పథకాల్లో, కార్యక్రమాల్లో జరిగే లోపాలను ఎత్తి చూపుతూ ప్రభుత్వాన్ని సవ్యదిశలో నడిచేందుకు ప్రతిపక్షాలు దోహదం చేస్తాయి. ఆ దిశలో ఈ ప్రసంగాలు సాగాయి.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలకు స్వతంత్ర భావన, ఆత్మగౌరవం, సమిష్టితత్వం అవసరం -మహాత్మా గాంధీ

# గవర్నర్‌గారి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం

4-6-2004

స్పీకర్ సార్, ఈరోజు గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రవేశ పెట్టిన తీర్మానం మీద మాట్లాడమన్నారు. మాకీ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. ఎన్నికలు అయిన తరువాత మొట్టమొదటి సారిగా రాష్ట్ర శాసనసభ సమావేశం ఏర్పాటు చేసుకున్నాము. గవర్నర్ గారి ప్రసంగంలో ఈ ప్రభుత్వం రాబోయేటటువంటి కాలంలో ఎటువంటి కార్యక్రమాలను చేపట్టబోతున్నదో ఈ రాష్ట్ర ప్రజలందరూ ఎదురు చూస్తున్న విధంగా, వారు చేపట్టబోయేటటువంటి కార్యక్రమాలు ఏమిటి, వారు ఎన్నికల సందర్భంలో చెప్పిన కార్యక్రమాలు ఎంతవరకు, ఏవిధంగా నిర్వహించ దలచుకున్నారు అనేటటువంటి విషయాలన్నీ కూడా చాలా స్పష్టంగా గవర్నర్ గారి అడ్రస్‌లో వుంటాయని ఆశించడం జరిగింది.

అధ్యక్షా! మొన్న జరిగినటువంటి ఎన్నికలు రాష్ట్ర చరిత్రలో కీలకమైన ఎన్నికలు. నిజంగా ఆ ఎన్నికలు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరిచే విధంగా ప్రజలు తీర్పును ఇచ్చారు. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు అటు ఆదిలాబాద్ నుండి అనంతపురం వరకు ప్రజానీకం అంతా ఒక చోట కూర్చొని, మాట్లాడుకొని ఎవరూ ఊహించని విధంగా తీర్పును ఇచ్చారు. దీంట్లో చాలా సర్వేలు చేసారు. ఏ సర్వే కూడా నిజం కాదని చెప్పి, ఏ రాజకీయ పార్టీ అంచనాలకు దొరకకుండా ప్రజలు ఈనాడు తీర్పును ఇచ్చారు. ప్రజాతీర్పును తెలుగుదేశం పార్టీ శిరసావహిస్తుంది. చిత్తశుద్ధితో ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలని రేయింబవళ్లు కష్టపడ్డాము. అయితే, ప్రజానీకాన్ని అన్ని సందర్భాలలో మేము ఒప్పించలేక పోయాము. చేసినటువంటి కార్యక్రమాలన్నీ కూడా వారికి అనుకూలంగా ఉన్నట్లు చూపించ లేకపోయాము. ఫలితంగా మేము అపోజిషన్‌లో కూర్చోవలసిన స్థితిని కల్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు సార్వభౌమాధికారులు. వారు ఇచ్చినటువంటి తీర్పును శిరవహిస్తామని మా బాధ్యతలను బాధ్యతాయుతంగా అవలంభిస్తామని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా! ఎన్నికలలో గెలుపోటములు సహజమే! 9 సంవత్సరాల నుండి ఈ రాష్ట్రంలో

ఏ విధమైన పరిస్థితులలో పరిపాలన చేసామని కూడా ఒకసారి అందరూ ఆలోచించుకోవాలి. ఓడిపోయిన వాళ్లకి సహజంగా బాధ ఉంటుంది. మేము ఈ రాష్ట్రానికి ఎంత చేసినా, ఎంత కష్టపడినా రేయింబవళ్లు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని రాష్ట్రాన్ని అభివృద్ధి పరచినా ప్రజలు అర్థం చేసుకోలేదని బాధగా ఉంది. అదే విధంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చాలా ఉత్సాహంగా ఉంది. ఉత్సాహంగా ఉండడంలో తప్పు లేదు. నేను గత మూడు నాలుగు రోజుల నుండి కాంగ్రెస్ సభ్యుల ధోరణి చూస్తున్నాను. వారు చాలా ఉత్సాహంతో ఉన్నారు. ఉండ వలసిన అవసరం కూడా ఉంది. అనేక విషయాలలో రాష్ట్రంలో మార్పు తెస్తామని వారు చెబుతున్నారు. ఈనాడు అనేక సమస్యలు వారి ముందు ఉన్నాయి. అవి ఏ విధంగా పరిష్కరిస్తారన్న విషయం ప్రజలు చూస్తుంటారని మరచి పోవద్దని మనవి చేస్తున్నాను. ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఒక కీలకమైన భూమికను పోషించినది. ఈ రాష్ట్ర రాజకీయాలలో చెరగని ముద్ర వేసిందని మరచిపోవద్దు.

అధ్యక్షా, 1982కు ముందు గతంలో ఏకఛత్రాధిపత్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆల్టర్నేటీవ్ పార్టీ లేనప్పుడు మా ఎన్.టి.రామారావు గారు తెలుగుదేశం పార్టీ పెట్టారు. ఆనాటి నుండి ఈనాటి వరకు చాలా కీలకమైన దశలలో అనేక అంశాలలో అనేక మార్పులను తీసుకు వచ్చింది. పార్టీ పరంగా మేము చేపట్టిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. అదే విధంగా వ్యక్తిగతంగా ప్రతి పార్టీలోను కొన్ని ఇష్యూస్ వస్తుంటాయి. ఈనాడు భగవంతుడు మనకు ఒక అవకాశం ఇచ్చాడు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఒక ప్రధానమైనటువంటి వ్యక్తి. ఈనాడు రాష్ట్రంలో ప్రజల యొక్క అవస్థలు చూసినట్లయితే వారికి అనేక సమస్యలు ఉన్నాయి. అదే విధంగా అవకాశాలు చాలా ఉన్నాయి. కాస్త లోతుకు వెళ్లినట్లయితే, ఎప్పుడు లేని విధంగా, ఎన్నడూ లేని విధంగా చాలా అవకాశాలు మన ముందుకు వచ్చాయి. ఒక వైపు టెక్నాలజీ, **ఎన్నడూ లేని విధంగా మానవ చరిత్రలో ఇండస్ట్రియల్ రివల్యూషన్ తరువాత ఈనాడు రెండవ రివల్యూషన్ మనకు అందుబాటు లోకి వచ్చింది. ఆనాడు బానిసత్వంలో ఉన్న మనము సరిగ్గా వాడుకోని ఆ ఫలితంగా ఈనాడు వెనుకబడ్డాము.** ఆ విధానాన్ని అవలంభించిన చాలా దేశాలు ముందుకు వెళ్లాయి. మనము ఈనాడు ఆ బండిని మిస్ అయ్యాము. మళ్లీ ఈనాడు రెవల్యూషన్ మన ముందుకు వచ్చింది. ఎన్నడూ లేని విధంగా టెక్నాలజీ మన ముందుకు వచ్చింది. ఈ టెక్నాలజీని వాడుకొని, ఈ టెక్నాలజీ ద్వారా మనకు వచ్చినటువంటి అనేక రంగాలలో వస్తున్నటు వంటి అవకాశాలను వాడుకొని కాస్త కష్టమైనా సరే, దీని ద్వారా ఈ రాష్ట్రంలో కొన్ని మార్పులు తీసుకురావాలని ప్రయత్నము చేసాము. ఆ ప్రయత్నంలో భాగంగా నిధులు సమీకరించుకోవడం జరిగింది. మేము అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి క్యాబినెట్ మీటింగ్‌లో చీఫ్ సెక్రటరీ గారు మమ్మల్ని ఒక ప్రశ్న అడిగారు. అదేమిటంటే, సార్ అన్ని ఆలోచన చేస్తున్నారు బాగానే ఉంది, అసలు ఈ నెల జీతాలు ఎక్కడ నుండి తెస్తారు, అది ఆలోచించండి అన్నారు. ఆ విధమైన పరిస్థితులలో ఆనాడు ప్రభుత్వం మా చేతికి వచ్చింది. ఒక వైపు నిధులు లేవు, రెండవ వైపు అత్యధికమైన సమస్యలు మా ముందు ఉన్నాయి. ఆ విధమైన పరిస్థితులలో ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని ఆలోచన చేసి, నిరంతర శ్రమ చేసుకుంటూ, అన్ని విషయాలలోను

ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రభుత్వాన్ని నడిపించామని తెలియజేస్తున్నాను. ప్రభుత్వంలో అనేక మార్పులను మేము తీసుకు రావడం జరిగింది. జవాబుదారీతనం, అకౌంటబిలిటీ ఆ విధంగా మేము బెంచ్ మార్కెట్‌ను క్రియేట్ చేసాము.

అధ్యక్షా! ఒక సామాన్యుని భాషలో చెప్పాలంటే గవర్నమెంట్ కాని, బడ్జెట్‌గాని మనం ఒక సంసారం నడిపించుకొనునట్లే. if you want development definetly మీరు ఎక్స్‌పెండీచర్ చేస్తారు. మీరేమి డెవలప్‌మెంట్ చేయకుండా ఉండాలంటే, ఉన్న డబ్బులు అక్కడే ఉంటాయి. మీకు ఫాస్ట్ డెవలప్‌మెంట్ కావాలి, ఫాస్ట్‌గా ఎక్స్‌పెండీచర్ చేయాలనుకొన్నప్పుడు సహజంగా ఇటువంటి ఓవర్‌డ్రాఫ్ట్ ప్రాబ్లమ్స్ వస్తాయి. 'నేను డెవలప్‌మెంట్‌కు పోను, ఆ ఉన్న డబ్బును మాత్రం జాగ్రత్తగా చూసుకుంటాను, ఖర్చు చేయకుండా, అభివృద్ధి చేయకుండా' అనుకుంటే తప్పకుండా మిగులు ఉంటుంది. 250 కోట్లు కాదు, 2500 కోట్ల రూ॥లు కూడా మిగులు ఉంటుంది. ఇది ఏ పెద్ద ఎకనామిస్టు అయినా చెపుతాడు. మిగులు బడ్జెట్ అనేది ఏదో పెద్ద ఇష్యూగా చెపుతున్నారు. రేపు బడ్జెట్ సెషన్ ఉంది, అప్పుడు చెప్పండి మేము ఎంత మిగులుబాటు ఇచ్చాం, మీరు ఎంత బడ్జెట్‌లో దానిని చూపిస్తున్నారో తెలుస్తుంది. ఈ రోజు అనేక రకాల స్ట్రక్చరల్ అరెంజ్‌మెంట్స్ గాని, ఇన్సెంటివ్స్ గాని మీ ముందు ఉన్నాయి. మీ బడ్జెట్‌లో చూపండి మేము ఎంత సర్‌ప్లస్ ఇచ్చాం, మీరెంత పెడుతున్నారో బడ్జెట్‌లో పెట్టకతప్పదు. ఈ అయిదు రోజుల్లో పోయింది ఏమీ లేదు. ఒక అడుగు మాత్రమే వేశాం, ఇంకా అనేక అడుగులు వేయాలి.

అధ్యక్షా! ఈ రోజు నేను ఒకటే చెప్పదలచుకున్నాను. ఏది జరిగినా, మా యొక్క ప్రభుత్వం లోపల ప్రజల భాగస్వామ్యం అనేది మేము పెంచే ప్రయత్నం చేశాము. అకౌంటిబిలిటీ మేము పెంచే ప్రయత్నం చేశాము. అడ్మినిస్ట్రేటివ్ అకౌంటబిలిటీ అనే దానికి ఒక బెంచ్ మార్కింగ్‌గా ఏర్పాటు చేసుకున్నాము. టెక్నాలజీని అన్ని రంగాల్లో ఉపయోగించడానికి పేదలందరి దగ్గరికీ దానిని తీసుకొని వెళ్లడానికి ప్రయత్నం చేశాము. The technology is not only meant for rich people it is meant for the poor people. అనే విధంగా దానిని తీసుకొని పోయే ప్రయత్నం చేశాము. అందుకే దానికి ఒక బెంచ్ మార్కింగ్‌ను ఈ రోజు ఏర్పాటు చేసుకున్నాము. దానికంటే బిలోగా పోయే పరిస్థితి ఉండదు. మీరు ఖచ్చితంగా హార్డ్‌వర్క్ చేయవలసి ఉంది. మంత్రులందరూ కూడా ఇప్పుడు వచ్చారు. చాలా సమస్యలున్నాయి. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి కూడా చాలా సమస్యలున్నాయి. దానిని మేము కొన్ని సందర్భాల్లో సింపథైజ్ చేస్తుంటాము. మీరు 14వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తే, 10 రోజుల వరకు క్యాబినెట్ ఏర్పాటు చేసుకోలేక పోయారు. మీకు ఉన్న సమస్యలు మీకు ఉన్నాయి. కాని ప్రజలకు ఆ సమస్యలు అవసరం లేదు. మీ ఇంటర్నల్ ప్రాబ్లమ్స్ ఏమిటో వాళ్లకు అవసరం లేదు. తమ సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు మీ వైపు చూస్తున్నారు. మీరు ఏవిధంగా పరిష్కారం చేయగల్గుతారు అని చూస్తున్నారు. దానిని మీరు గుర్తు పెట్టుకోవాలి. అదే విధంగా అధ్యక్షా! ఈ రోజు గెలుపు అన్నది ప్రధానం కాదు. ఎవరు ఓడిపోయారు, ఎవరు గెలిచారు అనేది అప్రస్తుతం. ప్రజానీకం ఒకటే అనుకున్నారు మమ్మల్ని ఓడగొట్టాలని. ఎన్నికల సరళి చూసే మాకు స్పష్టంగా అర్థమవుతున్నది. ఏ పార్టీ

అయినా సరే ఫరవాలేదు, అది టిఆర్ఎస్ అయినా, సిపిఐ అయినా, సిపిఎం అయినా లేదా ఆఖరకు ఇండిపెండింట్ అయినా సరే, మమ్మల్ని వద్దనుకున్నారు, మిమ్మల్ని గెలిపించారు. ఇంతకంటే సింగిల్ పాయింట్ లేదు. It is totally negative vote. The negative vote is not a positive vote for the congress party. అని ఖచ్చితంగా చెప్పదలచుకున్నాను. ఈ విషయాన్ని కూడా మీరు గుర్తు పెట్టుకోవాలి. ప్రజలు మీకు ఇచ్చిన తీర్పును పాజిటివ్‌గా మలచుకోండని మీ అందరికీ చెప్పదలచుకున్నాను. మీరు బాగా కష్టపడండి. మంచి కార్యక్రమాలు చేయండి. వాటన్నింటిని నెరవేర్చి, ఈ సందర్భంలో మంచి పరిపాలన ఇవ్వండి. మీకు ఉన్న గత చరిత్రను మరిపించే విధంగా, కొత్తదనంతో, నూతనత్వంతో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక మంచి పరిపాలన ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నదనే అభిప్రాయాన్ని ప్రజలకు కలుగజేయాలని నేను మీ ద్వారా కోరుతున్నాను. కాని ఇవ్వాళ గవర్నర్ ప్రసంగం చూసిన తరువాత ఏదో కాజ్యువల్‌గా ఇచ్చిన ప్రసంగం అని అర్థమవుతున్నది. ఏ ఒక్క కొత్త విధానాన్ని కాని, కొత్త అంశాన్ని కాని అందులో తెచ్చారా? ఆలోచించమని కోరుతున్నాను. మొన్న బిఏసి మీటింగ్‌లో కూర్చున్నప్పుడు ఇరిగేషన్ పైన మేము స్టేట్‌మెంట్ ఇస్తామని అంటే, మేము బయటకు వెళ్లి మాట్లాడుకున్నాము, ఎందుకు వీళ్లు స్పెసిఫిక్‌గా ఇరిగేషన్ మీద స్టేట్‌మెంట్ ఇస్తామంటున్నారు, గవర్నర్ అడ్రస్‌లో చాలా విషయాలు ప్రస్తావనకు వచ్చాయి కదా, మళ్లీ సెపరేట్‌గా ఎందుకు చెపుతున్నారు అని. మేము ఊహించాం, వీరు చాలా ప్రణాళికబద్ధంగా వస్తున్నట్లున్నారు, ఏయే ప్రాజెక్టులకు ఫండింగ్ లింక్ పెట్టుకున్నారు, వాటికి టైమ్ బౌండ్ పెట్టుకున్నట్లున్నారని, వాటన్నింటిని చెప్పదలచుకున్నట్లున్నారు, బాగా హోర్డ్‌వర్క్ చేస్తున్నారని అనుకున్నాము. కాని నిన్నటి డిబేట్ చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. ఒక్క కొత్త విషయాన్ని అయినా చెప్పడానికి ప్రయత్నం చేశారా? మీరు ప్రాజెక్టులన్ని కంప్లీట్ చేస్తామని చెప్పారు. రెండు, మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామన్నారు.

అలా అని మీరు గవర్నర్ ప్రసంగంలో చెప్పారు, ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రకటనలు చేశారు. అసలు ఫైనాన్షియల్ టై అప్ ఎక్కడ? ఏమి చేయదలచుకున్నారు? ఏ విధంగా ఫైనాన్స్ మొబిలైజ్ చేయదలచుకున్నారు? ఈ రోజున ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ఎన్నింటికి క్లియరెన్సులున్నాయి, దేనికి క్లియరెన్స్ ఉంది, ఏ ప్రాజెక్టుకు మీరు టై అప్ కుదుర్చుకున్నారు అవేవి చెప్పలేదు. మేము కుదుర్చుకున్న టై అప్‌లు తప్ప, కొత్తగా ఒక్కటైన ఎక్స్‌ప్లోర్ చేసి టై అప్ చేసుకున్నారా? అవన్నీ చెపుతారని అనుకున్నాం. దాని గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. మేము అన్ని ప్రాజెక్టులు కట్టిస్తాం, మా యొక్క ముఖ్యమంత్రిగారు చెప్పారు. మా అందరికీ ఆలోచన ఉందని చెప్పారు. మాకు కూడా ఆలోచన లేకుండా లేదు. మేము ఆ రోజుల్లో నిద్ర పోయి కూర్చోలేదు. మాకు ఉన్న పరిమిత ఆర్థిక వనరులతో ఏ ప్రయత్నం చేస్తే బాగుంటుంది, ఎటువంటి ఎయిడ్ తీసుకొని వస్తే బాగుంటుంది, ఎటువంటి ఫండింగ్ తీసుకొని వస్తే బాగుంటుంది అని ఆలోచించి మేము అన్నీ ఒక దాని తరువాత ఒకటి టేకప్ చేసుకుంటూ ముందుకు వెళ్లాం. There are limitations in the State. అంతేకాని అన్ లిమిటెడ్ రిసోర్సెస్ ఉన్నాయని మీరు ఊహించుకుంటే అది అమాయకత్వమే అవుతుంది తప్ప ఇంకొకటి కాదు. There is even limitation for the borrowings of the State. మీరు ఏ విధంగా 40, 50 వేల కోట్ల

రూపాయలు తెస్తామంటున్నారు? మీకు ఉన్న అరెంజ్‌మెంట్ ఏమిటో నాకు చెప్పమని కోరుతున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు రేపు క్లారిఫై చేయాలని చెప్పి కోరుతున్నాను. I do not know whether he is going to reply today. But I am expecting a reply from him. మీ డిపార్టుమెంట్ అందుకు కనీసం ప్రిపేర్ అయిందా? దీనికి సంబంధించి టెక్నికల్‌గా మీ దగ్గర ఉన్న స్టాఫ్ ఎంత? మీకు ఉన్న స్ట్రెంథ్ ఎంత? What are the altrnatives? కేవలం లెక్కలు చూపడం కాకుండా, దానికి సపోర్టింగ్ ఉండాలని చెప్పి తెలియచేస్తున్నాను. అదే విధంగా మీకు ఉన్న ఫండింగ్ ఏమిటి? దానిని ఎట్లా తేదలచుకున్నారు? బాండ్స్‌కు వెళ్లతామంటున్నారు. అనుభవజ్ఞులైన రోశయ్యగారు అనేక సందర్భాల్లో బాగా అనుభవంతో చెప్పారు. ఓపెన్ బారోయింగ్స్ తీసుకొని రావడానికి మీ యొక్క బడ్జెట్‌లో పర్మిషన్ ఉంటుందా? ప్లానింగ్ కమిషన్ పర్మిషన్ లేదని అనుకొన్నప్పటికీ, ఆ విధంగా చేసుకోవడానికి మనకు కొంతవరకు లిమిటేషన్స్ ఉన్నాయి. ఈ విషయంలో మీరు కాస్త చక్కగా వాళ్లను గైడ్ చేయండి. మీరు ఏవో చాలా హోప్స్ లేవనెత్తారు. యాజ్ ఇఫ్ మేము ఏదో చేయలేక పోయామని, మీరు అన్ని చేసేస్తామనే ధోరణిలో మాట్లాడుతున్నారు. అందులో వాస్తవాలేమిటో దయచేసి చెప్పండి. లేకపోతే నోముల నరసింహయ్యగారు ఈ అడ్రస్‌ను మార్చి, మళ్లీ సంవత్సరం తరువాత ఇటువైపు తిరిగి, ఏవిధంగా అయితే పొద్దుటి నుండి మమ్మల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నాడో, ఆ విధంగా మిమ్మల్ని అనడానికి అవకాశం ఉంది. జాగ్రత్తగా వ్యవహరించండి. People are not expecting wonders from you. They are expecting minimum from you. మినిమమ్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. ఆ మినిమమ్ వరకు ఆలోచన చేసే దానికి కావలసిన ఏర్పాట్లు చేసుకుని మీరు ముందుకు పోవాలి తప్పు, మేము ఏదో చేసేస్తామని చెప్పే ఆలోచన కాకుండా, తొందరపాటుతో దయచేసి నిర్ణయాలు తీసుకోవద్దని వారికి సలహా ఇస్తున్నాను.

అధ్యక్షా! ఈ రోజు రైతుల విషయమే తీసుకొందాం. మా పార్టీ ఆఫీసు నుండి వచ్చిన సమాచారం మేరకు 292 మంది చనిపోయారు. అడ్రస్సులతో సహా వారు మాకు వివరాలు ఇచ్చారు. ఇది పత్రికల్లో వచ్చింది. అయితే పత్రికల్లో వచ్చిందంతా నిజమని I am not claiming. మాకు ఉన్న సోర్స్ అది ఒక్కటే కాబట్టి మా పార్టీ ఆఫీసు వాళ్లు వార్తా పత్రికల నుండి సమాచారాన్ని సేకరించి మాకు ఇచ్చారు. దానిని మీరు కూడా వెరిఫై చేయండి. అయితే ఈ రోజున నేను అనేది ఏమిటంటే, ప్రమాణ స్వీకారం చేసిన తరువాత రైతులకు సంబంధించి చెప్పిన అతి కీలకమైన అంశం గురించి మీరు ఆలోచించుకొని ప్రకటన చేసి ఉండవలసింది. లేదంటే నలుగురు నిపుణులతో కలిసి ఆలోచన చేయాలి. మీ ముందు గవర్నమెంట్లు ఎందుకు ఆ విషయంలో అంత మొండిగా వ్యవహరించవలసి వచ్చిందో, దానికి గల కారణాల గురించి మీరు కొంత వరకు విశ్లేషించుకొని ఉండవలసింది. అదేమి చేయకుండా ఒక ప్రకటన చేసేసరికి ఈ ఫలితాలు వస్తున్నాయి. ఈ రోజు పేపర్లో కూడా వచ్చింది పది మంది చనిపోయారని. ఎందుకు చనిపోతున్నారు, ఎవరి ఫాల్ట్ అన్నది ఇక్కడ కాదు సమస్య. అధికారంలో ఉన్న మనం ఏ మాట మాట్లాడినా, ఏ పాలసీ గురించి చెప్పినా దాని వెనకాల ఉన్న సమస్యలేమిటి, దాని వెనుక ఉన్న మంచి చెడులు ఏమిటి అనే దాని గురించి నిదానంగా, ఓపికగా ఆలోచన చేయాలని

చెపుతున్నాను. మీ దగ్గర చాలా మంది అనుభవం గల మంత్రులు, అనుభవం గల సభ్యులున్నారు. ఎక్స్‌పర్ట్స్ అవైలబుల్‌గా ఉన్నారు. వారందరితో కూర్చొని మాట్లాడండి. మీరు అనౌన్స్ చేసిన పాలసీలో ఇప్పటికీ కూడా క్లారిటీ లేకుండా ముందుకు పోతున్నారు. టోటల్‌గా క్లారిటీ ఉందని నేను అనుకోవడం లేదు. దాని ఫలితంగా ఈనాడు అమాయక ప్రాణాలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. కాని అవి ఆగడం లేదని చెప్పి మీ దృష్టికి తీసుకొని వస్తున్నాను.

అధ్యక్షా, తొందరపాటుతో ముందుకు వెళుతున్నారు. కనుక తొందరపడవద్దు. నలుగురితో కూర్చుని ఆలోచన చేసి మీరు ఎనౌన్స్ చేయండి అంటున్నాను. మీరు రైతులకు సహాయం, హెల్ప్‌లైన్ అన్నారు. లేకపోతే కౌన్సిలింగ్ అన్నారు. లేకపోతే ఇంత డబ్బు ఇస్తాము అన్నారు. డెట్ రిలీఫ్ అంటున్నారు. డెట్ రిలీఫ్ ఏ విధంగా తేవాలి అంటున్నారు? కనుక తొందర పడవద్దు అంటున్నాను. You just sit down, apply your mind, take some body's help and advice. Then you come out with a policy. ఆ విధమైన క్రిటికల్ పాలసీ అగ్రికల్చర్ సెక్టార్‌లో మీరు ఒకసారి ఆలోచన చేయండి. మేము అగ్రికల్చర్ సెక్టార్‌కు తీరని అన్యాయం చేసినట్లు, రైతాంగానికి వ్యతిరేక ప్రభుత్వంగా మమ్ములను మీరు ఈ రోజు చిత్రీకరిస్తున్నారు. **భారతదేశం మొత్తం మీద పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయి? మొత్తం రైతాంగం పరిస్థితులు ఏ విధంగా మారాయో ఒకసారి ఆలోచన చేయండి. ఇది ఏదో మన రాష్ట్రానికో ఇంకో ప్రాంతానికో సంబంధించిన సమస్య కాదు. ఓవరాల్‌గా ఇవ్వాళ రైతులకు అనేక సమస్యలు వచ్చాయి.** మనకు ఈనాడు అనేక రకాల ఫ్రీ మార్కెట్, ఎకానమీ ఒక్కసారి ఫ్లడ్ గేట్స్ ఓపెన్ చేసినట్లు అయిపోయింది. అదే విధంగా మన రైతాంగాన్ని ఈ ప్రపంచీకరణకు సిద్ధం చేయలేకపోయాము. మీరు పోయి డబ్ల్యు.టి.ఓ. మీద సంతకాలు చేసి వచ్చారు. కాని ఇక్కడ రైతాంగాన్ని మనం ఎవరమూ కూడా సిద్ధం చేయలేక పోయాము. ప్రపంచ పోటీ తత్వానికి సిద్ధం చేయలేక పోయాము. విచిత్రమైన పరిస్థితి మన రాష్ట్రంలో, ఒకవైపు సర్‌ప్లస్. ఒకవైపు గిట్టుబాటు ధర లేదు. మా దగ్గర ఎక్కువ పంటలు పండిస్తున్నాము అని చెప్పి ఒక వైపు, రెండవ వైపు గిట్టుబాటు ధర లేక, వ్యవసాయం సరిగా జరగక రైతాంగం అనేక విధాల ఇబ్బందులు పడుతున్నారు. ఆ విధంగా మిస్ మ్యాచ్ జరగడం కూడా మనం చూస్తున్నాము.

అదే విధంగా ఈనాడు భూగర్భ జలాలు చూడండి. 22 లక్షల బోర్లు వేశాము. ఇప్పటికే భూగర్భ జలాలు 500, 1000 ఫీట్లు వేస్తున్నాము. నేను జడ్.పి. ఛైర్మన్‌గా ఉన్నప్పుడు 30 గ్రామాలలో మాత్రమే ఫ్లోరోసిస్ ఉండేది. ఈనాడు గ్రామాలు అన్ని టెస్ట్ చేస్తే 350 గ్రామాలలో ఫ్లోరోసిస్ సమస్య వచ్చింది. బికాజ్ ఓవరాల్‌గా భూగర్భ జలాలు లోతుకు పోతున్నాయి. ఒక డిస్క్రిమినేషన్‌తో బోర్స్ ఎలా చేశాము. మనం ఎందుకు చేశామో తెలుసు. రైతులు వేస్తున్నారు. మనం ఒకసారి పేపర్లలో వస్తున్న వార్తలు కాని, అదే విధంగా టి.వి.లలో వస్తున్న వార్తలు కాని చూస్తున్నాము. రైతాంగం చెబుతున్నారు. మేము ఒక్క బోర్ వేశాము, నాలుగు బోర్లు, ఐదు బోర్లు వేశాము, ఫెయిల్ అయ్యాయి. కేవలం అప్పుల పాలయ్యాము అని చెబుతున్నారు. కనుక బేసిక్ ఫండ్‌మెంటల్‌గా మొత్తం గ్రౌండ్ వాటర్ పరిస్థితి ఒకసారి ఆలోచన చేయండి. దానికి పాలసీ తయారు చేయండి. How to regulate it? ఇదే విధంగా ఊరుకుంటే కొన్ని సంవత్సరాలలో

ఎడారిలాగా అయిపోతుంది అన్న వాస్తవం గుర్తించాలి. గవర్నరు గారి అడ్రస్‌లో ఒక సింగిల్ సెంటెన్స్ రాశారు. భూగర్భ జలాల గురించి, సంతోషం. మేము "నీరు-మీరు" అంటే మీరు నవ్వారు. పేరు ఏదైనా పెట్టి ఉండవచ్చు గాక. ఆ ప్రోగ్రామ్‌లో ఎక్కడైనా అడ్మినిస్ట్రేషన్‌లో మిస్‌యూజ్ జరిగి ఉండవచ్చు. ఇంత పెద్ద అడ్మినిస్ట్రేషన్‌లో టోటల్‌గా తీసుకున్న ప్రతి నిర్ణయం అనుకున్న విధంగా జరగడానికి ఇది రాజదర్బారు కాదు. ఒక ప్రజాస్వామ్యంలో ఉన్నాము. చాలా ఒడిదుడుకులు ఉంటాయి. చాలా సమస్యలు ఉంటాయి. అడ్మినిస్ట్రేటివ్ డిఫెక్ట్స్ అవన్నీ పరిశీలన చేసుకుంటూ కంట్రోల్ చేసుకుంటూ పోవాలనుకుంటే అక్కడక్కడ కొన్ని పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. కాని బేసిక్ ఫండమెంటల్ కార్యక్రమం తీసుకున్నారు. Whether that is useful to the people or not. అడ్మినిస్ట్రేషన్‌లో సమస్యలు ఎట్లా అధిగమించాలి...

కనుక గ్రౌండ్ వాటర్ పైన దయచేసి ఆలోచన చేయండి. ఈనాడు ఉచిత విద్యుత్ ఇచ్చారు సరే. రైతాంగం బాధలో ఉన్నారు. వారికి అనేక సమస్యలు ఉన్నాయి. ఒకవైపు గిట్టుబాటు ధర లేక, మార్కెటింగ్ ఫెసిలిటీస్ లేక, ప్రకృతి పరంగా వస్తున్న ఇబ్బందులు. మా దురదృష్టమో, ఎవరి దురదృష్టమో కాని గత మూడు, నాలుగు సంవత్సరాలుగా వర్షాలు లేక చాలా ఇబ్బందుల పాలయ్యారు. ఈ సమయంలో రైతులకు వచ్చిన సమస్యలలో వారికి 5 రూపాయలు, 10 రూపాయలు కూడా ఏది మిగిలినా మిగులుబాటుగా కనిపించవచ్చు. ఆ విధంగా ఉచిత విద్యుత్ ఏదో చేస్తుంది అనుకుని ఉండవచ్చు. బాధలో ఉన్న రైతాంగం చాలా రిలీఫ్‌గా భావించి ఉండవచ్చు. అదే రిలీఫ్ అని కూడా ఆలోచన చేసుకోవచ్చు. ఈ రిలీఫ్‌తో సరిపోతుందా? న్యాయంగా అన్నీ సక్రమంగా ఉన్నట్లయితే గిట్టుబాటు ధరలు వచ్చి పంటలు బాగా పండితే ఇది రైతాంగానికి పెద్ద సమస్య కాదు. ఒక బస్తా బియ్యం అమ్మితే వచ్చినంత రేటు కూడా కాదు ఈ బిల్లు కట్టడానికి. పరిస్థితులు బాగా లేనందువల్ల ఏదైనా భారంగానే కనిపిస్తుంది. కాబట్టి దీనిని ఏ విధంగా పరిష్కారం చేయాలి అనే ఉద్దేశ్యంతో అనేక రకాల సబ్ కమిటీలు వేశాము. మీరు ఒకసారి చూడండి. మా అడ్వయిజ్ తీసుకోమని కాదు. మీరు నిర్ణయాలు తీసుకునే ముందు సబ్ కమిటీ రిపోర్ట్స్ చాలామంది ఎక్స్‌పర్ట్స్‌తో మాట్లాడి లాంగ్ టర్మ్ బెనిఫిట్ కోసం తయారు చేశాము. Kindly go through the reports of the sub committees. అగ్రికల్చర్ మినిస్టర్ గారు, ముఖ్యమంత్రి గారు, రోశయ్య గారు వాటిని ఒకసారి చదవండి. చదివి దానిలో ఉన్న మంచి పాయింట్స్ తీసుకోండి. మళ్లీ మీ టైమ్ వేస్ట్ కాకుండా కొంత వరకు దానిలో ఉన్న మంచి పాయింట్స్ తీసుకుని వాడుకున్నట్లయితే ఇమీడియట్‌గా రైతాంగానికి బెనిఫిట్ అవుతుంది. ఈ రోజు కావలసిందల్లా వాటర్ మేనేజ్‌మెంట్. దాని కోసం, డ్రిప్ ఇరిగేషన్ కోసం పెద్ద ప్రాజెక్టులు ఏర్పాటు చేశాము. ఇంతకు ముందు ముఖ్యమంత్రి గారు, రోశయ్య గారు మాట్లాడుతూ 90 శాతం డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ ఇస్తాము అన్నారు. We welcome it. But there is a danger in it. మేము అది ఆలోచన చేశాము. 90 శాతం ఎందుకు ఇవ్వకూడదు అనుకున్నాము. అది మిస్‌యూజ్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఎగ్జిక్యూషన్‌లో ఇబ్బందులు వస్తాయి అన్న సంగతి మర్చిపోకూడదు. 20 శాతం, 30 శాతం వారి ఇన్వాల్వ్‌మెంట్ ఉంటేనే ఇంటరెస్ట్ ఉంటుంది అని చెప్పాము తప్ప ఇంత పెట్టిన తరువాత రు.40, 50 కోట్లు పెట్టడానికి వెనుకకు పోలేదు. మెయిన్ కరెంటు అయినా మీరు పాలసీగా చేశారు. You have to note

క్లారిఫై చేయవలసిందిగా కోరుతున్నాను.

అదే విధంగా తీవ్రవాదం గురించి మెన్షన్ చేశారు. మేము మా పార్టీ తరపున వెల్‌కం చేస్తున్నాము అధ్యక్షా! ఈ రాష్ట్రంలో శాంతి నెలకొని వుండాలని మేము కోరుతున్నాము. ప్రభుత్వం చర్చల ద్వారా ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడానికి మీరు చేపట్టే ప్రతి చర్యకు మా మద్దతు వుంటుందని, సహకరిస్తామని చెబుతున్నాను. ఆ రకంగా మా సహకారంతో మీరు ముందుకు పోవాలని కోరుతున్నాను. (అధికార పార్టీ సభ్యుల నుంచి ఇంట్రప్షన్)

మా అజెండా పోయింది, మేము ఓడిపోయినాము. ప్రజలు ఒప్పుకోలేదు మా అజండా. మీ అజండాను అమలు చేయండి. ఎలా చేస్తారో చెప్పండి. మేము అదే అడుగుతున్నాము. మీరు చేసిన ప్రామిస్‌లు నెరవేర్చండని చెబుతున్నాను. మా అజెండాకు సపోర్ట్ దొరకలేదు. ప్రజలు ఆమోదించ లేదు కనుక ఓడిపోయి ప్రతిపక్షంలో వున్నాము. గెలిచిన ఉత్సాహంలో మీరు వున్నారు. ప్రామిస్‌లు ఎలా అమలు చేస్తారో చెప్పండి. చిత్తశుద్ధితో మంచిపేరు తెచ్చుకోండి. రోశయ్యగారు యిక్కడే వున్నారు. బ్యాక్‌వార్డ్ ఏరియాస్ గురించి రూ.1200 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రాజెక్టును పంపించాము. తీవ్రవాద సమస్య వున్న బ్యాక్‌వర్డ్ ఏరియాస్‌లో మౌలిక సదుపాయాలను పెంచడానికి, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి సంబంధించి ఒక స్కీమ్‌ను పంపాము. దాన్ని క్లియర్ చేయించుకోండి. కేంద్రం నుండి అనేక నిధులను ఆ రోజుల్లో తెచ్చాము. ఈ సందర్భంగా ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. 'వారు పోయారు, మేము గెలిచాము' ఇది మామూలు విషయం కాదు. ఈ దేశ రాజకీయాలను శాసించింది మేము. ఢిల్లీని శాసించిన పార్టీ మాది. దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో వున్న తెలుగుదేశం పార్టీని మీరు ఓడగొట్టారు. మీరు గెలిచారు. ఇది మీ గెలుపు అని నేను అనను. కర్ణుని చావుకు వంద కారణాలు అన్నట్లుగా మా ఓటమికి చాలా కారణాలు కనబడుతున్నాయి. గెలిచిన మీరు ఆ ప్రమాణాలకు తగ్గకుండా ప్రవర్తించండని చెబుతున్నాను. ఢిల్లీకి వెళ్లి మేమెప్పుడూ యింటర్‌వ్యూ కోసం పడిగాపులు పడుతూ కూర్చోలేదు. ఏ డిపార్ట్‌మెంట్‌లో, ఎక్కడ నిధులు వున్నాయనేది హోంవర్క్ చేసుకొని వెళ్లేవారము. సర్‌ప్లస్ ఎక్కడ వుంటే అక్కడి నుండి తెచ్చుకున్నాము. ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు వస్తున్నాయని మీరే అన్నారు. ఆ విధంగా మేక్సిమం ట్యాప్ చేశాము. మీ పార్టీ ప్రభుత్వమే అక్కడ కేంద్రంలో, యిక్కడ కూడా వుంది. ఎన్ని నిధులు తెస్తారు? ఎక్కువ నిధులు తీసుకురావలసిందిగా కోరుతున్నాను. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు సెక్టార్ వారీగా నిధులు వస్తాయి. You Kindly go through it. అనుభవజ్ఞులైన అధికారులు వున్నారు. ఎక్కువ నిధులు తీసుకు రావలసిందిగా, రాష్ట్ర సమస్యలు పరిష్కరించవలసిందిగా కోరుతున్నాను. మీకు యింటర్నల్‌గా పొలిటికల్ సమస్యలు వున్నాయి. వాటితో మాకు అవసరం లేదు. ప్రజలకు కూడా అవసరం లేదు. తమ సమస్యలను ఎట్లా పరిష్కారం చేస్తున్నారనేది ప్రజలు ఆలోచన చేస్తారు.

వరల్డ్ బ్యాంక్ సంగతి మనవి చేస్తాను. నర్సింహయ్యగారు కానివ్వండి, మీరు కానివ్వండి ఎవరు మాట్లాడినా వరల్డ్ బ్యాంక్ అంటే భూతం అని. దాన్ని వారి మీదకు వదిలినందున వారిని తింటుందన్నట్లుగా మాట్లాడుతున్నారు. వరల్డ్ బ్యాంక్‌కు సంబంధించిన కండిషనాలిటీస్ మీ

దగ్గర వున్నాయి. ఎవరైనా వెయ్యి రూపాయలు అప్పు యివ్వాలన్నా అనేక విషయాలు అడుగుతారు. వెయ్యి రూపాయలు ఎట్లా ఖర్చు చేస్తావు? ఏ రకంగా తిరిగి యిస్తావు? నీ ఆదాయం ఎంత? ఖర్చు ఎంత? తక్కువ ఖర్చు చేసి ఎక్కువ ఆదాయం పెంచుకుంటే నాకు యివ్వవలసిన వెయ్యి రూపాయలు యివ్వగలవు. లేనట్లయితే ముంచుతావు అని రకరకాలుగా అడుగుతారు. ఇది లెండింగ్ ఏజన్సీల ప్రిన్సిపల్. వారు కొన్ని విషయాలను మనకే కాదు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు చెప్పారు. It is a common principle of any funding agency. You go through it.

ఎటువంటి Conditionalities లేకుండా, ఇంత కంటే మంచి వాళ్లు మాకు లేరు అని చెప్పి, వారేమి అక్కడ ఫండింగ్ ఇవ్వడం లేదు. అక్కడ కూడా కొన్ని Conditionalities ఉన్నాయి. వాటన్నింటిని యాక్సెప్ట్ చేయవచ్చు, చేయకపోవచ్చు. సార్, నిన్న ముఖ్యమంత్రిగారు ఒక వర్డ్ కోసం ఒక డిక్షనరీ పట్టుకుని సభకు వచ్చారు. రోశయ్యగారు కూడా సంస్కరణలు అంటే ఏమిటో కరెక్టుగా డెఫినిషన్ ఇస్తే, అప్పుడు నా స్టాండ్ ఏమిటో చెపుతాను. దానిని బట్టి సంస్కరణలు కొనసాగిస్తారో లేక తీసివేస్తారో మీకే తెలుస్తుంది. **సంస్కరణలు అంటే అదేదో పనికి రాని మాటగా, దానిని ముట్టుకోవడానికి వీల్లేదనే విధంగా మాట్లాడుతున్నారు. మీ బుద్ధదేవ్ భట్టాచార్యగారు కూడా ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు మేమేమి మూర్ఖులం కాదు, సంస్కరణల్ని అపోజ్‌చేయడానికి అని.** సంస్కరణలు అంటే It is a must. Change is a Continuous process. ఏ ప్రభుత్వం, ఏ వ్యక్తి అయితే ఆ వ్యవస్థ గురించి మాట్లాడటానికి సిద్ధంగా ఉండడో, That will become redundent. అది సహజం. Change is must. అయితే ఆ ఛేంజ్ ఏ విధంగా ఉండాలి అనే దానిపైన మాకు రకరకాల అభిప్రాయాలున్నాయి. కనుక మేము మా అభిప్రాయాలతో ప్రజల ముందుకు వెళ్లాం. అయితే ప్రజలు దానిని అంగీకరించలేదు. కనుక వాటి పైన ఈ రోజు మేము కూడా పునరాలోచించు కుంటున్నాము. ఎక్కడ పొరపాటు చేశాం అనే దాని గురించి చర్చించుకుంటున్నాము.

అధ్యక్షా! వాస్తవాల గురించి ఈ రోజు మనం ఆలోచన చేయాలి. మేమే కనుక బ్రహ్మాండంగా అందర్నీ ఒప్పించగల్గితే, ఈ రోజున మేమే గెలిచేవాళ్లం. అయితే మేము ఒప్పించలేకపోయాము. మా దగ్గర కూడా కొన్ని పొరపాట్లు ఉన్నాయి. వాటిని ఎట్లా రివ్యూ చేసుకోవాలో చేసుకుంటున్నాము. కమ్యూనిస్టు పార్టీకి చెందిన మిత్రులు అంటే నాకు చాలా గౌరవం. వారికి ఈ మాత్రం క్రెడిబిలిటీ వచ్చింది అంటే అది మీ కష్టం వల్లే వచ్చింది. పాపం వాళ్లను మోసి, మోసి, ఊరురా పోయి, మీటింగులు పెట్టి, చెప్పి, చెప్పి, ఆఖరుకు మేము గెలవలేకపోయాము, మీరు గెలిచారు. వాళ్లు మంచి మిత్రులు, మేమూ గతంలో వారితో కలిసి పనిచేశాము. They are most dependable friends.

నేను లోతుగా పోదలచుకోలేదు. మేము ఓడిపోవడానికి లక్షా తొంభై ఆరు కారణాలున్నాయి. వాటన్నింటిని మేము రివ్యూ చేసుకుంటున్నాము. మనకు చాలా సమయం ఉంది. భవిష్యత్‌లో చాలా విషయాలు మాట్లాడుకోవచ్చు. నేను చేప్పేది ఏమిటంటే, ఈనాడు మీకు రాక రాక అవకాశం వచ్చింది. మా పార్టీ ఏర్పడిన ఈ 25 సంవత్సరాల్లో, మీకు 1989లో ఒకసారి, ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది. అందులో రాజశేఖర్‌రెడ్డిగారికి ప్రత్యేకమైన అవకాశం

దొరికింది. 25 సంవత్సరాల నుండి ఆయన స్ట్రగుల్ చేస్తున్నాడు ఏదో రకంగా ముఖ్యమంత్రి కావాలని చెప్పి. ఈ రోజున ముఖ్యమంత్రి అయ్యాడు. కనుక ఈ రోజు నుండి కాస్త మంచి పనులు చేయమని కోరుతున్నాను. మంచి పనులు చేస్తే రాష్ట్రం బాగుపడుతుంది. ఈ యొక్క టైమ్ నార్మల్ టైమ్ కాదు. ఒక విషయం చెబుతున్నాను మీరు చరిత్రలో ఏ విధంగా ఉండాలనుకుంటున్నారో అది చాలా ముఖ్యం. సరైన టైమ్‌లో మీరు లీడర్‌షిప్‌లో ఉన్నారు. ఈనాడు ఒక వైపున బ్యాంక్ వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి, ఎకనామికల్‌గా చాలా బెనిఫిట్స్ వస్తున్నాయి. **వరల్డ్‌వైడ్‌గా అనేక రకాల అవకాశాలు మీ ముందుకు నిలబడ్డాయి. వాటిని ఉపయోగించుకొని, ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్రాన్ని ముందుకు తీసుకొని వెళ్ళగల్గితే అందరూ హర్షిస్తారు. కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర ఉంది. పాత పద్ధతులున్నాయి. ఆ పాత పద్ధతుల్లో పరిపాలనను నడిపించుకుంటూ పోతే చరిత్ర క్షమించదని మీకు తెలియచేస్తున్నాను.**

చివరగా ఒక విషయం చెప్పదలచుకున్నాను. మొన్ననే మేము మహానాడు జరుపుకున్నాం. ప్రతి సంవత్సరం మా పెద్దాయన ఎన్.టి.ఆర్. పుట్టిన రోజు అయిన మే 28వ తేదీన జరుపుకుంటూ ఉంటాం. నేను 1983 నుండి చూస్తున్నాను. 1991 నుండి నేను పొలిట్ బ్యూరో మెంబర్ని కూడా. ప్రతి మహానాడులోనూ అన్ని ఏర్పాట్లను చాలా జాగ్రత్తగా చేసుకుంటాం. ప్రతి మహానాడులోనూ 5 వేల మంది డెలిగేట్స్ వస్తారు. కాని ఆ సంఖ్య కంటే తగ్గించి మూడు, నాలుగు వేల కుర్చీలు మాత్రమే వేసుకుని సభలో నిండుదనం వచ్చేటట్లు కొంత కేర్ తీసుకుంటాం. మొన్న ఓడిపోయిన తరువాత వెంటనే మహానాడు వచ్చింది. కనుక మా వాళ్లతో చెప్పాం, ఎప్పుడూ వేసే కుర్చీల్లో 50 శాతం తగ్గించి వేయండి, లేకపోతే బోసిపోయినట్లుగా ఉంటుంది, దాంతో రాష్ట్రంలో టిడిపి పని అయిపోయింది, చాలా ఇబ్బందుల్లో, బాధల్లో ఉన్నట్లుగా ఫీల్ అయిపోతారు, కాబట్టి మీరు జాగ్రత్తగా ఛైర్స్ అరెంజ్ చేయండని మా వాళ్లకు చెప్పాం. అధ్యక్షా! ఆ రోజున మేమంతా స్ట్రెయిట్‌గా మహానాడు ప్రాంగణానికి వెళ్లిపోతే, 12 వేల మంది డెలిగేట్స్ వచ్చారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత ఇంత పెద్ద సంఖ్యలో డెలిగేట్స్ ఎప్పుడూ రాలేదని నేను మీకు చెప్పదలచుకున్నాను. (అంతరాయం)తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది, దీనికి ఇంకేమి లేదు అనుకొని, మేము ఏమి చేసినా ఫరవాలేదు అనుకోవద్దు. 20 లక్షల మంది క్రియాశీల సభ్యులు, 50 లక్షల మంది సామాన్య సభ్యులతో ఉన్న పార్టీ మాది. అయితే ఎప్పుడైతే ఓడిపోయామో, ఆ వాస్తవాన్ని మా కార్యకర్తలు గ్రహించడంలో కొంచెం ఆలస్యం జరిగింది. తరువాత మేము ఈనాడు ఏదో మిస్ అయిపోయామని బాధపడి, ఒక్కసారి ఉలిక్కిపడి లేచి కూర్చున్నారు. మీరు చేసే మంచి పనులకు మేము ఎప్పుడూ అడ్డురాము. ఈ రాష్ట్ర భవిష్యత్ బాగుండాలని చెప్పి మా పార్టీ ఎప్పుడూ కోరుకుంటుంది. కాని పొరపాటున మా ఇష్టానుసారం మేము వ్యవహరిస్తాం, మేము ఏది చేసినా నడుస్తుంది అనే ధోరణితో ప్రవర్తిస్తే మాత్రం తెలుగుదేశం పార్టీ చూస్తూ ఊరుకోదు, దానికి ఖచ్చితమైన సమాధానం చెపుతుందని మనవి చేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ ముగిస్తున్నాను.

# ద్రవ్యవినిమయ బిల్లు

29-7-2004

అధ్యక్షా! ఈ అప్రాప్రియేషన్ బిల్లు మీద వైండింగ్ అప్ చేయడానికిగాను నాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ముందుగా తమకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఎన్నికల తరువాత రాష్ట్రంలో ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మొదటిసారి సంకీర్ణ ప్రభుత్వం మన రాష్ట్రంలో ఏర్పడింది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్టమొదటి బడ్జెట్ సమావేశాలు ఇప్పుడు ఏర్పాటు చేసుకున్నాము. ఈ బడ్జెట్ సమావేశంలో సహజంగా చాలా కొత్త విషయాలు ప్రభుత్వం ఇక్కడ తెలియజేస్తుంది. అనేక రకాలైన మార్పులకు నాంది పలుకుతుందని మేము అంతా ఆశించాము. కానీ గత 40 రోజులుగా, జరుగుతున్న శాసనసభ కార్యక్రమాలన్నీ కూడా ఒక్కసారి నెమరువేసినట్లయితే, కొత్తగా వచ్చిన ప్రభుత్వం వచ్చే 5 సంవత్సరాల కాలంలో ఏమి చేయబోతుందో, అదే విధంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏ విధంగా నెరవేర్చబడతాయో మొదలైన విషయాల మీద చర్చ జరుగుతుందని అనుకున్నాము. కానీ దురదృష్టవశాత్తు ఈ సభలో, అధికార పక్షం ఎక్కువ సమయాన్ని గత మా ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడానికి, మేము చేసిన కార్యక్రమాలపై ఎక్కువ ప్రస్తావన తీసుకురావడం జరిగింది. మాట్లాడిన సభ్యులు ఎన్నికల సందర్భంగా వీరు చెప్పిన అంశాలు కాకుండా, ఇంకా ఏదయినా అదనంగా ప్రజానీకానికి చెప్పదలచుకున్నారేమో, కొత్త విషయాలు తీసుకువచ్చారేమోనని ఆలోచించమంటున్నాను.

డెమోక్రసీలో ఎన్నికలు సహజం. ఎన్నికల సందర్భంలో, ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి. పాలసీలు కూడా మారుతూ ఉంటాయి. ప్రజలు మంచి ప్రభుత్వాన్ని యాక్సెప్ట్ చేస్తూ ఉంటారు. ఎన్నికల తరువాత ఆశతో చూస్తూ ఉంటారు. ఈ ఎన్నికల్లో చాలా ప్రత్యేకత ఉంది. ఎన్నికల్లో ప్రచారానికి సంబంధించి నాకు తెలిసి ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున ప్రచారం జరగలేదు. చాలా పెద్ద ఎత్తున ఖర్చు పెట్టడం జరిగింది. అదే విధంగా మొదటిసారి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే కాంగ్రెస్‌పార్టీ పొత్తు పెట్టుకోవడానికి సిద్ధపడింది. ఎట్టి పరిస్థితిలోనూ అధికారంలోకి రావాలనే

వాంఛ వారిని పొత్తు వైపు మళ్లించింది. ఇక్కడ గెలిచి వచ్చిన రాజకీయ పార్టీలు, మేము తప్ప అన్ని రాజకీయ పార్టీలతోనూ వారు పొత్తు ఏర్పాటు చేసుకొన్నారు.

ఎన్నికలు జరిగాయి. అధికారం వారి చేతుల్లోకి వచ్చింది. మొట్టమొదటిసారి బడ్జెట్ సమావేశాలు జరుపుకుంటున్నాము. ఒక్కసారి కేటాయింపుల గురించి ఆలోచిస్తే, ఎన్నికలప్పుడు అనేక అంశాల మీద ప్రస్తావన తీసుకువచ్చారు. ఒక మౌలికమైన అంశాన్ని కూడా ప్రస్తావనకు తీసుకువచ్చారు. మేము ఖచ్చితంగా, తెలుగుదేశం ప్రభుత్వం సరైన ఆర్థిక విధానాలను అవలంభించలేదనీ, తీసుకువచ్చిన డబ్బు అప్పు తెచ్చిన దానిని ప్రాధాన్యత క్రమంలో సరిగ్గా ఎంచుకోలేదని అన్నారు. ఖర్చు పెట్టిన పద్ధతులు పరిపాలనా విధానం ఏదీ కూడా బాగా లేదని అన్నారు. పాదయాత్రలు చేశారు. ఊరూరా తిరిగారు, బస్సు యాత్రలు చేశారు. గ్రామ గ్రామానికి తిరిగి అనేక అంశాలు ప్రస్తావనకు తీసుకువచ్చారు. ప్రత్యామ్నాయంగా ఏమి చేస్తారోనని కొన్ని అంశాలు తీసుకువచ్చారు. అనేక విషయాల మీద వాగ్ధానాలు చేశారు. పూర్తి మార్పు చేయబోతున్నామని రాష్ట్రాన్ని అంతా కలియ తిరిగి చెప్పారు. అనేక విధాలైన మార్పులు తీసుకు వస్తామని చెప్పారు. ఈనాడు బడ్జెట్ గురించి ఒక్కసారి చూసినట్లయితే, ఈ మార్పు ఏ విధంగానూ స్పష్టంగా కనిపించలేదు. ఏదయినా మాట్లాడుకోవచ్చు. చాకచక్యంగా మాట్లాడవచ్చు. ఒకరైతే ఏకంగా పద్యాలు, భజనలు చేయవచ్చు. ఇక్కడ అది కాదు. ఫైనల్‌గా గ్రామ స్థాయిలో వీరి మార్పు యొక్క ప్రభావం సామాన్యుడి వరకూ చేరుతుందా అనేది ఇక్కడ ఆలోచించాలి. **మనందరం శాసనసభలో ఇక్కడ ఉన్నాము. ఆలోచన చేసుకోవాలి. ఈ బడ్జెట్‌లో ఏమి మార్పు వచ్చింది. ఏమిటనేది చూసుకోవాలి. ఇందులో ఎంత మంది బడ్జెట్ చదివారు అనేది నాకు తెలియదు.** కొత్త బడ్జెట్‌కి, ఈ బడ్జెట్‌కి పోలికలు ఉన్నాయా అనేది ఎంత మంది చదివారో నాకు తెలియదు. ఆమోదం కోసం ఆమోదించ వలసిందిగా చెబుతున్నారు. ఆమోదం కోసం అందరం సిద్ధంగా ఉన్నామని అంటున్నారు. మేము అపోజ్ చేసినా ఆమోదం అవుతుంది. ఎందుకంటే వారికి సంఖ్యాబలం ఉంది కాబట్టి.

ఈనాడు ఏ విధమైన కార్యక్రమాలు తీసుకున్నారో ఆలోచన చేయాలి. రూ.51,000 కోట్ల గత బడ్జెట్, ఈ బడ్జెట్‌కి వ్యత్యాసం కనబడుతోంది. శ్రీధర్‌బాబు చెబుతున్నారు. అగ్రికల్చర్‌ని టోటల్‌గా ఇంతకు ముందు నెగ్లెక్ట్ చేశారని చెప్పారు. సి.ఏ.జి. రిపోర్ట్‌లో మూడు శాతంకన్నా ఎక్కువ లేదని చెప్పారు. ఆ విధంగా చూస్తే, వీరు ఎంత వరకూ పెట్టారనేది అడుగుతున్నాను. ఎంత ఇన్‌క్రీజ్ చేశారు. కార్యకర్తల నుండి ముఖ్యమంత్రి వరకూ మాట్లాడితే మాది రైతు ప్రభుత్వం, అని మాట్లాడుతున్నారు. ఒక్కసారి శాసనసభ్యులందరూ బడ్జెట్ చదివారా అని తమ ద్వారా అడుగుతున్నాను. క్రిందటి వారంలో ఒక గ్రామానికి నేను వెళితే, సరిగ్గా వర్షాలు పడక ఇంకా మేము పంటలు వేసుకోలేదని చెప్పారు. ప్రభుత్వంలో కొంత మార్పు ఉందని, రైతాంగానికి కొంత వరకూ మేలు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదని నేను చెప్పాను. ఏదో రకంగా కొత్తది వస్తుందని అంటే, రైతులు ఒక్కటే నాతో అమాయకంగా చెప్పారు. అవును, మేమూ వింటున్నాము. చూస్తున్నాము. టి.వి.లో చూస్తున్నాము. ఎవరు మాట్లాడినా, రైతుల గురించి

అంటున్నారు, బహుశా, ఏమయినా వస్తుందేమో, ఇంతవరకు అయితే, మాకు ఏమీ అందలేదని చెబుతున్నారు. (అంతరాయం)

40 రోజులు చాలా విషయాలు రకరకాలుగా మాట్లాడుకున్నాము. వీరిని ఏదో రకంగా విమర్శించడానికి కాదు. వారు మాట్లాడేటప్పుడు రకరకాల కామెంట్స్ చేసినా వింటూ మధ్యలో ఆపకూడదని అప్పటి నుండి కూర్చున్నాము. టి.ఆర్.ఎస్. వారు మాట్లాడుతూ, రకరకాల పద్యాలు చదివారు. రకరకాలుగా humiliate చేసినా కూడా ఇక్కడే కూర్చున్నాము. మేము చెప్పినా వినిపించుకోకుండా చాలా విషయాలు మాట్లాడుతున్నారు. వీరు ఇప్పుడే ప్రారంభంలో ఉన్నారు కాబట్టి కొంత మార్పు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయమని అంటున్నాను. కొద్దిగా ఆలోచన చేయాలని చెబుతున్నాను. శాసనసభ అంతా కూడా మొత్తం కమిటీలు వేయడానికో, ఎంక్వయిరీలు వేయడానికో గతంలో మేము చేసిన కార్యక్రమాలను చూసుకొని ఆనందపడుతున్నారు. ఒకరి మీద ఒకరు పోటీపడి తిడుతున్నారు. వ్యక్తిగత విమర్శలకు ఒకరిపై ఒకరు వెళుతున్నారు. గతంలో మీరు ఇది చేశారనీ, అది చేశారనీ అంటున్నారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని వారన్నారు. నిజంగా మంచి రాజ్యం వస్తుందని అనుకున్నాము. కానీ ఇంకొక విధంగా చూస్తే అలా కనబడడం లేదు. ఇందిరమ్మ అంటే మాకెంతో గౌరవం ఉంది.

తప్పనిసరిగా వారిని గౌరవిస్తాను. వారు డైనమిక్ లేడి. అయితే రెండవ కోణం కూడా ఉన్నది. ఈ దేశంలోని ప్రజా ప్రతినిధులను, అపోజిషన్‌ను ఏమాత్రం గౌరవించే సాంప్రదాయం ఆమెకు ఉండేది కాదు. దేశంలో ఎమర్జన్సీ పెట్టిన చరిత్ర వారికి ఉన్నది. ఈనాడు ఇందిరమ్మ రాజ్యం తెస్తామని అంటుంటే సంక్షేమ రాజ్యం తెస్తారని అనుకున్నానుగాని అపోజిషన్ గొంతునొక్కి మాట్లాడే అవకాశం లేకుండా చేసే రాజ్యం తీసుకురావటం సమంజసం కాదు. దానిని విరమించుకోండి. If that is your opinion, ఇందిరమ్మ రాజ్యం తాత్పర్యం అది అని మీరనుకుంటే మీరు పొరపాటు చేస్తున్నట్లే. దయచేసి అటువంటి రాజ్యం తీసుకువచ్చే ప్రయత్నం చేయవద్దని కోరుతున్నాను.

ఈనాడు చాలా ఎంక్వైరీస్ వేశారు. మేమెప్పుడూ కాదని అనలేదు. మీరు అడిగారు కనుకే వేశామని అంటున్నారు. అధికారం మీ చేతులలోనే ఉంది. కనుక ఏ సమాచారమైనా తెప్పించుకోవటానికి మీకు అవకాశం ఉంది. ఏ సమాచారం పైనైనా యాక్ట్ చేయటానికి మీకు అవకాశం ఉంది. దీనిని ఎవరూ కాదనలేదు. ఎంక్వైరీ చేయటానికి మీకు ఈ సభయొక్క ఆమోదం కూడా అవసరంలేదు. ఇక్కడ చర్చలు పెట్టటం, దానిపై కేకలు వేయటం, సాధించడం చేసి తరువాత ఎంక్వైరీ వేస్తున్నామని చెప్పటం తప్ప ఏమి కార్యక్రమాలు చేస్తున్నాము, ఏమి చేయదలచుకున్నాము, బడ్జెట్‌లో ఏవిధమైన మార్పులు తీసుకురావాలి, పరిపాలనలో ఏ విధమైన మార్పులు తీసుకురావాలి అనే వాటిపై మీ దృష్టి కేంద్రీకరించాలి. ఈరోజు మీరు చెబుతున్న అంశాలగురించి ఒక్కసారి ఆలోచించాలి. రైతాంగం, ప్రాజెక్టులు, నీటిగురించి మీరు ఎక్కువగా మాట్లాడుతున్నారు. రైతాంగం గురించి మాట్లాడుతూ అగ్రికల్చర్‌లో హరితాంధ్రప్రదేశ్‌ను తీసుకు రాబోతున్నామని గౌరవ ముఖ్యమంత్రిగారితో సహా ప్రతి ఒక్కరూ మాట్లాడుతున్నారు. అగ్రికల్చర్

సెక్టార్‌కు ఈనాడు ఉన్న ప్రాబ్లమ్స్ ఏమిటో ఎవరైనా పూర్తిగా ఆలోచన చేస్తున్నారా? మీరు దానిపై లోతుగా పరిశీలన చేసారా? దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉన్నది. ఒకవైపు ప్రొడక్షన్ పెరుగుతున్నది, రెండవ వైపు పెరుగుతున్న ప్రొడక్షన్‌కు మార్కెట్ లేదు. తయారుచేసే వస్తువులకు మార్కెట్ లేదు. ప్రొడ్యూసర్స్‌కు గిట్టుబాటు ధర రావటం లేదు. ప్రొడక్షన్ పెంచటానికి కూడా అవకాశం లేని పరిస్థితులు ఉన్నాయి. మనం ఇష్టానుసారంగా ప్రొడ్యూస్ చేస్తే మార్కెటింగ్ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలి. You are going to face this type of situation. ఒకవైపు కరువుతో అల్లాడుతోన్న రైతాంగం, రెండవ వైపు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటం దేశం మొత్తంమీద రైతాంగం ఎదుర్కొంటోంది. ధరలు లేకపోవటం వలన మార్కెట్ యార్డ్స్ కూడా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. దానిని ఏవిధంగా అధిగమించాలో ఆలోచించకుండా రైతులకు ఏదో చేస్తున్నామని మాట్లాడుతున్నారు. లాంగ్‌టర్మ్ మెజర్స్ ఏవి ఎనౌన్స్ చేశారు? Is there any agriculture policy with you? దానిపైన ఏదైనా ఆలోచన చేశారా? ఆవిధంగా పరిశీలన చేయకుండా చేసే మీ చర్యలు వీటిని ఇంకా కాంప్లికేట్ చేయటానికి ఉపయోగపడతాయి తప్ప లాంగ్‌టర్మ్‌లో రైతాంగ సమస్యలకు మీరు వెదుకుతున్న పరిష్కారమేమి కన్పించటం లేదు.

**ఫ్రీ మార్కెట్ వరల్డ్‌లో మనం ఉన్నాము. పండించే పంట ఒక జిల్లా నుండి రెండవ జిల్లాకే పోనటువంటి పరిస్థితి ఉన్నది. దేశంలో ఎక్కడికైనా వస్తువులను ఎగుమతి, దిగుమతి చేసుకునే సౌలభ్యం మనం చట్ట ప్రకారం కల్పించాము.** ఆ దిశలో మీరు ఈనాడు ఆలోచించండి. గత మూడు సంవత్సరాలు రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొన్నాము. త్రాగటానికి నీరు కూడా దొరకలేదు. రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటి సారిగా కృష్ణానది మొత్తం ఎండిపోయే పరిస్థితి దాపురించినది. కృష్ణా డెల్టాకు నీరివ్వలేని పరిస్థితిని మనం ఏనాడైనా విన్నామా? అటువంటి భయంకరమైన పరిస్థితులు దాపురించినప్పటికీ అగ్రికల్చరల్ కమోడిటీస్ విషయంలో మనకు ఎక్కడా షార్టేజ్ కన్పించలేదు. అవి ఏదో ఒక ప్రాంతం నుండి మనకు అందుబాటులోకి వచ్చాయి. ఆ విధంగా బయటనుండి ప్రొడ్యూస్ రావటంవలన మనం పండిస్తున్న ప్రొడ్యూస్‌ను బయటకు తీసుకుపోవటానికి అవకాశం లేకుండా పోయినది. మనం బోర్లు వేసి కూడా పంటలు పండిస్తున్నాము. రేపు కూడా ఇటువంటి పరిస్థితులు మనం ఎదుర్కొన బోతున్నాము. దీనిపైన మీరేమైనా ఆలోచన చేస్తున్నారా? రాత్రికిరాత్రి దీనిని మార్చటానికి అవకాశం ఉందా? ఒక్కసారి ఆలోచించండి. There should be a long term programme for the agriculture. నూటికి 70% మంది ప్రజలు భూమినే నమ్ముకుని బ్రతుకుతున్నారు. వారు ఇంకొక పని చేయజాలక, ఇంకొక పనిలో స్కిల్ లేనందువల్ల, ఆల్టర్‌నేటివ్‌గా రెండవ అవకాశం లేకపోవటం వలన వారు భూమినే నమ్ముకుని బ్రతుకుతున్నారు. దానివలననే మనకు అగ్రికల్చరల్ ప్రొడక్షన్ మనకు ఎక్కువగా వస్తోంది. అటువంటి వారందరికీ మనం గిట్టుబాటు ధరలు కల్పించాలి. అవసరమైతే స్టోరేజ్ యూనిట్స్ పెట్టండి. ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్‌గా ముందుకు వెళ్లండి. క్వాలిటి ప్రాడక్ట్స్ తయారుచేయండి. వాటిపై ఏవిధంగా ఆలోచన చేయాలనే దానికి ఎంతవరకు మీరు సిద్ధ పడుతున్నారు? మీ బడ్జెట్‌లో దాని కొరకు ఏ మాత్రం కేటాయింపులు చేశారు? అందు కొరకు

ఈనాడు బడ్జెట్‌లో కేవలం 5% కేటాయింపులను మాత్రమే పెంచారు. 5% కేటాయింపులను మాత్రమే పెంచిన మీరు అగ్రికల్చర్ రంగంలో రైతులను ముందుకు తీసుకుపోతున్నామని, హరితాంధ్రప్రదేశ్‌ను తీసుకురాబోతున్నామని మాట్లాడితే మీ మాటలను ఏవిధంగా నమ్మాలి? రూపాయి లేకుండా అది ఎట్లా సాధ్యం? దీనిపై ఆలోచన చేయండి. అవసరమైన లాంగ్‌టర్మ్ ప్రోగ్రామ్స్ తీసుకోండి.

Now a days horticulture is considered as an effective form of agriculture. దానిపై దృష్టి కేంద్రీకరించండి. దానికి కావలసిన వసతులు సమకూర్చండి. మనకు అందుబాటులో ఉండే ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ ప్రోడక్ట్స్ తయారుచేయటానికి ప్రయత్నం చేయండి. ఉత్పత్తి ఎంత, కన్‌జంప్షన్ ఎంత అనేది ఆలోచన చేయండి. ముందు దీనిని ఎంకరేజ్ చేయండి. కొత్త సమస్యలు ఎట్లాగూ వస్తాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సరైన ప్లానింగ్‌తో ముందుకు వెళ్లాలి.

గత మూడు సంవత్సరాలనుండి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గ్రామాలలో నీరు కూడా దొరకటంలేదు. కమర్షియల్ క్రాప్స్ మీద, రైతుల ఆత్మహత్యల మీద మీరు ఎనలైజ్ చేయించండి. 90% మంది 4 కమర్షియల్ క్రాప్స్‌కు వెళుతున్నారు. అందువలన రిస్క్ ఫాక్టర్ ఎక్కువ అవుతున్నది. పంటలో నష్టం వస్తే వారి ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా తయారవుతోన్నది. దానిపై మనం దృష్టి కేంద్రీకరించాలి. ఈ శాసనసభలో అవకాశం దొరికిన ప్రతీసారీ క్రెడిట్ ప్లాన్ గురించి ఇన్‌సిస్ట్ చేస్తున్నాము. Because that is the lifeline. 91% రైతాంగం క్రెడిట్ పైన ఆధారపడి ఉన్నారు. మీరు వారి కొరకు ఏవిధమైన ఏర్పాట్లు చేయబోతున్నారు? తక్కువ వడ్డీకి వారికి క్రెడిట్ వచ్చేట్లు చూడాలి. సుమారు రూ. 11,000 కోట్లు క్రెడిట్ ప్లాన్‌లో పెట్టారు. అయితే ఎనిమిది, తొమ్మిది కోట్ల కంటే మనం మించి ఇవ్వలేకపోయాము. గత సంవత్సరం రూ. 9,000 కోట్లు ఇచ్చాము. రూ. 11,000 కోట్లు ఇస్తామని మీరు చెప్పినప్పటికీ ఏ రైతుకు ఎంత ఇచ్చారో ఇప్పటికీ మీరు చెప్పలేక పోతున్నారు. మొన్న మినిస్టర్ గారిని అడిగితే ఏడు, ఎనిమిది వందల కోట్లు ఇచ్చామని చెప్పారు. దానిపై మీరు దృష్టి కేంద్రీకరించాలి. మీరు మారటోరియం బిల్లు తీసుకువచ్చారు. ఆరోజే మేము చెప్పాము. జనరల్ మారటోరియం విధిస్తే అప్పులు దొరకవని చెప్పాము. రూ. 25,000 కోట్ల నుండి రూ. 30,000 కోట్ల వరకు అగ్రికల్చర్ సెక్టార్‌కు ఎప్పుడైనా అప్పు అందుబాటులో ఉండాలి. మనం ఇచ్చే రూ. 11,000 కోట్లు మినహాయించినప్పటికీ సుమారు రూ. 20,000 కోట్లు ప్రైవేటు వ్యక్తుల వద్ద నుండి అప్పులు తెచ్చుకొని రైతాంగం పంటలు పండించుకుంటోంది. జనరల్ మారటోరియం విధించకుండా కావాలంటే ఒక కాంపిటెంట్ అథారిటీని క్రియేట్ చేసి, ఎమ్. ఆర్. ఓ. లేక మరొక కాంపిటీటివ్ అథారిటీని క్రియేట్ చేసి ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు ఒత్తిడి తెస్తే, ఇబ్బందులుపెడితే అటువంటి వారి వరకే ఈ మారటోరియంను పరిమితం చేయండి. మీరు జనరల్ మారటోరియంను తీసుకురావటం వలన గ్రామాలలో ఎవరూ కూడా అప్పులు ఇవ్వని పరిస్థితి ఏర్పడుతోంది.

దీని వల్ల ఇంకా జటిలంగా తయారయిపోతున్నది ఆ సమస్య. సరే, చనిపోయిన

రైతులకు మీరు ఏదో హెల్ప్ చేస్తామంటున్నారు చేయండి. వాళ్ల పరిస్థితి ఏమీ బాగోలేదు. కాబట్టి మాకేమి అభ్యంతరం లేదు. కాకపోతే ఈనాడు రైతుల ఆత్యహత్యల సంఖ్య రోజురోజుకి పెరిగి పోతున్నది. మీ ప్రభుత్వం వచ్చిన ఈ 70 రోజుల్లో 854 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అవి ఆగడం లేదు. రోజూ పది, పదిహేను మంది చనిపోతున్నట్లు పేపర్లో వస్తున్నది. You have to find some solution for it. దాని గురించి మీరు ఏమి చేయదలచుకున్నారు? మీరు దీనికి సొల్యూషన్ కనుగొనకుండా ఏదో రకంగా చేతులు ఎత్తేసి, మేము చేసిన కార్యక్రమాల వల్లే చనిపోతున్నారంటున్నారు. ఇంకా ఎన్ని రోజులు మీరు ఈ విధంగా మాట్లాడుతారు? మీ ప్రభుత్వం వచ్చింది. గత సంవత్సరం ఎంత మంది చనిపోయారు అంటే 1300 మంది అని మేము చెపుతున్నాము. తప్పు అయితే మీరు ప్రూవ్ చేయండి. చనిపోయిన వారికి మీరు డబ్బులు ఇస్తామంటునారు తప్ప, చనిపోకుండా ఉండటానికి మీరేమి చర్యలు తీసుకుంటునారు? పోనీ, కౌన్సిలింగ్ ఏమైనా జరుపుతున్నారా వారిలో మార్పు తీసుకొని రావడానికి. మీరు ప్రకటిస్తున్న ప్యాకేజీ రైతాంగం నుండి వెళ్లిపోయి ఇతర కార్యకర్తల దాకా వెళ్లిపోతున్నది.

దీనిపైన మీరేమి చేయదలచుకున్నారో ఆలోచన చేయాలని తెలియ చేసుకుంటున్నాను. ఆత్మహత్యలను ఆపడానికి మీరు సరైన విధానాన్ని అవలంభించవలసిన అవసరం ఉంది. దీనికి మీరు కరెక్టుగా ప్లాన్ చేయడం లేదు. ఈ ఆత్మహత్యలను ఆపడానికి మీరు తీసుకుంటున్న చర్యల్లో ఇంతవరకు స్పష్టత ఎక్కడా కనిపించడం లేదని చెప్పి తెలియ చేసుకుంటున్నాను.

అదే విధంగా ఈనాడు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నారు. అధ్యక్షా! ఈనాడు లక్ష్మయ్యగారు చాలా హుషారుగా ఇటు అటు చాలా యాక్టివ్‌గా తిరుగుతున్నారు. చాలా సంతోషం. ఎందుకంటే, He is the most wanted person in the State. ఎవరైనా ప్రతి టి.వి. ఆన్ చేయగానే ఎవరి మాటలైన తియ్యగా వినపడుతున్నాయంటే, అవి లక్ష్మయ్యగారి మాటలే. ముఖ్యమంత్రిగారి తరువాత లక్ష్మయ్యగారి మాటలే. ఎందుకంటే మా మిత్రుడు జనార్ధన రెడ్డి మొన్న బడ్జెట్ స్పీచ్ పైన మాట్లాడుతూ ప్యాంట్ పైకి లేపుకో, అసెంబ్లీలోకి నీళ్లు వచ్చేటట్లుగా ఉన్నాయని అన్నాడు. నేను దానిని అనదలచుకోలేదు కాని, ఆయన మాటలు వింటుంటే ఇదిగో ఇక్కడి నుండి గోదావరి వచ్చేస్తున్నది, అదిగో అక్కడి నుండి కృష్ణా వచ్చేస్తున్నది అన్నట్లుగా మాట్లాడుతున్నాడు. నిజంగా అవి జరిగిపోతున్నట్లు ఇంప్రెషన్ ఇస్తున్నాడు. మాట్లాడితే ఓ 1500 కోట్ల రూ.లకు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ ఇచ్చామంటున్నారు. మరో 1400 కోట్ల రూ.లు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇవ్వాళే ఇచ్చామని మరో పక్క అంటున్నారు. పాపం ఆ రోశయ్య గారికి ఎట్లా నిద్ర పడుతున్నదో ఏమైపోతున్నాడో, వారి ఆరోగ్య పరిస్థితి గురించి నాకు జాలి, నిజంగా ఆందోళనగా ఉంది. పెద్ద మనిషి ఈ కోట్లు కోట్లు విని విని ఆయన ఇన్ని కోట్లు ఎక్కడి నుండి తీసుకుని వస్తారో ఏమో! ఈ బడ్జెట్ కాకుండా ఏదైనా స్పెషల్‌గా ప్రొవిజన్ పెట్టారేమో నాకు తెలియదు. లేదా ఈనాడు అన్ని కోట్లు ఎక్కడి నుండి తేదలచుకున్నారు ఈ 46 వేల కోట్ల రూపాయలను.

మీరు 1989-1994లో అధికారంలో ఉన్నారు. 1989కు ముందు మేము ఆ రోజున అధికారంలో ఉన్నప్పుడు మీరు ఇదే విధమైన పాదయాత్రలు చేశారు ప్రాజెక్టులు కట్టిస్తామన్నారు.

కాని 1989-1994ను కనుక ఒకసారి మీరు చూసుకున్నట్లయితే మీ అయిదు సంవత్సరాల పాలనలో కేవలం రెండు వేల కోట్ల రూపాయిలు మాత్రమే ఖర్చు పెట్టారు. ఇట్లాగే మాట్లాడారు అప్పుడు కూడా. రాయలసీమను అంతా సస్యశ్యామలం చేస్తామని రాజశేఖర్ రెడ్డి రకరకాలుగా చెపుతూ జిల్లాలు తిరిగారు. కాని అయిదు సంవత్సరాల్లో ఖర్చు పెట్టింది కేవలం రెండు వేల కోట్ల రూపాయిలు మాత్రమే. ఈనాడు మీరు 46 వేల కోట్ల రూపాయిలు ఖర్చు పెడతామంటున్నారు. అధ్యక్షా! నా వర్రీ అంతా ఇంతకు ముందు వేరు, ఈనాడు వేరు. ఈనాడు వాళ్లు బిగినింగ్‌లోనే ప్రాజెక్టులకు వెంటనే అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తీసుకుంటూ పోతున్నారు. వాటిని రోశయ్యగారు ఏమైనా అప్రూవ్ చేస్తున్నారా లేదా? వారి సంతకాన్ని వీరు అడుతుగున్నారో లేదో కూడా తెలియడం లేదు. ఆయన పెట్టిన బడ్జెట్ చూస్తుంటే ఏ ప్రాజెక్టు చూసినా కోటి, రెండు కోట్లరూపాయలు మాత్రమే కేటాయించారు. ఇక్కడేమో మీరు 1400,1500 కోట్ల రూ.లకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చుకుంటూ పోతున్నారు. You take anything. You take Yellampally. పోలవరం తీసుకోండి, గతంలో దానికి ఎంత కేటాయించారు, ఎంత ఖర్చు పెట్టారు. అసలు మీరు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చే ముందు ఫైనాన్స్ డిపార్టుమెంట్ నుండి రూట్ అవుతున్నదా? లేకపోతే మీరే సెపరేట్‌గా ఏదైనా పెట్టుకుని చేస్తున్నారా అనేది నాకు డౌట్ వస్తున్నది. మీరైతే ఇచ్చుకుంటూ పోతున్నారు. మా వర్రీ అంతా మీరు తొందర పడుతున్నారు. ఒకసారి సమగ్రంగా ఆలోచన చేయండి. రాష్ట్రంలో మొత్తం నీటి వనరులు ఎన్ని ఉన్నాయి? ఏ ప్రాజెక్టులు మనం తీసుకోదలిచాము? ఏ ప్రాజెక్టులకు ఎప్పటిలోగా డబ్బులు ఇస్తారు? మీరు తొందర పడుతున్నారనేది నా యొక్క అభియోగము. ఈనాడు 30 ప్రాజెక్టులను అయిదు సంవత్సరాల్లో కంప్లీట్ చేస్తామంటున్నారు. నిజంగా ఆ విధంగా చేసినట్లయితే ముఖ్యమంత్రిగారికి, లక్ష్మయ్యకు భారత రత్న అవార్డు ఇప్పించవచ్చు. దాంట్లో ఏ మాత్రం అనుమానం లేదు. 5 సంవత్సరాల్లో ఈ 30 ప్రాజెక్టులు కంప్లీట్ చేయిస్తామని చెప్పేసి, 65 లక్షల ఎకరాలకు మేము సాగునీరు కల్పిస్తామని మీరు చెపుతుంటే వారి గుండెలు ఎంత గట్టివో ! రెండూ ఉంటాయి, ఒకటి చెప్పి చేయకపోవడం, రెండవది, అర్థం కాకపోవడం. అర్థం అయి మాట్లాడుతున్నారో, అర్థం కాక మాట్లాడుతున్నారో తెలియడం లేదు. ప్రయత్నం చేస్తామంటూ మీరు పరుగెడుతున్నారు. ఈ ప్రయత్నంలో మేము ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. ఆ ప్రయత్నంలో రాష్ట్రం నష్టపడకూడదనేది నా యొక్క ఉద్దేశ్యం.

ఇంతకు ముందు శ్రీధర్‌బాబు గారు మాట్లాడుతూ, ప్రజలు ఓట్లు వేశారు, ఆ మరక కూడా పోక ముందే మీరు ఇన్ని విమర్శలు చేస్తున్నారని అన్నారు. అదే విధంగా చాలా మంది మిత్రులు, మంత్రులు మాట్లాడుతూ, రెండున్నర నెలలు కాలేదు మీరు ఎందుకు ఈ విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. వ్యక్తులుగా ఎవరైనా ఒకరు వాళ్ల ఇంటి గురించో, వాళ్ల స్వంత విషయాల గురించో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా మాకు అభ్యంతరం లేదు. మీరు తీసుకున్న ఏ నిర్ణయమైనా సరే పూర్తిగా రాష్ట్రం పై ప్రభావం పడుతుంది. రాష్ట్రం యొక్క జన జీవన స్రవంతి పై దాని ప్రభావం పడుతుంది. మీరు తీసుకున్న నిర్ణయాలలో మొదట్లోనే తొందరపాటు మాకు కనపడింది. దానిని మేము సరిచేయాలని, తొందర పడొద్దని మీ దృష్టికి తీసుకొచ్చాము తప్ప

వేరే ఉద్దేశ్యం లేదు. ఇప్పుడేమి ఎన్నికలు లేవు, చాలా విషయాలు రాబోతున్నాయి. దాని గురించి కాదు. తొందరపాటుతో ఈ రెండు నెలలలోనే చాలా నిర్ణయాలు తీసుకున్నారు. అదే మా ఆందోళన. సాగునీటి గురించి, అగ్రికల్చర్ గురించి ఎక్కువ మాట్లాడుతున్నారు, సాగునీటి ప్రాజెక్టుల గురించి మీరు దీర్ఘంగా ఆలోచన చేశారా? నలుగురు ఎక్స్‌పర్ట్సని కూర్చుండబెట్టారా? ఏ విధమైన ప్రాజెక్టులను టేకప్ చేయదలచుకున్నారు? ఉన్నటువంటి డబ్బు ఎంత? ఇచ్చిన డబ్బునంతటిని ఒక దగ్గర ఇటుక, ఒక దగ్గర ఇసుక, ఒక దగ్గర నాలుగు సిమెంట్ సంచులను పెట్టి రకరకాల ప్రాజెక్టులకు ఇంతింత పంచిపెట్టి, ఏది పూర్తి కాకుండా నాన్ ఫెర్‌ఫామెన్స్ అసెట్స్‌ని క్రియేట్ చేస్తున్నారు. చాలా ప్రాజెక్టులు రేపు పూర్తిగా ఎన్.పి.ఎ. అవుతాయి. (అంతరాయం) శాసన సభలో వారు మాట్లాడింది, మేము మాట్లాడింది అంతా కూడా రికార్డ్ కావాలి. అడ్వాన్స్‌గా మేము హెచ్చరిక చేస్తున్నాం. కొన్ని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు లేవు, కొన్ని ప్రాజెక్టులకు పర్మిషన్ లేదు, కొన్ని ప్రాజెక్టులకు మీ ఇష్టానుసారంగా ఖర్చు పెడుతున్నారు. నీరు ఎక్కడుందో అక్కడ ఖర్చు పెట్టడానికి సరైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. ఈనాడు కృష్ణా నది పైన మనకు అనేక ప్రాజెక్టులున్నాయి. అల్‌రెడీ కృష్ణా నదిపైన అనేక సమస్యలున్నాయి. ఎస్సారెస్పీ కట్టి రెండు సంవత్సరాలైనా చుక్క నీరు లేదు, తెలుగు గంగలో ఒక్క చుక్క నీరు వదలలేక పోతున్నాము. మూడు వేల కోట్లు ఖర్చు పెట్టి ఇంకా ప్రాజెక్టులు కన్సీవ్ చేస్తున్నాం దానిపైన నీళ్లు ఎక్కడ నుండి తెస్తామో మనకే తెలియదు. ఒకొక్క రీజియన్స్‌లో మనకు అవసరాలున్నాయని నేను ఒప్పుకుంటాను. బ్యాక్ వార్డ్ రీజియన్స్ ఉన్నాయి. దానికి మనం ఏమి చేయదలచుకున్నాం?

అధ్యక్షా, ఈనాడు మనకు మనకు నలభై యాభై వేల కోట్ల రూపాయలు అప్పు పుడతాయి. I am very proud. భారతదేశంలో మనం ఈనాడు ఈ సిట్యుయేషన్‌లో ఉన్నామంటే మనకు ఇదొక బ్రహ్మాండమైన అవకాశం. **చైనా తరువాత జి.డి.పి.లో భారతదేశం ముందుంది. చాలా వేగవంతంగా ఎకానమీ ముందుకు పోతూంది. 6 నుండి 7 శాతం గ్రోత్ రేట్‌తో ముందుకు వెళ్తున్నాం. అడ్వాన్స్‌డ్ కంట్రీస్‌లో కూడా ఇంత గ్రోత్ రేట్ లేదు.** దీని మూలంగా ఈనాడు వెసులుబాటు కొంత అందుబాటులోకి వస్తుంది. మనకు కావలసిన అప్పులు ఏదో రకంగా కొంత పుట్టడానికి అవకాశాలున్నాయి. మనకు ఎక్కడైతే ఇమ్మీడియేట్‌గా రిజల్ట్ వస్తుందో అక్కడ ఖర్చు పెట్టాలి తప్ప అనవసరమైన చోట ఖర్చు పెట్టినట్లయితే నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ క్రియేట్ అవుతాయి. చాలా ఇబ్బందులు తలెత్తుతాయి. దయచేసి, ఆలోచించి, తొందరపడకుండా ఎక్స్‌పర్ట్స్‌తో సంప్రదించాలి. ఆల్ పార్టీస్‌ని పిలవండి, మాకున్న ఎక్స్‌పీరియన్స్‌తో మా అభిప్రాయాలు చెబుతాం. ఏ ప్రాజెక్ట్ ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో చెబుతాం తప్ప, అప్పు తీసుకొచ్చి తలా అయిదు వేలు, తలా పది వేలు ఖర్చు పెట్టి ఏది సరిగ్గా కాకుండా ప్రాబ్లం క్రియేట్ అవుతుందని నా అనుమానం. అదే విధంగా మనకున్న నదులలో ఉన్న జీవనది గోదావరి. గోదావరిలో బ్రహ్మాండంగా ఈనాటికి సర్‌ప్లస్ వాటర్ ఉంది. మనం ఆ వాటర్‌ని యుటిలైజ్ చేసుకోలేక పోతున్నాం. గోదావరి నీళ్ల పై మనం సమగ్రంగా ఆలోచించాలి. వెనుకబడ్డ ప్రాంతాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. తెలంగాణా జిల్లాలో గోదావరి పైన ఆరు వందల కి.మి.లలో పోతున్నటు వంటిది మనం చూస్తున్నాం. క్రింద గోదావరి ఉన్నా పైన త్రాగడానికి నీళ్లు లేని పరిస్థితులలో

ఉన్నాం. వీటికి ఏ విధంగా సమస్యను పరిష్కరిస్తారో ఆలోచన చెయ్యాలి. ఈనాడు మీరంతా అంటున్నారు, కేంద్రం కూడా గుర్తించింది. న్యాయంగా మేము కూడా గోదావరి పైన గోదావరి అథారిటీ క్రియేట్ చేసిన తరువాత చాలా సమగ్రంగా దాని పైన డీటెయిల్స్ వర్క్ అవుట్ చేశాం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి గోదావరి వరకు ఏ ఏ ప్రాజెక్టులు ఏ విధంగా వస్తాయో సమగ్రమైన ప్రణాళికలు, సర్వేలు అన్ని చేయించాం. కొన్ని ప్రాజెక్టులను టేకప్ చేయడం కూడా జరిగింది. ఫ్లడ్ ఫ్లో కెనాల్ కానివ్వండి, మొన్ననే ఇచ్ఛంపల్లికి వెళ్తాం అన్నారు, దుమ్ముగూడెం చేస్తాం అన్నారు. ఆప్టియాకి మొన్న వెళ్తాం అన్నారు. ఇప్పుడేమో వెళ్లమంటున్నారు. మాకేమి అర్థం కావడం లేదు. గోదావరిలో వాటర్ ఉంది. మిమ్మల్ని కోరేదేమిటంటే, స్టేట్‌లోని ప్రాజెక్టులకు ఈ ఫైనాన్స్ సరిపోదు. కాబట్టి కేంద్రం పై ఒత్తిడి తీసుకురండి. ఆనాడు ఉన్నటువంటి నేషనల్ ఫ్రంట్ గవర్నమెంట్‌లో వాజ్‌పాయిగారు ఇక్కడికి వచ్చినప్పుడు ఇంటర్ లింకేజ్ ఆఫ్ ది రివర్ విషయం వచ్చినప్పుడు చాలా డిస్కషన్ జరిగింది. దానిపై మేము వ్యతిరేకం కాదని చెప్పాం. ఖచ్చితంగా అది చేయల్సిందే! ప్రతి ఒక చుక్క నీళ్లను మనం వాడుకోవాలి. వెనుకబడిన ప్రాంతాలలో ఉన్నటువంటి ప్రజల కోరికలను మొదలు తీర్చాలి. వారి అవసరాలను తీర్చాలి. ఆ విధంగా మీరు లింకేజ్ ప్రాజెక్టులను తయారు చెయ్యాలి. కనుక దానిని ఇవ్వడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం దానికి ఫైనాన్స్ చేయాలని ఆనాడు చెప్పాము. దానికి వాళ్లు అంగీకరించారు. ఆనాడు వాజ్‌పాయ్ గారు ప్రతి ఎలక్షన్ మీటింగ్‌లో చెప్పారు. ఈసారి ఖచ్చితంగా ఎక్కువ నిధులు కేటాయించాలని గోదావరి గురించి స్పెషల్ మెన్షన్ చేశారు. ఇప్పుడున్న మీ ప్రభుత్వాన్ని ఒప్పించండి. ఎక్కువ నిధులు తీసుకురండి. లక్ష్మయ్యగారు దేవాదుల ప్రాజెక్టు గురించి చెప్పారు. 5 టి.యం.సి.ల వాటర్ కోసం గోదావరి ప్రాజెక్టు అంతా తీసుకొస్తాం అంటున్నారు. 200 టి.యం.సి.ల వాటర్ అవైలబుల్‌గా ఉంది. లిఫ్ట్ తప్ప ఇంకా ఎక్కడైనా ఆల్టర్నేట్ సోర్స్ ఉందా? ఏ ఎక్స్‌పర్ట్‌ని అయినా అడగండి. అక్కడ ఉన్నటువంటి ప్రాజెక్టులపైన లిఫ్ట్ తప్ప ఏమి లేదు.

# ద్రవ్య వినిమయ బిల్లు

30-5-2005

స్పీకర్ సార్, ఈరోజు ద్రవ్య వినియోగ బిల్లు పైన జరిగే చర్చలో పాలు పంచుకోవడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు తమకు ముందుగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తమరు ఇంతకు ముందు మాట్లాడుతూ టైమ్ గురించి చెప్పారు. మన బడ్జెట్ సెషన్ గురించి, మన హౌజ్‌ను గురించి ఒకసారి ఆలోచించినట్లయితే, ప్రతి 6 నెలలకూ ఒకసారి శాసన సభ కంపల్సరీగా మీట్ కావాలి. ఎన్ని సమస్యలున్నా, ఏమున్నా, ఆర్టికల్ 174 ప్రకారం రాజ్యాంగ బద్ధంగా ఎట్టి పరిస్థితులలోనూ హౌజ్ మీట్ కావాలి.

**శాసనసభ యొక్క ప్రధానమైన కర్తవ్యం చట్టాలు చేయడం. అదే విధంగా, ప్రధానమైన అంశాలకు పరిష్కార వేదిక కావడం, ముఖ్యంగా ఇటువంటి దాని పైన బడ్జెట్ పైన చర్చించి వాటి పైన సరైన నిర్ణయాలు తీసుకోవడం,** ఇవన్నీ మనందరి బాధ్యత. కాని కారణాలు ఏవైనా, ఈ బడ్జెట్ సమావేశాలలో ఒకే ఒక పద్దు, ఒకే ఒక డిమాండ్ పాస్ చేసుకోగలిగాము. నిన్ననే మిగతా డిమాండ్స్ గిలెటెన్ అయ్యాయి. చర్చించినా, చర్చ లేకున్నా, వాటన్నింటినీ మనం పాస్ చేసుకున్నాము. కాబట్టి రిక్వెస్ట్ చేసేదేమంటే, ఈరోజైనా సమగ్రంగా కొంత చర్చ జరగాలి. కొన్ని ప్రధానమైన అంశాలకు పరిష్కారం జరగాలి. శాసనసభలో జరుగుతున్న కార్యక్రమాలన్నీ ఈ శాసనసభ ద్వారా ప్రజలకు ఒక సందేశం ఇవ్వాలి. ఇక్కడ జరుగుతున్న చర్చల మూలంగా వారియొక్క సమస్యలు ప్రతిబింబించే విధంగా వారి సమస్యలను మా ద్వారా వినిపించే విధంగా మా ప్రయత్నం మేము చేస్తాము. ప్రథమంగా సమస్య చెప్పవలసిన బాధ్యతగా, ఆ విధంగా చెప్పడానికి మీరు కొంత సమయం కేటాయించాలి. మనం అంతా చేసుకోవలసిన ప్రధాన బాధ్యత ఉంది. నేను వేరే కాంట్రవర్సీకి పోదలచుకోలేదు. చర్చ మాత్రం చేసుకోలేకపోయాము. ఈరోజు 8 కోట్ల 10 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాము. అతి పెద్ద రాష్ట్రం ఇది. ఇంత మందికి ప్రతినిధులుగా మనం ఉన్నాము. సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయి. ఈనాడు రాష్ట్రంలో చాలా ద్రవ్యం ఉంటే, సమస్యలు తక్కువగా ఉండి, ఇబ్బందులు ఉండేవి కావు. కానీ

మన దగ్గర కొంత డబ్బు ఉంటే, సమస్యలు చాలా ఉన్నాయి. కాబట్టి ప్రతీ రూపాయిని కూడా చక్కగా వినియోగించగలిగితే శాసనసభలో మన సమాజంలో ఉన్న సమస్యలను పరిష్కరించు కోవడానికి ప్రతీ రూపాయి జాగ్రత్తగా ఖర్చు పెట్టుకొని సమస్యలు పరిష్కరించుకొనే దిశలో ప్రయత్నం చేయాలి. ఈరోజు ఆర్థిక శాఖామాత్యులు ప్రవేశపెట్టింది రూ. 57,341 కోట్లు మొత్తం బడ్జెట్‌లో నేను దీనిని ప్రతిపాదిస్తున్నాను, ఆమోదించవలసిందిగా ముందు పెట్టారు. శాసనసభ ఆమెదం చాలా అవసరం, ఆమోదం లేకుండా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడానికి వీలు లేదు. కాబట్టి మనం ఎప్పుడయితే ఆమోదిస్తామో, ఆమోదించే ముందు దాని మీద పరిపూర్ణమైన అవగాహనతో ఎక్కడ ఏమి ఖర్చు అవుతుందో, ప్రభుత్వం ఎక్కడ అవసరం ఉందో, ఎక్కడ అవసరం లేదో ఈ విషయాలన్నీ పరిపూర్ణంగా చర్చించుకోవలసిన అవసరం ఉంది. కానీ చర్చించు కోలేకపోయాము. సమయాభావం, ఇతర కార్యక్రమాలు చేసుకోలేదు. తమ ద్వారా వారిని కోరేదేమంటే, కనీసం భవిష్యత్తులో, ఇప్పుడు వచ్చే దాని కోసమైనా స్టాండింగ్ కమిటీ పెట్టమనండి. ఈ చర్చ అక్కడ జరుగుతుంది. కాబట్టి ఏమి జరుగుతోంది, డిపార్ట్‌మెంట్‌లో కొంత కేటాయింపు ఇస్తున్నాము, వాటిని చూసుకోవడానికి స్టాండింగ్ కమిటీ పెడితే బాగుంటుంది. అది నా సూచన. అది తమరు ఆలోచన చేయాలి. ఒక్కసారి ఆలోచిస్తే, **ఫైనాన్స్ మినిస్ట్రీ డిపార్ట్‌మెంట్, ఏదో ఒక అకౌంటింగ్ డిపార్ట్‌మెంట్ కారాదు. ఈరోజు రొటీన్‌గా మనం చూస్తూనే ఉన్నాము. బడ్జెట్ ప్రిపరేషన్ కొంత రొటీన్‌గా జరుగుతున్నది.** అది మామూలు అకౌంట్‌గా తయారవుతుంది. నార్మల్‌గా ఒక బ్యాంకింగ్ వ్యవస్థలో బ్యాంక్ క్యాషియర్ ఉన్నట్లుగా చేయడానికి వీలు లేదు. We are not accountants. Finance Ministry and Finance Department are not accountants. వచ్చిన డబ్బులంతా వచ్చింది, పోయింది అనేది కాకుండా ఏ విధంగా వస్తోంది. ఏ విధంగా ఏ సబ్జక్ట్ ఎక్కడ మనం ఖర్చు పెడుతున్నాము అనేది బాగా తెలివిగా ఆలోచించి కేటాయింపులు చేయాలి. ఈ రోజు అటువంటి కేటాయింపులు జరుగుతున్నాయా అనేది ఆలోచించాలి. ఆ విధంగా బడ్జెట్ ప్రపోర్షనేట్‌గా జరుగుతుందా అనేది ఆలోచించాలి. సోషల్ బడ్జెట్‌లా ఉండాలి. సమాజంలో ఉన్న వారికి ఏమి అవసరం ఉందో, అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది. వారిని ఆదుకోవలసిన అవసరం ఉంది. ఎవరికి సహాయం అవసరమో వారందరికి ఈ బడ్జెట్ సహకరిస్తుందా, వారికి దీని మూలంగా కలిసిరావలసిన సదుపాయాలు కలుగుతున్నాయా, మనం చూడాలి. మనం ఆలోచన చేయాలి తప్ప ఉత్త బడ్జెట్ చూసుకుంటూ ఏదో రకంగా వచ్చిన డబ్బు అటూ, ఇటూ కేటాయింపులు చేసుకుంటూ ఉండడం కాదు. ప్రభుత్వం వచ్చినా ముఖ్యమంత్రి వచ్చినా కాదు. ప్రాధాన్యతా క్రమంలో వెంటనే కొన్ని చర్యలు తీసుకోవచ్చు. అంతవరకూ సరిచేసి మిగతా సర్‌ప్లస్ అన్నీ ప్రక్కన పెట్టడం సమంజసంగా అనిపించుకోదు. బడ్జెట్ ప్రపోర్షనేట్‌గా బాగా చేశాము, బ్రహ్మాండమైన బడ్జెట్ అని చెప్పడానికి అవకాశం లేదు. అలా కనిపించడం లేదు. దీని మీద రోశయ్యగారో, ఎవరు ప్రిపేర్ చేశారో రొటీన్‌గా జరుగుతుంది. చిన్నప్పుడు మా టీచర్ ఒకయన చెప్పేవారు. ఒక ఊర్లో ఒక మంచి కుటుంబం ఉండేది. పూజా పునస్కారాలు చేసేవారు. ఆయన పూజ చేస్తూ, ఒక వైపు పిల్లిని కట్టేసేవారు, పూజ అయిన తరువాత వదిలేవారు. ఒక పెద్ద మనిషి వచ్చి ఎందుకు పిల్లిని

తీసుకువచ్చి కడతారు, ఇదేమిటని అడిగితే, మా తండ్రి అదే విధంగా ప్రతి రోజూ పూజ చేసే ముందు పిల్లిని కట్టేవారు, అదే విధంగా నేనూ చేస్తున్నానని చెప్పారు. అంటే కారణం ఏమిటో వారికి తెలియదు. ఆ వచ్చిన పెద్ద మనిషి మీ తండ్రి గారి స్నేహితుడిని కాబట్టి నేను చెబుతానని చెప్పాడు. మీ తండ్రి పూజ చేసేటప్పుడు చాలా సేపు పూజ చేసేవారు. నీలాగా 5 నిమిషాలు కాదు. చాలా సేపు పూజ చేసేటప్పుడు తీర్థ ప్రసాదాలు ఉండేవి. ఆయన ధ్యానం చేసేవారు. ఆ సమయంలో ఆ పిల్లి తీర్థ ప్రసాదాలను తినేది. కాబట్టి ఆ పిల్లిని తట్టుకోలేక కట్టివేసి తరువాత విడిచేవారు. ఇప్పుడు నీకైతే ఒక పూజా రూమ్ ఉంది. పిల్లి అందులో వచ్చే అవకాశం లేదు. అంత సేపు పూజ చేయవు. మీ ఇంట్లో పిల్లి కూడా లేదు. ఊర్లో పిల్లిని తెచ్చి కట్టడం చేస్తున్నావు. పూజ అయిన వెంటనే దాన్ని విప్పేస్తున్నావు. అది వెళ్లిపోతోంది. మీ తండ్రి చేసినట్లుగా రొటీన్‌గా చేయడం అలవాటైపోయింది. కాబట్టి నేను చేస్తున్నానని వారన్నారు. ఈ రోజు అదే పరిస్థితి. ఇప్పటి పరిస్థితులకు రిఫ్లెక్ట్ కావడం లేదు. నా ఉద్దేశ్యం ఏమిటంటే, కాలానుగుణంగా మనం మార్పులకు ప్రయత్నం చేయడం లేదు. మనం ఎంతో మందిని చూస్తున్నాము. ఉదాహరణకు బడ్జెట్ ప్రపోర్షనేట్‌గా ఉందా, లేదా అనేది చాలా మందికి తెలియదు ఒక లారీ నిండా పేపర్లు ఉంటాయి. అన్ని పేపర్లు పడి ఉంటాయి. ఎవరు తయారు చేస్తారో ఏమి చేస్తారో కొంత మందికి తెలియదు. ఎంత మంది చదువుతారు, ఎంత మంది చదవరో మనకు తెలుసు. నేను ఒక్కసారి గుర్తు చేసేదేమంటే, మేము ఒకసారి క్యాబినెట్ సబ్ కమిటీలో కూర్చొని బడ్జెట్ ప్రిపరేషన్ చేస్తూ ఉంటే, అధికారులు ఏమి చెప్పారంటే, ఆ ఉన్న డిపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తి రిటైర్ అయినారట. ఇవన్నీ ఆయనకు తప్ప ఎవరికీ తెలియదు. పద్దులవారీగా వ్రాయాలంటే రిటైర్ అయిన వారిని తీసుకువచ్చి అతనితోనే వ్రాయిస్తున్నారు. ప్రపోర్షనేట్ బడ్జెట్‌లో బ్రహ్మాండమైన ప్రిపరేషన్స్ ఉండవు. ఉన్నవాటిని అటు, ఇటు సర్దుబాటు చేసుకొంటూ, మనమేదైనా ఒకటి, రెండు ప్రాధాన్యత అంశాలను చెపితే వాటిని చేర్చి తయారు చేస్తారు. అంత మాత్రాన ఇదేదో బ్రహ్మాండంగా ఉంటుందని అనుకోవడం లేదు. ప్రతి పద్దుపైన, ప్రతి అంశం పైనా టోటల్‌గా వెళ్లే ముందు మనకున్న సామాజిక పరిస్థితులేమిటి, దానికి కావాల్సిన కేటాయింపులు ఉంటాయా, మన బాధ్యతల గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ఈనాడు 8 కోట్ల 10 లక్షల మందికి మనం ప్రాతినిధ్యం వహిస్తున్నాము. ఎంతో మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఎకనామిక్ సర్వే రిపోర్టు ప్రకారం, 22 శాతం ప్రజానీకం రెండు పూటల తిండి దొరక్క ఉన్నారు. I do not agree with that also. దానికి ఉన్న మెథడాలజీలో ఒక కోటీ 20 లక్షల మంది ప్రజలకు రెండు పూటల తిండి దొరకని నిరుపేదలు ఉన్నారు. రాష్ట్రంలో సరైన ఉపాధి కోల్పోతున్నారు. 8 శాతం నిరుద్యోగం పెరుగుతోంది. ఈ రాష్ట్రంలో మనకున్న బడ్జెటులో నిజంగా వాటిని అటెండ్ కావడానికి కావాల్సిన కేటాయింపులు చేస్తున్నారా? లేదా? ఆలోచించాలని కోరుతున్నాను. ప్రత్యేకమైన బాధ్యతలు ఉన్నాయి. ఈనాడు **శాసనసభ ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు చూస్తూ ఉన్నారు. రాష్ట్రం చేయనప్పుడు ఇండివిడ్యువల్‌గా వారు స్వయంగా చూసుకోలేరు. వారి బాధలు శాసనసభలో రిఫ్లెక్ట్ అవుతాయి.** వారి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా. వారు కోరుకొనే విధంగా వారి జీవన ప్రమాణాలు పెంచే విధంగా బడ్జెటు కేటాయిపుంలు

చేస్తున్నామా, ఆలోచించాలి. రాష్ట్రంలో 65 శాతం ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడి ఉంది. గ్రామీణ వ్యవస్థలో 72 శాతం ప్రజలు గ్రామాల్లో ఉన్నారు. గ్రామీణ వ్యవస్థ యొక్క స్వరూపం ఎట్లా ఉందో అర్థం చేసుకోగలమా? దానికి కావాల్సిన కేటాయింపుల కోసం ఆలోచించాలి. ఒకవైపు 65 శాతం ప్రజలు భూమిని ఆధారంగా చేసుకొని బ్రతుకుతున్నారు. వ్యవసాయంపై బ్రతుకుతున్నప్పటికీ గిట్టుబాటు జరుగుతోందా? అంటే అదీ లేదు. వీరికి వేరే అవకాశాలు లేవు. భూమిని నమ్ముకోవడం తప్ప ఏ పని చేయడానికి వీరికి అవకాశం లేదు. దీనిపైనే బ్రతికే పరిస్థితి వచ్చింది. వీరి విషయంలో ఏమి చేస్తే బాగుంటుందని ఆలోచించాలి. గత వ్యవసాయ విధానం ఇప్పటికి ఉందా, గతంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయా విశ్లేషించుకోవాలి. ఈనాడు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. అవి మా (తెలుగుదేశం) హయాంలోనా, మీ (కాంగ్రెస్) హయాంలోనా అని అనుకోవడం కాదు. ఈ సమస్యపై లోతుగా అధ్యయనం చేసి ఆత్మహత్యలకు గల కారణాలను ఆలోచించాలి. అగ్రికల్చర్ సెక్టర్‌లో వస్తున్న మార్పులను అధ్యయనం చేసుకొని చూడాలి. పది సంవత్సరాల క్రితం, వ్యవసాయం పరిస్థితులు వేరుగా ఉండేవి. అప్పుడు పెద్దగా పెట్టుబడులు పెరిగినప్పుడు దానికి ప్రపోర్షనేట్‌గా ఆదాయం తగ్గుతుంది. ఆ పరిస్థితుల్లో మనం ఏమి చేసుకోవాలో ఆలోచించాలి. గతంలో ఒక జిల్లా నుండి మరో జిల్లాకి ధాన్యం రావాలంటే రిస్ట్రిక్షన్స్ ఉండేవి. వ్యవసాయోత్పత్తుల ఫ్రీ మూవ్‌మెంట్ ఉండేది కాదు. నేడు దేశంలో, ప్రపంచంలో ఏ మూల నుండైనా, తీసుకువచ్చి అమ్ముకొనే పరిస్థితులు వచ్చిన తరుణంలో ప్రభుత్వం సరైన ఆలోచన చేయాలి. మీరు ఏమంటున్నారంటే, 'మేము బ్రహ్మాండమైన అవకాశాలు కల్పించామని బావిలో ఉన్న చేపని చెరువులో వేశాము వారి ఇష్టం ఉన్న చందంగా చేసుకోవచ్చుని చెపుతున్నారు. కానీ ఒక్కసారి పడేస్తే, అది ఎట్లా బ్రతుకుతుందో కూడా ఆలోచించడం లేదు. చెరువులో పెద్ద చేపలు ఉండి మింగుతాయి, వాటిని ఎలా ఎదుర్కొని బ్రతకాలో ఆలోచింపజేయాలి. స్వయం కృషితో ముందుకు వెళ్లగల్గుతాయనే ఆలోచన చేయడం పొరపాటు. పరిస్థితులు చూస్తే, మొత్తం అగ్రికల్చర్ సెక్టర్‌లో పెద్ద క్రైసిస్‌లు వస్తున్నాయి. ఈ క్రైసిస్‌కి బాధ్యులు ఎవరు, లోతుగా వెళ్లి ఎట్లా పరిష్కరించాలో ఆలోచించాలి. నా అభిప్రాయంలో మన రాష్ట్రంలోనే కాదు, యావత్ దేశంలో ఇదే పరిస్థితి ఉంది. అగ్రికల్చర్ సెక్టర్‌పై ఆధారపడి ఉన్న దేశాల్లో ఇదే పరిస్థితి ఉంది. I was reading an article. ఈ మధ్య కాలంలో చైనాలోనూ, ఇతర దేశాల్లో అగ్రికల్చర్ సెక్టర్‌లో ఈ ఎకానమిక్ ఛేంజస్ వస్తున్న పరిస్థితుల్లో ఇంచుమించు ఎక్కడైనా అదే పరిస్థితి ఉంది. అక్కడ ఇండస్ట్రియల్ గ్రోత్ ఎక్కువగా ఉంది. ఇండస్ట్రీస్ రావడం వల్ల దాని ద్వారా వచ్చే ఆదాయంతో అగ్రికల్చర్ సెక్టర్‌కి సబ్సిడీ ఇస్తున్నారు. ఆ విధంగా అక్కడ వయబిలిటీ చేస్తున్నారు. ఇండస్ట్రియల్ ఆదాయం ప్రధానమైన ఆదాయం, దీని నుండి పెద్దగా నిధులు రాకపోవడం వల్ల మనం పెద్దగా సబ్సిడీ ఇవ్వలేకపోతున్నాము. అలా అని వదిలి పెడితేనే పరిస్థితులు ఈ విధంగా వస్తున్నాయి. We must start somewhere. ఏవిధంగా ప్రొడక్షన్ తగ్గించాలి, కాస్ట్ తగ్గించాలి, మార్కెట్ ఎట్లా చేయాలి, మార్కెట్ ఎట్లా యింప్లిమెంట్ చేయాలి, ఏ పంటలు ఎప్పుడు వేయాలి, ఈ విషయాలపై సమగ్రంగా ఆలోచన చేయడం లేదు. ఇది రైతాంగానికి వదిలి పెట్టాము, పరిస్థితులు చేయి దాటి పోవడంతో అర్థంకాని పరిస్థితిని చూస్తున్నాము.

మిర్చి, ప్రత్తి రైతుల పరిస్థితి ఒకసారి ఆలోచించడి. మన రాష్ట్రంలోగానీ, దేశంలో గానీ, మొత్తంగా ఏ పంటలపై ఎప్పుడు తీసుకోవాలి, ఎట్లా వేసుకోవాలి, మార్కెటింగ్ ఏ విధంగా ఉంది. ఏ పద్ధతిలో వెళ్లాలి అనే ఆలోచించడం లేదు. మార్కెటింగ్ ఎట్లా ఉంటుంది అన్న విషయమై కూడా ఆలోచన చేయడం లేదు. ప్రపంచీకరణ మొదలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎట్లా జరుగుతోందో మీరు చూస్తున్నారు. ఎక్కడో జరిగిన పరిణామాలు మనపై పడుతున్నాయి. ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు అవసరాలు, ప్రొడక్షన్ ఎట్లా ఇవ్వాలనే దానిపైన మనం ఆలోచన చేయడంలేదు. ఈనాడు మేనిఫెస్టోలో పెట్టారు. అగ్రికల్చర్ సెక్టర్‌లో చాలా చేస్తున్నామని చెప్పారు. అసలు, మీకు అగ్రికల్చర్‌పై పూర్తిగా అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. సరైన దిశలో మీరు ముందుకు వెళ్లడం లేదు. మీ కేటాయింపులు రూరల్ డెవలప్‌మెంట్‌కి చూస్తే 2003వ సంవత్సరంలో 2.54 ఉన్నది. 2004వ సంవత్సరానికి వచ్చేసరికి బడ్జెట్ ఎస్టిమేట్స్‌లో 2.13% ఉంది. 2005-06 సంవత్సరానికి గాను 2.81గా బడ్జెట్ ఎస్టిమేట్స్‌ని పెంచాము. అగ్రికల్చర్ సెక్టర్‌కి ఏదో చేస్తామని, రూరల్ డెవలప్‌మెంట్‌కి ఏదో చేస్తామని, కేటాయింపుల్లో తగ్గించి, ఆ సెక్టర్‌కి పెంచామని అంటున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కేటాయింపులు పెంచినంత మాత్రాన సమస్య పరిష్కారం అవుతుందా? ఆలోచించాలని కోరుతున్నాను. ఈనాడు త్రాగడానికి నీరు లేదని అంటే, బావి త్రవ్విస్తామని అంటే, ఆనాటి వరకు ఏమి చేయాలి అన్న చందంగా ఉంది. ఈ ప్రాజెక్టులు వచ్చేవరకు ఈ సిస్టమ్ బ్రతకాలి. దానికి కనీస అవసరాలను పరిశీలన చేసి చేయాలి. చాలా తక్కువగా కేటాయింపులు వచ్చిన బడ్జెటులో అంటే మేము ఒకటే సెక్టర్‌కి బడ్జెటు పెడతాము, మిగతా అన్ని సెక్టర్స్‌లో తగ్గించినా ఫర్వాలేదన్న ధోరణిలో మీరు బడ్జెటు ప్రిపేర్ చేశారని తెలియజేస్తున్నాను. ఆ విధంగా మీరు ఆలోచన చేయకుండా ముందుకు వెళుతున్నారు. వ్యవసాయరంగంలో వస్తున్న పరిణామాలను ఇంకా ఆలోచన చేసుకోవాలి. దీనిని మోడ్రనైజ్ చేయాలి. ముఖ్యమంత్రి గారు మిగతా మంత్రులు చైనాకి వెళ్లి వచ్చి, అక్కడ జరుగుతున్న పరిణామాలు అవగాహన చేసుకోవాలని చెపుతున్నారు. **చైనా దేశాన్ని నేను కూడా పదిహేను రోజులపాటు పర్యటించాను. అక్కడి సామాజిక పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు అనేక విధాలైన మార్పులు ఈ లిబరలైజేషన్‌కి దోహద పడ్డాయి తప్ప, ఇమీడియట్‌గా మార్పులు రాలేదు. వారు బాగా మోడ్రనైజ్ చేశారు. దాని వల్ల ప్రోడక్టివిటీ పెరిగింది. రైతాంగాన్ని కాపాడుకొంటున్నారు. ఆ విధంగా సస్టేనబిలిటీ తీసుకు వస్తున్నారు.**

ఈ రోజు మార్కెటులో మిర్చి, పత్తి వచ్చింది. రైతులకే ఆ పరిస్థితిని వదిలేశాం. మంత్రి గారు ఇక్కడ డిబేట్‌లో చెప్పారు. ఈ హౌస్‌లో ఎంత చర్చ జరిగినా దాని ఫలితం రావడం లేదు. ఆ రోజు హౌస్‌లో 23 వ తేదీ నుంచి మార్క్‌ఫెడ్ ఇంటర్‌ఫియర్ అవుతుందని వారు చెప్పారు. వెంటనే మేము మార్కెటులోకి దిగబోతున్నాం అని చెప్పారు. ఈరోజు 30వ తారీఖు వచ్చింది. ఇంతవరకూ ఒక క్వింటాలు మిర్చిని కొన్న పాపాన పోలేదు. మార్కెట్ ఇంటర్‌వీన్ కాలేదు. రైతులను కాపాడతామని చెప్పారు, ఏ విధంగా కాపాడతారో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. మీరు ప్రత్యేకమైనటువంటి డబ్బు దీనికి కేటాయింపు చేయకుండా మీరు మార్కెటులో రైతులను రక్షించకుండా, మీరు ఎటువంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా రైతులను కాపాడతారని

అడుగుతున్నాను. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. గత సంవత్సరం మార్కెట్‌లో మిర్చి ధర క్వింటాలు రూ. 3 వేలు ఉంటే, ఈ సంవత్సరం రూ. 1500లకు పోతున్నది. రైతులకు ఖర్చు పెరుగుతున్నది. పెట్టుబడి పెరుగుతున్నది. ధర తగ్గుతున్నది. ఈ విధంగా ఉంటే వారి పరిస్థితి ఏమిటో ఒకసారి మీరు ఆలోచించాలి. ప్రభుత్వం అందుకు గాను ఏమి చేస్తున్నది? కాబట్టి రైతుల విషయంలో ప్రభుత్వం ఇంటర్‌ఫియరెన్స్ అవసరమని తెలియజేస్తున్నాను. ఇక్కడ ప్రభుత్వం వాళ్లు చేతులు కట్టుకుని కూర్చున్నారు. ఏమీ మాట్లాడటం లేదు. మేము మాట్లాడితే అపోజిషన్ పార్టీ వారు ఏమి చేశారని మాట్లాడుతున్నారు, లేకపోతే మీరు ఏమి చేశారని, ఆ విధంగా ఎదురు ప్రశ్నలు తప్ప ఇప్పుడు ఉన్న పరిస్థితులో ఎలా బయట పడాలని మీరు ఆలోచించడం లేదు. అగ్రికల్చర్ సెక్టార్లో మీ కేటాయింపులలో ఎలాంటి ఆలోచనా లేదని తెలియజేస్తున్నాను.

అదే విధంగా, మోడ్రనైజేషన్ గురించి నేను తెలియజేసేది మా పీరియడ్ లాస్ట్‌లో మేము ఈ విషయమై కమిటీ వేయడం జరిగింది. క్రైసిస్ రావడంతో సబ్ కమిటీ కూడా వేయడం జరిగింది. దీనిని లోతుగా పరిశీలిస్తే అందులో ఇబ్బందులు, ఒడిదుడుకులు చాలా ఉన్నాయి. ఆ కార్యక్రమంలో ఎక్స్‌టెన్షన్ మొత్తం పోయింది. గత 15, 20 సంవత్సరాలుగా అది సరిగా లేదు. కాబట్టి వస్తున్న మార్పులు రైతాంగం అర్థం చేసుకోలేని పరిస్థతి ఈ రోజు ఏర్పడుతున్నది. అదే విధంగా మోడ్రన్ టెక్నాలజీ మనకు అందుబాటులోకి వచ్చింది. టిష్యూకల్చర్, అనేక విధాల టెక్నాలజీ పరిణామాలు మనకు వచ్చాయి. రైతులకు అటువంటి కొన్ని సౌకర్యాలు కావాలి. కాబట్టి వారికి ఇన్సెంటివ్‌లు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఈ విధమైన కార్యక్రమాలను మనం పకడ్బందీగా చేయాలి. అప్పుడే వ్యవసాయ రంగంలో మనం ముందుకు సాగగలుగుతాం. లేకపోతే వ్యవసాయ రంగంలో సమస్యలను పరిష్కారం చేయలేము. కాబట్టి ఈ రంగంలో సమగ్రమైన అవగాహన ప్రభుత్వం కలిగి ఉండాలని నేను చెబుతున్నాను.

పరపతి విషయానికి వస్తే, రాష్ట్రం మొత్తంలో ఉన్నటువంటి రైతాంగానికి రూ. 10 వేల కోట్ల కంటే ఎక్కువ మనం రుణాలను బ్యాంకర్స్ ద్వారా ఇప్పించలేక పోతున్నాం. మనం ఇప్పించగలిగే డబ్బు ఆ ట్రక్కర్సుకు సరిపోవడం లేదు. అందువల్ల మరో రూ. 20 వేల కోట్లు డబ్బును రైతులు ప్రైవేటు లెండర్సు నుండి పొందుతున్నారు. ఈ మధ్య కాలంలో మేము మా పీరియడ్‌లో లాస్ట్‌లో డ్వాక్రా మహిళల డబ్బు రివాల్వింగ్ ఫండు లేకపోతే వారు స్వయంగా కూర్చుకున్న ఫండ్ ఇవన్నీ ఏ రంగంలోకి పోతున్నాయి? దేనికోసం దానిని ఖర్చు పెడుతున్నారు? ఆ విషయమై సర్వే చేయవలసిన అవసరం ఉంది. సర్వే చేయిస్తే 60 శాతం వ్యవసాయానికి మందు సంచులు కొనడానికి, వ్యవసాయ పనులు చేసుకోవడానికి వారు ఆ ఫండును ఉపయోగిస్తున్నారు. అంటే ఆ రంగానికి చాలా విపరీతమైన డిమాండు ఉంది. అందుకు పెట్టుబడి లేక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. దానిని గురించి మనం ఆలోచించాలి. బ్యాంకర్సు ద్వారా రైతాంగానికి రూ. 10 వేల కోట్ల కంటే ఎక్కువ రావడం లేదు. రాష్ట్రంలో 5 వేల షెడ్యూల్ బ్యాంకులు ఉన్నాయి. అందులో రూ. 77 వేల కోట్ల రూపాయలు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన డిపాజిట్స్ ఉన్నాయి. ఇక్కడ ల్యాండుకు ఎంత ఇస్తున్నారో ఒకసారి ఆలోచించాలి. మీరు ఈ

విషయమై ప్రెజర్ తీసుకు రావాలి. మీరు కమర్షియల్ బ్యాంక్సు మీద కూడా ప్రెజర్స్ తీసుకు రావాలి. ఆ విధంగా చేయకపోతే ఈ అగ్రికల్చర్ సెక్టారులో లెండింగ్ రోజు రోజూ తగ్గి పోతుంది. కనుక పరపతి అనేది లేక రైతాంగం ఇబ్బందులు పడుతున్నది. దానికి సరైన విధంగా మీరు స్పందించడం లేదు. కార్యక్రమాలను చేపట్టడం లేదని నేను మనవి చేస్తున్నాను. ఈ విధంగా ఈ రోజు మనం చూసినట్లుయితే 70 శాతం భూములకు కూడా 30 శాతం వ్యక్తుల చేతులలో ఉన్నాయి. చాలా మంది కౌలుదారుల నుంచి వచ్చారు. వారి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలు ఏవి వచ్చినా మనం ఇచ్చే నిధులు కనీస నిధులు కూడా వారికి చెందడం లేదు. లాస్ అంతా వారు భరిస్తున్నారు. దాని పైన సమగ్రమైన ఆలోచన మీరు చేయాల్సిందిగా నేను కోరుతున్నాను. బయట అభివృద్ధి చెందిన జపాన్ వంటి దేశం, ఇతర దేశాలు కూడా ఖచ్చితంగా ల్యాండ్ సీలింగ్‌ను అమలు చేస్తున్నారు. చేశారు. అదొక్కటే కాదు ల్యాండు అన్నది ఈ రోజు మనిషి యొక్క జీవనాధారంగానే కాకుండా, సోషల్ స్టేటస్‌గా కూడా ఉంది. మరి దానికై మీరు ఏవిధమైన చర్యలు తీసుకున్నారు? ఇప్పటికి కూడా స్టాటిస్టిక్స్ లో 70 శాతం భూమి 30 లేక 40 మంది వద్ద ఉంది. దాని గురించి మీరు ఆలోచించాలి. అటువంటి ఏరియాలలో మిరు రిలీఫ్ ఇవ్వాలి. కొన్ని మార్పులు తీసుకు రావాలి. ముఖ్యంగా రూరల్ డెవలప్‌మెంట్‌ను చూసినట్లయితే మీరు అందుకు గాను కేటాయింపులు తగ్గించారు. డ్రింకింగ్ వాటర్‌కు కూడా కేటాయింపులు తగ్గించారు. రూరల్ డెవలెప్‌మెంట్‌కు ఎందుకు కేటాయింపులు తగ్గించారో, ఏ కార్యక్రమాలు చేస్తున్నారో వివరించాలని కోరుతున్నాను. ఇది నిజంగా చాలా దారుణం. గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేయడానికి బదులు దానిని మీరు వీక్ చేస్తున్నారు. పరిస్థితులను మీరు వివరించాలని ఫైనాన్సు మినిష్టరు గారిని కోరుతున్నాను. ఆ దశలో మీరు ఆలోచన చేయాలని, కేటాయింపులు పెంచాలని, ఒక్కొక్క ప్రాంతంలో అవసరమైన కనీస అవసరాలను, సౌకర్యాలను తీర్చాలని కోరుతున్నాను. కొన్ని ప్రాంతాలలో కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితులున్నాయి.

**మన రాష్ట్రంలో గ్రామీణ పరిస్థితులను ఒకసారి చూడాల్సి ఉంది. రోడ్స్, ఆల్ ఇండియాలో రోడ్స్ లెవెల్ లెంగ్త్ కన్నా మన రాష్ట్రంలో చాలా లోలెంగ్త్‌లో ఉన్నాయి. గ్రామాలలో సాగునీరు, ఇవ్వలేక పోతున్నాం. అటువంటి సందర్భంలో కేటాయింపులను పెంచవలసిన అవసరం ఉంది.** కాని మీరు కేటాయింపులను తగ్గించడం జరిగింది. అది మంచిది కాదని తెలియజేస్తున్నాను. దీనిపై మీరు ఆలోచన చేయాలి. ఇక ఇరిగేషన్‌కు ఇచ్చామని తప్పించుకుంటే బాగాలేదని తెలియజేస్తున్నాను.

అదే విధంగా చేతి వృత్తులపై ఆధారపడి గ్రామాలలో అత్యధిక సంఖ్యాకులు జీవనం సాగిస్తున్నారు. ఆ వృత్తుల పరిస్థితులను ఒకసారి విశ్లేషణ చేయాల్సి ఉంది. రోజు రోజుకూ పేదరికం వీరిలో పెరుగుతున్నది. సమాజంలో వీరిని గురించి పట్టించుకునే వారు ఎవరూ లేకుండా ఉన్నారు. వారిని వదలి వేస్తున్నారు.కాబట్టి చేతి వృత్తుల వారిని గురించి ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. గ్రామాలలో వీరు తమకు గిట్టుబాటు లేక వలసలు పోతున్నారు. ఈ వృత్తులలో ఆధునికీకరణ వచ్చినప్పటికీ అది వారికి మాత్రం అక్కరకు రావడం లేదు. డబ్బు

ఉన్న వారు ఈ పద్ధతులను అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నారు. ఆ విధంగా డబ్బున్న వారి వద్ద వీరు కూలీలుగా చేరి తమ బ్రతుకును ఈడుస్తున్నారు. చేతి వృత్తి వారి జీవన విధానంపై ఈ ఆధునికీకరణ ప్రభావం ఏమీ లేదు.

ఫిషర్‌మెన్‌కు సంబంధించి. ఆలోచిస్తే, ఈనాడు రాష్ట్రంలో మత్స్యకారులు దాదాపు ఎనిమిదిన్నర లక్షలమంది ఉన్నారు. డైరెక్టుగా కాకపోయినా వీరి మీద ఇన్‌డైరెక్టుగా మరో 20, 30 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఆ విధంగా మనం పేదలకు ఏమి చేశామో ఒకసారి ఆలోచించుకోవాలి. ఆధునిక పద్ధతుల మార్పుతో ఈ రోజు వారికి స్పీడ్ పోస్టులు ఉన్నాయి. కానీ మత్స్యకారులు మొదటి నుంచి తమ జీవన విధానాన్ని అలాగే కొనసాగిస్తున్నారు. మరి ఈ ఆక్వా కల్చర్ వీరిలో ఏమి మార్పులు తెచ్చింది అనే విషయాన్ని మనం ఆలోచించాలి. పేదలైన మత్స్యకారులు డబ్బున్న వారి వద్ద కూలీలుగా పోయి తమ జీవనం సాగిస్తున్నారు. స్వయంగా తామే ఆక్వా కల్చర్ పెట్టుకునే స్థోమత కలిగే మార్పు వారికి రాలేదు.

ఇక నాయీ బ్రాహ్మణుల విషయానికి వస్తే ఈ నాటికీ గ్రామాలలో వారు తమ గత జీవన విధానాన్నే అమలు పరుస్తున్నారు. మోడ్రనైజ్ అయిన పద్ధతి ప్రకారం గ్రామాలలో నాయీ బ్రాహ్మణులు జీవించడం లేదు. పట్టణాలలో ఆధునీకరించబడిన విధానంలో బ్రహ్మాండంగా సెలూన్సు నడుస్తున్నాయి. బ్యూటీ పార్లర్స్ నడుస్తున్నాయి తప్ప ఈ నాయీ బ్రాహ్మణులు స్వయంగా తాము షాప్స్ పెట్టుకుని చేసుకునే అవకాశం లేదు. కారణం, కీలకం దీనికి డబ్బే. అది వారి వద్ద లేకపోవడమే దానికి కారణం. కాబట్టి వారికి మనం ఆ రంగంలో సహాయం చేసే ఆలోచన చేయాలి.

ఇక చాకలి వారు. వారు గ్రామాలలో నీరు లేక ఎక్కడెక్కడికో పోయి బట్టలను ఉతుక్కోవలసిన పరిస్థితి ఉంది. అది కూడా చేయలేని పరిస్థితిలో వారున్నారు. కొద్దిగా మోడ్రనైజ్ చేసినా అది ఎవరో కొట్టేస్తారు. డబ్బు ఉన్న వారు మాత్రం ఫ్యాషన్ షాపులు పెట్టుకుంటారు, పెద్ద పెద్ద డ్రైక్లీనింగ్ సెంటర్సు పెడతారు. వాళ్ల దగ్గర వీళ్లు ఇస్త్రీ చేయడానికో, బట్టలు ఉతకడానికో పనికి వస్తారు తప్ప వీళ్లు మాత్రం స్వయాన పెట్టుకొనే పరిస్థితులు ఈనాడు లేవు. మిగతా వాళ్లకు ఇచ్చినట్లు వీళ్లకు ఎందుకు మనం కలుగజేయ లేక పోతున్నాము. ఇండస్ట్రీలిస్టుల పేరుతో చాలామటుకు ఎస్.ఎఫ్.సి.లు పెట్టాము, ఎ.పి.ఐ.డి.సి.లు పెట్టాము. జనాభాలో సగభాగం ఉన్న చేతివృత్తుల వారికి ఎందుకు మనం ఫైనాన్సు కార్పొరేషన్స్ పెట్టాము? బి.సి. ఫైనాన్సు కార్పొరేషన్‌కు 4,5 కోట్లు ఇస్తాము, ఎన్నికలప్పుడు మాత్రము 2 కోట్లు ఎక్కువ ఇస్తాము ఈ విధమైన కార్యక్రమం తప్ప మనం ఈనాడు సమగ్రంగా అర్థం చేసుకొని చేతి వృత్తులను అప్‌గ్రేడ్ చేయాలనే దానిపైన ఎంతవరకు సీరియస్‌గా ఆలోచిస్తున్నామో ఆలోచన చేయాలని తెలియజేస్తున్నాను. చేనేత కార్మికులను ప్రతిరోజు మనం చూస్తున్నాము. ఎంత బాధ వేస్తుంది అంటే ఈ రోజు వాళ్లకి తిండి లేకుండా, పనిలేకుండా చనిపోతున్నారు. ఇది కంటిన్యూగా జరుగుతున్న పరిణామాలు. మనం చూస్తున్నాము. చేనేత కార్మికుల సమస్యలు ఏమిటి? ఐడింటిఫై చేయగలిగామా? ఏది ఏమైనా దీర్ఘకాలిక ఆలోచన చేస్తున్నామా, ఈనాడు ప్రపంచం అంత

కూడా కావలసిన ప్రొడక్టుకు డిమాండ్ ఉన్నది. ఆ యొక్క దిశ లోపల మనం అంత కూడా మోడ్రనైజేషన్ చేయడానికి ప్రయత్నం చేస్తామా అంటే, వాళ్ల పాటికి వాళ్లను వదిలి పెట్టాము తప్ప దానికి అర్థం కాకుండా ఈనాడు ఇబ్బందులు పడుతున్న సంగతి మనం మర్చిపోవద్దు అని తెలియజేస్తున్నాను. ఈనాడు కమ్మరి, మంగలి, గీత కార్మికులు, గొర్రె కాపరులు, ఈ యొక్క చేతి వృత్తులపైన బ్రతికే జనంలో పరిస్థితులో ఏమైనా మార్పులు మనం తీసుకురాగాల్గినా, ఈ బడ్జెటు ఏమైనా వాళ్లకి చెబుతుందా? ఈ బడ్జెటు మూలంగా వాళ్ల జీవన ప్రమాణాలు పెరగడానికి ఏమైనా అవకాశాలు ఉన్నాయా? ఈనాడు మనం ఇరిగేషన్ ప్రాజెక్టులు కడుతున్నాము, మిగతా ఇండస్ట్రీస్ కావాలి. ఎందుకు చేతి వృత్తుల సపోర్టు సిస్టమ్ పెట్టుకోలేకపోతున్నాము. ఆలోచన చేయండి. నిన్న చేతివృత్తులపైన షార్టు డిస్కషన్‌లో ప్రభుత్వం ఇచ్చిన జవాబు చూసినట్లయితే గొర్రెల కాపరులు గొర్రెలు కాస్తారు, గీత కార్మికులు తాడిచెట్టు ఎక్కుతారు, బెస్తవాళ్లు చేపలు పడతారు. చాకలి వాళ్లు బట్టలు ఉతుకుతారు ఇది, అంటే ఈ సంగతులు ఎవరికి తెలియవు. ప్రభుత్వం ఈ రోజు కనుక్కున్నదా? మేము అడుగుతున్నాము. ఫైనల్‌గా ఏమి చెబుతారు అధ్యక్షా! ఈ సభ ఎందుకండీ, పేద ప్రజలు చేతివృత్తుల వారు కోట్లాది మంది బ్రతుకుతున్నటువంటి ఈ ప్రజల యొక్క సమస్యలు పరిష్కారం జరగకుండా ఈ సభ ఎందుకు? ఈ చర్చ ఎందుకు? దీనిపైన కనీసం మీరు ఏ విధంగా ఉండాలనే ఆలోచన లేనందుకు అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకు మనం ఇస్తున్నటువంటి రిలీఫ్ ఏమిటి? మనం ఇక్కడ కూర్చొని నీవెంత, నీవెంత తిట్టుకొని కుస్తీలు పట్టడమా? నీవు క్రింద పడుతున్నావు, నేను మీద పడుతున్నాను. నీకాళ్లు పట్టుకుంటాను, నీచేయి పట్టుకుంటాను ఇదానండీ మనం చేసేది. ఈ రోజు మనం ప్రజలకు చెప్పేది. ఈ దేశంలో ఇప్పటికి ఏమి చేయాలనే పొల్లుపోకుండా ప్రజలు అందరికి అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు.

అధ్యక్షా! మన దగ్గర ఒక అలవాటు వున్నది. ఒక అంశం ఇక్కడ ప్రస్తావనకు వచ్చినపుడు ఏమేమి చేశారని చెప్పి అడుగుతున్నారు. మీరు ఏమి చేసినారు, మేము ఏమి చేసినాము ఈ విధంగా చర్చని ఇప్పుడు చేసుకుంటూ పోతే చాలా రోజుల తరువాత, ఇప్పటికే చాలా కుతికలదాకా వస్తుంది మన పరిపాలనా విధానం. **బీద వాళ్లకి ఇప్పటికే ఓపిక నశిస్తావున్నది. మనందరిని గెలిపించి ఇక్కడికి పంపించారు. సమస్యలు పరిష్కరించమంటే మనం ఈనాడు నీవు ఏమి చేసినావు, నేను ఏమి చేశాము చెప్పి మనం మాట్లాడుకుంటూ వెళ్లి పోవడం కాదు.** మేము కొంత ప్రయత్నం చేశాము. ఆదరణ కార్యక్రమం పెట్టాము. ఆదరణ కార్యక్రమంలో స్కిల్స్ అప్‌గ్రేడేషన్ కొద్దిగా బిగినింగ్ చేశాము. నేను అన్నీ బ్రహ్మాండంగా చేశామని చెప్పను. స్కిల్స్ అప్‌గ్రేడేషన్ కొంత బిగినింగ్ స్టార్టు అయినది సరే, కొంత ఎన్నికల టైము లోపల అక్కడ ఇక్కడ కొంత చేశారు. నేను కాదనడం లేదు. దానిని ఒప్పుకుంటాను. ఆ విధంగా కొన్ని అప్రాప్రియేషన్, మిస్ అప్రాప్రియేషన్ అయినాయి, కాని దానిని సరిచేసుకుంటు పోవాలి తప్ప ఆసలు మేము దీనిని ఆలోచన చేయము అంటే కాదు. నూటికి 50 శాతం మంది ఉన్న చేతి వృత్తుల వాళ్ల పరిస్థితి ఏమి జరుగుతోంది? మోడ్రనైజేషన్ విషయంలో ఏ మాత్రం మీరు మార్పులు తీసుకొచ్చారు? మొత్తం సంపద అంతా కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిపోతున్నది. రాళ్లు కొట్టే వడ్డెరలు వడ్డెరులుగానే ఉంటున్నారు. ఒక

క్రషర్ వాళ్లు పెట్టుకొనే పరిస్థితి లేదు. వాళ్లు కూలీలుగానే మారిపోతున్నారు తప్ప వాళ్ల బ్రతుకుల్లో ఎటువంటి మార్పులు లేవు ఇప్పుడు కూడా సమస్యల పరిష్కారం జరగడం లేదు. 46 వేల కోట్ల రూపాయలు ప్రాజెక్టులు కోసం పెట్టారు. అందులో వృత్తిపని వారి కోసం ప్రతి సంవత్సరం వెయ్యి కోట్ల రూపాయలు మీరు కేటాయించండి. జనాభాలో 50 శాతం చేతివృత్తుల పైన బ్రతుకుతున్నారు, మీరు స్కిల్స్‌ను అప్‌గ్రేడ్ చేయండి. పోటీ ప్రపంచంలో చైనా గురించి అందరం మాట్లాడుతున్నాము. చైనా వర్‌సెస్ ఇండియా అని చెప్పి అమర్త్యసేన్‌గారు చాలా చక్కగా అక్కడ పరిస్థితులు, ఇక్కడ పరిస్థితులు ఎనలైజ్ చేసి చెప్పారు. చైనా లోపల స్కిల్స్ అప్‌గ్రేడ్ చేశారు. అక్కడ ఉన్న గ్రామీణ వ్యవస్థలో తరతరాలుగా వస్తున్నటువంటి చేతి వృత్తులు అప్‌గ్రేడ్ చేయబడ్డాయి. ఆ విధంగా అక్కడ జరిగే ప్రొడక్టివిటీతో ప్రపంచ మార్కెట్‌లో పోటీగా నిలబడి, స్కిల్సును డెవలప్‌చేసి, అక్కడ ఉన్న కోట్లామంది బ్రతుకుతున్నారు. మీ బడ్జెటు లోపల స్కిల్సు అప్‌గ్రెడేషన్‌కు మీరు ఏమి పెట్టుబడి పెట్టారు. కోట్లాది మందికి మీరు జవాబు ఇస్తారా? ఈ ప్రభుత్వం చేస్తుందా అని చెప్పి నేను తెలియచేస్తున్నాను. మీరు చేశారా, నేను చేశాను అని చెప్పుకుంటూ మాట్లాడుతూ పోతే ఇంకా భవిష్యత్తులో చాలా విధంగా వుంటుంది. ఇప్పటికే చాలా పరిణామాల దిశలో ఆలోచించి చేయడంలో మనం కళ్లు తెరవడం లేదు. కనుక చాలా ఇబ్బందులు ఉంటాయి. ఇప్పటికే అన్నమో రామచంద్రా అంటూ అనవసరమైన కార్యక్రమాలకు వాళ్లు పోకుండా చూడాలి ఓపికతో ఇప్పటికి మన వైపు చూస్తున్నారు. దీనికి జవాబురావాలని నేను తెలియజేస్తున్నాను. అందరం శాసన సభలో 8 కోట్ల 10 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాము. 70 శాతం ప్రపంచ దేశాలలో కంటే మన జనాభా ఎక్కువ ఉన్నది. యూరప్‌లో మన లాగా పెద్ద దేశాలలో లేనంత జనాభా ఈ రాష్ట్రంలో ఉన్నది. ఇంత జనాభా ఉన్నటువంటి దీనికి మనం ఇస్తున్న పరిష్కార మార్గాలు ఇందులో మాత్రం నాకు కనిపించడం లేదు. ఈ దిశలో మనం ఆలోచన చేస్తున్నట్టుగా కనిపించడం లేదు. **ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచీకరణ జరుగుతావున్నది. మానవ జీవనంలో అత్యధికంగా పెను మార్పు వచ్చింది. ఇండస్ట్రియల్ రివెల్యూషన్ వచ్చినప్పుడు మనం ఆనాడు బానిసత్వంలో ఉన్నాము.** ఆనాడు మనిషి స్టీమ్ ఇంజన్ కనుక్కొన్నారు, టెలిఫోన్ వచ్చింది, ఎలక్ట్రిసిటీ, ఆ విధంగా అనేక రంగాలలో వచ్చిన మార్పులు ఈనాడు ఉన్న జీవన ప్రమాణాలు పెంచడానికి బ్రహ్మాండమైన అవకాశం దొరికింది. ఆ విధంగా మన ముందు నిలబడి వున్నది. ఆ దిశలో మనం నాయకులుగా ఇక్కడ ఉన్నాము. ఈనాడు మొత్తం ప్రపంచీకరణ జరుగుతున్నా, ఒక వైపు అన్నిటి కంటే ముఖ్యంగా టెక్నాలజీ చాలా పెను మార్పులు తీసుకువస్తున్నది. ప్రపంచంలో పరిణామాలు అన్నీ కూడా మన చేతిలో ఉన్నాయి. అనేక పరిణామాలు వచ్చాయి. ఇక్కడ వుండి సెల్‌ఫోన్‌తో దేశంలో ఎవరితో అయినా మాట్లాడవచ్చు. ప్రపంచంలో ఏమి జరుగుతుంది తెలుసుకోవచ్చు, విద్యా ప్రమాణాలు పెంచుకోవడానికి అవకాశం వున్నది. ఈ విధమైన టెక్నాలజీ వచ్చి రివెల్యూషన్ టైములో ఈనాడు అధికారంలో ఉన్నాము. మనందరం కూడా ఈనాడు నాయకులుగా ఉన్నాము. ఈ రివెల్యూషన్ మనం ఎడాప్ట్ చేసుకొని ముందుకు పోతామా లేకపోతే అట్లానే వదిలివేసి నాకు సంబంధం లేదు, ఏదో పాత పద్ధతుల్లో నడుస్తున్న పద్ధతి కొనసాగించుకుంటూ పోయినట్లయితే ఈ యొక్క ప్రజలు క్షమించరని చెప్పి మీకు

తెలియచేస్తున్నాను.

అధ్యక్షా! ఈ రోజున ప్రపంచంలోని అనేక దేశాలలో వచ్చిన మార్పులను పరిణామాలను ఒక్కసారి గమనించి అవి ఏవిధంగా ముందుకు పోయాయో అర్థం చేసుకోవలసిన అవసరముంది. పేదరికం అనేది 17వ శతాబ్దం వరకు ప్రపంచలోని అన్ని దేశాలలోనూ వుండేది. 17వ శతాబ్దం వరకు ఈ పేదరికం అనేది అందరికీ ఒకటే. కాని ఉదాహరణకు యూరప్‌ను తీసుకుంటే 17వ శతాబ్దం వరకు అక్కడున్న పేదరికాన్ని తొలగించుకోవడం కోసం ఇండస్ట్రియల్ రివల్యూషన్ తీసుకొని వచ్చి, ఆ పద్ధతులను విజయవంతంగా అడాప్ట్ చేసుకొని Within a short period వాళ్లు తమ పేదరికాన్ని తొలగించుకున్నారు. అలాంటి పద్ధతుల్లో మన రాష్ట్రం కూడా ప్రపంచంలో వస్తున్న పరిణామాలను గమనించి వాటిని మనకు అనుకూలంగా మలచుకొని మన రాష్ట్రంలో కూడా పేదరికాన్ని తొలగించుకోవడానికి కృషి చేస్తున్నట్లుగా నాకు కనపడడం లేదు. అందువల్ల దయచేసి ఆ దిశలో చేయవలసిన కార్యక్రమాలకు సంబంధించి పెట్టుబడుల కోసం మీ బడ్జెట్‌లో కేటాయింపులు చేయవలసిన అవసరముందని గుర్తు చేస్తూ ఆ దిశలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అదే విధంగా ఈ రోజు రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్యను చూస్తే ఈనాడు ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజీలలో నమోదై వున్న నిరుద్యోగుల సంఖ్య 24 లక్షలకు పైగా వుంది. ప్రతి సంవత్సరం ఈ సంఖ్యకు తోడు రెండు లక్షల 30 వేల మంది కొత్తగా ఎన్‌రోల్ అవుతున్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా మన రాష్ట్రంలోనే ఈ నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా వుందంటే అతిశయోక్తి కాదు. ఈ నిరుద్యోగులకు సంబంధించి వారికి ఉపాధి కల్పించడం కోసం ఈ ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోవాలనే దాని గురించి ఆలోచించాలని కోరుతున్నాను. **ఈనాడు ప్రపంచీకరణను ఆపే శక్తి ఎవరికీ లేదు. ప్రపంచీకరణను కొనసాగిస్తూనే దానిలోని అడ్వాంటేజెస్‌ను వెతికి పట్టుకొని వాటిని మనకు అనుకూలంగా మలచుకోవాలి. ఈనాడు అందులో భాగంగా అపెరల్ పార్క్ గురించి కూడా ఆలోచించవలసిన అవసరముంది.** ఈనాడు మనం 2005వ సంవత్సరంలో వున్నాము. ఈ రోజు కోటా సిస్టం పోయింది. అందువల్ల నేచురల్‌గానే మన దేశంలో చీప్‌గా వచ్చే లేబర్ మన వద్ద అందుబాటులో వున్నారు. ఈ లేబర్‌ను వుపయోగించుకొని వారికి ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించాలి. మేము ఈ అపెరల్ పార్కును మా రంగారెడ్డి జిల్లాలోని గుండ్ల పోచంపల్లిలో స్టార్ట్ చేశాము. దాదాపు 20 వేల మందికి ఉపాధి దొరికే అవకాశాలు కూడా ఉన్నాయి. మా ప్రభుత్వంలో అటువంటి ప్రణాళిక తయారు చేసి ముందుకు పోవడం జరిగింది. ఈ ప్రభుత్వం కూడా హయ్యస్ట్ ఎంప్లాయ్‌మెంట్ పొటెన్షియాలిటీ వుండే రంగాలైన అపెరల్ పార్క్, టెక్స్‌టైల్ పార్క్, లెదర్ పార్క్ వంటి వాటిని, labour intensive activities కల్పించడానికి ఎక్కువ అవకాశాలున్నాయి కాబట్టి అలాంటి వాటిని ఎక్కువగా నెలకొల్పే దిశగా కృషి చేసినట్లయితే మన రాష్ట్రంలో పెద్దగా చదువు సంధ్యలు లేని వారికి కూడా ఉపాధి కల్పించడానికి అవకాశమేర్పడుతుంది. ఈనాడు ఏడవ తరగతి వరకు కూడా సరిగా చదువుకోని వాళ్లు ఇలాంటి రంగాలలో ఉపాధి పొంది నెలకు దాదాపు రెండు, మూడు వేల రూపాయల వరకు సంపాదించుకుంటున్నారు. నేను మా జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై ఒకసారి చెప్పడం జరిగింది. ఎందుకంటే ముఖ్యమంత్రి గారు ప్రతి శనివారం అక్కడికి

రెస్ట్ తీసుకోవడానికి వచ్చిన సందర్భంలో వారికి దీని గురించి వివరించి అక్కడికి తీసుకెళ్లి చూపించినట్లయితే వారు కూడా దానిని చూసి అలాంటివి ఏర్పాటు చేయడానికి ముందుకొస్తారన్న ఉద్దేశంతో చెప్పాను. అయితే ఏమైందో ఏమో నాకు తెలియదు కాని ఇంతవరకు ప్రభుత్వంలోని వారు ఎవరూ కూడా అక్కడికి వెళ్లి చూసినట్లు నాకు కనపడలేదు. దీనిని ఒక మోడల్‌గా మేము తయారు చేయడం జరిగింది.

Yes. I am proud of it. మా ప్రభుత్వంలో మేము ఎంతో శ్రద్ధ తీసుకోవడం జరిగింది. ఈ ప్రభుత్వం కూడా ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవలసిన అవసరముంది. ఎందుకంటే దాదాపు ఐదారు వేల మందికి ఉపాధి కల్పిస్తూ, ఇంకా 20, 30వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అలాంటి వాటిని నెలకొల్పవలసిన అవసరం ఎంతైన వున్నది. ఈనాడు విదేశస్థులు చాలా మంది చీప్‌గా లేబర్ దొరికితే చాలన్న వుద్దేశంతో వున్న వారు ఇలాంటి పరిశ్రమల విషయంలో ముందుకొచ్చే అవకాశముంది. అలాంటి వారి ద్వారా ఇలాంటి పార్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలుంటాయి. అలాంటి విషయాలను పరిశీలించమంటే ఈ ప్రభుత్వంలో చలనం లేదు. ఆ దిశలో బడ్జెట్ కేటాయింపులు కూడా కనపడడం లేదు. ఈ విధమైన ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అవకాశాలు కల్పించకుండా రాష్ట్రంలోని యువకులకు మీరు ఏవిధంగా ఉపాధి కల్పించదలచుకున్నారో చెప్పాలని కోరుతున్నాను.(అంతరాయం)

సార్, నేను మంచి విషయాలే చెబుతున్నాను సర్. నేను రాజకీయంగా మాట్లాడడం లేదు. మీరు ప్రభుత్వానికి కొత్తగా వచ్చారు. కనీసం మీ ప్రాధాన్యత క్రమంలో కొన్ని మార్పులు చేసుకోవలసిన అవసరముంది. కాని మీరేమో మీకు ఇంటరెస్ట్ వున్న కొన్ని రంగాల పైనే దృష్టి పెడుతున్నారు. అంటే మీకు ఆదాయం వచ్చే రంగాలపైనే మీరు దృష్టి పెడుతున్నారు. ఇతర ప్రాధాన్యతా రంగాల గురించి పట్టించుకోవడం లేదు. వాటికి తగిన కేటాయింపులు చేయడం లేదు. ఒకసారి విద్యారంగాన్ని చూసినట్లయితే ఈనాడు human resources development అనేది ఈనాడు ప్రపంచలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈనాడు దేశాభివృద్ధికి అక్షరాస్యత అనేది అతి కీలకమైనది. కాని ఈనాడు మన రాష్ట్రం అక్షరాస్యతలో 28వ స్థానంలో వుందంటే మనమంతా తల దించుకోవాలి. **ఈనాడు విద్యారంగంలో వచ్చిన పెను మార్పుల వల్ల విద్యారంగం రెండు విధాలుగా విడగొట్టబడింది. ఈనాడు డబ్బు వున్న వారికి బ్రహ్మాండమైన విద్య లభిస్తున్నది. దాదాపు 70 శాతానికి పైగా వున్న నిరుపేదలకు విద్య అందని పరిస్థితుల్లో వుంది.** ఈనాడు ప్రజలకు మనం ఉపాధి కల్పించలేకున్నా కనీసం వాళ్లకు విద్యనైనా కల్పించినట్లయితే తమ కాళ్లపైన తాము నిలబడడానికి అవకాశముంటుంది. కాని ఈనాడు గ్రామీణ ప్రాంతాలలోని వారికి విద్య విషయంలో ఎలాంటి వసతులు కాని, సౌకర్యాలు కాని అందని పరిస్థితి వుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని స్కూళ్లలో టీచర్లు కూడా లేని పరిస్థితులున్నాయి. ఈనాడు గ్రామీణ ప్రాంతాలలోని స్కూళ్లలో టీచర్ల పరిస్థితి ఎలా వుందంటే ఆ ఊరికి బస్సు ఎప్పుడు పోతుందో అప్పుడే టీచర్లు వెళతారు. మళ్లీ ఆ ఊరి నుండి బస్సు ఎప్పుడు తిరిగి వస్తుందో అప్పుడు ఆ టీచర్లు తిరిగొస్తారు. అలా వుంది నేటి గ్రామీణ పాఠశాలల్లోని

దుస్థితి. ఈనాడు మనం ప్రజలకు ఫ్యాక్టరీలు కట్టించ లేకపోయినా, భూములు ఇవ్వ లేకపోయినా కనీసం వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడడానికి చదువైనా అందిస్తే బాగుంటుంది. ఈనాడు అక్షరాస్యత దేశవ్యాప్తంగా 64శాతం వుంటే మన రాష్ట్రంలో మాత్రం 61 శాతం వుండి మనం 28వ స్థానంలో వున్నాము.

ఈనాడు ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు drop outs చూసినట్లయితే ఇది 40 శాతం వరకు వుంది. ఇక పదవ తరగతి స్థాయిలో 60 శాతం వరకు ఈ drop outs వున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవాలి. అక్షరాస్యత విషయంలో మనం చెప్పుకుంటున్నది కాకి లెక్కలే. ఇంకా లోతుకు వెళితే అసలు విషయాలు తెలుస్తాయి. అందుకే మానవ అభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడే కీలకమైన విద్యారంగం అభివృద్ధి విషయంలో బడ్జెట్‌ను మన రాష్ట్ర ఆదాయానికి అనువైనవిధంగా దానికి ప్రపోర్షనేట్‌గా కేటాయించవలసిన అవసరముందని మనవి చేస్తున్నాను. ఇక హాస్టల్స్ విషయానికి వస్తే ఈనాడు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మెస్ ఛార్జీల క్రింద ఇస్తున్న మొత్తం నెలకు రూ. 270/–లు ఏమాత్రం సరిపోనిదిగా వుంది. అదే విధంగా ఈనాడు బీసీ విద్యార్థులు ఆయా విద్యాసంస్థల వాళ్లు ఫీజు కడితేనే కాలేజీకి రానిస్తామని ఇబ్బంది పెడుతున్న పరిస్థితుల్లో దాదాపు మూడు లక్షల మంది స్కాలర్ షిప్పుల చెల్లింపు కోసం తిరుగుతున్నారు. కాని ఆర్థిక మంత్రి రోశయ్య గారేమో మా ప్రభుత్వం ఏలాంటి ద్రవ్య లోటు లేకుండా, ఎలాంటి ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం ఉపయోగించుకోకుండా నడుస్తున్నదని చెపుతున్నారు. మరో వైపు ఈ సోషల్ సెక్టార్‌లో చూసినట్లయితే విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు లేవు. ఇంకొకవైపు ప్రజలకు సరియైన తిండి, నీరు లేని పరిస్థితులున్నాయి. ఈ సందర్భంలో నాకు ఒక కథ గుర్తుకొస్తున్నది అధ్యక్షా. ఒక ఊళ్లో ఒక పెద్ద మనిషి తాను ప్రతి రోజూ నేతితో రొట్టెలు తింటున్నానని చెప్పేవాడు. అతని పరిస్థితి కూడా అంత గొప్పగా లేదు. అలాంటి వాడు నేతితో రొట్టెలు ఎలా తింటాడని అనుమానం వచ్చిన ఊరి వాళ్లకు ఆ విషయం తెలుసుకోవాలని ఒకరోజు అతడేమి చేస్తున్నాడో గమనిస్తారు. అతను ఒక కుండలో వున్న నెయ్యికి ఈ రొట్టెలను తాకించి ఆ రొట్టెలను తింటూ తాను నేతితో రొట్టెలను తింటున్నట్లు సంతృప్తి పడుతున్నాడని ఆ ఊరి ప్రజలు అసలు విషయం తెలుసుకుంటారు. మన ఆర్థిక మంత్రి రోశయ్య గారు కూడా అదే విధంగా మా ప్రభుత్వం ద్రవ్యలోటు లేకుండా, ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం వినియోగించుకోకుండా చాలా సక్రమంగా నడుస్తుందని గొప్పగా చెప్పుకుంటూ మరో వైపు విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు లేకుండా, ప్రజలకు సరియైన తిండి, నీరు కల్పించకుండా, రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా పరిస్థితుల్లో ప్రభుత్వం వుంటే తమ పరిస్థితి ఎంతో గొప్పగా వుందని ఈ ప్రభుత్వం చెబుతున్నది. అధ్యక్షా. నేను దీనిని స్ట్రాంగ్‌గా కండెమ్ చేస్తున్నాను. ఏ విధమైన ఆలోచనతో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదో ఒకసారి చెప్పమనండి. టెండర్లున్నాయి, అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ వున్నాయి, వాటన్నింటి గురించి మాట్లాడాలి కదా!

రోశయ్యగారూ, మేము ఇచ్చాం, మీరు ఇచ్చారని కాదు. పిల్లలకు అవసరం వుంది అక్కడ, సాధ్యమైనంతవరకు మేము ఇచ్చాం, చేతనైనంత మేరకు ధర్మంగా చేశాం. ఇంకా ఎక్కువ

ఇవ్వమని మిమ్ములను కోరుతున్నాం సార్. అవసరాలు ఆ విధంగా వున్నాయి. వారి పరిస్థితి ఒకసారి ఆలోచించండి.

ఒక నాలుగు హాస్టల్స్ తిరిగితే తెలుస్తుంది వారి పరిస్థితి ఎంత దారుణంగా వుందో. నేను గ్యారంటీగా చెబుతున్నాను. హాస్టల్ ఫెసిలిటీస్‌కు సంబంధించి ఎన్ని పర్మనెంటు బిల్డింగులు వచ్చాయి, ఏవిధమైన ఇంప్రూవ్‌మెంటు వుంది తదితర విషయాలను చూడండి. రెసిడెన్షియల్ స్కూల్స్‌ను మా పీరియడ్‌లోనే స్టార్ట్ చేశాం. ఆ స్కూల్స్‌ను మెరుగుపరిచాం. వాటిని ఇంకా ఇంప్రూవ్ చేయండి సార్ మీరు. వాళ్లకు ఈ ప్రభుత్వం గాని, ఈ సమాజం గాని దానం చేయడం లేదు సార్. ఈ రాష్ట్రాన్ని నిర్మాణం చేసింది ఆ పేద ప్రజలే సార్. ఎస్.సి., ఎస్.టి.లు రోడ్లు వేస్తేనే ఈ రోడ్లు వచ్చాయి, వాళ్లు కడితేనే ఈ బిల్డింగులు వచ్చాయి. ఈ దేశ సంపదకు కాంట్రిబ్యూట్ చేస్తున్నారు సార్ వాళ్లు. వాళ్ల పిల్లలకు చదువు లేక, తిండి లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. పని చేయడానికి కాళ్లు రెక్కలు ఆడని ముసలి వాళ్లకు నాలుగు రూపాయల పెన్షన్ కూడా ఇవ్వలేకపోతున్నాం మనం. పరిస్థితి ఆ విధంగా వుంది. కాని బడ్జెట్‌లో మాత్రం బ్రహ్మాండంగా రూ. 55వేలు కోట్లు పెడుతున్నామంటున్నారు, అందులో కనీసం రూ. 2, 3 కోట్లు పెడితే వాళ్ల పరిస్థితి మారిపోతుంది ఈరోజు. కనీసం ఒక శాతం పెంచినా లక్షలాది మంది మీద ఆ ప్రభావం పడుతుందనే విషయాన్ని మరచి పోవద్దని, ఆ దిశలో ఆలోచన చేయమని కోరుతున్నాను.

అదే విధంగా మైనారిటీ సంక్షేమం ఒకసారి పరిశీలిస్తే, వాళ్ల పరిస్థితి ఏ విధంగా ఉందో ఒకసారి ఆలోచన చేయండి. వాళ్లలో రోజు రోజుకు పేదరికం పెరిగిపోతోంది, వాళ్లలో నిరక్షరాస్యత పెరుగుతోంది. మైనారిటీ మహిళల్లో నిరక్షరాస్యత చాలా ఎక్కువ వుంది. కాని కేటాయింపుల్లో రూ. 49 కోట్లు పెట్టి మైనారిటీ వెల్ఫేర్ బ్రహ్మాండంగా జరుగుతోందంటే అది ఏవిధంగా జరుగుతుందో ఒకసారి ఆలోచన చేయమని కోరుతున్నాను. ఈనాడు వాళ్లు మెయిన్‌స్ట్రీమ్‌లోకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. వాళ్లకు గవర్నమెంటుతో ఎటువంటి సంబంధాలు లేవు. పూర్తిగా తెగిపోయాయి. వాళ్ల బతుకేదో వాళ్లు బతుకుతున్నారు. వారి సంక్షేమం పట్ల మీరు ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. రిజర్వేషన్స్ తీసుకొస్తామని చెప్పారు. ఆ రోజే మేము చెప్పాం, మీరు మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు, ఆ 5శాతం రిజర్వేషన్ చెల్లదని చెప్పాం. మేము చెప్పినట్లుగానే అది చెల్లకుండా పోయింది. మళ్లీ అదేమైందో మాకు తెలియదు, ఆ బిల్లు ఏమైందో మాకు తెలియదు. కనీసం అదైనా తీసుకురావాలని కోరుతున్నాను.

అలాగే ఎస్.టి. వెల్ఫేర్ ఒకసారి చూస్తే, మీరు చేసిన కేటాయింపుల వల్ల వారి జీవన ప్రమాణాలలో ఏమి మార్పు వచ్చింది? సార్, నేను విశాఖ జిల్లా పాడేరుకు వెళ్లినపుడు అక్కడ చూశాను. పేదలు ఎంత బాధ పడుతున్నారంటే వాళ్లు ఏవో పీసులు ఉడకబెట్టుకుని తింటున్నారు. ఒక చోట ఈ దృశ్యం కనిపించింది. ఒక వైపు మన గోదాములు నిండిపోయి వున్నాయి. గోదాముల్లో ధాన్యాన్ని ఎలుకలు తింటున్నాయి. మరొకవైపు పేద ప్రజలు తిండి గింజలు లేక అల్లాడుతున్నారు. ఇంకొకవైపు రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. కొనుగోలు

శక్తి లేక కనీసం ఒక పూట కూడా భోజనం చేసే పరిస్థితి లేని వాళ్లు మన రాష్ట్రంలో చాలా మంది వున్నారు. అటువంటి కొనుగోలు శక్తి పెంచకుండా, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచకుండా ఈ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందంటే అది ఎలా సాధ్యమవుతుందని అడుగుతున్నాను. ఐటిడిఏలు ఏమి చేస్తున్నాయో, వాటి పరిస్థితి ఏమిటో ఒకసారి ఆలోచన చేయండి. మీ ముఖ్యమంత్రిగారు ఒక్కసారైనా ఈ ఐటిడిఏలను రివ్యూ చేశారా? అక్కడ వుండే ఆఫీసర్లు గిరిజనుల వద్దకు వెళుతున్నారా? అడవిని నమ్ముకుని బతికే ఆ పేద గిరిజనులకు మేలైన పరిస్థితులు కలుగజేశారా? ఐటిడిఏల పరిస్థితిని మెరుగుపరచడానికి మీ బడ్జెటులో ఏమైనా ప్రయత్నం చేశారా? పేదరికంలో మగ్గుతున్నవారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి మీరు ఏమి చేస్తున్నారో తెలియజేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

ఎస్.సి.లలో చాలా మంది వ్యవసాయ కూలీలు. పని లేకపోవడంతో గ్రామాలను వదలి పెట్టి వలస పోతున్నారు. ఇంతకు ముందు రాష్ట్ర రాజధానికి వచ్చేవారు. ఇప్పుడు ఇక్కడ కూడా పనులు లేకపోతే వేరే రాష్ట్రాలకు పని కోసం లక్షలాది మంది ప్రజలు వలస పోతున్నారు. వాళ్లంతా పనుల కోసం వలసపోతే ఇంటి దగ్గర వుండే ముసలి వాళ్లను ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితి లేదు. వాళ్లకు కనీసం ఒక పూట కూడ తిండి దొరకని పరిస్థితి ఈనాడు రాష్ట్రంలో వుందనే విషయం మీకు తెలియదా? దానికి మీరు ఏమి చేస్తున్నారో తెలియజేయాలని కోరుతున్నాను.

**ఈరోజు బడ్జెటులో బడ్జెట్ ఇనీషియేటివ్స్, నాన్ బడ్జెట్ ఇనీషియేటివ్స్ అని రెండు రకాలుగా వుంటాయి. బడ్జెటులో మనం చేస్తున్న కేటాయింపులు వాటి మూలంగా మార్పు వస్తుంది. రెండోది–నాన్ బడ్జెటు ఇనీషియేటివ్స్‌లో చాలా వుంటాయి.** దాని మీద శ్రద్ధ తీసుకోవడం లేదు. అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ లేవు. ఈనాడు మన అడ్మినిస్ట్రేషన్‌లో జవాబుదారీ వుందా? దాంట్లో అనేక మార్పులు తీసుకురావలసిన అవసరం వుంది. అనేక చట్టాలలో మార్పులు తీసుకురావలసిన అవసరం ఉంది. మనం ఏర్పాటు చేసుకున్న చట్టాలలోనే మనం పడిపోయి, వాటి నుంచి మనం బయటపడలేకపోతున్నాం. ల్యాండ్‌కు సంబంధించి రెండు వందల చట్టాలున్నాయి. ఒకసారి మాకు అవసరం వస్తే సెక్రటేరియట్‌లో కూడా దొరకలేదు, పడాల రామిరెడ్డి లైబ్రరీ నుంచి కొన్ని బుక్స్ తెప్పించుకోవలసిన అవసరం ఏర్పడింది. Abundant గా వున్న చట్టాల్లోంచి కొన్ని తీసేసి, క్రోడీకరించి కొన్ని మార్పులు తీసుకురావడం జరిగింది. అదే విధంగా ఈనాడు ప్రతి డిపార్టుమెంటులో రీఫార్మ్స్ తీసుకురావలసిన అవసరం వుంది. ఈనాడున్న పరిస్థితుల్లో మీరు ఏమాత్రం కూడా అడ్మినిస్ట్రేషన్‌ను గేరప్ చేయకుండా మరి భవిష్యత్తులో ఏమి చేయబోతున్నారో ఎక్కడా కూడా మీ పాలసీలో చెప్పడం లేదు. దాని గురించి ఆలోచించమని కోరుతున్నాను.

అధ్యక్షా! ఈనాడు ఈ ప్రభుత్వం చాలా చెప్పుకుంటున్న కార్యక్రమాలలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం ఒకటి. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ వాళ్లు ఎవరు మాట్లాడినా, ప్రభుత్వంలో వున్న వాళ్లు మాట్లాడినా ఒక్కటే చెబుతున్నారు, మేము ఇరిగేషన్ ప్రాజెక్టులు కడుతున్నాం, ప్రాజెక్టులు కట్టే వరకు మీరు ఆగండి, ఈ ఇరిగేషన్ ప్రాజెక్టులు కడితే రాష్ట్రంలో వున్న పేదరికం అంతా పోతుంది, అన్ని సమస్యలకు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణమే పరిష్కార మార్గమని చెబుతున్నారు.

కేటాయింపులు కూడా చేశారు, సంతోషం, 41 శాతం కేటాయింపులు ఇరిగేషన్‌కే పెట్టడం జరిగింది. మేము కేటాయింపుల మీద ప్రశ్నించడం లేదు, కేటాయింపులు చేయండి, వద్దనడం లేదు. అయితే మీరు వాస్తవంగా ప్రాజెక్టులు కట్టి నీళ్లు తీసుకొద్దామనుకుంటున్నారా? లేకపోతే ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో మీరంతా డబ్బులు దండుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారా అన్నది ఈనాడు ప్రధానమైన చర్చ. నిజానికి మీరు ప్రాజెక్టులు కట్టి నీరు తీసుకొచ్చినట్లయితే దానికి మేము కూడా సంతోషిస్తాం. తప్పకుండా అది జరగవలసి వుంది. ఎందుకంటే ఈనాడు నీరు లేక చాలా సమస్యలు వస్తున్నాయి. ఈనాటి వరకు కూడా 52 శాతం భూమి బోర్‌వెల్స్ ద్వారానే ఇరిగేట్ అవుతోంది. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటుకు పోతున్నాయి. ఖచ్చితంగా నదీ జలాలను తీసుకురావలసిన అవసరం ఉంది. కాబట్టి ఆ నీటిని మీరు ఏ విధంగా తీసుకొస్తారు? దీనికి సంబంధించి మనం ఎడాప్ట్ చేసుకున్న సిస్టం కరెక్ట్‌గా వుందా? గత అసెంబ్లీ సమావేశాలలో కూడా దీనిపై సుదీర్ఘంగా చెప్పాం.

మీరు వాటర్ అవైలబిలిటీ చూడడం లేదు. నేను ఈ మధ్య శ్రీధర్‌గారి కార్టూన్ చూశాను. ఒకచోట ప్రాజెక్ట్ కట్టారు.. ఇనాగరేషన్ కోసం మినిస్టర్‌గారిని తీసుకువెళ్లారు. ఆయన నీళ్లు లేవా, ప్రాజెక్ట్ ఇక్కడకు ఎలా వచ్చిందని అడిగారు. ప్రాజెక్ట్ కట్టాలంటే చాలా ఇబ్బందులు వస్తాయి. అందువల్ల ఇక్కడ కట్టాము. దీనికి నీళ్లు రావాలంటే కాలువలు తవ్వి నీళ్లు పోస్తే వస్తాయని చక్కని కార్టూన్ వేశారు. ఆ విధంగా నీళ్లు ఉన్నాయా, లేదా? అని చూడడం లేదు. రాత్రికి రాత్రి టెండర్సు తయారు చేస్తున్నారు. టోటల్‌గా వాళ్లు గుత్తాధిపత్యం తీసుకువచ్చి కాంపిటేషన్ లేకుండా చేస్తున్నారు. కాలువలు త్రవ్వడానికి కూడా ఇపిసి పెట్టిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదు, ప్రపంచంలో కూడా లేదు, మన దగ్గర ఉంది. ఎక్సెస్ కోట్ చేస్తూ ఇపిసి సిస్టమ్ ఇంట్రడ్యూస్ చేశారు. దానిని ఎ,బి క్యాటగిరైజ్ చేశారు. వాటిలో ప్రధానమైన పనులు ఏ క్యాటగిరీకి ఇచ్చారు. అక్కడ ఎటువంటి కాంపిటీషన్ లేకుండా జాగ్రత్తపడ్డారు. ఆ విధంగా వర్క్సు పంచుకున్నారు. ఈ విషయం గురించి రోజూ పేపర్లలో వస్తున్నది, ఇక్కడ చర్చ జరుగుతున్నది. అయినా ప్రభుత్వం నుండి స్పందన లేదు. బి క్యాటగిరీలో చేంజ్ చేశారు. ఎంత ఘోరమైన పరిస్థితి అంటే, ఈ రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు చూస్తుంటే, (అంతరాయం)

ఇరిగేషన్ పైన మేము చర్చ కోసం పట్టుపట్టాము. 30 రోజుల నుండి ఇరిగేషన్ పైన జరిగిన అవకతవకలు శాసనసభ్యులు చర్చించాలని ఎంతో ప్రయత్నం చేశాము. అయినా చర్చ సాధ్యం కాకుండా చేశారు. చర్చకు రాకుండా జాగ్రత్త పడ్డారు. నిన్నటి వరకు మేము స్ట్రగుల్ చేశాము. టెక్నికాలిటీస్‌లో పెట్టి హౌస్ క్లోజ్ చేశారు. ఆ విధంగా ఇరిగేషన్‌పై చర్చ రాకుండా చేశారు. వారి బండారం బయట పడుతుందని ఇరిగేషన్ విషయం చర్చకు రాకుండా చేశారు. మీరు టైమ్ లేదని అంటున్నారు.(అంతరాయం)

ఈ హౌస్‌లో రెండు, మూడు సార్లు చాలా స్పష్టంగా చెప్పాము. ఇరిగేషన్ టెండర్సులో చాలా పెద్దయెత్తున అవినీతి జరుగుతున్నది. కోట్లాది రూపాయలు ఈ ప్రభుత్వం కాజేస్తున్నది. దీనిపైన సమగ్ర విచారణ కావాలని అడిగాము. కాని ప్రభుత్వం నుండి స్పందన, కదలిక లేదు.

ఏ మాత్రం భయపడకుండా వారేమి అన్నా ఫరవాలేదని ముందుకు వెళుతున్నారు. ఇరిగేషన్‌పై చర్చ జరుగుతుందని తెలిసినా, ముఖ్యమంత్రిగారు మొన్ననే, మీరు ఎస్టిమేట్సు, డిజైన్సు బాగానే మారుస్తున్నారు, మీరు చేసే పని మీరు చేసుకోండి, చాలా బ్రహ్మాండంగా చేస్తున్నారని అన్నారు. ఆ విధమైన వ్యాఖ్యలు పేపర్లలో చూశాము. కావాలంటే పేపరు తెప్పిస్తాను చూడండి.

( అంతరాయం )

వాళ్లు కూడా అపోజిషన్ పార్టీలో ఉన్నారు. అపోజిషన్ పార్టీ యొక్క సోర్సెస్ ఏమిటి? న్యూస్‌పేపర్ వస్తుంది. ఆఫీసర్ల వద్ద నుండి కాని వాళ్ల దగ్గర ఉన్న వారి వద్దనుండి అయినా తెలుస్తుంది. మాకు యంత్రాంగం ఉందా? టెండర్సు, ఎస్టిమేట్స్ మార్చారు, మాకు చెప్పి మారుస్తారా వీళ్లు? మాకున్న ఇన్ఫర్మేషన్ చెబుతున్నాము. వాస్తవాలు ప్రూవ్ చేస్తామంటే ఎందుకు భయపడతారు? ఒక ఎగ్జాంపుల్, ఫ్లడ్ ఫ్లో కెనాల్ గురించి రోశయ్యగారు స్పెసిఫిక్‌గా ఏదో మాట్లాడుతున్నారు. ఎస్ఆర్ఎస్‌పి ఫ్లడ్‌ఫ్లో కెనాల్ 70 కి.మీ. నుండి 122 కి.మీ ఏడు ప్యాకేజీల క్రింద క్యాటగిరీ 2 లో ఇచ్చారు. ఇదే గవర్నమెంట్ వీరే పిలిచారు. ఇదే సేమ్ మెషినరీ. ( అంతరాయం )

స్పీకర్ సార్, ఈ శాసనసభలో బడ్జెట్ సెషన్ గురించి రోశయ్య గారు దయచేసి ఆలోచన చేసుకోవాలి. మనం ఇక్కడ శాసనసభ్యులుగా ఉన్నాము. ప్రభుత్వాన్ని ఈ రోజు ప్రజలు ఎన్నుకొని ఇక్కడికి పంపించారు. ఈ శాసనసభ ద్వారా ఏవైనా సమస్యలు పరిష్కారం అవుతున్నాయో మీరు చెప్పండి. ఏ డిబేట్‌కైనా సరైన జవాబు ప్రభుత్వం ఇస్తుందా? కాన్స్టిట్యూషన్ క్లియర్‌గా చెబుతుంది. Government, Government's administration are accountable to this House అని. అందుకే ప్రతి ఆరు నెలలకి ఖచ్చితంగా శాసనసభ మీట్ అవ్వాలి. ఆరు నెలలకు ఒక్క రోజు లేట్ అయినా ఆటోమ్యాటిక్‌గా డిసాల్వ్ అయిపోతుందని కాన్స్టిట్యూషనల్ మేకర్స్ అంత కేర్ తీసుకున్నారు. ఈరోజు ప్రభుత్వం ఎవరికి జవాబుదారీతనం? వాళ్ల యొక్క ఉద్దేశ్యం ఏమిటి? ఇక్కడ గోడలకు, లైట్లకు, గాంధీగారి ఫోటోకి, ఇక్కడ రాసే వీళ్లకా జవాబుదారీతనం! You are accountable to everyone, you are accountable to the people అంటే the people we represent everyone.ఇక్కడ ప్రభుత్వంలో మీరు ఉన్నారు. మీ పాలసీలు మీరు చెబుతున్నారు. ప్రతిరోజూ 304 మీరు తీసుకొస్తున్నారు. ప్రతి రోజూ 304లో మీరు ఏమి మాట్లాడుతున్నారు? రాజశేఖరరెడ్డిగారు వచ్చిన తరువాత మేము బ్రహ్మాండంగా చేసాము అని చెబుతున్నారే తప్ప కొత్త విషయాలు మీరేమైనా చెబుతున్నారా?

( ట్రెజరీ బెంచెస్ నుండి అంతరాయం )

అధ్యక్షా! నేను హౌస్ టైమింగ్స్ గురించి చెబుతున్నాను. అధికార పార్టీలో మీరున్నప్పుడు, మీకు అలాట్‌మెంట్ ఆ విధంగా చేస్తే, ఏమి జవాబుదారీతనం మీది? అసలు శాసనసభ ఎందుకు? మెయిన్‌గా ఆపోజిషన్ పార్టీ ఉంటుంది. దానిని గౌరవించాలి, వాళ్ల అభిప్రాయాలను వినాలి, అవి తెలుసుకోవాలి. ఆ ప్రయత్నం వదిలిపెట్టి అపోజిషన్ లేవగానే, వాళ్ల మెజారిటీని చూపించి నువ్వు 9 సంవత్సరాలు ఏమి చేశావు అంటూ కేకలు వేయడం, మేము చేస్తే ఏమవుతుంది, నువ్వు ఒకటి కొడితే నేను నాలుగు కొడతాను. ఇదా శాసనసభలో జరగవలసిన చర్చలు! ఈనాడు

160 గంటలు మనం కూర్చున్నాము. ఎప్పుడైనా రాష్ట్ర శాసనసభ చరిత్రలో బడ్జెట్ సెషన్‌లో ఇంత తక్కువ సమయం మనం కూర్చున్నామా? రాత్రి పన్నెండు గంటల వరకు అప్పుడు కూర్చున్నాము. ఇంకా ముప్పై, నలభై గంటలు ఉండాలి. వెనక రెండు వందల రెండు గంటలు కూర్చున్నాము మినిమమ్. మీకేమో మ. 1.30కే ఆకలేస్తది, 1.30కే వెళ్లిపోదామంటారు, సాయంకాలం రామంటారు, ఇదేమి పద్దతి? శాసనసభ అంటే జవాబుదారీతనం లేకుండా, (అంతరాయం)

అధ్యక్షా! శాసనసభలో ప్రజాస్వామ్యంలో అపోజిషన్‌కు చాలా కీలకమైన పాత్ర ఉంటుంది. అందుకే మన రాజ్యాంగకర్తలు ఆలోచన చేసి దూరదృష్టితో కొన్ని చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ పెట్టారు. వీళ్ల యొక్క ప్రవర్తన ఏ విధంగా ఉందండే, Democracy does not mean choosing a dictator నియంతలను ఎన్నుకోబోతున్నట్లుగా ఉండకూడదు ప్రజాస్వామ్యమని గాంధీగారు ఎప్పుడో చెప్పారు. నియంతృత్వ ధోరణులు ప్రజాస్వామ్యంలో పనికి రావని చెప్పారు. అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు ఎన్నుకున్నటువంటి ప్రభుత్వాలు జవాబుదారీ తనంతో ఉండాలి. We are only representing the people. ఆ విషయాన్ని మరచిపోవద్దు. నేను ఎన్నుకోబడ్డాను, 5 సంవత్సరాలు నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను, ఎవరికీ జవాబు ఇవ్వననే ధోరణి మంచిది కాదు. It is a dictatorial attitude. ఆ ఆటిట్యూడ్‌తో ఉన్నారు మీ ప్రభుత్వం. ఈనాడు శాసనసభలో జవాబు చెప్పరు, పత్రికల వాళ్లకి జవాబు చెప్పరు. ఎక్కడికి వెళ్లినా సరే నాకు 5 సంవత్సరాలు ఉంది, కనుక ఈ 5 సంవత్సరాలు నాకు అధికారం ఉంది, నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను అనే ధోరణితో ఆ విధంగా ప్రవర్తిస్తున్నారు. This is not good అని తెలియజేస్తున్నాను. ఈనాడు ప్రజలలో చైతన్యం లేకపోవచ్చు. **తరతరాల బానిసత్వం ఈ దేశంలో ప్రజల యొక్క చొరవను దెబ్బతీసిందని వివేకానందుడు అన్నారు. ఆ విధంగా దెబ్బతీసిన ప్రజానీకంలో ఈనాడు చైతన్యం తీసుకురావడానికి కొంత మంది యువకులు, దేశభక్తులు బయలుదేరితే ఈ దేశం ప్రపంచంలో అందరి కన్నా ముందుకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది.** ఆ విధమైన అవకాశం ఉందని ఆ మహానుభావుడు ఏనాడో చెప్పారు. ఈ దేశంలో ఏమి తక్కువ ఉంది. ఈ దేశంలో బ్రహ్మాండమైన అవకాశాలున్నాయి. అయినా పేదరికంతో బాధ పడుతుందంటే అత్యధిక సంఖ్యాకులైన ప్రజానీకం ఈనాడు నిస్సహాయులుగా ఉన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం లేదు, ప్రభుత్వంలోని వాళ్లకు చొరవ లేదు. ప్రభుత్వంలో ఎటువంటి జవాబుదారీతనం లేదు. కనీసం అపోజిషన్ వాళ్ల బాధ చెప్పినా, దీనికి జవాబు చెప్పము, మీ ఇష్టం ఉన్నట్లు చేసుకోండి అనే పద్దతి మంచిది కాదు. You have to listen us. మీరు వినాలి. దీనికి జవాబు చెబుతారా, చెప్పరా అనేది it is for you to decide. Finally, it is for the people. ఫైనల్‌గా వారు చూసుకుంటారు. కాని వినడానికి సిద్ధంగా లేము. నలభై పద్దులు ఈనాడు గిలిటన్ అయిపోతాయి. మెయిన్ అపోజిషన్ పార్టీ చెప్పింది వినకుండా, మా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతాం అంటే ఎట్లా? మీరు చేస్తున్న పనులు ఏమిటి? మొన్న జరిగిన ఎన్నికలలో అనేక ప్రామిసెస్ చేశారు. ప్రజలకు అనేక ఆశలు పెట్టారు. ఏ ప్రామిస్‌ను నిలబెట్టుకున్నారో తెలియజెయ్యాలి. ఇన్ని సమస్యలున్నప్పుడు శాసనసభలో చర్చలేకుండా, ఏమాత్రం డిస్కషన్ లేకుండా వేల కోట్ల రూపాయలు

ఒక వ్యక్తి యొక్క అవగాహనా రాహిత్యం మూలంగా ఈ రాష్ట్ర భవిష్యత్తు పాడయ్యే పరిస్థితి వస్తుంటే మనమందరం స్పెక్టేటర్స్‌గా ఎందుకు? టెండర్స్‌లో జరుగుతున్న అవినీతిని మేము ప్రూవ్ చేస్తాము, చెయ్యకపోతే మేమందరం సభ్యులమూ రిజైన్ చేస్తామంటే ఒక్క పలుకు పలకలేదు, ఒక్క మాట మాట్లాడలేదు. ఆపోజిషన్ పార్టీ ఇంత ఛాలెంజ్ చేస్తుందే, ఇందులో ఏముందని మీరు జవాబు చెప్పే అవసరం లేదా? ఎవరికి జవాబు చెబుతారు? డెమోక్రసీలో ఇది ఏమి ఉండదా? నిన్ను ఎన్నుకుంటే మొత్తం 5సంవత్సరాలు యావత్ రాష్ట్రంలో నాఇష్టం వచ్చినట్లు చేస్తాను, ఎవరికైనా టెండరిస్తాను, నా ఇష్టమైన రూల్స్, రెగ్యులేషన్స్ పెడతాను, సిస్టమ్స్ మారుస్తాను అని చెప్పి ఏకపక్షంగా నియంతృత్వ ధోరణితో ఈ ముఖ్యమంత్రి గారు పోతుంటే, మేమందరం కూడా స్పెక్టేటర్స్ కావాలా? You are not giving me proper time. అథర్‌వైజ్ నా దగ్గర చాలా సబ్జెక్ట్ ఉంది. ఈనాడు ఎస్.ఆర్.ఎస్.పి.,(అంతరాయం)

అధ్యక్షా! యస్‌ఆర్‌యస్‌పి., ఫ్లడ్ ఫ్లో కెనాల్ గురించి నేను చెబుతాను. సమయం లేదు కనుక నేను ఒక రెండు, మూడు మాత్రమే చెబుతాను. 70వ కిలో మీటరు నుండి 122 వరకు అధ్యక్షా,(అంతరాయం)

అయ్యా! శాసనసభ్యులారా మీరు వినండి. ఒకటి, రెండు కాదయ్యా, కొన్ని వేల కోట్ల రూపాయలను ఈ ప్రభుత్వం గోల్‌మాల్ చేస్తున్న విషయం మీరైనా తెలుసుకోండి. మీ పార్టీలోనైనా డిస్కస్ చేసుకోండి. ఏమి జరుగుతుందో ఆలోచన చేయండి. కనీసం మీ పార్టీ నుండి అయినా ఆలోచన చేయండి. ఒకరిద్దరు వ్యక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం మొత్తం మీ పార్టీ అంతా భూస్థాపితం కాబోతుందని నేను చెబుతున్నాను. దీని మూలంగా మీకు ఎక్కువ భవిష్యత్తు లేకుండా పోతుంది.

అధ్యక్షా! 70 కిలోమీటర్ల నుండి 122 కిలోమీటర్ల వరకు ఏడు ప్యాకేజీలు పెట్టారు. క్యాటగిరీ-1లో టెండర్లు పిలిచారు. మొత్తం 523 కోట్ల రూపాయలకు ఎస్టిమేటెడ్ కాస్ట్ అని చెప్పారు. అయితే క్యాటగిరీ-2లో ఎక్కువ సంఖ్యలో బాగా పోటీ వుండడం మూలంగా టెండర్స్ మొత్తం 353 కోట్ల రూపాయలకు వచ్చింది. 353 కోట్ల రూపాయలకు గాను 170 కోట్ల రూపాయల వరకూ అందులో తక్కువ వచ్చింది. అయితే ఈనాడు తక్కువకు వచ్చింది కాబట్టి ఫైనలైజ్ చేయవచ్చు కదా? ఈ లోపల హైకోర్టు జడ్జిమెంట్ వచ్చింది. క్యాటగిరీ-1లో వున్న టెండర్లు అన్నింటినీ క్యాన్సిల్ చేయమని చెప్పి హైకోర్టు జడ్జిమెంట్ వచ్చింది కాని క్యాటగిరీ-1లో వున్న ఏ టెండర్లను కూడా క్యాన్సిల్ చేయలేదు ఈ మహానుభావులు. క్యాన్సిల్ చేయకుండానే మరలా వారిని కోర్టుకు పంపించి, వర్క్స్ స్టార్ట్ చేశాము, ఏమి చేయమంటారు, వదలి వేయండని వారి చేత చెప్పించారు. ఆ పీరియడ్ లోపల ఈ క్యాటగిరీ-2లో లెస్‌గా ఇచ్చినటువంటి టెండర్స్‌ను క్యాన్సిల్ చేయించారు. క్యాటగిరీ-1లో వున్న వాటిని క్యాన్సిల్ చేయమని హైకోర్టు చెబితే, క్యాటగిరీ-2లో వున్న టెండర్లను క్యాన్సిల్ చేశారు. క్యాన్సిల్ చేసిన తరువాత మరలా వీటిని క్యాటగిరీ-1 క్రింద మార్చారు. ఇదే వర్క్, అదే కెనాల్‌కు సంబంధించిన టెండర్లను క్యాటగిరీ-1 క్రింద మార్చి మూడు బిడ్లుగా చేశారు. క్యాటగిరీ-1 ఎవరికి ఇచ్చారు? అక్కడ అంతా వీళ్ల

మనుషులే. ముఖ్యమంత్రి గారికి సంబంధించిన వ్యక్తులే తప్ప క్యాటగిరీ-1లో వున్న వారు ఎవరూ లేదు. మొత్తం వాళ్లకు సంబంధించిన వారు. వాళ్లు రింగ్‌లు చేసుకుంటున్నారు. రోజుకో చిట్టి వేసుకుంటున్నారు. నువ్వీ పని తీసుకో, నువ్వీ పని తీసుకోమని రోజుకో చిట్టీ పంచు కుంటున్నారు. అది అందరికీ తెలిసిందే. మీరు వినదలచుకోకపోతే, మీరు వాస్తవాలు తెలుసుకోకపోతే అది వేరే విషయం. అయితే ఇక్కడ ఎంత దుర్మార్గం అంటే అక్కడి నుండి మరలా ఇదే పని, అదే కాలువ, అదే 70 నుండి 122 కిలో మీటర్ల కాలువను క్యాటగిరీ-1 క్రింద మార్చిన తరువాత టెండర్స్‌ను కాల్‌ఫర్ చేసి, ఎక్సెస్ ఇచ్చి, 627 కోట్ల రూపాయలకు అగ్రిమెంట్ చేశారు. 353 కోట్ల రూపాయలు ఎక్కడ? 627 కోట్ల రూపాయలు ఎక్కడ? ఒకే ఒక్క పనిలో 270 కోట్ల రూపాయలు ఈ ప్రభుత్వం వీరినే పిలిచి అక్కడి క్యాటగిరీలో చేయవలసిన పనులు క్యాన్సిల్ చేయలేదు. క్యాటగిరీ-2లో తక్కువ వచ్చిన వాటిని మాత్రమే క్యాన్సిల్ చేసి, వాటిని క్యాటగిరీ-1 క్రింద మార్చి, 274 కోట్ల రూపాయలు ఎక్సెస్ ఇచ్చారు. అంటే ఏమి జరుగుతుందో ఒకసారి ఆలోచన చేయాలని చెప్పి తెలియజేస్తున్నాను. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఈ గవర్నమెంట్ చేసే చిత్ర, విచిత్రాలలో ఇది ఒక విచిత్రం. ఈనాడు మనకు చాలా మంది చెబుతున్నారు. కాటన్ దొర తరువాత రాజశేఖర్‌రెడ్డి గారు రెండవ కాటన్ అని చెబుతున్నారు. అధ్యక్షా, **కాటన్ దొర ఒక మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగినవారు. అతను మన దేశస్తుడు, మన ప్రాంతస్థుడు కాదు. ఈ దేశంలో వున్న ఆ ప్రాంత ప్రజల బాధలు చూసి ఇక్కడ నీళ్లు వున్నాయి కనుక మనం ఏదో ఒకటి చెయ్యాలనే ఉద్దేశ్యంతోటి చివరకు ప్రభుత్వాన్ని కూడా లెక్కచెయ్యకుండా ప్రాజెక్టును కట్టించారు.** మహానుభావుడు, గుర్రం పైన తిరిగి రాత్రింబవళ్లు కష్టపడి ఈ ప్రాజెక్టును కట్టించాడు. అతను ఎప్పటికీ ఆరాధించే వ్యక్తి. ఎప్పటికైనా మనం అతని యొక్క మంచిని గుర్తుంచుకోవాలి. ఎంతో బ్రహ్మాండముగా ఇరిగేషన్ పొటెన్షియాలిటీని క్రియేట్ చేసిన ఆదర్శనీయుడు. ఈ రోజున రాజశేఖర్ రెడ్డి గారు ఏమి చేస్తున్నారు? ఇప్పుడు వున్న టెండర్స్‌కు సంబంధించి అలాట్‌మెంట్ కాని, ఏమీ తెలియదు. ఇంతవరకూ ఫైనాన్షియల్ టైఅప్ లేదు. ఆర్థిక శాఖామంత్రిగారిని నేను సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నాను. పది వేల కోట్ల రూపాయలు ఈ సంవత్సరము అప్పులు పెరుగుతున్నాయి. అప్పుగా తీసుకువచ్చిన మొత్తాలు కూడా బ్రహ్మాండముగా ఇరిగేషన్‌కు ఖర్చు పెడతామని అంటున్నారు. ఇంతవరకూ ఏ ఒక్క ఫైనాన్షియల్ టైఅప్ కాలేదు. ప్రాజెక్టుకు ఎక్కడి నుండి అసిస్టెన్స్ వస్తుందో తెలియదు. ఎక్కడి నుండి ఏ ప్రాజెక్టు కొరకు నిధులు సమీకరిస్తారో తెలియదు. డబ్బులు తీసుకువచ్చి పది నెలలు అవుతున్నా, ఇంతవరకూ ఏ ఒక్క దానికీ క్లియరెన్స్ తీసుకొని రాలేదు. మీకు వున్న బడ్జెట్ ప్రొవిజన్ అంతా కూడా ఈ బి.సి.పిల్లలు, యస్.సి. పిల్లల నోళ్లు కొట్టి, అక్కడ కేటాయింపులు తగ్గించి, స్కూల్ ఎడ్యుకేషన్‌కి తొలగించి, ఈ మొత్తాలను తీసుకువెళ్లి వందల కోట్ల రూపాయలు టెండర్లకు పెట్టారు. నేను ఇంతకు మందే చెప్పాను. ప్రతి దానిలో కూడా మీరు డబ్బులు కొట్టివేస్తున్నారు. ఒక్క టెండర్లో మిగిలిన డబ్బులు ఇస్తే రైతులకు మద్దతు ధర దొరకుతుంది. పేద ప్రజలకు వసతి దొరుకుతుంది. త్రాగడానికి నీళ్లు దొరుకుతాయి. కాబట్టి మీరు వందల కోట్ల రూపాయలను దోపిడీ చేస్తూ ఈనాడు కాటన్ దొర గురించి మాట్లాడుతున్నారు. కాటన్

దొర విగ్రహం పెట్టాము, రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం కూడా పెడతామని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. అంత బ్రహ్మాండముగా ఏమి జరిగిందని నేను అడిగాను. రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం యొక్క తల క్రిందకి పెట్టి, కాళ్లు పైకి పెడతామని, మొత్తం చరిత్రను అంతా పాడుచేస్తున్నారు వీరు అని ఆ ప్రాంత ప్రజలు అన్నారు. ఇటు కృష్ణా వాటర్ సిస్టమ్స్ అన్నీ కూడా పాడైపోతున్నాయి. గోదావరి నుండి లిఫ్ట్ చేస్తామని చెప్పి ఈ ప్రాంతములో అంతా గందరగోళం సృష్టిస్తున్నారు. కనుక ఇరిగేషన్ సిస్టంను అంతా కూడా సర్వనాశనం చేస్తున్న వ్యక్తిగా ఎప్పటికీ రాజశేఖర్ రెడ్డి గారు చరిత్రలో మిగిలిపోతారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మా పీరియడ్‌లో పోలవరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ ఇచ్చాము. తాడిపూడి అంతా కూడా లిఫ్ట్ పెట్టాము. కనుక దానికి కావలసినటువంటి కెనాల్ సిస్టంకు కూడా ఈనాడు పర్మిషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు హెడ్ వర్క్ కాలేదు. ఇంకా అది ఎప్పుడు వస్తుందో తెలియదు. దానికి పర్మిషన్ లేదు. దాని కోసం మీరు చేస్తున్న ప్రయత్నం ఏదో తెలియదు కాని బ్రహ్మాండముగా కాలువ త్రవ్వుతున్నారు. దీనికి టెండర్లు పిలిచారు, దానికి టెండర్లు పిలిచారు. ఇద్దరు కాంట్రాక్టర్లు కూడా అక్కడకు వెళ్లి నేను కమీషన్ ఇచ్చాను కనుక నేనెక్కడ కాలువ త్రవ్వాలి, నేనెక్కడ కాలువ త్రవ్వాలి అని అంటుంటే ఇంజనీర్స్ ఏమి చూపిస్తారు? ఒకటే కాంటూర్, ఒకటే లెవల్, ఒకటే ఆయకట్టు కాని ఈయనకు ఒక టెండర్, ఆయనకు ఒక టెండర్. ఇది ఏమి విచిత్రం? ఏమి చేస్తున్నారు? ఇదేమి వ్యవస్థ? అక్కడ వున్న వ్యక్తులకు పట్టదా? అని నేను అడుగుతున్నాను. రైతులందరికీ కూడా ఇది అర్థం కావడం లేదు. ఏమి చేస్తుంది ఈ ప్రభుత్వం? ఒకే చోట రెండు కాలువలు త్రవ్వుతున్నారు ఏమిటి? ఎవరికి ఎక్కువ కాంట్రాక్ట్‌లు ఇస్తే వారే ఎక్కువ కమీషన్‌లు ఇస్తారు. ఇది అంతా ఎందుకు? అందుకే హుస్సేన్ సాగర్‌ను త్రవ్వండి. హుస్సేన్ సాగర్‌ను త్రవ్వడానికి ఒక కాంట్రాక్టర్‌ను ఇచ్చి, హుస్సేన్‌సాగర్‌ను మూసివేయడానికి ఇంకొక కాంట్రాక్టర్‌కు ఇవ్వండి. ఆ విధంగా కమీషన్స్ అందుకోవడమే తప్ప నీళ్లు ఇప్పించే పరిస్థితికి గాని, నీళ్లు తెప్పించే పరిస్థితికి గాని మీరు రావడం లేదని తెలియజేస్తున్నాను.

హౌస్ మొట్టమొదటి రోజు నుంచీ కూడా వ్యవసాయ ఉత్పత్తుల మీద, గిట్టుబాటు ధరలపైన రైతులు ఎంతో ఇబ్బంది పడుతుంటే దానికి సంబంధించిన చర్చ జరిగినా జవాబు చెప్పకుండా 23 నుంచి కొనుగోలు చేస్తామని ఇంతవరకూ కొనలేదు. ఇంతకు ముందు కూడా డిస్కషన్‌లో లేకుండా పోయారు. కనపడకుండా వెళ్లిన మంత్రిగారు మాట్లాడతాను అంటే ఆయనతో మాట్లాడించండి. ఏమి చేస్తున్నారో? ఏమి మాట్లాడతారో? రైతులు ఇబ్బంది పడుతుంటే కనీసం పట్టించుకోకుండా మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులు తాము పండించిన పంటలకు ధర లేకుండా ఉంటే వారిని బయట కాల్చుకుని తింటున్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతుంటే లాఠీ ఛార్జీలు చేస్తున్నారు. ఎమ్.ఎస్.పి. ఇప్పిస్తామని చెప్పి రూ. 500 కోట్లు మీ మ్యానిఫెస్టోలో పెట్టారు. మార్కెటింగ్ ఇంటర్‌వెన్షన్ కోసం మీరు పెట్టుకున్నారు. మార్క్‌ఫెడ్‌ను దించలేదు. ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. ఎంతో ఇబ్బంది పడుతున్న వారిని గాలికి వదిలేస్తే ఎలా? మేము ఏదో చేస్తాము, అది చేస్తాము, ఇది చేస్తాము అంటే ప్రాజెక్టుల విషయంలో అంటే ముఖ్యమంత్రి గారిని చెప్పమనండి. మంత్రులూ మీరు కూర్చోండి. కనీసం ఏమి జరుగుతోందో

తెలుసుకోండి. ఆఫీసర్సుకు అప్పచెప్పడం కాదు. ఈనాడు ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఇరిగేషన్ డిపార్టుమెంట్ చేతులలో లేదు. కంట్రాక్టర్స్ డిక్టేట్ చేస్తున్నారు. కాంట్రాక్టర్లే వారికి కావలసిన ఎస్టిమేట్స్ తయారు చేస్తున్నారు. కాంట్రాక్టర్లకు కావలసిన పనులు వారే ఎంచుకుంటున్నారు. రోశయ్య గారు చెక్‌బుక్ ఇచ్చేస్తే వారే బిల్స్ వేసుకుని వారే డ్రా చేసుకుంటారు. మిగిలింది ఏమైనా ఉంటే మనం అందరమూ కూడా తీసుకుందాము. ఆ విధమైన పరిస్థితి రాష్ట్రంలో వస్తే మీరు కామ్‌గా మాట్లాడకుండా బాధ్యత లేకుండా ఉండి మీరు దీనిపైన మాట్లాడడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇన్ని విధాలుగా మేము చెబుతున్నాము. నిన్న టి.ఆర్.ఎస్. సభ్యుడు తీసుకువచ్చి ఇచ్చారు.

శ్రీపాదరావు ప్రాజెక్టు గురించి డీటెయిల్స్ మేము కూడా తెప్పిస్తున్నాము. రూ.1300 కోట్లు ఉంటే దానిని ఒక్కే రాత్రిలో రూ.1700 కోట్లు అయింది. మొత్తం ఎస్టిమేట్స్ మారిపోయాయి. ఒక్కటే రాత్రి రూ.400 కోట్లకు పెరిగిపోయింది. వారు లెటర్సు ఇచ్చారు మాకు కూడా.. అందరికీ ఇచ్చారు. మీకు కూడా ఇచ్చారు. ఎల్లంపల్లికి ముఖ్యమంత్రి గారు ఫౌండేషన్ వేశారు. రూ.800 కోట్లు అన్నారు. మేమూ రూ.800 కోట్లే అనుకున్నాము. రూ.1300 కోట్లు అయింది అన్నారు. టెండర్స్ వచ్చి ఫైనలైజ్ అయ్యే సరికి చూస్తే రూ.1700 కోట్లకు జరిగింది. ఇది ఏ విధంగా జరుగుతోంది? ఇదంతా ఏమిటి? ఏమి జరుగుతోంది రాష్ట్రంలో? మా దృష్టికి ప్రతి ఒక్కటీ ఎలా వస్తుంది? Is it possible for any Opposition? మాకు ఇన్‌ఫర్మేషన్ ఎవరిస్తారు? మాకు సాధ్యం అవుతుందా? ప్రతి దగ్గరా ఎస్టిమేట్స్ మారుస్తున్నారు. ప్రతి దగ్గర ఖచ్చితంగా ఎవరు ఎక్కువ కమిషన్ ఇచ్చిన చోట వారికి ఇష్టానుసారంగా టెండర్స్ ఇస్తున్నారు. మేము ప్రూవ్ చేస్తాము అన్నాము. విషయం తేలుస్తాము అన్నాము. కనీసం స్పీకర్ గారి దగ్గర ఫైల్స్ పెట్టమన్నాము. ఉలుకూ, పలుకూ లేకుండా ఉన్న ప్రభుత్వం మేము నీళ్లు తెస్తాము అంటే ఇది ఏ రకంగా రాష్ట్రం ముందుకు పోతుందంటే ఇది ఎవరిని మోసం చేయడానికి? మీరు ఎవరిని ఏమి చేయ దలచుకున్నారో తెలియజేయాలని కోరుతున్నాను. ఇదంతా పచ్చి మోసం. నీళ్లు వచ్చేది లేదు. ప్రాజెక్టులు వచ్చేది లేదు. మీకు కావలసింది కమిషన్స్. కమిషన్స్ కొట్టేయడానికి ఇవన్నీ చేస్తున్నారు. ఆ విధంగా చరిత్ర హీనులుగా మిగిలిపోతారు తప్ప మరొకటి కాదు.

నేను ఇప్పటికైనా మీ ద్వారా కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వానికి నేను సూచనలు చేస్తున్నాను. ముఖ్యంగా చాలామంది అనుభవజ్ఞులు ఉన్నారు. 4,5 సార్లు గెలిచిన ఎమ్.ఎల్.ఏ.లు ఉన్నారు. కొంతమంది మంత్రివర్గంలో ఉన్నారు. కనీసం మీరైనా ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయంలో ఏమి జరుగుతోందో తెలుసుకోమని చెప్పి నా ఆవేదన తెలియజేస్తున్నాను. నేను చాలా బాధతో, ఆవేదనతో ఈ సబ్జెక్టును మాట్లాడుతున్నాను. దీని పైన మీరు సరైన దిశలో పోవడం లేదు. ఒకవైపు అప్పులు మిగిలి పోతున్నాయి. మనకు ఎన్.పి.ఏ.లుగా నాన్‌పెర్‌ఫార్మింగ్ ఎసెట్స్‌గా తయారయిపోతాయి. రెండవ వైపు నీళ్లు వస్తాయా? డబ్బు తిన్నారు. కమిషన్స్ తింటే అయినా నీళ్లు వస్తాయా అంటే నీళ్లు రావడం లేదు. అన్ని విషయాలు చెబుతామంటే టైమ్ లేదంటారు.

ఇక్కడ జరుగుతున్న భాగోతాన్ని గురించి సమగ్రంగా చెప్పాలి. We will definitely

demand. దీనిలో జ్యుడిషియల్ ఎంక్వయిరీ పెట్టండని చెప్పాము. మేము ప్రాజెక్టులు ఆపాలని ఎక్కడా అనలేదు. ప్రాజెక్టులు తెచ్చుకోవలసిందే. ప్రాజెక్టులు కట్టవలసిందే. నీరు రావాలసిందే. అన్ని ప్రాంతాలకు న్యాయం జరగవలసిందే. కానీ మీరు చేస్తున్న దుర్మార్గం, ఈ ధనయజ్ఞంలో, ఈ కరప్షన్‌కు పద్ధతి ప్రకారం చెక్ వుండాలి. దానికోసం If you do not like, I sit.

ఈ హౌస్‌లో డిస్కషన్‌కు ఎలా చేయకపోతే మేము ఎక్కడ డిస్కస్ చేయాలి అధ్యక్షా? గతంలో రాత్రి 12 గంటల వరకు చర్చించాము. మీరు కూడా రెండు, మూడు గంటలు మాట్లాడారు. చాలా అంశాలు వున్నాయి. నా రిపిటీషనల్లా పదే పదే చేస్తున్న రిపిటీషన్ టెండర్స్ మీదనే. టెండర్స్ విషయం వచ్చినప్పుడల్లా రిపిటీషన్ అంటే ఎలా? జాబే లేక పోతే మమ్ములను అందరిని ఏమి చేయమంటారు? అపోజిషన్ పార్టీ బాధ్యతగా ఈ విధంగా లూటీ జరుగుతోందని చెబితే, జవాబు చెప్పకపోతే ఎలా? మేము రిపీటెడ్‌గా చెబుతూ వస్తున్నాము. We will go on telling. We will not end it. తప్పకుండా దీని మీద మాట్లాడదాము. దీనిమీద మీరు జవాబు చెప్పవలసిన అవసరం వుంది. ఆరోజు చెప్పాను, ఈ రోజు చెబుతున్నాను. గౌరవ ఫైనాన్స్ మినిష్టర్ గారి బడ్జెట్ స్పీచ్ ప్రారంభంలో చెప్పాను. The Finance Minister is not an accountant.

ఇదేదో జమా ఖాతాలు చూసేటటువంటి అకౌటెంట్లు కాదు మీరు. ఎక్కడ నుండి ఎంత డబ్బు జమా అవుతున్నది, పోయిన డబ్బు ఎక్కడకు పోతున్నదని చెక్ చేయడానికి కాదు, ఆ విధంగా పోతున్నటువంటి డబ్బు ఎంతవరకు ఖర్చు పెట్టబడుతున్నదీ, ఎందుకు ఖర్చు కావడం లేదు, మిస్ యూజ్ ఎంత అవుతున్నది అని మీరు వాచ్‌డాగ్‌లాగా ఉండవలసిన డిపార్టుమెంట్ మీది. అటువంటి డిపార్టుమెంట్‌లో ఈనాడు మీరు టెండర్స్ గురించి ఏమి మాట్లాకుండా, ఇంత విచ్చలవిడితనంగా వ్యవహారం జరుగుతుంటే మీరేమి చేస్తున్నారు? కనీసం సీనియర్ మినిస్టర్స్ అయినా ఈ విషయం గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఎప్పుడైనా కూర్చొన్నారా? మాట్లాడారా? తెలుసుకుంటున్నారా? ఇంత బాధ్యతారాహిత్యంగా ఉండే మీ క్యాబినెట్ ఏ క్యాబినెట్ అని అడుగుతున్నారు. Is it responsible Cabinet or not in the State?

అదే విధంగా ఈనాడు రాజశేఖర్‌రెడ్డిగారు ఏమనుకుంటున్నారంటే, నేనేదో పాదయాత్రలు చేసేశాను, ప్రజలంతా నాకు ఓటు వేశారు, అందుకే అధికారంలోకి వచ్చానని అనుకుంటున్నారు. I don't think so. మీ లీడర్‌షిప్ కోసం మీరు పాదయాత్రలు చేసి ఉండవచ్చు. అనేక కారణాలు ఉన్నాయి. మేము ఓడిపోవడానికి. అనేక రకాల సమస్యలు వచ్చాయి ఆనాడు. ఆ విధంగా మీరు గెలిచి ఉండొచ్చు. కాని ఏదో పాదయాత్రలు చేశాను నేను, నన్ను చూసే ఓట్లు వేశారు, కాబట్టి నేను ఈ రాష్ట్రంలో ఏమి చేసినా నడిచిపోతుందని అనుకుంటున్నారు. ఏకచ్ఛత్రాధిపత్యంగా నడిపించుకోవచ్చునని అనుకోవడం మంచిది కాదు. It is leading to dictatorial attitude గా కనపడతున్నది ఆయన ధోరణిలో. అపోజిషన్ పార్టీ వాళ్లు చెప్పే మాటల మీద ఇక్కడ కాని, బయట కాని వాళ్ల ప్రవర్తన కాని చూసినట్లయితే ఒకసారి వాళ్లు ఆత్మవిమర్శ చేసుకోవాలని చెపుతున్నాను.

**ఏ రంగంలో మీరు సక్సెస్ అయ్యారు? విద్యుత్‌రంగం గురించి చెప్పారు. అందులో ఫెయిల్ అయిపోయారు. ఉచిత విద్యుత్ ఇస్తామని ఊరురా తిరిగి బ్రహ్మాండంగా చేస్తామని చెప్పారు. అక్కడా మీరు ఫెయిల్ అయిపోయారు. కనీసం ఎస్.సి. ఎస్.టి. కాలనీలకు అయినా ఉచిత విద్యుత్ ఇవ్వమని చెప్పితే, దానిపైన ఏదో పేచీ పెట్టారు.** ఇక ఎక్సైజ్ విధానానికి వస్తే, దాని మీద కోర్టు స్ట్రిక్చర్స్ పాస్ చేసింది. గతంలో ఎక్సైజ్ విధానం మీద మీరేమి చెప్పారు అధ్యక్షా? ఒకనాడు, నన్ను రోశయ్యగారిని లోక్‌సత్తా వాళ్లు పిలిచారు. అప్పుడు రోశయ్యగారు హ్యూమరస్‌గా మాట్లాడిన మాటలు నాకు చాలా రోజులు గుర్తుండి పోయాయి. వారు చాలా చక్కగా మాట్లాడుతారు. అది చెప్పడం మాకు రాదు. కాని జనార్ధనరెడ్డిగారు అప్పుడప్పుడు ప్రయత్నం చేస్తున్నారు. అది ఎంతవరకు మ్యాచ్ అవుతుందో తెలియదు. అప్పుడు రోశయ్యగారు ఏమన్నారంటే, మీరు పుట్టిన పిల్లవాడికి ఉగ్గుపాలు పోసినట్లు సారాయి తాగించి, మీరు రెవిన్యూ పెంచుకుంటున్నారు, మేము చిన్న పిల్లలకు ఆముదం తాగించడం నేర్పించాము, మీరేమో ఉగ్గుతో సారాయి తాగిపిస్తున్నారు, బ్రాందీ తాగిపిస్తున్నారు, రెవిన్యూ పెంచుకుంటున్నారు అని చెప్పి అవహేళన చేశారు. మా అందరికీ నవ్వు వచ్చింది ఈ పెద్దమనిషి ఎంత అప్రాప్రియేట్‌గా మాట్లాడుతారని చెప్పి. మరి ఈ రోజు ఫైనాన్స్ మినిస్టర్‌గారి నాయకత్వంలో బడ్జెట్‌లో నిధుల కోసం, ఇప్పుడు ఉన్న రెవిన్యూ సరిపోవడం లేదని, ఇంకా 500 కోట్ల రూ.లు ఎక్స్‌ట్రా కావాలని చెప్పి, ఊరికొక బార్ స్కీమ్ ఇప్పుడు పెట్టారు. మరి ఈ విధంగా ఊరికొక బార్ స్కీమ్ పెట్టి, మరి ఈనాడు ఉగ్గుతో పాలు తాగిపిస్తున్నారా, దేనితో తాగిపిస్తున్నారో మంత్రిగారు చెప్పాలని కోరుతున్నాను. రెవిన్యూ ఎట్లా పెరుగుతుంది? తాగితేనా కదా! తాగినవాడే కట్టాలి కదా పన్ను. ఈ విధమైన ఊరికొక బార్ షాప్ విధానంలో మీరు ఫెయిల్ అయిపోయి, మీరేమి చెప్పదలచుకున్నారు? హౌజ్‌లో స్టేట్‌మెంట్ ఇస్తామని చెప్పి, చివరకు టెక్నికాల్టీస్‌కు పోయారు. నేను అంటున్నాను, అవుట్‌సైడ్ హౌజ్ మీరు ప్రకటన చేశారు. వారు ఏమంటున్నారంటే, హౌజ్ సెషన్‌లో లేదు కాబట్టి నేను మాట్లాడాను అన్నారు. నేను ఒప్పుకుంటాను, హౌజ్ సెషన్‌లో లేనప్పుడు హౌజ్ కోసం మీరు వెయిట్ చేయవలసిన పని లేదు. శాసనసభ ఉన్నప్పుడే శాసనసభలో ప్రకటన చేయవలసిన అవసరం వస్తుంది. హౌజ్ లేనప్పుడు, మనం ఒక పాలసీ విషయాన్ని పెట్టిన తరువాత, ఆ పాలసీని హైకోర్టు కొట్టేసిన తరువాత, మళ్లీ status quo వచ్చినట్లే కదా అధ్యక్షా! కాబట్టి దాని తరువాత ఏమి చేయదలచుకున్నారో తెలుసుకునే హక్కు ఈ హౌజ్‌కు లేదా అధ్యక్షా? Are you going to implement the new policy or reverting back to the old policy? అని తెలుసుకోవలసిన అవసరం హౌజ్‌కు లేదా అని అడుగుతున్నాను. దానిపైన ఇంతవరకు వాళ్లు ఏమి చెప్పజాలకపోతున్నారు. ఏదో రకంగా రెవిన్యూ పెంచుకోవాలని మీరు చేస్తున్న కార్యక్రమాల్లో ప్రజలకు మీరు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని మీరు నిలుపుకోలేదని మీకు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా! ప్రధానమైన రెండు, మూడు అంశాలు చెప్పదలచుకున్నాను. చాలా విషయాలున్నాయి. అధ్యక్షా! స్థానిక సంస్థలకు అధికారాలు ఇచ్చే ఫైలు మీదనే మా మొదటి సంతకం అని అన్నారు. ఎన్ని మొదటి ఫైల్స్ అని సంతకాలు పెట్టారో నాకు తెలియదు.

ఎన్నికలప్పుడు వీళ్లు చెప్పారు తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థలను ఉత్సవ విగ్రహాలు మాదిరిగా మార్చారని ఎన్నికలప్పుడు ఊరూరా తిరిగి చెప్పారు. మేము అధికారంలోకి రాగానే స్థానిక సంస్థలకు అధికారాలు ఇస్తామని చెప్పుకున్నారు. కాని ఈ రోజు ఏమి చేస్తున్నారు? స్థానిక సంస్థల పరిస్థితి ఏమిటి? మున్సిపాల్టీల గడువు పూర్తయిపోతుందని మీకు తెలియదా? ఇదేమీ కొత్త పరిణామం కాదే! అయిపోతుందని తెలిసి కూడా దానికి ప్రిపేర్ అయి ఎన్నికలు పెట్టకుండా మీరు పోస్ట్‌పోన్ చేసి ఈనాడు అధికారులకు మున్సిపాల్టీల నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పారు. అధికార యంత్రాంగం ద్వారా పరిపాలన చేసుకోవడానికి వాళ్లు ముందుకు పోతున్నారు. మీరు ఎందుకు ఎన్నికలు పెట్టలేదంటే, మేము కో-ఆపరేటివ్ ఎలక్షన్స్ పెట్టలేదనే మాట ప్రతిసారీ చెపుతుంటారు. మేము ఎందుకు పెట్టలేదంటే, There is a difference between co-operative and administrative wings. Totally it is governing. అప్పుడు కో-ఆపరేటివ్ సెక్టార్‌లో చాలా పరిణామాలు వచ్చాయి. రిజర్వు బ్యాంక్ గైడ్‌లైన్స్ వచ్చాయి. దేశం మొత్తం మీద కో-ఆపరేటివ్ సెక్టార్ చాలా క్రైసిస్‌లో పడింది. మేము గవర్నమెంట్ ఆఫ్ ఇండియాతో మాట్లాడి ఒక సపోర్టింగ్ సిస్టమ్‌ను తీసుకుని రావాలని ప్రయత్నం చేశాము. వారు కొన్ని ఛేంజెస్ తీసుకుని రమ్మనమన్నారు. ఈ exercise వల్ల మేము చేయలేక పోయాము. దానికి దీనికి ముడిపెట్టి, మీరు ఒక తప్పు చేస్తే, మేము పది తప్పులు చేస్తామనే ధోరణిలో మాట్లాడుతున్నారు. ఆ విధంగా మీరు ఎలక్షన్స్ కండక్టు చేయకుండా, మోసపూరితంగా ముందుకు పోతున్నారు. మీరు చెప్పినటువంటి మాటను నిలబెట్టుకోలేకపోతున్నారని తెలియచేస్తున్నాను.

అధ్యక్షా! ఇక అపాయింట్‌మెంట్స్ విషయం చూసినట్లయితే, I got the list. మీరు చేస్తున్నటువంటి పొలిటికల్ అపాయింట్‌మెంట్స్ కాని, మీరు చేస్తున్నటువంటి కార్యక్రమాలు గాని చూసినట్లయితే చాలా ఘోరంగా ఉన్నాయి. మీరు చేస్తున్న పొలిటికల్ అపాయింట్‌మెంట్స్ యొక్క పేర్లు చదవాలంటే, నా సంస్కారం అడ్డం వస్తున్నది. But your people one side గా పోతున్నారు. ముఖ్యంగా అట్టడుగు, పేద వర్గాల వారు మీ వైపు చూస్తున్నారు ఎటువంటి రాజ్యం తీసుకుని వస్తారా అని. కాని మీరు వన్ సైడెడ్‌గా పోతున్నారు. మీకు కావాలంటే లిస్టు పంపిస్తాను. మేమే కాదు, అన్ని సెక్షన్స్ వారు అనుకుంటున్నారు. Everybody is worried about this. ఏమిటి ఈ ప్రభుత్వం ? వైస్ ఛాన్సలర్స్ కానివ్వండి, అధికార యంత్రాంగంలో కానివ్వండి, కోర్టులలో కానివ్వండి ఎక్కడ చూసినా మీరు ఒకే వర్గానికి ఇస్తూ, వర్గ ప్రభుత్వంలాగా పనిచేస్తున్నారు. అది మంచిది కాదని తెలియచేస్తున్నాను. In a democracy.. I want to quote Mahathmaji. In politics an unorganized miniorities is political majority. అది రియాల్టీ కావద్దని నేను కోరుతున్నాను. అదే రియాల్టీ అయిననాడు, ఈ మెజార్టీ వర్గం, బడుగు వర్గాల యొక్క కోపాగ్నికి దహనం అయిపోతుందని తెలియచేస్తున్నాను. You are organized people with talent and resources. ఎందుకంటే డెమొక్రసీని ఆ విధంగా తయారుచేశాము ఈ దేశం లోపల. ఈనాడు పేదవాళ్లు నిలబడలేని పరిస్థితులను కల్పించాము. పొలిటికల్ సిస్టమ్ అంతా పొల్యూట్ అయిపోయి, పేదవాళ్లు కనీసం ఇటు వైపు చూడకుండా, కొంత మంది అధికారులు కలిసి, అధికార యంత్రాంగాన్ని తమ చేతుల్లో పెట్టుకుని సర్వం మేమే అని ప్రవర్తించినట్లయితే,

నేను ఇంతకు ముందే కోట్ చేసినట్లుగా, వివేకానందుడు చెప్పిన విధంగా తరతరాల బానిసత్వం ఈ దేశం లోపల ప్రజల యొక్క చొరవను దెబ్బతీసిందని, ఆ చొరవను దెబ్బతీసిన బానిసత్వం నుండి విముక్తి కలగాలంటే, కొంత మంది వ్యక్తులు, కొంత మంది త్యాగం చేసి బ్రహ్మాండమైన చైతన్యాన్ని తీసుకుని వచ్చిననాడు ఇవన్నీ దహనం అయిపోతాయని, అప్పుడు ఆటోమేటిక్‌గా భారతదేశానికి భవిష్యత్తు ఉంటుంది అని చెప్పిన మహానుభావులున్నారు. ఇప్పుడు కాకపోయినా రేపైనా ఆ పరిస్థితులు తప్పకుండా వస్తాయి. కాబట్టి, అవి వర్గ పోరాటాలుగా మారకుండా, కుల పోరాటాలు రాకుండా, కుల సమస్యలు రాకుండా దయచేసి శ్రద్ధ తీసుకోవాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను. This is a must and it is the responsibility of the Government of the day to take care of that. ( అంతరాయం )

డిస్కషను పెట్టండి అధ్యక్షా. దాని మీద కూడా పెట్టండి. అపాయింట్‌మెంట్స్ మీద ఏం జరిగిందో, ఈ వ్యవస్థ మీద, పరిణామాల పైన, I am prepared for a discussion on this particular subject. ఇప్పటికి కూడా 80 శాతం ప్రజలు నిరుత్సాహంగా మన వైపు చూస్తున్నారు. ఈ సిస్టం వైపు చూస్తున్నారు. Even judiciary has not responded because of their own problems. కొన్ని వేల కేసులు పెండింగులో ఉన్నాయి. న్యాయ వ్యవస్థకు వెడితే న్యాయం జరగడం లేదు. అడ్మినిస్ట్రేషనుకు వస్తే ఎవరినీ పలకరించిన పాపాన పోలేదు. ఎట్లా ఉంటారు? I was a Minister for nine years. ఆ రోజు కొంతమంది వీకర్ సెక్షన్ల వాళ్లు మా వద్దకు వచ్చేవారు. ఎవరికైనా సహాయం చేద్దామంటే, కనీసం మేము వచ్చినందుకు ఒక బి.సి.ని తీసుకువద్దామంటే ఎవరున్నారు? ఎవరైనా ఉంటే, కండక్టరుగా రెండు టికెట్లు కొట్టేను సార్ అంటాడు. పోనీ ఇంకోదానిలో పెడదామంటే, అటెండరుగా పెట్టించండి. క్లర్కుగా పెట్టించండి, అనే వాళ్లే. ఎవరిని చదవనిచ్చారు మీరు? ఎవరు ఈ దేశంలో పైకి వచ్చాడు? అత్యధిక సంఖ్యాక ప్రజలు నిరుత్సాహంగా ఉంటే, వారి మనోభావాలను దెబ్బ తీసే విధంగా మీరు ప్రవర్తించకూడదు. దాని వల్ల సమస్యలు ఎదురవుతాయి.

అధ్యక్షా! ఈనాడు, మొన్న కూడా చెప్పాను. 610 జీవో మీద 3 రోజులు చర్చ జరిగింది. కాని దాని మీద ఏం రిజల్టు రాకుండానే, ఏం చెప్పామో, ఏం మాట్లాడేమో గాని అలా ఎండ్ అయిపోయింది. వేర్పాటు వాదంతో రకరకాల సమస్యలు వస్తున్నాయి. సమగ్రంగా ముందుకు వెళ్లవలసిన అవసరం ఉంది. ఈనాడు ఇది గందరగోళ ప్రభుత్వం. సంకీర్ణ ప్రభుత్వం. టీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి ఎన్నికలలో పోటీ చేశారు.

ఒకవైపు సంకీర్ణ ప్రభుత్వం. ఎవరేం చేస్తున్నారో తెలియదు. ఇది రాష్ట్రంలో మొట్టమొదటి సంకీర్ణ ప్రభుత్వం. ఏం చేస్తున్నారో తెలియదు. అక్కడ కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలో. మేము అనుకున్నాం, వెనకబడిన ప్రాంతాలకు న్యాయం జరగవచ్చునని. వీళ్ల నాయకురాలితో కలుపుకుని, క్రింది వరకూ అందరికీ అవగాహన చేసుకుంటున్నారనుకున్నాం. మేము ఎక్స్‌పెక్ట్ చేసింది, there will be special fund, ఈ ప్రభుత్వం ఇప్పటికైనా కొంత చొరవ తీసుకుంటుందని అనుకున్నాం. బీహారు వంటి రాష్ట్రం రూ. 6వేల కోట్లు తీసుకువెళ్లారు. అంతకంటే వెనుకబడిన

ప్రాంతం ఉంది. మనకే. ఆనాడు టి.ఆర్.ఎస్. వాళ్లు ఎన్నో మాట్లాడి వచ్చారు. 10 నెలలైంది. ఈ ప్రాంతంలో ఒక్క ప్రాజెక్టు గాని, ఒక్క పని ఎక్స్‌ట్రా తీసుకున్నారా? ఏం చేయదలచుకున్నారు? ఈనాడు కేంద్ర ప్రభుత్వం ఎట్లా వచ్చింది? 29 మంది ఇక్కడ కాంగ్రెసు వాళ్లు గెలిచారు. అవుట్‌సైడ్ కాంగ్రెసుకి 7 సీట్లు ఎక్స్‌ట్రా వచ్చాయి. కనుక రాష్ట్రంలో ఉండే కాంగ్రెసు పార్టీ నిర్ణయించింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని తెచ్చింది రాష్ట్ర ప్రజానీకం. వారికి మీరు ఏం చేస్తున్నారు? ఆనాడు కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తెచ్చాము మేము. I can say in every field ఎక్కువ సెంట్రల్ గ్రాంట్లు తెచ్చాము. అనేక రంగాలలో కొత్త కొత్త సహకారం పొందాము. మీరేం చేస్తున్నారు? ముఖ్యమంత్రి గారూ, వాళ్లూ తమ పదవుల్ని కాపాడుకోవడమే తప్ప, మీరేమైనా కొత్తగా నిధులు తెచ్చారా కేంద్రం నుంచి? కేంద్రంలో నలుగురు మినిస్టర్లు ఉన్నారు. ఏదైనా ఆలోచన చేస్తున్నారా?

ఏ ఎక్స్‌టెంట్‌కి వెళ్లారు వారు? Chief Minister whoever there may be and whatever it may be అక్కడ ఎవరైనా ఫరవాలేదు. రాష్ట్ర మనోభావాలను అర్థం చేసుకోవాలి. ఈనాడు సోనియాగాంధీ గారిని సీతమ్మతల్లితో, రామచంద్రుడితో పోలుస్తున్నారు. మా అందరి మనోభావాలు చూడాలి. మెజారిటీ ప్రజలున్నారు. మీరు ఎవరిని ఎవరితో కంపేర్ చేస్తున్నారు? దయచేసి ఆలోచన చేయండి. ఇంకెవరితోనైనా కంపేర్ చేసుకోండి. ఒక దేవతామాయితో కంపేర్ చేస్తున్నారు. సీతమ్మతల్లి, రామచంద్రుడు అంటే ఎంత అన్యాయం? ఈ పద్ధతిలో మాట్లాడటం మంచిది కాదు.

ఈ రోజు రాజకీయ పార్టీలు ఉభయులూ కలిసి మోసం చేశారు. ఈనాటికీ మోసం చేస్తున్నారు. ఒకాయన ఢిల్లీలో, ఇంకొకాయన ఇక్కడ. ఆ విధంగా ప్రతి విషయంలో మోసం చేస్తున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేకమైన గ్రాంటు తీసుకురావాలి. వత్తిడి తేవాలి. I am advising you. ఆ రోజులలో మేము ప్రధాని వాజ్‌పేయిగారికి, పార్టీ లీడర్‌షిప్‌కి ఒకటే చెప్పాము. ఇదిగో, ఒక ప్రధాన రాజకీయపక్షం కాంగ్రెసు వాళ్లపై గెలిచి వచ్చాము. ఎక్కువ నిధులు కావాలి. మా ఫెర్ఫార్మెన్సు నిలుపుకోవాలంటే నిధులు కావాలని, you tell your leader the same thing. ఆ విధంగా నిధులు ఎక్కువ తీసుకురండి. అది వదలిపెట్టి సీతమ్మ తల్లి, రాజీవ్ గాంధీ అని పేర్లు పెట్టి, అదే పద్ధతిలో బానిసత్వంలో పదవి నిలుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. మీరు చేసే కార్యక్రమాలు ఏమిటి? నేను కోరుకునేది, ఈ ప్రభుత్వం ఏ విషయం లోనూ సక్సెస్ కాలేదు. ఈ ప్రభుత్వం ఈ రోజు కనీస వసతులు లేకుండా, కనీస అవసరాలు తీర్చకుండా ఉంటే ప్రజానీకం ఆందోళనలో ఉంది. వాళ్లు రేపు ఊళ్లకు వెడతామంటున్నారు, వెడితే ధైర్యం ఉంటే తెలుస్తుంది. ఎంత బ్రహ్మాండంగా చేశారో తెలుస్తుంది. There is a book called "Art of War." ఆ బుక్ చదవండి. ఇక్కడ ఒకటే కనిపిస్తుంది. ఏదో రకంగా అపోజిషను యొక్క గొంతు నొక్కాలి. వారు మాట్లాడిన దానికి ఏదో రకంగా ఎదురుదాడి చేయాలి. ఏదైనా మాట్లాడితే మీ 9 ఏళ్ల పాలనలో ఏం చేశారని ప్రశ్నించడమే తప్ప మేము ఈ విధంగా ప్రామిస్ చేసి వచ్చాం. ఈ రాష్ట్రంలో ఈ కార్యక్రమాలు చేస్తాం, పూర్తి చేస్తాం అని చెప్పడానికి లేదు. రోశయ్య

గారున్నారు. కింద పెట్టి, మీద పెట్టి ఏదో మేనేజ్ చేస్తాడు అని. We are also waiting for him. Let him also complete. ఇది 500 మీటర్ల రేసు. ఇంకా 100 మీటర్లు కూడా పోలేదు. అధ్యక్షా! మేము చిన్నపుడు అనుకునే వాళ్లం, గ్యాలరీలో కూర్చుని. 500 మీటర్ల రేసులో పరుగెత్తుతూ వుంటే, ఫస్టు పరుగెత్తే వాడిని చూసి చప్పట్లు కొట్టేవాళ్లం, అతడే గెలిచేస్తాడనుకుని. 200 మీటర్లు, 300 మీటర్లు అయినాక అసలు సంగతి తెలుస్తుంది. ఎప్పుడూ గెలిచే వాడు, ముందుకు పోయేవాడు నిదానంగా ప్లాను ప్రకారంగా వెడతాడు. ఏదో నాలుగు మాటలు చాతుర్యంతో చెప్పి, బ్రహ్మాండంగా చెప్పేమని అనుకుంటే, స్వయంపరిపాలన చేసుకుపోతే ఎవరూ రక్షించజాలడు. ఇప్పటికే ఎంతో డ్యామేజీ జరిగింది. ఇక మీదట మరింత డ్యామేజీ జరగకుండా చూడాలని వారిని రిక్వెస్టు చేస్తున్నాను. I have many suggestions to make to this Government. గతంలో మేము ప్రభుత్వాన్ని నడిపించినపుడు కొన్ని మంచి సంప్రదాయాలు పెట్టాం. కాకపోతే, మళ్లీ పంపిస్తాను. మేము పార్టిసిపేటరీ గవర్నమెంటు కోసం ప్రయత్నం చేశాం. కొన్ని ఛేంజెస్ కోసం ప్రయత్నం చేశాం. రిఫామ్స్ కోసం ప్రయత్నం చేశాం. టెక్నాలజీ ఎడాప్ట్ చేయడం కోసం మేము ప్రయత్నం చేశాం. మీరేమీ చేయకుండా, మీకు ఒకటే ఏకైక కార్యక్రమం. మీరేం చేయదలచుకున్నారు? కోట్లాది రూపాయల బంధుప్రీతితో ఈ ప్రభుత్వం అన్ని రంగాలలో పూర్తిగా విఫలమవుతోందని మేము ఖచ్చితంగా చెబుతున్నాను. ఇప్పటికైనా మీరు ఎంక్వయిరీ పెట్టించండి. మేము ప్రూవ్ చేస్తాము. లేకపోతే ఈ శాసనసభ నుండి పూర్తిగా వెళ్లిపోతామని తెలియజేస్తున్నాను.

స్పీకర్ సార్, Unfortunately agriculture demand అయిపోయిందని మాట్లాడు తున్నారు. అంటే డిమాండ్ల మీద జరిగే చర్చ పట్ల వారికి ఎంత సీరియస్‌నెస్ ఉందో అర్థమవు తున్నది. సార్, నేను రెలెవెంట్‌గా మాట్లాడినపుడు అందరూ ప్రశాంతంగా విన్నారు. మాకు కూడా వారు చెబితే వినాలని వుంది. **ప్రభుత్వం రిప్లై చెప్పేటపుడు ఓవరాల్‌గా మొత్తం అన్ని సబ్జెక్టులు వస్తాయి. నీటిపారుదల ప్రాజెక్టుల టెండర్ల విషయం మాకు ముఖ్యమైన సబ్జెక్ట్ కాబట్టి మేము మొదటి నుంచీ చర్చకు తీసుకొస్తున్నాం. ఒకటి, రెండు నిముషాల సమయం ఇస్తే స్పెసిఫిక్‌గా అడుగుతాను.** అన్ని సబ్జెక్టులను కలిపి చెప్పేటపుడు ఈ విషయం సైడ్‌లైన్ అవుతుందన్నది నా ఉద్దేశ్యం. So, if you permit me, I would like to ask the Hon'ble Minister about two things. మినిష్టర్‌గారు ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన రిప్లై ఇచ్చిన తర్వాత ఇంకొక సబ్జెక్టుకు షిఫ్ట్ అయ్యేటపుడు మాత్రం నాకు కొద్దిగా అవకాశం ఇవ్వాలి. So that I can ask some more clarifications on irrigation projects. ఇరిగేషన్ సబ్జెక్ట్ నుంచి షిఫ్ట్ అయ్యేటపుడు మాత్రం కాస్త సమయం ఇస్తే చాలు. ఇప్పుడెలాగూ చెబుతున్నారు కాబట్టి ఇలా చేస్తే ఇప్పుడే అడుగుతాను. సార్, నేను స్పెసిఫిక్‌గా అడుగుతున్నాను.

సార్, నేను ఎస్టిమేట్స్ గురించి అడగడం లేదు. కంపేరిటివ్ ఎస్టిమేట్స్ గురించి అడగడానికి నా దగ్గర ఇప్పుడు సమాచారం కూడా లేదు. I am not prepared for that also. This is not the for discussing the estimates. అంతవరకు నాకు తెలుసు. కాకపోతే

ఎంత తెలివిగా డిపార్టుమెంటు వాళ్లు మినిష్టర్‌గారిని మిస్‌లీడ్ చేస్తున్నారో చెప్పడానికి If you permit me for five minutes, I will tell.

స్పీకర్ సర్, చాలా విషయాలు ప్రస్తావించాము. మినిష్టరుగారు కొన్నింటికి జవాబు చెప్పారు. కొన్ని పాలసీ మ్యాటర్సు చాలా విషయాలు చెప్పారు. అయినా టెండర్సు గురించి స్పెసిఫిక్‌గా కొన్ని ఆఫర్ చేశారు. ఒక ప్రాజెక్టుకు సంబంధించి రూ.20 కోట్లు ఉన్నప్పుడు వాటికి సంబంధించినంత వరకు గతంలో కూడా చెప్పారు. వాటిపై చర్చ కూడా జరిగింది. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు నా దగ్గర ఇప్పుడు లేవు. దాని గురించి ఇప్పుడు మాట్లాడను. కొన్ని విషయాలు స్పెసిఫిక్‌గా అడుగుతున్నాము. టెండర్సుకు సంబంధించినంత వరకు మేము అడిగింది. ఆల్ పార్టీస్ చూద్దామని అడిగాము. ఆ విధంగా ఇక్కడ కూర్చోవాలని అడిగాము. రెండవది, ఈ రోజు కూడా ఇక ఆఫర్ ఇచ్చారు. ఈ చర్చలు కంప్లీట్ కావాలంటే జూబ్లీహాల్‌లో పెడతామన్నారు. వి విల్ యాక్సెప్ట్ దట్. ఇంతవరకు మీరు ఫైనలైజ్ చేసిన ప్రాజెక్టుల వివరాలు మాకు ఇవ్వండి. లెటజ్ స్టడీ దట్. మేము వాటిని స్టడీ చేస్తాము.

అధ్యక్షా! ఈ రోజు ఫైనాన్స్ మినిష్టరు గారు మాట్లాడుతూ మేము పెట్టిన అలిగేషన్స్ అన్నీ అవాస్తవాలుగా, వారు చెప్పేవే నిజాలుగా, 'మేము నిజాలు చెబుతూ వుంటే, మీరు వినమని చెప్పే విధంగా' వారు మాట్లాడారు. దీనికి ఏమి సమాచారం కావాలి? యస్‌ఆర్‌యస్‌పికి సంబంధించి నేను క్లియర్ కట్‌గా చెప్పాను. టెండర్లలో జరిగినటువంటి ఎస్టిమేట్స్ కాదు. I am not talking about the estimates.ఎస్టిమేట్స్‌కి సంబంధించి తరువాత వద్దాము. కనీసం ప్రొసీజర్ చెబుతున్నాను. ఇదే గవర్నమెంట్‌కి క్లియర్ కట్‌గా మార్నింగ్ నుండి చెబుతున్నాను. ఇంతకు ముందు కూడా చెప్పాను, గతంలో కూడా ఇదే చెప్పాను. దీనికి ఆన్సర్ లేదు.

# బడ్జెట్టుపై చర్చ

21-2-2007

అధ్యక్షా! ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇది నాల్గవ బడ్జెటు. దీన్ని గౌరవ ఆర్థిక మంత్రి గారు సభలో పెట్టారు. ఇంకా మిగిలింది ఒక బడ్జెట్ మాత్రమే. వచ్చేది ఎన్నికల సంవత్సరం, ఆకాశమే హద్దుగా ఎన్నికల సంవత్సరంలో పెట్టబోయే బడ్జెట్ ఉంటుంది. చాలా మంది మిత్రులకు అయ్యో, అప్పుడే అయిపోయిందా సమయం అనిపించవచ్చు. ఈ బడ్జెటు నాల్గవది. ఈ బడ్జెట్, ఈ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను ప్రతిబింబించే విధంగా, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసే విధంగా, అభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాల్సిన అవసరం ఉంది. కానీ వారు ప్రవేశపెట్టిన బడ్జెటులో ఇవేమీ కనిపించడం లేదు. గౌరవనీయులైన పెద్దలు రోశయ్య గారు, ఆర్థిక మంత్రిగా 12వ పర్యాయం బడ్జెటును ప్రవేశపెట్టారని నేను పత్రికల్లో చూశాను. నాకు తెలిసినంతవరకు, బహుశా రాష్ట్ర మరియు దేశ చరిత్రలో ఇన్ని పర్యాయాలు బడ్జెటుని ప్రవేశపెట్టిన వారు ఎవరూ లేరని నేను అనుకొంటున్నాను. వీరి రికార్డుని ఎవరూ బ్రద్ధలు కొట్టలేరేమో. అపారమైన అనుభవం కలిగిన రోశయ్య గారంటే నాకు గౌరవం ఉంది. ఎంతో అనుభవశాలి. బడ్జెటు ప్రవేశపెడుతూ అనేక విషయాలు ప్రస్తావించారు. వీరికి ఎంత అనుభవం ఉందంటే, వారు ఇటువైపు ప్రతిపక్షంలో ఉండి బడ్జెటుపై ఎంతో గట్టిగా విమర్శించి, అటువైపు (పాలకపక్షం)కి వెళ్ళి బలపరుస్తూ ఎంతో గట్టిగా సమర్థించగలరు. ఇటు వైపు ఉన్నప్పుడు, అంతే గట్టిగా విమర్శించే చాకచక్యం, నైపుణ్యం తెలివితేటలు కలిగి ఉన్న పెద్ద మనిషి ఆయన. ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయననే ఆర్థికమంత్రిగా, లెజిస్లేటివ్ అఫైర్స్ మంత్రిగా పెట్టుకోవడం జరుగుతోంది. ప్రభుత్వాలు ఏది చెపితే, ఆనాడు ఉన్న నాయకులు ఏది చెబితే, దానికి అనుగుణంగా నడుచుకొని, ఆ విధంగా నడిపించడంలో ఎంతో అనుభవం కలిగి ఉన్నారు. ఆ విధంగా నడిపించుకుంటూనే వస్తున్నారు. నేను ఆయనతో సంభాషించినప్పుడు, రెండు మూడు సందర్భాలలో ఆయనతో రిక్వెస్ట్ చేశాను. ఈ ప్రభుత్వంలో 'అంతో ఇంతో అనుభవం ఉన్న వ్యక్తులు, చాలా విషయాలు తెలిసిన వ్యక్తి మీరు కాబట్టి, వాస్తవాలు మీరైనా మాట్లాడతారా' అన్నాను. ఆర్థిక మంత్రిగా మీకు వస్తున్న

నిధులు ఎలా ఖర్చు చేయాలో తప్పకుండా రివ్యూ చేయాలి. ఈనాడు బడ్జెట్టుకి శ్యాంక్టిటీ లేకుండా పోతోంది. ఆర్థిక మంత్రి పూర్తిగా అకౌంటెంట్‌గా మారిపోయారు. బ్యాంకులో అకౌంటెంట్ ఏమి చేస్తారంటే, ఎంత వచ్చింది, ఎవరి నుండి వచ్చింది, అన్న వివరాలు కరెక్టుగా ఆ పద్దు క్రింద ఎంట్రీ చేస్తారే తప్ప మిగిలిన విషయాలకు వెళ్లరు. But you are the Finance Minister of the State. You are not just an Accountant. మీరు అకౌంటెంట్ లాగానే పనిచేస్తానంటే కుదరదు. వచ్చిన నిధులు ఎట్లా ఖర్చౌతున్నాయి. సక్రమంగా ఖర్చు అవుతున్నాయా, లేదా, ఖర్చు కాకపోతే ఎటువంటి చర్యలు తీసుకోవాలి వంటి విషయాలను కూడా మీరే చూసుకోవాల్సిన బాధ్యత ఉంది.

నేను అనేక సందర్భాలలో సాగునీటిరంగంలో జరుగుతున్న అక్రమాల గురించి వారి దృష్టికి తీసుకువెళ్లాను. ఇక్కడ ఇష్టానుసారంగా జరుగుతున్న అవినీతి కార్యక్రమాలు, అక్రమ కార్యక్రమాలు తీసుకు వెళ్లి, మీరు వీటన్నిటినీ రివ్యూ చేయండి అన్నాను. మీరు మీకున్న అనుభవంతో వాటిని రివ్యూ చేసి కంట్రోలు చేయాలని అనేక సందర్భాలలో వారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అందుకు వారు తనకు అసలు టెండర్లు అంటే ఏమిటో తెలియదు, ఆ ఇరిగేషన్ సంగతి అంటే ఏమిటో తెలియదు అని నిర్మొహమాటంగా చెబుతున్నారు. ఇది పూర్తిగా వారి బాధ్యతా రాహిత్యం, ఇర్రెస్పాన్సిబిలిటీ అని స్పష్టంగా తెలుస్తుంది. నాకు వారి మీద ఉన్న గౌరవంతో కూడా నేను వారికి ఈ విషయాన్ని చెప్పదలచుకున్నాను. You are not acting as a responsible Finance Minister of the State. **చాలా డబ్బు వాస్తవంగా దుర్వినియోగం అవుతున్నది. పెట్టుబడుల గురించి నేను తర్వాత వస్తాను. దుర్వినియోగం అవుతున్న డబ్బు విషయంలో చూస్తే, మీరు సక్రమంగా దానిని నడిపించడంలో ఫెయిల్ అవుతున్నారని ఈ సందర్భంలో చెప్పదలచుకున్నాను.**

ఇది ఎలా ఉందంటే, బట్టలు కుట్టుకోవడానికి మన వద్ద ఉన్న బట్టను ఇస్తే అది కొంచెం ఎక్కువ తక్కువ అయినా సరే, మన మేలు కోరే మిత్రులు ఏదో విధంగా మనం అడిగిన దానిని తయారు చేస్తారు. ఆ విధంగా మీరు ఏదో విధంగా తక్కువ ఉన్న దానిని అందులో ఉన్న లోటు కనిపించకుండా, మీకున్న నైపుణ్యంతో ఏదో రకంగా ఫిటాప్ చేస్తున్నారు. చాలా మంది అన్నట్లుగా అక్కడ ఒక సేటు ఉండి, దర్జీని "క్యా దర్జీకా జీనా జిందగీ భర్ సీనా హై" అని చెప్పారు. ఆ విధంగా జీవితాంతం అతడు కుడుతూనే ఉండాలి. అలా కుడుతూ ఉంటేనే గానీ అతని జీవితం గడవదు. ఆ విధంగా మీరు బడ్జెటును ఊరికే ప్రవేశ పెట్టడం జరిగింది తప్ప మరొకటి కాదు. అందులో ఇచ్చిన నిధులు సరైన దశలో కేటాయించ వలసిన బాధ్యత కూడా మీ మీద ఉంది. అలాగే కేటాయించిన నిధులు సక్రమమైన మార్గంలో ఖర్చు అవుతున్నయా లేదా అన్న విషయాలు చూసుకోవలసిన బాధ్యత ఉంది. ఈ రెండు బాధ్యతలూ వారు సరిగా నిర్వహించలేదని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

అదే విధంగా ఈసారి ఆర్థికమంత్రి గారు ఒక విషయం చెప్పారు. " నాకు అమర్త్య సేన్ ఆదర్శం" అన్నారు. ఆయన చెప్పిన మాటలను నేను ఆదర్శంగా తీసుకుని బడ్జెటును

ప్రవేశపెడుతున్నానని చెప్పారు. నాకు చాలా సంతోషం వేసింది. ఎందుకంటే He is a Nobel Prize Awardee. చాలా బ్రహ్మాండమైన ఎకానమిస్ట్, ఆయన వ్రాసిన పుస్తకాలు 2-3 నేను చదివాను. అవి చాలా ఎక్స్‌లెంట్ బుక్స్. ఈ మధ్య కాలంలో, భారత దేశ ఆర్థిక పరిస్థితులను, ఈ ప్రపంచీకరణ జరగుతున్న పరిస్థితులలో మన ఆర్థిక వ్యవస్థలో స్పష్టంగా ఉన్న లోటుపాట్లను, సమాజంలోని లోటుపాట్లను స్పష్టంగా అవగాహన చేసుకుని వాటికి పరిష్కార మార్గాలు ఏ విధంగా ఉండాలో కూడా సూచించిన అటువంటి ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్య సేన్ గారు. అయితే, వారిని కోట్ చేస్తూ వీరు ఇక్కడ మన బడ్జెట్టు ప్రసంగంలో బడ్జెట్టును ప్రవేశపెట్టారు. కానీ బడ్జెట్టు ప్రిపేర్ చేసిన వ్యక్తి బడ్జెట్ స్పీచ్ తయారు చేసిన వ్యక్తి ఇద్దరూ డిఫెరెంట్ పర్సనాలటీస్ అన్నది స్పష్టంగా అర్థం అవుతున్నది. దీనిని ఇక్కడ కోట్ చేసింది, బడ్జెట్ స్పీచ్ కోసం కోట్ చేశారు తప్ప మరొకటి కాదు. అందుకోసం అక్కడ అమర్త్య సేన్ వచ్చారు గాని బడ్జెట్ స్పీచ్ ప్రిపరేషన్‌లో పూర్తిగా కాంగ్రెస్ పార్టీ రాజశేఖర రెడ్డి గారి యొక్క విధానంగా కనపడుతున్నది తప్ప నాకు అమర్త్యసేన్ చేసిన, చెప్పిన విధానం గురించి ఒక్క కాగితం కూడా ఇందులో కనిపించడం లేదు. వారు బడ్జెట్ స్పీచ్‌లో అమర్త్యసేన్‌గారి పేరు ఊరికే కోట్ చేయడానికి మాత్రమే ఉపయోగించు కున్నారు తప్ప, ఎక్కడా కూడా ఆయన చెప్పిన విషయాలను అమలు చేయలేదు అని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. ఆర్థికమంత్రిగారు సేన్‌గారు రాసిన బుక్స్‌ను అసలు చదివారో లేదో, బడ్జెట్టులో ఎవరో ఇచ్చిన కొటేషనును వారు చెప్పి ఉండవచ్చు. పూర్తిగా చదివారో లేదో కూడా తెలియదు. You may please go through the Sen's Book. ఇప్పుడైనా మీరు చదవండి. ఉన్న వాస్తవ పరిస్థితులను వారు ఎంత చక్కగా వివరించారో తెలుస్తుంది.

నేను ఈ మధ్యకాలంలో చదివినటువంటి విషయాలను వారి దృష్టికి తెస్తున్నాను. On Economic Ethics ఆయన చెప్పిన మాటలు. అదే విధంగా మనకు ఉన్నటువంటి poverty and famine పై ఆయన చెప్పిన అభిప్రాయాలు మీరు ఒకసారి చూడండి. Even his latest book "Argumentative Indian" one of the best books. అందులో ఆయన స్పష్టంగా చెప్పారు. ఆ విషయాలలో పేదరిక నిర్మూలన ఎలా జరగాలి? ఈ దేశంలో అభివృద్ధి ఏ వైపు పోతున్నది? ఏవిధంగా పేదవాడికి, ధనవంతుడికి మధ్య అంతరాలు పెరుగుతున్నాయి? ఈ విధమైన ఆర్థిక వ్యవస్థను ఈ రోజు ప్రభుత్వాలు ఎలా నడిపిస్తున్నాయి? అల్టిమేట్‌గా సమాజాన్ని ఏ వైపు తీసుకుపోతున్నారు అనే విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. 100 పేజీల పుస్తకం ఇది. దీనిని ఒకసారి చదవండి. చదివితే బాగుంటుంది. ఏదైనా ఒక కొటేషన్ ఇచ్చినప్పుడు సందర్భోచితంగా, కాలానుగుణంగా అది ఉండాలి. ఇక్కడ ఇది ఏ మాత్రం సందర్భోచితంగానూ, కాలానుగుణంగానూ లేవు. మీరు సమయాన్ని బట్టి ఏదో రకమైన బడ్జెట్టు ప్రవేశపెట్టారు. సేన్ గారి పేరును కోట్ చేసారు. గొప్ప బడ్జెట్టుగా చూపుకోవడానికి అతని పేరును కోట్ చేసుకున్నారు, వాడుకున్నారు తప్ప ఆయన యొక్క స్ఫూర్తి, ఆలోచనా విధానం మీ బడ్జెటులో ఎక్కడా కనిపించడం లేదన్న వాస్తవాన్ని మీరు గ్రహించాలని నేను తెలియజేస్తున్నాను. అదే విధంగా రంగరాజన్ ఒక విషయం చెప్పారు. గ్రోత్ గురించి చాలా విషయాలు మాట్లాడుతున్నారు. ఎందుకంటే growth by itself would not be an answer to the eradication of poverty. You have to

rememeber this for sustainable growth. A sustainable development is required. మీకు అసలు ఎంత గ్రోత్ రేట్ ఉంది? మనకు 8 శాతం, 9 శాతం గ్రోత్ రేట్ ఉందని, పేదరికాన్ని ఈ దేశంలో లేకుండా తొలగించామని చెప్పుకోవడం కాదు. వచ్చినటువంటి ఆదాయం ఏ విధంగా ఉపయోగిస్తున్నారు? అది అసలు పేద ప్రజలకు పోతున్నదా లేదా అన్న మౌలిక విషయాలలోకి మీరు లోతుగా వెళ్లకుండా, వస్తున్న డబ్బు ఎలా వస్తున్నది? ఏ విధంగా వస్తున్నది? వాటిని మీరు ఒకసారి చూస్తే, you just have an idea. మీరు ఒకసారి గత 5 సంవత్సరాలలో బడ్జెటు చూస్తే అది 4 రెట్లు పెరిగి పోయింది within a short span. 1990, 1995 సంవత్సరాల ముందరి బడ్జెటును చూసినట్లైతే ఈ విధమైన గ్రోత్ లేదు. ఈ రోజు ఈ విధంగా పెట్టుబడులు రెవెన్యూలు చాలా పెరిగాయి. ఇది ఏదో ఒక మన రాష్ట్రం లోనే పెరిగింది, మన రాష్ట్రంలో ఘనంగా మనం సాధించుకున్నది కాదు. మా రోశయ్యగారు రాత్రీ పగలూ చాలా కష్టపడి తెచ్చినటువంటి బడ్జెట్ యొక్క రెవెన్యూలు కావు. ఇది కంటిన్యూస్‌గా జరిగిన ఎఫర్ట్స్ మూలంగా రిఫార్మ్స్ అనేక రకాలుగా తీసుకోవడం మూలంగా వచ్చిన ఫలితాలు.

ఈ రోజు దేశమంతా చాలా రాష్ట్రాలలో బ్రహ్మాండంగా వనరులు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వంలో వనరులు పెరిగాయి. ఆ విధంగా వనరులు పెరిగిన తర్వాత వస్తున్నటువంటి వనరులను ఏ విధంగా ఉపయోగించుకోవాలన్న దాని గురించి మీరు వివరించాలి. మీరు ఆ విధంగా చేయలేదని ఈ సందర్భంలో నేను తెలియజేస్తున్నాను. ఈరోజు ప్రణాళికలు **ఏ విధంగా తయారయ్యాయంటే ప్రభుత్వం వద్ద పెట్టుబడులు, అదే విధంగా పెత్తందారీ వ్యవహారంలో డబ్బు ఉన్న వాడికి ఏ విధంగా అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించదానికి మీరు పని చేస్తున్నారు తప్ప, ప్రజల అవసరాలకు తగ్గట్లు మీ బడ్జెట్టు ప్రపోజల్స్ లేవు.** ప్రజల అవసరాలకు అనుగుణంగా మీ బడ్జెట్టు కేటాయింపులు జరగలేదు. ప్రజల అవసరాలు ఏమిటి? అసలు ఎవరి కోసం పని చేస్తున్నారు? ఈ ప్రభుత్వం యొక్క బాధ్యత ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వం తమ బాధ్యత ఏ విధంగా నిర్వహించాలి? అసలు ఆ బాధ్యత మీకు ఉందా? నిర్వహణ ఉందా? అవన్నీ యాక్షన్‌లో ఉన్నాయా? లేవా? అన్న ఒక ఆలోచన మీరు చేయాలని నేను తెలియజేస్తున్నాను.

నా వద్ద ఈ బుక్స్ చాలా ఉన్నాయి. ఆ విధంగా బుక్స్ కలెక్టు చేయడం నాకు ఉన్న అలవాటు. అందుచేత నేను చాలా చదివాను. నా గుడ్ ఫ్రెండ్ బాలయోగి గారు ఒకసారి భారత రాజ్యాంగాన్ని, కాన్స్టిట్యూషన్ ప్రతిని నాకు బహుమతిగా ఇచ్చారు. ఆయన లోక్‌సభ స్పీకరుగా ఉన్నప్పుడు నాకు ప్రెజెంట్ చేశారు. బ్యూటిఫుల్ బుక్. దానిని నేను ఒకసారి తిరగేస్తూ ఉంటే, ఫస్ట్ పేజిలో స్పష్టమైనటువంటి రాజ్యాంగంలో స్పష్టమైన పదాలు మన ప్రియాంబుల్‌లో "We, the People of India" అని చెప్పి మనకు స్వార్వభౌమాధికారమైన భారతీయులం. ఈ రాజ్యాంగాన్ని మనకు మనమే రాసుకున్నాము. అందులో స్పష్టంగా ఆ విషయం మెన్షన్ చేయడం జరిగింది. Justice - social, economic and political justice పరంగా ప్రభుత్వాలు ఉండాలనే దానిపై, ఎకనమిక్, సోషియల్, పొలిటికల్‌గా అందరికీ న్యాయం అయ్యే విధంగా ఎప్పుడూ కూడా ఈ వనరులను కేంద్రీకృతం కాకుండా చూసుకోవాలి. పెట్టుబడిదారీ విధానాన్ని

పెంచి పోషించే విధంగా అది ఉండకూడదు. We all welcome you. It is really a privilege for all of us to be here. ఒకసారి డైరెక్టివ్ ప్రిన్సిపల్ ఆఫ్ స్టేట్ పాలసీ ఒకసారి చూడండి చాలా స్పష్టంగా రాజ్యాంగం లోపల క్లియర్‌కట్‌గా చెప్పింది. "The citizen, man and women equally have the right to eke out livelihood that the ownership and control of material resources of the community are so distributed as based to observe the common good that the pattern of the economic system does not result in the concentration of wealth and means of production to the common detriment." ఈ విధంగా మన యొక్క డైరక్టివ్ ప్రిన్సిపుల్స్‌లో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఇక్కడకు వచ్చినటువంటి వ్యక్తులము. నిజంగా ఆ యొక్క స్ఫూర్తి ప్రకారంగా మనం ఇక్కడ పనిచేస్తున్నామా. ఆర్టికల్ 202 ప్రకారంగా ప్రతియొక్క ఫైనాన్సు మినిష్టర్‌గారు ఈ హౌస్‌కి ఫైనాన్షియల్ స్టేట్‌మెంటు ఒకటి ఇవ్వాలి. వారు ఆ విధంగా మన ముందు పెట్టినారు ఆమోదం తెల్పమని చెబుతున్నారు. 81 వేల కోట్ల రూపాయల బడ్జెట్టు మీ ముందు పెట్టినాను . రాష్ట్ర ఆదాయవనరులు ఈ విధంగా ఉన్నాయి. ఆ యొక్క వనరులను ఖర్చు పెట్టడానికి అనుమతి ఇవ్వమని వారు బడ్జెటు ప్రవేశ పెట్టినారు. ఈ యొక్క శాసనసభలో ఉన్న మనం ఆమోదం తెల్పకుండా ఒక్క రూపాయి కూడా వారు ఖర్చు పెట్టడానికి వీలువుండదు. ఆ విధంగా మనం ఆమోదించాల్సిన అవసరం వున్నది. అయితే ఆమోదం తెలిపేముందు నేను ఇంతకుముందు చదివినట్లుగా మొత్తం సోషల్, ఎకనమిక్ జస్టిస్ పెరిగే విధంగా ఎక్కడ కూడా పూర్తిగా సంపాదన అంతా ఏ కొద్దిమంది చేతుల్లో కాకుండా సంపద అందరికీ చెందే విధంగా మీరు ఉండాలని చెప్పి డైరక్టివ్ ప్రిన్సిపుల్స్‌లో రాజ్యాంగం చెప్పిన తరువాత ఈ విధమైన పద్ధతులల్లో మీ యొక్క బడ్జెట్ ప్రపోజల్సు కానియండీ, వనరులు కానియండీ. **వనరులు చాలా కీలకమైనవి. ఈ వనరులను ఏ పద్ధతులలో వాడాలి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా వాడాల్సింది కాని ఏ విధంగా వాడుతున్నారని అనేది నిజంగా మీరు, ఉన్న సంపదను అందరికి చెందే విధంగా మీరు తీసుకొని వెళతారు మనం ఒకసారి ఆలోచన చేయాలి.** ఈ మధ్యకాలంలో నేను ఒకసారి ఆర్టికల్ చూశాను నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం దేశంలో, 5 శాతం ప్రజల ఆదాయం యావరేజి 10 రూపాయల కంటే తక్కువగా వున్నది. అంటే మన రాష్ట్రంలో మొన్న సెన్సెస్ ప్రకారంగా దేశ జనాభా పెరిగింది. ప్రొపోర్షనేట్ దానికి చూసుకుంటే 8 కోట్ల 20 లక్షల వరకు జనాభా ఉన్నట్టు ఒక అంచనా. ఆల్మోస్టు 85 నుంచి 90 లక్షల ప్రజలకు 10 రూపాయలు కూడా ఆదాయం లేని ప్రజానీకం, వాళ్ల కుటుంబాలు ఏవిధంగా ఉన్నాయి. వాళ్లని ఏ విధంగా ఆదుకోవాలి, వాళ్లకి కావలసినటువంటి ఆదాయ వనరులను పెంచే మార్గాలు ఏమిటి, వీటిపైన మీరు ఏమన్నా దృష్టి పెట్టినారా? ఈ యొక్క బడ్జెటులో అవి ఏమన్నా ప్రతిబింబిస్తున్నాయా అంటే నాకు అవి మాత్రం ఎక్కడ కనిపించలేదు. మీరు పెట్టిన పద్దులే ఒకసారి చూసినట్లయితే స్పష్టంగా అందులో అర్థం అవుతుంది.బడ్జెటు స్వరూపం అంత ఒకసారి చూసినట్లైతే 81,21,61 లక్షల రూపాయలు మొత్తం బడ్జెట్ కావాలని పెట్టినారు. సైజ్ చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది. బ్రహ్మాండమైనటువంటి సైజ్ పెంచారు. రమారమీ 20 వేల కోట్ల రూపాయలు పెంచారు. ఈ సంవత్సరం అదనంగా మాకు resources వస్తున్నాయి ఆ విధంగా మేము బడ్జెటులో కేటాయింపులు పెంచుతున్నామని చెప్పారు.

వార్షిక ప్రణాళిక 30 వేల కోట్ల రూపాయలకు తీసుకొని వెళ్లారు. గతంలో కంటే రమారమీ 52 నుంచి 55 శాతం వరకు ఎక్స్‌ట్రా. ఈ సంవత్సరం వార్షిక ప్రణాళిక కూడా పొందుపర్చడం చూడడానికి ఇవి అన్ని కూడా బ్రహ్మాండంగా కనపడుతున్నాయి. ఈ రోజు రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందా? నిజంగా ఇన్ని వనరులను ఏ విధంగా సమీకరించుకున్నారు అనేటటువంటిది ఒకసారి చూసినట్లయితే, లోతుగా చూస్తే దాంట్లో స్పష్టంగా అర్థం అవుతుంది. ఇందులో ఎక్కడ నుంచి వచ్చినాయి, ఈ వనరుల సమీకరణ ఏమి చేస్తున్నారు. ఒకసారి మనం ఆలోచన చేస్తే, మేము ఉన్న ఆస్తులను అమ్మి వనరులను సమీకరిస్తామని అంటున్నారు. విపరీతమైన అప్పులు తీసుకొచ్చి వనరుల సమీకరణలో చూపెట్టారు. ఇవి అన్ని కూడా బడ్జెట్ సైజ్ పెంచడానికి తప్ప వాస్తవికంగా ఇవి ఏదో వస్తాయని చెప్పి వారికి తెలుసు. నిన్న ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫైనాన్సు సెక్రటరీ చెప్పారు. మాకు బడ్జెట్ సైజ్ పెంచాలంటే ల్యాండ్ సేల్సు పెట్టాలి. అది మేము చూపించినాము. ఆ పద్ధతిలో ఆయన చెప్పారు. ఆ విషయం నేను ఈ రోజు ఉదయం పత్రికల్లో చూశాను. ఆ విధంగా ఉన్న అవాస్తవాలు అన్ని ఇందులో పొందుపర్చి బడ్జెట్ సైజ్ పెంచడానికి మీరు ప్రయత్నం చేశారు తప్ప వాస్తవం ఇందులో మాత్రం ఏమి లేదు. మీ ప్రభుత్వం వచ్చిన తరువాత మీరు చెప్పిన దానికి ఖర్చు పెట్టే దానికి 15 శాతం డిఫరెన్సు వుంటుంది. ప్రతిసారి 15 శాతం యావరేజిగా ఎక్స్‌పెండిచర్ మీరు చెప్పిన దానికి డిఫరెన్షియేషన్ ఉంటున్నది చెప్పి ఈసారి మాత్రం ఇంకా ఎక్కువ ఉంటుందని చెప్పి మీకు తెలియచేస్తున్నాను. మనం ఒకసారి చూస్తే ఆదాయ వనరులు మనకు చాలా పెరుగుతూ వచ్చాయి. వ్యాట్ ఇంట్రడక్షన్ తరువాత 16,839 కోట్ల రూపాయలు వచ్చింది. ఈ సంవత్సరం మీరు 20 వేల కోట్ల రూపాయలుపైన ప్రొజక్షన్సు పెడుతున్నారు. అబార్కీ ఆదాయం వచ్చేసి 4,125 కోట్ల రూపాయలు. ఈ సంవత్సరం 700 కోట్ల రూపాయల ఆదాయం అబార్కీ పైన ఈసారి రోశయ్యగారు ఎక్స్‌పెక్టు చేస్తున్నారు. ఎన్నికల ముందు లోక్‌సత్తా వాళ్లు ఒకసారి డిబేట్ పెట్టారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రోశయ్యగారు వచ్చారు, టిడిపి తరఫున నేను వెళ్లాను. లోక్‌సత్తా డిబేట్ లోపల వారు మీరు ఏం చేస్తున్నారు అంటే, వారు ప్రభుత్వంపైన విమర్శ చేస్తూ ఆరోజు మమ్ములను అన్నారు. పుట్టగానే మీరు అసలు తల్లిపాల కంటే ముందు మీరు ఉగ్గుపాలతోబాటు బ్రాందీ త్రాగిస్తున్నారు అని అన్నారు. అప్పటికి మా ఆదాయం 1800 కోట్ల రూపాయలు, ఆ విధంగా రెండువేల కోట్ల రూపాయలు ఆదాయం తెచ్చుకోడానికి ఊరు ఊరికి మీరు షాపులు పెట్టినారు. మనిషి మనిషికి మీరు త్రాగిస్తున్నారు. నాకు మాత్రం మా తల్లి మొత్తం ఆముదం మాత్రము త్రాగించింది. మీరు అందరికి సారాయి తాగిస్తున్నారని చెప్పారు. నేను అదే రోజున చెప్పాను, రోశయ్యగారు చిన్ననాటి నుంచి మీరు ఎవరికి చిక్కడంలేదనే విషయం నాకు ఇప్పుడు తెలుసు. ఆముదం త్రాగడం మీకు అలవాటు అయిపోయి వంటికి ఆముదం పట్టుకున్నట్లు ఉన్నారు, ఎక్కడ చిక్కరు వారు, ఇట్లా పట్టుకుంటే జారిపోతారు. వీరు మసిపూసి మారేడికాయ చేసి మనకు ఒక విచిత్ర ప్రపంచాన్ని చూపించడంలో దిట్ట తప్ప వాస్తవాలు మాత్రం, వారికి అనుకూలమైన పరిస్థితులలో వారు మాట్లాడుతారు తప్ప వాస్తవాలు ఎన్నడూ కూడా చెప్పలేదు. ఆయన ఎదో త్రాగిపించి 4200 కోట్ల రూపాయలు ఆదాయాన్ని సంపాదించాలని ఆలోచన చేస్తున్నారో సభకు చెప్పాలి. రోశయ్యగారు ఓన్లీ ఆన్ ఎక్సైజ్ 4125 కోట్ల రూపాయలు ఎక్స్‌పెక్టు చేస్తున్నారు. ఒక సంవత్సరం 700 కోట్ల రూపాయలు

ఆదాయం ఎక్సైజ్ మీద సంపాదిస్తామని చెప్పి బడ్జెట్‌లో వాళ్లు సెలవు ఇచ్చినారు. అంటే ఎన్ని షాపులు పెట్టదలచుకున్నారు, ఎన్ని బెల్టు షాపులు ఇస్తున్నారు? మీ ప్రభుత్వం వచ్చిన తరువాత పౌరసరఫరాల విభాగం పూర్తిగా కుప్పకూలిపోయింది. సారాయి మాత్రం బ్రహ్మాండంగా సరఫరా చేసి 4100 కోట్ల రూపాయల ఆదాయాన్ని పెంచుకోడానికి బ్రహ్మాండమైన ప్రపోజల్సు పెట్టినారు. రిజిస్ట్రేషన్ ఫీజుల మీద 3750 కోట్ల రూపాయలు ఈనాడు ఎక్స్‌పెక్టు చేస్తున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ వ్యాల్యూస్ అన్నీ పెరిగిపోయాయి. సామాన్య ప్రజలకు కనీసం ఉండడానికి ఇల్లు లేని పరిస్థితులలో ఈనాడు వస్తుంది. ఇందులో రిజిస్ట్రేషన్ వాల్యుస్ అన్ని కూడా పెంచడానికి ఇందులో ప్రపోజల్సు పెట్టినారు. 1987-88లో ఒకసారి రెవెన్యూ మినిష్టర్‌గా రివ్యూ చేస్తావుంటే ఆరోజు 300 కోట్ల రూపాయల నుంచి 400 కోట్ల రూపాయలకు పెంచమంటే డిపార్టుమెంటు గొడవపెట్టారు. ఒకేసారి 25 శాతం పెంపుదల ఎక్కడ నుంచి పెంచమంటారు ఇది సాధ్యం కాకపోవచ్చు అని వాదిస్తూ వచ్చారు. స్లోగా దానిని 1999 నాటికి 300 కోట్ల రూపాయల నుంచి 600 కోట్ల రూపాయలు తెచ్చేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. ఎంతో పగడ్బందీగా కంప్యూటరైజ్ చేసి సిష్టమేటిక్‌గా అన్ని చేసిన తరువాత కూడా ఆ రోజు పెరగలేకపోయింది.

అధ్యక్షా! రిజిస్ట్రేషన్ వేల్యూస్ పెంచటం ద్వారా ఈ సంవత్సరం రూ.3,750 కోట్లు ఆదాయం పెంచుకోవటానికి బడ్జెట్‌లో ప్రపోజల్స్ పెట్టారు. వారికి పూర్తి కాన్ఫిడెన్స్ ఉన్నది. ప్రభుత్వం ఈనాడు సంక్షేమాన్ని వదిలిపెట్టి వ్యాపార ప్రభుత్వంగా తయారైనది. It has totally become a business oriented real estate company. ఆ విధంగా ఈనాడు ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రభుత్వమే ఆక్షన్స్‌పెట్టి ధరలను పెద్ద యెత్తున పెంచటం, పెరిగిన ధరల మూలంగా రిజిస్ట్రేషన్స్ రూపంలో ఎక్కువగా వసూలుచేయటానికి ప్రయత్నం చేస్తున్నారంటే ప్రభుత్వమే వ్యాపారసంస్థగా మారింది. ప్రజలకు ఎక్కడకు వెళ్లాలి, ఎవరికి చెప్పుకోవాలి? ఆ విధంగా ప్రభుత్వాన్ని వ్యాపారసంస్థగా మీరు మార్చారు. హైదరాబాద్ సరౌండింగ్స్ మాత్రమే కాదు. వైజాగ్, కాకినాడ, తిరుపతి ఎటు చూసిన ఎక్కడో ఒకచోట ప్రాజెక్ట్ వస్తుందని ప్రకటన చేయటం, వెంటనే ప్రజలంతా పరిగెత్తుకు వెళ్లటం, అక్కడ రేట్లు పెంచటం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కనిపెట్టిన క్రొత్త టెక్నిక్ ఏమంటే లక్ష రూపాయలది పది లక్షలకు పెరిగిందని వేల్యూస్ పెంచుతున్నారు. ల్యాండ్ వేల్యూస్ పెంచటంతో ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్ డ్యూటీస్ అన్నీ పెంచుకోవటానికి ప్రయత్నాలు ఏవైతే చేస్తున్నారో ఆ ప్రయత్నాల ద్వారా రూ.3,750 కోట్లు కేవలం రిజిస్ట్రేషన్స్ ద్వారా సంపాదించుకోవటానికి ఈనాడు ఇందులో పెట్టటం జరిగింది. వాహనాల మీద కూడా ఈసారి రూ. 1893 కోట్లు ఆదాయం వస్తుందని చెబుతున్నారు. బడ్జెట్‌లో మీరు హైసైడెడ్‌గా చూపిస్తున్న ఫిగర్స్ కాక వాస్తవాలు చూడాలి. మీరు ఎంతవరకు సమీకరించగలుగుతారు, నిధులు సమీకరణ జరుగుతుందా, సాధ్యమౌతుందా అనే విషయాలు మంత్రిగారు చెప్పాలి.

ఫైనాన్స్ మినిస్టర్‌గారు ఒక గొప్ప విషయం చెబుతారు. వారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేస్ అండ్ మీన్స్ కోసం ఒక్కసారి కూడా ఆర్.బి.ఐ. వద్దకు పోలేదని, గత

ప్రభుత్వం తీసుకునేదని చెబుతూ ఉంటారు. ఆర్.బి.ఐ. యొక్క స్టేట్ ఫైనాన్సెస్ స్టడీ ఆన్ బడ్జెట్, 2006-07 అనే పుస్తకం నేను నిన్న చూశాను. ఇంత గొప్ప విషయం మన రాష్ట్రం ఒక్కటే చేస్తోంది మిగతా వారు నార్మల్‌గా చేస్తున్నారంటున్నారు. ఇళ్లు నడపటంలో కూడా మనం ఇంట్లో ఉండేవారు బ్రహ్మాండంగా ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ చేస్తారు. ఒక రాష్ట్రాన్ని గాని, ఒక కుటుంబంగాని నడిపేటప్పుడు సాధారణంగా చేతి బదుళ్లు తెచ్చుకుంటారు. కొన్ని కుటుంబాలలో పిల్లలను చదివించుకోవటానికో, వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవటానికి కొన్ని ఖర్చుల నిమిత్తం చేతిబదుళ్లు తెచ్చుకుంటారు. ఇంకొక కుటుంబం ఉంటుంది, ఉన్న డబ్బులను దాచిపెట్టుకుని, ఏమాత్రం ఖర్చుపెట్టకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి సాధించాలను కుంటారు. అటువంటివారు కోరికలు, ఆశలు, కలలు కనటమే ఉంటుంది తప్ప, ఖర్చు పెట్టటం ఉండదు కాబట్టి సహజంగానే అక్కడ ఖర్చు ఉండదు. **దేశం మొత్తంలో చూస్తే వేస్ అండ్ మీన్స్ క్రింద కేవలం రెండు రాష్ట్రాలు, నాగాలాండ్, కేరళ తప్ప మరే రాష్ట్రాలు వేస్ అండ్ మీన్స్ క్రింద తెచ్చుకోవటం లేదు. అంతో ఇంతో వనరులు కొంతవరకు ఇంప్రూవ్ అయ్యాయి. అన్ని రాష్ట్రాలలో అయ్యాయి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంప్రూవ్ అయ్యాయి.** దాంట్లో మీ చాకచక్యం, గొప్పతనం ఏదో ఉందని మీరు చెప్పుకోవటానికి పనికివస్తుందేమోగాని వాస్తవానికి, ఆర్.బి.ఐ. రిపోర్ట్ ప్రకారంగా రెండు రాష్ట్రాలు మినహా వేరెవ్వరూ ఈ వేస్ అండ్ మీన్స్‌కు పోలేదనే వాస్తవం మీరు తెలుసుకోవాలని మనవి చేస్తున్నాను. 2005లో ఎఫ్.ఆర్.బి.ఎమ్. పెట్టారు. ద్రవ్య బడ్జెట్ బాధ్యతాయుత నిర్వహణను మీరు ఏదైతే పెట్టారో దాని ప్రకారం మూడు నెలలకు ఒకసారి కంపల్సరీగా కలిసి ఆర్థిక పరిస్థితి ఏవిధంగా ఉన్నదో రెవ్యూ చేసుకోవాలని పెట్టారు. నాకైతే అది ఎక్కడా కన్పించటంలేదు. వారు ఎక్కడైన పెట్టారేమో నాకు చూపిస్తే, చెబితే బాగుంటుంది. ఇంటర్నెట్‌ద్వారా వెబ్‌సైట్‌లో వెతికితే నిన్న ఒక కాగితం దొరికింది. నాకు అర్థంకాలేదు, మీకు పంపిస్తాను. మీకేమైనా అర్థమైతే చెప్పాలి. అది తప్ప నాకేమి దొరకలేదు. మీరు ఓపెన్‌గా పెట్టవలసినప్పటికీ ఓపెన్‌గా పెట్టినట్లు నాకు కన్పించటం లేదు. యూనియన్ గవర్నమెంట్ అయితే అన్ ఆడిటెడ్ ఫిగర్స్ మిడ్ ఇయర్ రెవ్యూ క్రింద సుమారు 70 పేజీలు పెట్టారు. ట్రెండ్స్ ఎట్లా ఉన్నాయి, ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నది, హెచ్చుతగ్గులు ఎట్లా ఉన్నాయి, అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోతున్నారా, లేదా అనే వివరాలను టోటల్‌గా పెట్టారు. మీవారు ఆవిధంగా పెట్టటంలేదు. మీరేదో సంవత్సరానికి ఒకసారి రావటం, మేమేదో చెప్పటం, మీరు పాస్ చేసుకని వెళ్లిపోవటం వంటివి మొక్కుబడిగా చేసున్న కార్యక్రమాలే తప్ప బడ్జెట్ మేనేజ్‌మెంట్‌లో సీరియస్‌నెస్ కన్పించటంలేదు.

అభివృద్ధి గురించి చెబుతున్నారు. ముఖ్యమంత్రిగారు కూడా ఈమధ్య కాలంలో మాట్లాడుతూ చెప్పారు. తాము వచ్చిన మూడు సంవత్సరాలలో సంక్షేమ రంగానికి సరైన కేటాయింపులు చేయలేదని, ఈసారి సంక్షేమ రంగానికి కేటాయింపులు పెంచుతామని పదేపదే చెప్పారు. మేము కూడా ఆశించాము. ప్రజలు, మరియు అపోజిషన్ పార్టీలవారు చాలా ఇబ్బందులు పెడుతున్నారు కాబట్టి ఈసారి తప్పనిసరిగా ఈ రంగానికి కేటాయింపులు పెంచుతారని ఆశించాము. ఆవిధమైన పెరుగుదల కన్పించకపోగా దానిని 26.6% నుండి 24.2%కు

తగ్గించారు. రాష్ట్రాభివృద్ధి 8.2% నుండి 7.2% తగ్గింది. ఇది ఏ విధంగా బ్రహ్మాండమైన ఆర్థిక అభివృద్ధో నాకు అర్థంకావటంలేదు. ఉరకలేస్తుందని ఆర్థికమంత్రిగారు చెబుతున్నారు. ఉరకలేయటం లేదండీ, గురకలేస్తుందని నేను అంటున్నాను. దానిని లేపండి, లేపి సరైన మార్గంలో నడిపించమని ఆర్థికమంత్రి గారికి తెలియచేస్తున్నాను. మీరు అనుకున్న విధంగా పరుగెత్తటంలేదు. అది పరుగు కాదు, చాలా లోపాలు ఉన్నాయి. కనుక లోతుగా అధ్యయనం చేయండని విజ్ఞప్తి చేస్తున్నాను.

అధ్యక్షా! మెయిన్ సెక్టార్స్‌కు వచ్చినట్లయితే important sector is agriculture. అగ్రికల్చర్‌లో బ్రహ్మాండంగా ముందుకు వెళుతున్నాము, మాది రైతు రాజ్యం, సంక్షేమ రాజ్యం అని చెబుతున్నారు: దానికి తగ్గట్లుగా ప్రభుత్వ కేటాయిపులు ఉండటంలేదు. ఏ కేటాయింపుల్లేకుండా, తిండి పెట్టకుండా పిల్లవాడు బ్రహ్మాండంగా ఉండాలంటే ఎట్లా అవుతుంది? మాటలు చెప్పి పంపిస్తుంటే ఎట్లా? అగ్రికల్చర్ సెక్టార్‌కు మీరు కేటాయింపులు ఎన్ని చేశారు. గ్రామాలలో ఉన్న 70% ప్రజలు ఈనాటికి కూడా అగ్రికల్చర్‌పైననే ఆధారపడి ఉన్నారు. అది అదృష్టమో, దురదృష్టమో, నన్ను అడిగితే అది దురదృష్టమే. 70% ప్రజలు అగ్రికల్చర్‌పైననే ఆధారపడుతున్నారంటే వారికి వేరే యాక్టివిటీ లేదు. ఈనాటికి కూడా గ్రామీణ వ్యవస్థ, ఆర్థికవ్యవస్థ వ్యవసాయంపైననే ఆధారపడి ఉన్నది. అదే వారి జీవనాధారం. అంతటి కీలకపాత్ర వహిస్తున్న వ్యవసాయానికి రూ.1116.40 కోట్లు కేటాయించారు. మీరు ఇచ్చిన రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో 2.89% ఉంటే ఈసారి 2.64%కు అంటే 0.24% తగ్గించారు తప్ప పెంచిన పాపాన పోలేదు. గతంలో మీకు అదే బేస్. ఆ బేస్ నుండే మీరు తగ్గుతూ వస్తున్నారు. బేస్‌ను పెంచుకోవాలి తప్ప తగ్గించుకోకూడదు. ఈ విధంగా చేస్తూ మేమేదో అగ్రికల్చర్‌లో బ్రహ్మాండంగా చేస్తున్నామంటే అదెట్లా అవుతుందో మీరొక్కసారి ఆలోచన చేయాలి. 6% గ్రోత్ రేట్ తెస్తామని మీరు మేనిఫెస్టోలో చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతులను విస్మరించిందని, రైతులగురించి పట్టించుకోవటంలేదని, సంక్షేమం గురించి పట్టించుకోవటం లేదని చాలా మాట్లాడారు. నేను అది చూసిన తరువాత ఆశ్చర్యపోయాను. 11వ ప్రణాళిక సంఘమే 4% గ్రోత్ రేటుకంటే ఎక్కువ తీసుకురావటం అసాధ్యమని వారే చెబుతున్నారు. అటువంటిది వీరు 6% తెస్తామని చెబుతున్నారని నేను ఆశ్చర్యపోయాను. అదేమైనా కానీయండి, మనకు ఓట్లు కావాలన్నట్లు 6% గ్రోత్ రేటు తెస్తామని చాలా గొప్పలు చెప్పారు. రైతు రాజ్యం, రైతుల గురించి బ్రహ్మాండంగా చేస్తామని మహానుభావులు వచ్చిన తరువాత ఆర్థిక పరిస్థితి ఏవిధంగా ఉన్నది, **వ్యవసాయరంగం ఏవిధంగా ఉన్నదనే విషయాలు ఒక్కసారి విశ్లేషణ చేసుకుంటే వ్యవసాయం, అనుబంధ రంగాలలో 2% ఉన్న గ్రోత్ రేటు తగ్గింది. వీరు అధికారంలోకి వచ్చిన తరువాత వీరి నిర్వాకం మూలంగా ఇది తగ్గింది.** పంటలు ఏవిధంగా ఉన్నాయో ఒక్కసారి చూడండి. ఈ మధ్య కాలంలో వర్షాలు బ్రహ్మాండంగా పడ్డాయి. దేశంలోనేకాదు ప్రపంచవ్యాప్తంగా మెరుగైన వాతావరణ పరిస్థితుల మూలంగా చాలా మంచి వర్షాలు పడ్డాయి. వర్షాలు పడినప్పటికీ విత్తిన పొలాల విస్తీర్ణం చూస్తే, నేను చెప్పేది పూర్తిగా ఎకనమిక్ సర్వే నుండి కోట్ చేస్తున్నాను, నా సొంతది కాదు. 71.68 లక్షల హెక్టార్లు 2005-06లో చేస్తే 2006-07లో 67.43కు అది తగ్గింది. రమారమి 4.25 లక్షల హెక్టార్లు

తగ్గింది. ఈ రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో అసలు విత్తనాలే వేయలేదు. టోటల్‌గా 12 లక్షల ఎకరాలకు అదనంగా నీరు ఇచ్చామని, ఎటు చూసినా జలయజ్ఞం చేస్తున్నామని మీరు గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇంత మంచి వర్షాలు పడిన తరువాత కూడా 10 లక్షల హెక్టార్లలో విత్తనాలు వేయని పరిస్థితి రాష్ట్రంలో ఉందంటే అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ నీరు ఇస్తున్నారు? రైతాంగానికి 7 గంటల కరెంట్ ఇస్తే వారెక్కడ వ్యవసాయం చేస్తారు? వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన చేయాలి తప్ప వేరే రకంగా చేయకూడదు. ప్రభుత్వ ఆలోచన ఏవిధంగా ఉందంటే, మొన్నటిదాకా ప్రతి జిల్లాలో మీరు కూడా చూశారు. రైతులు నాట్లు వేసుకున్నారు. మార్చ్, ఏప్రిల్‌లలో నీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది కాబట్టి నాట్లు వేయవద్దని వారి ఆఫీసర్స్ చెప్పారు. మేము మాట్లాడితే, లోకల్ ఆఫీసర్ మీద ప్రెజర్ పెడితే ఏమి చేయమంటారండీ, ప్రభుత్వం వేయవద్దని చెప్పమన్నారన్నారు. నాట్లు కూడా వేయవద్దని చెప్పే మా గొప్ప రైతు రాజ్యం ఇది.

ఈ రైతు రాజ్యంలో పది లక్షల ఎకరాల్లో అసలు నాట్లే వేయవద్దన్నారంటే, ఇంతకంటే సిగ్గుచేటు ఈ ప్రభుత్వానికి ఏమున్నదో ఒకసారి ఆలోచన చేసుకోవాలని మీకు తెలియ జేయదలచుకున్నాను. ఇక ఫుడ్ ప్రొడక్షన్ విషయానికి వస్తే 2005-06లో 169.50 లక్షల టన్నులుంటే 2006-07కు వచ్చేసరికి 147.82 లక్షల టన్నులు. అంటే 22 లక్షల టన్నుల మేర ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోయింది. రోశయ్య గారూ, మా ప్రభుత్వంలో వ్యవసాయ రంగం ఉరకలేస్తోంది ఉరకలేస్తోంది అంటున్నారు. ఎక్కడ ఉరకలేస్తోంది? గురకలేస్తోంది కాని, 22 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి ఈ సారి తగ్గిపోయింది. ముఖ్యమంత్రిగారు కూడా నిన్న అంగీకరించారు. సంతోషం, ఏదో పరిశ్రమలలో ముందుకు పోయాము కాని వ్యవసాయ రంగంలో అంత ముందుకు పోలేకపోతున్నామని మూడు సంవత్సరాల రైతు రాజ్యంలో చేతులెత్తేశారు వీళ్లు, మాతో ఏమీ అయ్యేటట్లు లేదని, మాతో ఇక అయ్యే పరిస్థితి లేదని చెప్పి, 22 లక్షల టన్నుల ఆహారోత్పత్తులు తగ్గిపోయాయి. కాని మా హయాంలో బెస్ట్ ఇయర్ 2001ను కూడా మీరు రీచ్ కాలేకపోయారని ఈ సందర్భంగా నేను తెలియజేయదలచుకున్నాను. ఒక్క బియ్యమే గత సంవత్సరంలో 117.40 లక్షలుంది. 2006-07కి వచ్చేసరికి 11 లక్షల టన్నులు తగ్గిపోయింది. ఒక్క బియ్యమే ఈ విధంగా మళ్లీ ఈ సంవత్సరానికి 5.28 లక్షల టన్నులకు ఓన్లీ రైస్ తగ్గిపోయిందండీ, అందుకే ఈ రోజు మీరు చూపే లెవీ అసలు పట్టించుకోవటం లేదు. ఎక్కడ పోయారండీ మీ వ్యవసాయ మంత్రి, కనీసం డిబేట్ జరిగేటప్పుడైనా లేరు, హిందూపురం వెళ్లారేమో కాని ఈ డిబేట్‌లో లేరు. Let him first attend. సివిల్ సప్లైస్, అగ్రికల్చర్ అన్నీ ఆయనకే అప్పజెప్పారు. అసలు ప్రొక్యూర్‌మెంట్ జరగడం లేదు. ప్రొక్యూర్‌మెంట్ కాకపోవడం వల్ల పంజాబ్ బియ్యం తినలేక చస్తున్నారు జనాలు, అసలు ప్రొక్యూర్‌మెంట్‌కు ఎక్కడ అవకాశమున్నది? ప్రొడక్షనే తగ్గిపోయింది. 5.2 లక్షల టన్నుల ప్రొడక్షన్ తగ్గిపోయింది. ఆయన ఎక్కడికి పోయారో, ఏమి చెబుతారో? ఆయన ఎక్కడికి పోయినా బ్రహ్మాండంగా చేశామని మాత్రం చెబుతుంటారు. రైస్ ప్రొడక్షన్ తగ్గిపోయిందని మీకు తెలియజేస్తున్నాను. ఒకసారి రైస్ ప్రొడక్టివిటీ కూడా చూసినట్లైతే, ప్రొడక్టివిటీ గురించి మీరు ఏదైతే ఎక్స్‌టెన్షన్ వర్కు చేస్తున్నాం, రైతాంగానికి బ్రహ్మాండమైన విత్తనాలిస్తున్నాం, బ్రహ్మాండంగా అన్ని సదుపాయాలూ కలుగ చేస్తున్నాం, పరపతిని

పెంచామంటున్నారు. అవన్నీ తరువాత నేను మాట్లాడతాను. వాటబౌట్ ప్రొడక్టివిటి? మీరిచ్చిన ఫిగర్స్‌లోనే, ఫైనాన్స్ మినిస్టర్ గారిచ్చిన ఫిగర్స్‌లోనే 2003-04లో 3011 కేజీలుంటే 2004-05లో 3111 కేజీలుంది. 2005-06కి వచ్చేసరికి 2939 కేజీలుంది. దటీజ్ ది ప్రొడక్టివిటీ అంటే మీరేమి ఎక్స్‌టెన్షన్ వర్క్ చేస్తున్నారు? మీరు రైతులను ఎంకరేజ్ చేసే కార్యక్రమాలు ఏవిధంగా చేస్తున్నారు? It is going on the reverse side. టోటల్‌గా లాస్ట్ త్రీ ఇయర్స్‌లో అగ్రికల్చర్ సెక్టార్ అంతా రివర్స్ సైడ్‌లో వెళ్తోంది. అది మన జీడిపి పైన స్పష్టంగా కనుపడుతోంది. ఫైనాన్స్ మినిస్టర్ గారు కూడా దానిని ఒప్పుకున్నారు. రెండు శాతం పూర్తిగా వ్యవసాయ రంగంలో తగ్గిపోయిన తరువాత గ్రామీణ వ్యవస్థ ఎట్లా బాగు పడుతుందండీ? ఈనాటికి కూడా మనం రైతాంగానికి అవసరమైన పరపతిని ఇప్పించలేకపోతున్నాము. ఇప్పటికీ ఆత్మహత్యలు పెరిగిపోతూనే ఉన్నాయి. గతంలో ఏదో కొంత మంది ఆ రోజులలో పూర్తిగా వర్షాలు పడక నానా ఇబ్బందులు పడి రైతాంగం ఇబ్బందుల్లో వున్న పరిస్థితుల్లో కొంత అగ్రికల్చర్ సెక్టార్‌లో కొన్ని ప్రాబ్లమ్స్ వచ్చాయి. మేము కూడా అంగీకరించాము. దానిని సరి చేసుకోవాలనే ఆలోచన కూడా చేయాలని అనుకుంటున్నాము. కాని మీరు వచ్చిన తరువాత గత మూడు సంవత్సరాలుగా బ్రహ్మాండంగా వర్షాలు పడుతున్నాయి. ఎక్కడ చూసినా రిజర్వాయర్లలో పుష్కలంగా నీళ్లున్నాయి. అదేవిధంగా భూగర్భ జలాలు కూడా బ్రహ్మాండంగా పెరిగిపోయాయి. కాని ఈనాడు రైతు ప్రొడక్షన్ పెరుగుతోందా? ఫుడ్ గ్రెయిన్స్ ప్రొడక్షన్ పెరుగుతోందా? కాని తగ్గిపోయాయి. ప్రొడక్టివిటీ తగ్గుతూ ఉన్నది. మరి ఎందుకు ఈ విధంగా తగ్గుతూ ఉన్నది? మీరేమైనా ఆలోచన చేస్తున్నారా? పూర్తిగా గాలికి వదిలేసి మీ ఖర్మ మాకైతే ఓట్లేశారు మేం మాత్రం బ్రహ్మాండంగా ఉన్నామని చెప్పి అక్కడక్కడా ఎలక్షన్స్ వచ్చినప్పుడు మాత్రం మాది రైతు ప్రభుత్వం, మాది రైతు ప్రభుత్వం, అని చెప్పి ఏదో పంచె వేసుకుంటూ తిరిగితే ఎలా రోశయ్యగారూ? ఇప్పటికైనా సరే ప్రభుత్వం, మీ అగ్రికల్చర్ మినిస్టర్ గారికి, మీ ముఖ్యమంత్రి గారికి రైతులు పడుతున్న బాధలను, రోజు రోజుకూ తగ్గిపోతున్న వాళ్ల యాక్టివిటీలను మీరు ఒకసారి వారికి చెప్పి కళ్లు తెరిపించండి. ఈ శాఖను ఇంప్రూవ్ చేయాలని మీకు తెలియజేస్తున్నాను. ఎప్పుడైనా సరే ఏదైనా ఒక క్రైసిస్ రాగానే ఇమ్మీడియట్‌గా ఒక కమీషన్ వేస్తాము. ఏదో రకంగా అబ్బో, ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది ఈ ఇష్యూపైన, ప్రభుత్వం వల్ల ఏమైనా మార్పు వస్తుందని భావించి వారిలో ఏవో భ్రమలు కలుగచేయడానికి ఒక కమీషన్ వేస్తుంటాము. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా హడావిడిగా జయతీ ఘోష్ కమీషన్‌ను వేశారు. ఆ కమీషన్ రిపోర్టు ఇవ్వగానే అవసరమైన మార్పులు తీసుకొస్తామని చెప్పారు. ఆ కమీషన్ రిపోర్టు ఇచ్చింది. మరి ఎక్కడ పోయింది ఆ కమీషన్ రిపోర్ట్? ఆ కమీషన్ రిపోర్టు అంశాలు ఏమైనా అమలు చేస్తున్నారా? కనీసం మీరు అమలు చేసే ప్రయత్నమైనా చేశారా? ఎవాల్వ్ చేశారా? అదే విధంగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వేసిన స్వామినాథన్ కమీషన్ రిపోర్టు అందరికీ పంపించాము. ఆ రిపోర్టే కాదు. గతంలో ఎన్నో కమీషన్ల రిపోర్టుల్లోనూ వారు చెప్పింది అగ్రికల్చర్ సెక్టార్ గురించి చాలా రిపోర్టులు ఇచ్చారు. ఏ కమీషన్ రిపోర్టులు ఇచ్చినా, వాటిని చూసినట్లయితే అమలు చేసే సిన్సియారిటీ మాత్రం ప్రభుత్వం దగ్గర కనపడటం లేదు. ఎక్కడ చూసినా ఓన్లీ నాలుగైదు పాయింట్లు మాత్రమే

బేస్ అయివుంటాయి. Any Report, you can go through it. ఈ రిపోర్టుల గురించి మా అనుభవంలో కూడా చూసినట్లయితే రైతులకున్న పరపతిని పెంచాలని చెబుతున్నారు. క్రెడిట్ అనేది ఎప్పుడైతే పెరగదో రైతుల పరిస్థితి కూడా మారదు ఎందుకంటే, ఎప్పుడైతే వ్యవసాయానికి పెట్టుబడులు పెరిగిపోయాయో వారి పరపతులు కూడా పెంచాల్సిన అవసరమున్నది. వెనకటికి మీరు కూడా చూశారు అధ్యక్షా, గతంలో పశువుల కొట్టంలో పేడ వేసుకొని, వచ్చినకాడికి అంతో ఇంతో వేసుకొని పంట తీసుకునేవారు. పెట్టుబడి కూడా పెద్దగా ఉండేది కాదు. కాని ఈ రోజుల్లో పెట్టుబడులు చాలా పెరిగిపోయాయి. విపరీతమైన పెట్టుబడులయ్యాయి. పెట్టుబడులకు తగినట్లుగా టైమ్‌లీ క్రెడిట్ అందుబాటులోనికి రానట్లయితే ఎన్ని ఇబ్బందులుంటాయో ఒకసారి ఆలోచన చేయాలని తెలియజేస్తున్నాను. ఆ విధంగా రైతులకు పెట్టుబడులు అందుబాటులోకి రావటానికి మీరు చేసిన ప్రయత్నాలు ఏమిటి? క్రెడిట్ ఫెసిలిటీస్ కొరకు మీరు ఏమైనా చొరవ తీసుకున్నారా? అదే విధంగా ఎక్స్‌టెన్షన్స్ పూర్తిగా పోయాయి. అందరం బాధ్యులమే. మేమేదో గొప్పగా చెప్పుకోబోవడం లేదు. మా పీరియడ్‌లో కూడా ఎక్స్‌టెన్షన్స్ ప్రోగ్రామ్స్ ఎంతో జరగవలసి వుండేదే. ఆ పీరియడ్‌లోనూ, అంతకు ముందు నుంచి కూడా మెల్ల మెల్లగా స్లో అయింది. గ్రీన్ రివల్యూషన్ తరువాత సెల్ఫ్ సఫిషియన్సీ వచ్చింది కాబట్టి ఇక సరిపోతుందనే భావనతో పూర్తిగా లెథర్జీ వచ్చి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా రైతాంగానికే వదిలిపెట్టారు. ఆ రైతాంగం ఏదో రకంగా తంటాలు పడి, వారికున్న అనుభంతోనో, స్వతహాగా వచ్చిన పరిజ్ఞానంతోనో ఏదోవిధంగా పంటలు పండించుకోవడం చేస్తున్నారు తప్ప ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రామ్ అనేది పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఆ కమీషన్స్ రిపోర్ట్స్ కూడా ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రామ్స్ ఇంప్రూవ్ చేయండని అంటే చేశామన్నారు కాని ఇంతవరకు నాకు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఫీల్డ్ లెవెల్‌లో పదివేల మంది ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్‌ను వేయమని జయతీ ఘోష్ కమీషన్ రిపోర్టులో స్పష్టంగా చెప్పడం జరిగింది. కాని ఎంతమందిని నియమించారో మంత్రి గారు చెప్పాలి. నాకు తెలిసినంతవరకు ఎక్కడా ఎక్స్‌టెన్షన్ వర్క్ సరిగా జరగడం లేదని మీకు తెలియజేయదలచుకున్నాను. రైతులకు శిక్షణ ఇచ్చేంతవరకు రైతులు ఆగుతారా? ఏదో మా ఖర్మ ఇంతే అనుకొని వాళ్లకు తెలిసిన పద్ధతుల్లో వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటున్నారు.

పూర్తిగా ఒకసారి ఆలోచన చేస్తే, **అగ్రికల్చర్ సెక్టారులో అనేక విధాలైన మార్పులు వస్తున్నాయి. గతంలో మనం గ్రామానికో, రాష్ట్రానికో పరిమితమైన వ్యక్తులం. కాని ఈనాడు ప్రపంచీకరణ జరుగుతోంది. అక్కడ ఎక్కడో కాటన్ పండితే ఇక్కడ మన కాటన్‌కు ధర ఉండదు. బయటి రాష్ట్రాలలో ఎక్కడో మిర్చీకి డిమాండు తగ్గితే మన మిర్చీకి ఇక్కడ రేటు ఉండదు.** మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా, మీ నిర్వాకాల వల్ల, కేంద్రంలో ఎవరున్నా కూడా ఆ రకంగా ఇదంతా అనుసంధానం అయిపోయింది. ప్రపంచ పరిణామాలకు మీరు అతీతంగా ఉంటారని అనుకుంటే అది పొరపాటు. పోటీ ప్రపంచంలో ఫ్లడ్ గేట్స్ ఓపెన్ చేసి, బక్క చిక్కిన రైతును తీసుకొచ్చి ఆ పోటీ ప్రపంచంలో పడేశాం. ఆవిధంగా పోటీ ప్రపంచంలో అతన్ని పడేసినపుడు, తగిన విధంగా మీరు పౌష్టికాహారం ఇవ్వాలి కదా! ఎక్కడ నిలబడతాడు సార్, కనీసం తన కాళ్ల మీద తాను నిలబడలేని పరిస్థితుల్లో వున్న వ్యక్తి, బాగా గుండులా ఉన్న వ్యక్తితో ఎక్కడ పోటీ పడతాడు

సార్? ఈనాడు ప్రపంచంలోని సరుకుల మూవ్‌మెంటుపై రిస్ట్రిక్షన్స్ లేని పరిస్థితుల్లో మీరు సపోర్టింగ్ సిస్టం ఎవాల్వ్ చేస్తే తప్ప ఈ రంగం ముందుకు రాదు. మీరు మోడ్రనైజేషన్ వైపు దృష్టికి కేంద్రీకరించాలి. ఏవిధంగా మీరు మోడ్రనైజేషన్ ప్రోగ్రాములు తీసుకున్నారో ఒకసారి ఆలోచన చేయండి. ప్రభుత్వం నుంచి మార్కెట్ ఇంటర్‌వెన్షన్ చాలా అవసరం. పసుపు ధర గురించి ఈనాడు నిజామాబాదు నుంచి వచ్చిన రైతులు "అయ్యా, ఈనాడు పసుపుకు రూ. 1600 లు రేటుంది రూ. 4000లు వస్తే తప్ప మాకు గిట్టుబాటు కాదు, లేకపోతే ఎకరానికి రూ. 20 వేలు నష్టం వస్తుందని" ఆ రైతులు బయట ఆందోళన చేస్తున్నారు. అధ్యక్షా! నవంబర్ కాగానే పవర్ డిపార్టుమెంటు ఒక ప్రకటన చేస్తుంది, మీరు ఎవ్వరూ కూడా వరి పెట్టొద్దు, పెడితే కరెంటు కట్ చేస్తామని చెబుతున్నారు. ఈనాడు వరి పెట్టకుండా కమర్షియల్ క్రాప్స్ వేస్తే పరిస్థితి ఏమిటో ఒకసారి ఆలోచన చేయమని కోరుతున్నాను. కమర్షియల్ క్రాప్స్ వేసుకుంటే అది ఒక ఏరియాకో, ఒక జిల్లాకో పరిమితమవుతుందా? మొత్తం ప్రపంచీకరణ జరిగిన ఈ పరిస్థితుల్లో, ఆ సరుకులతో ఈ సరుకు ఎక్కడ పోటీ పడుతుందండీ? అలాంటపుడు మీరు తప్పకుండా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పెట్టాలి. ధరల స్థిరీకరణకు నిధి పెడతామని మీ మేనిఫెస్టోలోనే చెప్పారు. ధరల స్థిరీకరణకు వెయ్యి కోట్లు పెట్టకపోతే ఇబ్బందులు వస్తాయని జయతీఘోష్ తన రిపోర్టులో స్పష్టంగా మెన్షన్ చేశారు. పెడతామని మీరు కూడా చెప్పారు. ఏమి పెట్టారు? రోశయ్యగారు స్థిరంగా కనబడుతున్నారు గాని బడ్జెటులో ధరల స్థిరీకరణకు సంబంధించిన అంశం కనబడడం లేదని తెలియజేస్తున్నాను. **మార్కెట్ ఒడిదుడుకుల మూలంగా రైతు తాను పండించిన పత్తిని తీరా మార్కెటుకు తీసుకొచ్చేసరికి ధర ఉండదు. రెండు, మూడు మాసాల్లోనే విపరీతమైన మార్కెటు ఒడిదుడుకులు చోటు చేసుకుంటున్నాయి,** ఒకటి రెండు సంవత్సరాలలో కాదు, రెండు మూడు మాసాల్లోనే ఈవిధంగా ఉంటే ఇక రైతు ఎలా బాగుపడతాడు? కనుక ధరల స్థిరీకరణకు మీరు కేటాయిస్తామన్న నిధులు కేటాయించకుండా మాది రైతు రాజ్యం, మా రాజ్యంలో వ్యవసాయ రంగాన్ని బ్రహ్మాండంగా ముందుకు తీసుకెళుతున్నామంటే ఎవరు నమ్ముతారో ఒకసారి ఆలోచన చేయమని కోరుతున్నాను.

ఇకపోతే అధ్యక్షా! రైతులకు కూడా పావలా వడ్డీకి రుణాలు ఇవ్వాలన్నారు. ఈ క్రెడిట్ కోసం మీరేదైనా ప్రయత్నం చేశారా? ఎన్ని రైతు మిత్ర సంఘాలున్నాయి? మా ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు మిత్ర సంఘాలు కూడా పోతున్నాయి. రైతులకు క్రెడిట్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి మీరు ఏమి ప్రయత్నం చేశారో వివరించాలని కోరుతున్నాను. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన ప్రభుత్వంగా మీరు చరిత్రలో మిగిలిపోతారని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను. ఈ సెక్టారును మీరు పూర్తిగా వదిలేశారు, గ్రామీణ వ్యవస్థను వదిలేశారు. గ్రామీణ వ్యవస్థ వృద్ధి రేటు ఒకసారి చూస్తే, గత సంవత్సరం 11 శాతం వుంటే, ఈ ప్రజెంటు ఇయర్‌లో దాన్ని 10 శాతానికి తగ్గించారు. ఈవెన్ రూరల్ డెవలప్‌మెంటు నిధులు కూడా మీరు తగ్గించారు. ఆర్‌డబ్ల్యుఎస్‌కు తగ్గించారు. ఎంత దుర్మార్గమండీ? తాగునీరు లేక కొన్ని ప్రాంతాలు ఇబ్బంది పడుతున్నాయి, కొన్ని ప్రాంతాలు ఫ్లోరోసిస్‌తో బాధ పడుతున్నాయి. దీనికి సరైన నిధుల కేటాయింపులు చేయాలి. ఈరోజు నీళ్లు తాగుదామంటే రోశయ్యగారు

ఎన్ని వేల లక్షల ఎకరాలకు నీరు అందించారు? 18 ప్రాజెక్టులను 5 సంవత్సరాలలో పూర్తి చేస్తామన్నారు. అల్లాఉద్దీన్ అద్భుత దీపం లాగా చేశారు. ఎక్కడ చూసినా నీళ్లు వస్తాయని ఆ విధంగా కేటాయింపులు చేస్తున్నామని పెద్ద పెద్ద వాగ్దానాలు చేశారు. ఏమైంది? అవినీతితో, అక్రమాలలో మీ డబ్బులు పెంచుకోవడానికి తప్ప నీళ్లు ఎక్కడా రాలేదు కాని ప్రజల అవసరాలు తీరలేదు. మీరు కట్టిన ప్రాజెక్టులు కొన్ని కూలి పోయాయి. కాల్వలు పోతున్నాయి. తోటపల్లి సంగతి చూశాము. ఈ విధమైన అవినీతి అక్రమాలకు నిలయంగా మీ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ మారింది. రోశయ్యగారు అంతా రెవ్యూ చేయాలని కోరుతున్నాను. **కేటాయింపులు చేసి చేతులు దులుపుకోవడం కాదు. ఎక్కడ ఏమి జరుగుతుందో ఆలోచన చేయండి.** గత సంవత్సరంలో రూ.10 వేల కోట్లు అన్నారు. జనవరి వరకు వారు ఇచ్చిన రిపోర్టులో రూ.6120 కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. ఈ నెల ఊరికే ఇస్తున్నారని తెలిసినది. ఏమి ఇస్తారో? మార్చి వచ్చింది కదా ఇరిగేషన్ మినిస్టరుగారు బిజీగా ఉన్నారు. ఇష్టం వచ్చిన బిల్లులు డబ్బులు కేటాయించి ఏదో రకంగా పని అయిపోయిందని అనిపించుకుంటున్నారు. ఈ ప్రభుత్వానికి డబ్బులు కేటాయించి ఏదోరకంగా పని అయిపోయిందని అనిపించుకుంటున్నారు. ఈ ప్రభుత్వానికి డబ్బులు ఖర్చు పెట్టిందని అనిపించుకోవాలని తప్ప ఇంకొకటి కాదు. దాని మీద ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి ఫలితాలు ఎలా వచ్చాయన్న దాని మీద శ్రద్ధ లేదు. ఇరిగేషన్‌కు రూ.10 వేల కోట్లు ఖర్చు పెడతామని అన్నారు. ఒక స్టేట్‌మెంట్ కూడా చేసింది. మార్చి లోపల రూ.6400 కోట్లు ఈ నెల రోజులలో ఎక్కడ పడితే అక్కడ రిలీజ్ చేస్తారు. రిలీజ్ చేసి అయిపోయాయని అంటారు. ముందు వేల కోట్ల రూపాయలు అడ్వాన్సులు ఇచ్చారు. మేము అబ్జక్షన్ చేస్తే మమ్ములను అనేక విధాలుగా మాట్లాడారు. తరువాత రికవరీ కోసం తీసుకున్న వాడు ఎక్కడికి వెళ్లాడో తెలియదు. వాడు బొంబాయిలో, ఢిల్లీలో, హైదరాబాదులో, వైజాగ్‌లో భూములు తక్కువ ఉంటే కొనడానికి వెళ్లాడు. వీరు అతనెక్కడుంటాడని వెతుకుతున్నారు. రికవరీ కోసం విజిలెన్సు వారిని పంపించడం జరిగింది. వెతికినా దొరకలేదు. అదే పద్ధతిలో ఖర్చు అవ్వాలని భూసేకరణకు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలకు కొంత రిలీజ్ చేస్తున్నారు తప్ప సిన్సియర్‌గా పనులు జరగడం లేదు. మొత్తం మీద నీళ్లు తెచ్చే కార్యక్రమం చేయడం లేదు. దీని మీద ప్రభుత్వానికి సిన్సియారిటీ లేదు. అది ఒక సోర్సుగా, అవినీతి అక్రమాలకు ఇరిగేషన్ ప్రాజెక్టు పేరు చెప్పి ఘన కార్యం చేస్తున్నామని చెబుతున్నారు. ఇరిగేషన్ శాఖ మొత్తాన్ని గందరగోళంలో పడవేసి మనం ఇచ్చిన కేటాయింపులన్నీ తిని వేయడానికి కేటాయించారు తప్ప పనులు చేయడానికి కాదు.

ఒకసారి ఆలోచన చేయండి. మేజర్ కాంట్రాక్టర్ అవినీతి భాగోతం నిన్న ఒక మిత్రుడు నాకు చెప్పాడు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి డ్యాం రాకముందే కాల్వలు తవ్విన ఘనచరిత్ర మీది. ప్రపంచ వింతలు ఏడుగా యిప్పటివరకు డిసైడ్ చేశారు. ఎనిమిదవ వింత ఆంధ్రప్రదేశ్‌లో వుందని ప్రపంచానికి చెప్పవచ్చు. డ్యాం రాకుండా కాల్వలు తవ్విన ఘన చరిత్ర వున్న ప్రభుత్వం యిది. దీనికి కారణం డబ్బు, కమిషన్ వస్తుందని చేశారు. రూ.126 క్యూబిక్ మీటర్‌కు యిస్తున్నారు. సబ్ కాంట్రాక్టర్ దగ్గరకు వచ్చేవరకు రూ.50లో పనులు చేయిస్తున్నారు. ఫీల్డ్‌కు పొమ్మనండి. కావాలంటే ఈ రోజు పోదాము. అల్ పార్టీ కమిటీ వేయండి. ఎవరికి కాంట్రాక్ట్ యిచ్చారు? ఒక

కాంట్రాక్టర్ మరొక సబ్ కాంట్రాక్టర్‌కు, అతను మరొకరికి ఈ విధంగా అంచెలంచెలుగా యిచ్చారు. ఈ విధంగా 60 శాతం వరకు ఫండ్స్ మిస్‌యూజ్ అవుతున్నాయి. నేను ఈ విషయం నిరూపిస్తానని ఛాలెంజ్ చేస్తున్నాను.

రూ. 13,000 కోట్లు కావాలని రోశయ్యగారు అడుగుతున్నారు. కానీ వారు ఖర్చు చేయబోయేది రూ. 6000 కోట్ల కంటే ఎక్కువ వుండదు. రూ. 7000 కోట్లు భోంచేయబోతున్నారు. మీరు మీ పెద్దలు భోంచేయడానికి మమ్మలను ఆమోదించవలసిందిగా కోరుతూ మా ముందుకు రావడం ఎంతవరకు సమంజసమో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. ఈవిధంగా అవినీతి, అక్రమాలతో నిండిపోయింది. మొన్న కల్వకుర్తి గురించి జనార్ధనరెడ్డి ప్రశ్న వేశారు. మంత్రిగారు అంటారు 'ఎక్కడి నుండి తెచ్చావో కాగితం, ఆ కాగితం పంపిస్తే చెబుతాను' అని. ఇపిసిలో ఒకేసారి కాంట్రాక్టర్‌కు రేట్స్ డిసైడ్ చేస్తారు, మరొకసారి రేట్స్ డిసైడ్ చేయడం వుండదు. కాంట్రాక్ట్ లోపల ఒక క్లాజ్ పెట్టారు. ఇపిసి గురించి అనుభవం వున్న వారిని అడగండి. ఫైనల్‌గా అడిట్ అబ్జెక్షన్‌లో యిదంతా రెయిజ్ చేసినా వీరు పట్టించుకోవడం లేదు. స్టీల్ ధరలు, సిమెంట్ ధరలు, ఫ్యూయల్ అన్నీ పెంచుకుంటూ పోతున్నారు. రూ. 50 వేల కోట్లు కాదు, లక్షల కోట్లు దాటిపోతోంది. స్టార్ట్ చేసిన వాటికే, మహానుభావులు వున్న డబ్బు రెండేళ్లలో తినివేశారు. కల్వకుర్తిలో సర్జ్‌పూల్ కోసం రెండు వేల క్యూబిక్ మీటర్స్ సైజ్ తక్కువ చేసి డబ్బు వాపస్ చేయడం యిష్టం లేక డబ్బు ఎడ్జస్ట్ చేస్తామని అన్నారు. ఒక్క క్యూబిక్ మీటర్‌కు ఆవిధంగా డబ్బు కొట్టేస్తూ వుంటే ప్రభుత్వం ఏమి చేస్తోంది? అసలు ప్రభుత్వం వుందా? రోశయ్యగారు రూ. 13 వేల కోట్లకు చెక్ వ్రాసి శాసనసభ ఆమోదం చేస్తే, మీరు ఆ చెక్ కాంట్రాక్టర్స్‌కు యిస్తే, వారు అది పంచుకుంటారు. దమ్మున్నవారు ఎక్కువ తింటారు. వారే బిల్ చేసుకుంటారు. శక్తి, అధికారం వున్న వారు వారే చెక్స్ వ్రాసుకొని తినాలి. మంత్రిగారు వున్నారా? ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం వుందా? ప్రభుత్వంలో చెక్ చేసే వారు, చూసే వారు వున్నారా? నిలువు దోపిడీ చేసుకుంటూ, ఆ దోపిడీకి మమ్మలను సహకరించండి అని, యింకా రూ. 13 వేల కోట్లకు ఆమోదం యివ్వండి అని మాట్లాడుతూ వుంటే, మేము ఏవిధంగా అంగీకరించాలో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను. కల్వకుర్తి లిఫ్ట్ -2 లో ఇ అండ్ యం.యం ఎక్విప్‌మెంట్ కొరకు రూ. 164 కోట్లకు అగ్రిమెంట్ అయినారు. టెండర్ టైమ్‌లో ఎగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పుడు రివిజన్ అని చెప్పి ఇ అండ్ యంయం ఎక్విప్‌మెంట్ రూ. 231 కోట్లు చేసుకున్నారు. మేము అడిగితే మీకు ఎక్కడి నుండి వచ్చిందని అన్నారు. రైట్ టు యిన్‌ఫర్‌మేషన్ క్రింద మీ డిపార్ట్‌మెంట్ యిచ్చిన సమాచారం తీసుకొని శాసనసభలో ప్రశ్నిస్తే ' ఎప్పుడూ యిటువంటి మాటలే మాట్లాడతారు' అంటూ దబాయిస్తారు. మీరు ఇచ్చిన యిన్‌ఫర్మేషన్ ప్రకారమే పెంచారండీ అంటే ఏవిధంగా జరిగిందనేది వివరణ యివ్వవలసిన ప్రభుత్వం ఆ విధంగా చేయకపోగా ఎదురుదాడికి దిగుతున్నారు. దబాయించి మా నోళ్లు మూయించి, ఈ సభలో సంఖ్యాబలం వుంది కాబట్టి, చప్పట్లు కొట్టే వారిని జమ చేసుకొని, వారు చప్పట్లు కొడుతూ వుంటే ఈవిధంగా రాష్ట్రంలో మీరు, మీ శాసనసభ్యులు దోపిడీ చేస్తున్నారు. ఈనాడు ఈ శాసనసభ పాస్ చేయకపోతే ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. రూ. 81 వేల కోట్లు ఈ బడ్జెట్ సమావేశాల్లో

పాస్ చేస్తే తప్ప పాస్ కాదు. అందువల్ల బడ్జెట్ గురించి చదవండి, తెలుసుకోండి. పద్దులకు ఎలా కేటాయిస్తున్నారో, ఎలా ఖర్చు చేస్తున్నారో గమనించండి. ఒకటా, రెండా, వేల కోట్ల రూపాయలు లూటీ అవుతున్నాయి. దానిని కాపాడుకోవడానికి మీ పార్టీలో మీలో మీరైనా మాట్లాడుకోవాలని గౌరవ సభ్యులకు తెలియజేశాను. ఇది ఓపెన్ లూటీ. ప్రభుత్వం చేస్తున్న దోపిడీ. రూ. 5, రూ. 10 దొంగతనం చేస్తే జైల్లో పెడతారు. ప్రభుత్వం చేసే వేల కోట్ల రూపాయల దోపిడీకి ఏమి శిక్ష వేయాలో తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

కేటాయింపులు ఒక భాగం కాగా, యిరిగేషన్ మరొక భాగం. ఇరిగేషన్ సెక్టార్ అంతా టోటల్‌గా ముఖ్యమంత్రిగారి అనుసంధానంలో వుంటుంది. ఆయనే ఆర్కిటెక్ట్. ఆయనే ప్లానర్, ఆయనే కన్‌స్ట్రక్టర్, ప్రతిదీ ఆయనే రాష్ట్రంలో. ఇపిసి అంటే టోటల్‌గా రాజశేఖర రెడ్డి ఆలోచనా విధానం, ఆయన ఏదంటే అదే యిరిగేషన్ పాలసీ. ఈ రాష్ట్రంలో ఏ ఇంజనీర్ లేడు. డిజైన్ యిచ్చేవారు, ఎగ్జిక్యూట్ చేసే వారు లేరు. కాంట్రాక్టర్స్ ముఖ్యమంత్రి ఏది చెబితే అది చేయడం, ముఖ్యమంత్రి చెప్పిన రేటుకు తీసుకోవడం, ఏ పని చేబితే ఆ పని చేయడం తప్ప ఈ రాష్ట్రంలో ఏ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ లేదని తెలియజేస్తున్నాను.

మన రాష్ట్రంలో 2764 టియంసిల నీరు అందుబాటులో వుంది. మొత్తం భారత దేశంలో ఈవిధంగా 2764 టియంసి నీరు లభ్యంగా వున్న పెద్ద రాష్ట్రాలలో మనది ముఖ్య రాష్ట్రం. భగవంతుని దయవల్ల, గోదావరి , కృష్ణా, పెన్నా జీవనదులు మనకు వున్నాయి. దాని ఫలితంగా 2764 టియంసి నీరు మనకు అందుబాటులో వుంది. ఇందులో 1480 టియంసి నీటి లభ్యత, ఎలకేషన్ గోదావరిలో మనకు వుంది. 811 టియంసి నీటి ఎలకేషన్ కృష్ణలో వుంది. కృష్ణా నదిపై యించుమించు చాలావరకు మనం ప్రాజెక్టులు చేపట్టాము. అక్కడ నీటి లభ్యత లేదు. సర్‌ప్లస్ వాటర్‌పై కూడా ప్రాజెక్టులు కట్టుకుంటున్నాము. మేము కొన్ని మొదలుపెట్టాము, మీరు కొన్ని మొదలుపెట్టారు. ఆ విధంగా ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. వీటి గురించి ఆలోచన చేయాలి. గోదావరి ద్వారా వున్న 1480 టియంసి నీటి లభ్యతలో యింతవరకు మనం వాడుకున్నది సగం నీరు మాత్రమే. మిగతా సగం గోదావరి నీరు సముద్రం పాలవుతోంది. గోదావరి ప్రవాహం బ్రహ్మాండంగా నిజామాబాద్ నుండి మొదలై తూర్పు గోదావరి వరకు పారుతూ, పుష్కలంగా నీటిని కలిగి వుంది. ప్రతిసారి గోదావరికి వరదలు వస్తూ వుంటాయి. గోదావరి నీటిని సద్వినియోగం చేయడం కోసం గోదావరి వాటర్ అథారిటీ ఒక దానిని ఏర్పాటు చేశాము. సర్వే జరిగింది. మిత్రులు షబ్బీర్ సభలో లేరు. ఆయన నిన్న ఒక స్టేట్‌మెంట్ యిచ్చారు. దేవేందర్ గౌడ్‌కి ఏమి తెలుసు? నీటి గురించి ఏమీ తెలియదు. ప్రాణహిత పేరు, అడ్రెస్ చెప్పమనండి అని అన్నారు. వారు సభలో వుంటే అడ్రెస్ గురించి అడుగుతాను. గోదావరి వాటర్ అథారిటీలో నేను కూడా సభ్యుడిని. గౌరవ ముఖ్యమంత్రిగారు ఛైర్మన్‌గా మేమంతా సభ్యులుగా వున్నాము. టోటల్ ఎవైలబిలిటీ ఆఫ్ వాటర్, దాన్ని ఎలా ఇయర్‌మార్క్ చేయాలి, ఎట్లా ప్రాజెక్ట్‌లు చేపట్టాలనే అంశంపై ఆనాడు ఐడెంటిఫై కూడా చేశాము. దానిలో అంతర్భాగంగా చాలా ప్రాజెక్టులు, గుత్పా, అలీసాగర్ మొదలైనవి చేపట్టడం కూడా జరిగింది. నిజాంసాగర్ నిజామాబాదులో

ఎండిపోయింది. నిజాంసాగర్ ఆయకట్టుకు నీరు యివ్వాలని గుత్పా, అలీసాగర్‌లను, శ్రీరాంసాగర్ నుండి ఎత్తిపోతల ద్వారా యిచ్చే విధంగా చేపట్టడం జరిగింది. తరువాత ఫ్లడ్ ఫ్లో కెనాల్ తీసుకున్నాము.

ఆ తరువాత క్రిందకు వస్తే ఎల్లంపల్లి, దీనికి సంబంధించి డిటెయిల్డ్ యిన్వెస్టిగేషన్ జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత టెండర్స్‌ను కాల్‌ఫర్ చేయడం జరిగింది. వర్క్ మొదలయిందని చెబుతున్నారు. ఇచ్చంపల్లికి సంబంధించి యింటర్ స్టేట్ డిస్‌ప్యూట్స్ వున్నందున, వెయిట్ చేయడం కంటే ఎత్తిపోతల ద్వారా చేసుకోవడం మంచిదని ఎత్తిపోతల పథకాలు మొదలుపెట్టాము. అది సక్సెస్ అయినాక కాన్ఫిడెన్స్ వచ్చి దేవాదుల మొదలు పెట్టాము. గోదావరి పైన కొన్ని ప్రాజెక్టులు మొదలుపెట్టాము. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వున్న పనులు స్పీడప్ చేస్తుందని భావించాము. ఉన్న నిధులలో నూటికి 50 శాతం ఇరిగేషన్ సెక్టార్‌కు మలుపుతున్నారు. మేజర్ షేర్ ఇరిగేషన్ సెక్టార్‌కు పోతున్నందున మేము కొన్ని ఎక్స్‌పెక్ట్ చేశాము. కానీ ఏమి చేస్తున్నారు వీరు? ఈనాడు గోదావరి బెల్ట్‌లో వున్న వెనుకబడిన తెలంగాణా జిల్లాల పరిస్థితి ఏమిటి? గోదావరి నీరు తీసుకురావడానికి వారు చేస్తున్న కార్యక్రమం ఏమిటో మంత్రిగారు చెప్పి వుంటే సంతోషించే వారము. ఈనాడు జరుగుతున్న పనులను రెవ్యూ చేస్తే ఒక విషయం బోధ పడుతుంది. గుత్పా, అలీసాగర్ మేము మొదలు పెడితే యింతవరకు అతీ లేదు, గతీ లేదు. అప్పటికే చాలా పనులు అయినాయి, ఎప్పుడో పూర్తి కావలసిన పని. ఇప్పటికీ ఈ ప్రభుత్వం గుత్పా, అలీసాగర్‌లను కంప్లీట్ చేయలేదు. పైన **మహారాష్ట్రలో బాబ్లీ బ్రహ్మాండంగా పని చేస్తోంది. బాబ్లీ ప్రాజెక్టును కడుతున్నారని మేమంటే, యిదే ఇరిగేషన్ శాఖ మంత్రిగారు, కాంగ్రెస్ పార్టీ వారు 'తెలుగుదేశం వారికి పనీ, పాట లేదు. వారు చెక్ డ్యామ్ కడుతూ వుంటే, బాబ్లీ వల్ల ఏదో పుట్టి మునుగుతుందని చెబుతున్నారు' అని అన్నారు.** ఇది గుడ్డి ప్రభుత్వం, బాధ్యత లేని ప్రభుత్వం అని మా ఎం.ఎల్.ఏ.లం అందరం బస్ వేసుకొని బాబ్లీ దగ్గరకు పోయినాము. అక్కడ గొడవ కూడా జరిగింది. అయినా భయపడకుండా బాబ్లీకి పోయి ఫోటోస్ తీసి, వీడియో కాపీస్ చేసి ముఖ్యమంత్రిగారి దగ్గరకు వెళ్లాము. పర్సనల్‌గా ముఖ్యమంత్రిని కలిశాము. ముఖ్యమంత్రిగారూ, మేము రాజకీయం చేయవలసిన అవసరం లేదు. ఇది తెలంగాణాకు కొంతమేరకైనా నీరు అందిస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సమస్య. వారు బ్రహ్మాండంగా కడుతున్నారు. బాబ్లీకి సంబంధించి శ్రద్ధ తీసుకోండి, ఆ ప్రభుత్వాన్ని అడగండి అని వారికి ఫోటోస్ కూడా యిచ్చాము. వారు నిలుపుదల చేయిస్తాము అంటే మేము నమ్మాము. మన రాష్ట్రంలో, కేంద్రంలో, మహ రాష్ట్రలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే వున్నాయి. కాబట్టి నిలుపుదల చేయిస్తారేమో అనుకున్నాము. ఎంత దుర్మార్గం అంటే, శ్రీరాంసాగర్ క్రింద కాంపెన్‌సేషన్ యిచ్చిన ఏరియాలో వారు ప్రాజెక్టు కడుతూ వుంటే ఈ ప్రభుత్వం కళ్లు మూసుకొని వుంది. ఈనాడు ఆ ప్రాజెక్టు పూర్తి అయింది. నిన్న సుప్రీంకోర్టు జడ్జ్‌మెంట్ సందర్భంగా, స్టే కావాలని అడగడానికి భయపడుతూ నిలబడ్డారు. వారు స్టే యివ్వము అని చెప్పారు. బాబ్లీ కంప్లీట్ అయ్యింది. ఏ కొద్దిగా మిగిలి వున్నా కంప్లీట్ చేస్తున్నారు. బాబ్లీ తరువాత శ్రీరాంసాగర్ పరిస్థితి ఏమిటి? మహారాష్ట్ర లోని బాబ్లీ 60 టియంసి నీటి కోసం కడుతున్నారు. శ్రీరాంసాగర్

90 టియంసి, అందులో 60 టియంసి పోతే శ్రీరాంసాగర్ పరిస్థితి ఏమిటి? శ్రీరాంసాగర్ ఎండిపోయిన తరువాత తెలంగాణా పరిస్థితి ఎలా వుంటుందో ఆలోచన చేయవలసిందిగా కోరుతున్నాను.

బాబ్లీ పైన ప్రాజెక్ట్ కట్టిన తరువాత ఫ్లడ్ ఫ్లో కెనాల్ పరిస్థితి ఏమిటి? దానికి నీరు ఎక్కడిది? శ్రీరాంసాగర్‌కే నీరు లేనప్పుడు ఫ్లడ్ ఫ్లో కెనాల్‌కు ఎక్కడి నుండి వస్తుంది? క్రిందికి వస్తే ఫేజ్-2, యస్ఆర్‌యస్‌పి కాల్వల తవ్వకాలు నడుస్తున్నాయి. ఫేజ్-2 కి నీరు ఎక్కడిది? ఫేజ్-2 కి నీరు ఎక్కడిదో చెబితే నేను నా ఉపన్యాసం బంద్ చేస్తాను. యస్ఆర్‌యస్‌పి ఫేజ్-2 కి ఫలానా చోటి నుండి నీరు యిస్తామని చెప్పమనండి. అక్కడక్కడ కూడా నీరు లేదు. ఆనాడు ఎల్లంపల్లి మొదలు పెట్టవలసిందిగా మేము చెప్పాము. 63 టియంసి నీరు ఎలకేషన్ వుంది కనుక యిబ్బంది లేదు. సర్‌ప్లస్ కాదు, ఎస్యూర్డ్ వాటర్ వున్నందున చేపట్టాలని మేము అడిగితే 12 టియంసి కొరకు వర్క్ మొదలుపెట్టారు. కాల్వలు లేవు, కాల్వలు లేని ఎల్లంపల్లి. మేము శాసనసభలో మాట్లాడినప్పుడు వెళ్లి చూసిరండని చెబితే, వెళ్లి చూస్తే ' ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా వుంది ఎల్లంపల్లి. ఎల్లంపల్లికి సంబంధించి 63 టియంసి నుండి 120 టియంసి చేసి కట్టాలని అడిగితే, వారు యన్‌టిపిసికి నీరు యివ్వడం కోసం చేస్తున్న ప్రయత్నం తప్ప మరొకటి కనిపించడంలేదు. ఈ ప్రాంతానికి నీరు యిచ్చే చిత్తశుద్ధి వారికి లేదు. రూ. 100 కోట్లు కొట్టేశారు. ఎల్లంపల్లి మీద డిబేట్ చేసి మేము గట్టిగా వాదిస్తే, వారు రకరకాలుగా మాట్లాడారు. లోకాయుక్త మీ వారికి నోటీసులు యిచ్చింది. మీరు చేతులు కట్టుకొని వారి ముందు నిలబడ్డారు. లోకాయుక్త ఏమి చెప్పింది?

కిరణ్‌కుమార్ గారు, యిక ఈ ఆర్గ్యుమెంట్‌లో పస లేదు. చాలా ఆర్గ్యుమెంట్స్ చేశారు. అందులో దమ్ము, పస లేదమ్మా. దాని గురించి ఎక్కువ అనవద్దు. మీరు మసిపూసి, మారేడు కాయ చేసే పద్ధతిని అవలంభించినా ఖచ్చితంగా తప్పు చేశారని లోకాయుక్త ప్రిలిమినరీగా రుజువు చేసింది. రూ.400 కోట్లు తిన్నారు అని చెప్పి నోటీసులు యిచ్చి ఎక్స్‌ప్లనేషన్ అడగడం జరిగింది. అందులో ప్రైమా ఫేసీ వున్నట్లుగా వారు నిర్ధారణకు రాకపోతే మీ ఆఫీసు వారికి నోటీసు ఎందుకు యిస్తారు? You must know . మీకు తెలిసే వుంటుంది. వారు నిర్ధారణకు వచ్చారు. మీరు లోకాయుక్తలో తప్పించుకున్నా, హైకోర్టు, సుప్రీం కోర్టు వున్నాయి. న్యాయస్థానాల్లో యిదే ఎల్లంపల్లి వల్ల రెండు సంవత్సరాల్లో మీకు ఉరి పడకపోదు, నేను చూస్తాను. ఎల్లంపల్లిలో రూ.400 కోట్లు తిన్నారు, తిన్నారు, తిన్నారు, ఈ మాట వందసార్లు అంటాను. ఖచ్చితంగా నిరూపించి తీరతాను ఎక్కడైనా సరే. మీరు తప్పించుకోలేరు. మీకు భజనపరులు వున్నందున మా నోళ్లు మూయించగలరేమో గాని అల్టిమేట్‌గా తప్పకుండా మీరు దానికి మూల్యం చెల్లించక తప్పదు. దేవాదులకు 12.5 టియంసి నీరు కేటాయించారు. 50 టియంసి నుండి 12.5 టియంసికి నీరు తగ్గించారు. ఈ విధంగా చేస్తే గోదావరిలో 1480 టియంసి నీరు ఎలకేషన్ వున్నా ఈ ప్రాంతానికి నీరు రాదు. ప్రతి ఒక్క ఎకరా భూమికి నీరు యిస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారు.

తెలంగాణాలోని ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని ముఖ్యమంత్రిగారు చెప్పారు. గొప్పలు మాత్రమే చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఇరిగేషన్ శాఖామంత్రిగారు సభలోకి వచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా మినహా మిగతా తెలంగాణా ప్రాంతానికి గోదావరి నీరు ఇవ్వడానికి అవకాశముంది. నీరు పుష్కలంగా ఉన్న నది గోదావరి. ఇప్పటికీ కేటాయింపులకు పోను మిగులు జలాలున్న నది. 12 టీఎంసీలతో మీరు చేపట్టిన ఎల్లంపల్లి గానీ, 12.5 టీఎంసీలతో చేపట్టిన దేవాదుల గానీ మొత్తం 24 టీఎంసీలతో తెలంగాణాలోని ప్రతి ఎకరాకు ఎలా నీరిస్తారో దయచేసి వివరిస్తే మేం నిజంగా చెవుల్లో పూలు పెట్టుకొని వింటాం. కాబట్టి మీరు నీరు ఏవిధంగా ఇస్తారో చెప్పాల్సిందిగా కోరుతున్నాను. ఈనాడు వీరు చేపడుతున్న కార్యక్రమాలను చూస్తే గుత్ప-అలీ సాగర్ గురించి కొత్తగా నీటి వనరులు ఏమైనా క్రియేట్ చేస్తున్నామా? మనకున్న వనరుల నుంచే నిజామాబాదు జిల్లాకు ఇస్తున్నాం. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా ఫ్లడ్ ఫ్లో కెనాల్ పరిస్థితి అందరికీ తెలుసు. శ్రీరాంసాగర్‌ను ఎండ పెడుతున్నారు. అటువంటి కార్యక్రమాలు మీరు చేస్తున్నారు. మీకు ఇంక ఫ్లడ్ ఫ్లో కెనాల్‌కు నీరెలా వస్తుంది? దిగువ ప్రాంతంలో ఏ ప్రాజెక్టు నిర్మించి నీరు ఇస్తారో? మేం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టాలని కోరాం. అప్పుడు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ వారు ఇచ్చిన రిపోర్టును స్పీకర్‌గారికి అందజేశాం. వారు తీసుకొని చూసి బ్రహ్మాండంగా ఉందని చెప్పి, ఇది మా ఆలోచనా విధానంలో పుట్టిందని చెప్పారు. మీ ఆలోచనలైనా, మా ఆలోచనలైనా మాకు అభ్యంతరం లేదు. ప్రాణహిత నీరు వస్తే ఫ్లడ్ ఫ్లో కెనాల్ రాదు.

అధ్యక్షా! ఇంతకంటే అన్యాయం ఇంకేమి లేదు. ఆరోజు ప్రశ్నోత్తరాలు జరుగుతున్నప్పుడు నేను కూడా ఉన్నాను. నేను ఇంతకు ముందే చెప్పాను. ఆ సమయంలో మంత్రిగారు సభలో లేరు. మా పార్టీ శాసనసభ్యులు రేట్ల పెంపు పై అడిగారు. ఒకేసారి 164 కోట్ల రూపాయల నుంచి 231 కోట్ల రూపాయలకు పెంచి ఒకే రాత్రి తినేశారు. ఇప్పుడు కాగితం గురించి చెబుతున్నారు. మేం ఆ కాగితాన్ని రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ కింద తీసుకొచ్చినదే. ఆ కాగితం ఎవరో ఇవ్వలేదు, ప్రభుత్వం వారిచ్చిన కాగితమే. వారికి స్పీకర్‌గారి ద్వారా పంపించాం. వారికి చూసే, వినే, చదివే ఓపికలేదు. కాంట్రాక్టులు, బిల్లులు వీటితోనే బిజీగా ఉన్నారు. అడ్వాన్సులు, బిల్లులు ఎందుకంటే మార్చి వస్తోంది కదా.

అధ్యక్షా! అయిపోయింది నా టైం కాదు అధ్యక్షా, మంత్రిగారిది, మంత్రివర్గానిది, ప్రభుత్వానిది టైం అయిపోయింది. ఆల్రెడీ వారికి డేంజర్ బెల్స్ కొడుతున్నాయి. వారేమి చెబుతారో నేను ఎక్స్‌పెక్ట్ చేయను. మంత్రిగారు చాలా మాట్లాడారు. స్లడ్జ్ పూల్ తవ్వడానికి కల్వకుర్తి లిఫ్ట్ పథకం-3 లో మొదట అనుకొన్న ప్రకారం రెండు వందల ఎనభై రూపాయల నుంచి హార్డ్ రాక్ వలన హెవీ వర్క్ ఉన్నదని ఇప్పుడు రెండు వందల రూపాయలు ఇస్తున్నారు. ఈ ప్రాంతానికి నీరు రావాలంటే ప్రాణహితకంటే వేరే గత్యంతరం లేదు. దాని కొరకు మేం పాదయాత్ర చేస్తూ బయలుదేరాం. ఆ విషయమై మేం ఇక్కడ సభలో కూడా చెప్పాం. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ నుంచి ఇంజనీర్లు కూడా వచ్చారు. మేం అనేక విధాలుగా మాకున్నటువంటి ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా ఉద్యమాలు చేపట్టి ముందుకు పోతూ ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా మేం

పాదయాత్ర చేశాం. ఆ సందర్భంలో ఈ మంత్రిగారు మా వెనకాల శుద్ధి యాత్ర ప్రారంభించారు. ఆ విధంగా శుద్ధి కార్యక్రమాలు చేసే సమయంలో మేం ప్రాణహిత చేపడుతుంటే మీకెందుకభ్యంతరమని మమ్మల్ని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టు గురించి ఇంతవరకు కనీసం సర్వే కార్యక్రమం అయినా నిర్వహించారా? మీరు సర్వే కూడా నిర్వహించలేదు. ఇదెంత దుర్మార్గం. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణితో నీరులేని ప్రాజెక్టులు వెనుకబడిన తెలంగాణాలో చేపడతారా? ఈ ప్రాజెక్టులకు పర్మిషన్లు వచ్చి ఈ ప్రాంతానికి నీరు వస్తుందా?

మీకు మొత్తం పూర్తిగా ఫైనాన్స్ వస్తుందా అక్కడ నుంచి? ఈ రోజు మనకు వచ్చే గోదావరి వాటర్ తీసుకు రావడానికి అవకాశం ఉన్నా ఆ ప్రాజెక్టు చేపట్టమంటే మాత్రం చేపట్టకుండా కుంటిసాకులు చెప్పి పక్కన పెడుతున్నారు. ఏదో ఒక రకంగా ఈ ప్రాంతంలో ఖర్చు అయిపోతున్నది అన్నట్లు, నేను ఇంతకు ముందు చెప్పినట్లు ఈ ఎల్లంపల్లిలో తినేయడానికి లేదా మీకు ఉన్న ప్రాజెక్టులలో డబ్బు తినేయడానికి ఈ డబ్బు ఖర్చు పెడుతున్నారు తప్ప రెండవది లేదు. ఎంతో బాధాకరమైన విషయం. ఈరోజు మొత్తం 7,8 జిల్లాల్లో అక్కడ నీళ్లు లేని పరిస్థితి ఉంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో దగ్గర పోతుంటే మేము ఆ రోజు పాదయాత్ర చేసినప్పుడు చూశాము. బహుశా ముఖ్యమంత్రి గారు కూడా ఆరోజు అపోజిషన్ లీడర్‌గా వారూ పాదయాత్ర చేశారు. అప్పుడు వారు కూడా చాలా విషయాలు తెలుసుకున్నారు. తెలుసుకున్న తరువాత వారు ఎంతో మార్పులు తెస్తారని మేము అనుకున్నాము. ఒక విలేజ్‌లో ఒక ఇంటికి పోయాము. ఎంతో బాధాకరమైన విషయం వారు చెప్పారు. నేను అప్పర్ మానేరు ఏడాది లోపట నింపేస్తాను అని ఇదే రాజశేఖర రెడ్డి గారు ఆ రోజులలో చెప్పారని అక్కడ ప్రజలు చెప్పినారు. అయితే ఊర్లలోకి పోతే సగం ఊళ్లు లేవు. మీరు ఈ రోజు చేపట్ట లేకపోతిరి అని మమ్ములను కూడా సమన్ చేశారు. నేను ఒప్పుకున్నాను ఆ విషయం కూడా. ఈ ప్రభుత్వం వచ్చింది. వేల కోట్లు మాట్లాడుతున్నది. **మాకు గ్రామాలలో ఇప్పటికీ నీళ్లు లేవు. ఒక ఇంటి దగ్గరకు పోతే తాళం ఉంది. ఎక్కడకు పోయారు అంటే ఆ తల్లి చెబుతోంది. కొడుకు బొగ్గు బావి దగ్గరకు పోయాడంట. ఇంకో ఇంటికి పోతే ముంబాయ్ పోయే. ఇంకో ఇంటికి పోతే దుబాయ్ పోయే. ఈ బావుల చుట్టూ తిరుగుకుంటూ బావులలో పడుకుంటూ ఉన్నటువంటి ఈ పరిస్థితి ఉన్న ప్రాంతాలలో నీళ్లేమో గోదావరి పక్కకు పోతోంది.** ఆ గోదావరి వాటర్ తీసుకు రావడానికి ఈ బడ్జెట్‌లో సగం బడ్జెట్ కేటాయింపులు చేసుకున్నటు వంటి మీ ప్రభుత్వం మీరు గోదావరి పైన ప్రాజెక్టులు చేపట్టకుండా ఏ విధంగా నిర్లక్ష్యం చేస్తున్నారో ఇప్పటికీ మీరు ఇంకా ఏ విధంగా మోసం చేయాలని చూస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు. తప్పనిసరిగా తగిన విధంగా మీకు బుద్ధి చెబుతారని చెప్పి మీకు తెలియ చేస్తున్నాను. మనకు గోదావరి పరిస్థితి ఆ విధంగా ఉంది.

ఇప్పటికి కూడా ఇంకో బాధాకరమైన విషయం ఏమంటే – ఒకవైపు ఉన్నటువంటి ప్రాణహితకు సర్వే జరగడంలేదు. రెండవ వైపు మాత్రం దుమ్ముగూడెం ద్వారా మొత్తం టైల్ పాయింట్ వరకు నీళ్లు తీసుకుపోవాలని చెప్పి ఈ గోదావరి నీళ్లు మలపడానికి మాత్రం సర్వే బ్రహ్మాండంగా చేయిస్తున్నారు. ఇది ఎంత దుర్మార్గం అధ్యక్షా? ఈ పరీవాహక ప్రాంతంలో

నీళ్లు ఇవ్వకుండా, మీరు వెనుకబడ్డ ప్రాంతంలో నీళ్లు ఇవ్వకుండా మీరు ఏదో విధంగా మసిపూసి మారేడు కాయ చేసి 24 టిఎమ్‌సిలతో ప్రతి ఎకరానికి నీరు ఇస్తామని చెప్పుకుంటూ మోసం చేసుకుంటూ రెండవ వైపు గోదావరి నుంచి నీళ్లు మలుపుకుపోయే ప్రయత్నం ఏదైతే చేస్తున్నారో ఈ పరిస్థితి చాలా దుర్మార్గమైన పరిస్థితి. ఈ పరిస్థితి ఇప్పటికైనా ప్రభుత్వం మానుకోవాలి. ఉన్న దుమ్ముగూడెం స్టార్ట్ చేయండి. దానిని మీరు తెచ్చి ఖమ్మం జిల్లాకు నీళ్లు ఇవ్వాలి. గోదావరి వాటర్‌ను ముందు ఈ పరీవాహక ప్రాంతానికి ఇవ్వకుండా మలుపుకుపోయే ప్రయత్నం ఏది చేసినా మేము ఒప్పుకునే పరిస్థితి లేదు. ఇంకా ఉద్యమం ఉధృతం అవుతుంది. మీరు ఏదో నవ్వులాట క్రింద అనుకుంటున్నారు. ఉద్యమం ఉధృతం చేసి ఈ ప్రభుత్వం పైన తప్పని సరిగా తగిన విధంగా చేస్తాము. ఎన్నికలు రాక తప్పదు.

కృష్ణా వాటర్‌కు వచ్చినట్లయితే కృష్ణ పైన మేము చెప్పినట్లు ఉన్న నీళ్లు అందరమూ వాడుకున్నాము. ప్రాజెక్టులు చేపట్టాము. ఏదైనా సర్‌ప్లస్ వాటర్ ఉన్న చోట ఈ ప్రాజెక్టులు చేపడుతున్నాము. అయితే పోతిరెడ్డిపాడు మొదటి నుంచి కాంట్రావర్సీ సబ్జెక్ట్. ఈ ప్రభుత్వం ఎంత తప్పుదారి పట్టిస్తున్నదంటే పోతిరెడ్డి పాడు ఆల్ పార్టీ మీటింగ్‌లో అందరూ ఒప్పుకున్నారు. అందరూ ఒప్పుకున్న దాని ప్రకారంగా మేము చేస్తున్నాము అని తప్పుడు సమాచారం ఈ హౌస్‌కు ఇస్తున్నారు. నేనే అధ్యక్షా. నేనే లీడ్ చేశాను మా పార్టీ డెలిగేషన్‌ను. మేము వాకౌట్ చేసి వచ్చాము. మీకు ఒక జల విధానం లేదు. మీరు జిల్లాల మధ్య తగాదాలు పెడుతున్నారు అని మేము వాకౌట్ చేసి వస్తే తరువాతనేమో అందరు ఆల్ పార్టీ మీటింగ్ అయిపోయింది కనుక 40 వేల నుంచి 44 వేలకు పెంచుతున్నాము అని చెప్పి ఆ విధంగా మొత్తం పోతిరెడ్డి పాడు నుంచి నీళ్లు తీసుకుపోతున్నారు. 841 లోనే మీరు ఏవిధంగా అక్కడ నుంచి నీళ్లు తీసుకుపోతారు? ఇక్కడ ముఖ్యమంత్రి గారు కూడా ఉన్నారు. మినిస్టర్ గారు చెప్పాలి. ఎక్కడైనా ఈప్రపంచంలో ఫ్లడ్ వాటర్, అస్యూర్డ్ వాటర్ రెండూ ఒకటే కాలువ నుంచి పోతే మీరు అస్యూర్డ్ వాటర్ రిలీజ్ చేసినప్పుడు ఫ్లడ్ వాటర్ ఎలా కంట్రోలు చేస్తారు? ఏ విధంగా కంట్రోలు చేస్తారు? కాస్త చెప్పండి. I am totally a layman. I am not an engineer. Let me know because you are an engineer. ఫ్లడ్ వాటర్‌ను, అదే విధంగా అస్యూర్డ్ వాటర్‌ను ఒకే కాలువతో ఎలా తీసుకుపోతారు? ఏ టెక్నిక్ వాడతారు? ఒకసారి మీరు నాకు వివరణ ఇవ్వాలని చెప్పి తెలియజేసుకుంటున్నాను. 841 లో మీరు మొత్తం మద్రాసుకు నీళ్లు కాని అదే విధంగా నీళ్లు అక్కడ నుంచి అస్యూర్డ్ వాటర్ తీసుకుపోతారు. అదే విధంగా మీకు కావలసిన ఫ్లడ్ వాటర్ కూడా పోతిరెడ్డి పాడు నుంచి తీసుకుపోతారు. 841 లోపల మీరు ఏదైతే అస్యూర్డ్ వాటర్ పెడుతున్నారో ఫ్లడ్ వాటర్‌కు కావాలంటే 881 లో పెట్టండి. మీకు నాగార్జున సాగర్ నిండిన తరువాత ఆ తరువాత శ్రీశైలం నిండగా అప్పుడు కదండీ మీరు ఫ్లడ్ వాటర్ సంగతి మాట్లాడవలసింది. మీరు ఇది రాగానే 841 లోనే రిలీజ్ చేయడం మొదలు పెడితే క్రింది ఆయకట్టు పరిస్థితి ఏమి కావాలి? క్రింది ఆయకట్టు పరిస్థితి ఏమవుతుందో మీరు ఒకసారి ఆలోచన చేయమని చెప్పి కోరుతున్నాను. నేను రెండు సంవత్సరాల క్రితమే చెప్పాను. మొత్తం

నిజాంసాగర్‌కు పట్టిన గతే నాగార్జున సాగర్‌కు పట్టబోతున్నది. అక్కడ కూడా నిజాంసాగర్‌లాగా ఎండగొట్టబోతున్నారు. ఆ విధమైన నదీ జలాలలో క్రింది వాళ్ల మధ్య తగాదాలకు అంకురార్పణ చేశారు. ఈనాడు పనులు ఎట్లా జరగుతున్నాయి అధ్యక్షా? ఒక కిలో మీటరు వరకు ఇష్టానుసారంగా పనులు జరుగుతున్నాయి. రాత్రింబవళ్లు పనులు జరుగుతున్నాయి. ఒక డెలిగేషన్ వెళ్లి చూద్దాము. అసలు 481 లో పెడుతున్నారా? 430 లో పెడుతున్నారా? 440 లో పెడుతున్నారా. ఎవరికీ తెలియదు. ఆ విధంగా మీరు ఉన్న నీళ్లను అంతా ఒక నది యొక్క పరీవాహక ప్రాంతం నుంచీ పెన్నా పరీవాహక ప్రాంతానికి ఇంత పెద్ద నదిని మీరు మలుపుకు పోయే ప్రయత్నం ఏదైతే చేస్తున్నారో ఈ పరిస్థితి ఇది ఎంతవరకు జస్టిఫైబుల్ మీరు ఒకసారి చెప్పాలని చెప్పి మీ ద్వారా తెలియజేస్తున్నాను. ఇంత వరకు కనీసం జల విధానం లేదు. సమగ్రమైన. ట్రిబ్యునల్‌లో సరిగా ఆర్గ్యుమెంట్స్ లేవు. ఇప్పటికీ ట్రిబ్యునల్ కానిస్టిట్యూట్ అయి ఉన్నది. ట్రిబ్యునల్‌లో రోజుకో విధంగా మాట్లాడుతున్నారు. మీకు ఏది అనుకూలంగా ఉంటే అది చెబుతున్నారు. రాష్ట్రానికి పర్మనెంట్‌గా అన్యాయం జరిగే పరిస్థితి ట్రిబ్యునల్‌లో రేపు తేబోతున్నారు. అది ముందే నేను మీకు హెచ్చరిక చేయదలచుకున్నాను. మీరు ఖచ్చితంగా పర్మనెంట్‌గా దోషులుగా నిలబడతారు ఇటువంటి పనులు చేసి అని చెప్పి మీకు తెలియజేయదలచుకున్నాను.

O.K., Tell me. ఆయన ఎట్లా తీసుకుపోతాడు? నేను ఒక్కటే ప్రశ్న వేస్తున్నాను. నేను ఏ విషయం చెప్పదలచుకోలేదు. మీరు చాలా బాగా చేస్తున్నాము అంటున్నారు కదా? ఒకే కాలువతో ఫ్లడ్ వాటర్, అస్యూర్డ్ వాటర్ ఏ విధంగా తీసుకుపోతారో మంత్రి గారు చెబుతారంట. ఆయనను చెప్పమనండి సార్. మంత్రి గారిని చెప్పమనండి. ఏమి లక్ష్మయ్య గారూ చెబుతారా? 841 లో అస్యూర్డ్ అండ్ ఫ్లడ్ వాటర్ గురించి.

ఫైనాన్స్ మినిస్టర్ గారికి నేను మళ్లీ ఒకసారి రిమైండ్ చేస్తున్నాను. మీరు సేన్ గారిని కోట్ చేశారు. అమర్త్యసేన్ గారిని కోట్ చేస్తే పూర్తిగా పేదరికం ఏ విధంగా తొలగించబడాలి- టైమ్ తక్కువ ఉంది కనుక ఆ కొటేషన్స్‌లోకి నేను వెళ్లడం లేదు. ఏ విధంగా మీరు వనరులను సక్రమంగా వినియోగించుకుని పేదరిక నిర్మూలనకు, పేదలను ఏవిధంగా భాగస్వాములను చేసి వారి సమస్యలను పరిష్కరించడంలో ఎట్లా ప్రభుత్వాలు దోహదపడాలో అతను పెద్ద ఎకనమిస్ట్ చాలా స్పష్టంగా చెప్పారు. World renowned economist చెప్పాడు.

**అధ్యక్షా, గ్రామాల పరిస్థితి గురించి నేను చెప్పదలచుకున్నాను. గ్రామాలలోని వారు దుర్భిక్ష పరిస్థితులలో ఉన్నారు. పేదరికం, దుర్భిక్షం గురించి చాలా విషయాలు చెప్పడం జరిగింది. కేటాయించిన కేటాయింపులు, ఆ పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు ఏ విధంగా చేపడుతున్నారో ఒకసారి గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పమనండి.** 80 వేల కోట్ల రూపాయలున్న బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి, గ్రామీణ ఆర్థిక పరిస్థితి బాగు పడడానికి, నిరుపేదలైన వారి జీవన విధానం ఏ విధంగా ఉందో ఎప్పుడైనా అంచనా వేశారా, లోతుగా వెళ్లారా అని అడుగుతున్నాను. ఏదో ఉన్న వనరులను బట్టి ఇటు నుండి అటు, అటు నుండి ఇటు బడ్జెట్‌లో చెయ్యడానికి ప్రయత్నం చేశారు కాని సమస్యను గుర్తించి లోతుగా వెళ్లి విశ్లేషణ చేశారా అని మరొక్కసారి రిమైండ్

చెయ్యాలనుకున్నాను. మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆ రోజు ఎన్నికలప్పుడు ఈ పాట విని, ఈవెన్ గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ఆ పాట విని మెన్షన్ చేసి చెప్పారు. "వల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల" అని చెప్పి ఆ రోజులలో అన్నారు.

అధ్యక్షా, మీరు నవ్వుతున్నారు. మీరు కూడా క్యాసెట్ వేయించుకున్నట్టున్నారు. ఆ రోజులలో ఎటు చూసినా ఈ క్యాసెట్ వాయించారు. " కన్నీరు పెడుతుంది ప్రజలు, చేతి వృత్తుల్లో చేతులు విరిగిపోయె నా పల్లెల్లోన, అయ్యా గ్రామ స్వరాజ్యం గంగలోన పాయె ఈ దేశంలోన" అని వెంకన్న రాసిన పాటను ఊరూరు వేయించుకొని, ఊరూరు తిప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చారు. ఆ కన్నీరు కనిపించడం లేదా ఇప్పుడు? ఆ కన్నీరు ఏమయ్యింది? కన్నీరు తుడవడానికి మీరు చేసిన ప్రయత్నాలేమిటి? మూడేళ్ల నుండి ఏ విధమైన ప్రయత్నాలు చేశారు? ఇప్పుడు నాల్గవ బడ్జెట్ ఇది. నాల్గవ బడ్జెట్‌లో కన్నీరు తుడవడానికి ప్రయత్నం ఏ మేరకు చేశారో ఒకసారి చూసుకోవాలి. ఇక ఇంకొక బడ్జెటే! నెక్స్ట్ ఇయర్ ఇంక ఎలక్షన్ బడ్జెట్. మీ పని ఇంక అయిపోయింది. మీరు ఆ డేంజర్ మార్క్ దాటి బయటకు వెళ్లారు. లాస్ట్‌లో కూడా ఫుల్ బడ్జెట్ పెడతామంటే ఇంక మీ ధైర్యానికి మెచ్చుకోవచ్చు. ఏప్రిల్‌లో ఎలక్షన్‌కి వెళ్తూ బడ్జెట్ పెట్టినా పెట్టవచ్చు. అది నాకు తెలియదు. మీరు తక్కువ వాళ్లు కాదు. ఏదో రకంగా పెట్టినా పెట్టొచ్చు. ఒకటే బడ్జెట్ పెడతారని నేను అనుకుంటున్నాను. ఓటాన్ అకౌంటో ఏదో ఒకటి పెడతారని అనుకుంటున్నాను. You have every right. ఆ విధంగా రికార్డ్ సృష్టించాలని ఆర్థిక మంత్రి గారు చాలా ఉత్సాహంగా ఒకే టర్మ్‌లో అయిదు బడ్జెట్‌లు పెట్టాలి. ఆరు బడ్జెట్‌లు పెట్టే పరిస్థితి.

అధ్యక్షా, నాకు ఈ ప్రభుత్వంలో ఒక విషయంలో అనుమానం ఉంది. ఒక్క రోజు కూడా మీరు అధికారం వదిలి వెళ్తారని అనుకోవడం లేదు. పూర్తి కాలం అధికారంలో ఉంటారు. అడ్వాన్స్‌గా ముందు వెళ్తారని నేను అనుకోను. మీరు అధికారంలోకి రావాలని అనుకున్నారు వచ్చారు. ఐదేళ్లకు అయిదు నిమిషాల ముందు కూడా మీరు వెళ్లరు. మీరు ఖచ్చితంగా ఉంటారు. లాస్ట్ వరకూ కూడా మీరు సంతకాలు పెడతారు, పెట్టుకోండి. But, I am reminding you. నాల్గవ బడ్జెట్ పెట్టారు, ఎక్కడా రిఫ్లెక్ట్ కావడం లేదు. ఇక వచ్చేది అంతా ఎలక్షన్ బడ్జెట్స్. అన్నీ కాకి లెక్కలే ఉంటాయి. ఇంతకు మించిన లెక్కలుంటాయి. బూస్టెడ్ బడ్జెట్స్ అవన్నీ. అవి బూస్టెడ్ బడ్జెట్స్ తప్ప ఇంకొకటి కాదని చెబుతున్నాను.

అధ్యక్షా, చేతి వృత్తుల వారి పరిస్థితి చూడండి. 94 కులాలు బి.సి.లలో ఉన్నారు. **94 కులాలలో ఇరవై, ఇరవై అయిదు కులాల పరిస్థితి అధ్వానంగా ఉంది. వాళ్లు ఎక్కడున్నారో తెలియదు. వాళ్లు సంచార జాతుల్లాగా ఉన్నారు. వాళ్ల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం తెలుసుకోవడం లేదు. పిచ్చకుంట్ల, బుడబుక్కల, మొండి, దొమ్మర, గంగిరెద్దుల, పాముల, వీరముష్టి, కూనపులి, దూదేకుల అని ఇలా మన సమాజంలో పిలవబడుతున్నవారు.** కొంత మందికి వినడానికి ఇలా ఉన్నాయేమిటి అని అనిపించవచ్చు. వారు పడుతున్న బాధలు, వాళ్ల జీవన పరిస్థితి మెరుగు పరచడానికి మనం చేస్తున్న ప్రయత్నాలు ఏమిటి? వాళ్ల తరపున గట్టిగా ఎవరైనా మాట్లాడితే కులతత్వం అని అంటారు. 94 కులాలలో 70 కులాల వారు, ఈ స్వాతంత్ర్య భారత దేశంలో

ఈ శాసనసభలో కాలుకూడా పెట్టలేదు. కాలుపెట్టే అదృష్టం వారికి లేదు. వాళ్ల జీవన పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం లేకపోయింది. అరవై సంవత్సరాలలో వాళ్ల తరపున మాట్లాడే నాధుడు లేడు. ఇలాంటి కులాలలో, వాళ్ల తరఫున ప్రాతినిధ్యం వహించే నాధుడు లేడు. ఈనాడు గ్రామీణ ప్రాంతాలలో చేతి వృత్తుల పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయి? **80 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో పెట్టారు. సమాజంలో యాభై శాతం ఉన్న బి.సి.ల పరిస్థితి ఇంప్రూవ్‌మెంట్‌కి మీరు ఏమి చేశారు? మీ కేటాయింపులు ఏ విధంగా ఉన్నాయో ఒకసారి ఆలోచించండి.** నిజంగా వారి అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా అనేది ఆలోచించండి.

అధ్యక్షా! బి.సి. కార్పొరేషన్‌కి బడ్జెట్‌లో మూడు కోట్ల నలభై లక్షలు పెట్టారు. జనాభా ప్రాతిపదికన చూసుకున్నా మనిషికి రూపాయి వస్తుంది. ఆ విధంగా ఉంది బడ్జెట్ పరిస్థితి. ఎకనామిక్ డెవలప్‌మెంట్ జరుగుతుంది. ఈనాడున్నటువంటి పరిస్థితులలో చాలా మార్పులు వచ్చాయి. పెట్టుబడికి అవసరం ఏర్పడుతుంది. బి.సి.లందరూ చేతి వృత్తులు చేసుకునే ప్రజలు. తరతరాలుగా చేతి వృత్తులు చేసుకుంటున్నారు. వారు సగం ఆకలితో ఉంటున్నారు. ఈనాడు చేతివృత్తులు ఆధునీకరించబడ్డాయి.

నాయీ బ్రాహ్మణులున్నారు. అది మాడ్రనైజ్ అయ్యింది. బ్యూటీపార్లర్స్ పెట్టాలంటే పెట్టుబడి కావాలి. కనీసం పది, ఇరవై లక్షల రూపాయలు కావాలి. వాళ్ల దగ్గరేమో కనీసం తిండికి కూడా ఉండదు. బ్యూటీపార్లర్స్ పెట్టాలంటే డబ్బు ఉండడం లేదు. వాళ్లు చేతులను నమ్ముకున్న వ్యక్తులు. అలాగే, మత్స్యకారులున్నారు. వాళ్ల ప్రొఫెషన్ మాడ్రనైజ్ అయ్యింది. కావలసిన ట్రాలీస్ వచ్చాయి. ఆక్వాకల్చర్, చేపల చెరువులు, రొయ్యల చెరువులు అన్నీ వచ్చాయి. ఎంత మంది మత్స్యకారుల చేతుల్లో ఈనాడు రొయ్యల చెరువులున్నాయి? పెట్టుబడి వర్గాలు వాళ్ల వృత్తిని తీసేసుకుంటున్నారు. చేపలు పట్టడానికి మాత్రమే వాళ్లు ఉన్నారు. యాజమాన్యం మాత్రం వాళ్లకు రాలేదు. ఎక్కడ చూసినా వడ్డెర్లు రాళ్లు పట్టుకొని కనబడుతున్నారు వాళ్లు? వృత్తి మాడ్రనైజ్ కాగానే ఇంకొకకరు తీసుకొని వెళ్తున్నారు. ఈ విధంగా ప్రతి వృత్తిలో పెట్టుబడి లేక, చేతి వృత్తుల వాళ్లందరూ కూడా అన్నమో రామచంద్ర అని గ్రామాలలో వలస కూలీలుగా మారిపోయి ఎటు పోతున్నారో తెలియని పరిస్థితి ఉంటుంది.

కనుక వాళ్లకు మీరు బడ్జెట్ సపోర్టు ఇవ్వాలి. మేము కొంత ప్రయత్నం చేశాము. అయితే అది సరిపోతుందని, లేదూ మేము బ్రహ్మాండంగా చేశామని చెప్పడం లేదు. ఆ రోజున మేము ఆదరణ ప్రోగ్రామ్ తీసుకుని వడ్డెరలకు, ఇతర చేతి వృత్తుల వారికి చిన్న చిన్న పరికరాలు ఇవ్వడం వంటి ప్రయత్నం చేశాము. కాని మహానుభావులు మీరు ఒకవైపు బ్రహ్మాండంగా ఆర్థికాభివృద్ధి చేశామని మాట్లాడుతున్నారే. కాని మీ యొక్క కేటాయింపులు ఏవిధంగా ఉన్నాయి? చేతివృత్తుల వారికి ఈనాడు పరపతి ఎవరు ఇవ్వాలి? కనీసం తిండికి గతిలేని వ్యక్తులు వాళ్లు .కాబట్టి బి.సి. ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఒక వేయి కోట్ల రూ.లు ఇవ్వమని మేము గతం నుండి కొట్లాడుతున్నాము. మీ దగ్గర డబ్బులు లేకపోతే మేము అడిగే వాళ్లం కాదు. కాని ఈనాడు మీరు 80 వేల కోట్ల రూ.ల బడ్జెట్ పెట్టిన తరువాత కూడా మీరు బి.సి. ఫైనాన్స్ కార్పొరేషన్‌కు

ఎక్కిరించినట్లుగా, నీ దిక్కు ఉన్న దగ్గర చెప్పుకో అన్న పద్ధతిలో కేవలం మూడు కోట్ల రూ.లు కేటాయించారు. దిక్కు ఉన్న చోట చెప్పుకో అన్న పద్ధతిలో వ్యవహరిస్తున్న మీ ప్రవర్తనకు మేము అభ్యంతరం చెపుతున్నాము. ఏనాడైతే ఈ శాసనసభలో 150 మంది బి.సి. శాసనసభ్యులు అడుగు పెడతారో అప్పటి వరకు ఈ పరిస్థితి మారేటట్లుగా కనపడటం లేదు. మీరు అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కార్మికుల పరిస్థితిని మెరుగుపరుస్తామని చెప్పారు.

అధ్యక్షా, ఈనాడు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 93 మంది చేనేత కార్మికులు చనిపోయారు. ఇదేమిటి? ఆఫీషియల్‌గా. ఇంకా చాలా మందే చనిపోయారు. పోస్టు మార్టం రిపోర్టు లేదనో, ఏదో లేదనో చెప్పి ఆ ఫిగర్స్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. కనీసం ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి కూడా ఏదో రకంగా తిప్పుకుంటున్నారు. ఏడు రోజుల నుండి నేను ప్రయత్నిస్తున్నాను. వారు ఏదో వ్రాసి పంపించారు.

ఇక గీత కార్మికుల విషయానికి వస్తే అధ్యక్షా, అది గతి లేని ప్రొఫెషన్. ఉదయం మూడు గంటలకు లేచి, చెట్లు ఎక్కి కల్లు గీస్తారు. ఒక్కొక్కసారి చెట్ల మీద నుండి పడిపోయి వికలాంగులుగా కూడా మారుతున్నారు. ప్రతి సంవత్సరం 650 నుండి 700 మంది దాకా కల్లు గీత కార్మికులు చనిపోతున్నారు. అటువంటి వారి డేటా కూడా మన దగ్గర లేదు. గతంలో గీత కార్మికుల సంక్షేమం కోసం మేము కొంత చేశాము. మేము ఉన్నప్పుడు కొంత కార్యక్రమం మొదలు పెట్టాం అధ్యక్షా. అయితే ఈ ప్రొఫెషన్ మూసివేసి, ఐఎమ్ఎఫ్ఎల్ తీసుకుని వచ్చి ఆదాయం ఎట్లా పెంచుకోవాలా అని ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. కనీసం ఆ వృత్తిని ఏ విధంగా మోడ్రనైజ్ చేద్దామా? అనే ప్రయత్నం కూడా ఈ ప్రభుత్వం చేయడం లేదని మీకు తెలియచేస్తున్నాను. ఆ విధంగా మత్స్యకారుల్ని, వడ్డెరల్ని, రజకుల్ని, నాయి బ్రాహ్మణుల్ని, స్వర్ణకారుల్ని, ముదిరాజ్‌లు కానివ్వండి, ఈ వర్గాలు మోడ్రనైజ్ చేయదగ్గ వర్గాలు. ఈనాడు మనకు అంతో ఇంతో పెట్టుబడులు వస్తున్నాయి, వనరులు వస్తున్నాయి. ఈ వనరుల్లో బి.సిలకు షేర్ ఉండాలి. 50 శాతం ఉన్న బి.సి. ప్రజలకు వీటిలో షేర్ ఇవ్వకూడదా మనం? కనీసం వారి పిల్లలు చదువుకుంటామంటే, వారికి స్కాలర్‌షిప్పులు కూడా ఇవ్వడం లేదు. వారికి కనీస అవసరాలు కల్పించలేమా? ఈనాటి ప్రపంచీకరణలో వారికి భాగస్వామ్యం అక్కర్లేదా? ఈనాడు మారుతున్న సమాజంలో కనీసం రెండు పూటలా తిండి తినడానికి వారికి అర్హత లేదా అని అడుగుతున్నాను. వారికి పెట్టవలసిన పెట్టుబడులు పెంచే బాధ్యత మన మీద లేదా? దానికి కావలసిన ఏర్పాట్లు మీరు ఏమి చేశారు? బి.సి. ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కనీసం వేయి, పదిహేను వందల కోట్ల రూ.లు అయినా బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, ఏవిధంగా బి.సి.లకు పరపతి సౌకర్యం తీసుకుని వస్తారో వివరించవలసిందిగా కోరుతున్నాను. లేదూ, బి.సిలు మాకు ఓటు వేయరు, వీరు మా ఓటు బ్యాంకు కాదు అనుకుంటున్నారా? దౌర్భాగ్యం ఏమిటంటే, ఈదేశంలో ఓటు బ్యాంకు రాజకీయం నడుస్తోంది. ఓటు వేయని వారికి మేము పని చేయమనే ధోరణి ఈ ప్రభుత్వంలో చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పెత్తందారీ ధోరణి తప్ప, ఇంకొకటి కాదు. Sir, it is Feudalistic Government. ఈ విధంగా పెత్తందారీ ధోరణి మనస్తత్వం ఉన్న మీరు, బి.సి.లకు చేస్తున్న అన్యాయాన్ని ఖచ్చితంగా ప్రజలు గ్రహిస్తారు, మీకు తగిన విధంగా

బుద్ధి చెపుతారని మీకు నేను తెలియచేయదలచుకున్నాను. ఈనాడు వారి తరపున మాట్లాడేవారు 40, 49 మంది ఉన్నారు. అయినా కూడా కనీసం వారు నోరే విప్పని పరిస్థితుల్లో ఉన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు రోజు రోజుకు తగ్గిస్తున్నారు, కక్షగట్టి ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని అంటే, నోరు విప్పి మాట్లాడే దిక్కే లేదు ఈనాడు ఈ సభలో. అయితే, బలహీన, బడుగు వర్గాలవారు ఈ శాసనసభలో అధిపత్యం చెలాయించే రోజు ఎంతో దూరం లేదని నేను ఈ రోజు హెచ్చరిక చేయదలచుకున్నాను. మీరు అనుకోవచ్చు. ఒక ఉదాహరణ చెపుతాను. తుఫాను వచ్చినపుడు ఒక కాగితం గాలిలో పైకి ఎగురుతుంటుంది. అది అనుకుంటుంది అయ్యో నేను ఎంత ఎత్తుకు ఎదిగిపోయాను అని. తుఫాను పోయాక, ఆ కాగితం భూమి మీద పడిన తరువాత గాని ఆ కాగితానికి అర్థం కాదు తన యొక్క పరిస్థితి ఏమిటి, తన స్థానం ఏమిటని,

ఈనాడు మీకు ఆ పరిస్థితి రాబోతున్నది. అనవసరంగా మీరు మేము ఏదో ప్రజా నాయకులం, ప్రజలకు అనుగుణంగా ఏదో చేస్తున్నామని భ్రమలు కల్పిస్తూ మాట్లాడుతున్నారు. కాని చేష్టల్లో మాత్రం పూర్తిగా తద్విరుద్ధంగా పనిచేస్తున్నది ఈ ప్రభుత్వం, దానికి తగిన మూల్యం కూడా ఈ ప్రభుత్వం చెల్లిస్తుందని అని చెప్పి ఈ సందర్భంగా నేను తెలియచేస్తున్నాను. మొన్న మీరు ఏదో గెలిచి ఉండొచ్చు. కాని వచ్చే ఎన్నికల్లో మాత్రం మీరు ఖచ్చితంగా దానికి తగిన పరిహారం చెల్లించుకోకతప్పదు. వందల కళేబరాలు తిన్న రాబందు అయినా తుఫాను వచ్చినప్పుడు అడ్రస్ లేకుండా కొట్టుకొనిపోయినట్లుగా మీరు కూడా రేపు కొట్టుకొని పోబోతున్నారు. పెత్తందారీ మనస్తత్వం ఉన్న మీరు గాలిలో కొట్టుకొనిపోక తప్పదు. పేద వర్గాలకు, బలహీన వర్గాలకు, చేతివృత్తుల వర్గాలకు మీరు చేస్తున్న అన్యాయానికి మీరు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఈ సందర్భంగా మీకు హెచ్చరిక చేయదలచుకున్నాను, సార్ ఇంకా చాలా ఉన్నాయి చెప్పవలిసింది. మీరు ప్రశాంతంగా ఉన్నారు. సభ కూడా ప్రశాంతంగా ఉంది. చెప్పనీయండి.

ఎస్సీల విషయానికి వస్తే, వారు ఈ రాష్ట్రంలో 1 కోటి 23 లక్షల మంది ఉన్నారు. **గ్రామాల్లో 82 శాతం ఎస్సీలు ఉన్నారు. వారి జీవితాలు బాగుపడకుండా గ్రామీణాభివృద్ధి ఏ విధంగా జరుగుతుంది? ఎక్కడ పడితే అక్కడ కూలీ చేసుకుని జీవనం గడిపే వారు. భూమిపైన ఎటువంటి హక్కులు లేకుండా బతుకుతున్న నిరుపేదలు, అటువంటి నిరుపేదల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఒకసారి మీరు ఆలోచన చేయండి అధ్యక్షా.**

2005-06 సంవత్సరంలో ప్లాన్ బడ్జెట్ కింద మీరు రూ.1020 కోట్లు కేటాయింపులు చేసి ఖర్చు పెట్టింది మాత్రం కేవలం రూ. 669 కోట్లు. అదే విధంగా స్కాలర్‌షిప్పుల కోసమని చెప్పి రూ.327 కోట్లు కేటాయించి విడుదల చేసింది మాత్రం రూ.187 కోట్లు, కాని ఖర్చు పెట్టింది మాత్రం రూ.176 కోట్లు ఎస్సీల కోసమని. 2006-07 సంవత్సరం వచ్చేసరికి, స్కాలర్‌షిప్పుల కోసమని రూ.176 కోట్లు ప్రతిపాదించి ఖర్చు పెట్టింది రూ.63 కోట్లు. ప్లానింగ్ కమీషన్ క్లియర్ కట్‌గా చెప్పింది. There should be an effective monitoring system అని చెప్పి. ఆ యొక్క మానిటరింగ్ ఏవిధంగా చేస్తున్నారు? రాజ్యాంగపరంగా ఈ

ప్రజానీకానికి హక్కులు ఉన్నాయి. జనాభా ప్రాతిపదిక మీద వనరులు కేటాయించాలని చెప్పి. మీ మీద ఆ విధమైన బాధ్యత ఉంది. కాని ఆ విధంగా కేటాయింపులు చేయడం లేదు. చేసిన కేటాయింపులు ఏ విధంగా ఖర్చు అవుతున్నాయో తెలుసుకోవడానికి కనీస పర్యవేక్షణ లేకుండా పోతున్నదని మీకు ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

రెడ్యానాయక్‌గారు అప్పుడప్పుడు సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పనితీరు గురించి బాధపడతున్నట్లుగా పేపర్లో చూస్తున్నాము. ఆయన మాట ఎవరూ వినడం లేదని, కేటాయింపులు సరిగా చేయడం లేదని బాధపడుతున్నట్లుగా, ఇబ్బంది పడుతున్నట్లుగా చూస్తున్నాము. కాని ఆ బాధ అసలు ముఖ్యమంత్రికి ఉండాలి, ఫైనాన్స్ మినిష్టర్‌కు ఉండాలి. ఆ విధంగా human touch ఉండాలి. మానవీయ కోణంతో ఆలోచించాలి. అటువంటి మానవీయ కోణం లేకపోతే, మీకు వీరి పరిస్థితి అర్థం కాదు. Sir, it is not just a number game. It is a human problem. ఇది మానవీయ సమస్య, ఆ సమస్య గురించి మీరు లోతుగా ఆలోచన చేయడం లేదు. దానికి తగ్గట్లుగా మీరు పరిష్కార మార్గం చేయడం లేదు. ఈనాడు ఆ పిల్లలు చదవుకుంటామంటే, చదవనీయకుండా చేస్తే ఎట్లా?

1 నుంచి 5వ తరగతి వరకూ చదివే ఎస్.సి. పిల్లలు 25 శాతం మంది డ్రాపవుట్ అవుతున్నారు. 10వ తరగతికి వచ్చే సరికి 70 శాతం డ్రాపవుట్ అవతున్నారు. ఎస్.టి.లైతే భయంకరంగా 81.76 శాతం డ్రాప్ అవుతున్నారు. వారు కనీస విద్యకు కూడా నోచుకోవడం లేదు.

ఎడ్యుకేషన్‌లో మనం 28వ స్థానంలో ఉన్నాం దేశంలో. సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ఈ దేశంలో మనం 28వ స్థానంలో ఉన్నాం విద్య విషయంలో. కేటాయింపులు చూస్తే, స్కాలర్‌షిప్పులు ఇవ్వకుండా పిల్లల్ని ఈ పోటీ ప్రపంచంలో పోటీ పడమంటే ఎట్లా? బయటి పిల్లలు ఉరుకుతారు. మీరు హైటెక్ సిటీలో ఉద్యోగాలు అంటారు. అక్కడ ఎంతమంది ఎస్.సి., ఎస్.టి., బి.సి.లు ఉన్నారు? ఎంత మందికి ఉద్యోగాలిచ్చారు? వారిలో నైపుణ్యం పెంచాల్సిన అవసరం ఉంటుంది. వాళ్ల గురించి సరైన శ్రద్ధ తీసుకోకపోతే, వాళ్లు ఏ విధంగా ఈ పోటీ ప్రపంచలో బ్రతకగలరో ఆలోచించండి. నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేయండి. జిల్లాలలో, మండలాల్లో పర్యవేక్షణకి సీనియర్ ఆఫీసర్లను వేసి ఏ విధంగా అమలు జరుగుతున్నదో పరిశీలించండి.

ఇక ఎస్.టి. వెల్ఫేర్. ఐ.టి.డి.ఏ.ల పరిస్థితి ఏమిటి? ఎంత భయంకరంగా ఉన్నాయవి? ఐ.టి.డి.ఎ.లలో నిధులు వస్తున్నాయా? ఆఫీసర్సును వాటిల్లో వేస్తున్నారా? నేను జడ్‌పి ఛైర్మన్‌గా ఉన్నపుడు అన్ని జడ్‌పిలనూ రెవ్యూ చేస్తున్నపుడు విశాఖ ఏరియాలో చూసినపుడు ఐ.టి.డి.ఏ.లు ఎంతో బాగుండేవి. స్పెషలాఫీసర్లను వేసే వారు. ఐ.ఎ.ఎస్. ఆఫీసర్సు ప్రొబేషన్ కాగానే వాళ్లను కంపల్సరీగా అక్కడకు పంపించేవారు. ఈనాడు ఐ.టి.డి.ఏ.లలో ఎవరున్నారు? ఎక్కడా పనికి రాని వాళ్లను, పనిష్మెంటుగా వేసి పొమ్మంటున్నారు. నిరుపేదలున్న ప్రాంతాలవి. అటువంటి ప్రాంతాల గురించి అడ్మినిస్ట్రేషన్‌కు ఎఫిషియెంట్ ఆఫీసర్సును వేయాలి. నిధులు ఎక్కువ కేటాయించి, వాటిని ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నం మీరు చేయడం

లేదు.

మిడ్ డే మీల్స్ గురించి, నేను ఒక సర్వే రిపోర్టు చదివాను. దేశంలో మిడ్ డే మీల్ పథకాన్ని దేశంలో ప్రవేశపెట్టిన తర్వాత, ముఖ్యంగా మన రాష్ట్రంలో 16 శాతం పిల్లల హాజరీ పెరిగిందని వచ్చింది. 6 నుంచి 7వ తరగతి వరకూ వస్తుంది. 1 నుంచి 5వ తరగతి వరకూ జనరల్ పిల్లలు 24 శాతం మంది డ్రాప్‌వుట్స్ అయితే, ఎస్‌సి, ఎస్‌టిలు 49 శాతం డ్రాపవుట్ అవుతున్నారు. 10వ తరగతికి వచ్చేసరికి 81 శాతం ఎస్‌టిలు, 70 శాతం ఎస్‌సిలు, 63 శాతం బిసిలు ఇతర పేద పిల్లలు డ్రాపవుతున్నారు. డ్రాపవుట్స్ సంఖ్య మిడ్‌డే మీల్ ప్రవేశపెట్టాక తగ్గింది. అయితే దీనికి ఎంత ఖర్చు చేస్తున్నాము? ఒక్క పూట భోజనం కోసం రూ. 250 కోట్లు సబ్సిడీ ఇస్తున్నాము. రూ. 250 కోట్లకి అదనంగా మరో రూ.200 కోట్లు ఇస్తే, ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా మరో కోటి మంది పిల్లలు ప్రతి రోజూ అన్నం తింటారు. తిండి కోసం విద్యాలయాలకు వచ్చే పరిస్థితి అంటే ఎంత పేదరికంలో వాళ్లున్నారో చూడండి. నేనింతకు ముందు చెప్పినట్లు, నేషనల్ శాంపిల్ సర్వేలో చెప్పినట్లు, 10శాతం మంది ప్రజలు రోజుకి రూ. 10 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. కోటి మంది కనీసం ఒక పూట భోజనం చేస్తే, వాళ్లు మన దేశ సంపదను పెంచుతారు. కనుక ఆ కార్యక్రమం చేపట్టాలి.

మిడ్ డే మీల్ ప్రోగ్రాంలో బడ్జెటును కొద్దిగా పెంచితే బాగుంటుంది. జూనియర్ కాలేజీల గురించి న్యూస్ పేపర్సులో వచ్చింది.

అదే విధంగా ఎడ్యుకేషన్‌లో మీ కేటాయింపులు చూడండి. అమర్త్యసేన్ గారి గురించి చెప్పి, బ్రహ్మాండంగా వారి కొటేషన్‌ను ఇచ్చారు. It is the most neglected sector అని, ప్రభుత్వాలు అతి దారుణంగా నెగ్లెక్టు చేస్తున్నది ఎడ్యుకేషన్ సెక్టార్ అని చెప్పారు. ఎడ్యుకేషన్‌లో మీ కేటాయింపులు చూడండి. ఈ విధంగా చేస్తే ప్రజలను ఏ విధంగా ఎడ్యుకేట్ చేయగలుగుతారు? **జి.ఎస్.డి.పి. లో 2.6 శాతం ఎడ్యుకేషన్‌కి ఈసారి మీరు చేశారు. అది కనీసం 3.6 ఉండాలని అందరు ఎకానమిస్టులు చెబుతున్నారు. మనకు హ్యూమన్ రిసోర్సెస్ ప్రధానమైనది. మానవ సంపదను ఎడ్యుకేట్ చేయకుండా, వాళ్ల నైపుణ్యం పెంచకుండా ఈ పోటీ ప్రపంచంలో వాళ్లు ఎలా బ్రతుకుతారు?**

మనం ఆల్‌రెడీ నాలెడ్జి బేస్డ్ సొసైటీలో ప్రవేశించాము. ఈ పోటీ ప్రపంచంలో ఈనాడు బ్రతకాలంటే నూటికి 80 మంది ప్రజలకు కనీస అవసరాలు లేవు. ఏ స్కూలుకు వెళ్లినా టీచర్స్ సరిగ్గా ఉండటం లేదు. విద్యాలయాలు ఉండవు. మీరు బడ్జెటులో రూ. 10 కోట్లు పెట్టారు. ఎంత దారుణం? ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం కాకపోతే, రిపేర్సు చేయవలసిన బిల్డింగ్సు రాష్ట్రంలో వేలాదిగా ఉంటే, రూ.10 కోట్లు కేటాయింపులు చేశారు మీరు. స్కూలు బిల్డింగ్సుకు, ఫర్నిచర్‌కు అంతా కలిపి రూ.20 నుంచి 25 కోట్లు కేటాయించకుంటే ఏ విధంగా ఎడ్యుకేషన్ సెక్టారును ముందుకు తీసుకుపోగలుగుతారు? నాలెడ్జి బేస్డ్ సొసైటీ అని గొప్పగా చెబుతారు. How is it possible? 60% of the SCs are not even coming to the 10th Class. 80 శాతం ట్రైబల్స్ 10వ తరగతికి కూడా రావడం లేదు. ఆ పిల్లల్ని ఏ విధంగా చదివిస్తామనేది కనీసం ఆలోచించాలి.

ఒక ప్రశ్నకు జవాబు చెప్పడానికి హెల్త్ మినిస్టర్ గారు నానా అవస్థ పడుతున్నారు. ఒక చిన్న ప్రశ్న బ్యాక్‌లాగ్ గురించి అడిగితే, మొత్తం హెల్త్ సెక్టార్ గురించి చెబుతున్నాడు. ఆయన హెల్త్ పాడైపోతోంది తప్ప హెల్త్ సెక్టారు మాత్రం ఇంప్రూవ్ కావడం లేదు. ఆయన స్వయంగా ఫైనాన్స్ మినిస్టర్ అయి వుండి కూడా హెల్త్ సెక్టార్‌లో ఆరోగ్యానికి కేటాయింపులు తగ్గిపోవడం చాలా విచారకరం. మీరు ఫిగర్సు చూపిస్తున్నారు. But I am talking about proportionate percentage. ప్రపోర్షనేట్‌గా బడ్జెట్‌లో ఏమిచ్చారు? రూ.50 కోట్లు అని, మీకంటే ఎక్కువ అని అంటున్నారు. 50 కోట్లు 100 కోట్లు అంటే సరిపోదు.

ఇక, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం గురించి దేవుడికే ఎరుక. అది ఎక్కడకు పోయింది? గ్యాస్ దొరకడం లేదు. కిరోసిన్ రావడం లేదు. చక్కెర ఇవ్వడం లేదు. గ్యాస్‌నూనె బయట ఎక్కడ అమ్ముకుంటున్నారో ఏమో. తగ్గించారు. మినిస్టరు గారు చెబుతున్నారు కోటా తగ్గిపోయిందని. అయ్యా, పక్కనున్న తమిళనాడు వాళ్లు కోటా తెచ్చుకున్నారు. 30 మంది లోక్‌సభ సభ్యులున్నారు. కేంద్రంలో. కేంద్రంలో మీ ప్రభుత్వం వచ్చిందంటున్నారు. కనీసం కిరోసిన్ కూడా తెప్పించుకోలేని దౌర్భాగ్య స్థితి వచ్చింది. పక్కనున్న తమిళనాడు వాళ్లు తెప్పించుకున్నారు. మీరెందుకు తెప్పించుకోలేక పోతున్నారు?

ఇక హౌసింగ్. 25 లక్షల ఇళ్లు కడుతున్నామన్నారు. అందరికీ ఇస్తే సంతోషమే. మాకేం అభ్యంతరం లేదు. కాని ముఖ్యమంత్రి గారు ఒకటి ఆలోచించాలి. ఏదైనా ఒక ఆలోచన వస్తే దయచేసి, దానినే పాలసీగా మార్చవద్దు. మీ ఆలోచనా విధానంతోటి, ఇరిగేషన్‌కు సగం బడ్జెట్ పెట్టాము అంటే, అక్కడ ఇంజనీర్లు లేరు, ఇ.పి.సి. ఇస్తే దోచుకు తింటున్నారు. రోజూ పుంఖానుపుంఖాలుగా వార్తలు వస్తున్నాయి. ఈ రోజు హౌసింగ్‌లో అదే జరుగుతోంది. హౌసింగ్‌లో దొంగ బిల్లులు తీసుకుంటున్నారు. కట్టిన వాటికే బిల్లులు తీసుకుంటున్నారు. దానిని డెఫినిట్‌గా మేము ప్రూవ్ చేస్తాము. డబ్బున్న వాళ్లే, ఉన్నత వర్గాల వారే నాలుగిళ్లు తీసుకుంటూ వుంటే, where is the supervision? దొంగతనంగా తీసుకున్నారు అని రాష్ట్రంలో ఎవరైనా చెప్పేవాళ్లున్నారా?

ఎంతోమందికి ఒక్కొక్క గ్రామంలో, ఆ తండా పేరు నాకు గుర్తు రావడం లేదు. మా టైంలో ఐదు వందల ఇండ్లు కడితే ఫ్రెష్‌గా మళ్లీ బిల్ తీసుకున్నారు. ఈ విధంగా ఆలోచన వచ్చింది కనుక కనీసం 25 లక్షలు ఎట్లా కడతారు అనే ఆలోచన చేయకుండా బడ్జెట్ కేటాయించి, మసిపూసి మారేడుకాయ చేయడానికి మీరు ప్రయత్నం చేస్తున్నారు. ఫండ్స్ మిస్‌యూజ్ అవుతున్నాయి. ఇది చాలా అన్యాయం. ఇంతటి బాధ్యతా రాహిత్యం గురించి మీరు ఆలోచన చేయాలని తెలియజేస్తున్నాను. ఇక రోడ్స్ అండ్ బిల్డింగ్స్, రోడ్లమీద పోవాలంటే, మరి ముఖ్యమంత్రిగారికి హెలికాప్టరు ఉంది. ఆ రోజులలో హెలికాప్టరులో మేము అక్కడ, ఇక్కడ తిరిగితే చాలా ఎద్దేవా చేశారు. గాలిలో తిరుగుతున్నారు అన్నారు. మీరు ఇప్పుడు గాలిలోనుండి దిగడంలేదు. మీరు తిరగడంలేదు కనుక రోడ్లు ఏమన్నాకానీ, ఏమి పాడైపోయినా నాకు అభ్యంతరం లేదనే విధంగా రోడ్ల మంత్రిగారు మాకు హాలిడే వచ్చిందని చెప్పేశారు. ఆయన ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ, ఆయన ఆరోగ్యంతో పాటు రోడ్ల ఆరోగ్యం కూడా ఆ విధంగా

ఉంచవద్దు. మీరు రెవ్యూ చేయండి. రోడ్స్ 63,625 కిలోమీటర్లు ఉంటే ఏమి కేటాయింపులు చేశారు? కనీసం మెయిన్‌టెయిన్ చేస్తున్నారా? మెయిన్‌టెయిన్ ఏ విధంగా చేస్తున్నారో ఒకసారి అర్థం చేసుకోండి. ఈనాడు మీరు ఉన్న బస్‌డిపోలను మూసివేస్తున్నారు. ఎయిర్‌పోర్టులు కడుతున్నారు. రోడ్ల మీద బస్సులు తిరగే పరిస్థితి లేదు. ఈ విధమైన పరిస్థితిలో ఆ శాఖ కేటాయింపులు ఏ విధంగా ఇచ్చారు? కనెక్టివిటీ రోడ్లు వేస్తే కనీసం రిపేర్స్ చేసుకునే దౌర్భాగ్యకరమైన పరిస్థితి కూడా మీకు లేదంటే ఏ విధంగా, ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితిలో ఈ ప్రభుత్వం పోతున్నారని తెలియజేస్తున్నాను.

సార్, స్పీకరుగారు ఉన్నారు. పాపం ఆయనను చూస్తే ఒక్కొక్కసారి మాకు చాలా బాధ వేస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలవుతున్నా కూడా ఇంతవరకు డెప్యూటీ స్పీకర్‌ను పెట్టుకోలేదు. ఆయన అలసిపోయి, అప్పుడప్పుడు మమ్ములను ఇంగ్లీషులో తిడుతుంటారు. ఆయన మాత్రం ఎంతకాలం, ఏమాత్రం చేయగలరు, అలసిపోతుంటారు. కనీసం డెప్యూటీ స్పీకర్‌ను పెట్టుకుంటే కొంత రిలీఫ్ ఉంటుంది. సార్, ప్యానల్ స్పీకర్‌గారు వచ్చారు ఫరవాలేదు. అధ్యక్షా, ప్రభుత్వ విధానం ఒకసారి ఆలోచన చేయండి. డెప్యూటీ స్పీకరుగారు లేరని చెప్పాను. మీరు వచ్చారు. మీరు డిప్యూటీ స్పీకరు కాదు గదా. డెప్యూటీ స్పీకరు ఉండాలని కోరాము. శాసనసభలో మూడు సంవత్సరాల నుండి పిటీషన్స్ ఇస్తే వాటిని రెవ్యూ చేసేవారు లేదు. ఇంతకుముందే ఒక సభ్యురాలు మా ప్రోటోకాల్ చూసేవారు లేరని చెబుతున్నారు. కనీసం ఆయనను కూడా పెట్టుకోకపోతే ఎట్లా?

అధ్యక్షా, క్యాబినెట్ అంటే ఏమిటి? ఇది స్వంత వ్యవహారం రాజశేఖరరెడ్డిగారికి సంబంధించింది కాదు. ముఖ్యమంత్రిగారికి సంబంధించింది కాదు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారం. రాష్ట్ర ప్రజానీకంతో ఎన్నుకోబడిన ప్రభుత్వాల ద్వారా మనం ఈనాడు ప్రభుత్వాలు నడిపించుకోలేని పరిస్థితి ఉంటే, మూడు సంవత్సరాలు అవుతున్నది. కనీసం క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్ చేసే పరిస్థితి లేదంటే మీరు ఏ విధమైన ప్రభుత్వం నడిపిస్తున్నారు? ఎవరు ఏ మంత్రులో మాకు ఇప్పటికి కూడా తెలియదు, ఎవరికి ఎడిషనల్ పోర్ట్‌ఫోలియోలు ఉన్నాయో ప్రజానీకానికి తెలియదు. అన్ని మంత్రి పదవులు ఒక్కరే పెట్టుకుని ఒక్కొక్క మంత్రి అలసిపోతున్నారు. అంటే మీ దగ్గర ఎంఎల్‌ఏలు సమర్థులు లేరా? దిక్కులేరా? అటువంటి పరిస్థితి మీకుందా? ప్రజాప్రతినిధులే పరిపాలన చేయాలని మన రాజ్యాంగంలో చెబితే కనీసం క్యాబినేట్ కూడా ఏర్పాటు చేసుకోకుండా 24 మందితో ఏదో ఒక రకంగా, ఇది కాంగ్రెస్‌పార్టీ ఇంటర్నల్ సమస్య కాదు. రాష్ట్ర ప్రజలకు సంబంధించిన సమస్య. రాష్ట్ర ప్రజలు మిమ్ములను ఎన్నుకున్నారు. ఎన్నుకున్న తరువాత మీరు పరిపూర్ణమైన క్యాబినెట్, రెస్పాన్సిబిల్ క్యాబినెట్, ప్రజల కోరికలు ప్రతిబింబించే విధంగా, ప్రజల మనోభావాలకు అనుగుణంగా, ప్రాతినిధ్యం కలిగించే విధంగా క్యాబినెట్ ఉండాలి తప్ప, మిగతా మంత్రి పదవులు ఇస్తే అసంతృప్తి వస్తుంది కనుక ఇదేదో మీ స్వంత వ్యవహారంగా పెట్టుకుంటే ప్రజల పరిస్థితి ఏమిటి? ప్రజలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు గవర్నమెంటు నడపజాలని పరిస్థితి అంటే వారి పరిస్థితి ఏమిటి? But it is not your internal affair. ఇది స్వంత వ్యవహారం కాదు. రాష్ట్రానికి సంబంధించి, రాష్ట్ర ప్రజానీకం తెలుసుకునే పరిస్థితి

ఉంది. దానికి వివరణ ఇవ్వాలి. ఇక్కడ ఈ పరిస్థితి అంటే, సెంట్రల్‌లో మినిస్టర్స్‌గా మనవారు ఉన్నారు. సెంట్రల్ మినిస్టర్స్‌గా తమిళనాడు వారు కూడా వున్నారు. వారికి ఎన్ని ప్రాజెక్టులు పోతున్నాయి? ఎన్ని విధాలుగా విపరీతంగా డబ్బు వాళ్లు తీసుకుని పోతుంటే, వీళ్లు కనీసం నోరు విప్పరు. ఈ రాష్ట్రానికి రావలసిన నిధులు ఏమి వస్తున్నాయి? ఎఐపిపిలో మీరు గత బడ్జెట్‌లో రూ. 1200 కోట్లు చూపించారు. రూ.300 కోట్లు తెచ్చారు. ఇప్పుడు రూ.1250 కోట్లు చూపిస్తున్నారు. అందులో ఎన్ని వస్తాయో, ఎన్ని రావో తెలియదు. ఆ రోజులలో మా గవర్నమెంట్ ఉన్నపుడు కేంద్రంతో గొడవ అయ్యేది. ఏదన్నా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకుని పోతున్నారు, గవర్నమెంట్‌లో 70 శాతం నిధులు ఆ రోజులలో మనం తెచ్చుకున్నాము. మరి మీరేమి చేస్తున్నారు, ప్రధానమంత్రి గారికి ప్రత్యేకమైన వినతి. ఏమి చేసుకోడానికి చెప్పండి. ఉదయం పేపర్లో చదువుకని పొయ్యిలో పెట్టుకోడానికి తప్ప, అదేమి వినతి? రూపాయి వచ్చించి లేదు. తెచ్చింది లేదు. రూ. 20 వేల కోట్ల రూపాయల ప్రత్యేక నిధితో ముఖ్యమంత్రిగారు బయలుదేరి పోయారు. ఏమి నిధులు తెచ్చారు, ఎక్కడెక్కడ నుండి తెచ్చారు? ఇరిగేషన్ రంగంలో ప్రత్యేకమైన ప్రాజెక్టులు చేపట్టాలని మేము కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నాము, ఇంతవరకు ఏమయింది? ఆ విధమైన పరిస్థితిలో కేంద్రంలో నిర్వీర్యంగా, ఇచ్చినదాని కంటే తెచ్చింది తక్కువ, ఇక్కడ నుండి ఇచ్చేది ఎక్కువ అయింది. ఆ విధంగా సూట్‌కేసులు మోయడం తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకొకటి లేదు, ఇందులో బడ్జెట్‌లో హోం డిపార్ట్‌మెంట్ గురించి కొంచెం మెన్షన్ చేశారు తప్ప ఉపన్యాసంలో మినిస్టరుగారు పెద్దగా చెప్పలేదు. రోశయ్యగారు హోం డిపార్ట్‌మెంట్ సంగతి పట్టించుకోలేదు. నిజంగా అటువంటి పరిస్థితే. ఒకనాడు ఒక రాజుకు ఖైదీలను వదిలిపెట్టాలని ఆలోచన వచ్చింది. పాపం ఇంతమంది చాలా రోజుల నుండి ఖైదీలు ఉన్నారు. జైలుకు వెళ్లారు. పోయి ఒక్కొక్కరినీ అడగడం మొదలు పెట్టారు. వాళ్లు ఒక్కొక్కరు అయ్యా,, అన్యాయంగా నన్ను తెచ్చారు, ఏమీ తప్పు చేయలేదు అన్నారు. ఇంకొక ఆయన దగ్గరకు పోయి అడిగినా అన్యాయంగా తెచ్చి పెట్టారు అనే చెప్పాడు, అందరూ ఇలాగే చెప్పారు. చివరగా ఇంకొకాయన దగ్గరకు పోయి అడిగితే. అవును సార్ నేను నేరం చేశాను, తప్పు చేశాను, ఖూనీలే చేశాను, అందుకే తెచ్చిపెట్టారు అని చెబితే, దానికి రాజు ఇంతమంది మంచివాళ్లలో నువ్వు ఒక్కడివే ఎందుకు ఉన్నావు, నిన్ను విడుదల చేశాను ఫో. మంచి వాళ్లను విడుదల చేయకుండా హోం డిపార్ట్‌మెంట్ చేస్తున్న పరిస్థితి ఏమిటంటే, అసలు ఖూనీలు చేస్తున్న వారిని వదిలి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నేను కోర్టులను తప్పు పట్టడంలేదు. ప్రవర్తన మార్చుకున్న వారిని కూడా జైలులో పెడతారా? మీ పరిపాలన ఆ విధంగా ఉంది. అసలు ఖూనీకోరులను ఎలా వదిలిపెట్టాలని ఎక్సర్‌సైజు చేస్తున్నారు గానీ మంచివారుగా ప్రవర్తన మార్చుకుంటే వారిని విడుదల చేసే పరిస్థితి లేదు. ఆయన హోం డిపార్ట్‌మెంట్ చేతులెత్తేసింది . మంత్రిగారు పాపం పెద్దమనిషి, ఏమన్నా అంటే పరిశీలిస్తున్నాను అంటారు, ఆయన పరిశీలన, మా పరిశీలన ఇక దీనికే సరిపోతుంది తప్ప ఇంకొకటి లేదా అని అడుగుతున్నాను.

**అధ్యక్షా, కరప్షన్ గురించి కూడా ఒక మాట మనవి చేయాలి. విలేజ్ సెక్రటరీలను రెవిన్యూ సెక్రటరీలుగా పూర్తిగా మార్చివేసి. విలేజ్ అడ్మినిస్ట్రేషన్‌ను, లోకల్ బాడీలను అధ్వాన్నంగా**

**మార్చేస్తున్నారు. లోకల్ బాడీలకు పవర్స్ ఇస్తున్నామని చెబుతున్నారు. ఆ పవర్స్ ఎక్కడకు పోయాయి?** డీ సెంట్రలైజేషన్ గురించి ఎన్నికలప్పుడు ఉద్యమాలు చేసిన మహానుభావులు ఈనాడు కనిపించకుండా పోతున్నరు . ఈనాడు వారి పంచాయతీలకే సమయం సరిపోతోంది తప్ప మా పంచాయతీలను గురించి పట్టించుకునే పరిస్థితి లేదు. ఇద్దరు మంత్రులు వారి పంచాయతీలను అనంతపురంలోనే సెటిల్ చేసుకుంటున్నారు, అందుకే వారి సమయం సరిపోతోంది.

వారు మా పంచాయతీలకు కావలసిన వనరుల గురించి ఎంత మాత్రమూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ఎ.పి.ఐ.ఐ.సి. భూములను కూడా అమ్ముకుంటోంది. మేము చాలా ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ చేస్తున్నామని అంటారు. మరి మంత్రి గారి హామీ ఎక్కడకు పోయిందో , వారు ఏమేమి చేస్తున్నారో, తెలియ జేస్తే బాగుంటుందని కోరుతున్నాను. You are great Finance Minister of the State. ఇండస్ట్రియల్ ప్రమోషన్ కోసం వున్న ఏజన్సీ అయిన ఎ.పి.ఐ.ఐ.సి.ని భూములు అమ్ముకుని మాకు ఇవ్వమని చెబుతున్న మహా ప్రభుత్వం ఇది. ఇండస్ట్రీలకు కేటాయించిన ల్యాండ్స్, ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కోసం కేటాయిచిన ల్యాండ్స్‌ను అమ్మేసి రాష్ట్ర ఖజానాకు జమ కట్టమని చెప్పిన మహా ప్రభుత్వం. యాక్చువల్‌గా ఇండస్ట్రియల్ ప్రమోషన్ కోసం నిధులను భూములును కేటాయించి, వారికి మౌలిక సదుపాయాలను కల్పించి, ఆ సదుపాయల ద్వారా ఇండస్ట్రీలను ఆకర్షించేందుకు ప్రయత్నించాలి కాని, వున్న భూములను అమ్మేసి మాకు ఇచ్చేయ్యండి, మేము మా బడ్జెట్‌ను పెంచుకుంటామని వత్తిడి తెచ్చే కార్యక్రమాలను చేస్తున్నారు. ఉన్న ల్యాండ్స్‌ను కోట్లాది రూపాయలకు అమ్మేసి, ఆ డబ్బును ప్రభుత్వ ఖజానాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఏదో చిన్న చిన్న మొత్తాలంటే పోనీలే అని సరిపెట్టుకోవచ్చు.

ఎక్కడ ప్రొటెక్ట్ చేయలేమో అక్కడ వుండే ల్యాండ్స్‌ను ఆక్షన్‌కు పెడుతున్నారు. చిన్న చిన్నవి పరవాలేదు కాని, వేలాది ఎకరాలను, అందులోనూ పేదలకు ఇచ్చిన భూములను గుంజుకుని మరీ అమ్మేసి, బడ్జెట్‌ను పెంచుకుంటున్నారు, బడ్జెట్ సైజ్‌ను పెంచుకుంటున్నారు. మా జిల్లాలలో ఆక్షన్‌ను పెడుతున్నారు. ఆక్షన్ పెట్టినా, అమౌంట్‌తో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని మా జిల్లా వంటి జిల్లాలలో కొంచెం కూడా ఖర్చు పెట్టడం లేదు. ఆనాడు ముఖ్యమంత్రిగా వున్న నారా చంద్రబాబునాయుడు గారు, స్కూల్ బిల్డింగుల కోసం అడగ్గానే రూ.25 కోట్లు భూములను ఆక్షన్ పెట్టగా వచ్చిన అమౌంట్ నుంచి ఇచ్చారు. కాని ఆనాడు మాకు రూ.100 కోట్లు కూడా రాలేదు. అందులో 25 శాతం మాకు ఇచ్చారు.

మరి మీరు ఈనాడు ఇన్ని వేల కోట్ల రూపాయలను తీసుకుంటున్నారు, మౌలిక సదుపాయాలను కల్పించడం లేదు. బడ్జెట్‌లో నిధులను చూపిస్తారు, వాటిని తీసుకెళ్లి లక్ష్మయ్య గారికి ఇస్తే, ఆయన కాంట్రాక్టర్లకు పంచి పెడతారు. ఈనాడు మీరు చేస్తున్న అవినీతి కార్యక్రమాలకు అంతూ పొంతూ లేకుండా పోయింది, మీకు ఎక్కడి నిధులూ సరిపోవడం లేదు. మంత్రి గారు చివరి ఒక్క నిమిషమూ వదిలిపెట్టమని అన్నారు. నేను కోరేది శాసనసభను మాత్రం వదిలి పెట్టెయ్యండి, లేకపోతే దానిని కూడా అమ్మి వేయగలరు. ఒక రోజున మేము పేపర్లో ఒక

వార్తను చూసాము. మేము ఈ రాష్ట్ర క్యాపిటల్‌నే మార్చి వేస్తున్నామని. మొత్తం సెక్రటేరియట్‌ను అమ్మెయ్యకుండా చూడాలని కోరుతున్నాను. అవినీతి, అక్రమాలతో నిండి పోయిన ప్రభుత్వమిది. దీని అవినీతి ఏ విధంగా వుందంటే, ' మేము ఏ విధంగానైనా మానేజ్ చేయగలమనే ఆలోచనతో వున్నారు. ఒక రష్యన్ ప్రోవెర్బ్ వుంది. When money speaks, truth keeps silent. ఆటోమేటిక్‌గా డబ్బు మాట్లాడడం మొదలు పెట్టేసరికి న్యాయం నోరు తెరవకుండా వుంటుంది.

ఆ విధంగా ఢిల్లీలో వుండే వారి నోరు మెదపనివ్వలేదు. ఇక్కడ వుండే వారికి చేతి నిండా డబ్బులు వున్నాయి కాబట్టి మేము ఎవరినైనా కొనగలుగుతాము, ఏమైనా చేస్తామనే ధోరణిలో వున్నారు. దానికి సరియైన విధంగా మూల్యం చెల్లించక తప్పదు. అవినీతి అక్రమాలకు, దుర్మార్గాలకు, ధర్మం లేకుండా చేస్తున్న పనులకు, ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు. హనుమంతుడు లంకకు వెళ్లి వచ్చి, రామచంద్రుడిని కలుసుకుని 'రామచంద్రా లంక చాలా బ్రహ్మాండంగా వుంటుంది, ఎక్కడ చూసినా పెద్ద పెద్ద భవనాలు వున్నాయి. రావణాసురుడి గురించి చెప్పాలంటే, చాలా మేధావి, చాలా శక్తివంతమైన వాడు, చాలా బలవంతుడని' చెబుతాడు. రాముడు చాలా నీరసపడిపోతాడు. అటువంటి వ్యక్తిని ఏ విధంగా గెలవగలమని ఆలోచిస్తూ వుంటాడు. హనుమంతుడు కంటిన్యూ చేస్తున్నాడు, ' అన్నీ బాగానే వున్నాయి కాని నీతి లేని వాడు, ధర్మం లేని వాడు' అంటాడు. రాముడు ఒక్కసారిగా లేచి ఖచ్చితంగా మనం అతనిని గెలుస్తాము, అతనిని ఓడించగలమని చెబుతాడు. కనుక నీతి నియమాలు లేని వాళ్లు, తమను తమ చుట్టు ప్రక్కల వుండే వారు కాపాడతారని అనుకోవడం చాలా పొరపాటవుతుంది. అందువల్ల నీతి నియమాలు లేని ప్రభుత్వం మీది. అన్నీ సర్వనాశనం చేసుకున్న ప్రభుత్వం కాబట్టి మీరు తప్పకుండా మూల్యం చెల్లించాల్సి వుంటుందని చెబుతున్నాను.

(ట్రెజరీ బెంచెస్ నుంచి అంతరాయం)

అధ్యక్షా, కాంగ్రెస్ సభ్యులు లాబీలలో కలిసినపుడు చెబుతూ వుంటారు. “మీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిదేమున్నది, మా ముఖ్యమంత్రి గారు చాలా బ్రహ్మాండంగా మా వ్యక్తిగత పనులు చేసి పెడతారు, అందరికీ ఏ పనులు కావాలంటే ఆ పనులు చేసి పెడతారు, మీ ముఖ్యమంత్రి అట్లా ఏమైనా చేసి పెట్టారా” అని అడుగుతూ వుంటారు. ఇట్లా చాలా చాలా చెబుతూ వుంటారు. ప్రజాస్వామ్యంలో మనం ప్రజాధనం యొక్క ధర్మ కర్తలం, ప్రజా ధనాన్ని దుర్వినియోగ పరచకూడదు.

(సభ వాయిదా)

## 2008-09 బడ్జెట్ పై చర్చ

22-2-2008

మేడమ్ స్పీకర్ గారూ, ఈ ప్రభుత్వపు చిట్ట చివరి బడ్జెట్‌ను మొన్ననే రోశయ్య గారు ప్రవేశ పెట్టారు. నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. ఎప్పుడైనా ఒక ప్రభుత్వం క్రొత్తగా వచ్చినప్పుడు ప్రవేశపెట్టేటువంటి బడ్జెట్‌కు చివరిగా ప్రవేశపెట్టే బడ్జెట్‌కు చాలా వ్యత్యాసం ఉంటుంది. మొట్టమొదటి సంవత్సరము క్రొత్తగా వస్తారు, తమకు ఉన్నటువంటి ప్రాధాన్యతలను నిర్ణయించుకుంటారు, కొన్ని కేటాయింపులు చేసుకుంటారు. అధ్యక్షా! ముఖ్యమంత్రిగారు కానీ, ఒక్క మంత్రిగారు కాని, కనీసం మొదటి వరుస బెంచిలో ఏ ఒక్కరూ లేరు. దీని ప్రకారం వారికి శాసనసభ మీద, బడ్జెట్ మీద ఎంత గౌరవం ఉన్నదో తెలుస్తున్నది. అధ్యక్షా, మీరు వారిని ఈవిషయమై మందలించాలి. ఈ విధంగా ప్రభుత్వంలో ఎవరికీ జవాబుదారితనం లేకపోవటం మంచిది కాదు. I am not here to make the records or break the records. మీలాగా 5,6 గంటలు మాట్లాడి మేము ఏదో చేసేస్తున్నామని చెప్పడానికి కాదు ఇక్కడ ఉన్నది. మెయిన్ అపోజిషన్ పార్టీగా బడ్జెట్ పైన మా అభిప్రాయాలు తెలియచేస్తున్నాప్పుడు, ప్రజల పక్షాన మేము జవాబుదారీతనంగా ఉన్నప్పుడు ప్రభుత్వ అధికారులు వాటికన్నింటికి కూడా జవాబు చెప్పవలసిన అవసరం ఉంది. అందుకే నేను ఆ విషయాన్ని గుర్తు చేశాను. ఈ విధంగా సభలో మంత్రులు లేకపోవడం చాలా బాధాకరమైన విషయము.

కాంగ్రెస్ ప్రభుత్వము అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరములు అయ్యింది. ఒక ప్రభుత్వానికి ప్రజాస్వామ్యములో నాలుగు సంవత్సరం కాలం చాలా ముఖ్యమైనది. అమెరికా లాంటి దేశాలలో ప్రజాస్వామ్యం అక్కడి అధ్యక్షులను ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఎన్నుకుంటారు. మన దేశంలో రాజ్యాంగబద్ధంగా ఐదు సంవత్సరాలు అవకాశము ఉంది. అమెరికాలో అఫెక్టివ్‌గా గవర్నమెంటు మూడు సంవత్సరాలు మాత్రమే పని చేస్తుంది. నాలుగో సంవత్సరం వచ్చేటప్పటికి వారికి ఎన్నికల సమయం మొదలు అవుతుంది. ఇప్పుడు అమెరికాలో పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ఒకవైపు ఒబామా, హిల్లరీ క్లింటన్ పార్టీ అభ్యర్థులుగా ఏవిధంగా పోటీ పడుతున్నారో చూస్తున్నాము. ఈ నాలుగు సంవత్సరాల కాలం చాలా ముఖ్యమైనది అని

చెప్పటానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఒక ప్రభుత్వము బ్రహ్మాండమైనటు వంటి అభివృద్ధిని చూపడానికి అవకాశం ఉంటుంది. ఈ సంవత్సరము బడ్జెట్ చాలా బ్రహ్మాండంగా ఉంటుందని, ప్రజలకు బాగా ఉపయోగపడుతుందని ఎదురుచూశాము. అందులో ఈ సంవత్సరము ఎన్నికల సంవత్సరము కాబట్టి ఇంకా చాలా జాగ్రత్తలు తీసుకొని బడ్జెట్ ప్రజంటేషన్ ఇస్తారేమో అని మేము చాలా ఆశతో ఎదురు చూశాము. మీరు బయట కూడా చాలా ఉద్యమాలు చూస్తున్నారు. ఎంతోమంది పేద జనం, అట్టడుగు జనాలందరూ కూడా రకరకాల ఉద్యమాలు నిర్వహిస్తూ, ఈ బడ్జెట్‌లో తమకు న్యాయం జరుగుతుందని ఆశించారు. కాని ఈ ప్రభుత్వం తన సహజ నైజాన్ని బయట పెట్టుకుంది తప్ప ప్రజల పక్షాన, ప్రజల కోసము ఈ బడ్జెట్‌ను విడుదల చేసినట్లుగా నాకు కనిపించుట లేదు.

రోశయ్య గారు 13 బడ్జెట్‌లు ప్రవేశపెట్టాము అని గొప్పగా చెప్పుకున్నారు. చాలా సంతోషము. బహుశా అది అరుదైన గౌరవము. ఒక ఆర్థిక మంత్రి 13 బడ్జెట్‌లు ప్రవేశ పెట్టడంతో రాష్ట్ర చరిత్రలో రోశయ్యగారు ఒక రికార్డ్ సృష్టించారు. బహుశా భవిష్యత్తులో కూడా ఎవరూ ఆ రికార్డును బ్రేక్ చేయలేరేమో? ఈ అవకాశం భవిష్యత్తులో ఎవరికి ఉంటుందో తెలియదు. ఈ ఘనత రోశయ్యగారికే దక్కింది. అధ్యక్షా! 13వ బడ్జెట్‌తో ఆ ఘనత ముగిసిపోతుంది. ఎందుకో గాని అందరు 13వ నంబరు అశుభం అంటారు. It is not a lucky number. ఆ విధంగా 13వ బడ్జెట్ ఆయనతో ఎండ్ అయిపోతుంది. మీరు గొప్పగా చెప్పుకున్నారు లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ దాటిస్తాం, దాటిస్తాం అని చెప్పి దాటించారు. లక్షా నాలుగు వందల ముప్పై కోట్ల రూ.ల బడ్జెట్ పెట్టి చరిత్ర మాత్రం సృష్టించారు. అందులో ఏ మాత్రం అనుమానం లేదు. అయితే ఒక నానుడి ఉంది అధ్యక్షా, లక్ష కోట్లు దాటి పోయింది బడ్జెట్, లక్ష కోట్ల ఆదాయం వచ్చేసింది అని గొప్పగా చెప్పుకున్నారు. చాలా సంతోషం. అయితే ఒక నానుడి ఉంది. దక్షుడు లేని ఇంట లక్షలు వచ్చినా నిలువ నీడ లేదన్నట్లుగా, దక్షత గల్గిన వాడు ఉంటే, ఆ దక్షతతో వచ్చిన డబ్బును నిర్వహిస్తే, మనం లక్ష్యాలను చేరుకోగల్గుతాము, ఆ విధంగా డబ్బుకి న్యాయం జరుగుతుంది. ఆ విధంగా కాకుండా ఎన్ని లక్షల కోట్లు వస్తే లాభమేమి? దుబారా ఖర్చులు, ఇష్టానుసారంగా కేటాయింపులు సరైనటువంటి ప్రాధాన్యత క్రమంలో ప్రాధాన్యతలను నిర్దేశించుకోక పోవడం వీటన్నింటి వల్ల, మీకెన్ని లక్షలు వచ్చినా దాని ఫలితాలు ప్రజలకు చేరుతాయా లేదా అనేదే మనం ఇక్కడ ఆలోచించుకోవలసిన విషయం. అయితే మీకు ఆ లక్షల కోట్ల రూపాలయు ఏ విధంగా వచ్చాయి అనే విషయానికి నేను తర్వాత వస్తాను. కాని ముందుగా ఈ లక్ష కోట్ల రూపాయలకు మీరిచ్చిన కేటాయింపులేమిటి? ఏ విధంగా మీరు కేటాయింపులు చేసుకుంటూ వచ్చారు? అన్ని రాజకీయ పార్టీలు నిన్ననే ముక్త కంఠంతో పేద వర్గాల వారికి మీరు ఏ విధంగా కేటాయింపులు ఇవ్వాలో చెప్పిన విధానాన్ని మీరు చూశారు. ఎందుకంటే రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వానికి ఒక ప్రత్యేకమైన స్థానం, పాత్ర ఉంది. ఎవరైనా సరే, ఈ దేశంలో వ్యక్తులు ఎంత పెద్ద పవర్‌ఫుల్ పర్సనాల్టీస్ అయినా కావచ్చు, కాని వారెవరికి పని చేసే అధికారం లేదు. వారు టాటా బిర్లాలు కావొచ్చు, అంబానీలు కావొచ్చు వారి దగ్గర వేల కోట్ల రూపాయలు ఉండొచ్చు కాక. వారికి పెద్ద పెద్ద పరిశ్రమలు ఉండొచ్చు కాక. కాని వారెవ్వరూ

ట్యాక్స్‌లు వేసి, ప్రజల సొమ్ముతో మళ్లీ అభివృద్ధి చేసే కార్యక్రమాలు చేసే అవకాశం రాజ్యాంగం కల్పించలేదు. కాని ఆ ఒక్క అవకాశం ప్రభుత్వానికి ఉంది. **ప్రభుత్వ బాధ్యత ఏమిటో రాజ్యాంగంలో నిర్దేశించబడింది. రాజ్యాంగం చాలా స్పష్టంగా చెపుతోంది. రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలు కూడా చాలా స్పష్టంగా చెప్పాయి. ఎవరు ప్రభుత్వంలో ఉన్నా, సమానత్వాన్ని ముందు తీసుకుని రావాలని చెప్పింది. దేశ సంపద అందరికీ చెందేటట్లు చూడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని రాజ్యాంగం చెప్పింది.** అసమానతలు లేని సమాజ నిర్మాణం చేయాలని చెప్పింది. సంపద ఎక్కడ కూడా ఏ కొద్ది మంది చేతుల్లో ఉండకుండా చూడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వాల మీద ఉందని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. కాబట్టి అధికారంలో ఎవరు ఉన్నా ఆ ఫ్రేమ్‌వర్క్‌లోనే ప్రభుత్వాలు పనిచేసుకోవాలని Directive Principles of State Policy చెపుతోంది. రాజ్యాంగంలోని అనేక నిర్దేశాలు ఆ విధంగా మనకు చెపుతున్నాయి. ఆ విధంగా మనం మన బాధ్యతల్ని ఎంతవరకు నిర్వర్తిస్తున్నామనేది ఇక్కడ ప్రశ్న. ఆ విధంగా అసమానతలు లేని సమానత్వం కోసం, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం, అట్టడుగు వర్గాల్ని పైకి తీసుకుని వచ్చి పేదరికం లేని సమాజం కోసం మనకు వస్తున్న నిధుల్ని ఖర్చు పెడుతున్నామా లేదా, ఆ దిశలో మనం ప్రణాళికలు వేసుకుని నడుస్తున్నామా లేదా అని మనం ఈ రోజు ఆలోచించుకోవాలి. అయితే గౌరవ ముఖ్యమంత్రిగారు మొన్న గవర్నర్‌గారి అడ్రస్ మీద ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా ఆరు గంటలపాటు సుదీర్ఘోపన్యాసం ఇచ్చారు. నేను మొదటి రోజు చాలా శ్రద్ధగా విన్నాను.

జి.డి.పి. విషయమై ఒక పత్రికలో వచ్చిన కథనం గురించి గౌ. ముఖ్యమంత్రిగారు దాదాపు గంటా పదిహేను నిమిషాలపాటు సమాధానం ఇచ్చారు. వారికి ఉన్న ఆధారాన్ని బట్టి ఆ పత్రిక అంచనా వేసింది. గ్రోత్ రేటు పైన difference of opinions వస్తుంటాయి. డిఫరెంట్ మెథడాలజీ అడాప్ట్ చేస్తూ ఉంటారు. ఆ డిటేయిల్స్‌లోకి వారు వెళ్లారు. వాటన్నింటిపై నేను కౌంటర్ వేయడానికి నేను ఇక్కడ సిద్ధంగా లేను. అవసరం లేదని కూడా అనిపించింది. వారు ఉగాది పంచాంగంలో చెప్పినట్లు చెప్పారు. పంచాంగం ఏముంటుంది అధ్యక్షా? పాపం పంచాంగం చదివే పండితులు ఎవరికి అనుకూలమైన పంచాంగం వాళ్లకు చెపుతారు. అందరూ అట్లా ఉండరు. కొద్ది మంది మాత్రం పాపం తంటాలుపడి చెపుతారు. ఆ విధంగా పంచాంగం చదివినట్లు పంచాంగం చదివి రికార్డు సృష్టించడం కోసం ఆరు గంటలపాటు సుదీర్ఘోపన్యాసం చేశారు. అది వేరే విషయం అనుకోండి.

ఏమైనా గ్రోత్ రేటు 10.37 శాతం వచ్చిందని, అది హైయ్యెస్టు అని వారు చెప్పారు. అయితే నేను వారిని ఒకటి అడగదలచుకున్నాను. అధ్యక్షా! నేను కూడా ఎకనామిక్స్ స్టూడెంటునే. అప్పుడు ఉన్న విద్యా విధానం వల్ల కాలేజ్ ద్వారా ఎక్కువగా విషయాలు తెలుసుకోక పోయినా, ఆ తర్వాత అనేక రకాల పుస్తకాలు చదివే అలవాటు నాకు ఉండటం వల్ల పుస్తకాలు చదవడం ద్వారా కాని, అనుభవ పూర్వకంగా గాని, దేశ ఆర్థిక పరిస్థితి గురించి అప్పుడప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేస్తూ ఉంటాను. కాబట్టి నాకు ఒక దేశం గురించి ఎగ్జాంపుల్ చెప్పమనండి. కేవలం

మూడు సంవత్సరాల్లోనే గ్రోత్ రేటు పది శాతం పైనే తీసుకుని వచ్చిన దేశం ఏదైనా ఉందా చెప్పమనండి. ఎటువంటి బేస్ లేకుండా, అంతకు ముందు ప్రయత్నాలు జరగకుండా, ప్రభుత్వం వస్తూ వస్తూనే మొత్తం పదిన్నర శాతం గ్రోత్ రేటు తీసుకుని వచ్చిన దేశమేదైనా ఉందా? పోనీ గ్రోత్ రేటు పెంపొందడానికి కావలసిన గ్రోత్ ఇంజన్స్ ఏమిటి అనేది మనం ఆలోచించవలసిన అవసరం ఉంది. మీరు వచ్చి నాలుగు సంవత్సరాలవుతున్నది. బడ్జెట్ కేటాయింపుల ఖర్చు విషయానికి వస్తే, మీరు దగ్గర దగ్గర మూడు సంవత్సరాల వరకు ఖర్చు పెట్టి ఉంటారేమో అని మనం అనుకుంటున్నాము. ఈ మూడు సంవత్సరాల కాలంలో ఆర్థికాభివృద్ధి రేటు సాధించడానికి మీరు పెట్టిన పెట్టుబడి ఎంతవరకు ఫలితాలను ఇచ్చింది అనేది ప్రశ్న. ఏ కారణాలు ఈనాడు మన రాష్ట్ర గ్రోత్ రేటును ముందుకు తీసుకుని పోతున్నాయి, దాంట్లో మీ పాత్ర ఏమిటి అనేది చెప్పాలి. ఎందుకంటే మీరు ఇక్కడ ఆ విషయాన్ని తీసుకుని చాలాసేపు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు కాబట్టి. నేను అందులోకి వెళుతున్నాను. గ్రోత్ రేటు ఇంత రావడానికి కారణం మీరు తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తయ్యాయా? కొత్తగా ఏదైన ఆయకట్టు వచ్చిందా? కాని 2000వ సం.లో ఉన్న ఆయకట్టు 16.49 లక్షల హెక్టార్లు అయితే, 2006-07 సంవత్సరం వచ్చేసరికి అదే 16.722 లక్షల హెక్టార్లుకు మనం ఈనాడు కాలువల ద్వారా నీళ్లు ఇచ్చే పరిస్థితి ఉందని మనకు ఉన్న statistical data చెపుతున్నది. అంటే కొత్తగా మీరు కట్టిన, కడతామనిచెపుతున్న ప్రాజెక్టులకు రమారమి బడ్జెట్ కేటాయంపుల్లో 50 శాతం నిధులు కేటాయిస్తున్న ప్రాజెక్టుల నిర్మాణ ఫలితాల వల్ల ఈనాడు అంత గ్రోత్‌రేటు వచ్చిందా? లేదూ, పెద్ద ఎత్తున రోడ్లు వేశాం, రోడ్ లింకేజ్ పెంచాము, నెట్‌వర్కింగ్ పెంచాము, ఆ విధంగా మేము పెద్దగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెచ్చాము, అందువల్ల పెరిగింది అని చెప్పుకోవడానికి మీరు అలాంటి కార్యక్రమం ఏదైనా చేశారా? ఈ రాష్ట్రంలో మేము వేసిన రోడ్లకు కనీసం మట్టి పోసే దిక్కులేదు. ఆ విధంగా మీరు ఏదైనా రోడ్ నెట్‌వర్కింగ్ పెంచినారా? లేకపోతే రాష్ట్రంలో ఈ మూడు సంవత్సరాల కాలంలో కొత్తగా పోర్టులు ఏవైనా వచ్చాయా? మీ మూలంగా ఏ ఎకనామిక్ యాక్టివిటీ పెరిగి ఇంత గ్రోత్‌రేటు పెరిగిందో ఫైనాన్స్ మినిస్టర్‌గారు తమ జవాబులో వివరణ ఇవ్వాలని రిక్వెస్టు చేస్తున్నాను. ఈనాడు ఎంతో అనుభవంగల రోశయ్యతోపాటు, ఎంతో మంది అనుభవజ్ఞులు ఇక్కడ ఉన్నారు. అసలు ఈ గ్రోత్‌రేటుతో రాష్ట్ర ప్రభుత్వం యొక్క అభివృద్ధి ఎంతవరకు ఉంటుంది? మనకు ఉన్న వనరులేమిటి? మనకు వచ్చే వనరులేమిటి? ఈనాడు ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ముందుకు పోతున్నది అని అంచనా వేయడానికి కావలసిన పారామీటర్స్ ఏమిటి? దాన్ని ఒకసారి అర్థం చేసుకోవాలని చెప్పదలచుకున్నాను. దురదృష్టవశాత్తు మన రాష్ట్రంలో taxation powers ఇప్పటికీ కూడా డీసెంట్రలైజేషన్ జరగలేదు.

ఈ ట్యాక్సెస్ తీసుకునే అధికారం మొత్తం కేంద్రం వారు వారి చేతులలో పెట్టుకున్నారు. 70 శాతం వరకు అనేక రకాలైన పన్నులను కేంద్రం రాష్ట్రాలతో పంచుకుంటున్నది. రాష్ట్ర ప్రభుత్వాలకు మిగిలింది బార్‌షాపులు, ఎక్సైజ్. ఇది కాక వ్యాట్. మిగిలిన చిన్న చిన్నవి తప్ప వనరులు సమీకరించుకోడానికి చాలా తక్కువ పరిధి ఉంది తప్ప మరొకటి లేదు. కేంద్రంలో కేంద్రప్రభుత్వం వారు నిర్వహించే పాలసీలే దేశవ్యాప్తంగా ఉంటాయి. ఆ ప్రభావం ఈ రాష్ట్రంపైన

ఎంత ఉందో మర్చిపోయి, ఇతర రాష్ట్రాలు అభివృద్ధి చెందలేదు. మనం మాత్రమే దూసుకు పోతున్నాము అని మాట్లాడడం మభ్యపెట్టడమే అవుతుంది. లేకపోతే తెలియక మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కనుక ఈనాడు గ్రోత్ అనేది మా కారణంగా, మా మూలంగా పెరిగింది అని చెప్పడం పొరబాటు అనే విషయం చెప్పదలచుకున్నాను. ఆనాడు ప్రభుత్వం చాలా కష్టపడి, అనేక రంగాలలో ఇబ్బందులు పడి ప్రజల కోపాన్ని కూడా మేము చవిచూచి, దానికి పెద్ద మూల్యం చెల్లించిన తరువాత బాధలలో ఉండి, ట్రాన్సిట్ పీరియడ్‌లో తీసుకున్న అనేక కఠినమైన నిర్ణయాలు ఫలితంగా రాష్ట్రంలో ఎకనమిక్ స్టెబిలిటీ వచ్చింది తప్ప, దానిమూలంగా మెల్ల మెల్లగా గ్రోత్ వస్తుంది తప్ప, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలు వలన ఎవరు ప్రభుత్వంలో ఉన్నా తప్పనిసరి పరిస్థితి. 1995లో భారతదేశం గ్రోత్ 2,3 శాతం కంటే లేదు. ఏదో రొటీన్‌గా జరిగిపోయేది తప్ప అంతకుముందు అభివృద్ధి అనేది మనకు పెద్దగా ఉండేది కాదు. ఏ పరిస్థితి వచ్చిందంటే **1991లో కేంద్రంలో పి.వి.నరసింహారావుగారు వారి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడినప్పుడు మనం మన బంగారాన్ని తీసుకుని పోయి కుదవ పెట్టే పరిస్థితి వచ్చింది. మూడు నాలుగు రోజులకంటే ఫారిన్ రిజర్వ్ లేని పరిస్థితి మనం చూశాము.** అలాంటి పరిస్థితులలో, మైనారిటీ గవర్నమెంట్‌లో ఉండి అనేకమైన క్లిష్టమైన నిర్ణయాలు తీసుకున్నాము. ప్రజలు కూడా ఆమోదించారు. ఎందుకంటే గత్యంతరం లేదు. ఆ విధంగా తీసుకున్న నిర్ణయాలు, మెల్ల మెల్లగా తరువాత వచ్చిన ప్రభుత్వాలు కంటిన్యూ చేస్తున్నాయి. ఇప్పుడు కూడా అవే పద్ధతులు కొనసాగుతున్నాయి. గ్రేట్ ఎకనామిస్ట్ ఈ రోజు ప్రధానమంత్రిగా ఉన్నాడు. He is not a social scientist. దేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని ఆవిధంగా ఎకనామిక్ పాలసీలు పెడితే, ఈ దేశంలో ఉన్న మెజారిటీ ప్రజల జీవితాలు బాగుపడేవి. ఎటొచ్చీ సంపద సృష్టించాలి, గ్రోత్ తేవాలి అనే డైరెక్షన్‌తో ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయి తప్ప, ఈ సంపద పేద ప్రజానీకానికి ఏ విధంగా చేరాలి? ఏ విధంగా ఈ సంపదలో వారిని భాగస్వాములను చేయాలనే ఆలోచనా విధానం లేదు. ఆ విధంగా ముందుకు పోవడంలేదు. తారతమ్యాలు బాగా పెరిగిపోతున్నాయి. ఫైనాన్స్ మినిస్టరుగారు మాట్లాడుతూ, తలసరి ఆదాయం బాగా పెరిగిపోతున్నది అని చెప్పారు. దానికి లెక్కలు ఏమిటి చెప్పండి. ఒక గ్రామంలో మొత్తం 100 కుటుంబాలు ఉంటే 10 మంది దగ్గర 90 ఆవులు ఉన్నాయి. మిగతా 90 మంది దగ్గర 10 ఆవులు మాత్రమే ఉన్నాయి. దానికి మన ఎకనామిస్ట్ పోయి లెక్కలు ఏమి తేలుస్తారంటే తలసరిగా ప్రతి ఇంటికీ ఒక ఆవు వుందని తేల్చుతారు. ఇది తలసరి ఆదాయమా? ఆనాడు టాటాలు, బిర్లాలను తలసరి ఆదాయంలో లెక్కకట్టి, గుడిసెలో ఉండే పేదవాడిని కూడా తలసరి ఆదాయం క్రింద లెక్కగట్టి, అందరిమీద సమానంగా సంపద వచ్చింది, ఆదాయం వచ్చింది అని ఒక లక్ష కోట్ల రూపాయలు ఉన్నవాడిని, కనీసం రు.5లు కూడా లేనివాడిని ఒక గాటనకట్టి, తలసరి ఆదాయం లెక్కకట్టి అభివృద్ధి సాధించాము అని పెద్దలు చెబితే, ఇది డిఫెక్టివ్ సిస్టం తప్ప అంతకంటే ఇంకొకటి కాదు. అమర్త్యసేన్ వంటి మహానుభావుడు, నోబెల్ బహుమతి గ్రహీతలు చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టే పనులు కాదు, వాస్తవ దృక్పథంతో ఆలోచన చేయాలి. వాస్తవాలకు అనుగుణంగా పాలసీలు తీసుకుని పోవాలి అని చెప్పారు. వాస్తవాలు ఏమిటో మనం ఒకసారి ఆలోచన చేయాలి. మానవ అభివృద్ధికి మన దేశంలో సూచిక ఏమిటి?

ఉన్న ప్రజలకు వారి జీవన ప్రమాణాలు పెరగకుండా, వాళ్లకు కడుపు నిండా తిండి దొరకకుండా అందరూ చదువుకోవడానికి, వైద్యానికి సరైన సమానమైన అవకాశాలు, వనరులు అనే పదం మనం పదే పదే వాడుతున్నాము. Because there are so much disparities between the poor and rich in this country. సమానమైన అవకాశాలు పేదలకు దొరకడం లేదు.సమానమైన అవకాశాలు మీరు ఇవ్వకుండా, ఆ పరిస్థితి తీసుకుని రాకుండా వారికి సోషల్ సెక్యూరిటీ ఇవ్వకుండా మీరు తలసరి ఆదాయం లెక్క పెట్టుకుని, అభివృద్ధి సాధించామని చంకలు కొట్టుకుంటే మోసం చేయడం అవుతుంది తప్ప ఇంకొకకటి కాదు. ప్రాధమిక అవసరాలు, పేదరికం డెఫినిషన్ మార్చాలి అని ఎకనామిస్ట్‌లందరూ చెప్పడం జరిగింది. ఈ విధంగా ముందుకు నడిచిన నాడే బడ్జెట్‌కు ఏమన్నా సార్థకత ఉంటుంది తప్ప ఏదో మేము తలసరి ఆదాయం పెంచాము. రూ.11 లక్షల కోట్లు వచ్చింది. నిజంగా చాలా గొప్పవాడిని అయ్యాను అని చిందులు వేస్తే ప్రజలు మన్నలను పొందుతారు అని అనుకుంటే చాలా పొరబాటు. కనుక ద ఎండ్ రిజల్ట్ What is the end result is most important. పారా మీటర్స్ ఆ విధంగా తీసుకోవాలని మీ అందరికీ తెలియజేస్తున్నాను. మా దగ్గరకు కొంతమంది నన్ను కలవడానికి వచ్చి ఒక రిప్రజెంటేషన్ ఇస్తున్నారు వచ్చిన వారిలో ఇద్దరు ముగ్గురు ఎగురుతున్నారు. సార్, మా దగ్గర చెరువు నిండిపోయింది. బావి నిండింది సార్ అని చెబుతున్నారు. వచ్చినవాళ్లు ఏమి చెబుతున్నారు చెరువు చాలాసార్లు నిండింది, మాకు ఏమన్నా జీవితాలు బాగు పడేదుందా? సార్ దగ్గరకు వచ్చాము, ముందు ఆ స్కూల్ సంగతి చెప్పు, రోడ్ మంచిగా చేసుకుంటే, బస్ రావడం లేదు, దాని సంగతి మాట్లాడుతాము, ఏదోవిధంగా పట్నం పోయి, కూరగాయలు అమ్ముకోవాలి, దాని సంగతి చెప్పండి అంటే ప్రజలు ఎంతమందికి అనుకూలంగా వస్తుంది? మెజారిటీ ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? దానికనుగుణంగా ప్రణాళికలు చేయకుండా నాకు ఏదో ఆలోచన వచ్చింది. ఈ రాష్ట్రంలో ఏకైక వ్యక్తే ఎకనామిస్ట్, ఏకైక వ్యక్తే సైంటిస్ట్. సర్వం తెలిసిన వ్యక్తి ఎవరంటే ముఖ్యమంత్రిగారే. ఆయనకు ఏ ఆలోచన వస్తే తెల్లారేసరికి ఈ రాష్ట్రంలో ఒక పాలసీ వస్తుంది. ఆయన ఏది మంచిది అనుకుంటే దానికి నిధులు కేటాయింపు చేయవలసిందే. ఆయనకు ఏదన్నా చాలా బాగా నచ్చిన స్కీము దొరికితే దానికోసం డబ్బులు కేటాయింపు చేయాల్సిందే. నేను ఇంతకుముందే మా ఫైనాన్స్ మినిష్టరుగారు పెద్ద గుమస్తా అని చెప్పాను. ఆయన చెప్పడం. ఈయన రాసేసుకోవడం, మొత్తం దస్త్రాలు అన్నీ ముందు పెట్టి, మేమేదో అభివృద్ధి సాధిస్తున్నామని లెక్కలు ముందు పెట్టడం. ఇది ఈనాడు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి డ్రామా తప్ప ఇంకొకటి కాదని నేను చెప్పదలచుకున్నాము. అదేవిధంగా ఈనాడు, మేము వనరులు పెంచుకున్నాము, బ్రహ్మాండంగా అదేదో వనరులు పెంచినట్లు, ఎన్నికల ముదు, 2004 కు ముందు ఎన్ని విధాలుగా మమ్మల్ని విమర్శించారు? ఎన్ని విధాలుగా టిడిపి వారు రుణాంధ్రప్రదేశ్ చేశారు, రాష్ట్రాన్నంతా మొత్తం అప్పులుమయం చేశారు, వరల్డ్‌బ్యాంకు జీతగాండ్లు అయ్యారు, అప్పులు చేస్తున్నారు అని ఏ విధంగా విమర్శలు చేశారు లోపల ఉన్న ఎంఎల్‌ఏలు, బయట వున్న రోశయ్యగారి నాయకత్వంలో ఆయన టీము. మేమేదో అప్పులు చేశామని, లెక్కలు మీ దగ్గర వున్నాయి కదా మీరు ఇచ్చిన ఎకనామిక్ సర్వే ఒకసారి చూడండి. యావరేజ్ అప్పులు ఇప్పుడు ఎంత ఉన్నాయి. అప్పుడు ఎంత ఉన్నాయి? మేము వచ్చినపుడు 1995 వరకు రూ.15 వేల కోట్ల

అప్పులు ఉండేవి. తరువాత అవి మేము రూ. 40,45 వేల కోట్ల వరకు చేశాము. యావరేజ్ నాలుగున్నర వేల కోట్ల రూపాయలు మా టైంలో వచ్చింది. రూ. 14 వేల కోట్లు చేసిన మహానుభావులు మీరు. ఈ నాలుగు సంవత్సరాలలో రూ. 63 వేల కోట్ల అప్పులు తెచ్చి ఆ తరువాత ఆ అప్పులు రూ. 14 వేల కోట్ల యావరేజ్‌కి తెచ్చారు. భూములు అమ్మారు ఇంకా రూ. 96 వేల కోట్లు మీ ఖజానాకు జమ చేసుకున్నారు. ఇంకా రూ.12 వేలు, రూ.14 వేల కోట్లు పెడతామని అంటున్నారు. ఆ సంగతి మీకు తరువాత చెబుతాను.

అదే విధంగా ఎక్సైజ్. మా ఫైనాన్స్ మినిస్టర్ గారు మమ్మల్ని అన్నన్ని మాటలు, పెట్టిన శాపనార్థాలు అన్నీ ఇన్నీ కాదు. వ్యక్తిగతంగా ఒకసారి నేను ఆయన శాపనార్థాలకు బలైపోయాను. 'ఏమి చేస్తున్నారు, ఎక్కడకు తీసుకుపోతున్నారు. ఈ రాష్ట్రాన్ని, మనిషి మనిషికీ మద్యాన్ని తాగిస్తున్నారు, అప్పుడే పుట్టిన పిల్లవాడికి ఉగ్గుపాలతో మద్యాన్ని పట్టిస్తున్నారు, త్రాగని వాళ్ల నోరు తెరచి పోసేస్తున్నారు, డబ్బులు గుంజుకుంటున్నార'ని చెప్పారు. మరి వారు ఈ రోజు పిల్లలకు పోయకపోతే ఎవరికి పోస్తున్నారు? పిల్లులకు, కుక్కలకు పోస్తున్నారా సారాయి? ఆయన ఖజానాకు ఈవాళ రూ.6000 కోట్లు, రూ.7000 కోట్లు వస్తున్నాయి. రూ.10000 కోట్లు మొత్తం అమ్మకాలు వుంటే, దానిపైన ఎక్సైజ్ ఆదాయం, దాని మీద వచ్చే సేల్స్ టాక్స్ ఆదాయాలు అన్నీ కలుపుకుంటే కొన్ని వేల కోట్ల రూపాయలు వస్తోంది. మరి ఎంత మంది త్రాగితే వస్తోంది? ఊరూరుకు బెల్ట్ షాపులు. ఎక్కడ చూసినా మొత్తం షాపులే ఈనాడు అభివృద్ధి బ్రహ్మాండంగా జరిగింది అంటే, ఏ ఊరికి పోయినా, తినడానికి ఏ షాపులోనైనా ఏమీ దొరకకపోయినా, త్రాగడానికి ఏదైనా దొరికేటట్లుగా అందుబాటులోకి తెచ్చారు, సంక్షేమ కార్యక్రమాన్ని ఆ రకంగా ముందుకు తీసుకుపోయారు. అదే విధంగా ' వ్యాట్ ' గురించి మేము ఇనిషియేషన్ తీసుకున్నాము. దానికి ఒక స్వరూపం ఇచ్చాము. ఆ రోజులలో మాకు కొంత భయం వుండేది. మాకే కాదు, యావత్ దేశంలో భయాలు వుండేవి. ఈ 'వ్యాట్ ' వచ్చిన తరువాత ఏమి జరుగుతుందో ఏమిటో అని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాలేదు. దాంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి, సేల్స్ టాక్స్‌లో మీకు ఏమైనా లాస్ కనుక వస్తే, మేము ఇస్తాము, ముందు 'వ్యాట్' ను ప్రవేశపెట్టాలని చెప్పారు. ఆ విధంగా 'వ్యాట్' ను ప్రోత్సహించడం జరిగింది. ఆ తరువాత 'వ్యాట్ ' ద్వారా విపరీతమైన రెవెన్యూలు వచ్చాయి. ఈ రోజు ఫైనాన్స్ మినిస్టర్ గారు చెబుతున్నారు, మేము పన్ను వేయలేదు, పన్ను వేయకుండానే ఆదాయం పెంచుకుంటున్నామని చెబుతున్నారు. మరి అదేమి ట్రిక్కో మేము కూడా తెలుసుకోవాలనుకుంటున్నాము. ఈ రోజు 22 శాతం రెవెన్యూలు పెరుగుతున్నాయి. ఏమైనా చైనా దేశంలో వేసిన టాక్స్‌లు మనకు వస్తున్నాయా లేకపోతే అమెరికా, పాకిస్తాన్ వసూలు చేసిన టాక్స్‌లు మనకు పంపుతున్నారా? లేకపోతే బ్రిటిష్ వాడు గతంలో మన దగ్గర దోచుకున్నవి ఇప్పుడు మనకు వాపసు ఇచ్చేస్తున్నాడా?

మన రాష్ట్ర ప్రజలు కడుతున్నారు ఈ టాక్స్‌లను. తలసరి పన్నులు ప్రతిరోజు ప్రతి మనిషీ కడుతున్న పన్నులు, ప్రతి సామాన్యుడూ కడుతున్న పన్నుల ద్వారానే ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నది. మా టైమ్‌లో 4.1 వుంటే మీ టైమ్‌లో 10.2 కు వచ్చింది. సామాన్యుడు ప్రతి రోజూ

కడుతున్న పన్ను, ప్రతి పేదవాడు కట్టుకున్న బట్టలపైన, తింటున్న తిండి పైన కడుతున్న పన్నులు తప్ప ముఖ్యమంత్రి గారో, లేక ఆర్థిక మంత్రి గారో, లేక మేమందరమూ కలిసి ఆస్థులను అమ్మి పన్నులను కట్టి ఈ ఖజానాను నింపడం లేదు. ఈ రాష్ట్ర ప్రజలే ప్రభుత్వ ఖజానా నింపుతున్నారు. 22 శాతం రెవిన్యూ ఈ విధంగా రకరకాలైన మార్గాలలో వసూలు చేస్తున్నారు. డీజిల్, పెట్రోలు రేట్లు మీ హాయాంలో 7 సార్లు పెరిగితే దాని గురించి ఏమీ మాట్లాడరు. కాని ఆ రోజు మా టైమ్‌లో 3 సార్లు పెరిగితే నానా గందరగోళం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చేతకాకపోతే మేము రాగానే సేల్స్ టాక్స్ తగ్గించి మా భారాన్ని మేమే మోసుకుంటామని అన్నారు.

మరి రోశయ్య గారు నా కంటే పొడుగ్గా వుంటారు, మంచి బలంగా వున్నారు, తప్పకుండా మోస్తారని మేము అనుకున్నాము. కాని ఆయన ఏమి మోస్తున్నారు? చప్పుడు చెయ్యరు. సేల్స్ టాక్స్ మీద ఒక్క మాట చెప్పనే చెప్పరు. పెట్రోలు, డీజిలు రేట్ల పెరుగుదల గురించి మాట్లాడరు. నన్నేమి చెయ్యమంటారు, కేంద్రంలో వుండే ప్రభుత్వం పెంచిందని అంటారు. కాని ఒక్క రూపాయి పెట్రోలు మీద పెరిగితే 33 పైసలు ఆయన సేల్స్ టాక్స్ వేస్తారు. అవి ఆటోమేటిక్‌గా ఖజానాకు జమ అవుతూనే వుంటాయి. ఈ రోజు వున్న రేటు ప్రకారం 33 శాతం సేల్స్ టాక్స్ మాట్లాడకుండానే వస్తుంది. ఆ విధంగా 7 సార్లు పెట్రోలు మీద, డీజిల్ మీదా రేట్లు పెంచారు. ఆ విధంగా వచ్చిన డబ్బులను ఖజానాకు జమ కడుతున్నారు. తగ్గించమని మేము ఎంత చెప్పినా మీరు తగ్గించడం లేదు. దాని ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు 300 శాతం పెరిగాయి.

గతంలో నిత్యావసర వస్తువుల ధరలు ఏ విధంగా వుండేవి? పప్పులు, ఉప్పులు, ఇట్లా ఏమి తీసుకున్నా గతంలో వున్న ధరలకు మూడింతలు, నాలుగింతలు పెరిగి కూర్చున్నాయి. ధరలు ఆ విధంగా పెరిగి ఇన్‌డైరక్ట్ పద్ధతిలో టాక్సులు కలెక్ట్ చేసుకుంటూ 22 శాతం పన్నులు వేసి, ఆదాయం పెంచుకుంటూ ' మేము ఏమి చెయ్యాలి, పన్నులు వెయ్యలేదు, నేను చూస్తూ కూర్చున్నాను, నా పన్ను అదే పెరిగుతుంద 'నే పద్ధతిలో ఫైనాన్స్ మినిస్టర్ గారు మాట్లాడడం విడ్డూరంగా వుంది. మనకున్న పరిస్థితులలో ప్రభుత్వం కాని, ఫైనాన్స్ మినిస్టర్ కాని మనకున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏమిటనేది ఆలోచన చేయాలి. ఉదాహరణకు ఒక కుటుంబం వుంటుంది. వారికి నెలకు రూ. 5000 ఆదాయం వస్తుంది. దానికి సహజంగానే కొన్ని ప్రాధాన్యతలను ఎంచుకోవడం జరుగుతుంది. వారికి ఆదాయం రూ. 10000 లకు పెరిగితే రోటీన్‌గా అయ్యే ఖర్చులు పోను ఎంత మిగులుతుంది, పిల్లలకు మంచి చదువులు చదివించాలని వారు పెట్టుకున్న ప్రాధాన్యతా క్రమాలకు డబ్బులు పెంచి ఖర్చు పెట్టుకోవడమనేది ఒక బాధ్యతాయుతమైన కుటుంబం చేయడం చాలా సర్వసాధారణం.

ఆదాయం పెంచుకోవడానికి అనేకమైన మార్గాలు వున్నాయి. మీరు ఆ మార్గాలను ఎంచుకోవడం లేదు, సెపరేట్‌గా దోపిడీ మార్గాన్నే ఎంచుకున్నారు. ఈనాడు రాష్ట్రంలో వున్న వనరులలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా వున్న వాటిని గురించి ఆలోచించాలి. అవి మానవ వనరులు. మనకున్న లేటెస్ట్ లెక్కల ప్రకారం మన రాష్ట్ర జనాభా 8.22 లక్షల మంది. మీరు ఇచ్చిన సర్వే రిపోర్టులే ఆ విధంగా చెబుతున్నాయి. ఆ మానవ వనరులను మనం ఇంప్రూవ్ చేయాలి. వారికి

కావాలసిన చదువు, వసతులు, ఏ విధంగా ఇంప్రూవ్ చేయాలి, ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనేది చూడాలి. అదే విధంగా మనకున్న భూమి, వ్యవసాయ యోగ్యమైన భూమి. బ్రహ్మాండమైన జీవనదులు వున్నాయి. బ్రహ్మాండమైన సముద్ర తీరం వుంది, అడవులు వున్నాయి, రుతుపవనాలు వున్నాయి. వాటినన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, దేనిని ఏ విధంగా వినియోగించుకోవాలో మీరు పద్ధతి ప్రకారంగా ప్లాన్ వేసుకుంటూ పోతే పేదరికాన్ని తొలగించడం మనకు అసాధ్యమైంది కాదు. కాకపోతే మీరు ఎంచుకున్న మార్గాలు దుర్మార్గంగా వున్నాయి.

మీరు పేదవారి కడుపు కొట్టి వారి చేత త్రాగించి, వారి జీవనాన్ని సర్వనాశనం చేసే పద్ధతిలో, ఏదో ఒక రకంగా ఖజానాను నింపే కార్యక్రమాన్ని పెట్టుకున్నారు. అధ్యక్షా! నేను ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు మంత్రిగారు ఇచ్చిన జవాబును వింటూ కూర్చున్నాను. దానిని మీకు ఎగ్జాంపుల్‌గా చెప్పదలచుకున్నాను. మైనింగ్ మినిస్టరు గారు చెబుతున్నారు. మేజర్ మినరల్స్ మీద కేంద్ర ప్రభుత్వానికి అధికారం వుంది, మాకు లేదు, మేము మైనర్ మినరల్స్‌కే వేస్తామని మంత్రిగారు చెప్పారు. నేను తప్పు పట్టడం లేదు. కాని **మనకు వున్న వనరులను మనం ఏ విధంగా వినియోగించుకోవాలి, వాటిని ఏ విధంగా తీసుకోవాలనే దానిపై ఆలోచించాలి. ప్రభుత్వాలకు హక్కు లేదా? మనకు రాజ్యాంగం అనేక విధాలుగా స్వేచ్ఛనిచ్చింది. ఆ విధంగా స్వేచ్ఛను ఉపయోగించుకోకుండా బాధ్యత నుంచి తప్పించుకోవాలనుకునే పద్ధతి కరెక్ట్ కాదు.**

ఒక విషయం ఆలోచించండి. మనకు ఐరన్ ఓర్ వుంది. ఇంతకు ముందు టన్నుకు రూ.500, రూ.600 వుండేది. కాని ఈవాళ రూ.3000 టన్ అయిపోయింది. దానిపైన ప్రభుత్వానికి ఏమి వస్తుంది? దానిపైన వారు పెట్టిన పెట్టుబడి ఏమిటి? ఏమైనా ఫాక్టరీ పెట్టారా? కేవలం మన్ను అమ్ముకుని తీసుకున్న పైసలు. వారు టన్నుకు రూ.3000 కొట్టేస్తున్నారు. మరి ప్రభుత్వానికి వచ్చేది కేవలం రూ.27 మాత్రమే. ఏ పెట్టుబడీ లేకుండా ప్రభుత్వానికి రూ.27 మాత్రమే కట్టి హెలికాప్టర్లలో తిరుగుతున్నారు.

అనేక హెలికాప్టర్స్‌లో వారు వెళుతూ ఉంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఈ విధంగా గనులు ఉన్నవారికి బెంగుళూరు బార్డర్‌లో ప్రతీ మనిషికి హెలికాప్టర్స్ అక్కడున్నాయి. ఆ విధంగా ఆ సంపద అంతా ఎవరిది? వారు ఏమయినా మ్యాన్యుఫాక్చరింగ్ చేశారా? చెమటోడ్చారా? వారిచ్చే కాగితం పెట్టుకొని భూములు త్రవ్వుకొని, మొత్తం 300 టన్నులు అలా అమ్ముకుంటూ ఉంటే, పేదవారు తిండి లేకుండా చస్తూ ఉంటే వనరులు రావడానికి అవకాశం ఉంటే రూ.1.00 లక్ష కోట్లు వసూలు చేయడానికి అవకాశం ఉందని లోకం కోడై కూస్తూ ఉంటే, వాటి మీద దృష్టి ఎందుకు పెట్టరు? వారు వీరికి కావలసిన వారు, వీరికి వారు, కాబట్టి అందులో అందరి పాత్ర ఉంది కాబట్టి చప్పుడు చేయడం లేదు. ఆలోచన చేయడం లేదు. రెండవ విషయం, బీమకుర్తికి సంబంధించింది. ఇదే అసెంబ్లీలో చెప్పాము. గొడవ కూడా అయింది. వేలాది కోట్ల రూపాయలు వస్తాయి, వీరు అన్యాయంగా ఇస్తున్నారని చెప్పారు. మరొకటి బాక్సైట్. ఈ విధంగా వేలాది కోట్ల రూపాయలు రావడానికి అవకాశం వచ్చింది. ప్రపంచంలో ఈ రోజు కొన్ని వస్తువులకు

లేని డిమాండ్ ఇప్పుడు వచ్చింది. ఆ విధంగా వచ్చిన డిమాండ్‌ని ప్రభుత్వం క్యాష్ చేసుకోరాదా? ఇది ఏమైనా రాజముద్రనా? రాయల్టీ రూ.27కన్నా ఎక్కువ వసూలు చేయడానికి లేదని కూర్చున్నారా? రాజ్యాంగబద్ధంగా వచ్చిన వారి బాధ్యతనా, వారు ఎందుకు చేయలేకపోతున్నారో ఆలోచన చేయాలి. ఆ విధంగా వనరులను సమీకరించుకొనే మార్గాలు వదిలిపెట్టి ఏవి అనుకూలంగా ఉంటే దానిని అవలంభించడం, ఏదైతే మనకు అవసరం ఉన్నాయో, వాటి గురించి చెప్పకుండా ఉండడం, ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు. వనరులను సమీకరించండి. ఈ రోజు దేశంలో సంపద విపరీతంగా వస్తోంది. క్రికెట్ ఆడేవారికి రూ.150 కోట్లు మొన్నే వచ్చాయి. ఆ విధంగా వేలాది కోట్ల రూపాయలు వస్తున్నాయి. ఆ సంపద పేదవారికి పోవడం లేదు. అవిధమయిన మార్గాలు అన్వేషించి, మంచి స్కీమ్స్ పెట్టాలని అందరికి తెలియచేస్తున్నాను. ఆ దిశలో ఆలోచన చేయాలని కోరుతున్నాను. ఈనాడు ఇంకొక ప్రధానమైన సోర్స్ ల్యాండ్. సేల్ ఆఫ్ ల్యాండ్స్ గురించి కొత్తగా కనుగొన్నారు. ఆ రోజుల్లో హుడాకి పర్మిషన్ ఇచ్చాము. అక్కడక్కడ ఉన్న చిన్న చిన్న బిట్స్ అమ్ముకొని హుడాలో ఖర్చుపెట్టుకోవడానికి అనుమతి ఇవ్వడం జరిగింది. ఆ రోజు మా జిల్లాలో స్కూల్స్ లేవంటే రూ.25 కోట్లు ఆ విధంగా తీసుకోవడం జరిగింది. కొంత అమౌంట్ వచ్చింది. తరువాత ప్రభుత్వం మారడంతో తీసుకోలేదు. ఆ విధంగా స్థానికంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఏదైనా చేయమని చెబితే, ఈనాడు మొత్తం షాప్ ఓపెన్ చేసుకొని వారు కూర్చున్నారు. మొత్తం రియల్ ఎస్టేట్ కంపెనీగా, ముఖ్యంగా ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా తయారుచేశారు. ఉన్న భూములన్నీ అమ్మివేశారు. ఏ.పి.ఐ.ఐ.సి., అంటే ఏమిటి? ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్. ఇండస్ట్రీకి కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసిన సంస్థను, ఇండస్ట్రీస్ దగ్గర భూములు అన్నీ లాక్కొని అమ్ముకునే సంస్థగా మార్చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కింది. ప్రభుత్వం వారికి బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తోంది. రూ.100 కోట్లు, రూ.200 కోట్లు వస్తే దాని మూలంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెంచి ఆ విధంగా పరిశ్రమలు రావడానికి ఆలోచన చేయడానికి ఉన్న కార్పొరేషన్ ఇప్పుడు ఏమి పని చేస్తోందో ఒక్కసారి అక్కడికి వెళ్లి చూస్తే తెలుస్తుంది. ఎక్కడ భూమి ఉంది, ఏ ఇండ్రస్ట్రీ దగ్గర భూమి ఉంది. ఎక్కడ ప్రభుత్వం ఇచ్చింది. ఆ భూములకు రేట్లు ఏమి పలకాలి. దీనిని కొనే వారు ఎవరు? బయట ఎవరున్నారు? బొంబాయి, మద్రాస్‌లో ఎవరున్నారో అనేదే తప్ప, అసలు ఇండస్ట్రీ ప్రమోషన్ మీద ఏపిఐఐసి ఏమీ చేయడం లేదు. అది దళారీ వ్యవస్థగా మారింది. అలా మార్చుకున్న ఘనత వీరికి దక్కింది. ఆ విధమైన కార్యక్రమాలున్నాయి. హుడా పని ఎప్పుడూ ఆక్షన్స్ పెట్టాలని చూడడమే. గోల్డెన్, ఐరన్ ఇలా మరొకమైన రకరకాల పేర్లు పెట్టడం, రకరకాల పద్ధతుల్లో ఆక్షన్స్ ఎలా పెట్టాలో తర్ఫీదు ఇచ్చి వారిని తయారుచేయడం, వారు ఇదే పని చేస్తున్నారు. అసలు హౌజింగ్ బోర్డ్ ఎందుకు ఏర్పాటు చేశారు. ఎవరయితే మధ్య తరగతి కుటుంబాలవారున్నారో, ప్రభుత్వోద్యోగులు ఉన్నారో, పేద వర్గాలు వారున్నారో, వారు స్వతహాగా ఇళ్లు కట్టుకోరు కాబట్టి వారికి నైపుణ్యం లేకుండా ఉంటుంది, ఆర్థికవనరులు లేకుండా ఇబ్బంది పడుతున్నారు కాబట్టి ప్రభుత్వం సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో హౌజింగ్ బోర్డ్‌ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈనాడు కూకట్‌పల్లిలో, వనస్థలిపురంలో హౌజింగ్ బోర్డులు,

హుడా, మిగతా కాలనీలు అన్నీ మధ్య తరగతి కుటుంబాలకు, ఆదాయం లేని కుటుంబాలకు గూడు కట్టించిన ఘనత హౌజింగ్ బోర్డ్‌కే దక్కింది. కానీ ఈ రోజు ఉన్న హౌజింగ్ బోర్డ్స్ ఎంత సిగ్గుచేటంటే, మొన్న కూకట్‌పల్లిలో హౌజింగ్ బోర్డ్ కార్యాలయాన్ని అమ్మారని అంటే దానిని ఎలా అర్థం చేసుకోవాలి? వారి సొంత కార్యాలయాలన్నీ అమ్ముకుంటున్నారు. మేమంతా ఆశ్చర్యపోయాము. మేము అక్కడికి వెళ్లి మీకు ఇంత దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందేమిటి? ఉన్న కార్యాలయాన్ని అమ్మివేశారు అని మేము గొడవ చేశాము. రేపు సెక్రటేరియట్‌ని అమ్ముతారో, పోతూ పోతూ ఏమి అమ్ముతారో చెప్పవలసిన అవసరం ఉంది. ఉన్న హౌజింగ్ బోర్డ్ పరిస్థితి ఆ విధంగా తయారుచేశారు. ఇవన్నీ అయిన తరువాత మిగిలింది ఏమైనా ఉంటే, అక్కడ కలెక్టర్ ఎంటర్ అవుతారు. ఇంతవరకూ కేటాయింపులు చేయకుండా హౌజింగ్ బోర్డ్, ఏపిఐఐసికి ఇంతకుముందు చెప్పిన సంస్థలకు కాకుండా ఇంకా ఏమైనా మిగిలి ఉంటే దానిని వారు అమ్మడానికి సిద్ధపడుతున్నారు. ఈ విధంగా భూముల అమ్మకం దాని మూలంగా వనరులను సమీకరించే పరిస్థితి, ఎవరయినా అడిగితే దబాయించి చెబుతున్నారు. నిన్ననో, ఈరోజో ముఖ్యమంత్రిగారు. అవును, అమ్ముతున్నాము వనరులను సమీకరించడానికి అమ్ముతున్నామని అన్నారు. ఒక్కసారి చూసినట్లయితే దీని పరిణామాలు ఏవిధంగా ఉన్నాయో చెప్పదలచుకున్నాను. సరౌండింగ్ ఏరియాలోని భూములు అమ్ముతున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, విశాఖపట్టణాలలో అమ్ముతున్నారు. అర్బనైజేషన్ పెరుగుతోంది. వలసలు ఆపే పరిస్థితిలో లేరు. ఎవరికీ సాధ్యమవుతుందని నేను అనుకోవడం లేదు. ప్రపంచం క్రమంగా మారుతూ ఉంటుంది. **ఎప్పుడయితే అభివృద్ధి కార్యక్రమాలు మెల్లగా పెరుగుతూ ఉంటాయో ఆర్థిక వసతులు మెరుగైన పరిస్థితులు మెరుగవుతాయో, గ్రామీణ వ్యవస్థ ఎప్పుడయితే కుప్పకూలుతుందో, గ్రామాలలో వారికి సంబంధించిన వసతులు కూడా దొరకనప్పుడు సహజంగా వలసలు పెరుగుతూ ఉంటాయి.** వలసలు వచ్చి ప్రజలంతా ఏ వనరులు లేని వారు అక్కడ బ్రతుకుతెరువు లేని వారు ఉంటారు. డబ్బు ఉన్న వారు ఎక్కడయినా సెటిల్ అవుతారు. డబ్బు లేని పేదల పరిస్థితి ఏమిటి? ఏమీలేని అంటే కాళ్లూ, చేతులు తప్ప కుల వృత్తులు పోయి, చేతి వృత్తులు పోయి వేరే వృత్తులు చేసుకోలేక, వ్యవసాయం సరిగ్గాలేక వ్యవసాయ కూలీలు వృత్తులు చేసుకోలేక పెద్ద ఎత్తున తరలి వస్తూ ఉంటే వారికి ఇళ్ల స్థలాలు మౌలిక సదుపాయాలు ఇవ్వాలి కదా అధ్యక్షా. ఆ ప్రాంతాలలో కావలసిన సామాజిక అవసరాలు అంచనా వేయాలి. కావలసిన స్కూల్ బిల్డింగ్స్, హాస్పిటల్స్, చివరకు చనిపోతే స్మశానాలు లేవు. దాని కోసం పెద్ద తగాదాలు జరుగుతున్నాయి. కొన్ని మతాలవారు స్మశానాలు కట్టుకోవడానికి లేకుండా చనిపోతే బస్తీలలో ఎక్కడికి తీసుకువెళ్లి క్రతువు చేయాలనేది సమస్యగా తయారయింది. ఎక్కడ పెట్టాలన్నా వారు ఒప్పుకోరు. మరొక చోట స్థలం ఉండదు. వారి పరిస్థితి ఏమిటి? చనిపోయిన వ్యక్తిని పూడ్చడానికి స్థలం లేకుంటే, ఉన్న స్థలాలను దుర్మార్గంగా అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. అటువంటిది ఆపండని ముక్తకంఠంతో చెబుతూ ఉంటే లేదు మీ దిక్కున్న చోట చెప్పుకోండి, మేము అమ్ముతానని మాట్లాడడం ఎంతవరకూ సమంజసం? ఈ విధంగా వనరుల సమీకరణ కరెక్ట్ పద్ధతా? ఒకసారి ఆలోచన చేయాలి. We must create the social asset. ఉన్న asset మొత్తం సంపదను పూర్తిగా వదిలితే రేపటి

ష్యత్ తరాల హక్కుల విషయం ఏమిటి? వారికి ఆ హక్కు ఎవరు ఇచ్చారు? 5 సంవత్సరాలకు న్నకొని పంపిస్తే ఇక్కడ ధర్మకర్తలా ఉంటారంటే, మొత్తం ఏమీ లేకుండా చేయడం, ధ్యతారాహిత్యం కాకుండా ఏమవుతుంది. జవాబు చెప్పాలని కోరుతున్నాను. ఈనాడు కనీసం, స్ట్ జనరేషన్‌కి ఏమీ ఉండకుండా చేయడం పొరపాటు అని గ్రహించడం లేదు. కాబట్టి తగిన నంగా ప్రజలే వచ్చే ఎన్నికల్లో జవాబు చెబుతారు.

ఈ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఏ విధంగా ప్రచారం చేశారు? ఊరూరికి వెళ్లి మేం పూర్తిగా వ్యవసాయాన్ని సర్వనాశనం చేసినట్లు, వ్యవసాయాన్ని పూర్తిగా పట్టించుకోనట్లు, ఆ రాష్ట్రంలోని రైతులందరూ ఆత్మహత్యలు చేసుకొని చనిపోతున్నట్లు ఏకంగా వారి అధ్యక్షురాల్ని సుకొచ్చి వారంతా భిక్షాటన చేసి వాళ్లందరికీ డబ్బులిస్తున్నామన్న పద్ధతిలో అనేక రాజకీయాలు చేశారు. ఈ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మేం టీవీలలో ఆ సాయంకాలం చూశాము. అదే రోజు ఒక ఆర్డర్ వేశారు. రైతులారా మీరెవరూ ఆత్మహత్యలు చేసుకోవడానికి వీలు లేదని చేతులూపుతూ బ్రహ్మాండంగా చెప్పారు. ఏదో ఆయనను అడిగి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు, తాను ఆ విధంగా చెప్పి రాజముద్ర వేయగానే ఆత్మహత్యలు బంద్ అవుతాయన్నట్లుగా పెద్ద ప్రకటనలు చేశారు. మరి మీ పరిపాలనలో ఎంతమంది చనిపోయారు? ఐదు వేల మంది చనిపోయారు.

దానికి మీరేమి జవాబు చెబుతారు? తెలుగుదేశం తొమ్మిది సంవత్సరాల పాలనలో వెయ్యి మంది చనిపోతే అంతకు డబుల్ కాదు ఐదింతలు చనిపోయారే? మరి దానికి మీరు జవాబు చెప్పాలి. మా పాలనలో వెయ్యిమంది చనిపోతే నానా రకాలుగా మాట్లాడారు. మీరు వచ్చిన తరువాత మేము రైతు బిడ్డలమని, మొత్తం అగ్రికల్చర్‌ను పూర్తిగా మార్చి వేస్తామని అనేక రకాలుగా యాక్టింగ్‌లు చేశారు. ఏమైంది మరి మీ అగ్రికల్చర్ సెక్టార్? ఏదో వర్షాలు బాగా పడితే నా పాలనలోనే వర్షాలు బాగా పడ్డాయన్నట్లు మాట్లాడుతున్నారు. ప్రక్కనే వున్న మహారాష్ట్ర తమిళనాడు బొంబయ్ దేశంలోనే కాదు మొత్తం ప్రపంచం అంతా వాతావరణ పరిస్థితులు అనుకూలించి వర్షాలు పడి, ఆ వర్షాల మూలంగా నీళ్లొచ్చాయి. అది కూడా మేమే చేశామన్నట్లు మాట్లాడారు. వర్షాలు బ్రహ్మాండంగా వున్నా రైతులు ఆత్మహత్యలు ఎందుకు జరిగాయో మీరు లోతుగా విశ్లేషణ చేశారా? వాటికి సంబంధించిన కారణాలపై ఏనాడైనా లోతుగా వెళ్లారా? కానీ మీరు బ్రహ్మాండంగా తలకు సెల్ల (తలపాగా) కట్టుకొని రైతు బిడ్డనన్నట్లుగా రోజుకు పది కోట్లు ఖర్చు పెట్టి రోజూ ప్రకటనలు ఇచ్చుకున్నారు. ఆ ప్రకటనలతో రైతుల కడుపు నిండుతుందా? ఆ విషయాన్ని అర్థం చేసుకొమ్మని చెప్పదలచుకున్నాను. మొత్తం పరిస్థితిపై కాస్త లోతుగా విశ్లేషణ చేస్తే మనకు గ్రీన్ రివల్యూషన్ రాకముందు అగ్రికల్చర్ సెక్టార్‌లో మనకు ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రామ్స్ అంతో ఇంతో జరిగేవి. గ్రీన్ రివల్యూషన్ వచ్చిన తరువాత అవి చాలావరకు నిలిచిపోయాయి. రైతులు ఎవరికి నచ్చిన పద్ధతిలో వాళ్లు తమ కార్యక్రమాలు కొనసాగించుకుంటూ వచ్చారు. ఆహార భద్రతను సాధించారు. ఇంత పెద్ద భారతదేశంలో ఎప్పటికైనా ఆహారం కోసం విదేశాల మీద ఆధారపడవలసి వస్తుందనుకున్న ప్రజానీకానికి రైతులు పుణ్యమా అని, సైంటిస్టుల పుణ్యమా

అని సెల్ఫ్ సఫిషియంట్ స్థాయికి చేరుకోగలిగాము. ఆ తరువాత వచ్చిన పరిణామాలు ఒక చూసినట్లయితే ప్రపంచీకరణ వచ్చింది. WTO వచ్చింది. ఒప్పందాలు కుదుర్చుకున్నా మొత్తం మీద ప్రపంచీకరణ మార్కెట్లో రైతులను వదిలేశారు. ఎక్కడో పండుతున్నా ఇక్కడ ధర తగ్గుతున్నాయి. ఎక్కడో పండకపోయినా ఇక్కడ ధరలు పెరుగుతున్నాయి. ఎక్కడ ఏమి జరుగుతున్న రైతుకు అర్థం కావడం లేదు. అర్థం చేసుకోవడానికి శక్తి కూడా చాలడం లేదు. ఆ విధం నియంత్రణ అనేది పూర్తిగా పోయింది. ఎక్కడో బావిలో వున్న చేపను తీసుకెళ్లి సముద్రం పడేస్తే అక్కడ తిమింగాలాల బారిన పడాల్సివస్తుంది. అట్లాగే మన రైతును తీసుకెళ్లి స్వేచ్ఛా మార్కెట్లో పడేస్తే ఎలా తట్టుకుంటాడు? సరియైన తర్ఫీదు వుండాలి కదా? తగిన తర్ఫీదు లేకుండా స్వేచ్ఛా మార్కెట్లో వదిలేస్తే ఏం చేస్తారు? ఎలా తట్టుకుంటారు? అందుకే మేం మొన్న ధర్నా చేస్తూ ఊర్లు తిరిగినప్పుడు ఒక చోట ఒక రైతు ఏడుస్తూ తన గోడు వివరించాడు. తాను వేసి చెరుకు తోటలో కనీసం కోతకు కూడా డబ్బులు లేక, రెండవ పంట వేసుకోవడానికి డబ్బుల లేక తన చెరుకు తోటలో తాను నిలబడి నిప్పంటించుకొని తనకు తానుగా ఆత్మహత్య చేసుకున్నాడు. రైతులు ఇలాంటి దారుణమైన పరిస్థితికి, నిస్సహాయ స్థితికి మీరు కారణాలేమి చెబుతారు? వాటికి రాష్ట్ర ప్రభుత్వం కాని, కేంద్ర ప్రభుత్వం కాని కారణాలు చెప్పే స్థితిలో లేవు. ఏమంటే బ్రెజిల్‌లో బాగా పండింది. లేదా అమెరికాలో బాగా పండింది. అందువల్ల మన దగ్గర ధర రాలేదు అంటారు. అంటే ఇలాంటి వాటి కోసం రైతులు బ్రెజిల్ పోవాలా లేక అమెరికా పోవాలా? పోనీ వాళ్లలాగా ప్లాన్ చేసుకునే శక్తి మన రైతులకు వుందా? ఏదోవిధంగా సంవత్సరంలో రెండు పంటలేసుకుని నాలుగు డబ్బులు సంపాదించుకోవాలని కష్టపడే రైతుకు ఈనాడు ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కడో జరిగిన లేక జరుగుతున్న పరిణామాలు వాళ్ల మీద ప్రభావం చూపుతున్నప్పుడు వాళ్లను కాపాడే బాధ్యతను చేపట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేస్తారు. ధరలు బాగున్నప్పుడు బైట అమ్ముకోవడానికి బ్రహ్మాండంగా పర్మిషన్లు ఇస్తారు. ధరలు లేనప్పుడు వాళ్ల గురించి ఏమాత్రం పట్టించుకోరు. అందుకే మేము ధరలపైన నియంత్రణ కోసం గట్టిగా పోరాటాలు చేస్తుంటే మీరు వెకిలి చేస్తున్నారు. ఈనాడున్న ధరలతో వ్యవసాయం నిలబడుతుందా? మీరు మమ్మల్ని, మేము మిమ్మల్ని తిట్టుకోవడం తప్పితే అల్టిమేట్‌గా వాళ్లను పట్టించుకునేదెవరు? అందుకే వాస్తవాల్ని అర్థం చేసుకోమని చెప్పడానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. ఈనాడు వ్యవసాయ పరిస్థితులు ఏవిధంగా రోజు రోజుకూ తగ్గిపోతున్నాయో, రైతాంగం వ్యవసాయం నుంచి ఏవిధంగా పక్కకు తప్పుకుంటున్నారు అన్న విషయాల్ని గమనించాలి. మనం ఎన్ని మాటలు చెప్పినా, ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా ఈనాడు రైతులకు విసుగొచ్చేసింది. ఎన్ని చెప్పినా భూమి మీదనే ఆధారపడి బ్రతకజాలమన్న నిరాశనిస్పృహలతో వ్యవసాయ కూలీలుగా వలస కార్మికులుగా మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేటి రైతాంగం పరిస్థితిని మెరుగుపరచడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటి? దీనిపై ప్రత్యేకంగా ప్రభుత్వానికి ఒక విజన్ వుందా? మన దేశంలో ఇప్పటికీ 70శాతం మంది ప్రజానీకం భూమి మీద ఆధారపడి జీవిస్తున్న విచిత్రమైన పరిస్థితి వుంది. ఇటువంటి పరిస్థితి ప్రపంచంలోనే లేదు. మన దేశంలో 70 శాతం మంది పండిస్తారు. మిగిలిన 30 శాతం మంది కొనుక్కొని తింటారు. అదే విదేశాలలో అయితే ఏ రెండు లేదా మూడు శాతం నుండి 8 లేదా 10 శాతం మంది ప్రజలు మాత్రమే పండిస్తారు. మిగతా 90 శాతం మంది ప్రజలు వాటిని

కొనుక్కొని తింటారు. దురదృష్టం ఏమంటే మన దేశంలో ఆహారధాన్యాలు ఎక్కువ శాతం మంది పండిస్తే తక్కువ శాతం మంది మాత్రమే అందిపుచ్చుకుంటారు. మన రాష్ట్రంలోని రైతులకు వ్యవసాయం తప్ప వేరే జీవనాధారం లేదు కాబట్టి వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నారు. ఇంతకంటే మెరుగైన అవకాశాలుంటే వాటి వైపు వెళతారు. కాబట్టి అటువంటి మెరుగైన అవకాశాలను, అలాంటి వాతావరణాన్ని మన రైతులకు కల్పించాల్సిన బాధ్యత మన ప్రభుత్వాల మీద వున్నది. ఆ విధంగా వారికి పెట్టుబడులు సమకూర్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలపైన వున్నది. అలాంటి అవకాశాలు, వాతావరణం, పెట్టుబడులు మన రాష్ట్రంలో లోపించిన పరిస్థితుల్లో మన రైతులు కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడకుండా వేరే వాటిపై దృష్టిపెట్టాలని మా నాయకుడు అంటే వ్యవసాయం దండగ అన్నారని ఆయన అనని మాటలను తీసుకొచ్చి ఎన్ని మాటలన్నారండీ? ఎన్ని నాటకాలాడారు? ఆ విధంగా మీరు రైతులను ఎంతో మభ్యపెట్టారు ముఖ్యమంత్రి గారు. మళ్లీ ఇప్పటికి జ్ఞానోదయమైనట్లుగా వ్యవసాయం లాభం లేదిక అందుకే వేరే వాటిపై ఆలోచన చేయాలని రైతాంగానికి చెప్పడానికి మీరు అధికారంలోకి వచ్చాక ఇన్నాళ్లకు కొత్తగా తెలిసిందా? ఇవ్వాళ మీరు ఈ విషయాన్ని కొత్తగా కనుక్కున్నారా? ఇది ఏ సామాన్యున్ని అడిగినా చెబుతాడే? ఎలాంటి అవకాశాలు లేని పరిస్థితుల్లోనే రైతాంగం వ్యవసాయం మీద ఆధారపడి బ్రతుకుతున్నారు తప్ప మంచి అవకాశాలుంటే ఆ వైపు వెళ్లడానికి అందరూ సిద్ధంగా వున్నారు. ప్రపంచంలో ప్రతి దేశంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో అవాస్తవాలు చెప్పే మీరు ఎన్నికల్లో గెలిచి ఇవ్వాళ వేషాలేస్తున్నారు. మోసాలు చేస్తున్నారు. అంతకుమించి మీరు చేసిన మేలు ఏమీ లేదని చెబుతున్నాను. ఏదో కరెంటు బకాయిలు మాఫీ చేసి రైతులకు కొంత ఊరట కలిగించారు. అయితే It is only a psychological relief. It is not a big financial relief. ఒక బస్తా బియ్యం ధరకంటే మించిన కరెంట్ బకాయిలు లేవు మీరు మాఫీ చేసిన బకాయిలు. అయితే బాధల్లో వున్నప్పుడు ఏది ఇచ్చినా అది ఊరట కలిగిస్తుందని అంగీకరిస్తున్నాను. ఆ విధంగా మీరు కొంతవరకు ఇచ్చి వుండవచ్చు. అయితే తరువాత మీరు రైతులకు చేసిన కరెంటు సరఫరా గురించి చెప్పాల్సి వస్తే, రైతులు పగలంతా కష్టపడి పని చేసి అలసిపోయిన పరిస్థితుల్లో మీరు రాత్రి పూట చేసే కరెంట్ సరఫరా ఎప్పుడు ఏ టైంకు వస్తుందో తెలియక రాత్రంతా దాని కోసం పడిగాపులు పడాల్సి వచ్చింది. దాని ఫలితంగా రెండు వేల మంది రైతులు రాత్రి పూట తమ పొలాల్లో కరెంట్ షాకు వల్ల చనిపోయే దౌర్భాగ్యకరమైన పరిస్థితులు మీ ప్రభుత్వంలో ఏర్పడ్డాయి. ఇక గిట్టుబాటు ధరల విషయానికి వస్తే గత మూడు సంవత్సరాలుగా ఏనాడూ మీరు గిట్టుబాటు ధరలు కల్పించ లేకపోయారు. మేం అధికారంలోకి వస్తే రైతుల కోసం మార్కెట్ ధరల నియంత్రణ కోసం రూ.500 కోట్లు కేటాయిస్తామని చెప్పి ఏనాడు దానిని అమలు చేయలేకపోయారు. ఇప్పుడు నాలుగేళ్ల తరువాత ఆ విషయం జ్ఞప్తికొచ్చి ఇప్పుడు రూ.30 కోట్లు ఇస్తే అది ఒక్క పంటకు కూడా సరిపోదు. కనీసం ఒక మార్కెట్ యార్డ్‌లోనైనా ఆ డబ్బుతో ధరలను నియంత్రించడానికి లేదా స్థిరీకరణకు సరిపోతుందా? ఈనాడు ధరల స్థిరీకరణపై కాని ధరల నియంత్రణపై కాని ప్రభుత్వం పట్టించుకోకుండా దళారీలపైన వదిలారు. ఈనాడు రైతులు తాము పండించిన పంటకు ఏ ధర వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్న

పరిస్థితుల్లో మార్కెట్లోని దళారీలు, వర్తకులు ఏకమై రైతులను ముంచేస్తుంటే ఇప్పటికి కూడా ప్రభుత్వం ఏమీ మాట్లాడకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నది. బాధ్యతారాహిత్యంగా వుంటున్నది.

పక్కన మహారాష్ట్ర, కర్ణాటక మిగతా రాష్ట్రాలలో ధరల స్థిరీకరణ నిధిని పెట్టి, రైతులకు కొంత బోనస్ కూడా ఇస్తున్నారు. సపోర్టింగ్ ప్రైస్ ఇస్తున్నారు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సపోర్ట్ చేసిన ప్రైస్ మాత్రమే గాకుండా దానికి అదనంగా కూడా ఇస్తూ, బడ్జెట్లు కేటాయింపులు చేస్తూ ఆదుకుంటుంటే-మాది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పి ఓట్లు వేయించుకుని గెలిచి, ఈనాడు వాళ్ల గురించి మాట్లాడకుండా, వాళ్లను గాలికి వదలేసి, వాళ్లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే మీరు మాట్లాడకుండా వుంటే ఇది బాధ్యతారాహిత్యం కాకపోతే ఏమవుతుందో చెప్పవలసిన అవసరం వుందని అడుగుతున్నాను. ఈనాడు వీళ్లు ఏదో గొప్పగా ఆలోచన చేస్తున్నట్లుగా, మేము బ్రహ్మాండంగా వ్యవసాయ రంగాన్ని ఒక మలుపు తిప్పేస్తున్నామని ప్రకటనలు ఇచ్చారు. ఎక్కడికి పోయారో వ్యవసాయ శాఖామంత్రిగారు హౌస్‌లో లేరు, ముఖ్యమంత్రిగారేమో మరొక రకంగా ఏదో చేస్తున్నామని చెబుతున్నారు. మేము అనుకున్నాం చాలా పెద్ద స్కీము పెడతారని. Unless and until Agriculture Sector ను turn around చేస్తే తప్ప ఈ వ్యవసాయరంగం బాగుపడదు, ఒట్టి మాటలతో, ఒట్టి కథలతో వ్యవసాయం బాగు పడుతుందని అనుకోవడం భ్రమే అవుతుంది.

**అధ్యక్షా! మేము పదిహేను రోజుల పాటు చైనా పర్యటనకు వెళ్లాం. అప్పుడు అక్కడ చూశాం, కుడాంగ్ అనే ఏరియాలో అత్యంత ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. మనకు, చైనాకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. ఎంతో పేదరికంలో వున్న చైనా, వ్యవసాయ రంగంపై అనేక ప్రయోగాలు చేసిన చైనా, ఆనాడు కొన్ని లక్షల మంది రైతులు ఆకలితో అలమటించి చనిపోయినా, మరి ఈనాడు చైనా దూసుకుపోతోంది,** బ్రహ్మాండమైన పద్ధతుల్లో చేస్తున్నారు, క్వాలిటీ ప్రొడక్టులను ఉత్పత్తి చేస్తూ ముందుకెళుతున్నారు. ఆవిధంగా turn around చేయాలి, అప్పుడే వ్యవసాయరంగం బాగుపడుతుంది. ఏదో గొప్ప స్కీము అంటూ ఆదర్శ రైతులను పెడుతున్నామంటూ చెప్పి, ఆ ఆదర్శ రైతులను చూసి మొత్తం రైతాంగమంతా నేర్చుకుని బాగు పడతారని చెప్పారు. ఎవరిని పెట్టారు ఆదర్శ రైతులుగా? 25వేల మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తీసుకొచ్చి ఆదర్శ రైతులుగా పెట్టారు. వాళ్లకు అసలు వ్యవసాయం అంటే ఏమిటో తెలియదు, పొలంలో నాటు ఎక్కడ వేస్తారో కూడా తెలియని వ్యక్తులను తీసుకొచ్చి ఆదర్శ రైతులుగా పెట్టారు అధ్యక్షా. వాళ్లు వ్యవసాయం చేస్తే, వ్యవసాయం వెక్కిరిస్తోంది వాళ్లను చూసి. అలాంటి వ్యక్తులను తీసుకొచ్చి ఆదర్శ రైతులను చేశారు మీ లబ్ది కోసం. మీరు పెద్ద ఎత్తున హోల్‌సేల్‌గా తింటున్నారు, మాకు కూడా ఏమైనా ఇవ్వరా అని వాళ్లు అడిగితే, సరే మీరు కూడా తినండంటూ ఆదర్శ రైతులను పెట్టి, రైతాంగానికి ఏదో బాగా చేస్తున్నామని, బ్రహ్మాండంగా చేస్తున్నామని మాట్లాడుతున్నారే అది ఎంతవరకు సమంజసమో చెప్పాలని కోరుతున్నాను. మీరు పెట్టిన ఆదర్శ రైతులు ఏవిధంగా రైతాంగానికి ఉపయోగపడుతున్నారు, ఏవిధంగా రైతుల సమస్యలను పరిష్కరించారు, ఏవిధంగా వారి మూలంగా ఉత్పాదకత పెరిగిందో చెప్పండి. ప్రొడక్టివిటీ పెరగాలి,

ఉత్పాదకత పెరిగిందని చెప్పడానికి మీ బెంచ్ మార్క్ ఏమిటి? మోడ్రన్ టెక్నాలజీ ఏదైనా వాడారా? వ్యవసాయంలో కొత్త పద్ధతులు ఏవైనా ప్రవేశపెట్టారా? కొత్త వంగడాలు తీసుకొచ్చారా? విత్తనాలు ఇవ్వగలుగుతున్నారా? మొన్నటి వరకు రైతులకు ఎరువులు కూడా ఇవ్వజాలని దౌర్భాగ్య పరిస్థితి మీ ప్రభుత్వానిది. రైతులు తమ పొలం దున్నుకుని సిద్ధంగా వుండి, మాకు ఎరువులు ఇవ్వండని అడిగితే, సరైన సమయంలో వారికి ఎరువులు కూడా సరఫరా చేయలేకపోయిన ప్రభుత్వం మీది. అలాగే విత్తనాలు సరఫరా చేయలేకపోతున్నారు. రైతులకు ఇవన్నీ సరఫరా చేయవలసిన కనీస బాధ్యత ప్రభుత్వానిది. అది కూడా చేయలేని మీరు వ్యవసాయాన్ని ఉద్ధరిస్తున్నాం, ఏదో చేస్తున్నామని మాట్లాడడానికి మీకు కనీసం సిగ్గు అయినా వుండాలి. సరైన ప్రణాళిక లేకుండా, సరైన మార్కెటింగు సదుపాయాలు కల్పించకుండా, ఈరోజు వ్యవసాయం రంగం గురించి మాట్లాడే నైతిక హక్కును మీరు కోల్పోయారని నేను తెలియజేస్తున్నాను. ఆవిధంగా వ్యవసాయ రంగాన్ని మీరు ముంచేశారు, ఇప్పటికైనా మీరు కళ్ళు తెరవండి, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, వరికి ఏదైతే వెయ్యి రూపాయిలు మద్దతు ధర ఇవ్వాలని సిఫారసు చేయబడిందో దాన్ని ఇప్పించండి, మంచిపేరు తెచ్చుకోండి. మీరు కొత్తగా చేయవలసిందేమీ లేదు. వాళ్లు agree అయితే సరిపోతుంది. ఆవిధంగా మీరు ఒప్పించడానికి ప్రయత్నం చేస్తే కొంతలో కొంత రైతాంగానికి మేలు జరుగుతుంది. ఆ విధంగానైనా ఇన్నాళ్లు మీరు చేసిన పాపాలు కడుక్కోండి. మోసపూరితమైన మీ పాపాలను తొలగించుకోండి. రైతాంగానికి కొంత సహాయం చేయండి. మద్దతు ధర విషయంలో గట్టిగా మీ ప్రధానమంత్రిగారికి, ఫైనాన్స్ మినిస్టర్‌కు, అగ్రికల్చర్ మినిస్టర్‌కు చెప్పండి. అయ్యా, చెరకు రైతులను ఇబ్బందుల నుంచి కాపాడండని. అక్కడ వున్న వ్యవసాయశాఖామంత్రిని అడిగితే, ఆయన ఇవేమీ పట్టించుకోకుండా క్రికెట్ మీద ఇంట్రెస్ట్ చూపిస్తారు, ఎక్కడ క్రికెట్ వుంటే అక్కడ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారే తప్ప ఆయనకు ఈ రాష్ట్ర వ్యవసాయ రంగంపై మాత్రం ఇంట్రెస్ట్ ఉండదు. ఇక్కడ వున్న ముఖ్యమంత్రిగారికేమో ఇక్కడ వున్న ఫ్యాక్టరీలు కనబడుతున్నాయి, సుబ్బిరామిరెడ్డి, ఇతరులకున్న ఫ్యాక్టరీలు కనబడి కేన్‌కు ధర పెరగకుండా చేస్తున్నారే తప్ప, ఆ ఫ్యాక్టరీ ఓనర్స్ లాబీలో పడి చెరకు రైతులను మోసం చేస్తున్న సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అక్కడ కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలో మీ నిర్లక్ష్యం ఫలితంగా – ఈరోజు దేశంలో లక్షమంది రైతులు చనిపోతే, రాష్ట్రంలో మీ పరిపాలనలో 5వేల మంది రైతులు చనిపోయిన పరిస్థితిని గుర్తు చేస్తున్నాను. వ్యవసాయరంగానికిగానీ, ధరల స్థిరీకరణకుగానీ కేటాయింపులు సరిగా లేవు, కేటాయింపులు పెంచవలసిన అవసరం వుందని చెబుతున్నాను.

ఇక రెండవ అతి కీలకమైన అంశం–మానవ వనరుల అభివృద్ధి. ఏదైనా ఒక దేశం అభివృద్ధి సాధించాలంటే మానవ వనరులు చాలా కీలకం, చాలా ఇంపార్టెంట్. ఈనాడు ఫైనాన్స్ మినిస్టర్‌గారు రకరకాల వ్యక్తుల కొటేషన్స్ బడ్జెటు ప్రసంగంలో పెట్టారు. ఎడ్యుకేషన్ వుండాలి, ఎడ్యుకేషన్ లేకపోతే మానవ విలువలు పెరగవని, అనేక కొటేషన్స్ ఇందులో పెట్టారు. కాని అల్టిమేట్‌గా ఏదైతే మాట్లాడారో అది సాధించడానికి వాళ్లు చేసిందేమిటి? కొఠారీ లాంటి మహానుభావులు అనేక విషయాలు చెప్పారు. ఈ భారతదేశం యొక్క భవిష్యత్తు క్లాసు రూములో

ఉందని చెప్పారు. మీరు క్లాసు రూములో వున్న విద్యార్థులకు మంచి ప్రమాణాలతో కూడిన విద్యను అందించి వాళ్లను మంచి పౌరులుగా తీర్చిదిద్దండి, ఈ దేశానికున్న సమస్యలన్నీ ఆటోమేటిక్‌గా తీరిపోతాయని చెప్పారు. కానీ మీరు ఏమి చేస్తున్నారు? లక్ష కోట్లు లక్ష కోట్లు అంటున్నారు. ఈ లక్ష కోట్ల కేటాయింపులు ఎవరికి ఇవ్వాలి, దేనికి ఇవ్వాలి? అధ్యక్షా, ప్రాధాన్యతలను ఒకసారి చూస్తే, రాజ్యాంగంలో స్పెసిఫిక్‌గా ఈ విద్య గురించి మెన్షన్ చేయడం జరిగింది. మహానుభావుడు అంబేద్కర్ విద్య విషయంలో చాలా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నారు, విద్య లేకపోవడం ఈ భారతీయులకు వున్నటువంటి పెద్ద శాపం. భారతదేశంలో పేద వర్గాలకు విద్య అందుబాటులో లేకుండా ఉన్నటువంటి దుర్మార్గమైన వ్యవస్థ ఈ దేశంలో వుంది కనుక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఖచ్చితంగా విద్యపైన దృష్టిని పెట్టాలి. మీకు వచ్చిన డబ్బును మొట్టమొదటగా విద్యపైనే ఖర్చు పెట్టాలని భారత రాజ్యాంగంలోనే వుంది. Article-45 of the Constitution of India లో universalization of Elementary Education గురించి, అలాగే Directive Principles of State Policy లో to provide free and compulsory education for all the children upto the age of 14 years అని వుంది, ఈ విధంగా చేయడం రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాల బాధ్యత. కంపల్సరీగా 14 సంవత్సరాల వరకు ప్రతి భారత పౌరుడికి ఉచితంగా విద్యను అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై వుందని రాజ్యాంగంలో చెప్పారు, మరి అదే రాజ్యాంగంపై ప్రమాణం చేసి వచ్చిన మీరు ఏమి ఆలోచన చేస్తున్నారు? ఈనాడు రాష్ట్రంలో వున్న లిటరసీ రేటు చూస్తే, ఎంతో దయనీయంగా వుంది. State average literacy rate is 60.47%, దేశం యావరేజ్ లిటరసీ రేటు చూస్తే 64.84 శాతం వుంది. అంటే దేశం యావరేజ్ కంటే మన రాష్ట్రంలో లిటరసీ రేటు తక్కువగా వుంది. ఎక్కడో 16, 17వ స్థానంలో వుంది రాష్ట్రం. అధ్యక్షా, ఒకసారి అక్షరాస్యత యొక్క నిర్వచనం చూస్తే – చాలా గమ్మత్తయిన నిర్వచనం వుంది, ఎంత దౌర్భాగ్యమైన నిర్వచనమంటే – A person who is seven years and above, who is able to read and write with understanding of any language is considered as literate. ఎవరైనా ఒక వ్యక్తి ఏదైనా ఒక భాషలో వ్రాయగలిగి, చదవగలిగితే అతనే విద్యావంతుడు. అలాంటి విద్యావంతులు ఎంతమంది వున్నారు, 60 శాతం మంది వున్నారు మన రాష్ట్రంలో. అంటే కనీసం 40 శాతం మంది ప్రజలకు కనీసం సంతకం కూడా పెట్టడం తెలియని వాళ్లున్నారు. వారికి కనీసం చదవడం కూడా తెలియదు. ఇది బ్రహ్మాండమైన దేశం, **60 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా 40 శాతం మంది భారత పౌరులు చదవజాలరు. ప్రపంచంలో వున్నటువంటి నిరక్షరాస్యుల్లో 50 శాతం ఈ భారతదేశంలో ఉన్నారు. ఇది బాధతో కూడుకున్న విషయం అధ్యక్షా.** అలాంటి ప్రణాళికలు మనం చేసి కూర్చున్నాం. ఆ విధంగా 40 శాతం మంది ప్రజలకు కనీసం చదువు రాదు. ఉన్న 60 శాతం మందికి వున్నటువంటి చదువు ఎలాంటిదంటే–వారికి సంతకం చేయడం తెలుసు, చదవడం తెలుసు. They are not just educated people, They are only literates. వాళ్లకు ఏదో చదవడం మాత్రమే తెలుసు తప్ప చదువు ద్వారా వచ్చిన జ్ఞానాన్ని ఉపయోగించుకునే శక్తిని మనం ఇవ్వలేకపోతున్నాం. Not even 5 to 6% of the people are reaching to the University level. ఎంత దౌర్భాగ్యం అధ్యక్షా? మీకున్న వనరులేమిటండీ ఈ దేశంలో?

భారతదేశాన్ని చూసి ఒక విషయంలో ప్రపంచమంతా భయపడుతోంది, అది మనకున్న యువతరం. ప్రపంచంలోనే అధికంగా యువకులున్న దేశం భారతదేశం. ఈనాడు ఉన్న వెస్టర్న్ కంట్రీస్‌లోని అనేక దేశాలలో వృద్ధులు పెరిగిపోతున్నారు. యువతరం సంఖ్య తగ్గిపోతున్నది. బర్త్‌రేటు డెత్ రేటు కంటే తగ్గిపోతుంది. మైనస్‌లోకి పాపులేషన్ తగ్గిపోతోంది. స్విట్జర్‌ల్యాండ్, జర్మనీ, జపాన్ లాంటి కొన్ని దేశాలో మైనస్ గ్రోత్ రేటు ఉంది. మన దేశంలో మంచి వనరులు, యువతరం ఉన్నారు. వారు ప్రొడక్టివిటీ యాక్టివిటీలో ఉండాలంటే వారికి విద్య నేర్పాలి. వారికి ఏమి విద్య నేర్పుతున్నారు. జిఎస్‌డిపిలో ఆరు శాతం పెట్టమంటే పెట్టలేదు. 3.3 శాతం కూడా పెట్టడం లేదు. పేద వర్గాల తల్లిదండ్రులు కనీసం ఫీజు కట్టలేని పరిస్థితి ఉంది. చదువు చెప్పించాలని రాజ్యాంగం చెప్పింది. రాజశేఖర్‌రెడ్డిగారు కొత్తగా పెట్టింది కాదు. రాజ్యాంగం బాధ్యత. We are only representatives of the people. ఆ విషయాన్ని మరచిపోవద్దు. ఆ బాధ్యతను నిర్వహించకుండా ఈనాడు కేటాయింపులు చేయకుండా నిరక్షరాస్యుల సంఖ్యను పెంచుతున్న మీ పరిపాలన ఎక్కడికి పోతుందో ఒకసారి ఆలోచించాలి.

నలభై శాతం మంది పిల్లలు స్కూలుకు రారు. ఉన్న అరవై శాతం మంది ఎన్‌రోల్‌మెంట్ అయితే పదవ తరగతి వచ్చే సరికి 64 శాతం మంది డ్రాప్ అవుట్సు ఉంటున్నారు. స్కూలు వదలి వెళ్లిపోతున్నారు. వారికి చదువు లేదు. మిగిలిన వారిలో సుమారు 30 శాతం మందికి క్వాలిటీ ఎడ్యుకేషన్ లేక ఫెయిల్ అవుతున్నారు. 90వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యామంత్రిగారు ఎక్కడికి వెళ్లారో తెలియదు. భర్తీ చేసిన పాపాన పోలేదు. డిఎస్‌సి పెట్టి టెక్నికల్‌గా మాట్లాడుతూ వారికి పోస్టింగ్సు ఇవ్వకుండా, ఎన్నికలు వస్తున్నాయని పోస్టింగ్సు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారు. 1022 స్కూల్సును మూసివేసిన ఘనత మీకు దక్కింది. నలభై శాతం పిల్లలు ఇప్పటికీ స్కూలుకు పోని పరిస్థితి ఉంది. పిల్లల సంఖ్య తగ్గిపోయింది. పిల్లలు స్కూలుకి గిల్లిదండ ఆడడానికి వస్తారా? టీచర్సు రావడం లేదు. టీచర్సు లేక స్కూల్సు మూసివేస్తున్నారు. 6600 స్కూల్సు మూయడానికి సిద్ధపడ్డారు. మేము గొడవ పెట్టిన తరువాత ఆ ఫైలు ఆగిపోయింది. పేదలను స్కూలుకు పంపించి విద్య నేర్పించాలి. ఉన్న స్కూల్సును మూసివేసి మేము బ్రహ్మాండంగా స్వర్ణయుగంలో ప్రవేశిస్తున్నామంటే ఎలా? అది మీ ఆలోచనా విధానమా? ఈ భారతదేశంలో ఫ్యూడల్ మనస్తత్వంలో కరడుగట్టిన ఫ్యూడల్ వారిగా చెప్పారా? ఈ దేశంలో ప్రజనీకానికి అత్యధిక సంఖ్యాకులకు చదువు రాకుండా చేసిన ధార్మిక వ్యవస్థ ఉంది. రెండు వేల సంవత్సరాలుగా అణగదొక్క బడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అయినా చదువు నేర్పకుండా ఉంటే ఎలా? బాబా సాహెబ్ అంబేద్కర్‌గారు Under Art.45 of the Constitution of India it is obligatory on the part of the Government and on the State. ఆ విధంగా కాన్‌స్టిట్యూషనల్ ఆబ్లిగేటరీ ఐనప్పటికీ విస్మరించి రు.లక్షకోట్ల బడ్జెట్‌లో పిల్లలకు ఎంత శ్రద్ధ తీసుకున్నదో వివరించాలని కోరుతున్నాను. ఆనాడు మేము మిడ్ డే మీల్స్ ప్రవేశపెట్టాము. ఇది మా ఘోష చెప్పడమే. వారికి ఎలాగూ పట్టదు, ప్రజలైనా వింటారు. రు.లక్ష కోట్ల బడ్జెట్‌లో విద్యా శాఖకు ఎంత కేటాయించారు? మేము మిడ్ డే మీల్స్ పెట్టడం వల్ల డ్రాప్ అవుట్సు సంఖ్య తగ్గింది. ఒక పూట భోజనానికి ఆశపడి 60 లక్షల మంది పిల్లలు

అన్నం, పచ్చిపులుసు కోసం, వారి కడుపు మంట తీర్చుకోవడానికి బడికి వచ్చారు. ఆ విధంగా వారికి చదువు చెప్పడానికి వీలైంది. రూ.లక్ష కోట్లతో నాది స్వర్ణయుగం అని అంటున్నారు. నేను ఛాలెంజ్ చేస్తున్నాను. ముఖ్యమంత్రిగారు, ఎవరూ లేరు. మిడ్ డే మీల్స్ గురించి ఎన్నోసార్లు శాసనసభలో గొంతు చించుకొని అరిచాను. ఒక మనిషికి రూ.2 ల చొప్పున మూడు నెలల నుండి వారికి బిల్లులు రాని పరిస్థితి ఉంది. మీ కాంట్రాక్టర్లకు ఒక్క బిల్లు ఆగిందా? ఒక్కరోజు వెయ్యి కోట్ల రూపాయలు టెలిఫోన్ మీద శాంక్షన్ చేయడంలేదా? మధ్యాహ్నం భోజనానికి రూ.15 కోట్లు నుండి రూ.20 కోట్లు ఇవ్వలేకపోతున్నారు. పేదవాడు ఒక్క రోజు భోజనం చేయడానికి రోశయ్యగారికి ఆలోచన రాదా? దుకాణానికి వెళితే వారు అడ్డమైన రేట్లు వేస్తున్నారు. వంట చేసే వాళ్లు పేదలు. వారు డ్వాక్రా గ్రూప్ మహిళలు. వారి దగ్గర పైసలుండవు. ఉద్దరకు తెచ్చి వండి పెట్టడమే. పిల్లలకు సరిగా తిండి లేదని టీవీలలో, వార్తాపత్రికలలో చూస్తున్నాము. పిల్లలు హాస్పిటల్ పాలవుతున్నారు. పిల్లలు ఆ విధంగా ఇబ్బంది పడుతుంటే, ఏదో పెద్ద ఘనకార్యాలు చేస్తున్నామని చెబుతున్నారు. దుర్మార్గం కాదా? ఇది దళారి ప్రభుత్వం కాకపోతే. సంక్షేమం ప్రభుత్వం అని చెబుతున్నారు, ఇదేమి సంక్షేమమో చెప్పాలని కోరుతున్నాను. పేదలకు సంబంధించిన కార్యక్రమన్ని కూడా నడపలేని చేతకాని ప్రభుత్వంగా ఎందుకు ఉందో చెప్పాలి. 2003-04లో పాస్ పర్సెంటేజ్ 80 శాతం ఉంటే మెల్లగా అది 72 శాతం, 73 శాతానికి పడిపోయింది. ఇప్పుడు 71 శాతం అయింది. రోజు రోజుకు పర్సంటేజ్ తగ్గిపోతున్నది. విద్యను నెగ్లెక్ట్ చేసి పూర్తిగా భ్రష్టు పట్టించారు. విద్యను పట్టించుకోవడం లేదు. ఏదో కొత్త ఆలోచనతో కాన్‌సెప్ట్ స్కూల్సును పెట్టి మెరుగైన విద్యను అందిస్తామని అంటున్నారు. ప్రజా ఆరోగ్యం అని చెబుతున్నారు. దానికి ఏమి చర్యలు తీసుకున్నారు? మేడమ్ మీరు అనుభవజ్ఞులైన ఆరోగ్య మంత్రిగా పని చేశారు. ప్రజారోగ్యం మీ ప్రైమరీ లెవెల్‌లో ఉన్న రోగాలు ఏమిటి? నేను డాక్టర్‌ను కాదు. కాని నా కుటుంబంలో అందరూ డాక్టర్సే. ప్రైమరీ స్టేజ్‌లో రోగ నిర్ధారణ చేసి ఆపగలిగితే 80 శాతం రోగం ఆటోమేటిక్‌గా తగ్గిపోతుంది. ఇబ్బందికరమైన పరిస్థితి రాకుండా ఉంటుంది. ఆసుపత్రులలో డాక్టర్లు లేరు. దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కోటి యాభై లక్షల మంది విషజ్వరంతో బాధపడుతున్నారు. మీ ఆసుపత్రులు ఎక్కడకు వెళ్లాయి?

అదే విధంగా 2006వ సంవత్సరం ఆగస్టులో మూడు లక్షల మంది మలేరియా, డెంగ్యూ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు మీరేమి చేశారు? 551 మంది గున్యా వ్యాధితో చనిపోయారు. ఈనాడు మలేరియా వచ్చి పదకొండు వందల మంది గిరిజనులు మలేరియా వ్యాధితో విశాఖ ఏజెన్సీలో మరణిస్తే మీరేమి చర్యలు చేపట్టారు? ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతములో మలేరియా వ్యాధితో 400 మంది పేద ప్రజలు చనిపోయారు. **అడవిలో వుండే వాళ్లు కనీసం జీవితాన్ని గడపడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజానీకానికి ఈనాడు వైద్యం అందించే బాధ్యత లేదాండీ? అభివృద్ధి చెందిన దేశాలను మీరు ఒకసారి వెళ్లి చూడండి. మీకు తెలియదని నేననుకొను. అభివృద్ధి చెందిన దేశాలలో అత్యధికంగా బడ్జెట్ దేనికి కేటాయిస్తారు? That is for health and education.** ఆ రెండింటికీ ఎక్కువగా బడ్జెట్ కేటాయింపులు వుంటాయి అక్కడ. చర్చ అంతా దాని మీద జరుగుతుంది. ఎక్కువ చర్చ, ఎలక్షన్స్‌లో జరిగే పెద్ద

చర్చ. అలాంటి హెల్త్ పైన ఈనాడు మీరు చేపడుతున్నది ఏది? పేద దేశం ఇది. కనీసం వాళ్లు తమకు ఏదైనా జరిగితే వాళ్లకు కూలీ కూడా దొరకకుండా మొత్తం ఎంటైర్ కుటుంబం అంతా కూడా సంక్షోభంలో పడేటటువంటి పరిస్థితి వస్తున్న ఈ దేశంలో మీరు ఆరోగ్యం పైన ఏమి చేపట్టారు? సియం రిలీఫ్ ఫండ్ లేకపోతే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తే ఆరోగ్య శ్రీ అని పెట్టారు. నేను అది తప్పని చెప్పను. అవసరం ఇది. కాకపోతే ఎంత పర్సెంటేజీ వారికి చెందుతుంది? ఎంతమందికి ఈనాడు విశాఖ ఏజెన్సీ ప్రాంతములో, వుట్నూరులో వున్నటువంటి గిరిజనులు కనీసం హైదరాబాద్ నగరంలో కాలుపెట్టి, హైదరాబాదు నగరాన్ని చూడలేనటువంటి గిరిజనులు, ఎంతమంది అడవి బిడ్డలు అక్కడ వున్నారు. కనీసం వాళ్లకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ తెలుసా? వాళ్లకు ఏమి తెలుసు? ఈనాటికీ కూడా ఏదో మంత్రాలు, తంత్రాలు చేసుకొని వాళ్ల అదృష్టం, వాళ్ల దురదృష్టం అని చెప్పి ఆ యొక్క కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకొని ప్రాణాలు కోల్పోతున్నారు తప్ప వాళ్ల పట్ల మీరు చేపడుతున్న వైద్యంలో మీరేమైనా కేటాయింపుల చేస్తున్నారా? ఇంకా వంద కోట్ల రూపాయలు తగ్గించారు. ఈరోజు పెట్టిన బడ్జెట్‌లో పిహెచ్‌సిలకు 60, 60 మాత్రం ఈనాడు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఏ విధమైన ప్రాథమిక విద్య లేక, వైద్యం లేక బాధపడుతున్న జనాలు 8 కోట్ల 22 లక్షల మంది వున్నారు. ఇంత పెద్ద రాష్ట్రంలో ఈనాడు మీరు వైద్యం పట్ల మీరు చూపుతున్న శ్రద్ధ ఏమిటి? ఆ వైద్యానికి మీరిచ్చిన కేటాయింపులు ఏమిటి? వైద్యం పట్ల మీరేదో గొప్పలు చెప్పుకుంటున్నారు ఆరోగ్య శ్రీలు, సియం రిలీఫ్ ఫండ్‌లు అని చెప్పి. మరి కనీసం ఈ యొక్క లక్షలాది, కోట్లాది మందికి సంబంధించిన ఆరోగ్యం పట్ల ఏమీ శ్రద్ధ తీసుకోవడం లేదు. వాళ్లంతా పోయి కొంపా అన్నీ అమ్ముకొని ఏదైనా రోగం వస్తే ప్రయివేటు హాస్పిటల్‌లో పడాలి. లేకపోతే అది మన దురదృష్టం అనుకొని వాళ్లు చావాలి తప్ప మీ తరపున మీరు చేస్తున్నటువంటి కార్యక్రమం ఒక్కటీ సక్రమమైన పద్ధతిలో జరగడం లేదని చెప్పి తెలియజేస్తున్నాను. ఇక మీరు దేనికైనా కేటాయింపులు చేస్తున్నారా అంటే, మాట్లాడితే ఇరిగేషన్. పేపరు విప్పగానే ఫోటో ఒకటి బ్రహ్మాండమైనది కనబడుతుంది. ముంగట మొత్తం నీళ్లు వెనుక దూకుతుంటాయి. ముందు ముఖ్యమంత్రి గారు బ్రహ్మాండముగా కనబడుతుంటారు ఏదో నీళ్లు వచ్చాయని. ఇదే శాసనసభలో పెద్దయెత్తున చర్చ జరిగింది ఆ రోజు జలయజ్ఞం గురించి. ఈనాడు రికార్డు ఒకసారి తీసుకుంటే నాలుగు సంవత్సరాల క్రితం ఈ జల యజ్ఞం ప్రస్తావన వచ్చింది. వాళ్లు ఎప్పుడైతే ఈ జలయజ్ఞం మాట్లాడడం మొదలుపెట్టారో, ఆ టైంలో నేను చాలా స్పష్టంగా ఇదే హౌస్‌లో గంటన్నరసేపు మాట్లాడాను. అయ్యా ఇది నాకు అనుమానంగా వుంది. ఖచ్చితంగా, నూటికి నూరుపాళ్లు డబ్బు కొట్టేయడానికి మీరు కనుక్కున్న బెత్తం, ఇది జలయజ్ఞం అని చెప్పాను. దానిని ఏవిధంగా మీరు ఈపిసిల క్రింద కనుక్కున్నారు. ఆనాడు వున్న కాంట్రాక్టర్లను తమకు ఎలిజిబిలిటీ, క్రైటేరియా పెట్టి వాళ్లకు సంబంధించిన వ్యక్తులకు వచ్చేటట్లు ఏ విధంగా ఆ యొక్క డాక్యుమెంట్‌లను మొత్తం మార్చారు. ఈ విషయం పైన కూడా ఇదే హౌస్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. దాని పైన మీరు కేటాయింపులు ఇచ్చారు. ప్రాజెక్టులు చేపట్టామని చెబుతున్నారు. ఎన్ని ప్రాజెక్టులు చేపట్టారు. మరి ఎన్ని ప్రాజెక్టులు కంప్లీట్ చేశారు? మొదట్లో మీరు చేపట్టిన ప్రాజెక్టుల సంఖ్య ఏమిటి? ఈనాడు మీరు మాట్లాడుతున్న ప్రాజెక్టుల

పరిస్థితి ఏమిటి? ఒకసారి మనం దానిని విశ్లేషణ చేసుకోవాలి. ఎందుకంటే సగం బడ్జెట్ ఉదారంగా, మన ఫైనాన్స్ మినిష్టరుగారు చాలా ఉదారంగా 50శాతం కేటాయింపులు చేశారు. 51 శాతం లాస్ట్‌బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని వాళ్లు చెప్పారు. మరి దాని ఫలితాలు ఏవిధంగా వున్నాయి? ఎక్కడైనా ఒక్క రూపాయి ఖర్చు పెడుతున్నా ఎనీఎకనమిస్ట్ గానీ, ఎవరైనా ప్రతి ఒక్కరూ ఆలోచన చేసేది what is the cost benefit ratio అనేది చూస్తారు. నేను రూపాయి ఖర్చు పెడుతున్నాను, ఆ రూపాయి ఖర్చుతో వచ్చే ఫలితం ఏమిటి? దాని ఫలితం ఏ విధంగా వుంటుంది అనేది ఆలోచన చేయాలి. చేయకూడదా అధ్యక్షా? ఏదో మనం ఈ లెక్కలు బ్యాంక్ అకౌంట్‌లాగా ఇవి తీసుకుపోయి ఆ అకౌంట్‌లో, అవి తీసుకువచ్చి ఈ అకౌంట్‌లో ఇదా అండీ మనం చేసేటటువంటి లెక్కలు, ఇది బడ్జెట్ అనడం? ఏవిధంగా మీరు కాస్ట్ బెనిఫిట్ రేషియో చేశారు? ఆవిధంగా మీరు చూస్తే సగం బడ్జెట్ ఇచ్చినటువంటి ఈ యొక్క ఇరిగేషన్ సెక్టారులో మీరేమి చేశారనేది ఒకసారి ఆలోచన చేసుకోవాలి. ఒకవైపు నదీ జలాల పంపకంలో మీరు చేసిన దుర్మార్గమైనటువంటి పనులు. రెండవది తీసుకున్నటువంటి ప్రాజెక్టులు. అదే విధంగా ఆ ప్రాజెక్టుల పేరుతో మీరు చేసిన అవినీతి, ఇవన్నీ కూడా ఒకటొకటి బయపడుతున్నాయి, ఈ రోజు ప్రతిదీ చర్చ జరుగుతుంది. ఈనాడు గొప్పగా చెప్పుకుంటున్నారు కదా 12 లక్షలు ఇచ్చామని, 15 లక్షలు ఇచ్చామని చెప్పి. మీరు ఇచ్చినటువంటిది ఇదే. ఇదే రోశయ్య గారి స్టాటిస్టిక్స్. ఈనాడు గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సోషియో ఎకనామిక్ సర్వేలో చాలా స్పష్టంగా వాళ్లు ఇచ్చినటువంటి దాని ప్రకారంగా ఏ ప్రభుత్వం అయినాసరే ఆయొక్క సర్వే చేసి ఫర్‌ఫెక్ట్‌గా, అథెంటిక్‌గా డాక్యుమెంట్ మీరు ఇచ్చింది. మొన్న సోషియో ఎకనామిక్ సర్వే రిపోర్టు ప్రకారంగా కాలువల క్రింద సాగుబడిలోకి వచ్చిన నీళ్లు ప్రాజక్టులు కడితే భూమిలోకి ఇంకిపోవు కదా? కార్టూనిస్ట్ శంకర్‌ది ఒక కార్టూను వచ్చింది నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా ఆ రోజులలో ఒక పెద్ద మనిషి కాలువలు త్రవ్వుతున్నాడు. ఆయనకు అనుమానం వచ్చింది. ఏమయ్యా కాలువలు త్రవ్వుతున్నావు, మీ డ్యాంఎక్కడ? మీ ప్రాజెక్టు ఎక్కడా? అంటే ఎక్కడ నీళ్లు వుంటే అక్కడ ఈ కాలువలు త్రవ్వుతాము. ముందు కాలువలు త్రవ్వితే ఆతరువాత మొత్తం ఈ కాలువలలోకి నీళ్లు రావాలి. కానీ నీళ్లు వచ్చిన తరువాత అప్పుడు పోయి డ్యాముల క్రింద మేము ఆలోచన చేస్తామని చెప్పినట్లుగా ఈ మహానుభావులు చెబుతున్న డ్యామ్‌ల పరిస్థితి వుంది. ఎక్కడ పెడతారో, హెడ్ వర్క్స్ ఎక్కడ జరుగుతున్నాయో తెలవదు. దానికి ఒక చేవెళ్ల-ప్రాణహిత దగ్గరకు వస్తుంది. ఆ కథ ఏమి చేస్తారో, ఆవిధంగా ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియదు. కానీ కాలువలకు మాత్రం బ్రహ్మాండముగా కేటాయింపులు చేసుకొని ఆ విధంగా దబ్బులు కొట్టేయడానికి వాళ్లు చేసే ఒక పద్ధతి ప్రకారంగా అవలంభించిన పద్ధతే ఈ జలయజ్ఞం తప్ప ఇంకొకటి కాదు. ఈపిసి సిస్టం పెట్టారు. ఈపిసిలో ఏమిటి అధ్యక్షా ఈనాడు? ఎవరైనా సరే. ఆరోజున మేమేమో ఒక్క ప్రాజెక్టుకు, దేవాదులకు ఈపిసి పెట్టాము. ఎందుకు పెట్టవలసి వచ్చింది ఆ ఈపిసి? పవర్‌ఫుల్ పంప్స్ అవసరమున్నాయి అక్కడ. ఎక్కడైతే పవర్‌ఫుల్ పంప్స్ వున్నాయో, మన దగ్గర వున్నటువంటి ఇంజనీరింగ్ విభాగాల వాళ్లకు అంత టెక్నాలజీ లేదు. కనుక ఎక్కడైనా ప్రపంచంలో మంచి టెక్నాలజీ అందుబాటులోకి రావాలి. ఎందుకంటే power consumption చాలా

ఇంపార్టెంట్ అక్కడ. రేపు భవిష్యత్తులో తరతరాలకూ ఎప్పటికీ కూడా అక్కడ వచ్చిన విద్యుత్ బిల్లు చాలా ఇంపార్టెంట్. తక్కువ విద్యుత్‌ను వాడే పంపులు రావాలి. అదే విధంగా హై టెక్నాలజీ పంపులు కావాలి. ప్రపంచములో ఎంతో ఎత్తయిన ప్రదేశాలకు మనం నీళ్లు తీసుకుపోతున్నాము. కనుక ఆ టెక్నాలజీ వున్న వ్యక్తులు రండి అని చెప్పి మేము ఈపిసి కావాలని ఒక ప్రాజెక్టుకు పిలిస్తే ఈ మహానుభావులు కాలువలు త్రవ్వడానికి కూడా ఈపిసి పిలిచారు. మొత్తం కాలువలు త్రవ్వడానికి ఈపిసి కావాలండీ? ఏమి టెక్నాలజీ కావాలండీ? మా వూళ్లో వడ్రంగాయనను అడిగితే కాలువలు ఎట్లా త్రవ్వాలో చెబుతాడు. దానికి వీళ్లు ఈపిసి పిలిచి, ఎందుకంటే ఈపిసిలో వీళ్లకు ఒక క్లాజ్ వుంటుంది. వాళ్లే డిజైన్ చేసుకుంటారు, వాళ్లే మొత్తం త్రవ్వుతారు, వాళ్లే ప్రాజెక్టు కాస్టింగ్ చెబుతారు. ఎంతలో కంప్లీట్ చేస్తారో చెబుతారు. ఆ విధంగా ఈనాడు కాలువలు డిజైన్ చేయడానికి మన దగ్గర రాదా? నామమాత్రం టెక్నాలజీ లేదా మన దగ్గర? కాలువలు డిజైన్ చేయడం, అదే విధంగా లోపల భూమిలో రాయి వుందో, రప్ప వుందో తెలియదు. ఇలాంటి దానికి ఈపిసి పిలుస్తారండీ? ఎవరైనా పిలిచారా? ప్రపంచంలో ఎక్కడైనా ఈపిసిని కాలువలకు పిలిచారండీ? అయ్యా, నువ్వు జలయజ్ఞం ఏమి చేశావు, నువ్వు సరిగా చేయలేదంటే లక్ష్మయ్య గారు చెబుతారు. మొన్న ఒక వార్తాపత్రికలో చూశాము పదివేల కిలోమీటర్ల కాలువలు త్రవ్వాము మేము, ఇంతకంటే ఏమి కావాలి జలయజ్ఞానికి అని. కాలువలు త్రవ్వితే జలయజ్ఞమా? కాలువలు త్రవ్వి, కమీషన్‌లు కొట్టి వేయడం ఇది జలయజ్ఞం కాదు. దానికి మంచిగా, ముద్దుగా పేరు పెట్టి ఈనాడు పెద్ద ఎగ్జిబిషన్ పెడుతున్నారు. మేము కూడా పెడతాము ఎగ్జిబిషన్. ఖచ్చితంగా మీరు ఏ విధంగా ప్రాజెక్టులలో ఎన్ని, ఏయే ప్రాజెక్టులలో ఎంత డబ్బు తిన్నారో?

ఒక్క ప్రాజెక్ట్‌కి కూడా ఒరిజినల్ కాంట్రాక్టర్ లేదు. ఒరిజినల్ కాంట్రాక్టర్, హైదరాబాద్‌లో అమ్మేసుకుంటున్నారు. వాళ్లు సబ్ కాంట్రాక్ట్‌కి ఇవ్వడం, వాళ్లు ఇంకొక కాంట్రాక్టర్‌కి ఇవ్వడం ఇలా జరుగుతోంది. ప్రాజెక్టుల దగ్గర ప్రొక్లెన్స్, టిప్పర్స్ పెడుతున్న వ్యక్తులు వేరే ఉన్నారు. ఆ విధంగా ఎవరి పర్సెంటేజ్ వాళ్లు కొట్టేసి, మీ పర్సెంటేజ్ మీకు పంపిస్తున్నారు. మీరేమో జోల కొడుతున్నారు. వాళ్లకి ఎప్పుడు బిల్లులు ఇవ్వాలి, ఏవిధంగా బిల్లులు ఇవ్వాలి, ఎవరి పర్సెంటేజ్ ఎప్పుడు రిలీజ్ చెయ్యాలి అని మీరు ఈ కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రాజెక్టుల నాణ్యత ఏ విధంగా ఉంది, ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటని మీరు ఎప్పుడైనా ఆలోచన చేశారా?

అధ్యక్షా! మనకున్న జీవ నదులలో కృష్ణా, గోదావరి ముఖ్యమైనవి. పెన్నా దగ్గర ప్రాజెక్టులకు అవకాశం లేదు. కృష్ణా వాటర్ కేటాయింపు అయిపోయింది. మనకు అవార్డ్స్ వచ్చాయి. ఆ అవార్డ్స్ ప్రకారం మనం కేటాయింపులు చేసుకున్నాము. మనకి ఇంక మిగిలింది సర్‌ప్లస్ వాటర్ మాత్రమే. మనకు నికర జలాలు లేవు. గోదావరిలో 1480 టి.యం.సిల నీరు అందుబాటులో ఉంది, 750 టి.యం.సిల నీళ్ల కంటే ఎక్కువ వాడుకోలేకపోతున్నాము. మిగతా నీరు సముద్రం పాలయ్యింది. కనుక, గోదావరిపైన ప్రాజెక్టులు కట్టవలసిన అవసరం ఉంది. మేము ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఒక అథారిటీ క్రియేట్ చేసాము. దానికి స్వయంగా అప్పటి ముఖ్యమంత్రిగారు ఛైర్మన్‌గా ఉన్నారు, మినిస్టర్లు కూడా మెంబర్స్‌గా ఉన్నారు. గోదావరి పైన ఏ

విధంగా ప్రాజెక్టులు చేపడితే బాగుంటుందో సమగ్రమైన ప్రణాళికను తయారుచేసి, కేటాయింపులు కూడా ఈ విధంగా ఉంటే బాగుంటుందని, ఆ విధంగా చేసాము. ఈనాడు ఇష్టానుసారంగా ప్రాజెక్టులు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి గారు అడ్డుగోలుగా పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేశారు. నల్గొండ, ఖమ్మం, గుంటూరు, కృష్ణ, ప్రకాశం, వెస్ట్ గోదావరి జిల్లాలకు తరతరాలుగా వస్తున్న సాగర్ ఆయకట్టు ఏమైపోయినా వాళ్లకు అవసరం లేదు. నికరజలాలు, వరదజలాలని కొత్త వాదన తీసుకొచ్చి ఉన్న జలాలను మలుపుకుపోవడానికి రాత్రి, పగలు కష్టపడుతున్నారు. పులివెందుల ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఎకరానికి నీళ్లు ఇస్తామని చెప్పి, పులివెందులలోకి కృష్ణా జలాలలను మలుపుకుపోయే దుర్మార్గమైన చర్యలు చేపడుతున్నారు. కృష్ణా నీటిని దోపిడీ చేసే పద్ధతిలో ప్రభుత్వం పనిచేస్తున్నది.

అధ్యక్షా! ఇక గోదావరి నది. గోదావరి నది ఎక్కువ తెలంగాణా జిల్లాలలో ఉంది. ఆరు వందల కిలోమీటర్లు తెలంగాణా జిల్లాల్లో పారుతుంది. ఎప్పటికైనా నీళ్లు వస్తాయని తెలంగాణాలో చాలా మంది ఎదురుచూస్తున్నారు. ప్రాణహిత గురించి ఇదే హౌస్‌లో చర్చ జరిగింది. ప్రభుత్వం కూడా అంగీకరించింది. మూడు సంవత్సరాలయ్యింది. నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రిగారు మాట్లాడుతున్నారు. మీకు ఈ ఆలోచన వచ్చిందా అని మమ్మల్ని దబాయిస్తారే, ఇంతవరకూ అక్కడ తట్టెడు మట్టివేశారా? నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రి గారు మాట్లాడుతున్నారు, ఇది మోసం కాదా? **రెండు సంవత్సరాల క్రితం మేము పాదయాత్రలు చేస్తుంటే, మేజర్ ఇరిగేషన్ మంత్రితో సహా నలుగురు మంత్రులు సుత్తి యాత్ర చేశారు. మేమేదో నీళ్లు తెద్దామని ప్రయత్నం చేస్తుంటే, వీళ్లు కావాలని పాదయాత్ర చేస్తున్నారు, నీళ్లు వచ్చేస్తున్నాయని మాట్లాడారు. రెండేళ్లవుతుంది. మీ బడ్జెట్ ఎక్కడికి వెళ్లింది, మీ కేటాయింపులు ఎక్కడకు వెళ్లాయి,** మీ పనులు ఎక్కడికి వెళ్లాయని అడుగుతున్నాను. మహారాష్ట్రకు ఒక ఉత్తరం రాసే దిక్కు లేదు. ఎక్కడ హెడ్ వర్క్స్ జరుగుతున్నాయో కూడా తెలియడం లేదు. కాలువలకు మాత్రం టెండర్లు పిలుస్తామని చెబుతున్నారు.

అధ్యక్షా! ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను ఎండగొట్టారు. ఇది మీరు చేసిన ఘనకార్యం. చరిత్రలో మీరు మిగిలిపోతారు. ఆ ప్రాజెక్ట్ పరిస్థితి ఏమిటి? దాని యొక్క కెపాసిటీ తగ్గి ఇప్పుడు 80 టి.యం.సిలకు వచ్చింది. దానికి సంబంధించి, 83 టి.యం.సిల కంటే ఎక్కువ లేదని నేను మొన్న లేటెస్ట్‌గా ఒక న్యూస్ చదివాను. కెపాసిటీ రోజు రోజుకీ తగ్గిపోతోంది. అది సరిపోదన్నట్లు బాబ్లి ప్రాజెక్ట్ అదే విధంగా ఇంకా 11 ప్రాజెక్టులు కడుతున్నారు. బాబ్లి ప్రాజెక్ట్ పనులు ఆపమని మేము ధర్నా చేసాము. మా మీద లాఠీ ఛార్జ్ చేసారు, జైళ్లకు పంపించారు. కేంద్రంలో మీ ప్రభుత్వం ఉంది. ముఖ్యమంత్రిగారు ఏమి చేసారని అడుగుతున్నాను. కొత్తగా ప్రాజెక్టులు కట్టి మీరు వెలగబెట్టింది ఏమీ లేదు. తెలంగాణా ప్రాంతంలో ఉన్న ప్రాజెక్ట్‌ను ఎండగొట్టే పరిస్థితి తెచ్చారు. ఇది చేతకాని ప్రభుత్వం కాదా? బాబ్లి ప్రాజెక్ట్ గురించి ఆ రోజు ఒక లాయర్ నాకు పర్సనల్‌గా వచ్చి చెప్పారు. సార్, ఈ ప్రభుత్వం ముంచెయ్యబోతుంది, సుప్రీంకోర్టులో సరైన వాదన చెయ్యడం లేదని అన్నారు. అదే పోలవరం ప్రాజెక్ట్, పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ కోసం అధికారులు

విమానాలలో వెళ్లారే! బాబ్లికి సంబంధించినంతవరకూ సరైన సమాచారం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. ఇంత ఉద్యమం నడిచినా కనీసం సక్రమమైన ఇన్‌ఫర్మేషన్ ఇవ్వలేదు. మనం నష్టపరిహారం చెల్లించిన ప్రాంతంలో తీసుకొచ్చి వాళ్లు కడుతున్నారు. గుడ్డివాడిని తీసుకొచ్చి చూపించినా చెబుతాడు. బ్యాక్‌వాటర్ దగ్గర కడతారా? బ్యాక్‌వాటర్‌ని లిఫ్ట్ చేసుకోడానికి ప్లాన్ చేస్తున్నారు. ఆల్ పార్టీ డెలిగేషన్‌తో ప్రధానమంత్రి దగ్గరకు వెళ్లి ఎక్స్‌ప్లెయిన్ చేస్తే ఇంతవరకూ ఉలుకూ, పలుకూ లేదు. పైగా ప్రధానమంత్రి గారు మా నాయకుడిని, మమ్మల్ని, మీరు రాజకీయం చేస్తున్నాం, ఆ విధంగా చెయ్యకండని అన్నారు. మాకు చాలా బాధ అనిపించింది. రాత్రికి రాత్రి ఫ్లడ్ లైట్స్ పెట్టుకొని వందల టిప్పర్లు పనిచేస్తున్నాయి. ఫోటోగ్రాఫర్స్ వెళ్లి ఫోటోలు తీద్దామనుకుంటే తరుముతున్నారు. బాబ్లి పనులు ఆ విధంగా ఉన్నాయి.

అధ్యక్షా! దానిని ఎగ్జాంపుల్‌గా తీసుకొని, 11 ప్రాజెక్టులు స్టార్ట్ చేశారు. తరువాత పరిస్థితి ఏ విధంగా ఉంటుందో మీరు వివరణ ఇవ్వాలి. మహానుభావులు చాలా మంది ఉన్నారు. తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన మంత్రులు చాలా మంది ఉన్నారు. ఏ విధంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఉందో చెప్పమనండి. వారు ఫీల్డ్‌కి వెళ్తే పరిస్థితి తెలుస్తుంది. (అంతరాయం) అమ్మగారు, టైమ్ ఇస్తే మీరు చేసిన పాపాల చిట్టా విప్పడం మొదలు పెడతాను. సాయంకాలం వరకు టైం ఉంటే మీరు చేసిన వాటి గురించి చెప్పి, ఉతికి ఆరేస్తా! ఎన్ని చేస్తున్నారు నాయనా మీరు? ఒకవైపు మూసివేస్తే, ఇంకో వైపు తెరుస్తారు. వంద కోట్ల రూపాయల కుంభకోణం అని అంటారు. కుంభకోణం సంగతి తీయగానే, తెల్లారేసరికి అన్ని తయారు చేసుకుంటారు. అది 1000 కోట్ల రూపాయల కుంభకోణం అని మళ్లీ వస్తుంది. తరువాత 5000 కోట్లు అంటారు. ఇందాకా ఎమ్మెల్యే గారు బ్రహ్మాండమైన వర్డ్ అన్నారు. మనోవేగంతో అవినీతి పరిగెడుతుందని కాంగ్రెస్ ఎం.ఎల్.ఏ. వెంకటరెడ్డి గారు అన్నారు. చాలా మంది చాలా విషయాలు మాట్లాడారు. ఆ విధంగా మీ వేగాన్ని ఎవరు తట్టుకోగలరు? **దేశంలో ఉన్నటువంటి అన్ని విజిలెన్స్ కమీషన్లు వెంటపడినా దొరకనంత స్పీడ్‌గా వెళ్లిపోతున్నారు మీరు. విజిలెన్స్ కమీషనర్ గారు, మీరు పరిపాలనలోకి వచ్చిన తరువాత నేను వస్తాను అని అన్నారు. మీ స్పీడ్‌ను తట్టుకోడానికి, మిమ్మల్ని కంట్రోల్ చెయ్యడానికి ఎన్ని వ్యవస్థలు కావాలో నాకు అర్థం కావడం లేదు.**

అధ్యక్షా! ప్రాజెక్ట్ డిజైనింగ్ ఏ విధంగా ఉంటుందంటే, కమీషన్లు ఏవిధంగా వస్తే, డిజైన్ అట్లా మారిపోతుంది. దేవాదుల ప్రాజెక్టు దగ్గర టన్నెల్ తవ్వాలని నిపుణులు చెప్పారు. 80 పర్సెంటేజ్ ఆఫ్ ది ఎక్స్‌పెండీచర్ లిఫ్టలలో పైప్ లైన్‌కి అవుతుంది. కొన్ని టన్నెల్స్ ప్రపోజ్ చేస్తే, లేదు లేదూ మాకు ఇదే కావాలి అంటారు. ఎందులో కమీషన్ ఎక్కువ దొరికితే దాని ప్రకారంగా వెళ్తున్నారు. కమీషన్లు ఎక్కువ వస్తే డిజైన్ మారిపోతుది. బోటీ కోసం యాటను కోస్తారని తెలంగాణాలో ఒక సామెత ఉంది. ఆ విధంగా భూస్వాముల ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగినా, వారికి తినాలనిపించినా బాధ మాత్రం పేదవాడికి కలుగుతుంది. వారింటిలో శుభకార్యంకోసం పేదవాడి గొర్రెను తీసుకొని వెళ్లి భూస్వామికి ఇవ్వాలి. అలాంటి ఫ్యూడల్ వ్యవస్థ ఈ ప్రాంతంలో కొనసాగింది. ఆ భూస్వామికి లివర్ తినాలనిపిస్తే గొర్రెను తెప్పించుకొని తింటారు. మిగతాది వృథా అయినా, ఏమైనా వారికి ఫర్వాలేదు. ఏది ఏమైనా గానీ, ఏ డిజైన్ అయినా గానీ, నాకు

కమీషన్ వస్తుంది కాబట్టి, అందులోనూ, ఈపీసీ విధానం కాబట్టి మీరు మీకు కావలసిన డిజైన్ చేసుకోమని ఇప్పటి ప్రభుత్వం చెబుతుంది. అందుకు కాంట్రాక్టర్లు వారిష్టం వచ్చినట్లుగా వారు డిజైన్లు మార్చుకుంటున్నారు. వారు ఆవిధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు తప్ప చిత్తశుద్ధితో సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశ్యం వీరికి లేదు. ఒక్కొక్క ప్రాజెక్టులో అంచనాలు పెంచుకుంటూ పోయారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు అంచనాల పెంపు గురించి ఇదే సభలో 17 రోజులపాటు చర్చ జరిగింది. ప్రతి ఒక్క దానికి సంబంధించి టెలిఫోన్ల మీద మాట్లాడుకుని రాత్రికి రాత్రి అంచనాలు మార్చి సుమారు నాలుగు వందల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వ బొక్కసానికి గండికొట్టి జేబులు నింపుకున్నారనే విషయాలు మేం మీ ముందు ఉంచాం. మేం అనని మాటను మాకు ఆపాదించి ఆ సమస్యనుంచి బయటికి వెళ్లారు. కానీ ఈ రోజు ఏమైనది? లోకాయుక్త అదే విషయాన్ని తప్పు పట్టింది. లోకాయుక్త రిపోర్టు కూడా ఇచ్చింది.

ముఖ్యమంత్రిగారు ఎప్పుడూ ఒక విషయం చెబుతుంటారు. మేం అనేక విచారణలు వేసుకున్నాం, మేం ఏ తప్పు చేయలేదు కాబట్టి మాకు ఆ ధైర్యం ఉంది అని చెపుతున్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఈ పెంపు విషయంలో కారకులమీద చర్యలు తీసుకోండి. పెద్దలు శ్రీ రోశయ్యగారు కూడా సభలో ఉన్నారు. కావున లోకాయుక్త రిపోర్టు శాసనసభలో పెట్టండని కోరుతున్నాను. ఏదైనా difference వస్తే లోకాయుక్త రిపోర్టు శాసనసభ ముందు ఉంచుతారు కదా. కావున శాసనసభా వ్యవహారాల మంత్రిగారైన మీకు నమస్కారాలు చేసి చెబుతున్నాను. లోకాయుక్త రిపోర్టు శాసనసభకు సమర్పించండి. ఎప్పుడు సభకు సమర్పిస్తారో చెప్పాలని మంత్రిగారిని డిమాండ్ చేస్తున్నాను. ఇంకొక వైపు కాగ్ రిపోర్టులో కూడా స్పష్టంగా చెప్పారు. రాత్రికి రాత్రి అంచనాలు మార్చి 359 కోట్ల రూపాయలు కొట్టేశారని, తినేశారని చెప్పింది. ఇంతకు ముందు లోకాయుక్త కూడా ఇదే విషయాన్ని చెప్పింది. లోకాయుక్త చెప్పిన విషయాన్ని మనమందరం విన్నాం.

అధ్యక్షా! పీఏసీ ఛైర్మన్ మరియు సభ్యులు ఈ సభలోనే ఉన్నారు. కాగ్ రిపోర్టుపైన, లోకాయుక్త రిపోర్టుపైన చర్చించే సమయంలో మొత్తం ఫైల్స్ కమిటీ ముందు పెట్టమని అధికారులను ఆదేశిస్తే, ఫైల్స్ అన్నీ లోకాయుక్తలో ఉన్నాయి కాబట్టి తరువాత కమిటీ ముందు ఉంచుతామని చెప్పారు. ఎప్పటికి రావచ్చు అంటే, నెలకు లేదా రెండు నెలలకు రావచ్చు అని చెప్పారు. ఇప్పటికి లోకాయుక్త విచారణ పూర్తి అయింది. మంత్రులతో సహా లోకాయుక్త ముందు బోనులో నిలబడినందుకు ఈ ప్రభుత్వానికి సిగ్గు ఉండాలి. బొక్కిన నాలుగు వందల కోట్ల రూపాయలు ఎక్కడ పెట్టారో చెప్పండి. అయినా కానీ, మీరు సిగ్గు విడిచి మాట్లాడుతున్నారు. ఇప్పుడు సభలో ఆర్థిక శాఖామంత్రి రోశయ్యగారు ఉన్నారు కాబట్టి వారైనా సమాధానం చెప్పాలి. మేం అన్ని ఫైళ్లు కూడా సభలో పెట్టమని అడిగాం. కానీ మీరు సభలో పెట్టలేదు. లోకాయుక్త విచారణ పూర్తి అయింది. లోకాయుక్త రిపోర్టు బయటకు రాకుండా మీ ప్రభుత్వానికి నీటిపారుదల సలహాదారుగా పనిచేసిన సీతాపతిరావు కోర్టుకు వెళ్లారు. Nothing doing. మీరు కాంపిటెంట్ అథారిటీకి ఆ రిపోర్టును ఫార్వర్డ్ చేయండని హైకోర్టు చెప్పింది. ఆ జడ్జిమెంట్ ప్రతి కావాలంటే

మీరు కోర్టు నుంచి తెప్పించుకోండి.

సార్, ఆర్థిక మంత్రి గారు చాలా అనుభవశాలి, అనేక పదవులు నిర్వహించారు. వారు అనేక సార్లు బడ్జెట్ పెట్టారు, బహుశా రాష్ట్ర చరిత్రలో 13సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన వ్యక్తిగా ఆయన రికార్డు ఎవరు అధిగమిస్తారో కాలమే నిర్ణయిస్తుంది, అంత పెద్ద రికార్డులు ఆయన చేసారు. కాకపోతే 13 అంకెతో ముగిస్తున్నారన్న బాధ ఒక్కటే, ఆయన అంత అనుభవం ఉన్న వ్యక్తి, ఆయనంత అనుభవం నాకు లేదు, నాకు తెలియక ఒక విషయం అడుగుతున్నాను. ఒక ప్రాజెక్ట్ పైన ఇదే శాసనసభలో 17 రోజుల పాటు చర్చించడం జరిగింది. మేము డాక్యుమెంట్లు కూడా ఇచ్చాము, రకరకాలైన అభియోగాలు కూడా వచ్చాయి. స్పీకర్ గారి దగ్గర రికార్డులు పెట్టమని చెప్పాము కానీ పెట్టలేదు. అంతిమంగా కాగ్ రిపోర్టును లోకాయుక్త సూమోటోగా స్వీకరించింది. మా పార్టీ తరపున మేము ఎలాంటి కేసు పెట్టలేదు. లోకాయుక్త జరుగుతున్నదంతా చూసి సూమోటోగా కేసు తీసుకుంది. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని కిరణ్‌కుమార్ రెడ్డి గారు చెబుతున్నారు. ప్రైమాఫేసీ ఎవిడెన్స్ లేకుండా లోకాయుక్త ఎవరినన్నా పిలుస్తుందా? I want to know from Rosaiah garu. ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో లోకాయుక్త నిజానిజాలు తెలుసుకున్న తరువాత, ఆరోపణల్లో నిజం ఉందని వారికి అనుమానం వచ్చిన తరువాతనే పిలుస్తారు. లోకాయుక్తకు ఎన్నో పిటీషన్లు వెళతాయి, ఎన్నో కంప్లైంట్లు పోతాయి, లేదా పేపర్లలో వస్తున్న రోజువారీ అభియోగాలు ఉంటాయి అవన్నీ సూమోటాగా వారు పిలవవచ్చు, పిలిచిన తరువాత విచారణ చేయవచ్చు, ఆ విధంగా పిలిచారా? సూమోటోగా వారు తీసుకొన్న కేసులో ప్రైమాఫేసీ ఉన్న తరువాతనే విచారణ జరుగుతుంది అనే విషయం వారికి తెలియదా? నేను అడిగిన ప్రశ్నకు రోశయ్య గారి నుంచి సరైన సమాధానం రాలేదు. కాగ్ రిపోర్టు వచ్చింది. కాగ్ తన రిపోర్టులో స్పష్టంగా చెప్పింది, ఒక రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలో ఈ విధంగా తప్పులు జరిగినాయి, కాంట్రాక్టర్‌కు ఫేవర్ చేయడానికి మీరు ఇవన్నీ చేసారు అని తన రిపోర్టులో చెప్పింది. ప్రతిపక్ష సభ్యులుగా మేము అడిగేదేమంటే, ప్రజల సొమ్ము రూ.400 కోట్లు తిన్నారని కాగ్ రిపోర్టు ఇచ్చింది, మేము కూడా చెబుతున్నాము. లోకాయుక్తలో విచారణ జరిగింది. ఆ విచారణ తాలూకు రిపోర్టు పెట్టడానికి మీకు అభ్యంతరం ఏమిటి? విచారణ తాలూకు రిపోర్టు తెప్పించగలిగే స్థితిలో మీరున్నారా? లేదా? జరిగిన విచారణ తాలూకు రిపోర్టును వెంటనే సంబంధిత అధికారికి పంపమని లోకాయుక్త మరియు హైకోర్టు చెప్పింది. విచారణలో ఏమి తేలిందో మాకు కూడా తెలీదు. జడ్జిమెంట్‌లో ఏమిచ్చారో తెలీదు, ఆ జడ్జిమెంట్‌ను శాసనసభ ముందు పెడతారా, లేదా? దీనికి సమాధానం ప్రస్తుతం చెప్పకున్నా, జవాబు చెప్పేటప్పుడు ఈ విషయాన్ని మాత్రం తప్పకుండా ప్రభుత్వం జవాబు చెప్పి తీరాలి. ఇది మీ బాధ్యత. కాగ్ రిపోర్టులో ఏముందో చెప్పకుండా తప్పించుకుంటున్నారు. మరి లోకాయుక్త రిపోర్టును సభలో ఎందుకు పెట్టరు? సాక్ష్యాలు లేకుండా న్యాయస్థానం తప్పు పట్టదు. ప్రభుత్వం నుంచి ఫైళ్లు తెప్పించుకుంది, అధికార్లను పిలిపించింది, సంబంధిత మంత్రులను పిలిచారు, విచారణ చేసారు, కాబట్టి ఆ రిపోర్టును ప్రభుత్వం తెప్పించుకొని సభలో పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. ఆ రిపోర్టు పెట్టడంలో ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు, ఉండడానికి అవకాశం

లేదు. హైకోర్టు నుంచి ఆర్డరు వచ్చి ఇప్పటికి 50రోజులు అవుతున్నది. లోకాయుక్త మీద నేను మాట్లాడటం బాగుండదు. ఎందుకంటే that is a Constitutional body. 50రోజులు అవుతున్నది, forthwith రిపోర్టు ఇవ్వమని హైకోర్టు ఆర్డరు ఇస్తే ఇంత వరకు రాకుండా ఎందుకు ఆపుతున్నారో సమాధానం చెప్పాలి. దాంట్లో నూటికి నూరుపాళ్లు రూ.400 కోట్లు మీరు, ముఖ్యమంత్రి గారితో సహా అందరి ఇన్‌వాల్వ్‌మెంట్ ఉంది కనుకనే ఆ రిపోర్టు బయటపెట్టడం లేదు. ఖచ్చితంగా లోకాయుక్త రిపోర్టును సభలో పెట్టాలి, మిమ్మల్ని కోర్టు ఏవిధంగా దోషులుగా నిలబెట్టిందో ఆవిషయం ప్రజలకందరికీ తెలియజేయాలి. ఆరిపోర్టు పెట్టమని మేము డిమాండ్ చేస్తున్నాము. ఇది ప్రజల సొమ్ము, మీ సొమ్ము కాదు, ప్రజా సొమ్మును దుర్వినియోగం చేసిన చరిత్ర మీకు ఉన్నది. ఒక కేసులో మీరు పకడ్బందీగా దొరికారు. ప్రజా సొమ్మును దుర్వినియోగం చేసిన చరిత్ర మీకు ఉన్నది. ఆ కేసు గురించి చెప్పమని నేను అడుగుతున్నాను.

స్పీకర్ సార్, నేను రోశయ్య గారు ఏదో ఇందులో తప్పు చేసారని చెప్పడం లేదు. నేను ఆరోజు కూడా చెప్పాను. ఫైనాన్స్ మినిష్టరు గారు తమరికి బాధ్యత లేదా అని బాధ్యత గుర్తు చేసానే తప్ప, మీరేదో దాంట్లో ఇన్‌వాల్వ్ అయ్యారు, అందరి కమిషన్లలో మీకింత కమిషన్ వస్తుందని చెప్పలేదు. With due respect to him, he is the Finance Minister of the State. He is not an accountant. ఖచ్చితంగా అనుమానం వచ్చినపుడు, నేను నిరాధారమైన ఆరోపణలు చేయలేదు. ఆరోజు ప్రొసీడింగ్స్ మీరు తీయండి, 17 రోజుల చర్చ తీద్దాము. మేము ప్రతి మాటకు ఆధారాలతో సహా ఇక్కడ ఫైళ్లు పెట్టాము. ప్రతి కాగితం మేము పెట్టాము. కానీ ఒక డెమోక్రసీలో మనమున్నాం. మీకు మంద బలముంది, సంఖ్యా బలముంది కాబట్టి, ఆ రోజు హౌస్‌లోపల ఏదో ఒక్క మాటను మొత్తం తప్పుగా అర్థం వచ్చేటట్లుగా చేసుకుని, సడెన్‌గా ఆ రోజు హౌస్‌ను క్లోజ్ చేసేసి మీరు వెళ్లిపోయినారు కదా. ఆ రోజు అక్కడితో ముగియలేదు కదా. తరువాత కాగ్ వాళ్లకైతే మేము చెప్పలేదు కదా. మా దగ్గర వున్న ఫైళ్లు, మా దగ్గర వున్న కాగితాలు కాగ్ అడగలేదు కదా. ఎక్కడైనా ఆడిటర్ ఏం చేస్తాడు సార్, వున్నటువంటి అకౌంట్స్‌ను తీసుకుని తన యొక్క అభిప్రాయాన్ని చెబుతాడు. సరే, ఆయన అభిప్రాయంపైన చర్చ జరగాలంటున్నారు. నేను కూడా ఒప్పుకుంటాను. ఖచ్చితంగా ఆయన యొక్క అభిప్రాయంపైన చర్చ పెడదాము. చర్చకు తీసుకుందాము. చర్చ పెట్టుకోవచ్చు.

కాగ్‌దేమో డిబేటబుల్ ఐటమ్ అంటున్నారు అధ్యక్షా . కాగ్‌ది మనం డిబేట్ చేద్దాము, దానికి కావాలసింది. ఏం చేద్దామో అది పెడదాము. ఇకపోతే 3వస్టేజ్ ఏమిటి, లోకాయుక్త. లోకాయుక్త అనేది కోర్టు . కోర్టు విచారణ జరిపింది, ఫైల్స్ తెప్పించుకున్నారు, ఆఫీసర్లను, మంత్రులను పిలిచారు, కోర్టు విచారణ జరిగింది. ఎన్ని రోజులు జరిగింది అధ్యక్షా, నేననుకుంటాను ఒకటి, ఒకటిన్నర సంవత్సరం పైగా విచారణ జరిగింది. విచారణ జరిగిన తరువాత ప్రభుత్వం కోర్టుకు సహకరించనందుకు మందలించారు. మేము ప్రెస్‌లో చూశాము, మేమేమి అక్కడికి వెళ్లి కూర్చోలేదు. ప్రెస్‌లో కూడా వచ్చింది. అనేక విధాలుగా మందలించి ఉన్న రిపోర్టు, ఫైళ్ళు అన్నీ తెప్పించుకుని వాళ్లు ఒక జడ్జిమెంట్ ఇచ్చినారు. with all evidences జడ్జిమెంట్

ఇచ్చినారు.ఇంతలో మీ అడ్వయిజరు కోర్టుకు వెళ్లినాడు. హైకోర్టుకు వెళ్లి ఈజడ్జిమెంటును మీరు ఓపెన్ చేయవద్దని చెప్పినాడు . అనేసరికి సీల్డ్ కవరులో ఆవిధంగా పెట్టమని హైకోర్ట్ వాళ్లు చెప్పినారు. మళ్లీ హైకోర్టు వాళ్లు nothing doing వెంటనే ఒక్క నిమిషం ఆలస్యం చేయకుండా ఆ జడ్జిమెంట్‌ను మీరు వెంటనే కాంపిటెంట్ అథారిటీకి పంపించండి అని చెప్పారు.ఎందుకంటే ఆ రోజు ఇచ్చిన లోకాయుక్త లేరు,ఇప్పుడు వేరే వాళ్లను తీసుకు వచ్చి పెట్టినారు వీళ్లు. జడ్జిమెంట్‌ను వెనువెంటనే దాన్ని ఫార్వర్డ్ చేయమని చెప్పినపుడు, మేము అడుగుతున్నాము అయ్యా ఏం చెప్పింది **న్యాయస్థానం, లోకాయుక్త ఏం చెప్పిందో తెలుసుకునేటటువంటి అధికారం ప్రజాస్వామ్యంలో మాకు లేదా? అది అడుగుతూ వుంటే, మీరు ఏవో పాతవన్నీ తీసుకువచ్చి రకరకాలుగా మాట్లాడటం బాధ్యత కాదు.** మేము రూఢీగా చెప్పిన తరువాత, మాకు జవాబు చెప్పకుండా మీరు ఆ రోజు తప్పించుకున్న తరువాత, కాగ్ రిపోర్టు వాళ్లు మా వాదనను నూటికి నూరు పాళ్లు ధృవీకరించిన తరువాత, ఈనాడు ఖచ్చితంగా లోకాయుక్త రిపోర్టును గురించి మేము అడగడం పొరపాటా? ఒకసారి రోశయ్య గారు చెప్పాలి. ఒక ముఖ్యమైన ప్రతిపక్షపార్టీగా మేము ఏం తప్పు చేస్తున్నామండి? ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసారా? చేయలేదా? తేల్చడానికి ఒక న్యాయస్థానం ఇచ్చిన రిపోర్టును బయటపెట్టడానికి మీకెందుకండీ భయం. ఎందుకు భయపడుతున్నారో ఆ విషయాన్ని చెప్పమని నేను అడగదలచుకున్నాను.

అధ్యక్షా! ఇవాళ వీళ్లిస్తున్న సబ్ కాంట్రాక్ట్‌ల చరిత్ర చూస్తుంటే, నిన్న చూశాము. పత్రికలలో వచ్చాయి. ఒక సబ్ కాంట్రాక్టరు, ఎవరో మెగా కృష్ణారెడ్డి అనే సబ్ కాంట్రాక్టరు ఏ మాత్రం అనుభవం లేనటువంటి వ్యక్తిని తీసుకువచ్చారు. ఒక వైపేమో కాంట్రాక్టర్లకు ఎలిజిబిలిటీ క్రైటీరియా పెట్టారు. తద్వారా ఎవరినీ కాంపిటీషన్ రాకుండా కేర్ తీసుకుని, ఈనాడు ఆ ఎలిజిబిలిటి లేని వ్యక్తులకు సబ్ కాంట్రాక్టులు మీరు ఇస్తున్నారు. ఒకటి కాదు, రెండు కాదు అధ్యక్షా, ఆరు నుంచి ఏడు వేల కోట్ల రూపాయల పనులు, ఏమాత్రం అనుభవం లేని వ్యక్తికి కేవలం రూ. 5 కోట్లో, రూ. 6 కోట్లో కృష్ణా పైపులైను 3వ ఫేజ్‌లో, 2వ ఫేజ్‌లో పనులు చేసిన అనుభవం వున్నట్లుగా చెబుతున్న వ్యక్తికి, ఏ మాత్రం అనుభవం లేకుండా ఇన్ని వేల కోట్ల రూపాయల పనులు ఎలా ఇస్తారండీ? ఆ మహానుభావుడిపై, మొన్ననే దేవాదుల పైప్‌లైన్ పేలిపోయింది. ఇలాంటి సబ్ కాంట్రాక్టర్లను పెట్టుకుంటూ, ఈవిధమైన కమీషన్లు తీసుకుంటూ, వాళ్లకు ఈనాడు వేలకోట్ల రూపాయల పనులు ఇచ్చుకుంటూ పోతున్నారు. ఎవరు చేస్తున్నారు, దీని వెనుక ఎవరున్నారు? ఈ సబ్ కాంట్రాక్టరు ముసుగు తీసివేస్తే, అసలు ముసుగు బయటకు వస్తుంది. ఇలాంటి వ్యక్తులు కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే చెబుతున్నాను. ఈ విధంగా మీరు కాంట్రాక్టులు ఇచ్చుకుంటూ, మీకు, మీకు సంబంధించిన వ్యక్తులకు వేల కోట్ల రూపాయల పనులు అప్పజెప్పుకుంటూ కోట్ల రూపాయలు కొట్టేసుకుంటున్న ఈ యొక్క యజ్ఞాన్ని అవును ధనయజ్ఞమని ముఖ్యమంత్రిగారు మాట్లాడారు. అయితే ఇది జలయజ్ఞమా, లేక దుర్మార్గమైన యజ్ఞమా అనే విషయాలకు సంబంధించి ఇది ఏ యజ్ఞమో రేపు ప్రజలు వారు పోయిన తరువాత వాళ్లే చూసుకుంటారు. ఆవిధంగా ఖచ్చితంగా మేము దాన్ని ఎగ్జిబిషన్ పెడతాము. ఇంతవరకు ఎన్ని కెనాల్స్‌లో ఎంతశాతం నీళ్లు వచ్చాయి. ఏఏ ప్రాజెక్టులలో ఎంత నీళ్లు వచ్చాయో, ఫిజికల్‌గా కూడా వెరిఫై చేద్దాము.

ఏ విధంగా ప్రజలను మోసం చేసారో ఆ విషయాలన్నీ కూడా ప్రజానీకానికి తెలియజేయాల్సిన అవసరం వున్నది.

అదేవిధంగా అధ్యక్షా! ఈరోజు మీరు నదీ జలాలపైన, గోదావరి జలాలపైన ఇంకొక విషయం చెబుతున్నారు. ఒక విషయం చెబుతున్నాను, మీరే జవాబు చెప్పాలి అధ్యక్షా, మరి మంత్రిగారిని అడిగి చెబుతారా? లేక మీరు తెలుసుకుంటారా? తెలుసుకోండి. ఈనాడు ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టులు కావాలని మేము కొట్లాడుతూవుంటే, ఆ ప్రాజెక్టుల కోసం మేం ఉద్యమాలు చేపడుతుంటే, మీరు దుమ్ముగూడెం ప్రాజెక్టు తీసుకువచ్చి టేల్‌పాండ్‌లో నీళ్లుపోసి, 160 టి.ఎం.సి.ల గోదావరి నీటిని మళ్లించడానికి టెండర్లు పిలవబోతున్నారు. మరి దాని సంగతేమిటి? మీరొక వైపు పోతిరెడ్డిపాడు నుంచి వరద జలాలు తీసుకు పోతామని అంటున్నారు. వరద జలాలను తీసుకుపోతాము, ఒక్క చుక్క వరద జలాలను కూడా వదిలిపెట్టమని అంటున్నారు. అప్పుడు, ఆరోజు జనార్ధనరెడ్డి గారు బ్రతికి వున్నప్పుడు అడిగారు. వరద జలాలకు, నికర జలాలకు వ్యత్యాసం ఏమిటండి నాకు అర్థం కావడం లేదు, దానికో రంగు, దీనికో రంగు వున్నదా అని అడిగారు. మరి ఈనాడు వున్న నికర జలాలు అక్కడ నుంచి తరలించుకు పోకపోతే, మరి 160 ఎకరాల కమాండ్ ఏరియా ద్వారా ఎవరికి నీళ్లిస్తారండి. ఆల్రెడీ ఇంతకుముందు వున్నటు వంటి కృష్ణా జిల్లా డెల్టా క్రింద వున్న నీళ్లకా, లేకపోతే ఆడెల్టా క్రింద వున్న నీటికి ఈ గోదావరి నీళ్లు ఇవ్వదలచుకుంటే, మరి కృష్ణా నీళ్లు మీరు పోతిరెడ్డిపాడు నుంచి తీసుకు పోవడానికి నీళ్లు రావాలి కదా. ఆవిధంగా స్టెబిలైజ్డ్‌గా వున్న నీళ్లకు రెండు, రెండు ఇస్తారా? ఒకే పంటకు అక్కడ నీళ్లిస్తారా? లేక ఇక్కడ నీళ్లిస్తారా?. మరి ఆసంగతి కూడా చెప్పాలి కదా. 160 టిఎంసిల నీరంటే దగ్గర దగ్గరగా, ఎంత లేదనుకున్నా 17,18 లక్షల ఎకరాలకు నీళ్లను తీసుకువచ్చే ప్రాజెక్టును చేపడుతూ, ఎక్కడ నీళ్లివ్వబోతున్నారో కూడా చెప్పకుండా, అంటే ఆల్రెడి కృష్ణా నీళ్లను పోతిరెడ్డిపాడుతో తీసుకుపోతారు మీరు, అక్కడ నుంచి తొలగించిన నీళ్లకు అక్కడేమన్నా గొడవవుతుందని చెప్పి ఇది బూచి చూపెడుతున్నారు. ఈ విధంగా జలయజ్ఞం పేరుతో దోపిడీ చేస్తున్నారు. జలయజ్ఞం రూ.44 కోట్లు అన్నారు, ఈనాడు అది లక్ష కోట్లకు వచ్చింది. తరువాత లక్షా ముప్పై కోట్లు అంటున్నారు. ఇప్పటికి ఎన్ని కోట్లో బహుశ భగవంతునికి తెలుసు, తరువాత కాంట్రాక్టర్లకు తెలుసు. ఎందుకంటే వాళ్లకు ఎంత అసరమైతే అంత వేసుకోవచ్చు కనుక. కాంట్రాక్టర్లకు రెండువేల కోట్లు అవసరముంటే ప్రభుత్వానికి చెబుతారు రెండువేల కోట్ల ప్రాజెక్టు ఏదైనా వెయ్యమని అప్పుడు దాని డిజైన్ మార్చడమో, లేదా లేని పైపులు తీసుకువచ్చి పెంచడమో, లేదా ఎక్కడైనా కాలువ త్రవ్వించడమో చేసి ఆ రెండు వేలు ఆటోమాటిక్‌గా పెంచివేస్తారు. మొన్న పేపర్‌లో చూసి ఆశ్చర్యపోయాను. మూడువేల ఐదు వందల కోట్లు పెట్టి సోమశిల ప్రాజెక్టుకు రివర్స్‌లో కడప వరకు నీళ్లు తీసుకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారని. (అంతరాయం) ఈ విధంగా ప్రాజెక్టులన్నీ కూడా డబ్బులు కొట్టేయడానికి చేస్తున్న ప్రయత్నాలు తప్ప ప్రజలకు గానీ, రైతాంగానికి గానీ ఏ విధమైన ఉపయోగం కనిపించడం లేదు. ఆకలి మన బలహీనత. ఆకలితో ఉన్నవాడు కడుపు నింపుకోవడానికి తిండి ఎక్కడ దొరికితే అక్కడకు పరిగెత్తుకుని

వెడతాడు. నీరు ఈనాడు భూమికి చాలా అవసరం. నీళ్లు కావాలనే బలమైన కోరిక రైతాంగానికి, ప్రజానీకానికి ఉన్నది. నీళ్లు మనకు అందుబాటులో ఉన్నాయి. కానీ మీరు ప్రజల అవసరాన్ని గుర్తించి ప్రాజెక్టుల ముసుగులో డబ్బులు కొట్టేయడానికి చూస్తున్నారు. ఈవిధమైన దుర్మార్గమైన చర్యలు చేపడుతున్నారు. మరొక ముఖ్యమైన అంశం సంక్షేమం. మీకు ఈనాడు వనరులు పెరిగాయి. వాటికి కారణాలు ఏమైనా వనరులు వచ్చాయి. లక్షకోట్లకు పైగా వనరులు వచ్చాయి. ఇక చూడండి ఈ యుగం ఎలా మారిపోతోందో అని రోశయ్యగారు అన్నారు. అలా ఐతే మీరు ఇచ్చిన బడ్జెట్‌లో ఎవరికి ముందు కేటాయింపులు ఇవ్వాలి? సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలకు కేటాయింపులు చేస్తారా? లేదా నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా కోట్ల రూపాయలు కమీషన్లు కొట్టి సొమ్ము చేసుకుంటున్న కాంట్రాక్టర్లకు దోచిపెడతారా? ఏ విధంగా మీ కేటాయింపులు ఉన్నాయో మీరే ఆలోచించండి. ఎందుకంటే ముఖ్యమంత్రిగారు రెండు మూడు సార్లు స్పెసిఫిక్‌గా చెప్పారు-నా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఏ ఇతర రాష్ట్రాలలోను జరగడం లేదని. కావాలంటే మీరు విమానంలో వెడతారా? బస్సులో వెడతారా?, రైలులో వెడతారా? అన్ని రాష్ట్రాలు తిరిగి చూసి రండి అని సెలవిచ్చారు. నేనెక్కడికీ తిరగవలసిన అవసరం లేదు. ఆర్.బి.ఐ. వాళ్లేమీ తప్పుడు లెక్కలు ఇవ్వరు కదా. ఈనాడు వాళ్లిచ్చిన రిపోర్ట్ ప్రకారం percentage of expenditure on social sectors లో ఆంధ్రప్రదేశ్ తొమ్మిదవ స్థానంలో ఉన్నది. ఈ రిపోర్ట్ అంతా ఇప్పుడు సభలో చదవడానికి నాకు టైమ్ సరిపోదు. 1998-99నుండి తీసుకుంటే ఆనాడు మా ప్రభుత్వ హయాంలో మేము 40 శాతం కేటాయింపులు పెట్టాము. ఆ విధమైన కేటాయింపులు తీసుకుంటే 2007-08 నాటికి మీరు 36.1 శాతానికి తగ్గించారు. నేను హెల్త్ రంగంలో మీ కంటే ఎక్కువ కోట్లు పెట్టాను కదా ఇంకో చోట ఇన్ని కోట్లు ఇచ్చాను కదా అంటారు, కానీ మాకు కావలసింది కోట్లు కాదు what is the percentage you are giving? మీకు వచ్చిన నిధులలో మాకు కేటాయించిన నిధులెన్ని? అని అడుగుతున్నాను. ఈనాడు బీహార్, జార్ఖండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళ్‌నాడు రాష్ట్రాలకంటే కూడా మన రాష్ట్రం తక్కువ కేటాయింపులు చేసిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాయింట్ అవుట్ చేసింది.

భారత దేశంలో అరవై సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో ఇప్పటికీ అత్యంత దయనీయ స్థితిలో ఉన్నటువంటివారు దళితులు. కేంద్రంలో కూడా పరిపాలన చేసినటువంటి మహానుభావులు మీరు. ఈ 40 సంవత్సరాల పాలనలో వారి చేత ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారు. ఐనా వారి పరిస్థితి ఏమైనా మారిందా? రాజ్యాంగ బద్ధంగా జనాభా ప్రాతిపదికన వారి సంక్షేమానికి నిధులు పెంచాలి కదా అదేమైనా పాటిస్తున్నారా? నోడల్ ఏజెన్సీ పెట్టమని అందరూ ఉద్యమాలు చేపడుతూ ఉంటే ఆనాడు పెడతామన్నారు. నోడల్ ఏజెన్సీ పెట్టాక ఇంతవరకూ ఏమి జరుగుతోంది? ఇప్పుడన్నా కనీసం బడ్జెట్ కేటాయింపులు పెంచాలి కదా? సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో 30, 40 శాతం పెంచామని బ్రహ్మాండంగా మాట్లాడుతున్నారు కానీ ధరలు కూడా బ్రహ్మాండంగా పెరిగాయి. ఈనాడు టాక్స్‌ల పేరుతో, వ్యాట్ పేరుతో ఇన్‌డైరెక్ట్‌గా ప్రతి సంవత్సరం 22శాతానికి పైగా గ్రోత్‌రేట్ పేరుతో పన్నులు వసూలు చేసుకుంటున్నారు. ఈనాడు జనాభా ప్రాతిపదికన ఇవ్వాలని,

కేటాయింపులు చెయ్యాలని ఉన్నా మీరెందుకు చెయ్యడంలేదు? ఈనాడు 320 మంది పిల్లలు సరైన తిండి లేకుండా, కనీస వసతులు లేకుండా చనిపోయిన సంగతి వాస్తవం కాదా? ఇదే మాట మేము ఇదివరలో అంటే ప్రభుత్వం స్పందించలేదు. నిరంకుశంగా ఎదురుదాడి చేశారు. మమ్మల్ని అనేక రకాలుగా విమర్శించారు. మేమందరం సంక్షేమ యాత్ర చేపట్టి మహబూబ్ నగర్, నల్గొండ రాష్ట్రాలలో సంక్షేమ వసతి గృహాలలో మేము పడుకొన్నాం. మా నియోజక వర్గంలోనే ఒక్కొక్క హాస్టల్‌ను చూసినట్లైతే కళ్ల వెంట నీళ్లు వస్తాయి. మహబూబ్‌నగర్ హాస్టల్‌లో పిల్లలు పొద్దున 4 గంటలకు లేచి ఒకటే నల్లా దగ్గర స్నానాలు చేస్తున్నారు. కొంతమంది పిల్లలైతే నీళ్లు లేక 8 రోజులకు ఒకసారి స్నానం చేస్తున్నారు. మరి ఈ పరిస్థితులు ఇలా ఉంటే వచ్చిన నిధులు ఏం చేస్తున్నారండీ? ఎవరికి పంచి పెట్టడానికి ఈ లక్ష కోట్లు?

అధ్యక్షా! హాస్టల్స్‌లో పరిస్థితి దారుణంగా ఉందని చెపితే ఆ రోజు జరిగిన డిబేటులో స్పీకరు గారి డైరెక్షన్ల మేరకు కొందరు వెళ్లి పడుకుంటామని చెప్పారు, అవిధంగా పడుకున్నారు. We are all very grateful to him.

ఈ ప్రభుత్వం మొండి ప్రభుత్వం, గుడ్డి ప్రభుత్వం, ఏది పట్టదు, ఫ్యూడల్ ప్రభుత్వం ఇది, ఆలోచన కూడా వుండదు, పేదలకు సాయంచేద్దామని ఆలోచన వీళ్లకు వుండదు. మా పార్టీ తరుపున మేము అందరం కూడా చలికి పిల్లలు అందరు బాధ పడుతావుంటే ఎన్‌టిఆర్ ట్రస్టు తరఫున 3 లక్షల దుప్పట్లు అన్ని హాస్టల్స్‌లో పంచినాము. మేము పంచుతావుంటే అనేక రకాలుగా మాట్లాడారు, మాట్లాడితే మాట్లాడారు మేము చేయదల్చుకున్న దగ్గర చేశాము. It is a token protest as well as the reminding responsibility to the Government. మళ్లీ మాట్లాడుతున్నారు ఒకటో తారీఖునుంచి పోతామని చెబుతూవున్నారు, సంతోషమే పొండి. అధికారంలో ఉన్న వాళ్లు వెళ్లడం చాలా అవసరం. వాస్తవాలు అన్నా కనీసం తెలుసుకొనే అవకాశం వుంటుంది. మీరు వెళుతున్నారు అంటే అధికారులన్నా పని చేస్తారు. ఎన్నికల సంవత్సరం కాబట్టి ఎక్కువ బడ్జెటు పెడతారని, మళ్లీ అధికారంలోకి వస్తామని ఉవ్విళ్లూరుతున్నారు. కనీసం కేటాయింపులు పెంచుతారని అనుకుంటే, కేటాయింపులు పెంచలేదు. మసిపూసి మారేడుకాయ చేసినట్టుగా మనకు పెరిగిన ధరలకు అనుగుణంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చెబుతుంది ఎదుగుతున్న పిల్లవాడికి ఖచ్చితంగా 2600 కాలరీస్ కావాలని చెబుతూ వుంటే వెయ్యి కాలరీస్ కూడా సరిగా ఇవ్వడం లేదు. మీ నాణ్యత ఈ విధంగా వుంది. కనుక దీనిపైన మేము వారిని కోరాము మీరు ఈసారి పెంచమని చెప్పి అది పెంచలేదు. గిరిజనులకు అనేక విధాల వాగ్దానాలు చేసినారు. ఇదే ముఖ్యమంత్రి, ఆ రోజు అపోజిషన్ లీడరుగా గిరిజనుల దగ్గరకు పోయినారు. అయ్యా లంబాడాలకు తాండాలు ఏర్పాటు చేస్తామని, స్వయం పరిపాలన ఇస్తామని, మేము అధికారంలోకి రాగానే తండాలు అన్నిటిని గ్రామ పంచాయితీలుగా డిక్లేర్ చేస్తామని చెప్పారు. 4 సంవత్సరాలు అయినది, తాండాలు ఎక్కడికి పోయినాయి, గ్రామ పంచాయితీలు ఎక్కడికి పోయినాయి. నిన్న అక్కడకు పోతే వాళ్లు అందరూ అమరణ నిరాహారదీక్షకు కూర్చొని ఈ విధంగా ప్రభుత్వం మోసం చేస్తుంది. వాళ్లు ఏమి అడిగారు అంటే డెమోక్రసీ లోపల మేము

పరిపాలనలో భాగస్వాములము అవుతాము. మా తండాలో ఏదో ఒక తృప్తి. మా పరిపాలన మేము చేసుకుంటాము. ప్రజాస్వామ్యంలో తృప్తిని కల్గచేయడానికి ఏర్పాటు చేయమని అందరూ కూడా రిక్వెస్టు చేస్తే అతీలేదు, గతీలేదు, మోసపూరితమైన మాటలు మాట్లాడారు. ఓట్లు అయితే, వేయించుకున్నారు కాని ఒక్క విషయంలో వారికి సరైన సాయం చేయడంలేదు. అదే విధంగా గోండ్లు, కోయలు కాని అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి వాళ్లు, అమాయక ప్రజానీకానికి సంబంధించిన కార్యక్రమాలు. ఐటిడిఎలను ఎవరైనాపోయి చూస్తున్నారా? రివ్యూ చేస్తున్నారా? దానికి ఏమైనా నిధులు ఇస్తున్నారా. కేటాయింపులు ఏమైనా చేశారా? ఐటిఎడిల పరిస్థితి దారుణంగా తయారు అయినది.

ఆ విధంగా దుర్మార్గమైన పరిపాలన చేసిన మీరు, గిరిజన తండాలకు కాని లంబాడా తండాలలోగాని గ్రామ పంచాయితీలు చేస్తారా? చేయరా? మీ పాలసీ ఏమిటో చెప్పాలి, చేయవలసిన అవసరం వున్నది. ఖచ్చితంగా చేసి తీరాలి, మా డిమాండ్. ఐటిడిఎలకు మీరు నిధులు పెంచాలి. అటు కేంద్రం ఇవ్వదు. కేంద్ర ప్రభుత్వం ఎంత బాధ్యతారాహిత్యంగా ఉంది. He may be an economist. అక్కడ ఉన్న ప్రధానమంత్రికి తెలియదు. వారు అంటారు ఫస్టు క్లాస్ 60 శాతం మార్కులు వస్తే తప్ప స్కాలర్‌షిప్పు మేము ఇవ్వము, రీ ఎంబర్సు చేయమని చెప్పి రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వం మాట్లాడదు. ఇప్పటికి 40 శాతం పిల్లలు స్కూలుకు పోవడం లేదు. హాస్టలుకు రావడం లేదు. ఆ పరిస్థితి వున్నది. అందులో గిరిజనులలో ఇంకా దారుణం ఇప్పటికి 75 శాతం నుంచి 80 శాతం గిరిజనులకు ఇప్పటికీ చదువులేదు, అటువంటి దారుణమైన పరిస్థితిలో వాళ్లు వుంటే 60 శాతం మార్కులు వచ్చిన వాళ్లకు స్కాలర్‌షిప్పు ఇస్తాము లేని వాళ్లను గాలికి వదిలి వేస్తామంటే ఇది బాధ్యతారాహిత్యం కాకపోతే ఏమి అవుతుందో చెప్పాలని చెప్పి మీకు తెలియచేస్తున్నాను. We all give respect to the chair. అదే విధంగా వెనుకబడిన తరగతుల పరిస్థితి ఎంత దారుణంగా వుందో ఒకసారి ఆలోచన చేయండి. 2005-06లో 355 కోట్ల రూపాయలు కేటాయిస్తే 298 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. 2006-07లో 391 కోట్ల రూపాయలు కేటాయిస్తే 172 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టారు. అదే విధంగా 2007-08లో 537 కోట్ల రూపాయలు కేటాయిస్తే 188 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. అంటే దీనితో ఏమి అర్థం చేసుకోవాలి. ఫస్ట్ ఆఫ్ ఆల్ దీనికి సరిపోయిన కేటాయింపులు ఇచ్చినా మీరు సరిగా ఖర్చు పెట్టకపోవడం ఏదో రకంగా ప్రతిసారి సంక్షేమానికి ఏదో విధంగా కట్ చేయండి, ఒకవైపు వికలాంగులు ఇబ్బందులు పడుతావుంటే, ఉద్యమాలు చేపడుతావుంటే వాళ్లకు అనేక రకాలైనా హామీలు ఇచ్చారు. వాళ్లకి పెన్షన్సు, మిగతా సదుపాయాలు కలుగచేస్తామని చెప్పి ప్రభుత్వం ఇంతవరకు వారికి బడ్జెటు కేటాయింపులు చేయకపోవడం వల్ల ఏవిధంగా హామీ నెరవేరుస్తారో ఆ విషయాన్ని ఫైనాన్సు మినిష్టరు చెప్పాలని తెలియచేస్తున్నాను. ఆరోజు మేము ప్రవేశపెట్టిన డ్వాక్రా గురించి ఇవాళ గొప్పగా చెప్పుకున్నారు. డ్వాక్రా గ్రూపులకు మేము ఏదో చేసినామని చెప్పి. దేశం అంతా పాలిస్తున్నారు కదా మీరు పరిపాలించే రాష్ట్రాలలో ఎందుకు లేవు? ఎంతో నిబద్ధతతో పేద మహిళలను ఐక్యం చేయాలని వాళ్లను అనేక రకాలుగా ఆదుకోవడానికి ఏర్పాటు చేసిన ఆ

మూసినప్పుడు మనకు చాలా అనుమానాలు కలుగుతుంటాయి. ఆ విధంగా పరిపాలన చేసే వ్యక్తులు ఏదో చేస్తున్నారని అనుమానంగా చూస్తుంటారు. దాని గురించి పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు. కాని, ఎప్పుడైతే నీ అవినీతి హద్దు మీరినటువంటి అవినీతి ప్రజా జీవితాన్ని మొత్తం ఎప్పుడైతే నీవు భ్రష్టు పట్టించి పాలన చేసినావో, ఆ పరిపాలనను ఏమాత్రము కూడా క్షమించకూడదని చాణక్యుడు ఎప్పుడో చెప్పాడు. ఈనాడు మీరు చేస్తున్నటు వంటిది ఏమిటి? మొత్తం వ్యవస్థను నాశం చేస్తున్నావు. నీకు వచ్చిన అధికారముతో, నీకు వచ్చిన సంపాదనతో, డబ్బుతో మొత్తం వ్యవస్థను నాశనం చేస్తున్నావు. అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నావు.

స్పీకర్ సార్, ఒక వ్యక్తికి అధికారం ఇస్తే ఏమిచేస్తారు అధ్యక్షా? ఆ అధికారాన్ని దుర్వినియోగపరిచే పద్ధతిలో వ్యవహరిస్తాడు. నా దగ్గరేమో లిస్టు ఉంది. మీరు టైమ్ లేదంటున్నారు. ఈరోజు కూడా దినపత్రికలో వచ్చింది. పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి పేపర్లో వచ్చింది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రూ.1023 కోట్ల అంచనాలతో రైల్వే ట్రాక్ వేస్తుండగా, అందులో 50 శాతం స్టేట్ గవర్నమెంట్ ఇస్తానని ఒప్పుకుంది. ఎవరైనా రైల్వే ట్రాక్ కోసం ఖర్చు పెట్టారా గతంలో? స్టేట్ గవర్నమెంట్ తరపున రూ.500 కోట్లు ఇస్తామని ఎవరైనా వ్రాసి ఇస్తారా? ఐఐఐటిలు అక్కడనే, రింగు రోడ్డులు అక్కడే. మొత్తం అన్నీ అక్కడే. మా దగ్గరేమో భూములు అమ్మాలి, అక్కడేమో పెట్టాలా?

ఏదేమైనా అధ్యక్షా, వీళ్లు చేస్తున్న పాపాలకు రేపు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారు. విజయదశమి వస్తాది. ఆ రోజున ఆయుధాలు పట్టుకుని పేద ప్రజలందరూ కదిలిన నాడు, ఓటు అనే ఆయుధాన్ని తీసుకుని బయటకెళ్లిన నాడు దుర్యోధనుడు ఏ విధంగా నీళ్లల్లో దాక్కున్నాడో ఆ పరిస్థితి ఏర్పడుతుంది రాజశేఖర్‌రెడ్డిగారూ. వీళ్లందరూ మీ వెంట వస్తారని అనుకోవడం పొరపాటు. నువ్వు చేస్తున్న దుర్మార్గపు పనులకు నువ్వు ఖచ్చితంగా మూల్యం చెల్లించుకుంటావు. You are the last Mount Baton. లార్డ్ మౌంట్‌బాటన్ లాగా చిట్టచివరి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా చరిత్రలోకి ఎక్కిపోతారు. నమ్మిన ప్రజలకు చేసిన ద్రోహానికి, నమ్మిన ప్రజానీకాన్ని అడ్డం పెట్టుకుని, ప్రజాస్వామ్య ముసుగులో, ముఖ్యమంత్రి కావాలనే ఏకైక ధ్యేయంతో అధికారంలోకి వచ్చి చేస్తున్న లూటీకి తగిన మూల్యం మీరు చెల్లించుకుంటారు. ఆనాడు సహజ కవచ కుండలాలతో ఉన్న కర్ణుడు దుర్యోధనుడికి సహాయపడలేదు. అదే విధంగా ఆనాడు శకుని నాకు తెలివితేటలు ఉన్నాయి కదా అనుకున్నా, ఆ శకుని కూడా అడ్డం రాలేదు. కాబట్టి ఈనాడు మీకు డప్పు కొడుతున్న ఎమ్.ఎల్.ఏ.లు ఎవరూ మీకు అడ్డం రారు. ఆ నూరు మంది కౌరవుల్లాగా మీరూ రేపు కనుమరుగై పోతారనే విషయాన్ని మరచిపోవద్దు. ఒక వైపేమో 610 జి.ఓ. అమలు చేయరు. తెలంగాణ ప్రజానీకాన్ని మోసం చేస్తారు. ప్రతి దానికీ రాజీవ్‌గాంధీ పేరు, సోనియాగాంధీ పేరు పెడతారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎన్టీఆర్ పెట్టమంటే, రాజీవ్‌గాంధీ పేరు పెడతారు (మైక్ కట్ చేయబడింది) మీకు ధన్యవాదాలు కూడా చెప్పాద్దా అధ్యక్షా?

# అవిశ్వాస తీర్మానం పై చర్చ

1-4-2008

గౌరవ స్పీకర్ గారూ, ఈ రోజు ముఖ్యంగా అవిశ్వాస తీర్మానంపై మనం ఇక్కడ చర్చ చేసుకుంటున్నాం, నిన్నటి నుంచి చాలా మంది పెద్దలు మాట్లాడారు. చాలా విషయాలు కూడా ప్రస్తావనకు తీసుకురావడం జరిగింది. 14 సంవత్సరాల తర్వాత మళ్లీ ఈరోజు ఈ శాసనసభలో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం రావడం, ముఖ్యంగా అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టవలసి వచ్చిందో ఒకసారి ఆలోచన చేయాలని కోరుతున్నాను. ప్రభుత్వం ఐదు సంవత్సరాల కోసం ఎన్నుకోబడింది. ఇంచుమించుగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో వారు ప్రజలకు ఇచ్చిన హామీలలో కొన్నింటిని నెరవేర్చారు. మరి కొన్నింటిని నెరవేర్చక పోవడం, ఇదంతా ఒక ఎత్తయితే అసలు ఈ ప్రభుత్వ పని తీరే పూర్తిగా ప్రజాస్వామిక వ్యవస్థకే ముప్పు తెచ్చే పద్ధతిలో పోతోంది. కనుక తప్పనిసరి పరిస్థితుల్లో ఈ అవిశ్వాస తీర్మానాన్ని మేము ప్రవేశపెట్టాం. ఇది మా హక్కు, ప్రతిపక్షం యొక్క హక్కు. ఈ ప్రభుత్వం చేస్తున్నటువంటి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో, మా సంఖ్య మాకు తెలిసినా, తీర్మానం ఏమవుతుందనే విషయం తెలిసినా, మేము ముందు చెప్పినట్లుగా తప్పనిసరి పరిస్థితుల్లో ఇది ప్రవేశపెట్టాం.

కాంగ్రెస్ పార్టీ ఈ రోజు కొత్తగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోలేదు. 1982కు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండేది, ఏకచ్ఛత్రాధిపత్యంగా వుండేది, అసలు ఆ పార్టీని అడిగే వాళ్లే వుండే వారు కాదు. 1982 తర్వాతే మా పార్టీ అధికారంలోకి వచ్చింది. స్వర్గీయ యన్.టి.రామారావుగారు పార్టీ పెట్టడం, తరువాత ఎన్నికలు జరిగాయి, ఎన్నికలలో గెలిచాం, మేము 1983 లో అధికారంలోకి రావడం జరిగింది. అయితే 1989లో ప్రజలు వాళ్లకు మళ్లీ అవకాశం ఇచ్చారు. కొత్తగా వాళ్ల ధోరణిలో మార్పు రాకపోవడంతో 1994లో ఆల్ మోస్ట్ కాంగ్రెస్ పార్టీకి తుడుచి పెట్టుకుని పోయే పరిస్థితి ఏర్పడింది. 26 మంది సభ్యులతో ఈ శాసనసభలో కూర్చున్నారు. మళ్లీ పది సంవత్సరాలైంది. పూర్తిగా నీరసించి పోయిన ఆ పార్టీకి,

మళ్లీ అసలు ఆ పార్టీకి రాజకీయ భవిష్యత్తు వుంటుందా వుండదా అన్న పరిస్థితుల్లో ప్రజలు మరొకసారి వారికి అవకాశం ఇచ్చారు. ఆ విధంగా అవకాశం వచ్చిన సందర్భంలో మేమందరమూ అనుకున్నాం. ఈ ప్రభుత్వం బాగా పని చేస్తుందవచ్చని. ఎందుకంటే నిరంతరమూ ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేసినా, ఆనాడు మమ్ములను కాదని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు ప్రజలు వారిపై విశ్వాసం ప్రకటించారు ఆ టైములో. ఈనాడు ఇక్కడ మాట్లాడుతున్న సభ్యులు, ప్రతిసారీ ముఖ్యమంత్రిగారు, మంత్రులు చెబుతున్న విషయాలు, మాపై విమర్శలు. ఇవన్నీ ఎన్నికల సమయంలో డిస్కషన్‌కు వచ్చాయి. కొత్తగా ఈ నాలుగు సంవత్సరాల కాలంలో తెలుగుదేశం పార్టీపైన గానీ, మాపైన గానీ విమర్శలేవీ చేయలేక పోయారు. ఈరోజు మీరు ప్రస్తావిస్తున్న ప్రతి విషయం కూడా ఆ రోజు ఎన్నికలకు ముందు చెప్పారు కాబట్టే, ప్రజాకోర్టుల్లో మామాట కాదని ప్రజలు మిమ్ములను అధికారంలోకి తీసుకొచ్చిన తర్వాత, ఈనాడు అవిశ్వాస తీర్మానంపై ముందుకు పోతున్నపుడు కూడా అవే విషయాలు చెబుతున్నారే తప్ప, ఒక ప్రధాన రాజకీయ పార్టీ మాపై అవిశ్వాస తీర్మానం పెట్టింది, కనుక దీంట్లో మనం విషయాలు తెలుసుకుందాం, మళ్లీ మనం రేపు ప్రజాకోర్టుకు వెళ్లాలి, దాన్ని ఏవిధంగా మార్చుకుందాం అనే ఆలోచన మాత్రం ఏ కోశాన వీరిలో నాకు కనిపించడం లేదు. ఎవరు ఏమి చేసినా ఫర్వాలేదు, మా పద్ధతిలో మేము పోదలుచుకున్నాం, మీకు దిక్కున్న చోట చెప్పుకోండనే పద్ధతిలో వీళ్లు నడిపిస్తున్నారు, సభను నడిపిస్తున్నారు, బయట ప్రభుత్వాన్ని కూడా అదే పద్ధతిలో నడిపిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలైన తర్వాత, మా అధ్యక్షుల వారు కూడా నిన్న చదివి వినిపించారు, రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఈ సభలో ప్రవేశిస్తాం. మంత్రివర్గంలో కూడా అదే పద్ధతిలో రాజ్యాంగం పై ప్రమాణం చేసి, రాగ ద్వేషాలకు అతీతంగా మేము పని చేస్తాం, ధర్మ కర్తలుగా వుండవలసిన వ్యక్తులం అని చెబుతాం. కాని ఈనాడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని రాజశేఖర్‌రెడ్డిగారు చాలా సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే వున్నాడు. వాళ్లు ఏ విధమైన కార్యక్రమాలు చేశారో అవన్నీ చెప్పడానికి టైం లేదు. వాటి జోలికి పోదలచుకోలేదు. ఆనాడున్న వాతావరణాన్ని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. పాదయాత్రలు, వాగ్దానాలు చేశారు. స్వతహాగా కాంగ్రెస్ పార్టీ, మ్యానిఫెస్టో ద్వారా 130 వాగ్దానాలు చేశారు. ఆ విధంగా వాగ్దానాలు చేసి, మెప్పించి, ఒప్పించి చివరకు ప్రజాతీర్పులో విజయం సాధించారు.

**అధ్యక్షా! ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారు. అందరికీ సమాన అవకాశం ఇవ్వాలని, నిష్పక్షపాతంగా పరిపాలనను సాగించాలి అని రాజ్యాంగం చాలా స్పష్టంగా చెబుతుంది. రాగ ద్వేషాలకు అతీతంగా పరిపాలన చెయ్యాలని నిర్దేశించిన రాజ్యాంగం పై ప్రమాణం చేసిన వ్యక్తి ఈనాడు ఏమి చేస్తున్నారో ఒకసారి ఆలోచించాలి.** డెమొక్రసీ అంటే ఒక నియంతను ఎన్నుకోవడం గాదు. మీరు అలెర్ట్‌గా ఉండాలని గాంధీ గారు చెప్పారు. ఆ విధమైన పరిస్థితులు ఏర్పడితే చాలా ప్రమాదమని చెప్పారు. We are not choosing the person. Let us remember this. ఎం.ఎల్.ఏ.గా ఒక వ్యక్తి ఎన్నిక అవుతాడు . ఆ పార్టీలోని సభ్యులు మెజారిటీ ద్వారా వాళ్ల నాయకుడిని ఎన్నుకొని పెట్టుకుంటారు. మంత్రివర్గం ఏర్పాటు చేసుకున్నారు. మంత్రివర్గం గురించి

ఆలోచన చెయ్యండి. మూడు సంవత్సరాల వరకూ మంత్రివర్గం 21 మంత్రులతోనే నడిచింది. ఒకొక్క మంత్రీ రెండు, మూడు పోర్ట్ ఫోలియోలు చూసేవారు. ఎవరు ఏ పోర్ట్ ఫోలియో చూస్తున్నారో చాలా మందికి తెలిసేది కాదు, ఆ విధంగా మంత్రివర్గాన్ని వాళ్లు ఏర్పాటు చేసుకున్నారు. తమ స్వంత మనుషులు, తన వాళ్లను మంత్రివర్గంలో పెట్టుకున్నారని వార్తలు వచ్చాయి. చాలా పార్టీల నుండి విమర్శలు వచ్చాయి . మేము కూడా బయట నుండి చూస్తూనే ఉన్నాము. రాజ్యాంగ స్ఫూర్తి ఎక్కడ దెబ్బ తింటుంది అనే విషయాన్ని ఆలోచన చెయ్యకుండా, నువ్వు తిన్నావు, నేను తిన్నాను అనుకుంటే ఎట్లా? అసలు సమస్య ఎక్కడ ఉంది? ఈ రాష్ట్రంలో రాజ్యాంగానికి తీరని అవమానం జరుగుతోంది. ఆ విషయాన్ని నేను చెబుతాను.

అధ్యక్షా! మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. What is Cabinet? ఈ రాష్ట్రంలో 8 కోట్ల మంది ప్రజానీకానికి సంబంధించి, పరిపాలన చేసే వ్యవస్థ ఇది. అధ్యక్షా, నేను చెప్పకూడదు కాని, చెప్పక తప్పడం లేదు. ఈనాడు ఒక వ్యక్తి మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో నిర్ణయాలు తీసుకోవలసి వస్తుంది. అనేక విషయాలు. అనేక అంశాలు మంత్రి దృష్టికి వస్తుంటాయి. వాళ్లు తీసుకున్న నిర్ణయాలపై యావత్ రాష్ట్ర ప్రజల జీవన విధానం ఆధారపడి ఉంటుంది. వ్యవస్థను నడపవలసిన మంత్రివర్గంలో ఎవరిని పడితే వాళ్లను తీసుకున్నారు. ఒక ఎగ్జాంపుల్ చెబుతాను. జక్కంపూడి రామ్మోహనరావుగారు ఉన్నారు. ఆయన ఒక జబ్బుతో బాధ పడుతున్నారు. అలాంటి జబ్బు ఎవరికీ రాకూడదని నేను కోరుకుంటున్నాను. కానీ, వారికి వచ్చింది. ఇప్పటికీ ఆయనను ఇద్దరో, ముగ్గురో, నలుగురో వ్యక్తులు వచ్చి ఇక్కడ కూర్చోపెడతారు. ఆయనకు నడవడం చేతనవడం లేదు. ఆయన అవస్థను నేను చూస్తున్నాను. ఆయనకు వచ్చిన జబ్బును నయం చేయించడానికి ఎన్ని కోట్ల రూపాయలు అయినా ఖర్చు పెట్టండి, నేను వద్దనడం లేదు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించండి. ఆత్మీయ మిత్రునిగా, ఆత్మీయ స్నేహితునిగా అతనిని అన్ని విధాల ఆదుకోమని చెబుతున్నాను. ఒక నాయకునిగా వారిని చూసుకోవలసిన బాధ్యత మీ పైన ఉంది. కాని, Can he discharge as a Minister? మినిస్టర్‌గా పని చెయ్యడానికి అతని ఫిజికల్ కండిషన్ బాగా లేదు. ఆయన ఆర్ అండ్ బి మినిష్టర్‌గా పనిచేశారు. ఆర్ అండ్ బి మినిస్టర్‌గా ఎన్నో నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. ఇప్పుడు ఆయన ఎక్సైజ్ మినిస్టర్‌గా ఉన్నారు. మన రాష్ట్రంలో కొన్ని లక్షల మంది కార్మికులున్నారు. గీత కార్మికులు నా దగ్గరకు వచ్చి, సార్ మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి, మంత్రి గారి దగ్గరకు వెళ్తే ఆయన ఉండడం లేదు, ఆఫీసర్స్ మమ్మల్ని బెదిరిస్తున్నారని చెబుతున్నారు. నా వాడు ఇతను, నేను ఇతనికి చెప్పుకోవాలని, ప్రజాప్రతినిధులకు చెప్పుకుంటే కష్టం తీరుతుంది అనే భావన ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఉంటుంది. మంత్రిగా పెట్టుకోడానికి అతనికంటే మీకు ఎవ్వరూ దొరక లేదా అని అడుగుతున్నాను. ఈ 190 మందిలో మీకు ఎవరూ కనపడలేదా? still you are continuing him. అంటే, నా మనిషి అని పెట్టుకున్నారు. ఏమైనా సరే రాజశేఖర్‌రెడ్డిగారి ముద్ర ఉండవలసిందే! ఆ విధమైన ముద్ర ఉన్న వ్యక్తులు మాత్రమే నా వెంబడి ఉండాలి, నేను ఎంతైనా సహాయం చేస్తాను అనుకుంటారు. Is it not a dictatorial attitude? Is it a democritic approach? అదే విధంగా మంత్రివర్గం కాకుండా

అవుట్ సైడ్ మంత్రివర్గానికి సంబంధించి అధికారం ఎవరికి ఇచ్చారు? మీ వెంబడున్న వ్యక్తులకు ఇచ్చారు. సుధీర్ రెడ్డి అనే వ్యక్తిని హుడా ఛైర్మన్‌గా వేశారు. ఒక్క మెంబర్‌ని వెయ్యలేదు. ఇప్పటికి నాలుగు సంవత్సరాలు అవుతుంది, ఒక్క మీటింగ్ కూడా జరగలేదు. మా ప్రాంతంలో ఏమి జరుగుతుందో మాకు తెలియడం లేదు. పేపర్స్‌లో చదువుకోవాలి. హుడా ఏ విధమైన పనులు చేస్తుందో తెలియదు. సభ్యులు లేరు, వ్యక్తులు లేరు. ఒకే వ్యక్తి హుడా కార్యక్రమాలను చేస్తున్నారు. Because he is your man.

అధ్యక్షా, టి.టి.డి.లో మీకు సంబంధించిన వ్యక్తిని వేశారు. కీలకమైన సంస్థల్లో మాకు సంబంధమున్న వ్యక్తులనే పెట్టుకుంటామనే పద్ధతి కొనసాగుతున్నది. డెమాక్రసీలో ప్రజలను ఇన్వాల్వ్ చెయ్యకుండా, ప్రజాస్వామ్యంలో ఉన్నటువంటి వ్యవస్థను ఒక వ్యక్తి స్వామ్యంగా మార్చే ప్రయత్నం చేశారు. Is it not undemocratic? అందుకే మేము అవిశ్వాస తీర్మానం పెట్టాము. ఇది ఒక రీజన్.

అధ్యక్షా! నేను ఇక్కడ ఒక వ్యక్తి గురించి మాట్లాడడం లేదు. I am talking about the system. The Chief Minister is a system. అతను ఒక వ్యక్తి కాదు. అతను ఒక వ్యవస్థ. సర్వాధికారాలున్న వ్యవస్థను నడిపే వ్యక్తి, రాజ్యాంగం పైన రాగ ద్వేషాలకు అతీతంగా పని చేస్తానని ప్రమాణం చేసిన వ్యక్తి. ఒక ట్రస్టీగా ఉంటున్న వ్యక్తి చేస్తున్న కార్యక్రమాల గురించి నేను చెప్పదలచుకున్నాను. పవర్ ఆయనకి ఎక్కడ ఉంది? Can an individual Rajasekhara Reddy, can he appoint any one. నేను అడుగుతున్నాను ఇవ్వాళ. Because he is a Chief Minister. అందుకని, నీకు ఇష్టమైన మనుషులను, నీకు ఇష్టమైన చోట్ల వేయడానికి, నీకిచ్చిన అధికారాలను వినియోగించు కుంటున్నావని చెప్పదలచుకున్నాను. In a democracy, in politics an organized minority is a political majority. రాష్ట్రం ఏ విధంగా తయారయ్యింది. Who is exercising the power? ఇక్కడున్న మంత్రులా? ఇక్కడున్న వ్యక్తులా? somebody outside this house. ఇక్కడున్న వ్యక్తులు కాదు. మీరు గుండె మీద చెయ్యి వేసుకొని ఆలోచించండి. అడ్వైజర్స్ అని కొంత మందిని పెట్టుకొన్నారు. వాళ్లు వాళ్ల ఇష్టానుసారంగా కొంతమంది అడ్వైజర్స్‌గా పెట్టుకున్నారు. దేగకన్నులా మీ క్యాబినెట్ పనిచేస్తుంది. ఇక్కడున్నటు వంటి మినిస్టర్స్ స్వేచ్ఛగా, కరెక్ట్‌గా మేము చెయ్యగలుగుతామా అని చెప్పమనండి. They will decide, he will sign. This is how the things are going on. Is it not extra constitutional authority? ఏ కాన్స్‌టిట్యూషన్, I am not going to yield. (అంతరాయం)

అధ్యక్షా! నేను పదే పది నిమిషాలు మాట్లాడాను, అర్ధ గంటకు పైగా ఇంటరప్షన్స్ వచ్చాయి. కాబట్టి ఇవాళ మంత్రులు ఇక్కడ లేవనెత్తిన సబ్జెక్టుపైన ఇంకొక సెపరేట్ సెషన్ పెట్టుకుందాం. I am going on record. నేను నిరాటంకంగా 4,5 గంటలు మాట్లాడతాను. మొత్తం మీ కాంగ్రెస్ పార్టీ వటవృక్షం ఎక్కడ వున్నది, ఎక్కడ నుంచి వచ్చింది మొదలైన అన్ని సంగతులు మాట్లాడతాను. కానీ ముఖ్యంగా ఈరోజు మేము పెట్టింది No confidence motion.

ఈ రోజు రాజశేఖరరెడ్డి గారి నాయకత్వంలో వున్న ప్రభుత్వం విశ్వాసరాహిత్యానికి పాల్పడ్డది కాబట్టి, మేము అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాం. మాకు డెమోక్రసీ ఊపిరి లాంటిది. ఈరోజు ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎప్పుడైతే దెబ్బతింటుందో, ఎప్పుడైతే దాని మూలానికే ప్రమాదం ఏర్పడుతుందో, అటువంటి సందర్భంలో ఎవరైనా తెలిసి, అర్థం చేసుకుని దూరదృష్టితో ఆలోచన చేసే వ్యక్తుల యొక్క బాధ్యతతో, మనం దాన్ని ఎప్పటికప్పుడు ఇమీడియట్‌గా ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలి అనే నైతిక బాధ్యతతో నేను ఇవాళ నిర్వహిస్తున్నాను. అధ్యక్షా, ఈనాడు If you go back to the history, I am telling about organized people. It is not Cabinet of the State. If you organise people, they are organising entire power. Power అంతా కూడా వాళ్లు exercise చేస్తూ వున్నారు. ఆ విధంగా వనరులు కొట్టేస్తున్నారు, distribution of power అక్కడే జరుగుతున్నది. అధ్యక్షా, ఈనాడు రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు మీరు చూడండి. Even Hitler was an ordinary solidier in the Second World War. Later on he was elected in the democratic process. డెమోక్రటిక్ ప్రాసెస్‌లో వచ్చినాడు. కానీ తరువాత మొత్తం మెజారిటీ ఎప్పుడైతే తను పూర్తిగా కంట్రోల్‌లోకి తెచ్చుకోగలిగినాడో, ఎప్పుడైతే మొత్తం ప్రజాభిప్రాయాన్నే మౌల్డ్ చేసే శక్తి తెచ్చుకున్నాడో, ఎప్పుడైతే ప్రజల బలహీనతలను మొత్తం చేతుల్లోకి తీసుకున్నాడో, ఎంత ప్రమాదకారిగా ఏర్పడ్డాడో మనం ఒకసారి ఆలోచించాలి. ఈనాడు నేనూ అదే కోరుతున్నాను, అయ్యా మీరేం చేస్తున్నారో, ఏవిధంగా చేస్తున్నారో అవన్నీ కూడా మనం మాట్లాడుకుందాం. కానీ మీరు ప్రజాస్వామ్యానికి మూల స్థంభాలను దెబ్బ తీస్తున్నారు. అధ్యక్షా, ఈనాడు 60సంవత్సరాల క్రితం మనం ఒక్కసారి వెనుకకు వెళ్లి చూస్తే, కొన్ని వేల సంవత్సరాలు ఒక్కటి కాదు రెండు కాదు అనేక విధాలైనటువంటి బాధలు పడ్డారు. ఎవరండీ ప్రజాస్వామ్యం దెబ్బతింటే బాధపడేది, ఎవరండీ సర్వవిధాలా తమ హక్కులు కోల్పోయేది? కేవలం బలహీన వర్గాలు. బలహీన వర్గాలు తమ వాణిని కూడా వినిపించే అవకాశం లేదు. ఈ 60సంవత్సరాల ప్రజాస్వామ్య దేశంలో వాళ్లకన్నీ జరిగి పోయాయని నేను అనను. కానీ, ఎన్నికలప్పుడు ఎవరో ఇలాంటి పెద్ద మనుషులు వచ్చి వాళ్లకు దండం పెడుతున్నారు, అయ్యా మాకొక్కసారి ఓటు వేయడండని వాళ్లను అడుగుతున్నారు. అయ్యా మీకు బియ్యమిస్తామంటున్నారు, అయ్యా మీకు ఇళ్లు కట్టిస్తామంటున్నారు. కనీసం మనుషులనే వారు వున్నారనేదేనే ఈ ప్రజాస్వామ్యం అనే విషయాన్ని గుర్తు చేస్తున్నది. అంతకు ముందు పరిస్థితి ఏ విధంగా వుండేదో ఒక్కసారి ఆలోచన చేయండి ఇవాళ. కనుక డెమొక్రసీని ఎవరైనా సరే అన్ కాంప్రమైజ్‌గా ప్రొటెక్ట్ చేసుకోవాలి. అదర్‌వైజ్ డెమొక్రసీ ఎక్కడ షేకప్ అయినా అల్టిమేట్‌గా పేద వర్గాలు, నోరులేని వర్గాలు దెబ్బ తింటారు. అదే నా ఆందోళన. దానిపైన మేము అవిశ్వాస తీర్మానం పెట్టామని చెప్పదల్చుకున్నాను.

అధ్యక్షా! మీరొకసారి ఆలోచించండి politics mangement చాలాకాలం పనిచేయదు. మీరు తెలివిగా పని చేస్తున్నారు. ప్రభుత్వం ఈనాడు అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అనేకమంది వ్యక్తుల దగ్గరకు డిజిపిలు, ఆఫీసర్స్ వెడతారు. They take orders from the persons who are not Cabinet members at all. This is my

concern. This is why as a Cabinet మీరు ఫెయిల్ అయ్యారు. Who is accountable in the State? అకౌంటబిలిటీ లేని వ్యక్తులు ఎప్పుడైతే పవర్‌ను exercise చెయ్యడం మొదలు పెడతారో is it not failure of the Cabinet అని నేను అడుగుతున్నాను. That is what I am cautioning them. It is totally undemocratic way in which your Government is functioning. దానిమీదనే మేము ఈనాడు అవిశ్వాస తీర్మానం పెడుతున్నాము.

**పాదయాత్ర తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు చాలా చక్కగా పరిపాలన చేస్తారని మేమంతా ఆశించాము. కానీ ఇప్పుడు ఏం చేస్తున్నారు? ప్రభుత్వ తీరు ఎటు పోతోంది? వాళ్లు, వాళ్లకు సంబంధించిన మిత్రులు, కుటుంబ సభ్యులు మొత్తం వాళ్లే సర్వమై కూర్చున్నారు.** ఈనాడు రాష్ట్రంలో బయట వ్యక్తులు ఏ విధంగా అధికారాన్ని మిస్ యూజ్ చేస్తున్నారో, ఏవిధంగా వారు అన్ని రంగాలలో ఇంటర్ ఫియర్ అవుతున్నారో ఒక్కసారి మనం ఆలోచన చెయ్యాలి. Is it fair? ఒక ముఖ్యమంత్రి చెయ్యవలసిన పనేనా ఇది? straightaway asking them. ఈనాడు మానేజ్‌మెంట్ ఉండవచ్చు. అవినీతి వల్ల విచ్చలవిడిగా డబ్బు వచ్చింది. దానితో ఎవరినైనా మానేజ్ చేసుకోవచ్చు. ఢిల్లీకి వెళ్లైనా సరే మానేజ్ చేసుకోవచ్చు. ఇదివరలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్న నాయకులు స్టేట్‌లను కంట్రోల్ చేసేవారు. ఒకవేళ డెమొక్రటిక్ లేదా అన్ డెమొక్రటిక్ గా ఉంటే సరిచేసేవారు. That is a different matter for discussion. But ultimately they used to have some interference. కానీ ఈనాడు ఇక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందంటే ఈనాడు ఇక్కడ వాళ్లకు వ్యతిరేకంగా పిజెఆర్ లాంటి వాళ్లు గొంతు ఎండి పోయేటట్లుగా మాకు వచ్చే నీళ్లు పోతున్నాయి, మాకు రావలసిన భూములు పోతున్నాయి, ఇది అన్యాయం అని చెబుతూ ఉంటే వాళ్ల లాంటి వాళ్లని కంట్రోల్ చెయ్యడానికి ఈనాడు ఈ అధిష్ఠానం కేంద్రాన్ని వాడుకొంటోంది. ఆ విధంగా internal and external democracy ని మీరు దెబ్బ తీస్తున్నారు. అందుకే మీ మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాము.

This is most important point. అవినీతి, అక్రమాలు ఇవాళ పూర్తిగా ఉన్నాయి. మొత్తం డెమొక్రసీని ఏవిధంగా కాలరాస్తున్నారో దానికి జవాబు చెప్పాలని కోరుతున్నాను. This kind of management things will not work.

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏవిధంగా ఉండేది అధ్యక్షా? కాంగ్రెస్ పూర్తిగా చచ్చి, మళ్లా తిరిగి అధికారంలోకి వస్తుందని ఎవరూ అనుకోలేదు. సరే రాజశేఖర్‌గారు పాదయాత్ర చేశారు. ప్రజలకు అనేక వాగ్దానాలు చేశారు.

నా పాదయాత్ర గురించి కూడా చెబుతాను. అన్నింటికంటే ప్రధానంగా ఆనాడు ఉన్నటువంటి మిత్రపక్షాలు సిపిఐ, సిపిఎం, టిఆర్ఎస్ పార్టీలు మూడూ మీతో కలిశాయి. ఆ విషయం మీరు మర్చిపోవద్దు. మేము కూడా వాళ్ల సహకారం తీసుకున్నాము. మేము వాళ్లకు సహకరించాము. సిద్ధాంతపరంగా వచ్చిన విభేదాల వల్ల 1999లో వాళ్లు మాతో లేరు. ఆవిధంగా

మాతో విభేదించిన వామపక్షాలు మీ క్రెడిబిలిటీని పెంచాయి. కానీ అధికారంలోకి వచ్చాక మీరేమి చేశారు? ఇప్పుడు మీ వెంట సిపిఎం లేదు, సిపిఐ లేదు. టిఆర్ఎస్‌ను ఫుట్‌బాల్ ఆడినట్లు ఆడుకుంటున్నారు. నమ్మి విశ్వాసముంచి వీళ్లను గెలిపిస్తే తెలంగాణాను సర్వనాశం చేసినటువంటి ఈ వ్యక్తుల యొక్క పద్ధతులు హాస్యాస్పదంగా ఉన్నాయి. Politics of management. అక్కడ ఉన్నదానిని విడగొట్టడం, తనని గొప్పగా చెప్పుకోవడం This is how dictators will always function in the State. చరిత్రలో జరిగిందే అది. తనే కరక్ట్‌గా చేస్తున్నాను అని అనిపించుకోవడం వాళ్లకే చెల్లింది. నా మిత్రులు ఒకరు యూనివర్సిటీ నుండి వచ్చి హిట్లర్ పుట్టి వంద సంవత్సరాలు పూర్తయింది I don't know what is the co-relation between these two. Powerful personalities- అతను చేసిన ప్రచారం ఏ విధంగా ఉండేదంటే జర్మన్స్ అల్టిమేట్‌గా ఓడిపోయామని అంగీకరించడానికి కూడా సిద్ధంగా లేరు. హిట్లర్ ఏ పరిస్థితికి వెళ్లి పోయారంటే మీరు ఓడిపోయారండీ, ప్రజలకు మెల్లగా తెలుస్తోంది, మీకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి అంటే You change the people అన్నారు. That is how the dictator will function. పవర్ విపరీతంగా పెరిగిన తరువాత అల్టిమేట్‌గా జరిగేది అదే. ఈ విధమైన మేనేజ్‌మెంట్ పాలిటిక్స్ నడవవు. మీరు నలుగురితో పొగిడించుకోవచ్చు. పార్టీలను విడగొట్టవచ్చు. లేదా పార్టీలను విడగొట్టి ఓటుబ్యాంకు రాజకీయాలు చెయ్యవచ్చు. ఆ విషయం వారికి బాగా తెలుసు. వ్యవస్థలో ఉన్న బలహీనతలను అనుకూలంగా మార్చుకొనే ప్రయత్నం చెయ్యవచ్చు. But ultimately it is not going to help you. Ultimately you are the losers. This is the history. You must know. It is only a matter of time అని మీరు గుర్తు పెట్టుకోవాలి. 1978, 1989లో కూడా చెన్నారెడ్డిగారు వచ్చినప్పుడు ఇదే విధంగా అన్ని పార్టీలను కలిపేసుకున్నారు. అల్టిమేట్‌గా ఏమయింది. ఎన్‌టిఆర్‌గారి ప్రభంజనంలో కొట్టుకుపోయారు. వెయ్యి కళేబరాలు తిన్న రాబందు ఒకే ఒక్క సుడిగుండంలో కొట్టుకు పోయినట్లుగా రామారావుగారి ప్రభంజనంలో అడ్రస్ లేకుండా కొట్టుకుపోయారు. ఒక్కొక్క సారి మీ మేనేజ్‌మెంట్ గేమ్స్ కుదరవు. It is not a number game. Who gave power? మనం ఆపవర్‌ను ఏవిధంగా ఉపయోగించుకోవాలి? తనకు, తన వర్గానికి మాత్రమే పవర్‌ను ఉపయోగించుకునే వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండడానికి అర్హుడా? అధ్యక్షా, ఈరోజు Misuse of power ఏ విధంగా జరుగుతోందో మీకు వివరంగా చెబుతాను. For example let us start with his own constituency. ఏ విధంగా జరిగింది? నాకు సమయం తక్కువ ఉంది కాబట్టి నేను లోతుగా వెళ్లదల్చుకోలేదు. ఒక ప్రాంతంపైన అభిమానానికి హద్దులు ఉండాలి. మీరు రైల్వే స్టేషన్లు పెట్టుకుంటారా? ట్రిపుల్ ఐటీలు పెట్టుకుంటారా? మీ స్నేహితులు ఉన్నచోట నూజివీడులో ఆయనకొక ట్రిపుల్ఐటీ, ఈయనకొక ట్రిపుల్ఐటీనా? ఈ విధంగా వెయ్యి, వెయ్యి కోట్ల రూపాయలతో వాటిని పెట్టుకుంటున్నారు. మీ ట్రాన్స్‌పోర్టు ప్లానింగ్ గురించి రు. 25 కోట్లు ఇస్తారా? ఆష్టరాల్ 50వేల మంది జనాభా కలిగివున్న పులివెందుల మునిసిపాలిటీ కోసం రింగురోడ్డు వేస్తారా? గోల్ఫ్‌కోర్టులు పెట్టుకుంటారా? ఎవరిచ్చారండీ మీకీ అధికారం? మిగతా నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని ఎన్నుకోలేదా? దాదాపు ఏడు, ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఈ రాష్ట్ర

ఖజానా నుండి తీసుకుపోయి.. Is there any separate planning for him? రోశయ్యగారు లేరిక్కడ. నేను అయనను ఒక వ్యక్తి కోసం సెపరేటు విధానాలు, సెపరేటు బడ్జెటును ఏమైనా తీసుకువచ్చారా అని అడగదల్చుకొన్నాను. Is it not unconstitutional? Is it proper? వీటికి సమాధానం ముఖ్యమంత్రిగారు చెప్పవలసిందిగా కోరుతున్నాను. ఎనిమిది కోట్ల మంది ఇప్పటికీ ఫ్లోరిన్ కలిసిన నీళ్లు త్రాగుతున్నారు. త్రాగునీరు ఇస్తామని చెప్పారుగానీ ఇంతవరకు ఇవ్వలేదు. మా జిల్లా లోపల నేను ఇవాళ చెబుతున్నాను. ఒక్క దగ్గర రోడ్లు లేక దెబ్బతిని మట్టిపోసే దిక్కులేక బస్సులు బందు అయినాయి. పులివెందులకు అయితే 6 లైన్లు రోడ్లు కావాలి, పులివెందుల టు కడపకు 8 లైన్లు రోడ్లు కావాలి, రింగ్ రోడ్డు కావాలి, డ్రైనేజ్ కావాలి, హైమాస్ట్ లైట్లు కావాలి. మీ నియోజకవర్గ ప్రజానీకానికి మా మీద పెత్తనం చెలాయించేటటువంటి అధికారం ఎవరు ఇచ్చారు. వాళ్లకి ఏ విధమైన స్పెషల్ గ్రాంట్ ఇవ్వడానికి ఏ అధికారం ఏవిధంగా ఇచ్చినారు.

అధ్యక్షా! నేను ఒక ఎగ్జాంపుల్ చెప్పాను, డిబేట్ ఎప్పుడు కూడా కరెక్టుగా ఉండాలి. ఒక సైడ్ వాదన కూడా పోకూడదు. రెండు వైపుల నుంచి పోవాలనే ఉద్దేశ్యంతో వాళ్లు ఎవరు లేచినా కూర్చుంటున్నాను ఇక్కడ. Let the people also know. అల్టిమేట్‌గా నీవు, మేము ఇక్కడ కొట్లాడుకొని ఇది ఏమన్నా మల్ల యుద్ధమా, కుస్తీలు చేసేటటు వంటిది ఒక పహిల్వాన్ లాగా కొట్టుకొనేదా, నీవు క్రింద పడుతున్నావు, నేను క్రింద పడుతున్నాను అనడానికి అల్టిమేట్‌గా ఇక్కడ జరిగే డిబేటు బయట ఉన్నటువంటి న్యాయ నిర్ణేతలు వాళ్లండి వాళ్లు నిర్ణయించుకుంటారు. నేను వాళ్లను దృష్టిలో పెట్టుకొని చెబుతున్నాను. Let it be a good debate. హైద్రాబాదు డెవలప్ చేస్తున్నామని చెప్పి ఎన్నో ప్రాజెక్టులకు మీరు అప్పులు తీసుకొని వస్తున్నారు. మీరు రైల్వేలు తీసుకోండి. Let the CM also react. మా రింగ్ రోడ్డు వున్నది మీరు తీసుకొని వస్తున్నారు, జెబిఐసి తీసుకొని వచ్చారు. 12 వేల కోట్లరూపాయలు మా జిల్లాలో ఆస్థులు అన్నీ అమ్మవచ్చు. ఈయొక్క అప్పులు ఎందుకు తీసుకురావాలండీ, కడప జిల్లాలో ఏమి ఒక్క రూపాయి అప్పులేకుండా చేసుకుంటారు. మీరు మొత్తం తీసుకొని పోయి యూనివర్సిటీలు పెట్టుకోవడం, రోడ్లు వేసుకోవడం ఆ విషయాన్నే నేను చెబుతున్నాను. Let the Government publish. కాన్స్టిట్యూషనల్‌గా ఏ విధంగా ఎంత ఖర్చు పెట్టారు ఆ విధంగా పబ్లిష్ చేయమని చెప్పండి. దానిపైన కూడా మనం మొత్తం ఆలోచన చేద్దాము. Is it not mis-use of power? I am straight-away questioning that. మీకు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని మీరు పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నారు. అందుకే మీ మీద నో కాన్ఫిడెన్సు మోషన్ పెట్టామని చెప్పి మీకు తెలియచేస్తున్నాను. ఒక వ్యక్తి ఒక ప్రాంతానికి, ఒక వర్గానికి, పనిచేసే ప్రభుత్వం అని మీ మీద నో కాన్ఫిడెన్సు మోషన్ మూవ్ చేశాము. ఈ రోజు మనకు వున్నటువంటి సంపద ఏమంటే **తరతరాలుగా మనకు వస్తున్నటువంటి సంపదలలో భూమి, నీరు ఇవి ప్రధానమైనవి. జనరేషన్సు వస్తాయి, పోతావుంటాయి కాని ఈ యొక్క నీరు, భూమి చాలా కీలకమైన అంశాలు. నీటి కోసం**

**యుద్ధాలు వస్తాయని వీర బ్రహ్మంగారు చెప్పారు. ఇప్పుడే స్టార్టు అవుతున్నాయి** ఆ విధంగా నీటి కోసం చాలా సమస్యలు వస్తాయి because it is a natural resource. దానికి లిమిటేషన్సు ఉన్నాయి ఆ విధమైన రిసోర్సెస్ మనం వాడేటప్పుడు ఎంత కేర్‌ఫుల్‌గా వుండాలి. ఈ దేశంలో ఇవాళ రాజశేఖరరెడ్డిగారే ముఖ్యమంత్రిగారా, ఈయన ఒక్కరే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారా? ఇంతకుముందు వున్న ప్రభుత్వాలు లేవా? అంతకు ముందు వున్న ప్రభుత్వాలకు తెలివితేటలు లేవా? వాళ్లకి సిస్టమ్స్ తెలియవా? ఈయొక్క రాష్ట్రం లోపల is he the only one individual? ఒక్కరే ఒక్కరా పని చేసేది. There are so many systems. నీటి వినియోగం ఎట్లా ఉండాలనే దానిపై ప్రపంచ వ్యాప్తంగా అనేక మోడల్సు ఉన్నాయి. వాళ్లు స్పష్టంగా చెబుతూ వుంటారు. ఇంటర్‌స్టేట్ ప్రాబ్లమ్స్ ఎట్లా సాల్వు చేసుకోవాలి, ఇంటర్‌నేషనల్ కంట్రీస్ ప్రాబ్లమ్స్ ఎట్లా సాల్వు చేసుకోవాలి. అట్లాగే మ్యాగ్జిమమ్ యుటిలైజేషన్ తీసుకోవాలి, హక్కులేంటివి, హక్కుదార్లు ఎవరు ఈ విషయాలు అన్ని కూడా చాలా స్పష్టంగా there are established systems. ఎక్కడైనా డిస్‌ప్యూట్సు వస్తే అవార్డ్సు ఉన్నాయి. అవార్డ్సు ఇచ్చినటువంటి తీర్పులు అవి పాటించడం మీ ధర్మం కాదా ఒక కాన్‌స్టిట్యూషనల్ ఇన్‌స్ట్యూషన్నును గౌరవించి దానిని ఫాలో చేయాలి. చేయకుండా, ఈ రోజు డైరక్టుగా నేను అడుగుతున్నాను. ఇవాళ ఏమి చేశారు. కృష్ణాలో వున్న మన యాలోకేటెడ్ వాటర్ 800 టిఎంసిలు ఇంచుమించు ప్రాజెక్టులు అన్నిటికి కట్టుకున్నాము. మనకు వున్న 800 టిఎంసిలు కాక సెల్ఫ్ రిచార్జీ క్రింద ఇంకొక 11 టిఎంసిలు, మొత్తం 811 టిఎంసిలు వస్తావుంటాయి. దానికి ఇవాళ ఏమి చేశారు. అల్రెడి కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయబడింది. ఆ ట్రిబ్యునల్ అక్కడ వుండనే వున్నది. ఏ ట్రిబ్యునల్‌కు సంబంధం లేకుండా ఎలాంటి అవార్డ్సుకి సంబంధం లేకుండా ఒక బేసిన్ నుంచి రెండవ బేసిన్‌కు మార్చడానికి వీలు లేదండి. నాకు చెప్పండి ఏ పుస్తకంలో చూపిస్తారో, చూపించండి. Unless and until you fulfil the entire 60-70% in the first basin, రెండవ బేసిన్‌లోకి తీసుకుపోవడానికి వీలులేదు. మీరు కృష్ణా బేసిన్ నుంచి తీసుకొని పోయి పెన్నా బేసిన్‌లోకి తీసుకొని వెళ్తారా? మీరు మొత్తం తీసుకొని వచ్చి పోతిరెడ్డిపాడు తీసుకొనివచ్చి 44వేల క్యూసెక్కులు వాటర్ మరల్చుకొని పోతావుంటే క్రింద వున్న జిల్లాల్లో ఏమి కావాలి? 5 జిల్లాలో ఎస్టాబ్లిష్ అయి వున్న ఆయకట్టు ప్రజానీకం ఏమి కావాలి, ఎక్కడికి పోవాలి ఇది మీకు నిజంగా ఎవరు ఇచ్చినారు పవర్. Are you not misusing that power? ఆ విధంగా మీరు ఇచ్చిన ట్రిబ్యునల్ లేదా? అవార్డ్సు లేవా, అగ్రిమెంటు లేదా, మీరు సొంతంగా రాజశేఖరరెడ్డిగారికి వచ్చినటువంటి ఏకైక ఆలోచనతో పులివెందులలో ప్రతి ఎకరానికి నీరు ఇస్తామని హామీని నెరవేర్చుకోవడానికి రాష్ట్ర ప్రజలను మొత్తం ప్రక్కన పెట్టేసి వాళ్ల ఇంటరెస్టులు అన్నీ ప్రక్కన పెట్టివేసి అందుకే you have no moral right to continue as Chief Minister. భవిష్యత్తు తరాలకు అన్యాయం చేసి, తరతరాలకు అన్యాయం చేసి నీటీ వనరులను అలాంటి ప్రధానమైన అంశాన్ని మీరు మీ సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. కనుకనే ఈ రోజు అవిశ్వాస తీర్మానం పెట్టినారు. ఫ్లోరోసిస్‌తో బాధపడతున్న నల్గొండ జిల్లా వాళ్ల మీద జాలి ఎక్కడా కనిపించదా?

సర్, మా దురదృష్టమో, లేక ప్రజలకు కొన్ని వాస్తవాలు చెబుతూ వుంటే వినడానికి అవకాశాలు లేకపోవడమో కాని, నేను మాట్లాడుతూ వుంటే 20 నిమిషాలు మాట్లాడితే 2 గంటలు ఇంటరప్షన్స్. నేను చెప్పవలసిన విషయాలు చాలా వున్నాయి, ప్రభుత్వం చేస్తున్న విన్యాసాలు చాలా వున్నాయి. ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రిగారు, ఇరిగేషన్ మంత్రిగారూ మాట్లాడుతూ, (అంతరాయం) సర్, ముఖ్యమంత్రి గారు ఇంతకు ముందు ఏమి మాట్లాడారో, ఇరిగేషన్ మంత్రి గారు ఏమి మాట్లాడారో, ఇక్కడున్న వారికందరికీ తెలుసు, ఇక్కడున్న వారెవరూ చిన్న పిల్లలు కాదు. బయట వున్న ప్రజానీకం చూస్తున్నారు. నేను ఒక్క విషయం అడగ దలచుకున్నాను. మొత్తం కృష్ణా డెల్టా అంతా 35 లక్షల ఎకరాలు వుంది. నాగార్జున సాగర్‌కు (అంతరాయం) ఇట్లా అయితే మీ ఇష్టం సర్. ఈ విధంగా ఒక స్పీకర్‌కు 5 నిమిషాలు మాట్లాడగానే 20 మంది అడ్డం పడితే ఎట్లా? మాకు కూడా ఫ్లో ఆఫ్ థాట్స్ వుంటాయి కదా. ముఖ్యమంత్రి గారిని నేను ఒకటే అడుగుతున్నాను. దుమ్ముగూడెం టెయిల్ పాండ్ యొక్క టెండర్లను పిలుస్తున్నారు. గోదావరి నీటిని తీసుకువస్తున్నారు. మీకు నమస్కారం. ఇప్పటికి 20 సార్లు లేచి 20 సార్లు కూర్చున్నాను. నాకు ఒక ఆలోచన వుంది, దానిని మీ ముందర పెట్టదలచుకున్నాను. వారు మాట్లాడేటపుడు నేను డిస్టర్బ్ చేయలేదు. అన్నీ వ్రాసుకున్నాను. నాకు చాతనైంది మాట్లాడతానని చెప్పాను. ఇప్పుడు ఇట్లా 10 నిమిషాలకొకసారి ఇట్లా అడ్డు తగులుతూ వుంటే ఎట్లా?

అధ్యక్షా! ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు ఉన్నారు. రాష్ట్ర ప్రజలు చూస్తున్నారు. నేను ముఖ్యమంత్రిగారిని తమ ద్వారా అడిగేదేమంటే ఈ ప్రశ్నకు సూటిగా వారిని సమాధానం తమ ద్వారా చెప్పమంటున్నాను. ఏదైనా, ఒక ప్రాజెక్ట్ మనం అనుకున్నప్పుడు, చాలా తీవ్రంగా వర్కౌట్ చేస్తాము. ఆయకట్టు సర్వే నంబర్‌తోసహా చెబుతారు. ఈ ఆయకట్టుకు నీరు ఇస్తున్నాము కాబట్టి ఈ ప్రాజెక్ట్ అవసరం  ఉంది కాబట్టి ఈ ప్రాజెక్ట్‌కి ఎంత అవుతుందని టోటల్ రిపోర్ట్ అంతా అందులో ఉంటాయి. ఈ రోజు గోదావరి మీద దుమ్ముగూడెం నుండి టైల్ ఎండ్‌లో గోదావరి వాటర్ తీసుకువెళతామని అనుకుంటున్నారు. ఆ నీరు ఎక్కడికి తీసుకువెళతారు. అది నాగార్జున సాగర్‌లో పోస్తారు. అది వారి ప్లాన్. ఆ విధంగా నాగార్జునసాగర్‌లో పోసే 165 టియంసి నీరు కోసం ప్రాజెక్ట్ తయారుచేశారు. దాని ఆయకట్టు చెప్పమనండి. 18 లక్షల ఆయకట్టుకు సరిపోయే నీరు వస్తుంది. ఏ ఆయకట్టుకు తీసుకువెళ్లి నీరు ఇస్తారు. క్లియర్‌కట్‌గా ముఖ్యమంత్రిగారు ఇంతకుముందు చెప్పినట్లు, కాన్స్‌ట్యూషనల్‌గా ఎన్నుకోబడిన ప్రభుత్వం, there are other Constitutional bodies. ఇతర అనేక రకాల ఎక్స్‌పర్ట్స్ ఉన్నారు. అన్నీ ఉన్నాయి. వారు వాటిని పట్టించుకోవడం లేదు. ఈ రోజు దుమ్ముగూడెం నుండి పోలవరం నుండి గోదారి నీరు డైవర్షన్ చేసిన తరువాత రేపు అవార్డ్సులో ఎంత డైవర్షన్ వస్తుందో ఆ నీరు ఏమవుతుందనేది నేను చెప్పదలచుకోలేదు. అది అవసరం. ఆ విధంగా ఆయకట్టు ఎక్కడ ఉంది. ఖచ్చితంగా కృష్ణాడెల్టాలో ఉన్న నీరు, క్రింద ఉన్న నాగార్జునసారగ్ ఆయకట్టుకి తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ అష్యూర్ట్ వాటర్ డైవర్ట్ చేయకుండా ఉంటే, పోతిరెడ్డిపాడు నుండి తీసుకోకుండా

ఉంటే, ఈ దుమ్ముగూడెం నుండి నీరు ఎందుకు? ఏదైనా, గుంతలో పోయాలి. అష్యూర్డ్ ఆయకట్టు కోసం తీసుకువెళుతున్న నీరు రేపు అష్యూర్ట్ ఆయకట్టుకి కృష్ణా నీరు రాదు. వారు తీసుకువెళు తున్న నీరు మూలంగా స్పష్టంగా అర్ధమవుతుంది. అదే విధంగా, 7 లిఫ్ట్ తీసుకెళ్లి టైల్ ఎండ్‌లో పోస్తున్నారు. ఇది గ్రావిటి మీద 150 సంవత్సరాలుగా చేస్తున్నారు. సాగర్ వచ్చిన తరువాత నల్గొండ, ఖమ్మం జిల్లాలో గ్రావిటి ద్వారా నీరు పోతున్నాయి. గ్రావిటిని పక్కన పెట్టి లిఫ్ట్ తీసుకు పోయి 7లిఫ్టుల ద్వారా పోయాలని వారి ప్లాన్. ఇక్కడున్న ప్రజలు, తెలంగాణా వారు ఏమి పాపం చేశారు? అక్కడున్న గోదావరి పైన ఉన్న నీరు 7 లిఫ్టల ద్వారా పెడితే తెలంగాణా ప్రాంతంలో అందరికి నీరు వస్తుంది. ఎందుకు పెట్టరు? మేము సర్‌ప్లస్ వాటర్ తీసుకువెళు తున్నాము. అష్యూర్డ్ వాటర్ తీసుకువెళ్ళమని అంటున్నారుకదా? అష్యూర్డ్ వాటర్ మీద రెండవ అనుమానం లేదు. మమ్ములను పిచ్చివారిగా చేసి నలుగురు మేనేజ్‌మెంట్ పాలిటిక్స్ మాట్లాడారు. ఖచ్చితంగా ఇది అష్యూర్డ్ వాటర్ తీసుకు వెళతారు. దాని లెవెల్స్, వారికి కావలసిన అరేంజ్‌మెంట్స్, అవి కూడా పర్‌ఫెక్ట్‌గా తీసుకుంటున్నారు. ఈరోజు వచ్చే వాటర్‌కి ఒకవైపు ఈ ప్రాజెక్టులకి సంబంధించి చూస్తే, 1990నాడు ఫ్లడ్ వాటర్ అంటున్నారు. కల్వకుర్తికి సంబంధించి జనార్ధనరెడ్డిగారు అడిగినట్లు అది కూడా ఫ్లడ్ వాటరే. అది కూడా ఫ్లడ్ వాటర్ ఎలా కంట్రోల్ చేస్తారు? పోతిరెడ్డిపాడు కూడా ఫ్లడ్ అంటున్నారు. ఎలా రెగ్యులేట్ చేస్తారు. ఫ్లడ్ వాటర్‌కి అష్యూర్డ్ వాటర్‌కి ఎలా డిస్టింగ్విష్ చేసి సర్‌ప్లస్ వాటర్ రెండూ కలిపి ఎలా తయారుచేస్తారు? దానికి ఉన్న టెక్నికల్ సిస్టం ఏమిటి? ఖచ్చితంగా దీని నీరు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. కాన్స్టిట్యూషనల్ అథారిటీని మొత్తం వీరు, వీరి సొంత అజెండా కోసం ముఖ్యమంత్రి అయ్యారు తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాలేదు. ఇది కూడా వీరి అజెండాలో ప్రధానమయిన భాగం. అందుకే మేము ఈ రోజు అవిశ్వాస తీర్మానం పెడతున్నాము. పోతిరెడ్డిపాడు ఆ విధంగా చేస్తున్నారు. ఇక్కడ గోదావరి పైన జరుగుతున్న పరిస్థితి దారుణమయిన పరిస్థితి. తెలంగాణాలో బ్రహ్మాండంగా చేశామని చెబుతున్నారు. ప్రాణహిత, చేవెళ్లకి సంబంధించి పాదయాత్ర అన్నారు. అధ్యక్షా, వారు అధికారం కోసం ఆనాడు పాదయాత్ర చేశారు. నేను మా ప్రభుత్వం అధికారం నుండి పోయిన తరువాత ఒక సంవత్సరం తరువాత చేశాము. ఆ రోజు ఎందుకు చేశానంటే, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక పాలసీ డాక్యుమెంట్ రిలీజ్ చేశారు. మొత్తం అన్నింటికన్నా ప్రధానమయిన అంశం జలాలకోసం జలయజ్ఞం చేయబోతున్నామన్నారు. బడ్జెట్‌లో సగం జలయజ్ఞంకి తీసుకోబోతున్నామన్నారు. కాబట్టి ఎన్ని వేల కోట్లు అయినా, అప్పులు తెస్తాము, ఖర్చు పెడతామన్నారు. అలాంటప్పుడు నాకు ఆశ ఎందుకు పుట్టదు? మా ప్రాజెక్ట్‌కి కావాలి. ఏమి ప్రాజెక్ట్ అది? ఈ రోజు తెలంగాణా పరిస్థితి ఏమిటి? ఎస్‌ఆర్‌ఎస్‌పి ఉంది. బాబ్లీ కడుతూ ఉంటే అప్పుడు మాట్లాడరు. మేము ఉద్యమం చేశాము. అప్పుడు వారి ప్రభుత్వం కేంద్రంలో ఉంది, మహారాష్ట్రలో ఉంది. బాబ్లీ ప్రాజెక్ట్ తయారయింది. నేను ఎన్ని అయినా చేసి ఉండవచ్చు. పెద్దగా రాత్రంతా చదివి పరీక్ష వ్రాయవచ్చు. కానీ పరీక్షలో ఫెయిల్ అయితే ఇక చదువు ఎందుకు? అందరిని బాబ్లీకి తీసుకువచ్చాను. ఇప్పటికే నీరు తక్కువగా ఉంది. ఎస్‌ఆర్‌ఎస్‌పిలో

నీరు తక్కువగా ఉంది. ఎప్పుడు బాబ్లీ సక్సెస్ అయిందో, మరొక 12 ప్రాజెక్టులు వారు వ్రాసి తీసుకుంటున్నారు. ఎస్ఆర్ఎస్‌పి ఉంటుందా? ఇక వరద కాలువ పరిస్థితి ఏమిటి? క్రింద ఉన్న ఎల్లంపల్లి ఏమిటి? ప్రతి రోజూ ఎలా జరుగుతుందో చూస్తున్నారు. **ఉన్నది ప్రాణహిత, దానిని త్వరగా చేయాలని పాదయాత్ర చేసాను. నేను పొరపాటు చేసానా? నాలుగు ఏళ్ల క్రితం చేసేది ఉంటే అప్పుడే చేస్తాను. నేను అధికారం కోసం చేసానా?** చేసేది ఉంటే అప్పుడే చేస్తాను. అధికారం కావాలి, ఇంకా ఆరు నెలలు ఉంది, నాకు ఓట్లు వేయండి, నేను గెలుస్తాను, నా జీవిత ఆశయం నెరవేరడం లేదు. అలా చెప్పి ఆ విధంగా చేయలేదు. ఈ ప్రాంతం తరతరాలుగా వెనకబడిన ప్రాంతం, వలసలు పోయి ఇబ్బంది పడుతున్న ప్రాంతం. బాగుపడాలనే చేసాను.

(అంతరాయం)

నేను ఎట్టి పరిస్థితిలోనూ కూర్చోను. తమరు కూర్చోమంటే నేను ఇక వెళ్లిపోతాను. అధ్యక్షా, ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతూ ఉంటే, నా ఓపికకు కూడా లిమిటేషన్ ఉంది. వారు మాట్లాడాలంటే వారు జవాబు చెప్పేటప్పుడు చెప్పమనండి. As a Government you have every right to reply. కాబట్టి ఈనాడు అక్కడ పాదయాత్ర కార్యక్రమం చేపట్టాము. జలయజ్ఞం పేరుతో వీరు చేస్తున్న కార్యక్రమాలు ఏ విధంగా ఉన్నాయో చూడండి. వారు మొదట్లో చేశారు. ఇదే శాసనసభలో ఇదే మైక్‌లో నిలబడి మూడున్నర సంవత్సరాల క్రితం బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడాను. ఒక్కసారి రికార్డ్స్ పరిశీలించండి. ఆరోజు నేను ఏమి చెప్పానో అవన్నీ కూడా నూటికి నూరుపాళ్లు కరెక్ట్ అవుతున్నాయి. అప్పుడే చెప్పాం, మీకు సమగ్ర ప్రణాళిక లేదు, మీరు ఒక పద్ధతి ప్రకారం పోవడం లేదు, పైసలన్నీ తీసుకెళ్లి పోస్తున్నారు, ఏటిలో పోసినట్లవుతోందని చెప్పాం. నీళ్లు సరిగ్గా వచ్చే కొన్ని ప్రాజెక్టులను తీసుకొండి. వాటిని కంప్లీట్ చేయండి. ఈరోజు ఏమైంది అధ్యక్షా. నాలుగేళ్ల పూర్తి అయింది. పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చుకున్నారే, రెండేళ్లలో ఇన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు కదా, ఐదు సంవత్సరాలలో మొత్తం 18 ప్రాజెక్టులు, 8 ప్రాజెక్టులు రెండేళ్లలో చేస్తామని చెప్పారు. కదా, టెండర్స్‌ను ఆవిధంగా రింగ్ చేసుకోవడానికి మీరు అవకాశం ఇచ్చారు. ఇది పబ్లిక్ మనీ అధ్యక్షా, పబ్లిక్ మనీని ఖర్చు చేసేటపుడు మీ పార్టీ గానీ, మీ యంత్రాంగాన్ని కానీ stregthen చేసి, సార్, ఒక చిన్న విషయం చెబుతాను. మనం ఇళ్లు కట్టుకుంటాం, ప్లానింగ్ ఉండదా? నాకు రాత్రి పూట ఆలోచన వచ్చింది, పొద్దున లేచి నేను ఇళ్లు కట్టుకుంటాను, నా దగ్గర పైసలు వున్నాయి, ఎవరికో ఒకరికి కట్టడానికి ఇస్తాను అని అంటామా? ఆ ఇంటికి ఎంత అవుతుంది, ఎలా అవుతుందని, ఏమి చేయాలో ఆలోచించమా?

సార్, ఎట్టి పరిస్థితుల్లో నేను కూర్చోను. I allready told, if you give mike to him, I will get out of this House. Democratic గా ఇక్కడ డిస్కషన్ వుండాలి. అందరూ వినాలని ఇంతకుముందు మిమ్ములను ఎలా చేశాను. అవిశ్వాస తీర్మానం అంటే నువ్వు దొంగవు, నువ్వు దొంగవు అనుకుంటూ, నీ సంగతి నా సంగతి కాదు, ఇంతకు ముందు నేను చెప్పినట్లుగా మల్లయుద్ధం కాదు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన విషయాన్ని నేను ఇక్కడ ప్రస్తావనకు

తీసుకొస్తున్నాను సార్. ఇప్పటికే నన్ను 20 సార్లు కూర్చుండబెట్టి లేపారు.

అధ్యక్షా! సురేష్ రెడ్డిగారు ఉంటే చెబుతామనుకున్నాను. గౌరవప్రదమైన స్థానంలో మీరు అక్కడ వున్నారు. పురాణగాథ ఒకటి వుంది. అదేమంటే, ధృతరాష్ట్రుడు తనకున్న పుత్ర వాత్సల్యాన్ని చంపుకోలేక, వాళ్లు ఎన్ని తప్పులు చేసినా, ప్రతిసారీ వెనకేసుకొచ్చేవాడు, ధర్మాన్ని కూడా చుట్టబెట్టి, అధర్మాన్ని కూడా ధర్మంగా చేసే ప్రయత్నం చేశాడు. అల్టిమేట్‌గా ఏమైంది? కౌరవులు మొత్తం చనిపోయారు. చివరికి ఆయనకు పుత్రశోకం తప్ప ఏమీ మిగలలేదు. వంశ నాశనం అయింది. ఆ విధంగా రేపు కాంగ్రెస్ పార్టీ కూడా రాష్ట్రంలో పూర్తిగా వంశనాశనం అవుతుంది. కంట్రోల్ చేసుకుని దారిలో పెట్టుకుంటే కనీసం మిగులుతారు, లేకుంటే మీరు చేసే పొరపాట్లకు రాష్ట్రంలో తుడిచిపెట్టుకపోతారు. ముఖ్యమంత్రిగారు ఒక మాట అన్నారు. కాగ్ రిపోర్టు సంగతి చెప్పారు.

సార్, మీరు లేనపుడు ధృతరాష్ట్రుని సంగతి చెప్పాను. మళ్లీ చెబుతున్నాను. మహా భారతంలో ధృతరాష్ట్రుని పాత్ర ఒకటి ఉంది. ధృతరాష్ట్రుడు మహారాజు, చక్రవర్తి, అతని మాటకు తిరుగు చెప్పలేని పవర్స్ వున్న వ్యక్తి ఆయన. కానీ ఆయనకు తన కొడుకుల మీద వున్న ప్రేమ ఏదైతే వుందో అది it never allowed him, ఆయన తన డ్యూటీస్ డిస్చార్జ్ చేయడంలో చాలా అడ్డమైంది. ఆవిధంగా అల్టిమేట్‌గా తన వంశమే నాశనమై పోయింది. ఒక్క కొడుకు కూడా మిగల లేదు. ధర్మ యుద్ధంలో అందరూ పోయారు, ఎవ్వరూ మిగలలేదు. విదురుని వంటి మహానుభావుడు చెప్పినా కూడా వినకుండా, అల్టిమేట్‌గా సర్వ నాశనమైతే ఆయనకు పుత్ర శోకమే మిగిలింది. కనుక ఆవిధంగా వద్దు. ఏదైనా వుంటే మందలించండి, ఏదైనా వుంటే సరి జేసుకోమని చెప్పండి, వాళ్లు సరి చేసుకుంటారా ఇంకా ఒక ఏడాది వుంది, అంతిమంగా తెలుస్తుంది రేపు ఓటింగులో లేకుంటే పుత్ర శోకమే మిగులుతుంది, మీకు గానీ, మీ అధిష్టాన వర్గానికి గానీ కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో తుడిచి పెట్టుక పోయిన తర్వాత. అప్పుడు గానీ అయ్యో మేము పొరపాటు చేశామే, అయ్యో మేము కంట్రోల్ చేయలేక పోయామే, అయ్యో ఈ జూదం ఆగివుంటే బాగుండునే, అయ్యో మేము అడవుల పాలు కాకుంటే బాగుండునే, అయ్యో అధర్మం చేస్తిమే అని చిట్ట చివరకు పుత్ర శోకం మిగుల్చు కోవద్దని చెప్ప దలిచాం సార్. పెద్దలు ముఖ్యమంత్రిగారు ఆనాడు ఇక్కడ ( అపోజిషన్‌లో వున్నపుడు) వున్నపుడు కాగ్ గురించి మాట్లాడిన ఒక అంశాన్ని చెబుతాను.

Sir, I pray to God. ఆ పైన వున్న మహానుభావుడు ( సభలో ఉన్న మహాత్మాగాంధీ ఫోటో మరియు అక్కడ రాసి వున్న అక్షరాలను చూపిస్తూ) ‘ సత్యమేవ జయతే’ అని మీ నెత్తి పైన రాసి వున్నది, ఆయనే సాక్షి, పైన వున్న భగవంతుడు సాక్షి, నేను చెప్పిన విషయం రేపు నిజం కాకపోతే చూడండి, నేనేమో జ్యోతిష్యున్ని కాదు. అల్టిమేట్‌గా జరగబోయేది చెబుతున్నాను అంతే. అధ్యక్షా, ఈ ముఖ్యమంత్రిగారు ఆనాడు ఇక్కడ (అపోజిషన్‌లో) కూర్చుని ఏమి చెప్పారు, కాగ్ రిపోర్టు మాకు అడ్డంగా వచ్చిందని చెబుతూ, ‘చెప్పు తీసుకుని మిమ్ములను కొట్టింది కాగ్’

అని చెప్పారు ఆ పెద్ద మనిషి. దీన్ని అసెంబ్లీ రికార్డుల్లో చూపెట్టారు మావాళ్లు. అదే కాగ్ ఈనాడు ఆయనను తప్పు పడితే, ఏ ముందండీ, కాగ్‌లను మస్తుగా చూశాం, చాలా చెప్పారు, అదేమి కాగ్, అదేమి లోకాయుక్త అని మాట్లాడితే is it responsibility? ఒక రెస్పాన్సిబుల్ పొజిషన్‌లో వున్న మీరు మాట్లాడవలసిన పద్ధతేనా ఇది? మీరు చూశారా నిన్న రోశయ్యగారు ఏమి చెప్పారో. మా లీడర్‌కు సంబంధించిన విషయంపై ఒక అరగంట సేపులో ఇంటికి ఉరికి, నేను పోయి మొత్తం సొసైటీలో రికార్డులు సీజ్ చేసేశాను అని మీ ఎఫీషియన్సీ గొప్పగా చెప్పుకున్నారే, ఆ ఎఫీషియన్సీ ఏదో నిధుల దుర్వినియోగం అరికట్టడానికి ఉపయోగించడంటే బాగుండేది కదా. పట్టపగలే దోచుకు తింటున్నారని చాలా సార్లు నేను ఇదే సభలో చెప్పాను. ఏవిధంగా ఎక్సెస్ పేమెంట్స్ చేస్తున్నారు, ఏవిధంగా కాంట్రాక్టులలో దోచుకుంటున్నారు అనే విషయాన్ని ఫైనాన్స్ మినిష్టర్‌గారు ఎప్పుడైనా పరిశీలన చేశారా? ఈ కొంచెం కష్టం చేసి వుంటే మీకు వేల కోట్ల రూపాయలు మిగిలి వుండేవి కదా, ఆ ప్రయత్నం మాత్రం చేయరు. మేము ఎప్పుడైనా అడిగితే, నాకు సంబంధం లేదు, కాంట్రాక్టులు నాకు సంబంధం లేదు, కాంట్రాక్టులు తెలియదని, తనకు ఏమీ తెలియదన్నట్లుగా మాట్లాడతారు. మరి అపోనెంట్స్‌ను కంట్రోల్ చేయడానికి మాత్రం ఉరికిచ్చి ఉరికిచ్చి ఈవిధంగా బ్రహ్మాండంగా చేస్తున్నారే, అదే విధంగా మీ ఫైనాన్సెస్ కంట్రోల్ చేస్తే మీకు ఎంత డబ్బు మిగిలేది? ఎంతో మిస్ యూజ్ కాకుండా వుండేది కదా, మీకు డబ్బులు మిగిలేవి, మీరు ఆ దిశలో ఎప్పుడైనా ఆలోచన చేశారా?

కృష్ణా వాటర్ హైదరాబాద్ నగరానికి రావడానికి మేము ఆనాడు మూడు ఫేజులకు ప్రణాళిక వేసి, రెండు ఫేజులు పూర్తి చేశాం, వీళ్లు మూడో ఫేజు మాత్రం తీసుకురారు. చాలా ఖర్చుకు వస్తుంది అది. అలా కాకుండా గోదావరి నుంచి ఎల్లంపల్లి ద్వారా తెస్తామని చెబుతున్నారు. రూ.3.6 వేల కోట్లతో చేసే ఎల్లంపల్లి గురించి చెబుతున్నారు. అయితే మేమందరమూ ఇదేమిటయ్యా, ఎల్లంపల్లిలో ఎప్పుడో కొద్దిగా వాటర్ వుంటుంది, దాన్ని కూడా తీసుకుపోతమంటే ఎలా అని అడిగితే, మళ్లీ ఇప్పుడు ప్రాణహిత అంటున్నారు. రోజుకు ఒక విధంగా మాట్లాడుతున్నారు. ఆ ప్రాజెక్టు కోసం రెడీగా పెట్టుకున్నారు. టెండర్లు పిలవాలి, అడ్వాన్సులు తీసుకోవాలి, వాళ్లకు అడ్వాన్సులు ఇప్పించాలి, అందులోంచి కమీషన్లు కొట్టేయాలి. ఇదే పని అధ్యక్షా వాళ్లకు. అధ్యక్షా, గండుపిల్లి ఎలుక చుట్టూ తిరుగుతుంటుంది, అవతల ఏమున్నది, కుండ వున్నదా ఏమున్నదనే విషయం చూడదు, కుండ పగిలిపోయినా దానికి అనవసరం, ఎలుకను తినాలే, తన కడుపును నింపుకోవాలే. కమీషన్లు వస్తాయనుకుంటే ఏ కార్యక్రమమైనా చేయడానికి వెనుకాడని ప్రభుత్వం అధికారంలో వుంటే ఇక దీని మీద ఎలా విశ్వాసం వస్తుంది అధ్యక్షా? కనుకనే మేము అవిశ్వాస తీర్మానం పెట్టాం. ఆవిధంగా మీకు సమగ్రమైన జల విధానం లేదు. ఎక్కడ చూసినా మోసపూరితమైన ప్రకటనలు. ఎవరండి ఈ మెగా కృష్ణారెడ్డి? ఈయనకున్న అనుభవం ఏమిటి? వేల కోట్ల రూపాయల కాంట్రాక్ట్ ఒకరి పేరున ఉంటుంది, వేరే వాళ్లు పనులు చేస్తుంటారు. వీళ్లంటుంటారు, మేము మొత్తం శ్రీవైష్ణవులం, రొయ్యల బుట్ట ఎక్కడికి పోయిందో మాకు తెలియదనే విధంగా మాట్లాడుతుంటారు. మెయిన్ కాంట్రాక్టర్ ఒక దగ్గర

వుంటాడు, హైదరాబాదులో కూర్చుని ఆ పేపర్లు అమ్ముకుని పైసలు తింటున్నాడు. సబ్ కాంట్రాక్టర్, ఈవిధంగా కొన్ని వేల కోట్ల రూపాయలు ఒక్కొక్క డిఫరెన్షియేషన్‌లో కొట్టేసుకుంటూ అనుభవం లేని వ్యక్తులను తీసుకొచ్చి, వారి ముసుగులో వేల కోట్ల రూపాయలు ఎవరు కొట్టేస్తున్నారో జవాబులో చెప్పాలని కోరుతున్నాను. జవాబు చెప్పకపోయినా ఫర్వాలేదు, ఇలాంటి కమిషన్‌దార్లను, ఈవిధంగా దుర్మార్గంగా అవినీతి అక్రమాలను పోషిస్తున్న మీ ప్రభుత్వం మీద మేము అందుకే No confidence motion ఇచ్చాం, ఇలాంటి దళారీ వ్యవస్థను అంతమొందించడానికేనని చెబుతున్నాం.

అధ్యక్షా! ఇన్నాళ్లూ జలాల మీద పడ్డారు. ఈనాడు జలాలు పోయాయి. ఇప్పుడు మైనింగ్ మీద పడ్డారు. ముఖ్యమంత్రి గారు సభలో లేరు. ఫైనాన్స్ మినిస్టర్ గారు పెద్దలు, అనుభవజ్ఞులు ఇక్కడున్నారు. ఈ రోజున మన రాష్ట్రంలో ఓబులాపురం, చీమకుర్తి అట్లాగే విశాఖపట్నంలో బాక్సైట్ మైన్స్ గురించి మనం మాట్లాడుకుంటున్నాము. ఓబులాపురం మైన్స్ గురించి అందరికీ తెలుసు. Becasuse it is not a secret. ఈరోజున టన్ను ధర రెండున్నర వేల నుండి మూడు వేల వరకుంది. కచ్చితంగా దాని ధర ఎంతుందన్నది రసీదుల్లో వుంటుంది. Because they export it. కాని దానిపై ప్రభుత్వానికి సెస్ రూపంలో రూ.26 మాత్రమే వస్తుంది. ఎందుకంటే మీరు ఒక్కో దానికి ఒక్కో రకంగా ట్యాక్సులు వేస్తున్నారు. కాని వాళ్లు ప్రతి రోజూ అక్కడ మైనింగ్ జరిపి కొన్ని కోట్లరూపాయల ఆదాయం పొందుతున్నారు. మేము గతంలోనే లక్ష కోట్లరూపాయలని లెక్క వేసి చెప్పాము. అదేవిధంగా చీమకుర్తిలో రూ. 40, 44వేల కోట్లని చెప్పాము. దానిపైన మీకు అధికారం లేదా రోశయ్య గారూ? రాజ్యాంగం మనకు అధికారం ఇవ్వలేదా? వాళ్లేమైనా అక్కడ వాళ్ల డబ్బు ఖర్చుపెడుతూ డ్రిల్లింగ్ చేస్తున్నారా? ఆఫ్‌షోర్ కాని, ఆన్‌షోర్ కాని డ్రిల్లింగ్ చేయడం లేదు. కేవలం ప్రభుత్వం ఇచ్చిన ఒక కాగితం తీసుకు పోయి మైనింగ్ చేస్తూ రోజూ కొన్ని వందల లారీలు పట్టుకుపోయి అమ్ముకుంటే ఈ విషయంలో State is helpless. మన రాజ్యాంగ వ్యవస్థలో మనకున్న అధికారాలనుపయోగించుకొని మనం రాజభరణాలను రద్దు చేయలేదా? బ్యాంకులను జాతీయం చేయలేదా? Land Ceiling Act తీసుకురాలేదా? జాగీర్దారీ వ్యవస్థను అబాలిష్ చేయలేదా? వాళ్లకు సంబంధించి ఆ మైన్స్‌ను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంలో Are we Incompetent? I will give you one suggestion Sir. You call us. Within 10 minutes we will draft a G.O. Within 10 minutes we will draft an Act. Where by we can hand over that whole thing. తద్వారా కొన్ని వేల కోట్ల రూపాయల ప్రజాధనం ప్రభుత్వానికి వస్తుంది. put it in 9th schedule. అప్పుడు కోర్టులు కూడా దానిపై ఇంటర్‌ఫియర్ కావు. మీరు గ్లోబల్ టెండర్లు పిలవండి. ఎవరైతే ఐదు కోట్ల రూపాయలిస్తారో వారికే ఇస్తామని చెప్పండి. Say, from tomorrow onwards yes Obulapuram belongs to the State అని చెప్పే పరిస్థితులో మీరు Global Tenders పిలవండి. ఇంతకుముందే ఇచ్చిపోయారంటున్నారు. Cancel them. దానివల్ల Every month hundred crores of rupees ప్రభుత్వ ఖజానాకు వస్తుంది. దానితో ప్రజల మీద

పన్నులు వేయకుండానే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. These are the resources అని మేము చెప్పినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ముఖ్యమంత్రి గారికి సంబంధించిన వ్యక్తులు అందులో లబ్ధిదారులు. అందుకే ఈ ప్రభుత్వం వారి జోలికి పోవడం లేదు. ఈనాడు కేవలం కొన్ని కోట్ల రూపాయలు కాదు కొన్ని వందల, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వారికి దోచిపెడుతున్నారు. ఆవిధంగా వచ్చిన డబ్బుతో They are becoming Mafia. ఈ రోజున వాళ్లు రేపు జరగబోయే ఎన్నికలలో ప్రభుత్వాల సంగతి తేల్చేస్తామనే స్థితికి వచ్చారు. అక్కడ కర్ణాటకలో తేలుస్తారట. రేపు ఎలక్షన్లలో ఇక్కడ మా సంగతి తేలుస్తారట. మేము ఎవరిని అనుకుంటే వాళ్లను అధికారంలోకి తీసుకొస్తామనే పరిస్థితుల్లో ఈ రోజున ఈ మాఫియా వున్నది. అలాంటి మాఫియాను పెంచి పోషిస్తూ You are just destroying the democratic principles of the State. ఆ విధంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే వ్యవస్థల్ని పెంచి పోషించే ఈ ప్రభుత్వం మీద మేము అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం జరిగిందని తెలియజేస్తున్నాను. ఆవిధంగా ఈనాడు ఈ ప్రభుత్వం భూముల కేటాయింపులు, భూముల అమ్మకాలు చేపట్టి 97 వేల ఎకరాల భూముల్ని కేటాయించడం, అమ్మడం చేసింది.

ఈ విధంగా చేయడానికి అదేమైనా రబ్బరా? లేక మనం దానిని ఉత్పత్తి చేయడం కాని తయారు చేయడం కాని చేయగలమా? Sale of land అన్నదానిని ఇష్టమొచ్చినట్లు చేయడానికి it is not an activity. **భూమి అనేది మనిషికి ఒక జీవనాధారం. అది ఒక Civilization. ఒక ప్రాంతంలో కాని దాని Surrounding area కాని నివసిస్తున్న ప్రజల జీవనాధారమైన ఆ భూమిని ప్రజల సంక్షేమం కోసం, భవిష్యత్ తరాల అవసరాల కోసం నిలబెట్టకుండా మీ ఇష్టమొచ్చినట్లు అడ్డగోలుగా అమ్మేస్తారా?** రాజరిక వ్యవస్థలో కూడా ఈ విధంగా చేయలేదు. మీరు పదివేల కోట్లు ఆ విధంగా సంపాదించారు. ఈ బడ్జెట్‌లో కూడా దాదాపు 13,14 వేల కోట్లు అలా అమ్మడం ద్వారా సంపాదించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇక్కడ నేను ఒక్కటి చెప్ప దలచుకున్నాను. ఈ విధంగా చేస్తే రేపు భవిష్యత్ తరాలకు సంబంధించి స్కూళ్లు హాస్పిటల్స్, కాలేజీలు, చివరికి శ్మశానాల వంటి పబ్లిక్ యుటిలిటీల విషయంలో కూడా ప్రభుత్వం భూమి దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. If you change the title of that particular land రేపొద్దున Public utility అవసరాలకు లేకుండా చేయడమే. Is it not un-constitutional? ఎవరికైనా ఇల్లు కిరాయికిస్తే వాళ్లు ఇంట్లోని దూలాలు, తలుపులు, కిటికీలు ఒక్కొక్కటిగా అమ్ముకుంటుంటే ఊర్కుంటారా? మీకు ప్రజలు అధికారం ఇచ్చింది It is only five years period. అంతే కాని శాశ్వతంగా అధికారం ఇవ్వలేదు. ఐదు సంవత్సరాల్లో ఉన్నదంతా అమ్మేసుకుంటామంటే రేపు భవిషత్ తరాల అవసరాలు ఎవరు తీర్చాలి? దానికి కావలసిన ఒక ప్రణాళికను మీరేమైనా చేశారా? ఈ విధంగా అడ్డగోలుగా మీకు సంబంధించిన వారికి అమ్మేసుకొని ఒక కొత్త మాఫియా తయారు కావడానికి మీరు అంకురార్పణ చేస్తున్నారు. మీరు ఒక basic fundamental తీసుకురావడం జరిగింది. మంత్రివర్గం ఏ విధంగా తన బాధ్యతలను విస్మరించి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం, ప్రాంతీయతత్వంతో, కులతత్వంతో పని చేస్తున్నదో ఆ తీరుతెన్నుల పైన

మేము అవిశ్వాస తీర్మానం తీసుకు రావడం జరిగింది. అధ్యక్షా, ముఖ్యమంత్రి గారికి ఒక దివ్యమైన ఆలోచన వచ్చింది.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి నాలుగు సంవత్సరాలుగా పట్టించుకోని ముఖ్యమంత్రి గారికి టిఆర్ఎస్ సభ్యులు రాజీనామా చేసి వెళ్లిపోయిన తరువాత ఒక దివ్యమైన ఆలోచన వచ్చింది. ఆ ప్రాంతాల అభివృద్ధికి ఎవరికీ రానంత ఆలోచన సొల్యూషన్ కనుక్కున్నానని ఈ సభలో ఒక యాక్ట్ తీసుకొచ్చారు. నేను అప్పుడే చెప్పాను. దీని వల్ల లాభం లేదు. మీరు తొందరపడి చట్టం తీసుకు రావద్దు. అది కేవలం ప్రజల్ని మభ్య పెట్టడానికి తెస్తున్నారు తప్ప ప్రజల మీద వున్న చిత్తశుద్ధితో కాదని, అది టేబుల్ తుడుచు కోవడానికి తప్ప దేనికీ పనికి రాదని. ఎస్, I told on record and I also went on record. వాటికోసం చట్టబద్ద సంస్థలు 1956 నుంచి వున్నాయి. పెద్ద మనుషుల ఒప్పందాలున్నాయి. ఆరు సూత్రాల ప్రణాళికలు వున్నయి. Constitution was amended. The Presidential Order was given. కాని ఇవ్వాళ మీరు ఇక్కడి నుంచి పోతిరెడ్డిపాడుకు నీళ్లు తీసుకు పోతారు. మొత్తం ప్రభుత్వాన్ని, సర్వ అధికారాల్ని తన కోసం, తన కుటుంబం కోసం, తన నియోజవర్గం అభివృద్ధి కోసం, తన వారి ప్రయోజనాల కోసం, వాడుకుంటున్న వ్యక్తి, మొత్తం తిని తిని పళ్లు అరిగిపోగా మిగిలింది ఇతరులకు ఇస్తున్న వ్యక్తి, ఎందుకంటే ఓట్లు వేయించుకోవాలి కదా? ఏదో రూ.200 పింఛన్ ఇస్తే ఓట్లయినా వేస్తారన్న ఉద్దేశంతో దానినే గొప్ప అభివృద్ధిగా చెప్పుకుంటున్న వ్యక్తి, ఈనాడు ఈ ప్రాంతం గురించి మాట్లాడుతున్నారు. ప్రత్యేక తెలంగాణాకు సంబంధించి ఒక సొల్యూషన్‌ని తీసుకొస్తామని అన్నారు. ఆయనకి చరిత్ర అయినా తెలియకపోవాలి లేదంటే ఓవర్ ఇంటెలిజెన్స్ అయినా అయి ఉండాలి. Something called criminal intelligence. ఆయన ఏది చేసినా దాని వెనుక పెద్ద ఆలోచన ఉంటుంది. ఆ ఆలోచన వల్ల తనకు ఏ విధంగా లాభం కలుగుతుందా అని చూస్తారు. ప్రజల గురించి ప్రజానీకం గురించి. ఆ ఆలోచన వల్ల తనకు ఏ విధంగా లాభం కలుగుతుందా అని చూస్తారు. ప్రజల గురించి ప్రజానీకం గురించి ఏమాత్రం ఈ పథకంలో ఆలోచించలేదని తెలియజేస్తున్నాను. ఏవిధంగా వాళ్లచేత ఓట్లు వేయించుకోవాలి, వారికి ఏ పని చేస్తే ఓట్లు వేస్తారు అనే ఆలోచన తప్ప ఇంకొకటి కాదు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలు కనపడతారు. ఆ తరువాత ప్రజలకు కనపడరనే విషయాన్ని తెలియజేస్తున్నాను. It is nothing but a fraud. మసిపూసి మారేడు కాయ చేసి ప్రత్యేక తెలంగాణాను తీసుకొస్తానని, ఈనాడు మోసం చేస్తున్నారు.

అధ్యక్షా! చాలా మంది పెద్దలు ఈ వ్యవస్థలో అతనికి ఉపయోగపడుతున్నారు. అతను వీరిని ఉపయోగించుకుంటున్నారు. మొన్నటివరకూ ఈ ప్రాంతం గురించి పోట్లాడిన వారిని కూడా ఇతను కంట్రోల్ చేస్తున్నాడు. అధ్యక్షా, "పంచతంత్రం"లో నల్ల త్రాచు కథ చెబుతాను. ఒక సరస్సు ఉంది. అందులో బోలెడు కప్పలు ఉన్నాయి. ఒక నల్ల త్రాచుకు ఆకలి వేసి ఈ సరస్సు దగ్గరకు వెళ్తుంది. ఎప్పుడూ నన్ను అందరూ తిడుతుంటారు, ఇప్పటికైనా మంచిపేరు

తెచ్చుకోవాలని దీనికి ఆలోచన వచ్చింది. కానీ, దీనికి ఆకలి వేస్తుంది. ఆ సరస్సులోని కప్పలతో ఈ నల్ల త్రాచు ఏమని చెబుతుందంటే, "నేను మంచి పేరు తెచ్చుకోవాలని అనుకుంటున్నాను" అని చెప్పిందంట. "నేను ఈ రోజు పొరపాటున ఒక ఆశ్రమానికి వెళ్లాను అక్కడి మునికుమారుడు అతని కాలుతో నన్ను తొక్కాడు. అప్పుడు నేను అతన్ని కాటు వేసాను, ఆ ముని అతని యొక్క శక్తితో ఆ పిల్లవాడిని కాపాడుకున్నాడు కాని, నాకు మాత్రం శాపం ఇచ్చాడు, నువ్వు ఏ కప్పలను అయితే తింటున్నావో ఆ కప్పలను మోసుకొని తిరగాలని శాపం పెట్టాడు, కనుక, నేను మీ దగ్గరకు వచ్చాను" అని చెప్పింది. నేను మంచిగా ఉండాలని అనుకుంటున్నాను, మిమ్మల్ని మోసే దాకా నాకు శాపం పోదు. ఇప్పుడు నన్ను ఏమి చెయ్యమంటారని ఆ నల్లత్రాచు కప్పలతో అందట. అప్పుడు కప్పరాజు లేచి, బాధపడకు అని తాను, మిగతా సైన్యం ఆ నల్లత్రాచు మీద ఎక్కాయంట. ఆ విధంగా నల్లత్రాచు పాకుతూ కొద్ది దూరం వెళ్లి ఆగింది. ఎందుకు ఆగావు అని కప్పరాజు అడిగిందంట. నాకు ఆకలవుతుంది, నా ఆకలి తీరే వరకూ ముందుకు కదలలేను కాబట్టి నా ఆకలి మీరే తీర్చాలి అని ఆ నల్లత్రాచు చెప్పిందంట. పాపం ఆ కప్పరాజు ఆలోచించి, మేము చాలా మందిమి ఉన్నాము, ఒక కప్పను ఇస్తాను అని చెప్పిందంట. ఈ విధంగా నమ్మించి, నమ్మించి, మొత్తం సరస్సులోని కప్పలను తినేసి నేను చాలా బ్రహ్మాండంగా ఉన్నాను, మంచిపేరు తెచ్చుకుంటున్నానని అనుకుంటుంది. ఆవిధంగా ఉంది మీ కథ. ఈ విధంగా ఉంటే ఎవరు నమ్ముతారు? అధ్యక్షా, నేను ఆరోజు చట్టం తెచ్చేటప్పుడు చెప్పాను. మీరు ప్రాంతీయతత్వంతో పనిచేస్తున్నారు, మా నీళ్లను దోపిడి చేస్తున్నారు, మా భూములను అమ్ముకుంటున్నారు అని చెప్పాను. ఈ ప్రాంతానికి న్యాయం చెయ్యని వ్యక్తి, ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు కొట్టేస్తున్న వ్యక్తి ఈనాడు నేను వెనుకబడిన ప్రాంతాలను బాగుచేస్తానని చెబుతుంటే ఎవరు నమ్ముతారని నేను అంటున్నాను. నా పులివెందులను నేను అభివృద్ధి పరచుకుంటాను, 8000 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకుంటాను, నా ఇష్టం, నేను ముఖ్యమంత్రిని అని ఇప్పుడే చెప్పారు. రాజ్యాంగబద్ధంగా ఆయనకి ఎక్కడ హక్కు ఉందని నేను అడుగుతున్నాను. ఆయన ప్రాంతీయతత్వం గురించి ప్రాంతీయ అసమానతలను తొలగిస్తానని చెబుతుంటే, అది ఎంతవరకూ సాధ్యం అని అడుగుతున్నాను. అది అయ్యే పనా అని అడుగుతున్నాను. ఆ విధంగా మోసం చేస్తున్నారు కనుక అవిశ్వాస తీర్మానం పెట్టాము.

అధ్యక్షా! అదే విధంగా అధికారం అనేది ఒక ముఖ్యమంత్రితో ఆగదు. ఒక వ్యక్తితో ఆగదు. మనం వైస్ ఛాన్సలర్స్‌ను అపాయింట్ చేస్తాము, ప్రజలు ఎన్నుకోబడని వ్యక్తులకు నామినేటెడ్ పోస్టులు కూడా ఇస్తుంటాము. నాకు అవకాశం వచ్చింది, మళ్లీ భవిష్యత్‌లో వస్తుందో రాదో తెలియదు. కాబట్టి నాకు సంబంధించిన వారికి అపాయింట్‌మెంట్స్ ఇస్తాను అంటే అది ఎంతవరకూ సమంజసమో ఒకసారి ఆలోచించాలి. Is it not the misuse of power? ఈనాడున్న వైస్‌ఛాన్స్‌లర్స్‌లో, ఐదుగురు వైస్‌ఛాన్స్‌లర్స్, కడప, రాయలసీమ ప్రాంతానికి చెందినవారు. తెలంగాణా ప్రాంతానికి చెందిన వారు ఒకరు, కోస్తా ప్రాంతానికి చెందిన వారు నలుగురు

ఉన్నారు. ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన వైస్ ఛాన్స్‌లర్ విషయాన్ని కిరణ్‌కుమార్ రెడ్డి గారు లేవనెత్తారు. నేను చెప్పాను. నేను చెప్పిన వ్యక్తి అన్యాయానికి గురయ్యాడు. తెలంగాణాలో ప్రతినిధులు ఉన్నారా, చచ్చారా, మాకింత అన్యాయం చేస్తుంటే, మీరు ముఖ్యమంత్రిని అడగడం లేదని నా దగ్గరకు మొత్తం యూనివర్సిటీ ప్రొఫెసర్స్ వచ్చి అడిగారు. అప్పుడు మనసు బాధ అనిపించి నేను ఒక ప్రయత్నం చేసాను. నేను చెప్పిన వ్యక్తిని, ఇప్పుడు మీరు అపాయింట్ చేసిన వ్యక్తిని కంపేర్ చెయ్యండి. రోశయ్య గారిని జడ్జ్‌గా పెడదాము. ఇంకా కొంత మందిని కూడా జడ్జిలుగా పెడదాము. నేను చెప్పిన వ్యక్తి ఆల్ ఇండియాలోనే ఎమినెంట్ పర్సన్. మీరేమో మీ బంధువులకి ఇచ్చారు. నేను ఒక వ్యక్తి గురించి అడిగితే, మీ ఇష్టానుసారంగా చేస్తున్నారు. జాగీర్లు రాస్తున్నారు. నిజాం సర్కార్ అయినా వెనుకాడేవాడు. ఈనాడు మీరు మీ వర్గాన్ని పెంచి పోషించుకుంటూ, మిగతా వర్గాలను పక్కన పెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారా లేదా అని అడుగుతున్నాను.

అధ్యక్షా! ఒక ఎగ్జాంపుల్ చెబుతాను. హోంమినిష్టర్ గారు ఉంటే బాగుండేది. ఆయన ఆకాశం, భూమి రెండింటినీ చూస్తుంటారు. అదేంటో మరి ఆయన పైకి, కిందికి చూస్తుంటాడు. అతనికి ఏమి జరుగుతుందో తెలియదు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఏమి ఆలోచిస్తాడో తెలియదు. సుదీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనబడతాడు. మేము ఏదైనా అడిగితే, దేవుడు చల్లగా చూడాలి గాక, ప్రజలందరూ మంచిగా ఉండాలి గాక అని ఈ విధంగా రెండు ఉపన్యాసాలు ఇచ్చి కూర్చుంటాడు. అంతేగాని, మిగతా విషయాలు చెప్పరు. అధ్యక్షా, హైదరాబాద్ సిటీలో 63 మంది హెచ్.ఎస్.ఓ.లు ఉన్నారు. వారిలో 11 మంది మాత్రమే ఇక్కడ వారు, 43 మంది రాయలసీమ ప్రాంతానికి చెందినవారు. సిటీ సరౌండింగ్స్‌లో యం.ఆర్.ఓ.లను అప్‌గ్రేడ్ చేశారు. ఇంపార్టెంట్ జిల్లాలకు సంబంధించి ఆరు పోస్టులను అప్‌గ్రేడ్ చేసి మొత్తం రాయలసీమ వ్యక్తులను పెడతారా? హైదరాబాద్ సరౌండింగ్స్‌లో మీ అధికారం చెలాయించడానికా మీకు అధికారాన్ని ఇచ్చింది? ఈ ప్రాంత ప్రజలు మీకు అధికారాన్ని ఇవ్వలేదా? వాళ్లు ఏమి కోరారు? అయ్యా మాకు 40 శాతం జనాభా ఉన్నాము, మాకు న్యాయం చెయ్యండి, మాకు ఉద్యోగాలు ఇవ్వండి, మాకు వనరులు ఇవ్వండి అని కోరారు. వారికి న్యాయం చెయ్యక పోగా, వారి చేత ఓట్లు వేయించుకొని, రోజుకొక తమాషా చేస్తున్నారు. ఇది ఎంతవరకూ సమంజసమో వివరణ ఇవ్వాలి.

అధ్యక్షా! రైతుల సమస్య గురించి చెబుతాను. మా కాలంలో దురదృష్టవశాత్తు వర్షాలు పడక 1200 మంది రైతులు ఇబ్బంది పడ్డారు. కరవు వచ్చింది, చాలా మంచి ఇబ్బంది పడ్డారు. మీరు ప్రమాణస్వీకారం రోజు చెప్పారు. కావాలంటే టీవీలో చూడండి. ఈరోజు నుండి ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోదని ఈ మహానుభావుడు ప్రకటన చేశాడు. మరి 4625 మంది ఎట్లా చనిపోయారు? మీకు ప్రాపర్ ప్లానింగ్ లేదు. సమస్యను అర్థం చేసుకోలేకపోయారు. సమస్యను పూర్తిగా అటెండ్ అవ్వలేక పోతున్నారు కాబట్టి అగ్రికల్చర్ సెక్టార్‌లో క్రైసిస్ వచ్చింది. 500 కోట్ల రూపాయల స్థిరీకరణ చేస్తామని అన్నారు. కనీసం ఎరువులు కూడా సరఫరా చెయ్యడం

లేదు. ఈ రోజేమో ఈవిధంగా మాట్లాడుతున్నారు. దానిపైన కూడా మీరు చెప్పాలి. అగ్రికల్చర్ సెక్టార్ కొలాప్స్ అయ్యింది. దీనిపై ప్రకటనలు చేసుకొని ముందుకు వెళుతున్నారు తప్ప సిన్సియర్‌గా మీరు ఎఫర్ట్స్ పెట్టడం లేదు.

అధ్యక్షా! సంక్షేమం, చిత్తశుద్ధి లేని శివపూజ చేసినట్లు ఉంది. 80 శాతం సమాజంలో ఉన్న ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలు మీకు ఎప్పుడు జ్ఞాపకం వస్తారు? ఈ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారకులు వాళ్లే. చాలా ప్రాంతాల్లో మనం చూస్తున్నాం. **డబ్బు ఉన్నవారు, అన్ని వసతులు పొందుతున్నారు ఓటింగ్‌కు రారు. తిండి కోసం రాష్ట్రంలోని దూర ప్రాంతాలనుంచి వచ్చి నా నియోజవర్గంలో పనిచేస్తున్న వ్యక్తులు వారి సొంత గ్రామాల్లో ఓటింగ్ ఉంటే చేతిలో పైసలు లేకపోయినా సరే, అప్పులు తీసుకొని సొంత గ్రామాలకు వెళ్లి ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆ విధంగా ప్రజాస్వామ్యాన్ని పేద ప్రజలు రక్షిస్తున్నారు.** అటువంటివారి సంక్షేమం మీకు పట్టదా? రాష్ట్రంలో, దేశంలో ఈనాడు ఆర్థిక వ్యవస్థ బాగా పుంజుకోవడం వల్ల వనరులు పెరిగాయి. నిన్ననే కేంద్ర ఆర్థిక మంత్రిగారి ప్రకటన చూశాను. ఈ ఆర్థిక సంవత్సరం అనగా 2008-09లో ఆదాయం పన్ను ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మూడు లక్షల అరవై వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని చెప్పారు. ఆదాయం పన్ను ప్రతి సంవత్సరం పెరుగుతుందని అన్నారు. ఆదాయం పన్ను ద్వారా వచ్చే ఆదాయం అబ్‌నార్మల్‌గా పెరుగుతోంది. నాలుగు సంవత్సరాల క్రితం ఆదాయం పన్ను అరవై వేల కోట్ల రూపాయలు వస్తుంటే ప్రస్తుతం అది 3.5 లక్షల కోట్లకు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థల మూలంగా పన్నులు ప్రభుత్వానికి విపరీతంగా వస్తున్నాయి. అందుకే కేంద్ర ఆర్థిక మంత్రిగారు రైతులు తీసుకున్న అరవై వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తున్నామని కేంద్ర బడ్జెట్‌లో కేటాయించకుండా ప్రకటించగలిగారు. ఆ విధంగా వనరులు వస్తున్నాయి గనుకనే అరవై వేలకోట్ల రూపాయల రుణమాఫీ పెద్ద సమస్య కాదు. ఆదాయం పన్ను ద్వారా వచ్చే ఆదాయం గత సంవత్సర ఆదాయం కన్నా లక్షాయాభై వేలు అదనంగా ఈ సంవత్సరం వచ్చింది. ఆవిధంగా వస్తున్న నిధులతో ఎంతో బాగా సంక్షేమం చేపట్టవచ్చు.

ఆ విధంగా వస్తున్న నిధులతో పిల్లలకు చదువు చెప్పారా? మా పార్టీ శాసనసభ్యులం నియోజవకవర్గాలలోని కనీసం పది గ్రామాలను తిరిగాము. ఆ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లల పరిస్థితి చూడండి. మీపిల్లలుగానీ, మాపిల్లలుగానీ, ప్రభుత్వ అధికారుల పిల్లలుగానీ ఎవరూ అందులో లేరు. కేవలం పేదవారి పిల్లలు మాత్రమే ఆపాఠశాలల్లో చదువుకుంటున్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తరువాత పేద పిల్లలు చదువుకుంటున్న 1026 పాఠశాలలను మూసివేశారు. ఇంకా 6600 పాఠశాలలు మూసివేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. మీరు సంక్షేమం గురించి మాట్లాడుతున్నారు. పేద ప్రజల పిల్లలు మాత్రమే ఆ పాఠశాలలకు వెళుతున్నారు. అయినా వారి పిల్లలకు విద్య నేర్పరు, వారికి సరైన వైద్యం ఇప్పించరు. ఆరోగ్య శ్రీ అంటారు, మేం నిన్న చెప్పినట్లుగా కమీషన్లు కొట్టివేయడానికి, ఆరోగ్యశ్రీ పథకాన్ని కార్పోరేట్ హాస్పిటల్స్‌కు దోచిపెడుతున్నారు. కానీ పీహెచ్‌సీల పరిస్థితి ఏమిటి? వాటిలో

డాక్టర్లు, నర్సులు ఉండరు, మందులు అంతకన్నా ఉండవు. అయినా వాటిగురించి మీరు పట్టించుకోరు. వాటిని గాలికి వదలివేస్తున్నారు. మేం సంక్షేమం చేస్తున్నామని మీరు చెబుతూ ఇప్పుడు ఏం చేస్తున్నారని ఈ విధంగా మాట్లాడుతున్నారు. మేం అధికారంలో ఉన్న కాలంలో మాకున్న నిధులను బట్టి మేం మాకు చేతైనైనంతవరకు మేం ఖర్చు పెట్టాం. కానీ ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్ల రూపాయలు అని రొమ్ము విరుచుకుని చెబుతున్నారు. బడి పిల్లలకు మధ్యాహ్నం తిండి పెట్టడానికి అయిన ఖర్చు నాలుగు నెలల నుంచి ఇరవై కోట్ల రూపాయలు చెల్లించలేని పరిస్థితి ప్రస్తుతం ఉంది. పాఠశాలల్లో భోజనం పెడుతున్నారనే ఆశతోనే పేదల పిల్లలు బడికి వస్తున్నారు. భోజనం ఆపివేస్తే పిల్లలు కనిపించరు. ఇదా మీ సంక్షేమం? రాష్ట్రంలో హాస్టళ్ల పరిస్థితి చూస్తే మీరు చెప్పే విషయాలు కాగితాలకే పరిమితమైనాయి. మీరు చేస్తున్న ప్రచారానికి పేపర్ ఖర్చులకు, ప్రకటనలు ఖర్చులకు సరిపోతున్నాయి తప్ప వాస్తవంగా జరగడంలేదు. హాస్టళ్లలోని పరిస్థితిలు తెలిసి, మేం మనోవేదన చెంది, శాసనసభ దృష్టికి తీసుకొచ్చి, ప్రజల దృష్టికి కూడా తీసుకరావడంతో మీరు విధిలేని పరిస్థితుల్లో మీరు సంక్షేమ యాత్ర చేపట్టారు. **అధ్యక్షా, మేం పిల్లలతోబాటు హాస్టళ్లలో పండుకొన్న తరువాత మీరు ఈ సభలో వాస్తవ పరిస్థితులను అంగీకరించి, మీరు కూడ ఆ హాస్టల్‌లో నిద్రించారు. అన్ని పార్టీల శాసనసభ్యులను హాస్టళ్లలో పండుకోమన్నారు. ఆ విధంగా మేం సమస్యను లైమ్‌లైట్‌లోకి తీసుకొచ్చాము.** ప్రతిపక్ష పార్టీగా మేం అంతకన్నా ఏం చేయగలం. ఆవిధంగా మేం ఒక సబ్జెక్టుపై కదిలామని చెబుతున్నారు కానీ కదలలేదు. ఇప్పుడు ఎన్నికల వస్తున్నాయని రైతుల రుణాలు మాఫీ చేస్తామని, రోజువారీ కులాలవారీగా మీటింగ్‌లుపెట్టి వారందరి ఓట్లు వేయాలి గనుక చెబుతున్నారు. ఎన్నికలు రాకపోతే కనీసం వారికి మంచినీరు కూడా ఇచ్చేవారు కాదు. అటువంటి ఆశతో సంక్షేమాన్ని ముందుకు తీసుకవెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నారు తప్ప ఎంతమాత్రం మీకు చిత్తశుద్ధి లేదు.

మీరు అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయి. ధరల పెరుగుదల గురించి సామాన్య ప్రజల గోడు మీకు పట్టదా? రఘువీరారెడ్డిగారు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం సుమారు 200 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఆహారోత్పత్తి జరిగిందని చెబుతారు. అంతగా రాష్ట్రంలో ఆహారోత్పత్తి పెరిగిందని చెబుతున్నా, ఆహార వస్తువులు ధరలు మూడింతలు ఎందుకు పెరుగుతున్నాయి? ఆర్థిక శాస్త్రంలో డిమాండ్, సప్లై ఉంటుంది. వాటిలో వచ్చే హెచ్చుతగ్గుదలనుబట్టి రేట్లు పెరుగుతాయి. అటువంటి సమయంలో ఆహారధాన్యాల ఉత్పత్తి విపరీతంగా పెరిగినపుడు నిత్యావసర వస్తువులు ధరలు ఎందుకు పెరిగాయి? సామాన్య మానవునికి సరైన ధరకు ఆహారధాన్యాలు ఎందుకు దొరకడంలేదు? ఎందుకు ధరలు మూడు రెట్లు పెరిగాయి? గ్యాస్ ధరపై వంద రూపాయల సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ఎన్నికలకు ముందు వాగ్ధానం చేసింది. ఆ వాగ్ధానం ఎక్కడికి పోయింది. మీరు ధరలు పెరుగుతుంటే చూస్తూ పట్టించుకోరా? విమానాలకు ఉపయోగించే ఇంధనంపై ప్రస్తుతమున్న పన్నును 33 శాతం నుంచి నాలుగు శాతానికి తగ్గించారు. అటువంటి వారికి ఆర్టీసీ బస్సులు

కనిపించలేదా? సామాన్య ప్రజలు ఉపయోగించే స్కూటర్లు కనిపించలేదా? సామాన్యునికి ఉపయోగపడే లారీలు, బస్సులు కనిపించవా? ఈ వాహనాలన్నీ ఉపయోగించే పెట్రోలు, డీజిల్‌పై అమ్మకం పన్ను మినహాయించకుండా విమానాలలో ఉపయోగించే ఇంధనంపై ఉన్న పన్ను శాతాన్ని మాత్రమే ఎందుకు తగ్గించారు? వారి అధికారమంతా తనకోసం, తనవారికోసం వాడుకుంటున్నారు. రాష్ట్రంలో సిమెంట్, స్టీల్ ధరలు మూడింతలు పెరిగాయి. మీరు పేదలకు ఇండ్లు కట్టిస్తామంటున్నారు. ఈవిధంగా ధరలు పెరగడంతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న మీకు, పేదవాడి గోడు పట్టించుకోని మీకు ఈ రాష్ట్రాన్ని పరిపాలించే హక్కు లేదు. అందుకే మేం అవిశ్వాసం తీర్మానం పెట్టాం. ఈ విధంగా తొలగిపోవాలని గట్టిగా మేం కోరుతున్నాం.

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి గురించి చెప్పాలంటే రాష్ట్రంలో జరిగిన బాంబు ప్రేలుళ్లు, రాజకీయ హత్యలు మన రాష్ట్రంలో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడు హోంమంత్రిగారు సభలో లేరు. I will take only just five minutes. మీరు లేస్తుంటే నాకు ఇబ్బందిగా ఉంది.

అధ్యక్షా! ఎన్నికలకు ముందు వారు పాదయాత్ర చేశారు. ఆరోజు వారు ఇంటర్నల్ అడ్జస్ట్‌మెంట్ చేసుకున్నారు. మంత్రి శ్రీ డి.శ్రీనివాస్‌గారు అప్పుడు పీసీసీ అధ్యక్షులుగా ఉన్నారు. ఆయన ఫోటో, సోనియా గాంధీ గారి ఫోటో వేసుకొని 131 వాగ్దానాలు చేశారు. అందులో నేను కొన్ని స్టడీ చేశాను. రాజశేఖరరెడ్డిగారి పాదయాత్రలో చేసిన వాగ్దానాలు కలిపితే మొత్తం వెయ్యి అవుతాయి. ఎక్కడ ధర్నా జరిగితే అక్కడ, కనిపించినవారికందరికీ వాగ్దానాలు చేసి, మమ్మల్ని అధికారంలోకి తీసుకురండి, మేం అధికారంలోకి రాగానే మీ కోరికలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. ఆ వాగ్దానాలన్నీ ఎక్కడికి పోయాయి? శ్రీ డి.శ్రీనివాస్‌గారిది చాలా పెద్ద చేయి, ఆ చేయి చూపిస్తూ ఓటు వేయండి, ఒక్క బల్బు ఉపయోగించేవారికి ఉచితంగా కరెంటు ఇస్తామని చెప్పారు. ఎక్కడికి పోయింది ఉచిత కరెంటు? రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంకోసం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ అన్నారు. అదెటు పోయింది? స్థానిక సంస్థలకు అధికారాలిస్తామని ఆ మహానుభావులు చెప్పారు. వారిని ఎక్కడికి తీసుకెళ్లారు? స్థానికసంస్థలకు అధికారాల బదలాయింపు కోరితే వారిని తీసుకెళ్లి జైలులో పెడుతున్నారు. లాఠీఛార్జి చేస్తున్నారు. మేం అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. ఆ వాగ్దానం ఏమైంది? ఈనాడు ఎన్నికలు వస్తున్నాయి గావున డీఎస్సీ ప్రకటిస్తున్నారు. ఇంతకు ముందు ప్రకటించిన డీఎస్సీ కొన్ని టెక్నికల్ సమస్యల వలన ముందుకు వెళ్లలేదు. డీఎస్సీ నిర్వహించి, నియామకాలు చేపడతామని చెబుతున్నారు. ఎన్నికలు వస్తున్నందున, యువతరం మీరు చేసిన వాగ్దానాలు నెరవేర్చనందుకు మీకోసం సిద్ధంగా ఉన్నారు. వారి కోపానికి భగ్గుమని మండి బూడిద అయిపోతామన్న భయంతో వారికి ఏదో ఒకటి చెప్పి వారిని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఉద్యోగాలు ఇస్తామని యువతరాన్ని మభ్యపెడుతున్నారు.

పీపీఏలు సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ విధంగా ప్రభుత్వానికి సమగ్రమైన నిర్ణయం

లేదు. రాష్ట్రంలోని వనరులన్నీ వారి ఇష్టానుసారంగా ఖర్చు పెడుతున్నారు. మద్యపాన నిషేదాన్ని దశలవారీగా పెడతామని చెప్పిన మహానుభావులు రోశయ్యగారు అయితే ఇంతకు ముందు మాట్లాడుతూ మీరు ఆముదం పోస్తున్నారా అని చెప్పినవారు ఇప్పుడు పది వేల కోట్ల రూపాయలు ఎక్సైజ్‌శాఖ నుంచి పొందుతున్నారు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్దఎత్తున ఈ శాఖనుంచి ఆదాయం తీసుకోవడంలేదు. రాష్ట్రంలో డెబ్బైవేల బెల్టు షాపులు పెట్టారు. గతంలో మీరు చేసిన వాగ్దానం ఏమైంది. ఇండ్ల పట్టాలు కావాలని ధర్నా చేస్తున్నవారిని మీరు ముదిగొండలో ఏవిధంగా రాక్షసంగా ప్రవర్తించిందీ రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు, చూస్తున్నారు. ఈనాడు ఈ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా పరిపాలన చేయాలి. ఇదేమీ వారి సొంత జాగీరు కాదు. ఈ సందర్భంగా నేనొక సంఘటన చెప్పదలచుకున్నాను. అధికారమంటే ఏమిటో ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవాలి. వారు ప్రతిపక్ష నాయకులుగా ఇక్కడ ఉండి వారి పార్టీ శాసనసభ్యురాలి భర్త అయిన ఆయన అనుచరుడికి గన్‌మెన్ రక్షణకోసం ఎంత రాద్ధాంతం చేశారో, అల్టిమేట్‌గా స్పీకర్ స్థానం వద్దకు వచ్చి ఎంతగా కోరారో, హోం మంత్రిగా నేను ఉన్నప్పుడు నా వద్దకు వచ్చి ఒకసారి వినండి, నేను పూచీ ఉంటాను, వాడు తప్పు చేయడని మాట్లాడిన వ్యక్తి, ఒకేసారి నాలుగేళ్లలో సర్వాధికారిగా ఎలా తయారయ్యాడో చూడండి. ప్రజలు మీకు అధికారమిచ్చారు. మీరు పెద్ద క్వాలిఫికేషన్‌తో, పై నుంచి దిగి రాలేదు. ప్రజలు మీకు అధికారం ఇచ్చారు. ప్రజల గురించి పాటుపడాల్సిన అవసరం మీకు లేదా?

ప్రజలను మభ్య పెట్టి మీ చుట్టూ, మీ కుటుంబం చుట్టూ, మీ వర్గం చుట్టూ, మీ ప్రాంతం చుట్టూ, ఈ అధికారాన్ని తిప్పి కొట్టిన మీకు ఒక్క రోజు కూడా అధికారంలో ఉండడానికి మీకు ఏ మాత్రం అర్హత లేదు. కనుకనే మీ పైన అవిశ్వాస తీర్మానం పెట్టాం. నేను దయచేసి మిత్రులందరిని కోరుతున్నాను, మీకు తెలుసు నేను చెప్పింది నూటికి నూరు పాళ్ళు కరెక్టేనని , మనస్సాక్షిగా దీంట్లో పాలుపంచుకోండి. ఈ నియంతృత్వ పాలనను భవిష్యత్తులో ఈ రాష్ట్రానికి ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా ఇవ్వాళ ఎదుగుతున్న ఈ ముఖ్యమంత్రిని దించెయ్యాలి. ప్రజల మధ్యకు, ప్రజా కోర్టుకు ఈడ్చుకెళ్ళాలి. ఆ విధంగా ఇతను చెప్పిన ప్రతి మోసపూరితమైన మాటలను ప్రజల కోర్టుకి తీసుకువెళ్ళాలి. ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కులేదు. కనుకనే తెలుగుదేశం పార్టీ ఒక బాధ్యత గల ఒక ప్రతిపక్ష పార్టీగా అవిశ్వాస తీర్మానం పెట్టామని చెప్పి దానికి అందరూ సహకరించాలని తెలియచేస్తూ, నాకు అవకాశం ఇచ్చిన మీకు నా ధన్యవాదాలు తెలియచేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

స్పీకర్ సర్. మేము ప్రవేశపెట్టిన 'నో కాన్ఫిడెన్స్ మోషన్ ' పైన కిషన్‌రెడ్డి గారు మాట్లాడారు. ఎందుకంటే అది గవర్నమెంట్‌కు వ్యతిరేకంగా ఇచ్చింది. దానికి అన్ని రాజకీయ పార్టీలూ, ఆయా పార్టీల పాలసీలకు అనుగుణంగా సపోర్ట్ చేస్తూ వుంటారు. సిపిఎం సపోర్ట్ చేస్తోంది సహజంగానే ఏ సభ్యుడైనా ప్రభుత్వం చేసిన తప్పిదాలను గురించి మాట్లాడినపుడు మెచ్చుకునే వారు మెచ్చుకుంటారు. వ్యతిరేకించే వారు వ్యతిరేకిస్తారు. మేము అదే మాట్లాడుకుంటున్నాము.

కిషన్ రెడ్డి సాట్యురేషన్ పాయింట్ గురించి బాగా డిఫెండ్ చేస్తారు. ఏఏ ఏరియాలలో సాట్యురేషన్‌కు వెళ్లారో చెప్పారని అనుకుంటున్నాము. రఘువీరారెడ్డి గారికి ఏమి అర్థమైందో, ఎంఐఎం సభ్యులకు ఏమర్థమైందో తెలియదు కాని, ఏదో రకంగా భారతీయ జనతా పార్టీకి మేము సపోర్ట్ చేస్తున్నట్లుగా, ఆ రకంగా మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదు. ఈ దేశంలో ఏ పార్టీకైనా నైతిక హక్కుంది కాని మీకు హక్కు లేదని చెబుతున్నాను. నేను ఇంతకు ముందు మాట్లాడినపుడు తిరుగుతున్నారు. ఏ కండువా వేస్తారు, ఎవరు వేస్తారు. బయట వారు వేస్తారా, మళ్లీ ఒకసారి మాకు అధికారం ఇవ్వండని అడగడం, కండువా వేసుకోవడం, ఓట్లు వేయించుకోవడం, మోసం చేయడం. మోసంలో పుట్టి మోసంలో పెరిగిన వారికి మీకు ఎక్కడ హక్కుందండీ మా గురించి మాట్లాడడానికి?

మీ పార్టీలో ఎంతమంది టిడిపి వారు వున్నారు? ఎంతమంది ఈ రోజు మీ పార్టీలో ఎంఎల్‌ఎలుగా వున్నారో చూడండి. అవుట్‌సైడ్ కాదు. ఆ విధంగా మీ క్యాబినెట్‌లో కూడా వున్నారు. మీ క్యాబినెట్‌లో జానారెడ్డి గారితో సహా టిడిపి తయారు చేసిన లీడర్లు చాలా మంది వున్నారు. ఆ విధంగా చెప్పదలచుకంటే చాలా పెద్దలిస్ట్ అవుతుంది. మీ దగ్గర పెట్టుకుని మమ్మల్ని అంటే ఎట్లా? మీ ముఖ్యమంత్రిగారు రెడ్డికాంగ్రెస్ నుంచి గెలిచారు కదా. అందుకే, ఆ పేరు నిలబెట్టడానికే సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ తరువాత వచ్చి ఇక్కడ చేరిపోయారు కదా. ఈ రకంగా లెక్కలు చూసుకుంటూ పోతే చాలా వున్నాయి. ఈ రోజు మనం 'నోకాన్ఫిడెన్స్ మోషన్ ' మీద మాట్లాడుకుంటున్నాము. కొన్ని విషయాలు బయటకు తెచ్చాము. ఆ విషయాల

మీద మాట్లాడండి, వాటికి జవాబు చెప్పే ప్రయత్నాలు చేయండి కాని, ఎవరితో ఎవరు కలుస్తున్నారనేది అందరికీ తెలుసు.

మీరు ఒకసారి మునిసిపల్ ఎలక్షన్లు చూడండి. బిజెపి వారు మాకు సపోర్ట్ చేస్తే కనీసం 10, 15 మునిసిపాలిటీలలో గెలిచేవారం. కాని మేము కామ్‌గా వున్నాం. వారు మాకు సపోర్ట్ చేస్తామన్నా, పాలసీ మేటర్ క్రింద డిఫర్ అయ్యాం కాబట్టి ఆ తరువాత కలవదలచుకోలేదు. ఈ ఎలక్షన్స్ అయిన తరువాత కూడా, వన్ రీజన్ ఈస్ కామారెడ్డి. బిజెపి మాకు అన్‌కండిషనల్ సపోర్టు చేస్తామని చెప్పినా కూడా మేము వద్దని చెప్పాము. వద్దని అనుకున్న తరువాత మేము కలవకూడదని మేము ఇన్ ప్రిన్సిపుల్ వెళ్లుతున్నాము. అది ఒదిలిపెడితే మీరు టిఆర్‌ఎస్‌తో కలుద్దామా, సిపిఐతో కలుద్దామా సిపిఎంతో కలుద్దామా అని అ కండువాలు మార్చుకుని తిరుగుతూ మా గురించి మీరా మాట్లాడేది.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భం

5-12-2005

అధ్యక్షా! ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేసి 46 సంవత్సరాలు కంప్లీట్ చేసుకొని స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో ఈ రోజున అదే టైంకు కలవాలని చెప్పి ఈ సభను మీరు ఏర్పాటు చేశారు. అలాంటి సందర్భంలో నన్ను మాట్లాడడానికి అవకాశ మిచ్చినందుకు మీకు ధన్యవాదాలు.

అధ్యక్షా! మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రం మన ఆంధ్ర రాష్ట్రం. ఇక్కడ భాష అనేది చాలా ప్రధానమైనది. ఆనాడు ఈ ప్రజలంతా కలవడానికి ఏకైక మార్గం మన తెలుగు భాష, దేశంలోనే హిందీ తరువాత అధిక సంఖ్యాకులు మాట్లాడే భాష కూడా తెలుగు భాష. అలాంటి తెలుగు భాష ప్రాముఖ్యం గురించి, రాష్ట్రావతరణకు ముందు తెలుగువారందరూ ఏకం కావాలనుకోవడం, ఈ రాష్ట్రం ఏ విధంగా ఏర్పడింది, అందుకు కారకులు ఎవరు? అనే విషయాలకు నేను పోదలచుకోలేదు. ఏదిఏమైనా అటు మద్రాసు ప్రావిన్స్‌లో కానివ్వండి, ఇటు హైదారాబాదు స్టేట్‌లో కానివ్వండి భాష పట్ల కాని, సంస్కృతి, సాంప్రదాయాల పట్ల కాని ప్రజలకు ఆనాడు స్వేచ్ఛ వుండేది కాదు. అటు మద్రాసు ప్రావిన్స్‌లో తమిళ ప్రజలు, ఇటు హైదారాబాదు స్టేట్‌లో మరాట్వాడా, కర్నాటక ప్రజలు అందరూ కలిసి నివసించేవారు. అనాడున్న రాజకీయకారణాల వల్ల అనాటి పాలకులు తమ పరిపాలనా సౌలభ్యం కోసమే ఆలోచన చేసేవారు తప్ప వారికి ప్రజల యొక్క మనోభావాలతో కాని, భాష, సంస్కృతులతో కాని పని లేదు. అవన్నీ ఆ పాలకులకు సెకండరీ. అది తరువాతి విషయం వారికి. ఆ విధంగా వారు తమ యొక్క భౌగోళిక స్వరూపాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వారు తమ భౌగోళిక స్వరూపానికే ప్రాధాన్యమిచ్చారు తప్ప ప్రజల యొక్క మనో భావాలకు, వారి భాష, సంస్కృతి, సాంప్రదాయాలకు ఆనాడు పెద్దగా విలువ వుండేది కాదు. కనుకనే బ్రిటీష్ వారు ఆనాడు మద్రాస్ స్టేట్‌లో వారి అడ్మినిస్ట్రేటివ్ యూనిట్స్‌ను

పెట్టుకొని పని చేయించడం, ఇటు హైదరాబాదు స్టేట్‌లో మరాట్వాడా, కర్నాటక ప్రజలు కలిసి వున్న ప్రాంతంలో కూడా ఆ విధంగా పెట్టుకోవడం జరిగింది. ఆవిధంగా ఈ రెండింటిలోనూ తెలుగు వారికి భాష, సంస్కృతి గురించి పట్టించుకునే అవకాశం లేని రోజుల్లో, వాటి కోసం తపించే రోజుల్లో ఆనాడు తెలుగువారంతా ఐకమత్యం కావాలనే నినాదంతో ,దృఢసంకల్పంతో మొదలైన ఉద్యమం యొక్క ఫలితంగా ఏర్పాటైన మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం మన ఆంధ్రరాష్ట్రం. అలాంటి తెలుగు భాషకు వున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. అసలు భాష అనేది మనిషి యొక్క భావాన్ని వ్యక్తపరిచే మార్గం. ఒక వ్యక్తి తన యొక్క భావాన్ని తన భాష ద్వారానే వ్యక్తపరచుకోగలదు. ఈ విధంగా భాష అనేది వ్యక్తి యొక్క అస్తిత్వాన్ని తెలియచేస్తుంది. ఇంత పెద్ద సువిశాలమైన ప్రపంచంలో మనిషి యొక్క పరిస్థితి ఏమిటి? నీవు ఎక్కడి వాడివి? నీ అడ్రస్ ఏమిటి అనేది తెలుసుకొనడానికి అతని భాష, అతను పాటించే సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నడవడి, కట్టుబాట్లు వంటి వాటితోనే అతని యొక్క పరిస్థితి తెలుస్తుంది తప్ప ఈ భాషకు గుర్తింపే లేనప్పుడు, ఈ భాష అనేది ఎటువంటిదో తెలియనప్పుడు నీ యొక్క ఆచారవ్యవహారాలే తెలియనప్పుడు ఇంత పెద్ద ప్రపంచంలో నీ యొక్క అస్తిత్వాన్నే కోల్పోతామనే విషయాన్ని మనందరం మరచిపోకూడదని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ విషయాలు ఎందుకు చెబుతున్నానంటే అధ్యక్షా, చాలా మంది ఈ రోజుల్లో వివిధ కారణాల మూలంగా ఈ భాషకున్న ప్రాధాన్యతను గుర్తించకుండావున్నారు. ఈనాడు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాలను ఒకసారి గమనించినప్పుడు ఎన్నో సాంకేతిక విప్లవాలు వచ్చాయి. ఆధునిక సాంకేతిక విప్లవాల యుగంలో మనం నడుస్తున్నాము. ప్రపంచమంతా గ్లోబలైజేషన్ వచ్చింది. మనకు అందనంత ఎత్తులోవుందనుకున్న టెక్నాలజీ ఈ రోజు మనకు అందుబాటులోకి వచ్చింది. అలాంటి ఆధునిక సాంకేతిక విప్లవంలో మనిషి యొక్క భాష అనేది విలవిలలాడుతున్నది .ఆ భాష నిలబడే పరిస్థితి లేదు. ఇక్కడ సాంస్కృతిక దాడులు జరుగుతున్నాయి. భాషాపరమైన దాడులు జరుగుతున్నాయి. అలాంటి సందర్భంలోనే నీ భాషను, నీ సంస్కృతిని, నీ సాంప్రదాయాన్ని కాపాడుకోలేక పోయినట్లయితే ఇంత పెద్ద సువిశాల ప్రపంచంలో నీ వ్యకిత్వాన్ని కోల్పోయే ప్రమాదముందని చెప్పడానికే ప్రయత్నం చేస్తున్నాను. కనుక దాని పట్ల మనిషి ఎంతో కొంత ఆలోచన చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. అధ్యక్షా, ఆ రోజు పెద్దలందరూ అలోచన చేసి మనకు అనాడు ఒక రాష్ట్రం వుండాలని కొన్నిటినీ శాక్రిఫైస్ చేశారు. ఆనాడున్న ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారు రేపు ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే తన పదవి పోతుందని తెలిసి కూడా ఆయన దానికి ఒప్పుకొన్నారు.ఆనాటి పెద్దలు అనేక ఒడంబడికలు చేసుకొని తెలుగు వారినంతా ఒకే తాటికి చేర్చాలనే సత్సంకల్పంతో ఆ విధంగా చేశారు. ఆవిధంగా చేసిన తరువాత, ఒక ఉమ్మడి కుటుంబంలాగా కొని దశాబ్దాలు కొనసాగిన అనంతరం, ఏదో కొద్దిమంది వ్యక్తులు ఇంతమంది ప్రజలు ఒకే భాష మాట్లాడే వారందరినీ ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేసిన తరువాత సహజంగానే వారిలో ఆశలు ఏర్పడతాయి. ఎక్కడా లేని ప్రగతిని సాధిస్తామనే ఆశతో ఇన్ని రోజులుగా కోల్పోయిన వాటన్నింటిని సాధించుకుంటామనే ఆశతో ముందుకు వచ్చారు. కాని

ఆ ఆశలన్నీ నెరవేరలేదు. వాటికి అనేక విధాలైన ఆటంకాలను మనం చూస్తున్నాము. రాష్ట్రమయితే ఏర్పాటు చేసుకున్నాము. భౌగోళికంగా సరిహద్దులను తెచ్చుకోగలిగామే కాని మనసులు మాత్రం ఇంకా కలవలేకపోతున్నాయి. ఇప్పటికి కూడా ఒకరిపై ఒకరికి అనుమానాలు, వివక్షతకు గురవుతున్నామన్న బాధ చాలామందిలో వ్యక్తమౌతున్నది. ఈనాడు చూస్తే ఇదే హౌస్‌లో మేం బాయ్‌కాట్ చేస్తున్నామని చెప్పి వెళ్లిపోయారు టి ఆర్ ఎస్ సభ్యులు. అనేక ఉద్యమాలు వచ్చాయి వస్తున్నాయి. ఇంతకుముందు 1969లో వచ్చింది. 72లో వచ్చింది. ఆ విధంగా మేము రాష్ట్రం నుండి విడిపోతామని ప్రజల్లో కూడా ఆలోచన వస్తున్నది. ఇవి ఎందుకు వస్తున్నాయో. ఒకసారి ఆలోచన చేయవలసిన అవసరముంది. అధ్యక్షా, వ్యక్తులను తప్పు పట్టడం కాదు. రాజకీయాల్లో అనేక విధాలుగా సాధించుకోవాలన్న తపన వుంటుంది. కనుక స్వార్థపరులు చేసే కార్యక్రమాల మూలంగానే ప్రజలు నమ్మి వారి వెంట పడతారన్నది పొరపాటు. కొన్ని బలమైన కారణాల వల్ల ప్రజల్లో వచ్చే బాధలను ఉద్యమ రూపంలో తీరుస్తామంటూ ఎవరో కొందరు నాయకులుగా ఉద్భవిస్తుంటారు. కనుక ప్రజల్లో వచ్చే ఆ విధమైన బాధలకు గురిచేసే అలాంటి కార్యక్రమాలను అటెండ్ చేసేవరకు అలాంటి సమస్యలు వస్తూనే వుంటాయని నేను ఈ సందర్భంగా అందరికీ చెప్పదలచుకున్నాను. కాబట్టి దాని గురించి ఆలోచనచేయాలని మీ అందరికీ తెలియజేస్తున్నాను. అనేక ఒడిదుడుకులను మనం చూశాము. మీరూ చూశారు. అధ్యక్షా ,రాష్ట్రంలో 1982 వరుకు ఒకే ఒక్క పార్టీ, అదీ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండేది. ఏకచ్ఛత్రాధిపత్యం వుండేది. ఏది చేసినా, ఎలాంటి అపోజిషన్ వుండేది కాదు. ఆ రోజుల్లో తెలుగు ప్రజలందరూ ఆ పార్టీని నమ్ముకొని వుండే సందర్భంలో వారు అనేక విధాలుగా పరిపాలించారు. ఆ రోజుల్లో నేను కూడా చూశాను. అధ్యక్షా! కనీసం పార్లమెంటు సభ్యుడెవరో కూడా గ్రామాల్లో తెలిసేది కాదు. శాసన సభకు ఎవరు టికెట్ తెచ్చుకున్నారో కూడా తెలిసేది కాదు. టికెట్ వస్తే చాలు ఏదో ఒక గుర్తు పై విశ్వాసంతో ఓట్లు వేసి ఆ రోజుల్లో గెలిపించారు. కాని అనుకున్నంత ప్రగతి మాత్రం సాధించలేపోయాము. అనేక విధాలుగా వివక్షతకు, ఇబ్బందులకు గురికావడమే కాకుండా తెలుగువారి ఆత్మగౌరవం ఇబ్బందుల పాలవుతున్న పరిస్థితిని, రాజకీయాలను మనం చూశాము. అప్పుడే మహానుభావుడు ఎన్.టి.రామారావుగారు రంగ ప్రవేశం చేయడం ఆ తరువాత వచ్చిన రాజకీయ పరిణామాలను మనం చూశాము. అనేక సాంఘిక,రాజకీయ మార్పులకు పునాది వేసినవారు ఆ మహానుభావుడు ఎన్.టి.రామారావుగారనే సంగతిని మనం మరచిపోవద్దని తెలియజేస్తున్నాను. ఆ రోజుల్లో ఎన్నో కారణాల మూలంగా అనేక విధాలుగా ఎంతో కొంత మాలాంటి వ్యక్తులకు, అనేక సామాజిక వర్గాలకు రాజకీయంగా ముందుకు తీసుకొచ్చిన మహానుభావుడు. ఆ రోజుల్లో అనేక రాజకీయ కుటుంబాలలో వున్న సోషల్ స్ట్రక్చర్‌లోనూ, పొలిటికల్ స్ట్రక్చర్‌లోనూ పెనుమార్పులు తీసుకొచ్చిన మహానుహాభావుడు ఎన్.టి.రామారావు గారు. గంభీరమైన నిండు తెలుగు జాతికి ఒక గుర్తింపును తెచ్చిన మహానుభావుడు ఎన్.టి.రామారావుగారు. వారి నాయకత్వంలో మనం అనేక విధాలుగా ముందుకు వెళ్లాం. అభివృద్ధి కార్యక్రమాలన్నవి నిరంతరంగా కొనసాగాలి. నిజానికి ఆ విధంగా అభివృద్ధి కార్యక్రమాలు

జరుగుతున్నాయా? అని శాసనసభ్యులమైన మనమందరమూ ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరుతున్నాను. **ఈరోజు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నాం. ఇదే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి సమాన హక్కుందని మన రాజ్యాంగం చెబుతోంది. రాజ్యాంగంలోని మొట్టమొదటి పేరాలోనే వ్రాసుకున్నాం, ఈరోజు నుంచి ఈ దేశంలో రాచరికాలు లేవు, బానిసత్వ పరిపాలన ఉండదని.** We, the soveregin people of India, మాకు మేమే రాజ్యాంగం వ్రాసుకున్నాం, మా ప్రతినిధుల ద్వారా పరిపాలన చేసుకుంటామని చెప్పి రాజ్యాంగంలో వ్రాసుకున్నాం. కాని నిజమైన ప్రాతినిధ్యం మనం ఇప్పటికి కూడా ఇవ్వలేకపోతున్నాం. ఇప్పటికీ ఇంకా 70 కులాల వారికి ఈ శాసనసభలో అడుగుపెట్టే అవకాశామే రాలేదంటే మన ప్రజాస్వామ్యం ఎంత నిండుదనంతో ఉందో ఒకసారి ఆలోచించాలి. పేద ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. నిండు ప్రజాస్వామ్యమని చెప్పబడే మన వ్యవస్థలో ప్రతినిధులుగా ఉండే అవకాశం లేని పరిస్థితులు కూడా ఉన్నాయనే విషయాన్ని మరచిపోవద్దని మనవి చేస్తున్నాను. మన వ్యవస్థలో డిఫెక్టివ్ ప్లానింగ్ ఉంది. ముఖ్యమంత్రిగారు, అదే విధంగా ఇంతకు ముందు మాట్లాడిన పెద్దలు కూడా చెప్పారు, మనం చాలా ప్రోగ్రెసివ్‌గా అనేక రంగాలలో ముందుకు వెళ్లి ప్రగతి సాధించామన్నారు. You compare with any country, భారతదేశంతోపాటు యాభై ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన ఏ దేశంతో మనం పోల్చుకున్నా, వాళ్లు మనకంటే పదిరెట్లు ముందుకెళ్లారు. మనం మాత్రం ఇక్కడే ఉండిపోయాం, దీనికి కారణం డిఫెక్టివ్ ప్లానింగ్, డిఫెక్టివ్ రెప్రజెంటేషన్. చిత్తశుద్ధితో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు కరువు కావడం, స్వార్థపరులైన వ్యక్తులు ఈ శాసనసభలో ప్రవేశించడం వల్లే ఇటువంటి పరిస్థితులు వచ్చాయనే సంగతిని మనం మరచిపోవద్దు. మనం ప్రజలను కేవలం ఓటర్లుగా మార్చేశాం, వారి ఓట్ల కోసమే మనం ప్రజాప్రతినిధులుగా పని చేస్తున్నాం, ఓట్ల కోసమే ప్రభుత్వాలు పని చేస్తూ చేసుకుంటూ ముందుకు పోతున్నాయే తప్ప ప్రజలనే వారు మనుష్యులు, వారికి అవసరాలు, అభీష్టాలుంటాయి, వాటికి అనుగుణంగా పనిచేసుకుంటూ పోవాలనే స్పృహ లేకుండా పోయింది. ప్రజల అవసరాలకు, అభీష్టాలకు అనుగుణంగా పని చేసుకుంటూ పోయే వ్యక్తులను ఇప్పటికీ మనం ప్రొడ్యూస్ చేయలేకపోయామన్నది వాస్తవం, ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా అది మాత్రం వాస్తవం. ఆ వాస్తవిక పరిస్థితులను మరవకూడదని తెలియజేస్తున్నాను.

ప్లానింగ్ అన్నది in totality ఉండాలి. మేము ప్రాజెక్టులు కడుతున్నాం, దాన్ని మీరు వ్యతిరేకిస్తున్నారనే భావన కలుగజేస్తున్నారే అది తప్పు. ప్రాజెక్టులు కావాలి, కాకపోతే మీకున్న బడ్జెటులో సక్రమంగా అన్నీ జరగాలి. మనం ఇప్పుడు ఏ దశలో ఉన్నాం, ఏ యుగంలో ఉన్నామనే విషయాన్ని కూడా ఒకసారి ఆలోచన చేయండి. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఒకవేళ పని చేయకపోయినట్లయితే we will be missing another revolution అనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఈరోజు టెక్నలాజికల్ రెవల్యూషన్ జరుగుతోంది ఈనాడు మొట్టమొదటిసారిగా ప్రపంచ దేశాలన్నీ కూడా భారతదేశం వైపు చూస్తున్నాయంటే దానికి కారణం ఇక్కడ ఉన్న హ్యూమన్ రిసోర్సెస్. ప్రపంచంలో ఏ దేశంలో

లేనంతగా యువత మన దేశంలో ఉన్నారు. మొత్తం ప్రజానీకంలో 75 శాతం మంది 25 సంవత్సరాల వయస్సు గల యువతవున్న దేశం మనది. అలాంటి యువతరాన్ని ఏవిధంగా ఉపయోగించుకోవాలి, హ్యూమన్ రిసోర్సెస్‌ను ఏవిధంగా వాడుకోవాలి, ఈ పోటీ ప్రపంచంలో మనం బ్రతకాలంటే చేయవలసిన కార్యక్రమాలేమిటో ఆలోచన చేయండి. మనకు తోచింది చేయడం, ప్రజలకు అర్థంగాకుండా కార్యక్రమాలు, పథకాలు చేపడుతూ ఏ పేరు ఇష్టమైతే ఆ పేరు పెట్టడం సరైనది కాదు. ప్రజాసరళిని ఆలోచన చేయండి, వారిని మెప్పించే ప్రయత్నం చేసినట్లయితే మనం నాయకుల మనిపించుకుంటాం. లీడర్‌కు ఎప్పుడూ కూడా దూరదృష్టి ఉండాలి. భవిష్యత్తు గురించి ఆలోచన చేయాలి. అవసరమైతే కఠినమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలను ఒప్పించే ధైర్యం, సాహసం ఉండాలి, ఆ విధమైన లక్షణాలు ఉన్న వాడే లీడర్ అవుతాడే తప్ప ఏదో ప్రజల మెప్పు కోసమో, వచ్చే ఎన్నికలలో ఓట్ల కోసమో, వారి అవసరం కదా అని చాక్లెట్లు, పిప్పరమెంట్లు, పప్పు బెల్లాలు పంచితే సంతృప్తి పడతారని పంచుకుంటూ పోతే మనల్ని స్టేట్స్‌మెన్ అనరు. ఏదో నాలుగు కాలాలపాటు అధికారంలో కొనసాగడానికి ప్రయత్నం చేసే వ్యక్తులుగానే మన చరిత్రలో మిగిలిపోతామే తప్ప మరొకటి కాదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఆ దిశలో మీరు ఆలోచన చేయండి.

అన్నింటికంటే ప్రధానమైన విషయం - మీరు తెలుగు జాతికి తల ఒంపులు తెచ్చే ప్రయత్నాలు చేయవద్దని మనవి చేస్తున్నాను. మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా కేంద్ర ప్రభుత్వం దగ్గర 70 శాతం నిధులు కేంద్రీకృతమై ఉంటాయి. వారు తీసుకునే నిర్ణయాల మీదే ఒక రాష్ట్రాభివృద్ధి ఆధారపడి ఉంటుందనే విషయం మనకందరికీ తెలుసు. అలాంటి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి, అక్కడ మన పలుకుబడి నుపయోగించి రాష్ట్రంలో కార్యక్రమాలు చేపట్టకపోయినట్లయితే, మనకున్న పరిమితమైన బడ్జెట్‌లో, లిమిటేషన్స్‌లో ఈ రాష్ట్రాన్ని ఎక్కడికో తీసుకెళతామనుకుంటే అది భ్రమ తప్ప మరొకటి కాదు. ఇప్పటికే మీ ప్రభుత్వం వచ్చి 18 నెలలు పూర్తయింది. చాలా విషయాలు మీరు మరచిపోయారు. ఇప్పటికీ అపోజిషన్‌లో ఉన్నట్లుగానే మీరు మాట్లాడుతున్నారు, వాగ్దానాలు చేస్తున్నారు. మాలాంటి వారు ఎవరు మాట్లాడినా ఎదురు దాడి చేస్తున్నారనే తప్ప మీలో మీరు సరిజేసుకుని, చెప్పిన మాటలను నిలబెట్టుకోవడానికి చేపట్టవలసిన కార్యక్రమాల గురించి నిజాయితీగా కూర్చుని ఇప్పటికీ ఆలోచించలేకపోతున్నారు, ఇది చాలా దురదృష్టకరమని తెలియజేస్తున్నాను. It should be democratic government. ఆవిధంగా ఇప్పటివరకూ మీ పాలనలో కనిపించడం లేదు. కనీసం full-fledged cabinet ను ఏర్పాటు చేసుకోలేకపోతున్నారు. పూర్తి స్థాయిలో కేబినెట్‌ను ఏర్పాటు చేసుకోండి, అనుభవజ్ఞులైన వ్యక్తులున్నారు, ఏవిధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలో అందరూ కూర్చుని ఆలోచించండి.

సార్, నాకంటే ముందుగా మాట్లాడిన సభ్యులు, ముఖ్యమంత్రిగారు చాలా విషయాలు మాట్లాడారు. స్వర్ణోత్సవాల సందర్భంగా వారు ఆవిధంగా మాట్లాడుతారని నేను ఎక్స్‌పెక్ట్ చేయలేదు. ప్రపంచంలోని 150 దేశాల కంటె అత్యధిక సంఖ్య ఉన్న ఎనిమిది కోట్ల మంది తెలుగు ప్రజానీకం

ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయం ఇది. Eight crores is not a small number. ఎనిమిది కోట్ల ప్రజలకు సంబంధించిన విషయంలో, వీళ్లందరూ కూడా అనేక సంవత్సారాల తర్వాత ఒక దగ్గర చేరిన శుభసందర్భరంలో, సభలో వారి ఔన్నత్యం గురించి, మన భాష గురించి, జాతి గురించి, మనం సాధించిన ప్రగతి గురించి, భవిష్యత్తులో మనం చేపట్టవలసిన కార్యక్రమాల గురించి మనమందరమూ ఏకంగా మాట్లాడవలసింది తప్ప మీరేదో చేశారు, మేమేదో చేశాం, మీ టైములో ఇంత జిడిపి వుంది, మా టైములో ఇంత జిడిపి వుందని మాట్లాడారు. ఇవి రోజూ ఉన్నవే గదా, జిడిపి, ఎడిపి గురించి మాట్లాడాలంటే మాకు సమయం ఇస్తే గంటల తరబడి మాట్లాడుతాం. మౌలికంగా ముందుకు పోయే ప్రయత్నం మీరు చేశారు, దాని గురించి కొన్ని విషయాలైనా చెప్పకపోయినట్లయితే వాటి గురించి ప్రస్తావన చేయకపోయినట్లయితే ప్రజానీకం నన్ను తప్పుబట్టే ప్రమాదం ఉంటుందనే ఉద్దేశ్యంతోటే దాని గురించి మాట్లాడుతున్నానే తప్ప మరొకటి కాదు. మీరు రెండు నిముషాల సమయం ఇస్తే తెలుగు భాష గురించి, సంస్కృతి గురించి, సంప్రదాయాల గురించి, తెలుగు జాతి గురించి మాట్లాడాలనుకున్నాను, కాని వాళ్లు వేరే విషయాలు ప్రస్తావిస్తూ నన్ను కూడా అందులోకి తీసుకెళ్లారు. మీరు పోతున్న మార్గం మంచి మార్గం, ఆ మార్గాన్ని కాస్త ముందుకు తీసుకపోండి, ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా మరో మూడు సంవత్సరాల పైన మీరు అధికారంలో ఉంటారు.

అధ్యక్షా! ఇప్పుడున్న రోజుల్లో ప్రతిరోజు కూడా ముఖ్యమైనదే. అనేక విధమైన పరిణామాలు చేసుకుంటున్నాయి. మీకు అనేక అవకాశాలు వస్తున్నాయి. అదే విధంగా చాలెంజెస్ కూడా వస్తున్నాయి. మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం, రైతాంగ ప్రభుత్వమని చెప్పుకుంటున్నారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన తర్వాత ఒకసారి రెవ్యూ చేసుకోండి. రైతుల్లో పెను మార్పులు తీసుకొచ్చే కార్యక్రమాలు మీరు పెద్దగా తీసుకొస్తారని నేను అనుకోవడం లేదు. దానికి మీ శక్తి సరిపోతుందనుకుంటే అది మీ భ్రమ అవుతుంది. అది భవిష్యత్తులోనైనా తెలుస్తుంది. స్పష్టమైన విధానంతో మీరు ముందుకు పోలేకపోతున్నారు. కనీసం ఇప్పటికైనా స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్ళమని చెబుతున్నాను. ఈ రోజు సెంట్రల్ స్కీమ్స్ అనేకం ఉన్నాయి. వాటిని రాష్ట్రానికి తీసుకురండి. ఇక్కడి తెలుగువారు ఇచ్చిన అవకాశం మూలంగానే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. కాని దురదృష్టం, సెంట్రల్ స్కీంలను రాష్ట్రానికి తీసుకురాలేక పోతున్నారు. ప్రాజెక్టులు రావడం లేదు. ఇతర రాష్ట్రాల వాళ్ళు తీసుకెళుతుంటే మీరు నిస్సహాయంగా అటూ ఇటూ తిరిగే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సరైన విధంగా స్పందించి, మనకు రావలిసిన ప్రాజెక్టులు వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నాను. అధ్యక్షా! ఎక్కువ సమయం ఇచ్చారు. సార్, ఇప్పుడు మనకున్న పరిస్థితిలో I will take four to five minutes times. అంతకంటే ఎక్కువ తీసుకోను. కొత్త ప్రభుత్వం వచ్చినపుడు అంతకంటే ముందుగా కంటిన్యుయేషన్ లో వస్తున్న కార్యక్రమాలను తీసుకుంటూనే కొత్తగా మరికొన్ని కార్యక్రమాలను ప్రవేశ పెట్ట వలిసిన అవసరాలు ఏర్పడతాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడినపుడు ప్రజలు సహజంగానే ఊహించుకుంటారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం బ్రహ్మాండంగా పనిచేయాలని కోరుకుంటారు.

ఈరోజు డ్వాక్రా గురించి మీరు మెన్షన్ చేశారు. I am really very happy. మహిళల్లో స్వావలంభన తీసుకుని రావాలని మేము ఎన్నో విధాలుగా కృషి చేసి చేపట్టిన మహా ఉద్యమం అది. దానిని మీరు ఇంకా స్ట్రెంథెన్ చెయ్యండి . ఇలాంటి కార్యక్రమాలను మీరు ఇతర రంగాలలో కూడా తీసుకునిరండి. ఆ విధంగా మీరు ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకునిపోండి. ఇందాకా పెద్దలు రాజేశ్వరరావు గారు చెప్పినట్లుగా ఈనాడు చేతి వృత్తుల వారి పరిస్థితి చాల దయనీయంగా ఉంది. ఇంతపెద్ద స్వతంత్ర భారత దేశంలో వాళ్ళంతా వలసలు పోయి, కూలీలుగా మారుతూ ఏ విధంగా చేనేత కార్మికులు అన్నమో రామచంద్రా అంటున్నారో ఒకసారి మీరు ఆలోచించాలని తెలియచేస్తున్నాను. వాళ్ళకు క్యాపిటల్ లేదు. You create something for them.

ఏదేమైనా 49 సంవత్సాలు పూర్తి చేసుకుని, 50 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాము. అటువంటి సందర్భంలో తెలుగు వారంతా ఐకమత్యంగా కలిసిమెలిసి ఉంటున్న రోజుల్లో కనీసం భవిష్యత్తులో ప్రాంతాల వారీ వివక్షత లేకుండా సమైక్యంగా ఈ రాష్ట్రం ముందుకు వెళ్ళేటట్లుగా ముందు అధికారంలో ఉన్న వ్యక్తులు దూరదృష్టితో పోనట్లయితే ఈ యొక్క వేర్పాటువాదానికి దోహదపరచే విధంగా మీ చర్యలు ఉన్నట్లయితే, ఈ తెలుగు ప్రజలు అనేక సంవత్సరాలుగా ఎంతో నమ్మకంతో విశ్వాసంతో, ఆశతో ఒకటైన రోజుల్లో మళ్ళీ ఏదో రకంగా దీనిని ఛిన్నాభిన్నం చేసిన వాళ్ళమవుతాం.

సమస్య పరిష్కారానికి రాజకీయ ఎత్తుగడలు పనికిరావు. అధ్యక్షా! మనమేదో ఎత్తుగడలు వేసి, వ్యక్తులను కిందా మీద పడేయవచ్చు. కాని ఎత్తుగడలు ఎల్లవేళలా పనికిరావు. ఎత్తుగడలు కన్నా చిత్తశుద్ధి అవసరం. లేవనెత్తిన అంశాలను మనం అటెండ్ కావాలి. అలా లేవనెత్తిన అంశాలను మనం పరిష్కరించగలగాలి. అప్పుడే మన హుందాతనాన్ని మన చిత్తశుద్ధిని ప్రజలు నమ్ముతారు తప్ప, మనమేదో ఎత్తుగడలతో నలుగురు మనుష్యుల మధ్య సమస్యలు సృష్టించినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. స్వార్థ పూరితమైన వ్యక్తులు చాలా మంది ఉంటారు. అలాంటి వారిని మనం వశపరచుకోవడమో, లేకపోతే ఇంకా ఏదో చేసేయడమో అది పెద్ద సమస్య కాదు. భారత రాజకీయాలలో మనం అనేక సంఘటనలు చూశాం. కాని సమస్యలను అదే విధంగా మీరు వదిలిపెట్టేసి, మీరు ప్రయత్నాలు చేసినట్లైతే భవిష్యత్తులో చరిత్ర మనల్ని క్షమించదు. అటువంటి పరిస్థితి కలుగ చేయవద్దని నేను ముఖ్యమంత్రిగారికి, ముఖ్యంగా ఈనాడు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి విన్నవించుకుంటూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన పెద్దలకు, అందరికీ ధన్యవాదాలు తెలియచేస్తూ, మరొక్కసారి స్పీకర్ గారికి ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

## రైల్వే బడ్జెట్ రాష్ట్రానికి మొండి చేయి

27-2-2007

స్పీకర్ సర్, నిన్న కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైల్వే బడ్జెట్‌లో మన రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. ఒకటి రెండు సంవత్సరాల నుంచి రైల్వే బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరుగుతోంది. ఏవిధమైన పరిస్థితి అంటే, మేము చెప్పిన సజెషన్సును కూడా ఇన్‌కార్పొరేట్ చేస్తే బాగుంటుంది. దాని కోసం ఎలాబరేట్ చేయదలచుకున్నాము. 32 కొత్త రైల్వే లైన్సు పెడితే అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా మనకు ఇవ్వలేదు. ఏదో గరీబీ అంటూ సికిందరాబాదు నుంచి యశ్వంతపూర్‌కు, అది కూడా 3 రోజులకోసారి, అది తప్ప మరింకేం ఇవ్వలేదు. కేటాయింపులు చూస్తే ఎంత నిర్లక్ష్య ధోరణో అర్థం అవుతుంది. మునీరాబాద్-కొత్తపల్లికి కేవలం ఒక లక్ష రూపాయలు కేటాయించారు. ఏదో బిచ్చం పెట్టినట్టు ఒక లక్ష రూపాయలు ఇచ్చారు. ఈ పరిస్థితులలో ఉంది రాష్ట్రం. మన రాష్ట్ర ప్రజలంటేనే ఒక నిర్లక్ష్య ధోరణిలో రైల్వే పని చేస్తోంది. ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కావాలని చాలా సంవత్సరాల నుంచి డిమాండు ఉంది. 5 కోచ్ ఫ్యాక్టరీలలో 3 ఇచ్చారు. ఇంకో 2 వచ్చే అవకాశం ఉంది. కోచ్ ఫ్యాక్టరీ ఖాజీపేటలో పెట్టాలని తీర్మానం పొందుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాను. 30 మంది కాంగ్రెస్ పార్టీ ఎం.పి.లు ఉన్నారు. వాళ్లు ఏం చేస్తున్నారు? ఆంధ్రప్రదేశ్ ఇంత పెద్ద రాష్ట్రానికి అన్యాయం జరుగుతూ వుంటే కనీసం వీళ్లు పోయి, మాకు ఇది కావాలి అని చెప్పజాలని దౌర్భాగ్య పరిస్థితిలో కాంగ్రెసు పార్టీ ఉంది. ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకోవాలి. తీర్మానం పెట్టడమే కాకుండా ఆల్ పార్టీ డెలిగేషన్‌ను ముఖ్యమంత్రిగారు తీసుకువెళ్లాలి. Are we not part of this country ? ఇంత నిర్లక్ష్య ధోరణి రైల్వే బడ్జెట్‌లో కనిపిస్తూవుంటే, ఆంధ్రప్రదేశ్ అనేది ఒకటి వుందని, దానికి కేటాయింపులు కావాలని చెప్పలేకపోతే, ఇది ఏ రకంగా వినే ప్రభుత్వం? సోనియా గాంధీ గారు చెబితే గాని నోరు తెరవరు, మేము చెబితే లెక్క పెట్టరు. ఈ నిర్లక్ష్య ధోరణి వల్ల రాష్ట్ర ప్రజలందరికీ అన్యాయం జరుగుతోంది. ప్యానల్ స్పీకరు గారూ, ఈ రోజు జీరో అవర్లో రైల్వే బడ్జెట్‌లో మన రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి మా పార్టీ తరపున మేము ప్రస్తావన తీసుకువచ్చాము. ప్రభుత్వం కూడా ఒక తీర్మానం రూపంలో రావడం సంతోషం. అయితే ఒక్క

విషయం మాత్రం సీరియస్‌గా అబ్జెక్షన్ చెప్పదలచుకున్నాను. తీర్మానంలో మొదటి వాక్యం- "This House resolves to congratulate" అని అన్నారు. అలా ఏదైతే చెబుతున్నారో, అది తీరని విచారం తెలియజేస్తున్నది అనే పదాలతో సబ్‌స్టిట్యూట్ చేయాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. చాలా సీరియస్ అంశం. దేశంలో ఇంత పెద్ద రాష్ట్రం మనది. ఈ రాష్ట్రానికి సంబంధించి, ఇది మొదటిసారి కాదు. గత 3 సంవత్సరాల నుంచి కేంద్రంలో యు.పి.ఎ. గవర్నమెంటు వచ్చేక రైల్వే మినిస్టరు గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చేసరికి ఇక్కడ జరుగుతున్న ప్రాజెక్టులకు కేటాయింపులు చేయకుండా, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా పక్షపాతధోరణితో వ్యవహరిస్తున్నారు. అధ్యక్షా, ఆర్థిక వ్యవస్థలో రైల్వేల పాత్ర చాలా కీలకమైనదని నేను ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కమ్యూనికేషన్ సిస్టం చాలా ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తున్నది. గూడ్స్, పాసింజర్స్ మూవ్‌మెంటు విషయంలో రైల్వేలు చాలా కీలకమైన భూమిక వహిస్తున్నాయి. అటువంటి రంగానికి మన రాష్ట్రంలో సరైన కేటాయింపులు తెచ్చుకోకపోవడం చాలా దౌర్భాగ్యం. చాలా దురదృష్టకరం. కనుక ఈ హౌస్ ఖచ్చితంగా తీవ్ర నిరసన తెలియజేయాలి. అదే విధంగా కేంద్ర ప్రభుత్వానికి తన బాధ్యతను గుర్తు చేయాలి. ఆ విధమైన పద్ధతులలో తీర్మానం ఉండాలని ఖచ్చితంగా చెప్పదలచుకున్నాను. ఒకసారి ఆలోచించండి. హైదరాబాదులో జరుగుతున్న ఎంఎంటిఎస్ గురించి ప్రస్తావన లేదు. ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ గురించి గాని, ఈ ప్రాజెక్టులకు నేను ఉదయం చెప్పినట్లు, ఎంతో వెక్కిరించినట్లు, మునీరాబాద్-కొత్తపల్లికి లక్ష రూపాయలు కేటాయించారు. అది కాగితాలకు, టైపింగ్ ఖర్చులకు కూడా సరిపోదు. వెక్కిరిస్తున్నట్లు కేటాయింపులు చేశారు. కనుక దీని పైన సీరియస్‌గా ఉండాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ యొక్క అసెంబ్లీలో తీర్మానం చేయడమే నిజంగా బాధాకరమైన విషయం. కేంద్రంలో బడ్జెట్ కేటాయింపుల కోసం ఈనాడు రైల్వేలో మనకు కావలసిన వాటా కావాలని హౌసులో తీర్మానం చేసే పరిస్థితి రావడమే అందరికీ తలవంపులు తెచ్చే పరిస్థితి. కేంద్ర ప్రభుత్వానికి తన బాధ్యతలను ఈ రోజు హౌస్ ద్వారా తెలియజేసే పరిస్థితి రావడమే తీరని బాధకరం. ఇది కేంద్రం బాధ్యతా రాహిత్యం. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేక, మీ ఎంపిలు, మినిస్టర్లు అక్కడ ఉన్నారు. పక్కనున్న తమిళనాడు రాష్ట్రంలో నిధులు తీసుకుపోతున్నారు. మీరేం చేస్తున్నారో అర్థం కావడం లేదు. కనుక కాంగ్రెస్ ఎప్పుడు కేంద్రంలో అధికారంలోకి వచ్చినా, రాష్ట్రానికి అన్యాయం జరుగుతూనే ఉంటుంది. ఆ విధమైన అన్యాయం రైల్వేలో కూడా జరిగింది. ఏదైతే ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన అభినందన అనే పదం తీసివేసి, తీవ్ర నిరసన తెలియజేయాలి. The way they introduced the Railway Budget ఆ విధంగా ప్రాజెక్టులు చేయకుండా అన్యాయం చేసినందుకు నిరసన తెలియజేస్తూ వాళ్ల బాధ్యతను గుర్తెరిగే విధంగా, బాధ్యతతో వ్యవహరించే విధంగా ఈ తీర్మానం, ఒక హెచ్చరికగా ఉండాలి తప్ప ఏ మాత్రం వదల కూడదనే విషయాన్ని తెలియజేస్తున్నాను.

# సంక్షేమ రంగం

జనాభాలో అత్యధిక శాతం బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు, వీరి సంఖ్య దాదాపు 80% గా ఉంటుంది. వీరిలో అధికశాతం నిరుపేదలు, దిగువ మధ్యతరగతి వారు. మన రాజ్యాంగంలో ప్రభుత్వాల లక్ష్యం సంక్షేమరాజ్యం నెలకొల్పడమని స్పష్టంగా ఉంది. అందువల్ల ఏ ప్రభుత్వ ప్రాధాన్యమైనా.. సంక్షేమరంగంలో అధిక కేటాయింపులు చేసి ఆయా వర్గాలకు విద్య, వైద్యం, గూడు మొదలైన మౌళిక సదుపాయాలు కల్పించడం కావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రయోజనాలను కాపాడాలి.

2004లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ హయాంలో సంక్షేమరంగంలో జరిగిన లోటుపాట్లపై సూటిగా, స్పష్టంగా అనేక సందర్భాల్లో నిలదీయడం ఈ ప్రసంగాల్లో కన్పిస్తుంది.

సామాజిక స్వేచ్ఛను నువ్వు సాధించలేకపోతే, చట్టం కల్పించే స్వేచ్ఛ వల్ల నీకు ఎటువంటి ఉపయోగం ఉండదు - డా॥ బీ.ఆర్.అంబేద్కర్

# బీసీ సంక్షేమం

**26-07-2004**

వెల్ఫేర్ గురించి అందరం చెప్పాము. ముందుకు వచ్చారు. దీనితో డిబేట్ కొంత జరిగింది. దీనిపై కొన్ని ముఖ్యమైన క్లారిఫికేషన్లు ఉన్నాయి. మేము మినిస్టరు వారీగా అడగాలని భావించాము. కానీ అన్ని కలిపివేశారు. మినిస్టరువారీగా అడగమంటారా లేక ఏ మంత్రికి ఆ మంత్రికి అడిగితే 5 నిముషాలలో అయిపోతుంది. మా వరకు సబ్జక్టువైజ్ క్లారిఫికేషన్ అడుగుతాము. గవర్నమెంట్‌లో సీరియస్‌నెస్ కనిపిస్తుంది. 5, 10 నిముషాలలో మొత్తం పూర్తిచేయడానికి ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వం ఎలక్షన్ల తరువాత మొదటి బడ్జెట్ సెషన్‌లో వెల్ఫేర్‌కు సంబంధించిన చాలా విషయాలు మా ముందు పెడతారని ఆశించాము గానీ ఆ విధంగా కాకుండా బిసి వెల్ఫేర్ 15 నిముషాలు అని కాగితం చదివి కూర్చున్నారు. మినిస్టరు వారీగా చూస్తే బ్యాక్‌లాగ్ పోస్టులు 50 వేలు ఉందని మీరు చెప్పారు. అసలు బ్యాక్‌లాగ్ ఎంత? లేటెస్ట్‌గా ఏమన్నా పోస్టులు తీసుకున్నారా? తీస్తే ఎప్పటిలోగా భర్తీచేస్తారు? ఎస్‌సి బ్యాక్‌లాగ్ పోస్టులు గురించి చెప్పాలని కోరుతున్నాను. ప్రైవేటు సెక్టారులో రిజర్వేషన్ కలుగజేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టారు. దీని ప్రోగ్రెస్ ఏమిటి? ఎప్పటిలోగా చేయగలుగుతారు అనేది చెప్పాలని కోరుతున్నాను. అదే విధంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కాంట్రాక్టు విషయంలో గాని, గవర్నమెంట్ ప్రాజెక్టుల విషయంలో గానీ, ఎంకరేజ్ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దానిపై ఏమి చేయబోతున్నారో చెప్పాలని కోరుతున్నాను. అదే విధంగా రజకులు, వడ్డెర కులస్థులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని చెప్పారు. వీటి పరిస్థితి ఏమిటి? చెప్పాలని కోరుతున్నాను. గిరిజన సంక్షేమానికి వచ్చేప్పటికి గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేస్తామని చెప్పారు. దీనిపై చాలా డిమాండ్ ఉంది. వీటి పై ఏమి ఆలోచన చేస్తున్నారు? ప్లెయిన్ ఏరియాలలో ఉన్న గిరిజనుల గురించి ఈ ప్రభుత్వం ఏమి చేస్తుంది? ఐటిడిఏలలో ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఐ.ఏ.ఎస్.

అధికారులను నేరుగా నియామకం చేస్తే బాగుంటుంది, అభివృద్ధి జరుగుతుందని భావిస్తూ, ఆ విధంగా చేయాలని కోరుతున్నాను. రెడ్యానాయక్‌గారు హౌజింగ్ గురించి గొప్పగా చెప్పారు. బడ్జెట్‌లో రూ.700 కోట్లు పెట్టామని అంటున్నారు. హౌజింగ్ లోన్స్ రీపేమెంట్‌కు రూ.358 కోట్లు ఈ బడ్జెట్‌లో ఏర్పాటు చేసారు. అవి పోగా, మిగతా వాటికి మాత్రం సబ్సిడీ ప్రొవిజన్ పెట్టారు. మీరు అన్న విధంగా టోటల్‌గా చేయడానికి ఏవిధంగా ప్లాన్ చేయదలచుకున్నారో చెప్పాలని గౌరవమంత్రి గారిని కోరుతున్నాను. వారు చెప్పిన తరువాత మిగిలిన మినిస్టర్స్‌కు సంబంధించిన అంశాలను అడుగుతాను.

గౌరవనీయులు రోశయ్యగారు వినాలి. మీ ప్రభుత్వంలో మీరు బిసిల గురించి పట్టించుకోకపోగా, మంత్రి పదవి కూడా అవసరం లేదని టిఆర్ఎస్ వారికి అప్పగించారు. వారికి బిసి దొరకలేదు. బిసిల పరిస్థితి అలా వుంది. ఒక్క బిసి మంత్రిలేని పరిస్థితి మొట్టమొదటిసారి రాష్ట్రంలో వచ్చింది. బిసి సమస్యలు తెలిసిన ఒక్క బిసి దొరక లేదా మంత్రి పదవి యివ్వడానికి? ఆ పెద్ద మనిషికి కాగితాలు తప్ప రెండో విషయం తెలియదు. కాగితాలు పక్కన పెడితే, రోశయ్యగారూ, మీరన్నా మా గోడు విని ఏమి చేయదలచుకున్నారో మా చెవిన వేయండి. కనీసం బిసిలలో ఎన్ని కులాలు వున్నాయో వారికి తెలియదు. ఆయన్ను తెచ్చి బిసి మంత్రిని చేశారు. (ఇంటరప్షన్స్)

పరిస్థితి ఈ విధంగా వున్నది కనుక మీరు విని జవాబు చెప్పే పరిస్థితి వుండాలని కోరుతున్నాను. ఇప్పుడు మొత్తం బిసి వెల్‌ఫేర్ బడ్జెట్ తగ్గించారు. జనాభాలో 50 శాతం బిసిలు వున్నారు. వీరు అనేక వృత్తులు చేసుకొని బ్రతుకుతున్నారు. చేతి వృత్తులు దెబ్బతినడం వల్ల గ్రామాలలో పరిస్థితి దారుణంగా వుంది. ఈనాడు రైతుల ఆత్మహత్యలను మనం చూస్తున్నాము. గ్రామాలలో చేతి వృత్తులు కూడా దెబ్బతింటున్నాయి. అందువల్ల గ్రామాల నుండి మేక్సిమం వలసలు పోతున్నారు. నా కాన్‌స్టిట్యుయెన్సీ నుండి హైదరాబాద్ చుట్టుపక్కలకు చేతివృత్తుల వారు పెద్ద సంఖ్యలో వలసలు పోతున్నారు. 'ఆదరణ' గురించి మీరు ఎన్ని విమర్శలు చేసినా, ఆ పథకం ద్వారా కొన్ని టూల్స్ యిచ్చే ప్రయత్నం చేశాము. కొన్ని వేల మందికి పనిముట్లు దొరికాయి. కొంతవరకు ఆధునీకీకరించే ప్రయత్నం జరిగింది. దాన్ని మీరు కొనసాగిస్తున్నారు. ఆధునిక పద్ధతుల్లో చేతి వృత్తుల వారు తమ వృత్తులను చేసుకొని బ్రతకడానికి మీరు చేస్తున్న ప్రయత్నం ఏమీ ఈ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించదు. ఈ విషయంలో ప్రభుత్వం ఏమి చేయబోతోందో తెలియజేయండి. గతంలో కంటే ఇప్పుడు బిసి బడ్జెట్ తగ్గించారు. పోయిన సంవత్సరం బడ్జెట్ కేటాయింపుల కంటే తరువాత మేము పెంచాము. ఈ సంవత్సరం మీరు. రూ. 267 కోట్లు కేటాయించారు. స్కాలర్‌షిప్స్‌తో సహా అన్నీ తగ్గుతున్నాయి. ఈ విషయంలో బయట ఆందోళన వుంది. వాటి పరిస్థితి ఏమిటో చెప్పవలసిందిగా కోరుతున్నాను. వడ్డెర వారిని ఎస్.టి.ల జాబితాలో చేర్చుతామని చెప్పారు. ముదిరాజ్‌లను 'బి' క్యాటగిరీ నుండి 'ఎ' క్యాటగిరీకి మారుస్తామని చెప్పారు. ఆ క్యాటగరైజేషన్ విషయం ఏమిటి? సీయం గారు సభలో వుంటే బాగుండేది. ఆర్థిక

మంత్రిగారయినా జవాబు చెబితే బాగుంటుంది. బిసిలకు కేటాయింపులు తగ్గాయి. ఇంత పెద్ద జనాభాకు రూ. 267 కోట్లు ఏమాత్రం చాలవు. దీనిపైన ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించ వలసిందిగా కోరుతున్నాను. కేటాయింపులు ఇంకా పెంచవలసిన అవసరం వుంది. ఈ విషయంలో ఆర్థిక మంత్రిగారు మాకు ఖచ్చితమైన హామీ యివ్వాలని, దీనికి సంబంధించి ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలని, ఈ బడ్జెట్ కేటాయింపులు ఏమాత్రం సరిగా లేవని తెలియజేస్తున్నాను. మైనారిటీస్ వెల్‌ఫేర్‌కు సంబంధించి ఫైనాన్స్ మినిస్టర్ గారు బడ్జెట్‌కు సంబంధించి క్లారిఫికేషన్స్ అడిగిన సందర్భంగా ఒక మాట చెప్పారు. గతంలో కేటాయించిన దానికంటే మీరు బడ్జెట్ తగ్గించారు అని అడిగితే, ఇన్ కోర్స్ ఆఫ్ టైమ్ మేము పెంచుతాము అని చెప్పారు. ఆ విధంగా ఎంత పెంచదలచుకున్నారు? ఏ క్యాటగిరీలో పెంచదలిచారు? బిసి క్యాటగరైజేషన్ చేసి ముస్లింలను బిసిలలో చేర్చి 5శాతం రిజర్వేషన్ ఇస్తామన్నారు. వారికి ఏ ప్రొవిజన్‌తో స్కాలర్‌షిప్స్ ఇవ్వదలచుకున్నారు? బిసి బడ్జెట్ నుండి ఇస్తారా లేక మైనారిటీస్ బడ్జెట్ నుండి ఇస్తారా? ఫైనాన్స్ మినిస్టర్ గారు చెబితే బాగుంటుంది. మైనారిటీస్ వెల్‌ఫేర్ మంత్రిగారికి ఈ శాఖ కొత్త. అందువల్ల క్లారిఫై చేయవలసిందిగా ఫైనాన్స్ మినిస్టర్ గారిని కోరుతున్నాను. (అంతరాయం) బిసి వెల్‌ఫేర్ శాఖకు బిసి మంత్రి దొరకలేదని మాత్రమే నేను అన్నాను.

స్పీకర్ సార్, గౌరవ మినిస్టర్‌గారు ఒక ప్రస్తావన తీసుకొచ్చారు. వారికి అనుభవం లేదని నేను చెప్పలేదు, వారికి అనుభవం వున్నది. వారు సైనికునిగా వుండవచ్చు, ఒక రైతుగా గ్రీన్ రెవల్యూషన్‌లో పార్టిసిపేట్ చేశానని కూడా చెబుతున్నారు. నేను అనేదేమంటే, వారికి అనుభవం వున్న సబ్జెక్టుకు సంబంధించి మంత్రి పదవి ఇస్తే వారి అనుభవాన్ని ఉపయోగించి ఆ మంత్రి పదవికి న్యాయం చేస్తారు. వారికి బి.సి.ల వెల్ఫేర్ గురించి, బి.సి.ల సమస్యల గురించి తెలియదు. ఒక ఉదాహరణ చెబుతున్నాను. లాస్ట్ టైమ్ ఇదే బి.సి. రిజర్వేషన్ విషయంలో మెడికల్, ఇంజినీరింగ్ సీట్లలో బి.సి.లకు తీవ్ర అన్యాయం జరిగింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించని కారణంగా చాలా అన్యాయం జరిగింది. బి.సి. లకు అప్పుడు బి.సి. మంత్రిగా వున్న మా మిత్రుడు ఇమ్మీడియేట్‌గా ఆ సబ్జెక్ట్ మేటర్ తెలుసుకోగలిగిన ఆయన మా దగ్గరకు వచ్చి, బి.సి.లకు సంబంధించిన విషయంలో ఆఫీసర్స్ మిస్‌లీడ్ చేస్తున్నారని చెప్పి మా సపోర్ట్ తీసుకుని దాన్ని సరిచేయడం జరిగింది. అప్పుడు నాలుగువేల మంది విద్యార్థులకు లాభం జరిగింది. మళ్లీ ఈరోజు ప్రొఫెషనల్ కోర్సు అయిన మెడిసిన్‌లో ఒక పోస్ట్‌గ్రాడ్యుయేట్‌కు అన్యాయం జరిగింది. ఆయనకేమి తెలుసు బి.సి.ల సంగతి? నేను ఏమంటున్నానంటే వారికి అనుభవం వున్న శాఖ ఇప్పించండి. తెలంగాణాలో గడీల సంగతి మాకు తెలియదా? గడీ దగ్గర చెప్పులు విడిచిపెట్టి లోపలికి పోయి వీళ్ల కాళ్లు మొక్కాలి సార్. ఇదీ పరిస్థితి. అటువంటి పరిస్థితుల్లో బి.సి.లకే బి.సి. వెల్ఫేర్ మంత్రి పదవి ఇవ్వాలని చెబుతున్నాను. బి.సి. ల సమస్యలు తెలిసిన వారికే ఈ మంత్రి పదవి ఇవ్వమని చెబుతున్నాను. **ఈ దేశంలో కుల వ్యవస్థ వాస్తవం, ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో, ఈ సమాజంలో కుల వ్యవస్థ వాస్తవం. ఈ కుల వ్యవస్థ**

**మూలంగా ఇప్పటికీ వేల మంది బాధలు పడుతున్నారు. వారి బాధలు తెలిసిన వ్యక్తులకే ఈ బి.సి. వెల్ఫేర్ మంత్రి పదవి ఇవ్వమని కోరుతున్నాను.** లక్ష్మీకాంతరావు గారికి మాకూ ఏమీ లేదు, వ్యక్తిగతంగా మాకు ఆయనతో సంబంధంలేదు. ఆయన న్యాయంగా గుండెమీద చేయి వేసుకొని చెప్పు మనండి whether he is happy to be the Minister of B.C. Welfare. కావాలంటే మంచి మినిస్ట్రీ ఇవ్వండి. కావాలంటే you can make him Home Minister, you can make him Agriculture Minister, we have no objetion. బి.సి.లకు రాష్ట్రంలో సామాజికంగా అనేక సమస్యలున్నాయి. వృత్తి పరంగా చాలా సమస్యలున్నాయి, ఆ వృత్తులపై అవగాహన వుండి, ఆ వృత్తులలో వుండే సమస్యలను తెలుసుకున్న వ్యక్తులను బి.సి. మినిష్టర్‌గా నియమిస్తే బాగుంటుందనే విషయం చెబుతున్నాం తప్ప మరొకటి కాదు. let him do, వారికి అనుభవం వున్న ఫీల్డ్‌లో చేయమనండి. వారు సైనికునిగా పని చేసి వుండవచ్చు, విద్యా సంస్థలు పెట్టవచ్చు, వారిపై వ్యక్తిగతంగా నాకు ఏమి లేదు. (టీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం) ఇప్పటివరకు ఆయనగారు ఒక్క బి.సి. హాస్టల్ కూడా విజిట్ చేయలేదు. దేశంలో ఎన్ని కులాలున్నాయో తెలియదు. ఆయనకు ఏమి సమస్యలు తెలుసు?(అంతరాయం)

Kindly understand me. I want to make it clear to the Hon'ble Minister. It is nothing personal to any one. I am very clear in my mind. It is a political statement I am making. The sincerity of this Government I am not questioning. The sincerity of the Minister I am not questioning This is a social issue. Social clarity should be there. The man who is holding a Ministry should have a clarity about people and people's sufferings. They may give him a good Ministry. I appreciate.

# సంక్షేమ హాస్టళ్ల సమస్యలు

12-11-2007

అధ్యక్షా! ఇది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు సంబంధించిన 8.5లక్షల మంది విద్యార్థులకు చెందిన ప్రశ్న. కనుక గౌరవ ముఖ్యమంత్రిగారు, ఫైనాన్స్ మినిస్టరుగారు సభలో ఉండి జవాబు చెబితే బాగుంటుంది. ఇది ఒక మినిస్ట్రీకి సంబంధించింది కాదు. వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఉన్నటువంటి పరిస్థితి ఎంతో దారుణంగా ఉంది. మేము దీనిని రాజకీయం కోసం మాట్లాడడం లేదు .మానవీయ కోణంలో ఆలోచన చేసి ఆ సమస్యను పరిష్కరించడానికి ఈ ప్రశ్న ఉపయోగపడాలని మేము రెక్వెస్ట్ చేస్తున్నాము. ముఖ్యమంత్రిగారు హౌస్‌లో ఉండి దీనికి జవాబు చెబితే బాగుంటుంది. కాబట్టి మీ ద్వారా కోరుతున్నాను. 5300 హాస్టల్స్‌లో 2000 హాస్టల్స్‌లో త్రాగడానికి నీరు లేదు. మంచినీరు లేకుండా హాస్టల్స్ ఏ విధంగా ఉంటాయో మీరొకసారి చెప్పాలని మంత్రిగారిని కోరుతున్నాను. 1700 బిల్డింగ్స్ అద్దె భవనాలలో ఉన్నాయి. మేము కొన్ని హాస్టల్సు తిరిగి వచ్చాము. ఒక రూమ్‌లో 60 మంది పిల్లలు పడుకొని ఉన్నారు. గొర్రెల మందలోని గొర్రెలు కూడా ఆ విధంగా ఉండవు. 200 మంది పిల్లలున్న హాస్టల్‌లో మేము నైట్ హాల్ట్ చేస్తే రెండే బాత్‌రూమ్‌లున్నాయి. అటువంటి దారుణమైన పరిస్థితులున్నాయి. ఒక్కొక్క పిల్లవాడికి మూడు పూటల భోజనం కోసం రూ.11లు ఇస్తున్నారు. కనీసం ఖైదీలకైనా రోజుకు రూ.35 లు ఇస్తారు. 3 సంవత్సరాలలో ధరలు విపరీతంగా పెరిగి, రేట్లు మొత్తం 300 శాతం పెరిగినా కాని, వాళ్లకు మాత్రం హాస్టల్ యొక్క మెస్ చార్జీలు పెంచడం లేదు. కనీసం 310 మంది పిల్లలు చనిపోయిన చరిత్ర ఎక్కడైనా ఉందా? అది ఎంతటి ఘోరం. అనేక మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. వాళ్లను చూసిన నాధుడు లేడు. ఏ ఒక్క డాక్టరు విద్యార్థులను చెక్ చేసిన సందర్భాలు లేవు. వాళ్లకు పెడుతున్న తిండి ఎంత ఘోరమైనదో ఆలోచన చేయాలి. ముఖ్యమంత్రిగారు రివ్యూ చేస్తూ వారు బాధను వ్యక్తం చేసిన విషయం పేపర్ ద్వారా తెలిసింది. పది బాత్‌రూమ్‌లు పది మంది పిల్లలకు ఒక్కొక్కటి చొప్పున కట్టిస్తున్నామని చెప్పారు. వారికి

ఫెసిలిటీస్ పెంచుతామని చెప్పారు. సమాజంలో మంచిగా బ్రతకాలనే ఆశతో వారు హాస్టల్‌లో చేరుతున్నారు. కొద్దిమందికే హాస్టల్‌లో సీట్లు దొరుకుతున్నాయి. ఈ దేశంలో 40 శాతం ప్రజానీకం అసలు స్కూలుకు వెళ్లడం లేదు. మిగతా వారు చదువుకుంటామని వెళితే వాళ్ల పరిస్థితి ఎంతో దారుణంగా ఉంటుంది. బడ్జెట్ వనరులు లేవా? ఈ ప్రభుత్వం వనరులు ఖర్చు పెట్టలేదా? ఈనాడు బడ్జెట్ రూ.84వేల కోట్లకు పెంచినా సంక్షేమానికి రు.84 కోట్లు తగ్గించి వేశారు. ఇటువంటి పరిస్థితులలో హాస్టల్‌లో ఎలా ఉంటారో ఆలోచన చేయాలి. మేము దేవరకొండలో ఒక నైట్‌హాల్ట్ చేసి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌లో పిల్లల వెంబడి పడుకుంటే ఆ గిరిజన హాస్టల్ లోపల మూడు రోజుల పాటు కరెంటు లేదని తెలిసింది. మేము వస్తున్నామని తెలిసి ఏదో వైరు గుంజి పెట్టారు. చిన్న పిల్లలు ఎక్కడకు పోతారు. తల్లిదండ్రులను వదలి ఎక్కడో అడవిలో ఇలా ఉంటే ఎలాగో మీరే చెప్పండి. ఒక వంట రూమ్, ఒక బాత్ రూమ్ లేదు. ముక్కిపోయిన బియ్యంతో భోజనం పెడుతున్నారు. ఈ విధంగా వెల్ఫేర్ హాస్టల్సును తయారు చేశారు. ఇంత దుర్మార్గమైతే ఎలా? బయట ఉన్న పిల్లలకు స్కాలర్‌షిప్స్ లేవు. వారు చదువుకోడానికి చాలా ఇబ్బందిగా ఉంది. అన్నీ ప్రయివేటు స్కూల్సు ఉన్నాయి. 1060 స్కూల్స్ మూసి వేశారు. 6600 స్కూల్స్ మూసివేయడానికి రంగం సిద్ధం చేశారు. దీనికి ముఖ్యమంత్రిగారు జవాబు చెప్పాలి. వారు ఏ దిశలో ఆలోచన చేస్తున్నారు. మాది ఇందిరమ్మ రాజ్యం అంటారు. ఏదో వెల్ఫేర్ స్టేట్ అంటారు. మంత్రిగారు మాట్లాడుతూ భూమండలంలో ఎక్కడా లేని అభివృద్ధి సాధిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రిగారు ఒక్కొక్క జిల్లాకు హెలికాప్టర్‌లో 20, 30 సార్లు తిరుగుతున్నారు.అంబర్‌పేటలో ఒక హాస్టల్ ఉన్నది. అక్కడ మెడికల్ స్టూడెంట్సు, పి.జి. గ్రాడ్యుయేట్స్, 400 మంది పిలల్లున్నారు. రాష్ట్రం మొత్తం మీద ఒకటే కాలేజ్ హాస్టల్. వారు ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. వారిని ఒకసారి అక్కడ నైట్ హాల్ట్ చేయమని చెప్పండి . కనీసం ఒక 10/10 రూమ్‌లో 12, 20 మంది పి.జి. స్టూడెంట్సు పడుకుంటున్నారు. వాళ్లు ఆ స్థితిలో ఎలా చదువుకుంటారు? కాంపిటీటివ్ వరల్డ్‌లో వారు ఎలా బ్రతకాలి? బాత్‌రూమ్స్ లేవు, నీళ్లు లేవు . హాస్టల్సు చాలా దుర్మార్గంగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా? సంక్షేమాన్ని పట్టించుకుంటున్నారా? **హాస్టళ్లలో ఏ విధమైన పరిస్థితులున్నాయో సమగ్రమైన రిపోర్టు ఇవ్వాలని ఈనాడు రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు సీరియస్‌గా మందలించింది. అదే విధంగా లోకాయుక్త కూడా హాస్టల్‌లో పేద విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపి, మీ దుర్మార్గమైన పరిపాలన బాగలేదని సరిచేసుకోమని చెప్పింది వాస్తవమా, కాదా?** ఎన్‌హెచ్‌ఆర్‌సి వారు మీ ఛీఫ్ సెక్రటరీకి ఒక నోటీసు పంపారు. స్టేట్ గవర్నమెంట్‌కు, సిఎస్‌కు హాస్టల్సులో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, ప్రభుత్వం మానవులను మానవులుగా చూడడం లేదని వారు నోటీసు పంపించారు. అయినా, ప్రభుత్వంలో ఎటువంటి కదలిక లేదు. పేద పిల్లలు చనిపోతుంటే వారి గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇది వాస్తవమా, కాదా? ఎన్‌హెచ్‌ఆర్‌సి, హైకోర్టు, లోకాయుక్తవంటి రాజ్యాంగబద్ధంగా ఉన్న సంస్థలు ఏది చెప్పినా వినకుండా, ఏ ఒక్క చర్య చేపట్టకుండా మానవ హక్కుల ఉల్లంఘన చేస్తున్నారు.

# స్కాలర్‌షిప్పులు, వసతి గృహాలలో సౌకర్యాలు

15-12-2005

అధ్యక్షా! మూడురోజుల నుండి చర్చ జరుగుతోంది. మినిస్టర్ గారు కొంతైనా న్యాయం జరిగేలా చెబుతారని మేము చూసాము. ఆయన ఎంటైర్ రిప్లైలో అసలు విషయాలు చెప్పకుండా జనరల్ ఉపన్యాసం ఇచ్చారు. స్కాలర్‌షిప్స్, హాస్టల్స్, స్టడీ సర్కిల్స్, జి.ఒ. 23 విషయాలలో ఒక్క రూపాయి పెంచుతున్నామని లేకపోతే మేము ఇస్తామని, ఇప్పుడున్న బాధలను తీరుస్తామని ఒక్క మాట కూడా చెప్పలేదు. అనంతరామన్ కమీషన్ నుండి స్టార్ట చేసి చరిత్రలోకి వెళ్లారు. 58 సంవత్సరాల చరిత్ర మనది. మోసపూరితంగా ఇవన్నీ జరుగుతున్నాయి. రోశయ్య గారు ఒక మాట మాట్లాడారు. ఇందిరమ్మ కార్యక్రమం వచ్చినప్పుడు 23వేల కోట్లరూపాయలు అవుతాయి, 19 వేల కోట్ల రూపాయలు మా దగ్గర ఉన్నాయి, ఇంకొక నాలుగు వేల కోట్లరూపాయలంటే ఎక్కడ నుండి తెస్తాము అండీ అని మమ్మల్ని క్వశ్చన్ వేసారు. Where there is a will there is a way. అని చెప్పిన. వారు మళ్లీ అన్నారు. 5 లక్షల మంది పిల్లలు బయట వెయిట్ చేస్తున్నారు, వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. నెక్స్ట్ బడ్జెట్‌లో చూస్తామని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో ఎరియర్స్ ఇవ్వకపోతే ఇన్‌స్టిట్యూషన్స్‌లో వాళ్లకు సర్టిఫికేట్స్ ఇవ్వకుండా, ఎగ్జామ్స్‌లో కూర్చుండబెట్టే పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్క రూపాయి అయిన కన్సిడర్ చేస్తున్నాము, ఇస్తున్నామని చెప్పడం లేదు. నేను ఏది ఇవ్వకపోయినా ఇది ఇస్తారులే అనుకున్నాను. అదికూడా చెప్పకుండా మాకు ఫైనాన్షియల్‌గా చాలా ఇబ్బందులున్నాయి, మార్చి లోపల పెంచే ప్రయత్నం చేస్తామని చెబుతున్నారు తప్ప రెండవ విషయం చెప్పడం లేదు. **కులవృత్తుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. వారికి ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కొద్దిగా అయినా ఇవ్వాలి. చేతివృత్తుల వాళ్లకు చేతులు, కాళ్లు తప్ప వారి దగ్గర ఏమి లేదు. ఆస్తిపాస్తులు లేనటువంటి కులవృత్తుల వాళ్ళ పరిస్థితి అధ్వానంగా ఉంది.** జాలర్లను తీసుకున్నా, చాకలి, మంగలి వాళ్లను తీసుకున్నా అంతే. మేము ఆరోజు ఆదరణ పెట్టడానికి చాలా ఆలోచన చేసి పెట్టాము. మీరు ఒకసారి ఆలోచించండి.

చాకలి, మంగలి వాళ్లు ఆ వృత్తి చేసుకుంటున్నారు, నాయిబ్రాహ్మిణ్స్ సెలూన్స్‌లో ఉంటున్నారు. సిటీకి వచ్చి బ్యూటిపార్లర్స్‌లో, సెలూన్స్‌లో ఉంటున్నారు. జాలర్లు చేపలు పట్టుకోవడానికి పనికొస్తారు. మోడ్రనైజ్ అయిన తరువాత ఈనాడు ఆక్వాకల్చర్ వచ్చింది. ఏ ఒక్క ఆక్వాకల్చర్ యజమాని ఫిషర్‌మ్యాన్‌గా కనపడడం లేదు. వడ్డెర్లను తీసుకున్నా అంతే, ఏ వృత్తి తీసుకున్నా అంతే. పెద్ద పెద్ద కాంట్రాక్టులు ఇచ్చారు. అరవై వేల కోట్ల రూపాయల కాంట్రాక్ట్ చేపడుతున్నారు. ఒక్క కాంట్రాక్టర్ కూడా బి.సి. కాంట్రాక్టర్ లేదు. ఆ విధంగా మోడ్రనైజేషన్ వచ్చిన తరువాత, వీళ్లు మాత్రం కూలీలుగానే పనిచేస్తున్నారు. కాబట్టి వాళ్లను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ కార్యక్రమం మొదలుపెడితే, ఈనాడు ఒక్కటీ లేకుండా బి.సి. ఫైనాన్స్ కార్పొరేషన్‌ను క్లోజ్ చేసే పరిస్థితికి తీసుకొచ్చారు. జి.ఒ.23 గురించి మాట్లాడారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చింది, ఆ కోర్టు జడ్జిమెంట్ ఇచ్చింది, ఈ కోర్టు ఇచ్చింది అని చెబుతున్నారు. అన్ని జడ్జిమెంట్లు రాజ్యాంగాన్ని కోట్ చేస్తూ చెబుతున్నాయని మినిస్టర్‌గారు కొంతమంది మట్లాడిన సభ్యులు ఆ విధంగా చెప్పారు. రాజ్యాంగ నిర్దేశకులు మహానుభావుడు అంబేద్కర్‌గారు చాలా క్లియర్‌గా రాజ్యాంగంలో ప్రతి పేజీలో రాసారు. ఈక్వాలిటీ రావాలి, సమాన అవకాశాలు ఉండాలి, సంపద అందరికీ చెందాలని పదే పదే గుర్తుచేసారు. ఇప్పుడు ఏమి ఈక్వాలిటీ ఉంది? ఏమి వచ్చింది?

జి.ఒ. 23 ఇష్యూ చేసారు. ఒకసారి ఆ పేరా చదవమనండి. మేము ఏ కులాన్ని తీసెయ్యదలచుకోలేదని మీరు చెబుతున్నారు. తీసెయ్యదలచుకోన్నప్పుడు జి.ఒ. ఎందుకు ఇవ్వాలి? జి.ఒ.లో క్లియర్‌కట్ గా చెప్పారు. To undertake revision of the list with a view to - with a view to why I am insisting on it is to exclude from such a list, those classes ceased to be BC classes -

ఇది క్లియర్ కట్‌గా ఉంది. ఇది స్పష్టమైన జి.ఓ. ఇచ్చినప్పుడు టోటల్‌గా అన్నీ రెవ్యూ చేయండి. ఏ కులాలనైతే తొలగిస్తున్నారో ఆ కులాల పరిస్థితి మొత్తం కూడా రికమెండ్ చేయండి. మీరు జి.ఓ. ఇస్యూ చేశారు. ఆ జి.ఓ.కు అర్థమే లేదు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చింది అని చెప్పి దాని ప్రకారం ఇచ్చింది. జడ్జిమెంట్ ఇచ్చినా ఎన్నిసార్లు గవర్నమెంట్ ఎక్స్‌టెండ్ చేయలేదు. ప్రతిసారి 10 ఇయర్స్ ఎక్స్‌టెండ్ చేసుకుంటూ వచ్చారు రిజర్వేషన్స్‌ను. ఇవ్వాళ మీరు కొత్తగా రెవ్యూ చేసేసి తొలగించవలసిన అవసరం ఏమి వచ్చింది? అది ఇవ్వాళ ఏ విధంగా ఉంది? కనుక దీనిపైన స్పష్టంగా జీ.ఓ. రద్దు చేయవలసిందే. ఈనాడు హాస్టల్స్ కానీ, బడ్జెటరీ ప్రావిజన్స్ కానీ ఇమ్మీడియట్‌గా రెయిజ్ చేయాలి. ఈ సంవత్సరమే 87 శాతం ఉన్న బిసి హాస్టల్స్‌లో రిజల్ట్ 72 శాతానికి మీ పుణ్యమా అని చెప్పి పడిపోయింది. పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతున్నది. బిసి వెల్‌ఫేర్ మినిస్టర్ గారిని కోరుతున్నాను. మేము స్టడీ సర్కిల్స్ ఇంట్రడ్యూస్ చేశాము. ఐ.ఎ.ఎస్. ఆఫీసర్స్ సెలెక్ట్ అయ్యారు దాని నుంచి. అటువంటి స్టడీ సర్కిల్స్ కూడా క్లోజ్ చేశారు. ఇంత క్రూరంగా ప్రవర్తిస్తుంటే మేము ఎట్లా ఊరుకుంటాము? పసి పిల్లల మీద ఇంత కక్ష సాధింపుగా, పగపట్టిన విధంగా ప్రభుత్వం చేస్తున్నది. జవాబు చెప్పాలని మంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను.

# బీసీల సమస్యలపై చర్చ

7-11-2005

స్పీకర్ సార్, నార్మల్‌గా ఎప్పుడైనా పోస్ట్‌పోన్ చేసినప్పుడు, ఒకటి వెనుకా ముందుగా గవర్నమెంట్ ఏదో చేసుకుపోతూ ఉండటం సహజం. దాని గురించి వారు ఇక్కడ చెప్పడం సాంప్రదాయంగా వస్తుంది. కానీ స్పెసిఫిక్ ఇష్యూలో తమరి సమక్షంలో నిన్న బిఎసిలో ఈ విషయమై చాలా డిబేట్ అయిన తర్వాత తెలుగుదేశం పార్టీగా మేము బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై ముందు డిబేట్ జరగాలన్న దానికై చాలా ఇన్సిస్ట్ చేశాం. మీరు పోస్టింగ్ జరగలేదని చెప్పేది సబ్జెక్ట్ మేటర్. నార్మల్‌గా సబ్జెక్ట్ మేటర్ ప్రకారం ఏది ముందు, ఏది వెనుక అన్నది ఉండదు. అయితే ఇక్కడ అది వచ్చింది. బిఎసిలో ఆ విషయం వచ్చింది. మేము క్వశ్చన్ వేశాము. క్వశ్చన్ రాలేదు. గత సెషన్‌లో కూడా దీనిని తెచ్చే ప్రయత్నం చేశాము. ఇప్పుడు ఖచ్చితంగా ఉండాలని మొట్టమొదటగా అది తీసుకోవాలని మేము ఇన్సిస్ట్ చేస్తే ముఖ్యమంత్రిగారు, వారు వేరేవి ప్రాధాన్యం అయినవి ఉన్నాయని చెప్పిన విషయాలపై, దానిపైన నిన్న బిఎసిలో డిబేట్ అయింది. అప్పుడు మేము వాకౌట్ చేస్తామని చెప్పి, వాకౌట్ చేశాము. ఫస్ట్ ప్రాధాన్యం ఉన్నవి, ఇంపార్టెంట్ అయినవి జరిగిన తర్వాత చేయాలని చెప్పాము. ఈవేళ కనీసం ఈ విషయంలో ఇప్పుడు మీరు చెప్పిన దాని గురించి మాకు నోట్ రాలేదు. ఇప్పుడు చీఫ్ విప్ చెబుతున్నారు. మీరు ఏదైనా సరే పోస్టు చేయడం జరుగుతుందని, కాబట్టి మేము ముందుగా ప్రిపేర్ అయివుండాలని అంటున్నారు. అసలు మీరు నోట్ ఇచ్చారా? ఇంతవరకు నేను ఇక్కడకు వచ్చినప్పటి నుంచీ క్వశ్చన్‌అవర్ అవుతున్నప్పటి నుంచీ అడుగుతూనే ఉన్నాను. నోట్ ఎక్కడ, ఏది అని? అది లేకుండా మేము ఏమి ప్రిపేర్ కావాలి? ఏ విషయం వస్తుందని ప్రిపేర్ కావాలి?

బిసిలకు సంబంధించినది వస్తుందనా, లేక మరొకటి వస్తుందనా? ఏది వస్తుందని దేనికి ప్రిపేర్ కావాలన్న అయోమయ పరిస్థితి మాది. బిసిలది వస్తుంది అంటే ముఖ్యమంత్రిగారు ఇక్కడ ఉన్నారు. వారు అన్నింటికీ సమర్థంగా చెబుతున్నారు కాబట్టి, ఇందులో కూడా మేము అడిగిన దానికి వారు జవాబు చెప్పాలి. ఇది చాలా ముఖ్యమైనది. బి.సి.లకు సంబంధించి అతి ప్రాధాన్యతగల ఇష్యూ. Kindly take the of Welfare of BCs first for discussion. తర్వాత ఏ ఇష్యూ తీసుకున్నా మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. దయచేసి మళ్లీ పోస్ట్‌పోన్ చేయడం అంటూ, ఏవో కుంటి సాకులు చెప్పడం సరికాదు. దయచేసి ప్రాధాన్యత గల అంశాలు ముందుగా తీసుకోవాలి.

# బీసీల జనాభా

25-3-2006

ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి శాసనసభ సమావేశాలలో కూడా బి.సి.లకు జరుగుతున్న అన్యాయం పైన ఏదో ఒక రూపంలో చర్చ జరుగుతోంది. పోయిన శాసనసభలో చర్చ జరిగినప్పుడు మరుసటి రోజు మేము పేపర్లలో చూశాము. బి.సి. వెల్ఫేర్ మినిస్టర్ గారు శ్రీ డి.శ్రీనివాస్ గారు, మిగతా బి.సి. మినిస్టర్లు అందరూ కూడా వారి ఛేంబర్స్‌లో మీట్ అయి ఇది నిజంగానే మేము చేస్తున్న వాదనను వారు ఒప్పుకొని ఏదో ఒక రకంగా ఈసారి బాగా చెయ్యాలని వారు కొంత పెంచారని చెప్పి మేము పేపర్లలో చూశాము. కొద్దిగా కదలిక వచ్చిందని అనుకున్నాము. ముఖ్యమంత్రిగారు నా దృష్టికి రాలేదు. ఇంత అన్యాయం ఎట్లా జరిగిందని ఈసారి పెంచే ప్రయత్నం చెయ్యాలని చెప్పినట్లు మేము పేపర్లలో చదివాము. చదివిన తరువాత పరిస్థితి చాలా ఇంప్రూవ్ అవుతుందని మేము ఆశించాము. కాని, ఎంత మేరకు ఇంప్రూవ్‌మెంట్ ఉందో ఒకసారి ఆలోచన చెయ్యండి. వారు సీనియర్ మినిస్టర్, వారిని గుండెల మీద చేతులు వేసుకొని ఆలోచన చెయ్యాలని కోరుతున్నాను. పి.సి.సి. ప్రెసిడెంట్‌గా బొమ్మలు వేసుకున్నారు. నేను బి.సి.ని నాకు అందరూ ఓట్లు వెయ్యండని ఇందిరమ్మ రాజ్యం వస్తుందని అన్నారు. ఈరోజు పరిస్థితి ఎట్లా ఉందో ఆలోచన చెయ్యండి. మున్సిపల్ ఎలక్షన్స్ రాగానే బి.సి.లు జ్ఞప్తికి వచ్చారు. 'రాజీవ్ అభ్యుదయ పథకం' పెట్టారు. ఆ అభ్యుదయ పథకంలో 13 వందల కోట్లు ఖర్చు పెడతామని దానిని పది లక్షల మందికి ఇస్తామని పతాక శీర్షికలలో, పత్రికలలో వచ్చాయి. ఒట్టి మాటలు కాదు, స్టాటిస్టిక్స్ చెప్పండి అని మంత్రిగారిని కోరుతున్నాను. పది లక్షల మందికి ఇస్తాము అన్నారు. ఇప్పటి వరకూ ఎంత మందికి ఇచ్చారు, కనీసం పది లక్షల మందిలో పది మందికైనా ఇచ్చారా? ఒకసారి చెప్పాలని కోరుతున్నాను. బడ్జెట్‌లో పదమూడు వందల కోట్ల గురించి మాట్లాడినవారు ఈరోజు రూ.5 కోట్లు అని చెబుతున్నారు. కోట్లాది మంది బి.సి.లు ఉన్నవారికి ఈ రూ.5 కోట్లు కేటాయించామని వారు జవాబులో చెప్పారు. రాజీవ్ అభ్యుదయ పథకం మాకు నోరు తిరగడం లేదు. అన్ని రాజీవ్ అనే పేరు మీద ఉండడం వల్ల ఏపథకం

దేనికో అర్థం కావడం లేదు. అన్ని రాజీవ్ పథకాలే పెట్టుకున్నారు. అధ్యక్షా, మంత్రిగారు రేపు వచ్చే ఉగాదికి 5 కోట్ల రూపాయలతో ప్రసాదం వండి తలా ఇంత పెట్టినా చాలదు. ఏవిధంగా వీరి అభ్యుదయం పోతోంది? దానిని గురించి ఆలోచన చెయ్యాలని మినిస్టరు గారు తెలియజెయ్యాలని కోరుతున్నాను. ఉపకార వేతనాల గురించి చెప్పారు, పాత బకాయిలే ఇవ్వడానికి మేము తగాదా పడితే ఉన్న ఎమౌంట్స్ రిలీజ్ చేస్తే పాత బకాయిలకే సరిపోలేదు. పాత బకాయిలు ఎనభై కోట్లు ఉన్నాయి. బి.సి.ల సంఖ్య పెరుగుతున్నది. పిల్లలు అంతో ఇంతో చదువుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈరోజు బి.సి.లకు ఇస్తున్న ఆస్తిపాస్తులు ఏమిటి? ఈనాడు ఉన్న దేశ సంపద ఇవ్వలేకపోతున్నాము. ఆ విజ్ఞానాన్ని ఇవ్వలేకపోతున్నాము. చదువుకోడానికి కనీసం స్కాలర్‌షిప్స్ లేకుండా కనీస హాస్టల్ ఫెసిలిటీస్ లేకుండా ఉంటే ఏవిధంగా దేశ సంపద పెరుగుతుంది? ఏ విధంగా మానవ వనరులు పెరుగుతాయి? కనీస చదువులు చెప్పించే పరిస్థితిలో లేని ఈ ప్రభుత్వం ఏమి ప్రయత్నాలు చేస్తున్నది. అరవై మూడు వేల కోట్ల రూపాయలు రాష్ట్ర శాసనసభ బడ్జెట్‌లో పాస్ చేసిన తరువాత ఈనాడు బి.సి.లకు మీరు ఇస్తున్న కార్యక్రమాలు ఏమిటి? అరవై మూడు వేల కోట్లు అంటే రోజురోజుకూ ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నది. ఆదాయాలు పెరుగుతున్నాయి. కాని బి.సిల సంక్షేమానికి ఎంత పెంచారో మీరు ఎంత పర్సెంటేజ్ పెంచారో ఎంత ప్రపోర్షనేట్‌గా పెంచారో తెలియజెయ్యలేదు. మీరు గత సంవత్సరాలతో పోల్చుకుంటూ మేము 5 కోట్లు పెంచాము, పది కోట్లు పెంచాము అంటే ఎట్లా సరిపోతుందో మినిస్టర్ గారు మా అందరికీ జ్ఞానం కలుగజేసే విధంగా తెలియజెయ్యాలని కోరుతున్నాను. ఏదో మాట్లాడి ఏదో తమాషా చేసి పోతూ చెప్పవద్దు. I am very seriously asking. హాస్టల్స్‌లో 87 శాతం నుండి 77 శాతానికి ఉత్తీర్ణత పడిపోయింది. అంటే 10 శాతం పడిపోయింది. హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులకు మీరు కనీస వసతులు కల్పించడం లేదు. కనీస వసతులు లేక కప్పుకోవడానికి దుప్పట్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. నేను పాదయాత్రలు చేసిన సందర్భంలో కొన్ని హాస్టల్స్ ప్రాక్టికల్‌గా చూశాను. నా నియోజకవర్గంలోనే కాదు, మారు మూల ప్రాంతాలలో పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది.

మినిస్టర్‌గారు మీరు ఎన్నిసార్లు హాస్టల్స్ తిరిగారండి? మీ మంత్రులు ఎంతమంది వున్నారు? ప్రతి డిబేట్‌లో ముఖ్యమంత్రి వుండడం లేదు. మీ మంత్రులు వుండడం లేదు. ఒక్కరిద్దరు బిసి, యస్‌సి, మైనారిటీస్‌కు సంబంధించిన వారు దయతో, ప్రేమతో మా ఘోష వినడానికి వున్నట్లున్నారు. కనీస బాధ్యత కూడా ఈ ప్రభుత్వానికి లేదని తెలియజేస్తున్నాను. ఈనాడు 369 మంది చేనేత కార్మికులు చనిపోయారు. అంతమంది చేనేత కార్మికులు చనిపోతే మీరు ఏమి చేశారు? సిరిసిల్ల నుండి భర్తలు చనిపోయిన మహిళలు వచ్చి ధర్నా చేస్తూ వుంటే పోయి పలకరించిన పాపాన పోలేదు. మహిళలు ఏమి చేయాలో తెలియక అసెంబ్లీ ముందు పడిగాపులు పడుతూ వుంటే పలకరించిన పాపాన పోలేదు ఈ ప్రభుత్వం. 12 లక్షల గొర్రెలు చనిపోతే ఏమి సహాయం చేశారు? 70 వేలమంది గొర్రెల కాపరులు నాలుగుసార్లు పార్క్ దగ్గర ధర్నా చేస్తే ఏమి చేశారో తెలియజేయండి. మేము ఆనాడు చాకలి వారికి దోభీ ఘాట్స్ కట్టించాము. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏమి చేస్తున్నది? ఒక్కరికైనా కుర్చీ అయినా యిచ్చారా? వృత్తి పనివారికి

సంబంధించి ఎన్ని నిధులు కేటాయించారు? అదే విధంగా వడ్డెర, కుమ్మరి, వడ్రంగి ఈవిధమైన కుల వృత్తులు పోయి గ్రామీణ ప్రాంతాలలో వారు దయనీయ పరిస్థితుల్లో వుంటే ప్రభుత్వ పరంగా మీరు ఏమి చేస్తున్నారు? చేతి వృత్తులను యింప్రూవ్ చేయడం కోసం రూ.1000 కోట్లు పెట్టండని అడిగాము. వేల కోట్లు మీ యిష్టానుసారం చేస్తున్నారని చెబితే, ఈ ప్రభుత్వం వీరి కోసం ఏమి చేస్తున్నదో తెలుపవలసిందిగా కోరుతున్నాను. సంక్షేమం గురించి మేము అడిగితే స్కాలర్‌షిప్స్ గురించి చెబుతున్నారు. స్కాలర్‌షిప్స్ కోసం మీరు కేటాయించిన డబ్బు పాత బకాయిలకు సరిపోయినాయి. నేను మంత్రిగా వున్నకాలంలో స్టడీ సర్కిల్స్ పెట్టాము. ఆ స్టడీ సర్కిల్స్ ద్వారా యిద్దరు, ముగ్గురు ఐఎయస్ అధికారులు, గ్రూప్ వన్, గ్రూప్ టు అధికారులు సెలెక్ట్ అయినారు. పేదవారైన వారి తల్లిదండ్రులకు చదువు రాదు. పిల్లలను ఏ కోర్సుల్లో చదివించాలో కూడా తెలియని దయనీయ పరిస్థితి వుంది. అందువల్ల స్టడీ సర్కిల్స్‌ను పెంచవలసింది పోయి ఉన్న కోర్సులను కూడా బంద్ చేయించారు. బిసిలకు కొద్దిపాటి డబ్బు కూడా కేటాయించకుండా బిసిలను ఉద్ధరించామని మాట్లాడుతున్నారు. **ఈనాడు గీత కార్మికుల పరిస్థితి దారుణంగా వుంది. కుల వృత్తులను చేసుకునే వారి పరిస్థితిని మార్చడానికి ప్రణాళిక ఏదయినా చేశారా? మేము కనీసం కొంత ప్రయత్నించాము. మీరు ఆ ప్రయత్నాన్ని క్లోజ్ చేశారు. బిసి కార్పొరేషన్ ఏమి చేస్తోంది?** ఒక్క లోను, ఒక్క రూపాయి యిచ్చారా? వారి పరిస్థితిని బాగుపరచడానికి ఏమయినా చేశారా? బిసి కార్పొరేషన్ వారు పాత బాకీలను వసూలు చేసి జీతాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ, వారికి అన్యాయం చేస్తూ, వారిపట్ల కక్ష కట్టినట్లుగా ప్రవర్తిస్తోంది. మంత్రిగారు మాట్లాడుతూ 'బిసి జనాభా మీద రకరకాల అభిప్రాయాలు వున్నాయి. సెన్సస్ చేస్తాము' అన్నారు. నాకు ఈ ప్రభుత్వం మీద నమ్మకం లేదు. మునిసిపాలిటీలలో సెన్సస్ చేసి బిసిలు 20శాతం, 30శాతం మాత్రమే వున్నారని చెప్పిన మహానుభావులు వీరు. ఆ సెన్సస్ చేసి బిసిల సంఖ్య తగ్గి పోయిందని, సంక్షేమం అవసరం లేదని, కొందరు క్రీమీలేయర్ క్రిందకు వస్తారని, మిగతావారు కనబడకుండా పోయారని సెన్సస్ చేసే ప్రమాదం వుంది. అందువల్ల ఒక ఇండిపెండెంట్, అటానమస్ బాడీతో, వారి సూపర్‌విజన్‌తో చేయాలి తప్ప మీ ఇష్టానుసారం ఏదో ఒక రకంగా లెక్కలు తీస్తే లాభం లేదు. ఆ విధంగా దొంగ లెక్కలు తీసే ప్రమాదం వుంది. సరియగు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

అధ్యక్షా! సక్రమంగా లెక్కలు తీయవలసిందిగా కోరుతున్నాను. ఒక ప్రయత్నమైతే చేశారు. కాని మునిసిపాలిటీలలో 20శాతం వున్నట్లుగా లెక్క తేల్చారు. నా నియోజకవర్గంలో 20 శాతం బిసిలు వున్నట్లుగా లెక్క తేల్చారు. గొర్రెల కాపరులకు, చేనేత కార్మికులకు సునామీ వచ్చిన సందర్భంగా నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్ వారు సహాయం చేశారే తప్ప ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదు. మత్స్యకార్మికులకు ప్రభుత్వపరంగా ఏమి చేశారు? ఎన్‌జీవోస్ చేశారు తప్ప మీరేమి చేశారో చెప్పవలసిందిగా అడుగుతున్నాను. పూర్తిగా రియంబర్స్‌మెంట్ చేయవలసిందిగా మేము డిమాండ్ చేస్తున్నాము. రాజీవ్ గృహకల్ప విషయం చెప్పవలసిందిగా కోరుతున్నాను. అదే విధంగా బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ విషయం ఏమిటి? దానికి మీ కేటాయింపులు ఎంత? మార్జిన్ మనీ ఎంత? సంఖ్యలతో సహా వివరాలు యివ్వవలసిందిగా కోరుతున్నాను. ఎంత మందికి ఇచ్చారు?

స్పీకర్ సర్, ప్రొటెస్ట్ చేయడానికి అవకాశం ఇవ్వకపోతే ఎట్లా? మంత్రిగారు వారికి ఎంత బాధ ఉన్నా మాట్లాడక తప్పదని ఇది చెప్పినట్లు కనిపిస్తుంది. మేము ప్రత్యేకంగా ఈ ప్రభుత్వాన్ని కొన్ని ప్రశ్నలు అడిగాము. దానికి జవాబు చెప్పలేదు. రాజీవ్ అభ్యుదయ ప్రోగ్రాం క్రింద రు 13వందల కోట్ల కంటే ఎక్కువ పెట్టినవి ఉన్నాయని, ఫిగర్ చెప్పలేకపోయారు. చివరకు బడ్జెట్‌లో పెట్టింది రూ. 5 కోట్లు. అప్పుడు ఏసు ప్రభువు రెండు రొట్టెలు ఇచ్చి ప్రపంచానికి పంచినట్లు అందరికీ పంచుతాను అనే మంత్రం ఏదయినా కనుక్కోగలిగితే వేరే విషయం. ఆ ప్రపోజల్ ఉంటే ఉండనివ్వండి. నేను ఆపదలచుకోలేదు. ప్రభుత్వానికి మాత్రం ఈ బిసిల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ఉంది. వారి చర్యలలో స్పష్టంగా కనిపిస్తున్నది. వారి రాజకీయ కార్యక్రమాలు అదేవిధంగా కనిపిస్తున్నాయి. వారి బడ్జెట్ అదేవిధంగా కనిపిస్తున్నది. ఎటువంటి ఇంప్రూవ్‌మెంట్ లేదు. ఎంత చెప్పినా వారు మాట్లాడుతున్నారు, 5సంవత్సరాలు 10సంత్సరాలు పెట్టామని చెబుతున్నారు. ఇప్పటికి రెండు సంవత్సరాలు అయింది. ఇంకా 3సంవత్సరాలు ఉందనే విషయం మర్చిపోతున్నారు. ఈ మూడు సంవత్సరాలలో ఏదో చేస్తామని చెబుతున్నారు గానీ ఇంతవరకు మీ లెక్కలు చేయడానికి స్కీములు తయారుచేయడానికి రెండు సంవత్సరాలు పట్టింది అని చెప్పిన మహానుభావులు మీరు. మీకున్న ఈ 3సంవత్సరాల కాలంలో ఏమి చేస్తున్నారనేది స్పష్టంగా చెప్పే చిత్తశుద్ధి లేదు. కిరణ్‌కుమార్‌రెడ్డిగారు రూ. 50కోట్ల స్కాలర్‌షిప్స్ మిస్‌యూజ్ అయింది అన్నారు. అయితే, అట్లా మిస్ యూజ్ అవుతుందనే భయంతో చేయడంలేదా? బిసిలకు ఇస్తే మిస్‌యూజ్ అవుతుందా? అది కాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? పకడ్బందీగా చేయాలి తప్ప ఏమీ చేయకుండా మిస్‌యూజ్ అవుతుందని ఏమీ చేయను అనే ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తున్నది ఈ ప్రభుత్వానికి. చేతివృత్తుల ద్వారా బ్రతుకుతున్న బిసిలకు, జనాభాలో 50 శాతం ఉన్న బిసిల పరిస్థితి దయనీయంగా ఉంది. వారి పరిస్థితి మెరుగుపరచడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. బడ్జెట్ కేటాయింపులు పెంచడంలేదు. బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఒక్క రూపాయి లేకుండా ఉన్న డబ్బు వసూలుచేసే కార్పొరేషన్‌గా తయారయింది, కొత్తగా ఎటువంటి ప్రపోజల్ ఈ ప్రభుత్వం చేయనందుకు, జీవో 23 రద్దు చేయనందుకు, చేతివృత్తుల వారి పరిస్థితి బాగుచేయనందుకు, ఏ కొత్త పథకం పెట్టనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నాము.

# బిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్స్

22-8-2006

అధ్యక్షా, ఇది బిసి వెల్ఫేర్ మరియు సోషల్ వెల్ఫేర్ మంత్రులిద్దరికీ సంబంధించిన ప్రశ్న. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి సెషన్‌లో ఈ యిస్యూ డిబేట్ కావడం, మేము ప్రశ్నలు వేయడమే తప్ప సరియగు పరిష్కారం దొరక్కపోవడం జరుగుతోంది. చివరిగా ఏ పరిస్థితి ఏర్పడిందంటే చట్ట సభలో దీనికి పరిష్కారం దొరకడం లేదు. బయట విద్యార్థులు ఉద్యమాలు చేపట్టి జైళ్ల పాలై హైకోర్టుకు పోతే హైకోర్టు ప్రభుత్వాన్ని మందలించి, విద్యార్థులకు ఎందుకు స్కాలర్‌షిప్స్ యివ్వడంలేదు అని అడిగే దుస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడింది. కేంద్రం నుండి స్పాన్సర్ కాబడిన స్కీమ్స్ యస్‌సి, యస్‌టి విద్యార్థుల కొరకు వుంటాయి. ఈ సంవత్సరం జులై నెలలో రావలసిన రూ.31 కోట్లకు గాను రూ.16 కోట్లు రిలీజ్ చేశారు. రూ.236 కోట్ల కోసం ప్రతిపాదనలు పంపితే కేంద్ర ప్రభుత్వం నుండి ఉలుకు పలుకు లేదు. కేంద్రం ఇస్తుందా లేక రాష్ట్రం ఇస్తుందా? విద్యార్థులు చదువుకోవాలి కదా. 3 లక్షల 14 వేలమంది బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో వున్నాయి. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో, హాస్టల్స్‌లో ఉత్తీర్ణత శాతం ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తగ్గిపోతున్నది. స్టాండర్డ్స్ పడిపోతున్నాయి. స్కాలర్‌షిప్స్ సరిగా ఇవ్వడం లేదు. హైకోర్టు ఇంటర్‌ఫియర్ అయినా, దానికి సరిగా స్పందించడం లేదు. మాట్లాడితే బడ్జెట్‌లో మీ కంటే కొంచెం పెంచామని చెపుతారు. అసలు బడ్జెట్ పరిస్థితి ఏమిటి? నాలుగైదు సంవత్సరాలుగా రాష్ట్ర బడ్జెట్ వచ్చి 60 వేల కోట్ల రూ.లు. దానికి ప్రర్సనేట్‌గా ఎంత పెంచారండీ? ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్స్‌కు సంబంధించి మీరు ఏమి చేస్తున్నారండీ? సమాజంలో వారిని ఏ విధంగా పైకి తీసుకుని వస్తున్నారండీ? అధ్యక్షా, బహుశా మీరు కూడా చూసే ఉంటారు. మా హయాంలో బలహీన వర్గాలకు చెందిన ఏ ఒక్క విద్యార్థికీ స్కాలర్‌షిప్ అందని రోజు లేదు. మాకు హాస్టల్‌లో తిండిలేదని చెప్పి పిల్లలు విద్యను బంద్ చేసుకున్న రోజు లేదు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చదువుతున్నారో, ఏమి చదవడం లేదో తెలియకపోయినా, ఇతర ప్రాంతాల నుండి హైదరాబాద్ వచ్చేసి, ఇక్కడ పిల్లలు చదువుకునే పరిస్థితి ఉండేది. కాని ఈనాడు, 20,30 వేల రూ.ల ఫీజులు కట్టి పేద విద్యార్థులు ఏ విధంగా చదువుకోగల్గుతారండీ? మీ మొత్తం వెల్ఫేర్ బడ్జెట్ కలుపుకుంటే మీరు కనీసం సంవత్సరానికి అయిదారు వందల కోట్ల

రూ.లు కూడా ఇవ్వకపోతున్నారు. అక్కడేమో కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోయే. ఇటు మీరు ఇవ్వకపోయే. ఎస్సీలకు రావలసిన స్కాలర్‌షిప్స్‌ను కేంద్ర ప్రభుత్వం బంద్ చేస్తే, మీరు ఏదో కొద్దిగా రిలీజ్ చేసామని చెపుతున్నారు. వారు ఇవ్వకపోయి, మీరు ఇవ్వకపోతే, విద్యార్థులు ఎట్లా చదువుకుంటారు? విద్యార్థులకు కనీసం విద్యను సక్రమంగా ఇవ్వకపోతే, మారుతున్న ప్రపంచీకరణ సందర్భంగా పేద విద్యార్థుల పరిస్థితి ఏమి కావాలి? దీని కోసం ఇక్కడ మేము ప్రతిసారీ గొంతు చించుకుని అరవాలా? ప్రతి దానికి విద్యార్థులు హైకోర్టుకు ప్రతీసారీ ఎట్లా వెళతారో చెప్పండి. కాబట్టి ఇప్పటి వరకు పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తారా లేదా? ఎప్పటిలోగా చేస్తారు? ఎంత కేటాయింపులు ఇచ్చారు? అదే విధంగా ఎన్ని దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి? అక్కడేమో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల గురించి మాట్లాడుతున్నారు. సంస్కరణల పేరుతో విద్యార్థులు చదువుకు దూరం కావడమే సంస్కరణ అవుతుందా? పేదవాడికి పనికిరాని సంస్కరణలు దేనికి కావాలి సార్? కాబట్టి పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ఎప్పటిలోగా స్కాలర్‌షిప్స్ మంజూరు చేస్తారు? అదే విధంగా ఉత్తీర్ణత శాతం కూడా పడిపోతున్నది. నేను బి.సి. వెల్ఫేర్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు స్టడీ సర్కిళ్లు పెట్టాము. బి.సి.వర్గాలకు చెందిన ఐఏఎస్, ఐపిఎస్ ఆఫీసర్లు ఎంత మంది ఉన్నారో చెప్పండి. ప్రపోర్షనేట్‌గా ఉన్నారా? సెంట్రల్ సర్వీసుల్లో, స్టేట్ సర్వీసుల్లో బి.సి.ల పరిస్థితి ఏమిటో ఒకసారి చూడండి అధ్యక్షా. బి.సి.లకు కనీసం మంచి చదువు ఇప్పిస్తే, వారు బయట ఉన్న కాంపిటీషన్‌ను తట్టుకుని, ఐఏఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సంపాదిస్తారని, మహానుభావుడు ఎన్టీ రామారావుకు మేము చెప్పగానే స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేశారు. వాటిని కనీసం మీరు ఇంప్రూవ్ చేయవలసిందిపోయి, వాటి సంఖ్యను ఇంకా పెంచవలసింది పోయి, కొత్తగా మీరు ఒక డెసిషన్ తీసుకున్నారు. అక్కడ కూడా అవుట్ సోర్సింగ్ చేయాలని నిర్ణయించారు. అంటే ఇప్పుడు ఉన్న స్టడీ సర్కిళ్లకు డబ్బు లేకుండా చేస్తున్నారు. కాబట్టి మీరేమి వెల్ఫేర్ చేస్తున్నారు? నేను అడిగిన వాటికి ఇద్దరు మంత్రులు జవాబు చెప్పాలని కోరుతున్నాను. అధ్యక్షా, మినిస్టరుగారు కొన్ని విషయాలలో ఎగ్రీ అయ్యారు. వారు చెప్పిందే నేను చెబుతున్నాను. ఎస్సీ, ఎస్‌టి పిల్లలకు కేంద్రం నుండి రూ.58 కోట్లు కావాలి. ఆ విధంగా బకాయి ఉన్నపుడు పరిస్థితి గ్రౌండ్‌లో ఎట్లా ఉంటుందో మీరు ఆలోచన చేయాలి. రెండవది బిసి విద్యార్థులకు కావలసిన ఫుల్ ఫ్లెడ్జ్‌డ్‌గా మీరు నిధులు ఇవ్వడం లేదు. మీరు అంగీకరించాలి. మీ పీరియడ్‌లో కొంత పర్సంటేజ్ తగ్గి ఉండవచ్చు, నేను కాదని అనడం లేదు. పర్సంటేజ్‌వైజ్ చూస్తే ఆ రోజు ఉన్న బడ్జెట్ ఈరోజు లేదని ఎందుకు మాట్లాడడం లేదు? మొన్న ఢిల్లీ నుండి ముఖ్యమంత్రిగారి స్టేట్‌మెంట్ కూడా చూశాను. రూ.20 వేల కోట్లతో మన ఆంధ్రప్రదేశ్ మొత్తం దేశంలోనే నెం.1 ప్లాన్డ్ బడ్జెట్ స్టేట్‌గా మనం నిలబడ్డాము. దానికి వున్న చాలా కారణాల మూలంగా ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. అట్టడుగు వర్గాల ప్రజానీకానికి కేటాయింపులు పెంచుతారా? వారి కేటాయింపులు తగ్గించి వారికి మనం ఆస్తిపాస్తులు ఏమన్నా ఇస్తున్నామా? కనీసం చదువుకుని వాళ్లు కూడా బాగుపడడానికి వారికి ప్రోత్సాహం ఇవ్వకుండా ఇంకా ప్రపోర్షనేట్‌గా మీకంటే మేము కొద్దిగా ఎక్కువ ఇచ్చాము అని అనడం బాధ్యతగా లేదు. ఖచ్చితంగా ఇప్పటివరకు పెండింగ్‌లో వున్న స్కాలర్‌షిప్స్ రిలీజ్ చేస్తారా? ఏ ఒక్క విద్యార్థి స్కాలర్‌షిప్స్ లేకుండా, తిండిలేకుండా, విద్య మానుకునే పరిస్థితి కలుగజేయమని హామీ ఇస్తారా? ఇది స్పెసిఫిక్‌గా బిసి, ఎస్‌సి, ఎస్‌టి స్టూడెంట్స్‌కు సంబంధించి, ఇన్ టోటల్, అధ్యక్షా, వారు సమాచారం ఇచ్చారు. ఇది నా దగ్గర ఉన్న సమాచారం. దీని పైన ఇద్దరం చర్చించుకుని

తిట్టుకోవడానికి కాదు నేను చేసేది. మా ప్రయత్నం విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వాలి, వారి చదువు కంటిన్యూ కావాలనేది నేను రిక్వెస్ట్ చేస్తున్నాను. నాకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఎస్‌సి స్టూడెంట్స్‌కు ఈ సంవత్సరం రూ.236 కోట్లకు ప్రతిపాదన పంపితే, రూ.18 కోట్లు వచ్చింది. మాకు ఇది వర్రీగా ఉంది. ఇంకా 6మాసాలు ఉంది. ఇవ్వకపోతే ఎస్‌సి స్టూడెంట్స్ ఇబ్బందులు పాలవుతారు. బిసిలకు సంబంధించి 3 లక్షల 14 వేల మందిది ఇప్పటివరకు పెండింగ్‌లో ఉంది. చివరకు ఏమవుతుంది? జనవరి గడిచిపోతే, ఏదో బడ్జెట్ సెషన్లో ఇట్లాగే గొడవ చేస్తాము. విద్యార్థులు ఇప్పటివరకు 36 సార్లు ధర్నా చేశారు. హైకోర్టుకు వెళ్లారు. వాళ్లకు ఇంకా వున్న సోర్స్ ఏమిటి? ఇది ఆలోచన చేయాలి, ఇది మేమేదో మిమ్ములను విమర్శిస్తున్నట్లు, రాజకీయంగా లబ్ధి పొందడానికి కాదు. గుండెమీద చేయి వేసుకుని మీరు కూడా చెప్పండి. మీ స్టేట్‌మెంట్స్ కూడా నేను పేపర్లో చదివాను. గట్టిగా కొట్లాడుతున్నారు, రెడ్యానాయక్, డి. శ్రీనివాస్ అనుకున్నాను. ప్రతి గవర్నమెంట్‌లోను ఈ సమస్యలు ఉంటాయి. మా గవర్నమెంట్‌లో మాకు కూడా ప్రాబ్లం ఉంది. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఉన్నది సర్దుకోడానికి రకరాలుగా చేసి చిట్టచివరకు వెల్ఫేర్ మీద పడతారు. వెల్ఫేర్‌కు కటింగ్ పడుతుంది. ఇది దురదృష్టం. మీరేదో రూ.20 వేల కోట్లు ఒక్కొక్క ప్రాజెక్టుకు అని చెబుతున్నారు. ఇందులో రు. 200 కోట్లు ఖర్చుచేస్తే 3,4 లక్షల మంది విద్యార్థులు చదువుకోడానికి ఇస్తే నష్టం ఏమిటి అని నేను చెప్పదలచుకున్నాను.

అధ్యక్షా! మినిస్టర్ గారు, ' మా ప్రభుత్వంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు చాలా సంతోషంగా వున్నా'రని అన్నారు. ఈ ప్రభుత్వం **వచ్చిన తరువాత స్టూడెంట్స్ చేసిన ధర్నాలు, తిన్నన్ని తిట్లు, దెబ్బలు ఎప్పుడూ, ఏ సందర్భంలోనూ తినలేదు.** ఆఖరికి హైకోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. మాకు ట్యూషన్ ఫీజులు ఇవ్వడం లేదు, మేము చదువుకోవాలా, అక్కర లేదా అని విద్యార్థులు కోర్టుకు వెళ్లిన సందర్భం గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేదు. ఆ విషయాన్ని శ్రీనివాస్ గారు గ్రహించుకుంటే మంచిది. ఇక రెండో విషయం వీరు పెంచామని చెబుతున్నారు. ఒరిజినల్‌గా రూ.40, రూ.45 కోట్లు వుంటే, దానిని రు.6కోట్లకు తగ్గించేసారు. మళ్లీ ఈ సంవత్సరం రు.2 కోట్లు పెంచామని అంటున్నారు. తమ పిల్లలు చదువుకోవాలనే ఆశతో తల్లిదండ్రులు స్కూళ్లకు పంపిస్తున్నారు. కొంత రేటాఫ్ లిటరసీ పెరుగుతోంది కాబట్టి, సంఖ్య కూడా పెరుగుతోంది కాబట్టి, నాచురల్‌గా బి.సి.ల సంఖ్య కూడా హయ్యర్ ఎడ్యుకేషన్‌లో పెరుగుతోంది. మీరు బడ్జెట్‌ను ప్రపోర్షనేట్‌గా పెంచనక్కర లేదా? ఏదో 2, 3 కోట్ల రూపాయలు పెంచినట్లయితే సరిపోతుందా? ఏదో టెక్నికల్ గానో, పొలిటికల్ గానో మాట్లాడితే మంచిగా వుండదని మీ ద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను. మీరు వాస్తవాలు చెప్పండి, మీరు ఏమి చేసారో చెప్పండి.

# పెన్షన్ల పంపిణీ

**15-3-2005**

స్పీకర్ సర్, We know the position. గౌరవ ముఖ్యమంత్రి గారు సభా నాయకుడిగా ఇంటర్‌ఫియర్ కావచ్చు. ఏదైనా విషయంలో వారికి ఉన్న సమాచారాన్ని హౌసుకి చెప్పడంలో ఏ సమయంలోనైనా వారికి హక్కు ఉంది. దానిని మేము గౌరవిస్తాము, అభ్యంతరం పెట్టం. దానికి కాదు మేము ప్రొటెస్టు చేసేది. మేము క్వశ్చన్ వేశాము. ఎన్నికల సమయంలో ఇస్తున్న పెన్షన్లు సరిపోవడం లేదని, ముఖ్యమంత్రిగారు, వారి పార్టీ పెద్దలు ప్రతి చోట 'అయ్యో, ఎంత అన్యాయం జరుగుతోంది. ముసలి వాళ్లకు కూడా యాభయ్ రూపాయలూ, డెబ్బయి రూపాయలిస్తున్నారా, మేము అధికారంలోకి వస్తే రూ. 225 ఎట్టి పరిస్థితులలోనూ ఇస్తామని, పోస్టులో ఇంటి వద్దకే పంపిస్తామని ఎన్నికలలో చెప్పారు. అట్లా చెప్పి ఓట్లు వేయించుకున్నారు. రకరకాల ప్రామిస్‌లు చేశారు. దీనిని ముఖ్యమైన ప్రామిస్‌గా తీసుకున్నారు. మేము అడిగేది, మీరు చెప్పిన ప్రామిస్‌ను ఇంప్లిమెంటు చేయడం లేదు అని. బడ్జెటులో ఎందుకు పెట్టలేదన్న అంశం లేవనెత్తాం. దానికి మళ్లీ ఎన్నికలు వచ్చేలోగా చేస్తాము, ఉచిత విద్యుత్‌ను ఇచ్చాము అన్నారు. ఏ ప్రామిస్‌ను నిలబెట్టుకున్నారు ఈ 9నెలల్లో? ప్రజలను మోసం చేస్తున్నారు. విద్యుత్ ఫైలు మీద మొదటి సంతకం చేస్తామని చెప్పిన మీరు 6నెలలు గడిచిపోయినా దాన్ని వెనక్కు తీసుకుని, ప్రజల్ని మోసం, దగా చేస్తున్న మీరు, పెన్షన్లు విషయంలో కూడా మీరు చెప్పిన ప్రామిస్‌ను నిలబెట్టుకోకుండా పై పెచ్చు మా మీద ఎదురుదాడి చేస్తున్నారు. కాబట్టి దానిని ఖచ్చితంగా పెంచాల్సిందే. ఒకవైపు రాష్ట్రంలో తిండి లేకుండా కరువుతో లక్షలాది మంది ప్రజలు, ముసలి వాళ్లు, ఇంటి వద్దనే ఉండి కనీస తిండి లేక, ఆకలి చావులు చస్తున్నారు. ఈ సందర్భంలో మీరు పెన్షన్లును పెంచాలి. కరువు పెన్షన్లు, వృద్ధాప్య పెన్షన్లు మీరు ఇస్తామన్నట్లు రూ. 225 ఇవ్వాలి. ఆ విధంగా ఇవ్వకపోవడానికి నిరసనగా వాకవుట్ చేస్తున్నాం.

# ఐఐటీ ఏర్పాటు

19-3-2008

స్పీకర్ సార్, ఇది చాలా ఇంపార్టెంట్ ఇష్యూ. సమస్య లేని దానిని ఏ విధంగా సమస్య క్రింద ప్రభుత్వం మారుస్తుంది అనడానికి ఇది ఒక ఎగ్జాంపుల్. సమస్య లేని దానిని సమస్య క్రింద మారుస్తున్నారు. యునానిమస్‌గా రెండు సార్లు తీర్మానం చేసాము. ఒ.బి.సి.ల రిజర్వేషన్ సమస్య వచ్చి, సీట్లు పెంచడంలో అంతర్భాగంగానే మూడు ఐ.ఐ.టి.లు దేశ వ్యాప్తంగా ఇస్తున్నారు. ఆ విధంగా మనకు కూడా ఇచ్చారు. బాసరలో ఎస్టాబ్లిష్ చెయ్యడానికి అన్ని మౌలిక సదుపాయాలు అక్కడ ఉన్నాయి. రైల్వే లైన్, వాటర్ సప్లై, పవర్ కనెక్షన్, రోడ్ కనెక్షన్, కావలసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. నాందేడ్‌లో ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్ అండర్ కన్‌స్ట్రక్షన్‌లో ఉంది. ఇవన్నీ ఉన్నా కూడా అక్కడ ఎస్టాబ్లిష్ చేస్తామని చెప్పడం లేదు. హైదరాబాద్ పక్కన పెడతాము అన్న తరువాత సమస్య స్టార్ట్ అయ్యింది. మెదక్‌లో పెడతాము అని చెప్పి ప్రకటన చేసిన తరువాత, ఎప్పుడైతే రెండు జిల్లాలలో పెద్ద ఉద్యమం వచ్చిందో అప్పుడు కమిటీ గురించి మాట్లాడి, కమిటీ వేసారు. నిర్ణయం తీసుకున్న తరువాత ఏర్పాటు చెయ్యబడింది ఆ కమిటీ. ఆ కమిటీ వేసిన తరువాతైనా ఊరుకున్నారా? మళ్లీ గణతంత్ర దినోత్సవంనాడు ముఖ్యమంత్రిగారు, మెదక్‌లో ఐ.ఐ.టి. వస్తుందని చెప్పారు. కమిటీ ఎస్టాబ్లిష్ అయిన తరువాత, కమిటీ ఇన్‌స్పెక్షన్ చెయ్యకముందే, ముఖ్యమంత్రి గారు గణతంత్రదినోత్సవం నాడు ఆ విధంగా ప్రకటన చేసిన తరువాత కమిటీ ఏం రిపోర్ట్ ఇస్తుంది? ఆల్‌రెడీ ప్రభుత్వం మేడప్ చేసుకుంది. డిసైడ్ చేసుకున్న తరువాత కమిటీ దీనికి ఎగైనెస్ట్‌గా రిపోర్ట్ ఇస్తుందని చెప్పుకోవడం అసాధ్యమైన పని అని నేను అనుకుంటున్నాను. ఈ హౌస్‌కు పవిత్రత ఉంది. స్పీకర్‌గారు, తమరు చెప్పండి. మీరు ఆ జిల్లా వాసులే! మీకు ఆ సమస్య గురించి తెలియదా? ఈ హౌస్‌లో రెండుసార్లు తీర్మానం చేసిన తరువాత ఈ తీర్మానానికి, వాళ్లు భాగస్వాములు అయిన తరువాత, కొత్త సమస్య తీసుకొచ్చి, తెలంగాణా జిల్లాల మధ్య తగాదా పెట్టే కార్యక్రమం కాకపోతే ఎమిటిది? ఇది ఏర్పాటు చేయ్యమని మెదక్ వాళ్లు అడిగారా? కొత్త సమస్యను తీసుకొచ్చి పెడుతున్నారు. ఖచ్చితంగా, ఐ.ఐ.టి.ని బాసరలోనే ఏర్పాటు చెయ్యాలి. వెనకబడ్డ ప్రాంతంలో ఈ ఇన్‌స్టిట్యూట్ రావడం చాలా అవసరం. దయచేసి, ఇంకా సమస్యలలో పెట్టకుండా, మంత్రిగారు అక్కడ ఏర్పాటు చేస్తామని సభలో హామి ఇవ్వాలని, ముఖ్యమంత్రి గారు వచ్చి చెప్పాలని కోరుతున్నారు!

# రాజీవ్‌గాంధీ టెక్నాలజీ యూనివర్శిటీ

**19-3-2008**

స్పీకర్ గారూ, ముందు మంత్రి గారిని ఈ బిల్లు పెట్టవలసిన అవసరానికి సంబంధించి aims and objects చెబుతూ ఏ ప్రాంతాలను ఏ పద్ధతిలో ఎన్నిక చేసారో వివరణ ఇస్తే దాని పైన మేము మాట్లాడతాం.

మేడం స్పీకర్ గారూ, ఈ రాజీవ్ గాంధీ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి మంత్రి గారు వివరిస్తూ, ఒకటి గ్రామీణ ప్రాంతంలో వున్న యువతరానికి నాణ్యత గలిగిన విద్యను అందించాలన్న ఉద్దేశంతో మేము దీన్ని తీసుకువస్తున్నామని చెప్పారు అది సంతోషమే. అవసరముంది. హయ్యర్ ఎడ్యుకేషన్‌లో చాలా ఇన్‌స్టిట్యూట్‌లు వస్తున్నాయి. అయితే ఈ రోజు బిల్లులో ప్రతిపాదించిన ప్రకారం చూస్తే రూ. 2,940 కోట్ల వరకు ఈ మూడు ఇన్‌స్టిట్యూట్‌ల మీదే ఖర్చు పెట్టడం జరుగుతుందని వారు బిల్లులో ప్రపోజ్ చేసినారు. అయితే వెనుకబడ్డ ప్రాంతంలో వీటిని పెట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. అయితే ఈనాడు మీరు ఏదైతే మొదలుపెడదాము అనుకుంటున్నారో, దాని పర్పస్ ఒక్కసారి చూస్తే నానో టెక్నాలజీ, బయో టెక్నాలజీ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, సోలార్ ఎనర్జీస్, వీటన్నింటిపైన రీసెర్చ్ అంతా కూడా ఇన్‌స్టిట్యూట్‌లలో జరిగే విధంగా పెట్టాలని మీరు ప్రపోజ్ చేసారు. నేను మంత్రి గారిని ఒక్క విషయం అడగదలచుకున్నాను. మీరు దీని హెడ్‌క్వార్టర్సును తీసుకెళ్లి ఇడుపులపాయలో పెడదాము అనుకుంటున్నారు. ఈ రాష్ట్రంలో బ్యాక్‌వర్డ్ ఏరియాలు లేవా? ఇడుపులపాయ తప్ప. ఇడుపుల పాయలోనే హెడ్‌క్వార్టర్స్ పెట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఏదైనా ఒక ఇన్‌స్టిట్యూట్ గాని... అదొక చిన్న స్కూల్ కాదు, హాస్టల్ కాదు. మీరు రూ. 3 వేల కోట్లు ఖర్చు పెడుతున్నపుడు, మీరు ఏం క్రైటీరియా తీసుకుని ఈనాడు selection of the site చేసారు?. ఇదే హౌస్‌లో బాసరలో ఐఐటి పెట్టాలనే విషయంపై అనేక సందర్భాలలో చర్చకు వచ్చినపుడు మీరు అనేక

రకాలైనటువంటి అబ్జెక్షన్స్ వస్తున్నాయి, అక్కడ విమానాశ్రయం లేదు, రకరకాలైనటువంటి కారణాలు చెప్పి, మేము పెట్టలేకపోతున్నామని చెప్పారు, కనుక మేము హైదరాబాదులోనే పెడతాము అని ఆ రోజు చాలా వాదోపవాదాలు కూడా selection of the site పైన ఇక్కడ మన దగ్గర జరిగాయి. అయితే అదే పద్ధతిలో అంతకంటే స్టాండర్ట్స్‌లో మేం పెడతాము అంటున్న మీకు, హెడ్‌క్వార్టర్‌ను ఇడుపులపాయలో పెట్టవలసిన అవసరం ఏమిటి? ఏ క్రైటీరియాలో మీరు పెట్టారు. ముఖ్యమంత్రి గారి కాన్స్‌స్టిట్యూయెన్సీకి సంబంధించింది కాబట్టి అదొక్కటే క్రైటీరియానా? అంతకంటే బ్యాక్‌వర్డ్ ఏరియాలు లేవా? పోనీ అక్కడేమన్నా తక్కువ ఇన్‌స్టిట్యూట్‌లు పెట్టారా అంటే లేదు.

నా దగ్గర మొత్తం లిస్ట్ వుంది అధ్యక్షా. అంతకుముందే ఇడుపులపాయలోను, పులివెందులలోను మీరు ఇచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లు ఒక్కసారి లెక్కచూసుకున్నట్లైతే మరి ఇంకా దాని కంటె కూడా ఇంత పెద్ద ఇన్‌స్టిట్యూట్ తీసుకువెళ్లి అందులో కూడా హెడ్‌క్వార్టర్స్‌తో సహా అక్కడ పెట్టవలసిన అవసరం ఏమున్నదో మంత్రి గారు వివరణ ఇవ్వవలసిన అవసరం వున్నది. selection of the site is most important thing. దాన్ని మీరు ఎందుకు చేసుకున్నారనే దానిపైన మరొక్కసారి వివరణ ఇవ్వాలని మంత్రి గారిని కోరుతున్నాను. అంతకుముందే అక్కడ వున్న ఇన్‌స్టిట్యూషన్స్ చూస్తే 21st centuryకి సంబంధించిన ఇన్‌స్టిట్యూషన్స్ మేము already ఒకటి పెట్టేసినామని అన్నారు. 21వ శతాబ్ధపు గురుకులం అక్కడ పెట్టామని, అదేవిధంగా నాలెడ్జ్ సొసైటీ వ్యాలీ క్రింద ఒకటి డిక్లేర్ చేసారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఒకటి పెట్టుకున్నారు, సైనిక్ స్కూల్ ఒకటి పులివెందులలో పెట్టుకున్నారు, జెఎన్‌టియు క్యాంపస్ ఒకటి already అక్కడ పెట్టుకున్నారు, ఒకటి కరీంనగర్‌లో ఇచ్చారు. మరి already ఒక ప్రాంతమని, ప్రాంతీయతత్వం మాకు లేదని చాలా గొప్పగా మీరు మాట్లాడతారు. మరి already ముఖ్యమంత్రి గారి జిల్లాలో ఇచ్చినటువంటిది మాత్రం కంప్లీట్ అవుతుంది, అదే కరీంనగర్‌లో ఇచ్చినటువంటిది మాత్రం కంప్లీట్ కాదు. ఆ సంగతి మీరు వివరించిన తరువాత దాని విషయానికి వస్తాను. ఈ విధంగా మీరు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఒకటి తీసుకువెళుతున్నారు. ఈ విధంగా ఇన్ని ఇన్‌స్టిట్యూషన్స్ వుండగా మీకు ఇదే ఇడుపులపాయ దొరికిందా? ఈ ఇన్‌స్టిట్యూషన్ పెట్టడానికి. What is the criteria for selection of this one? ఇంతకంటే వెనుకబడ్డ ప్రాంతం రాష్ట్రంలో ఎక్కడా లేదా? హెడ్‌క్వార్టర్స్ తీసుకువెళ్లి అక్కడ పెట్టవలసిన అవసరం వున్నదా? హెడ్‌క్వార్టర్ అన్నప్పుడు బాసరలో ఎందుకుపెట్టరు? మొదటి నుంచి కూడా బాసరలో పెట్టాలని డిమాండ్ వున్నప్పుడు, తీసుకువెళ్లి హెడ్‌క్వార్టర్‌ను అక్కడ పెట్టడానికి, బాసర కంటే కూడా ఇడుపులపాయ ఏవిధంగా మెరుగైన ప్రదేశము అవుతుంది? ఈ వివరణ మీరు ఇవ్వండి. అదేవిధంగా ఇప్పటికే మీరు అనేక విధాలుగా ఒక్క ముఖ్యమంత్రి గారి నియోజకవర్గంలోనే అనేక వందల కోట్ల రూపాయలు పెట్టి రోడ్లేసుకుంటారు, అక్కడే మీరు ఎకో పార్కులు కడతారు, గోల్ఫ్ కోర్సులు పెడతారు, అక్కడే గెస్ట్‌హౌస్‌లు కడతారు. ఈ విధంగా ఒకే నియోజకవర్గంలో తనకు అధికారం వుందని ముఖ్యమంత్రిగారు పెడితే, సర్వం తన

కాన్‌స్టిట్యూయెన్సీలోనే పెట్టుకుంటే... ఇప్పటికి మాకు తెలిసిన లెక్క ప్రకారం చివరకు ఇడుపులపాయకు రైల్వే స్టేషన్ కూడా తీసుకెళ్లి దానికి సగం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెట్టి, ఇడుపులపాయలో రైల్వే స్టేషన్ దాకా కూడా తీసుకుపోతున్నారంటే ఎక్కడకిపోతున్నట్లు? మీరు ఎందుకు ఈ విధంగా ఒకే ప్రాంతము, ఒకే నియోజకర్గము, ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అయినంత మాత్రాన సర్వం తన నియోజకవర్గంలో 4 లైన్ల రోడ్లు, ఆరు లైన్ల రోడ్లు వేసుకుంటారు. ఇడుపులపాయ నుంచి మొత్తం రోడ్లు కనెక్టివిటీ వేసుకుంటారు?

మొన్నటి బడ్జెట్‌లో unnoticed గా మీరు తీసుకెళ్లారు, చిన్న గ్రామపంచాయితీగా వుండి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన పులివెందులకు రూ.39 కోట్లు కేటాయిస్తే, యావత్ రాష్ట్రమంతా వున్న మున్సిపాలిటీలన్నింటికీ రూ.200 కోట్లు ఇవ్వడానికి కూడా రోశయ్య గారు వెనకాముందు అయ్యారు. రూ.200 కోట్లు కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదు. ఈవిధంగా ఒకే ప్రాంతానికి, ఒక ముఖ్యమంత్రి గారి నియోజకవర్గానికి ఈ విధంగా ఇన్‌స్టిట్యూషన్స్, ఈ విధంగా కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకుంటూ, ప్రతి ఎకరా భూమికి నీళ్లు ఇస్తామని చెప్పి ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎంత డబ్బులు పెట్టారో, రోడ్ల కోసం ఎంత డబ్బులు పెట్టారో, ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఎంత డబ్బులు పెడుతున్నారో, ఇప్పుడు మళ్లా ఇడుపులపాయలో మూడు వేల కోట్ల రూపాయల ఇన్‌స్టిట్యూషన్ పెట్టడం ఇది ఎంతవరకు సమంజసము? What is the criteria for selecting this particular area? అనేది ముందుగా మీరు స్పష్టం చేయాలి.

మేడమ్ స్పీకర్ గారు, నేను సదరు అంశాలు ఎందుకు ఇక్కడికి తీసుకొస్తున్నానంటే, already మీరు చాలా ఇన్‌స్టిట్యూషన్స్ అక్కడ పెట్టారు. ఎంత... ఒక పెద్ద లిస్టు తయారైపోయింది అధ్యక్షా. మీరు ఈ రోజు రూ.100 కోట్లు పెట్టి యానిమల్ హస్బెండరీకి సంబంధించి ఒక రీసెర్చ్ సెంటర్‌ను తీసుకెళ్లారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు తీసుకెళ్లారు, అకాడమీని తీసుకెళ్లారు. ఇన్ని వుండగా ఇంకొకటి ఎందుకు తీసుకెళ్తున్నారు. That is my question. My straight question to the Minister is what is the criteria? There must be some criteria.

కాదమ్మా, ఇంతపెద్ద ఇన్‌స్టిట్యూషన్ మీరు ఇచ్చినపుడు, site selection కు criteria వుండాలి కదా? ఏ criteria తో మీరు site selection చేసారు? మీకు ఇంతకంటే వెనుకబడ్డ ప్రాంతాలు లేవా? ఆయన మంత్రి గారు కదా! ఆయన నియోజకవర్గం, ఆయన దగ్గర పెట్టమనండి. పులివెందుల కంటే వెనుకబడ్డ ప్రాంతాలు లేవా?

మేడమ్, ఇక్కడ రాష్ట్రంలో సమస్యలకు కొదవ లేదు. మీరన్నట్లుగా ముఠా తగాదాలకు సంబంధించి ఆ యొక్క కమిటీ రిపోర్టు నేను కూడా చూసాను. డెవలప్‌మెంట్‌కు అవసరమున్నదని చెప్పి ఇచ్చాము. అదే విధంగా ఇంకొక రిపోర్టు కూడా ఇచ్చాము. నక్సలిజానికి కూడా కారణాలున్నాయి. నక్సలిజం వల్ల చాలా కారణాలతో, వెనుకబాటుతనంతో చాలా ప్రాంతాల్లో అనేక ఇబ్బందులున్నాయి. ఆ ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరమున్నది, దాని

కోసం ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్యాకేజి కూడా పంపించాము.

( ఎందుకు పంపించారో చెప్పండి అంటూ అధికార పక్ష సభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ నుంచి అభ్యంతరాలు)

నన్ను పూర్తిగా చెప్పనియ్యి బ్రదర్. అప్పుడే మీకు, అయితే మన మినిస్టర్ కన్నా లక్ష్మీ నారాయణ గారికి ఒక్క పులివెందుల ఫ్యాక్షనిజమే కనబడుతోందా? మీకు మొత్తం రాయలసీమలో ఫ్యాక్షనిజమే లేదా? ఒక్క పులివెందులలో వున్న ఫ్యాక్షనిస్టులంతా కూడా దీంతో అభివృద్ధి సాధించుకుంటారు, మొత్తం వాళ్లు ఇంతకుముందు పులులు పోయినట్లుగా, పులులన్నీ ఏవిధంగా అడవులకు పోయినాయో, ఆవిధంగా మొత్తం రాష్ట్రం మీద పడ్డారయ్యా వాళ్లు. ఆ విధంగా మీరు వదిలిపెట్టేసి, అమ్మా నేను మాట్లాడిన తరువాత వారికి గంటసేపు అవకాశం ఇవ్వండి.

( అంతరాయం )

ఇప్పుడు రాయలసీమ మొత్తంలో పులివెందుల ఒక్క దగ్గరే ఫ్యాక్షనిజం వున్నదా? మీరు పులివెందులలో వున్న ముఠాతగాదాలు తగ్గించడానికి ప్రత్యేకమైన పథకం ఏదైనా అమలు చేయదలచుకున్నారా? అది ఏవిధంగా చేస్తున్నారనేది చెప్పండి పోని. మేము పులివెందులలో ఇప్పటి నుంచి ముఖ్యమంత్రి అయిన తరువాత పులివెందులలో ఫ్యాక్షనిజం వుండదు, కానీ మా యొక్క ప్రాంతంలో వున్న ముఠాతగాదాలు తగ్గించడానికి ఇన్‌స్టిట్యూషన్స్ పెడుతున్నామని చెప్పండి, ప్రజల కన్నా తెలుస్తుంది, మాకన్నా అర్థమవుతుంది. మాకు అర్థం కాక తలపట్టుకుంటున్నాము. ఏమిటయ్యా ఒక నియోజకవర్గంలో ఇప్పటికే రూ.7 కోట్లు తీసుకెళ్లి పెట్టారు. మొత్తం ఒక్కొక్క ప్రాంతానికి లేదు. ఒక ప్రాంతానికి ఈరోజు ఎన్ని వేల కోట్ల రూపాయలు పెట్టారండీ? ఈ రోజు ఇన్ని వేల కోట్ల రూపాయలు పెట్టే ఒక్క ఇన్‌స్టిట్యూషన్ కాదమ్మా...మా దగ్గర చెబుతున్నాము.

మేడమ్, ఈ అంశాన్ని లేపలేదమ్మా. మంత్రి గారు అడిగారు, అయ్యా! నువ్వు అప్పుడు హోం మంత్రిగా వున్నప్పుడు ఒక రిపోర్టు ఇచ్చావు. ఆ రోజున్న పరిస్థితులలో దాన్ని ఇంప్రూవ్ చెయ్యాలంటే డెవలప్‌మెంట్ జరగాలని చెప్పావు, ఇప్పుడు మేము దాన్ని అమలుచేస్తున్నాము అని వారు చెప్పారు. అయితే పులివెందులలో మాత్రమే అమలుచేస్తున్నారా లేక రాష్ట్రమంతా అమలుచేస్తున్నారా అని నేను అడుగుతున్నాను. తప్పండీ రాష్ట్రమంతా అమలు చేస్తున్నారా, లేక ఇతర ప్రాంతాలలో చాలా మంది మీ దగ్గరున్న సభ్యులున్నారు, మీ మంత్రులున్నారు, మరి వారి దగ్గరేమన్నా అమలచేస్తున్నారా? లేక ఒకే ఒక్క దగ్గర మీకు ఫ్యాక్షనిజం కనపడుతోందా? దీనిపైన కొన్ని వేల కోట్ల రూపాయలు తీసుకెళ్లి ఒకే ప్రాంతంలో, ఒకే నియోజకవర్గంలో పెట్టవచ్చునా? ఈ ఇడుపులపాయకి 4 లైన్లు, 6 లైన్ల రోడ్లు వేసుకుంటున్నారు. మా దగ్గర వున్న భూములన్నీ అమ్మేస్తున్నారు. మా జిల్లాలో ఒక్కొక్క చోట రోడ్లు బాగాలేక ఆర్‌టిసి బస్‌లు తిరగడం బంద్ అయిపోయాయి. అవి వదిలిపెట్టేసి, మీరు తీసుకువెళ్లి 6, 7 లైన్ల రింగ్‌రోడ్లు వేయడం, మళ్లీ దానికొక అథారిటీ. ఇది ఏందండీ? ఈరాష్ట్రంలో ఏమన్నా ప్రభుత్వం వున్నదా? లేకపోతే కొంత

వ్యక్తుల కోసం ఈ ప్రభుత్వం అంతా కూడా పనిచేస్తోందా? కనుక నా క్వశ్చన్, మీరు రూ. 3 వేల కోట్లకు సంబంధించిన ఇంతపెద్ద ఇన్‌స్టిట్యూషన్‌ను ఎందుకు ఇడుపులపాయలోనే పెడుతున్నారు? అంతకుముందే ఇన్ని కాలేజీలు, ఇన్ని ఇన్‌స్టిట్యూషన్‌లు అక్కడ పెట్టుకున్నారు. గత మూడు సంవత్సరాల కాలంలోనే అక్కడ మీరు అనేక యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూషన్‌లు అన్నీ తీసుకెళ్లి పెట్టుకున్నారు.

మొత్తం ఆంధ్రప్రదేశ్ అంతా తీసుకొనిపోయి అక్కడ పెడితే ఆ నియోజకవర్గంలో డెవలప్ అయితే మొత్తం అంతా డెవలప్ అవుతుందా? నిన్నో మొన్నో చూశాను ప్రాంతీయతత్వం రాకుండా చట్టబద్ధ సంస్థ తెస్తామని. అది తెచ్చినప్పుడు మేము మాట్లాడుతాము. చట్టబద్ధ సంస్థలు ఎందుకు అవసరం వస్తున్నాయండీ ఈనాడు రాష్ట్రంలో ఎందుకు సమస్యలు వస్తున్నాయండీ. ఈ విధంగా అధికారంలో వున్న వ్యక్తులు ఎవరికి తోచింది వాళ్లు వేలాది కోట్ల రూపాయలు, ఇది అంతా కూడా ప్రజాధనం it is nothing but publicity. ఈ ఇన్‌స్టిట్యూషన్ అక్కడ పెట్టడానికి ఏమి క్రైటీరియాను చెప్పారు. ఫలానా ప్లేస్‌లో వుంటుందని చెప్పి బిల్లులో పెట్టేది ఎందుకు, you simply call it అయ్యా బిల్లులో మేము మూడు ఇన్‌స్టిట్యూషన్సు పెట్టదల్చుకున్నాము దానికి ఒక కమిటి వేస్తాము, ఒక క్రైటేరియా పెడతాము, ఆ క్రైటీరియాను అనుసరించి ఈ క్రైటీరియాలో వున్న వాళ్లకు ఈ యొక్క ప్రాంతంలో ఇది తీసుకొని చేస్తాము You appoint expert Committee. Let them also go through the State. Let them also idetify. ఆ తరువాత మీరు, ఎక్కడ కావాలంటే అక్కడ పెట్టాలి తప్ప మీ చేతిలో అధికారం వుందని చెప్పి నా ఇంటిలో పెట్టుకుంటాను, నా ఇంటి దగ్గర పెట్టుకుంటాను, నా ఇంటి ప్రక్కన పెట్టుకుటాను ఇన్స్ట్యూషన్సు అన్ని, అంటే ఇది ఎంతవరకు న్యాయం అండీ. మీరు ఏ విధంగా ఇడుపులపాయను సెలక్టు చేశారు. మొత్తం ఇన్స్ట్యూషన్సు అన్నీ ఒక్క దగ్గరకు తీసుకునిపోయి ఎట్లా పెడతారు? దానికి మీరు what is the criteria for expression has to be considered. బిల్లులో ఇడుపులపాయ హెడ్ క్వార్టర్ అని పెడితే రేపు హెడ్ క్వార్టర్ మార్చడానికి అవకాశం లేకుండా ఇది ఎందుకు బిల్లులో పెట్టవలసిన అవసరం ఏర్పడింది. ఈ విషయాలు మీరు వివరణ ఇవ్వాలని చెప్పి కోరుతున్నాను.

మేడమ్ డిప్యూటీ స్పీకర్‌గారూ, **నేను ఇంతకు ముందే చెప్పాను. ఇదేదో ఒక చిన్న స్కూల్ కాదు, చిన్న కాలేజ్ కాదు కదా! ఒక యూనివర్సిటీని నెలకొల్పేటప్పుడు, దాని లొకేషన్ కూడా చాలా ముఖ్యం. కాబట్టి దయచేసి మీరు దీని గురించి ఒక కమిటీని వేయండి. దయచేసి దానికి కొన్ని గైడ్‌లైన్స్ పెట్టండి. లొకేషన్ చాలా ముఖ్యం.** సరే, వాళ్లు ఏదో పెద్ద ఘనకార్యం చేస్తున్నామని చెపుతున్నారు. ఈ రోజున రాష్ట్రంలో ప్రైమరీ ఎడ్యుకేషన్ గురించి ఏమి చేశారు మీరు? పాఠశాలల్ని మూసేస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక 1023 స్కూల్స్ మూతపడ్డాయి. 6600 స్కూల్స్ మూసేయడానికి సిద్ధంగా ఉంది ఈ ప్రభుత్వం. ప్రైమరీ ఎడ్యుకేషన్‌ను గాలికి వదిలేసారు. సరే, హయ్యర్ ఎడ్యుకేషన్ విషయంలో మేమేదో చేస్తున్నామని చెప్పుకుంటున్నారు.

2946 కోట్ల రూ.లు దీనిపైన ఖర్చు పెడతామని చెపుతున్నారు. ఈ ప్రభుత్వానికి ఒక స్టయిల్ ఉంది అధ్యక్షా. ముందు కొన్ని ప్రకటనలు చేయడం, తర్వాత ఇవ్వాళ మంత్రిగారు చాలా గొప్పగా చెపుతున్నరు. మేము ఏరియాల వారీగా అన్ని ప్రాంతాల్ని సమానంగా చూస్తున్నమనే పద్ధతిలో చెప్పుకుంటున్నారు. మంత్రిగారూ, నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ ప్రభుత్వం ఏ స్టేజ్‌లో ఉందండీ? వేమన యూనివర్సిటీ ఏ స్టేజ్‌లో ఉంది? మీరు మినిస్టర్ కదా, మీరు అక్కడకు వెళ్లి ఒకసారి చూడండి. నిమ్స్ ఎక్కడ ఏ స్టేజ్‌లో ఉంది? రిమ్స్ ఎక్కడ ఏ స్టేజ్‌లో ఉంది? కడపలో పెట్టిన హాస్పిటల్ రెడీ అయిపోతుందా? ఇదే ముఖ్యమంత్రిగారు మీ జిల్లాలోని భువనగిరిలో నిమ్స్ గురించి ఫౌండేషన్ వేశారు కదా, అది ఏ పరిస్థితిలో ఉంది? ఆ రాళ్లు ఇప్పటికీ అట్లాగే ఉన్నాయి. మరి దాని సంగతి ఎందుకో మీరు చెప్పరు? తెలంగాణ యూనివర్సిటీ మీ జిల్లాలోనే పెట్టారు కదా! నిన్న ఏదో మంత్రిమండలి సమావేశంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ అని పేరు కూడా మార్చారు. అది యూనివర్సిటీయా? ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పి.జి. సెంటర్ బోర్డు తీసేసి యూనివర్సిటీ బోర్డు పెడతారా? మరి అదే యోగి వేమన యూనివర్సిటీ అన్ని విధాలుగా రెడీ అయిపోతుందా? రేపు దీని విషయంలో కూడా ఖచ్చితంగా ఇదే విధంగా జరుగుతుంది. ఇడుపులపాయలో పనులు స్టార్ట్ అయిపోతాయి.మీ బాసర మాత్రం రెడీ కాదు. సరస్వతీదేవి దగ్గరకు మనమంతా పోయి మొక్కుకోవాలి తప్ప, ముక్తి ఉండదు. ఈ ప్రభుత్వం పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోంది. పూర్తిగా ప్రాంతీయతత్త్వంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోంది. కనుక దీనిపైన మేము చెప్పదలచుకున్నాము– సమాన ప్రాతిపదిక మీద మూడూ ఒకేసారి స్టార్ట్ చేస్తారా? ఇడుపులపాయలో హెడ్‌క్వార్టర్స్ ఎందుకు పెట్టవలసి వచ్చింది? రాష్ట్రం మొత్తానికి ఇడుపులపాయ ఏవిధంగా కన్వినియంట్ అవుతుంది? మీరంటున్నారు స్టూడెంట్స్ అక్కడకు వెళ్లవలసిన అవసరం ఉండదు, ఏదో ఒక ఆఫీసు అక్కడ పెట్టుకుని, అధికారులు కూర్చుంటారని. యూనివర్సిటీ హెడ్ క్వార్టర్స్‌కు సూడెంట్స్ వెళ్లకుండా ఉంటారా? ఎన్ని సమస్యలు వస్తాయి వారికి? ఇడుపులపాయికి విద్యార్థులు పోవలసిన అవసరం లేనప్పుడు, బాసరలో పెట్టు. అక్కడే ఎందుకు పెట్టుకోవాలి? పోనీ మీ కడపలో ఏమైనా తక్కువ పెట్టుకున్నారా? కనుక మీరు అక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ హెడ్‌క్వార్టర్స్ పెట్టడానికి వీల్లేదు. గ్రామీణ వెనుకబడిన ప్రాంతం ఒక్క ఇడుపులపాయలోనే కనిపించిందా మీకు? పులివెందుల ఒక్కటే కనిపించిందా మీకు? ఇక్కడ ఇంకా ఎక్కడా లేదా? రాయలసీమలో లేదా, తెలంగాణలో లేదా? అక్కడ ఇవ్వాళ వెనుకబడ్డ ప్రాంతం లేదా? అక్కడే పెట్టడానికి ఏం అవసరం వచ్చింది? దానికి సరైన జవాబు చెప్పండి.

సరే, వైస్ ఛాన్సలర్ అన్నారు, ఛాన్సలర్ అన్నారు. నిబంధనల ప్రకారం అయితే గవర్నరే ఛాన్సలర్‌గా ఉంటారు. సెర్చ్ కమిటీ వేసిన తర్వాత వైస్ ఛాన్సలర్‌ను అపాయింట్ చేస్తారు. కాని బిల్లులో ఏమి ఉందంటే, వైస్ ఛాన్సలర్‌ను ఛాన్సలరే అపాయింట్ చేస్తారని ఉంది. దానిపైన కూడా వివరణ ఇవ్వండి. రెండవది ఇనిస్టిట్యూషన్ పెట్టేందుకు సెలక్టు చేసిన ఏరియా గురించి ఇవ్వండి. మూడవది అన్నీ సమానంగా at a time స్టార్ట్ అవుతాయి, ఎక్కడ ఏ స్టేజ్‌లో ఎంత

ఖర్చు పెట్టినా, మూడు ప్రాంతాల్లో సమానంగా ఖర్చు పెడతామని మీరు ఈ హౌజ్‌కు అస్యూరెన్స్ ఇస్తారా? ఈపాటికే ఇడుపులపాయలో పనులు స్టార్ట్ అయిపోయి ఉంటాయి. మీరు అక్కడ దాన్ని స్టార్ట్ చేస్తారు. మిగతావి అలాగే ఉండిపోతాయి. ఆల్‌రెడీ మీరు తెలంగాణ యూనివర్సిటీ పరిస్థితి ఏం చేశారు? ఫౌండేషన్ వేసి, అక్కడ రాళ్లు వదిలిపెట్టేశారు. మీ స్వంత జిల్లాలో పెట్టి ఏడాదిన్నర అవుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ పి.జి. సెంటర్ బోర్డు తీసేసి యూనివర్సిటీ బోర్డు పెట్టారు. దాన్నే మీరు యూనివర్సిటీ అంటారా? మేము ఇక్కడ అడిగితే, ఇడుపులపాయ ప్రాంతం చాల బ్రహ్మాండంగా ఉంది, అక్కడే మేమే ఖచ్చితంగా పెడతామనే పద్ధతిలో మాట్లాడుతున్నారు. అలా పెట్టడానికి మీరు తీసుకున్న Criteria ఏమిటి? Criteria నిర్ణయించడంలో మీరు ఎక్స్‌పర్టా ఇంత పెద్ద ఇనిస్టిట్యూషన్‌కు? బయో టెక్నాలజీ, నానో టెక్నాలజీ వీటన్నింటిని తీసుకునిపోయి ఎక్కడో ఒక ఊరిలో పెట్టి, హెడ్‌క్వార్టర్స్ కూడా అక్కడే పెడతామని చెప్పడం ఎంత వరకు సమంజసం అని అడుగుతున్నాను. దానిపైన వివరణ ఇవ్వాలని మంత్రిగారిని డిమాండ్ చేస్తున్నాను.

బిల్ పాసయింది కదా మేడమ్ స్పీకర్. మేడమ్ స్పీకర్, ఒక్క నిముషం ఇవ్వండి. ఏదో ఒకటి చెబుతాము. ఒక్కసారి ఇవ్వండి.

# బి.సి.లు - చేతి వృత్తులు స్థితిగతులు

14-11-2007

స్పీకర్ సర్, మొత్తం గ్రామీణ వ్యవస్థలో చాలా మంది చేతివృత్తుల మీద ఆధారపడి ఉన్నారు. యంత్రాలు వచ్చిన తరువాత వీరు పూర్తిగా జీవనాధారాన్ని కోల్పోయి వలస కూలీలుగా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. వారి జీవితాలను బాగు పరచవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ప్రభుత్వం వారిచ్చిన సమాధానం ఒకసారి చూస్తే జనాభాలో 52శాతం ఉన్న బీసీల పరిస్థితి ఈ ప్రభుత్వ పరిపాలనలో ఎంతో దిగజారింది. ఈనాడు పరిశ్రమలను అభివృద్ధి చేయటానికి ఒక ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా ఐడిబిఐ ఉన్నది. ఈ విధంగా లక్షల కోట్లు రూపాయలు పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి వారికి లోన్లు ఇవ్వడం జరిగింది. వారికి ఇచ్చిన ఎన్నో వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసారు. ఆ విధంగా పరిశ్రమల వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ చేతివృత్తుల మీద ఆధారపడి, జనాభాలో 52 శాతం ఉన్న ఈ వెనుకబడిన తరగతుల జనాభా చేతివృత్తులను ఆధునీకరించడానికి, వాళ్ల జీవన విధానం మెరుగు పరచడానికి బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సగటున ఆరు కోట్ల రూపాయలు కేటాయించి, రూపాయి పడవేసినట్లుగా లెక్కలు కట్టి ఆరు కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చారు. మత్స్యకారుల కార్పొరేషన్‌కు మనిషికి కనీసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ముఖ్యమంత్రి గారు, ఫైనాన్స్ మినిష్టరు గారు ఒక్క మాట వినాలి, నాయి బ్రాహ్మణులకు బడ్జెట్‌లో కేటాయించింది రూ.25 లక్షలు. అందులో ఖర్చు పెట్టింది రూ.12 లక్షలు. ఏదైనా కోత వేయాలంటే అక్కడ నుంచే కోత మొదలు పెట్టారు. ధోబీ ఇల్లు లేని గ్రామం ఉందా? ప్రతి ఊరిలో ఉంటారు. ధోబీ ఘాట్లు ఉన్న చెరువులు అన్ని ఎండి పోయాయి. ధోబీలను గ్రామం లోపలకు రానీయరు కనుక వారికి బోరు వేసుకొని ధోబీఘాట్‌లు నిర్మించుకోవటానికి మా ప్రభుత్వం ఒక స్కీమ్ మొదలు పెట్టింది. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కనీసం ఒక్క ధోబీ ఘాట్‌ను అయినా నిర్మించిందా? వారికి కేటాయించిన బడ్జెట్ కనీసం సబ్బు బిళ్ల కొనటానికి

కూడా సరిపోదు. గీత కార్మికుల్లో చనిపోయిన వారికి ఏమైనా ఇచ్చారా? (కాంగ్రెసు సభ్యుల నుంచి అంతరాయం) అయ్యా మీకు వినబుద్ధి కాదు, రాజ్యం మీది నాయనా, ఈనాటి పరిస్థితి ఏమిటి అని ఒక్కసారి చూసుకోండి.

మీ ప్రభుత్వ పరిపాలనలో ప్రజలు ఏ విధంగా బ్రతుకుతున్నారో ముఖ్యమంత్రిగారిని, ఫైనాన్స్ మినిష్టర్ గారిని చూడమనండి. హాస్టళ్ల మీద చర్చ జరుగుతున్నప్పుడు మొన్న ముఖ్యమంత్రి గారు లేరు. ఈనాడు ఆ పిల్లలు చదువుకోవడానికి చదువు లేదు. వృత్తి చేసుకోవడానికి ఒక్క రూపాయి కూడా మీరు వారికి ఇవ్వడం లేదు. మీరు ఇవ్వదలచుకున్నారా? లేకపోతే వారి మీద కక్ష గట్టి ఈ రాష్ట్రంలో మేము ఉన్నన్ని రోజులు ఒక్క రూపాయి ఇవ్వము, మీ దిక్కున్న చోట చెప్పుకోండి అన్నట్లు ఈ ప్రభుత్వ పరిపాలన ఉంది. అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ముందుకు వచ్చారు. దయచేసి మీరు అంగీకరించి దీన్ని మొత్తం ఆఫ్ ఎన్ అవర్ డిస్కషన్‌గా మార్చండి. దయచేసి మాకు సమయం ఇవ్వండి, వాళ్లను కూడా జవాబు చెప్పమనండి. ఎవరేం చేశారు? ఏం జరుగుతూ వుంది? ఏ రంగంలో పోతున్నాయి? ఏ ప్రజలు వీళ్ల పరిపాలనలో సుఖంగా వున్నారు? ప్రజలు ఏ విధంగా బాధపడుతున్నారో, ఆ విషయాలు చర్చించడానికి అరగంట సమయం ఇవ్వండి. ఇది ఈ రాష్ట్రంలో వున్న యాభై శాతం ప్రజలకు సంబంధించిన సమస్య. ఈ శాసనసభలో ఇంతకంటే అత్యంత ప్రాధాన్యత వున్న విషయం వుండదు. కాబట్టి దయచేసి దాన్ని కన్వర్టు చేయండి, సరిపడా వ్యవధిని మాకు ఇవ్వండి. వ్యవధి ఇచ్చి కూడా జవాబు చెప్పమనండి. అధ్యక్షా, నా అభ్యర్థన ఏమంటే ఈ హౌస్ లోపల ఏది కూడా సక్రమంగా డిబేటుకు రావడం లేదు. వస్తుందన్న నమ్మకం మాకు కనపడటం లేదు. ఎందుకంటే వాళ్లు ఎత్తుగడతో ఏదో ఒక విధంగా దీన్ని తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రోజు ఇప్పుడే దీన్ని కన్వర్టు చేయండి. డిబేటు కూడా చేద్దాము . వ్రాతపూర్వకంగా సమాధానం మేము కోరుతున్నాము. ముఖ్యమంత్రి గారికి ఫిగర్స్ అన్నీ కళ్లల్లో వున్నాయి కదా, నోటితో చెబుతున్నారు కదా, మాకు చెప్పమని చెప్పండి. అంతే తప్ప మీరు దీన్ని మళ్లీ వాయిదా వేస్తే మాత్రం బాగుండదు.

స్పీకర్ సర్, ఒకటి Finance Corporation గురించి అసలు సమాచారం మీ ప్రభుత్వం లోపలే ఉంది. ఎన్ని కోట్ల మంది ఏ ఏ వృత్తుల వారు వారి వృత్తుల పైన ఆధారపడి బ్రతుకుతున్నారు? వారికి ఆర్థికపరమైన సహకారం అందించవలసిన బాధ్యత ప్రభుత్వము పైన ఉన్నది. ముఖ్యమంత్రి గారు మీరు ఏమి చేసినారు అంటున్నారు. మేము మా ప్రభుత్వం చివరిలో రూ. 430 కోట్లు ఎలాట్ చేశాం. ఈనాడు ఆర్థికపరమైన పరిస్థితులు మెరుగైనాయి. రాష్ట్రంలోనే కాదు, దేశంలో బడ్జెట్ 3 రెట్లు పెరిగిపోయింది. ఆ లెక్కన చూసినా ఒక వేయి కోట్ల రూపాయల పైన ఖర్చు పెట్టాలి. కాని మీరు ఇస్తున్నది 6 కోట్ల రూపాయలు. అదే పద్ధతిలో ఒక్కొక్క కార్పోరేషన్‌లో నాయి బ్రాహ్మణులకు రూ. 25 లక్షలు ఇచ్చారు. వాళ్లు రోడ్డు పై రాళ్లు కొట్టుకొనే వారనుకొని వారికి ఒక రూం కూడా ఇచ్చిన పాపాన పోలేదు . గొర్రెల కాపరుల పరిస్థితి అంతే. అదే గీత కార్మికులకైతే వారి చావుకు ఇచ్చినారు కాని వాళ్లు బ్రతకడానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ విధమైన పరిస్థితులలో కుల వృత్తుల వారికి సంబందించి బడ్జెట్ ఎందుకు కేటాయింపులు చేయరు? బిసి కార్పోరేషన్ అధికారులతో మాట్లాడితే అప్పు ఇచ్చినటువంటి వాటిని వసూలు

చేసుకొని జీతాలు తీసుకొంటున్నామని చెప్పినారు. ఈనాడు ముఖ్యమంత్రి గారు మా మీద ఎదురు దాడి చేస్తున్నారు. ఈనాడు కోట్లాది మందిని మనము చూస్తే సిగ్గుతో తల వంచుకోవాలి. ఈ యొక్క బడ్జెట్ 25 లక్షలు రూపాయలు కనీసం చస్తే చావుకు కూడా పనికి రాదండి. ఆ విధంగా బిక్షం వేసినట్లు వేస్తూ పైగా మామీద ఎదురు దాడి చేస్తున్నారు. అధ్యక్షా, రాజశేఖర్ రెడ్డి గారికి ఒకటి రిమైండ్ చేయదలచుకున్నాను. ఆనాడు మీ పాదయాత్రలో పల్లె కన్నీరు పెడుతుందంటూ ఊరూర పాటలు పాడుతూ తిరిగారు. మరి ఈనాడు పల్లె పరిస్థితి ఏమైంది? ఈనాడు కక్ష కట్టినట్లుగా ఉన్నారు.

**అధ్యక్షా, బి.సి.ల పరిస్థితి గురించి ఇక్కడ చెప్పుకొన్నా, బయట చెప్పుకొన్నా వినే నాథుడు లేదు. ఈ సభలో నేటికి కూడా 70 కులాల వారు ఇంకా కాలు పెట్టనే లేదు. ఉన్న పదిమందిమైనా మా ఆవేదననైనా చెప్పుకోనీయండి.** ఇంతకు ముందు మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు అయింది, మీరేమి చేస్తున్నారు ఫైనాన్స్ కార్పోరేషన్ పెట్టి అంటే మంత్రి గారు సమాధానం చెపుతూ, మా అధికారులను వేరే రాష్ట్రాలకు పంపి సమాచారం తెప్పించుకొని అవి ముఖ్యమంత్రి గారికి సమర్పించడం జరిగిందని చెప్పారు. మీరు (మంత్రి) అయ్యప్ప దీక్షలో ఉన్నారు. మీరు అయ్యప్ప కొండకు వెళ్లి అక్కడ హుండీలో వేస్తే ఆ దేవుడైనా కరుణిస్తాడేమో కానీ, రాజశేఖరరెడ్డి గారికి అప్పజెప్పిన తరువాత మూడున్నర సంవత్సరాలైనా ఇంతవరకు అతీ గతీ లేదు. ఎంత దౌర్భాగ్యమైన పరిస్థితో ఒకసారి ఆలోచించండి. ఈనాడు చాలా వరకు స్టాటిస్టిక్స్ లేవు. కరీంనగర్ జిల్లాలో స్వర్ణకారులు 250మంది చనిపోయినట్లు చెపుతున్నారు. వందలాది మంది అర్ధాకలితో వలసలు వెళుతున్నారు. పేదవాడికి బ్రతుకుదెరువు చూపించలేని పరిస్థితి ఇక్కడ ఉంది. బి.సి. ఫైనాన్స్ పరిస్థితి దారుణంగా ఉంది. ముఖ్యమంత్రిగారు సభకి రావాలి. మీరు పిలిపించండి. ఆయన జవాబు చెప్పాలి. ఖచ్చితంగా దీనికి జవాబు చెప్పేంతవరకు ఏదైనా సరే. మీరు మాకు ఎంత శిక్ష విధించినా సరే మేము పడడానికి సిద్ధంగా ఉన్నాము. Let the Chief Minister come and answer this question. శాసనసభలో అర్థవంతమైన చర్చ జరగాలి. బాధ్యత కల ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం నుండి కనీస సమాధానమైనా మేము ఎక్స్‌పెక్ట్ చేస్తాము. ప్రతిసారి మేము రావడం ప్రొటెస్ట్ చేసి వెళ్లిపోవడామా అండీ? వారు కనీస సమాధానం కూడా చెప్పడానికి ప్రయత్నం చేయకుండా అవహేళన చేసే పద్ధతిలో వారు మాట్లాడుతుంటే ఎట్లా? మీరు అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలైంది. మీరు ఎవరెవరికి అప్పాయింట్‌మెంట్స్ ఇచ్చారు? ఎవరెవరికి అధికారాలు పంచారు ? మూడు రోజుల క్రితం ఇదే ముఖ్యమంత్రి గారికి నేను మొదటిసారి ఒక ఉత్తరం వ్రాశాను. పేదలు చదువుకొనే అంబేద్కర్ యూనివర్శిటీలో బలహీనవర్గాలకు సంబంధించి చాలా ఉత్తముడైన బి.సి.అభ్యర్థి ఉన్నాడు, వారికి అప్పాయింట్‌మెంట్ ఇవ్వండంటే, కె.సి.రెడ్డి గారు మొన్న మూడు రోజులు క్రితం తీసుకు వచ్చి ఒకాయన్ని పెట్టారు. అపోజిషన్ పార్టీ తరపున లేవనెత్తిన సబ్జెక్టుకి అయినా ఇవ్వకుండా, కేర్‌లెస్‌గా మీకు దిక్కున్న చోట చెప్పుకోండి అనే విధంగా ఈ ప్రభుత్వం అణచి వేస్తోంది.

# గీత కార్మికుల సమస్యలు

28-3-2008

మినిస్టరుగారు అఫీషియల్సుతో టోటల్‌గా బ్రీఫింగ్ తీసుకున్నారో లేదో నాకు తెలియదు. 68-బి ఆన్సర్ చేస్తూ టాపింగ్‌కు సంబంధించి గీత కార్మికులకు సంబంధించి ఒక ప్రొవిజన్ ఇంక్లూడ్ చేస్తున్నారు. నర్సింహయ్యగారు చెప్పినట్లు ఐఎమ్ఎఫ్‌లతో బార్‌లతో దానికి సంబంధించిన క్లాజ్‌లో వీటికి టాపింగ్ తెచ్చే ప్రయత్నం చేస్తే డీటెయిలింగ్ ఏమి చెప్పలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత గీత కార్మికులకు సంబంధించి అనేక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నది. హైదరాబాదు, సికింద్రాబాదులలో ఎలాగు షాపులు మూసి వేశారు. అన్ని ప్రాంతాలలో విపరీతమైన దాడులు చేస్తున్నారు. చాలా అరెస్టులు చేస్తున్నారు. బీభత్సం చేస్తున్నారు. వాటికి సంబంధించి ఈ వృత్తి పై పని చేసే వారిని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నారు. వారు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా వాస్తవాలు అలా జరుగుతున్నాయి. ఈ వృత్తి పైన వస్తున్న ఆదాయం పెద్దగా లేదు. రూ.100 కోట్లు వస్తుంది. ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయింది. మెల్లమెల్లగా తగ్గిస్తే రెవెన్యూస్ పెరుగుతాయనే దురాలోచన ఈ ప్రభుత్వానికి వచ్చింది. ఈ వృత్తిని తప్పించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు నడిపిస్తున్నారు. తప్పనిసరిగా లక్షలాది మంది ఈ వృత్తిపై ఆధారపడి బ్రతుకుతున్నారు. మినిష్టరుగారు కాని శాసనసభ్యులు కాని ఆలోచన చేయవలసిన విషయం. **ఈరోజు కల్లు గీత కార్మికులు సంతోషంగా బ్రతుకుతున్నారని అనుకుంటున్నారు. ఈ వృత్తి చాలా బ్రహ్మాండమైన వృత్తి కాదు. ఈ వృత్తి గురించి చాలామందికి తెలియక పోవచ్చు. మూడునాలుగు సార్లు రోజుకు చెట్టు ఎక్కవలసి వస్తుంది. ఈ వృత్తిలో చాలా మంది చనిపోయారు. ఈ వృత్తిలో చనిపోయినట్లుగా ఎవరూ చనిపోరు.** వికలాంగులు అవుతున్నారు. మూడు నాలుగు వందల మంది చనిపోతున్నారు. అయినా వేరే గత్యంతరం లేక వారు జీవనం సాగిస్తున్నారు. చాలా మంది ఈ వృత్తి నుండి వెళ్లిపోయారు. ఏమి బ్రతుకుదెరువు లేని వారు ఈ వృత్తిలో ఉన్నారు.

చెట్లు కూడా తగ్గిపోయాయి. చెట్లకు ప్రొటెక్షన్ లేక, రకరకాల ఇబ్బందులు ఉండడంతో ఐదు ఎకరాలు ఇచ్చి లైసెన్సు రవాణ లేకుండా ఉండాలని మేము కొన్ని కార్యక్రమాలు చేపట్టాము. అంతా బ్రహ్మాండంగా చేశామని చెప్పడం లేదు. వాటిపై వచ్చిన సమస్యను సానుభూతితో అర్థం చేసుకొంటే బాగుంటుంది. లక్షలాది మంది బ్రతుకుతున్న వృత్తి కాబట్టి కక్ష కట్టే విధంగా ఈ వృత్తిని తొలగించాలని చూస్తున్నారు. కల్తీ చేస్తే పిడి యాక్టు పెడతామని అన్నారు. వారి జిల్లాలోనే వేలాది మంది వృత్తిపై ఆధారపడి ఉన్నారు. ఈ పిడియాక్టు పెడితే వారి పరిస్థితి ఏమి కావాలి? కల్తీ చేసే వారిపై యాక్షన్ తీసుకోండి. సామాన్య మానవునిపై పిడి యాక్టు పెడితే ఈ రాష్ట్రంలో ఉన్న జైళ్లు సరిపోవు. ఈ ఆలోచన ఎందుకు వచ్చిందో తెలపాలని కోరుతున్నాను. వారి మీద దాడులు ఏ ఉద్దేశ్యముతో చేస్తున్నారు? ఈ వృత్తిని తొలగించి ఐఎమ్ఎఫ్‌లు విపరీతంగా పెంచుకోవాలని ఈ ప్రభుత్వానికి ఉంది. అది ఏ విధంగా చేయదలచుకున్నారు? క్లారిఫై చేయాలి. ఈ సెక్షన్ ఎందుకు పెట్టవలసి వచ్చింది? మేము టోటల్‌గా పర్మినెంట్ లైసెన్సులు ఇచ్చాము. లైసెన్సు పేరుతో ఎక్సైజ్ వారు వీరిని పీడించుకుతింటున్నారు. స్పెసిఫిక్‌గా ఒక సొసైటీకి ఇచ్చేవారు. ప్రతి సంవత్సరం రెన్యువల్ అవసరం లేదు. ఆల్ పార్టీస్ డిమాండ్ చేసిన తరువాత కొత్తగా పర్మినెంట్ సిస్టమ్ పెట్టాము. మరల ఈ చట్టం వల్ల కొత్త లైసెన్సు విధానం ప్రతి సంవత్సరం తీసుకునే విధంగా తీసుకువచ్చే దురాలోచన దీని వల్ల కనపడుతుంది. బిల్ మీద చర్చలో రిటెన్‌గా సమాధానం ఇవ్వడం ఏమిటండీ? ఇది కరక్టు కాదు.

అధ్యక్షా! ఈ బిల్లు రాష్ట్రంలో మద్య విక్రయాన్ని కంట్రోలు చేసే బదులుగా మద్యం యొక్క అమ్మకాలను పెంచే విధంగా ఉంది. ఇంకా పెద్ద ఎత్తున వీటిని ఎక్స్‌ప్యాండ్ చేసే విధంగా ఈ బిల్లును ప్రవేశపెడుతున్నారు. అదే విధంగా గీత కార్మికులకు సంబంధించి ఈ ప్రభుత్వం అవలంభించినటువంటి తీరు ఎలా ఉందంటే ఈ బిల్లులో ట్యాపింగ్ అనేది పూర్తిగా మద్యానికి సంబంధించి ఒక క్లాజ్ మొదటిసారిగా ఇంక్లూడ్ చేసారు. ట్యాపింగ్‌కు సెపరేట్‌గా యాక్ట్స్, రూల్స్ ఉన్నాయి. దానికి సంబంధించి ప్రొవిజన్స్ ఉన్నాయి. మొదటిసారి బార్ లైసెన్స్‌తో ఈ ట్యాపింగ్ లైసెన్స్‌కు సంబంధించి వాటిని ఇంక్లూడ్ చేసి, ఆదాయాన్ని పెంచుకోవడానికి, ఆ వృత్తిని సర్వనాశనం చేసేలా, ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా తయారుచేస్తున్న కార్యక్రమం అని తెలియజేస్తూ మేము ప్రొటెస్ట్ చేస్తున్నాము.

# ఎస్సీ, ఎస్టీల సమస్యలపై చర్చ

26-2-2007

అధ్యక్షా! ఈరోజు రాష్ట్రంలో ముఖ్యంగా దళితుల సమస్యల గురించి చర్చ చేపట్టాలని అన్ని రాజకీయ పార్టీల వాళ్లు మిమ్మల్ని రిక్వెస్టు చేయడమయింది. ఈ సమస్య ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మేము ప్రధానంగా డిమాండ్ చేశాము. దళితుల సమస్యల గురించి, వారిపై జరుగుతున్న అత్యాచారాల గురించి విచారించేందుకు గతంలో మా ప్రభుత్వం జస్టిస్ పున్నయ్య కమీషన్‌ను ఏర్పాటు చేయడమయింది. ఆ కమీషన్ రాష్ట్రమంతటా తిరిగి దళితుల సమస్యలన్నింటిని తెలుసుకుని ప్రభుత్వానికి ఒక రిపోర్టు ఇవ్వడం జరిగింది. ఆ రిపోర్టును అధ్యయనం చేసేందుకు అప్పట్లో చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలోని ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీ కూడా వేయడం జరిగింది. మేమందరం అందులో సభ్యులం. మేము ఆ రిపోర్టునంతా స్టడీ చేసి, ఆ రిపోర్టు in total గా ఆమోదించాము. ఆ రిపోర్టును ఆధారంగా చేసుకుని, చాలా జి.ఓ.లు ఇవ్వడం జరిగింది. అయితే ఆ కమీషన్ ఛైర్మన్ యొక్క పదవీకాలం మొత్తం పూర్తి రికార్డులను మీరు ఒకసారి చూడండి. ఆ బిల్లును చర్చించే సందర్భంగా నేను మాట్లాడాను. పున్నయ్యగారు పెద్ద మనిషి, వారి అధ్వర్యంలోని కమీషన్ రిపోర్టు ఇచ్చింది, కనీసం వారి పీరియడ్ పూర్తయ్యేవరకైనా కొనసాగించండి అంటే, ఆగమేఘాల మీద బిల్లును పాస్ చేసుకుని ఛైర్మన్‌గా బలవంతంగా తొలగించారు. తొలగించి ఇప్పటికి దగ్గర దగ్గర రెండు సంవత్సరాలైంది. ఇంతవరకు ఛైర్మన్‌ను కాని, సభ్యుల్ని కాని నియమించలేదు. ఇందులో నాన్ ఫైనాన్షియల్ కమిట్‌మెంట్ ఉంది.

మేము రిక్వెస్టు చేసేదేమిటంటే, వెంటనే ఛైర్మన్‌ను అపాయింట్ చేయండి. అదే విధంగా

నోడల్ ఏజెన్సీ పెట్టమని చెబుతున్నాము. నోడల్ ఏజెన్సీ పెట్టినట్లయితే ప్రభుత్వంలో జరుగుతున్న కార్యక్రమాలను రెవ్యూ చేసుకోవచ్చు. ఇవన్నీ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాము.

అధ్యక్షా! అదే విధంగా ఈ సమస్య పైన సి.పి.ఎం. పార్టీ ప్రధాన కార్యదర్శి రాఘవులు గారు ఆమరణ నిరాహార దీక్షలో ఉన్నారు. ఆ పార్టీ తరపున వారు అనేక ఉద్యమాలు లేవనెత్తారు. చాలా సందర్భాలలో ప్రభుత్వం దృష్టికి కూడా వచ్చింది. ఈ ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం ధోరణి, మొండి వైఖరి కలసి ఈనాడు ఏ సమస్య పరిష్కారం కావడం లేదు. కనుక ఇమ్మీడియేట్‌గా డిమాండ్స్‌కి అగ్రీ అవ్వాలి. ప్రభుత్వం యొక్క ప్రకటన ఉండాలని మేము డిమాండ్ చేస్తున్నాము. వారిని కూడా నిరాహారదీక్ష నుండి విరమింపచెయ్యాలని సభ ద్వారా మేము రిక్వెస్ట్ చేస్తున్నాము.

# కోనేరు రంగారావు కమిటీ సిఫారసులు

18-7-2007

ఒక ప్రధానమైన సమస్య. ముఖ్యంగా శాసనసభలో దీని మీద బహుశా, భూ సమస్యల మీద జరిగిన చర్చలు, ఇంక ఏ సమస్య మీదా ఈ 12వ శాసనసభలో జరిగి ఉండదు. చాలా సమస్యలు చాలా సందర్భాలలో చర్చకు వచ్చాయి. ఈ మధ్య కాలంలో తమరు కూడా చూస్తున్నారు. రాజకీయ పార్టీలుగా మేము, ప్రత్యేకంగా వామపక్షాలు. చర్చ కొంత ఫలప్రదంగా ఉండాలని కోరుతున్నాను. ఎందుకంటే, అత్యంత పేద వర్గాలకు ముఖ్యంగా ఉండడానికి ఇల్లు లేకుండా ఉంటె, కొద్ది భూమి దొరుకుతుందనే ఆశతో చూస్తున్న సందర్భంలో ప్రభుత్వం నుండి కొంత పాజిటివ్‌గా ఒక పాలసీగా వారికి అనుకూలంగా ఉండే పద్ధతిలో ఒక జవాబు రావాలని కోరుతున్నాను. లక్షలాది మందికి సంబంధించిన అతి ప్రధానమైన సమస్యగా ఈ శాసనసభలో చర్చ తరువాత మాకు ఎంతో కొంతయినా పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నాము. మా సమస్యకు తగు విధంగా చర్చా సరళి ఉంటుందనీ, అదే విధంగా ప్రభుత్వ స్పందన కూడా ఉంటుందని నేను ఆశిస్తున్నాను.

అధ్యక్షా! ఈ రోజు ముఖ్యంగా మీకు తెలియనిది కాదు. మొత్తం భారత దేశంలోనే బహుశా ఈ భూసమస్యలపైన పోరాటం చేసిన చరిత్ర మన ప్రజానీకానికి వున్నది. మన యొక్క స్వాతంత్ర్య పోరాటం నుంచి కూడా భూ సమస్యల కోసం చాలామంది అనేక రకాలైన ఉద్యమాలు తీసుకున్నారు. దానిలో ప్రధానంగా హైదరాబాదు స్టేట్‌లో ఆరోజు తీసుకున్న భూపోరాటం అనేది మొత్తం యావద్భారత దేశ దృష్టిని ఆకర్షించిన సందర్భాన్ని మనం చూశాము. ఆరోజు కమ్యూనిస్టులు సంస్థానాల విముక్తి కోసం ఒకవైపు, పేద వారికి భూమి తీసుకురావాలని మరోవైపు వారు చేపట్టిన పోరాటాల ఫలితంగా కొంత వరకు భూ సమస్యలకు ఆ రోజే పెద్దలు

బూర్గుల రామకృష్ణారావు గారి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడగానే ఈ భూసంస్కరణ చట్టాలను మొట్టమొదట మొత్తం భారత దేశంలోనే తీసుకు వచ్చిన ఘనత కూడా మన రాష్ట్రానికే దక్కింది. ఆ విధంగా కమ్యూనిస్టులు నాలుగు వేల పైన ఆ పోరాటంలో చనిపోయారు. అంత పెద్దయెత్తున పోరాటం జరిగింది. దానిలో ఒకసారి చూస్తే ఆ టైంలో ఒక్కొక్క భూస్వామి దగ్గర వేలాది ఎకరాల భూములుండేవి. ముట్నూరు రామచంద్రారెడ్డి గారు కానివ్వండి. ప్రతాప్‌రెడ్డి గారు కానివ్వండి. రామచంద్రరావు గారు కానివ్వండి వేల ఎకరాల పొలాలు పెట్టుకొని ప్రజలను హింసిస్తూ అనేకరకాలైన బాధలకు గురి చేస్తున్న సందర్భంలో **ఆనాడు కమ్యూనిస్టులు చేపట్టిన సాయుధ పోరాట ఫలితంగా ఆ రోజు పది లక్షల ఎకరాల భూములు పంచడం జరిగింది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు వాటన్నింటినీ గుర్తించి ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తీసుకు రావడం జరిగింది.** ముఖ్యంగా ఆ రోజులలో టెనెన్సీ యాక్ట్ తీసుకొచ్చారు. అది నేను రెవెన్యూ మినిస్టర్‌గా వున్నప్పుడు చూశాను. దానిపై సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ చేసిన అబ్జర్వేషన్ కూడా చూశాను. They told this is one of the progressive act done by a state అని చెప్పి పేదలకు చాలా అనుకూలంగా దానిని ఒక ప్రముఖమైన చట్టంగా మేం గుర్తిస్తున్నామని వారు చేసిన కామెంట్ కూడా చూశాను. ఆ విధంగా ల్యాండ్‌కు సంబంధించినంత వరకు మన శాసనసభలోనే ఎవరు తెచ్చారన్నది అప్రధానం. ఇక్కడ మనం తీసుకొచ్చిన ప్రతి సందర్భంలో పేదలకు అనుకూలంగా వుండాలని తేబడ్డాయి. ఆ తరువాత 1975లో తీసుకొచ్చిన ల్యాండ్ సీలింగ్ యాక్ట్‌ను చాలా ఎఫెక్టివ్‌గా తీసుకొచ్చారు. దాని ఫలితాలు చాలా దక్కుతాయనుకున్నాను. అల్టిమేట్‌గా ఏ చట్టం తీసుకొచ్చినా నియర్లీ నాకు తెలిసినంత వరకు పేద వారికి భూములు చెందాలనే వుద్దేశంతో ప్రోగ్రెసివ్‌గా తయారు చేసిన చట్టాలు. ఒక పది వరకు మన శాసన సభలోనే చేసిన చట్టాలున్నాయి. అడ్మినిస్ట్రేటివ్ హర్డిల్స్. లీగల్ హర్డిల్స్ కారణంగా ఎంతైతే వారికి చేరాలో అంత చేరలేదని నేను చెప్పదలచుకున్నాను. ఆ విధంగా ఈ రోజు జరుగుతున్న కార్యక్రమాలు కూడా చాలా ఇంపార్టెంట్. మనిషి ఏదైనా ప్రొడ్యూస్ చేయగలడు. కాని భూమిని మాత్రం ప్రొడ్యూస్ చేయలేడు. అందువల్ల వున్న భూమిని చాలా ఎఫెక్టివ్‌గా ఉపయోగించుకోవాలి. ఎందుకంటే ఈ రోజు మనకు భూమే జీవనాధారం. రైతులకు, రైతు కూలీలకు జీవనాధారంగా వున్నది. ఈనాడు భూమి 70 శాతం మంది ప్రజానీకానికి జీవనాధారంగా వున్న సందర్భాన్ని మనం చూస్తున్నాము. What is your policy with regard to poor people? ఎంతో మంది భూమిపై ఆధారపడి తమ జీవనాన్ని కొనసాగించడం జరుగుతున్నందున నేడు భూమికి ఎంతో ప్రాముఖ్యత వున్నది. దానిని అందరికీ సమానంగా పంచి పెట్టే పద్ధతిలో పేదలకు అనుకూలంగా శాసన సభలు చట్టాలు చేయాలని రాజ్యాంగపరంగా చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. ఎప్పుడైతే భూమిని పెద్దయెత్తున పేద వర్గాలకు వ్యవసాయానికి, ఇళ్ల స్థలాల కోసం ఇచ్చే అలోచన చేయనంత కాలం పేద ప్రజల వలసలు చాలా పెరుగుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నాయి. ఒక ఎస్టిమేషన్ ప్రకారం వచ్చే 15 సంవత్సరాలలో రాష్ట్రంలో 50 శాతం ప్రజలు పట్టణ ప్రాంతాలకు చేరిపోతారు. కనుక పట్టణ ప్రాంతాలలోని 50 శాతం ప్రజల అవసరాలకు అనుకూలంగా, అనుగుణంగా ఏ ప్రభుత్వాలున్నా వాటిని

వాడకంలోకి తీసుకురావడానికి అవసరమైన పాలసీలు వుండాలని ఎవరైనా కోరుకుంటాము. కాని జరుగుతున్న వ్యవహారం ఒకసారి చూసినట్లయితే ఈనాడు పట్టణ ప్రాంతాలలో చాలా ఇండస్ట్రీస్ వస్తున్నాయి. ముఖ్యంగా ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతున్నది. మనం ఇండస్ట్రీస్ పెట్టుకున్నప్పుడు ఖచ్చితంగా దానికి వచ్చే వర్కర్స్, ఉద్యోగస్తులు వస్తారు. ఆ విధంగా సర్వీస్ సెక్టార్ కూడా విపరీతంగా పెరుగుతుంది. ఆ సర్వీస్ సెక్టార్‌కు కావలసిన మ్యాన్‌పవర్ రావడంతో కామన్ యుటిలిటీ పర్పస్‌కు కావలసిన ల్యాండ్స్ అన్నీ ప్రిజర్వ్ చేసుకోవాల్సిన అవసరముంటుంది. వాటిని ఐడెంటిఫై చేసుకోవాల్సి వుంటుంది. కాని దానికి సమగ్రమైన విధానమంటూ మన రాష్ట్రంలో లేకపోవడం చాలా దురదృష్టం. ఆ విధంగా సమగ్రంగా అవసరాలను గుర్తించుకొని దానికి కావలసిన విధానాన్ని మనం రూపకల్పన చేయలేకపోతున్నాము. మా జిల్లానే ఒకసారి చూసినట్లయితే చాలా ఇండస్ట్రీస్ పెట్టారు. నా ఓన్ కాన్‌స్టిట్యుయెన్సీలోనే ఆసియాలోనే అతిపెద్ద స్మాల్‌స్కేల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్లాన్ చేసినప్పుడు అందులో పనిచేసే వర్కర్స్ కాని అక్కడ పని చేసే ఉద్యోగస్తులకు కాని ప్రొవిజన్స్ లేవు. దానితో వారు ఎక్కడికి పోవాలి? అందువల్ల గవర్నమెంట్ ల్యాండ్ ఎక్కడ ఖాళీ వుంటే అక్కడికి పోయి ఒక గుడిసెనో, ఒక చిన్న రూమో కట్టుకున్నారు. అధికారులు దానిపై సరిగా స్పందించక వారిని నానా ఇబ్బందులు పెట్టడం అనేది కంటిన్యూగా జరుగుతున్న వ్యవహారం. వాటిని రెగ్యులరైజ్ చేయడానికి కాను ఒక లక్ష నుండి లక్షా36 వేల మందికి మరియు కొత్తగా కొంతమందికి పట్టాలిచ్చే కార్యక్రమం చాలా మటుకు మా టైంలో చేసుకుంటూ వచ్చాము. వలసలు ఇక్కడే కాకుండా రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలో కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. అలాంటప్పుడు ప్రభుత్వంలో ఎవరున్నా వాటి కోసం కంటిన్యువస్ ప్రాసెస్‌గా ఆలోచన చేసి పేద ప్రజానీకానికి పట్టాలిచ్చే కార్యక్రమాలు తీసుకోవాలి. ఈనాడు మేం చేపట్టిన ఉద్యమం, అదే విధంగా లెఫ్టిస్టులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతున్నారు. వాటికి ప్రజల్లో మంచి స్పందన వస్తోంది ఎందుకు? ఆ ఉద్యమంలోకి ప్రజలు ఎందుకు గుమికూడి పాలుపంచుకుంటున్నారన్నది ప్రభుత్వం ఆలోచన చేయకుండా ఏ విధంగా ఆ ఉద్యమాన్ని అణచాలని, ఏ విధంగా ప్రజలు అందులో పాల్గొనకుండా చూడాలని ఆలోచిస్తూ అగ్రెసివ్‌గా దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనైనా నిలుపుదల చేయాలనే కార్యక్రమం చేపట్టడం చాలా దురదృష్టం. ఏకంగా ఒక రాజకీయ పార్టీకి చెందిన ముఖ్య నాయకుణ్ణి తీసుకెళ్లి రాజద్రోహం క్రింద జైల్లో పెట్టే ఆలోచన ఈ ప్రభుత్వం ఏ కోణంలో చేస్తున్నదో అర్థం కావడం లేదు. కనుక ఈ ప్రభుత్వం దీనిని ఏ విధంగానైనా అణచివేయాలనే వుద్దేశంతో ఎందుకు ముందుకు పోతున్నదో పేదలకు భూ పంపిణీకి చేయవలసిన విధానాలు, పాలసీలు మీరు ఎందుకు చేయడం లేదని నేను అడగదలచుకున్నాను. కనుక మీరు దయచేసి ఆ యాంగిల్‌లో ఆలోచన చేయండి. ఆ విధంగా పేద ప్రజానీకానికి కావలిన భూ పంపిణీకి చర్యలు తీసుకోండి. ఇక కోనేరు రంగారావు గారి నివేదిక గురించి తరువాత మాట్లాడతాను. ముఖ్యంగా ఇళ్ల పట్టాలకు సంబంధించి అర్బనైజేషన్‌కి సంబంధించి ఈ రోజు మంత్రిగారు ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. అందులో మేం ఆశించిన సమాచారం లేదు. మొత్తం పేదలకు ల్యాండ్ ఇష్యూ మీద ఏ పద్ధతి అడాప్ట్ చేయబోతున్నారో దానికి సంబంధించిన సమాచారం లేదు. అందులోచూస్తే బూట్ యాక్ట్ వంటి వాటికి సంబంధించి

ఒట్టి ఉపోద్ఘాతాలున్నాయి తప్ప అసలు ఈ మూడేళ్లలో మీరు డిస్ట్రిబ్యూషన్ చేసిన భూములు ఏయే జిల్లాలో ఎన్ని వున్నాయో చెప్పలేదు. ఆ విధంగా మేము అడిగిన వివరాలు ఇవ్వకుండా మేం పేదలకు బ్రహ్మాండంగా భూములు పంపిణీ చేస్తుంటే అపోజిషన్ పార్టీల వారు ఏదో అనవసర రాజకీయం చేస్తున్నారని మాట్లాడుతున్నారు. మీరు పెద్దపెద్ద హోర్డింగులు, బోర్డులు పెట్టుకుంటున్నారు కదా? ఏయే జిల్లాలో ఎంతమేరకు పట్టాలివ్వడం జరిగింది? అసైన్డ్ ల్యాండ్స్ గురించి యాక్ట్ తీసుకొచ్చారు. అది తీసుకొచ్చిన తరువాత ట్రాన్స్‌ఫర్ అఫ్ అసైన్‌మెంట్స్ బ్యాన్ చేసి రిజంప్షన్ పెట్టారు. ఎంత మందికి రిజంప్షన్ పెట్టారు. ఎంత మందికి నోటీసులు ఇచ్చారు? ఇవి చెప్పలేదు. ఇవేవి చెప్పకుండా ఊరికే ఉపోద్ఘాతం ఇచ్చి ఇది అయింది అన్నట్లు మొక్కుబడిగా చెయ్యడానికి వారు చేస్తున్న ప్రయత్నంగా కవబడుతుంది తప్ప ప్రభుత్వానికి సీరియస్‌నెస్ కనిపించలేదు. ల్యాండ్ ఇష్యూ మీన్స్ ఓవరాల్‌గా అన్నింటికీ సంబంధించిన సమస్య. దీనికి సంబంధించి ఇండస్ట్రీస్, ఎస్.ఇ.జెడ్స్, ఇళ్ల పట్టాలు, అగ్రికల్చర్ ల్యాండ్స్ ఇవన్నీ ఉన్నాయి. కావలసిన అలాట్‌మెంట్స్ ఉన్నాయి, హౌసింగ్ ప్రోగ్రామ్ గురిచి, పెద్ద పెద్ద టౌన్‌షిప్స్ గురించి మాట్లాడుతున్నారు. వాటికి ల్యాండ్ అలాట్ చేస్తున్నారు. దీకికి సమగ్రమైన విధానాన్ని చర్చిస్తున్నప్పుడు మీ సమాచారం ఏది? మాకున్న సమాచారాన్ని ఆధారం చేసుకొని మాట్లాడితే ఎట్లా? ఏదో అయిపోయిందని అనిపించుకోవడానికి మీరు చేస్తున్నట్లుగా మీ సమాచారం బట్టి మాకు అర్థం అవుతుంది. దీని పైన సీరియస్‌నెస్ లేదని చెప్పదలచుకున్నాను. మీ పాలసీలు ఏ విధంగా ఉన్నాయో చెప్పాలని నేను అనుకుంటున్నాను. ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక కొత్త విధానానికి అంకురార్పణ చేసారు. గతంలో మేము కూడా ఎక్కడైతే ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయో అక్కడ ఆక్షన్ పెట్టడానికి ప్రయత్నం చేసాము. **ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత బడ్జెట్‌ను పూడ్చుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఏకంగా తొమ్మిది వేల కోట్ల రూపాయలను గవర్నమెంట్ యొక్క ల్యాండ్స్‌ను ఆక్షన్ చేసి, అది తీసుకొచ్చి బడ్జెట్‌లో పెట్టాలనే సంకల్పంతో ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది.**

ఎటు చూసినా ఆక్షన్ పెడుతున్నారు. పేదవాడికిమాత్రం ఒక్క గజం కూడా ఇవ్వడం లేదు. ఆక్షన్ పెట్టడం, తీసుకెళ్లడం చేస్తున్నారు. జలయజ్ఞం పేరుతో దానిని తీసుకెళ్తున్నారు. యజ్ఞం ఫలితాలు ఏ విధంగా ఉంటాయంటే, యజ్ఞం చేసిన తరువాత అందులో నుండి బూడిద తీసి అయ్యవారు మనకు బొట్టు పెడతారు. ఆ పద్ధతిలో వీళ్ల యొక్క పద్ధతి ఉంది. ఫలితాలు ఏ విధంగా ఉంటాయో తెలియదు. మూడు సంవత్సరాలు అయ్యింది. ప్రతి రూపాయి తీసుకెళ్లి అక్కడ పెట్టారు. మొన్న చూసాము. పొన్నాల లక్ష్మయ్య గారు శ్రీశైలంలో, నాగార్జున సాగర్‌కి వెళ్లి గేట్లు ఎత్తడం, పూజలు చేయ్యడం చేసి నా జీవితం ధన్యం అయిపోయిందని ఆయన ప్రకటించుకున్నారు. ముఖ్యమంత్రిగారు నాగార్జునసాగర్ బొమ్మ పెట్టి ఆయన ఫోటోతో అడ్వర్టయిజ్‌మెంట్ ఇచ్చుకున్నారు. ఇది చూస్తే నాకు ఒక సామెత గుర్తు వస్తుంది. ఎవరికో పెద్ద మనిషికి ఒక ఆలోచన వచ్చింది. తన మొక్క తీర్చుకోడానికి మిఠాయి షాపు వద్దకు వెళ్లి, దేవుడా! ఈ షాపులో ఉన్నవన్నీ నీకు సంతర్పించుకుంటున్నాను అని చెప్పాడంట. ఆ విధంగా ఉంది. ఈరోజు రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే కాదు, వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలంగా

మారడంతో ఎటు చూసినా వర్షాలు వస్తున్నాయి. ఆ వర్షాల మూలంగా జలపాతం నిండితే దానికి ఈయన పూజలు చేసి మా జలయజ్ఞం ఫలితాలు అంటున్నాడు.

ముఖ్యంగా, పేద వర్గాల వారికి ఇవ్వవలసిన స్థలాలు కూడా కూడా ఆక్షన్ పెట్టారు. ఆ డబ్బును కూడా తీసుకెళ్లి ఈ జలయజ్ఞంలో పోస్తున్నారు. ఈ రోజు మీ దగ్గరున్న పాలసీ ఏమిటి? What is the policy with regard to the people? హౌస్ సైట్స్ పట్టాల గురించి మీరు ఏమి చెయ్యదలచుకున్నారు? ఎన్ని ఇచ్చారు, ఎన్ని ఇవ్వదలచుకున్నారు, ఏ పద్ధతిలో ఇవ్వదలచుకున్నారో స్పష్టంగా మంత్రి గారు చెప్పాలని కోరుతున్నాను. హైదరాబాద్ సరౌండింగ్స్‌లో గాని, రంగారెడ్డిలో గాని ఎక్కువ పరిశ్రమలు రావడానికి కారణం మన దగ్గర ఉన్నటువంటి గవర్నమెంట్ ల్యాండే. BHEL,IDPL,DRDL లాంటి పెద్ద పెద్ద సంస్థలు వచ్చాయంటే దానికి కారణం గవర్నమెంట్ ల్యాండ్. గవర్నమెంట్ ల్యాండ్ అందుబాటులో ఉంది. ఏ పరిశ్రమ వచ్చినా ఏది వచ్చినా ఇమ్మీడియేట్‌గా మనం అలాట్ చెయ్యగలిగాము కాబట్టి అవన్నీ వచ్చాయి. ఎకనమిక్ యాక్టివిటీకి మన చేతిలో గవర్నమెంట్ ల్యాండ్స్ ఉన్నాయి. ఏదైనా ప్రైమ్ ఇన్స్‌టిట్యూషన్స్‌కి ఒక పద్ధతి ప్రకారం కేటాయింపులు చేయడం చాలా అవసరం. ఆ పద్ధతిని మనం అవలంభిస్తున్నామా, మనం ఈనాడు ఏ పద్ధతిలో పోతున్నాము? ఎవరికి అనుకూలంగా ఉంటే ఆ ప్రకారం ల్యాండ్ అలాట్ చేస్తున్నారు. మీకు ఒక క్రైటీరియా ఉందా? ఎస్.ఇ.జెడ్లు. ఇస్తున్నారు. ఇది ఒక కొత్త విధానం. జమీందారి సిస్టమ్‌ను మనం అబాలిష్ చేసాము. వాటి మూలంగా వాటి పైన ఆక్యుపెన్సీలో ఉన్న పేద వాళ్లకు ఆక్యూపెన్సీ రైట్స్ ఇచ్చాము. ఈ కొత్త జమిందారి వ్యవస్థను రాష్ట్రంలో ప్రవేశ పెదుతున్నారు. ఒకొక్క దగ్గర టౌన్‌షిప్స్ అని కొన్ని వందల ఎకరాలు మీరు కేటాయింపు చేసుకుంటే, వాళ్లు Within the townships లో ఇష్టానుసారంగా అలాట్‌మెంట్ చేస్తున్నారు. This is nothing but encouraging real estate. ఒక సమగ్రమైన పాలసీతో మీరు పోవడం లేదని చెప్పదలచుకున్నాను.

గత మూడు సంవత్సరాలుగా ఎవరెవరికి, ఏ విధమైన అలాట్‌మెంట్స్ ఇచ్చారు అనేది. You must give it. ల్యాండ్ పాలసీ మీద డిబేట్ జరిగుతుంది. అలాట్‌మెంట్స్ జరిగాయి. What is the criteria? ఏ క్రైటీరియా ద్వారా ఎవరెవరికి అలాట్‌మెంట్స్ ఇచ్చారో చెప్పాలని కోరుతున్నా. అదే పద్ధతిలో ఇచ్చిన ల్యాండ్ యొక్క యుటిలైజేషన్ ఏమిటి? ల్యాండ్ అసైన్ చేసేటప్పుడు కండిషన్స్ ఉంటాయి. క్లియర్‌కట్‌గా స్పెసిఫిక్ పర్పస్ ఉంటుంది. ఆ పర్పస్‌కు ఉపయోగించారా లేక డీవియేట్ అయ్యారా? డీవియేట్ అయితే ఏ విధమైన యాక్షన్ తీకున్నారు? ఎన్ని డీవియేషన్స్ జరిగాయి? ఎంత వరకు మీరు దాని పై స్పందించారో సమాధానం చెప్పాలని కోరుతున్నాను. అదే విధంగా యాక్టివిటీ ఒకటి చెప్పి ఇంకొక రకంగా చేస్తున్నారు. హైదరాబాద్ సరౌండింగ్స్‌లో, వైజాగ్‌లో గవర్నమెంట్ ల్యాండ్స్ అలాట్ చేసారు. అవసరానికి మించి అలాట్‌మెంట్స్ చేశారు. మన దగ్గర ఉన్న భూమి చాల పకడ్బందీగా ఇస్తున్నారు. ఈనాడు ఇండస్ట్రియలైజేషన్‌లో అత్యంత వేగంగా చైనా ముందుకు వెళ్తుంది. అక్కడ ల్యాండ్ పాలసీ బ్యూటిఫుల్ పాలసీ. 33 సంవత్సరాలకంటే ఎక్కువ వాళ్లు ల్యాండ్ ఇవ్వరు. ఎందుకంటే, నెక్స్ట్

జనరేషన్‌కి ఉపయోగ పడుతుంది. మనం యాభై సంవత్సరాలో, అరవై సంవత్సరాలో లేక వంద సంవత్సరాలో బ్రతుకుతాము. కాని తరతరాలు ఉండవలసిన సంపద. ఇది రాష్ట్రం చేతిలో ఉండాలి. మన రాజ్యాంగం చాలా స్పష్టంగా చెబుతుంది. మనకున్న సంపద సమానంగా పంచుతామని చెబుతుంది. ఈ దేశంలో ఉన్న సంపద అందరికీ సమానంగా పంచుతామని రాజ్యాంగం మీద ప్రమాణం చేసి కూర్చున్నాము. ఎక్స్‌ప్లాయిటేషన్ లేని సొసైటీ నిర్మిస్తామని అన్నాము. కాని, ఈనాడు ఉన్నదంతా ప్రైవేట్ వారి చేతుల్లోకి వెళ్లిపోయిన తరువాత, మనకు స్టేట్ చేతిలో ఏమి లేకుండా పోతుంది. ఆ విధంగా అయితే రేపు ఏమి లేకుండా పోతుంది. ఆ విధంగా అయితే రేపు ఏదైనా యాక్టివీటికి అలకేషన్ చేసినట్లయితే, We don't know. ఎలాంటి యాక్టివిటీస్ వస్తాయో మనకు తెలియదు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి ఈ షేప్ వస్తుందని మనం ఇరవై, అయిదు సంవత్సరాల ముందు అనుకున్నామా? నేచర్ అఫ్ యుటిలిటీ పెరగడానికి అవకాశం ఉంటుంది. దానికి తగినట్లు ల్యాండ్స్ ఉండాలి. మనం రెన్యువల్ చేసుకొని మన చేతికి వచ్చేటట్లుగా పాలసీలను మనం చేసుకోవాలి. ఆ ప్రకారం ప్రభుత్వం చెయ్యడం లేదు. ఇష్టానుసారంగా అతి తక్కువ ధరకు వందలాది ఎకరాలు ఇస్తున్నారు కనుక దాని పైన వివరణ ఇవ్వాలని కోరుతున్నాను. అదే విధంగా రాష్ట్రంలో ఒక వైపు చూస్తే, ఇండస్ట్రీస్ అన్ని ప్రైవేటైజేషన్ అవుతున్నాయి. ప్రైవేట్ సెక్టార్‌లో ఇండస్ట్రీ వస్తుంది. ప్రమోషన్ అఫ్ ఇండస్ట్రీస్‌కి APIIC ని ఏర్పాటు చేసుకున్నాము. దాని బాధ్యత ఏమిటి? ఒక వైపు గతంలో మనం స్వతహాగా పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్‌ని పెట్టేవాళ్లం. కొత్తగా ఈనాడు మనం ఎవరమూ పెట్టడం లేదు. అటువంటి పాలసీస్ లిబరలైజేషన్ తరువాత రావడం లేదు. నాడు ఒక ఫెసిలిటేట్ రోల్ క్రింద మనకు మనం ఏదైనా మౌళిక సదుపాయలు ఏర్పాటు చేసుకొని కావలసిన వారికి కొన్ని ల్యాండ్స్ ఎలాట్‌మెంటు చేసి వన్‌థర్డు ఇండస్ట్రీస్ ప్రొవైడ్ చేయడం కోసమని చెప్పి మనం బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్రియేట్ చేసుకోడానికి ఎపిఐఐసి పెట్టాము. ఈ ప్రభుత్వం ఎపిఐఐసికి ఏమి పని పెట్టింది అంటే ఇండస్ట్రీస్ కోసం ఎపిఐఐసి ఎలాట్ చేసిన ల్యాండ్స్‌ను అమ్మి ఆ ల్యాండ్స్ ద్వారా వచ్చిన డబ్బు తీసుకొచ్చి బడ్జెటు కేటాయింపులకు మాకు కావాలని కనుక మీరు అమ్మి మాకు పెట్టమని చెబుతున్నారు. అంటే ప్రమోట్ చేయవలసిన ఏజన్సీ పూర్తిగా డ్రాపౌట్ చేసి, ఈనాడు వాళ్లు అంతా ఎపిఐఐసి ఏమి పనిచేస్తున్నారు. ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ గురించి పనిచేయకుండా ఏ ల్యాండ్ అమ్మాలి? ఎట్లా సొమ్ము చేయాలి? రోజూ ఫైనాన్సు సెక్రటరీ బాధపడలేక మేము ఏదో రకంగా అమ్మి బడ్జెటు కేటాయింపు చేయాలి అనే పద్ధతి అవలంబిస్తున్నారు. అంటే ఈ యొక్క విధానం ఎక్కడికి పోతుందో ఒకసారి ఆలోచన చేయాలి. అదే విధంగా ఎపిఐఐసికి ఇంతవరకు మీరు ఇచ్చింది ఎంత? మొత్తం ఎపిఐఐసి ఆక్షన్ చేసిన ల్యాండ్ ఎంత? ఆ ల్యాండ్ మూలంగా ఎన్ని డబ్బులు వచ్చాయి? ఎంత ప్రపోజ్ చేయదల్చుకున్నారు. బికాజ్ ల్యాండ్ మొత్తం మనది, ఏజన్సీకి ఎలాట్ చేసి వుండవచ్చు తప్ప దాని మీద కంట్రోల్ మాత్రం పూర్తిగా ప్రభుత్వానికి వుంటుంది. ఆ సంగతి మార్చి పోవద్దు. దాని ప్రకారంగా మంత్రిగారు సమాచారం ఇవ్వాలని కోరదల్చుకున్నాను. ముఖ్యంగా కమ్యూనిటి యుటిలైజేషన్. చాలామంది శాసన సభ్యులు ఉన్నారు ఇక్కడ మున్సిపాలిటీలలో అన్‌ఫార్చ్యునేట్ సిట్యుయేషన్. ఎవరు ప్రభుత్వంలో

ఉన్న మీ ప్రభుత్వం ఒక్క దానినే తప్పు పట్టడం లేదు. మా దగ్గర చాలా అత్యంత హీనమైన టౌన్ ప్లానింగ్ విభాగాలు ఉన్నాయి. అసలు టౌన్ ప్లానింగ్ వాడికి టౌన్ ప్లానింగ్ తెలియదు. ఒక్కటే తెలుసు సంతకం పెట్టి డబ్బులు తినడం తప్ప. వాళ్లకి టౌన్ ప్లానింగ్ లేనే లేదు. There is no proper town planning. చాలాసార్లు పూర్తిగా దానిని స్ట్రీమ్‌లైన్ చేయడానికి కొన్ని ప్రయత్నాలు చేశాము. ఇప్పుడు ఏమి జరుగుతుందో మాకు తెలియడం లేదు. ఎట్లా అయినా టౌన్ ప్లానింగ్ లేదు. కామన్ యుటిలిటి ఒకసారి గవర్నమెంటు స్కూల్ మంజూరు ఆయినట్టు వుంది. ఈవెన్ స్కూలు కట్టుకోడానికి వీలులేదు. డిపెప్ అయినా స్కూల్సు కూడా కట్టజాలక అవి అన్ని కూడా రిటర్న్ అయిపోయిన సందర్భాలు ఉన్నాయి. శాసనసభ్యులకు తెలుసు. దీనికి కారణం ఏమిటి? కామన్ యుటిలిటికి ల్యాండ్స్‌ని ప్రిజర్వు చేయాలి. ఎక్కడా చేయడం లేదు. ఈవెన్ పార్కులలో ఇళ్లు కట్టుకున్న సందర్భాలు మనం చూస్తున్నాము. కామన్ యుటిలిటికి మీరు సమగ్రంగా ప్లాన్ తయారు చేసినారా? ముఖ్యంగా సరౌండింగ్ మున్సిపాలిటీలలో కామన్ యుటిలిటి కాని, స్కూల్సు కాని, కాలేజి కాని, బస్సుస్టాండ్సు కాని. గ్రేవ్‌యార్డ్సు, చస్తే మా దగ్గర సమస్య. కొన్ని మున్సిపాలిటీలలో మనిషి చస్తే గొడవలు అవుతాయి. ఎందుకు అంటే ఎక్కడ పాతి పెట్టాలో తెలియదు. వీళ్లు చస్తే మా స్మశానం అని వాళ్లు గొడవ పడతారు., వాళ్లు చస్తే మా స్మశానం అని వీళ్లు గొడవ పెడతారు. కనుక అలాంటి పరిస్థితి కూడా మన దగ్గర ఉన్నప్పుడు కామన్ యుటిలిటీకి కావలసిన ల్యాండ్‌ను ఐడింటిఫై చేసి ప్రిజర్వు చేసుకోవలసిన అవసరం వున్నది. అది కూడా చేయకుండా ఉన్న వాటిని అన్నింటిని కూడా ప్రక్కన పట్టే పరిస్థితికి వచ్చారు. మా వాళ్లు అంతా నిన్న మా దగ్గరకు వచ్చారు. మేము వాంబే స్కీమ్ లోపల ల్యాండ్ తీసుకున్నాము. పేదవాళ్లను వాంబే స్కీమ్‌లో పెట్టడానికి మేము దానిని ఎలాట్ చేసినాము. దానికి కొంత డిలే అయినది. వీళ్లు కూలీలను, డబ్బును సమకూర్చుకోవాలి, స్టార్టు చేయాలి అంతవరకు మనం ఇన్‌స్టాల్‌మెంటు ఇవ్వము. అంత లోపల నిన్న మొన్న పోయి ఇంకొక ప్రయివేటు ఫ్యాక్టరీకి ఇచ్చి వేస్తున్నాము మీరు వెళ్లి పొండని చెప్పినారు. ప్రతి రోజు సరౌండింగ్ ఏరియాస్‌లో ఇది జరుగుతావున్నది. రావడం ల్యాండ్ తీసుకోవడం ఆ తరువాత ఎలాట్‌మెంటు చేస్తున్నారు. దానిని నోటిఫై చేస్తున్నారు. **మీరు పేద ప్రజలకు ఇచ్చిన పట్టాలు నా దగ్గర మొత్తం సమాచారం వున్నది. ఎందుకంటే మంత్రిగారు ఇప్పుడు చెబుతూ, మొత్తం ఫైల్ కూడా తీసుకొని వచ్చాను. ఎలాంగ్ విత్ విలేజెస్, ఏ విలేజిలో ఏ సభ్యునికి పట్టాలు ఇవ్వబడ్డాయో, రోజు వాళ్లు పోయి ఎట్లా డిస్టర్బ్ చేస్తున్నారు. ఈ రోజు ఇంత పెద్ద రెస్పాన్సు వస్తుంది అంటే వాళ్లకి పనిలేదా? తిండి ఎక్కువై వస్తున్నారా? పోలీసులతో దెబ్బలు తినాలని అటువంటి కోరిక వాళ్లకి ఉన్నదా? ఎందుకు వస్తున్నారు?** ప్రభుత్వం ఎందుకు ఆలోచన చేయడం లేదు. అయ్యా, మీరు ఎన్ని విధాలుగా మాట్లాడుతున్నా వాస్తవంగా గ్రౌండ్‌లో ఎన్నో రకాలుగా ఉన్నాయి. పట్టాలు ఇవ్వడం లేదు బ్యాన్ చేశారు. ఇచ్చిన పట్టాలు క్యాన్సిల్ చేస్తున్నారు. ఈనాడు ఎవరికైనా పట్టాలు ఇచ్చి వాళ్లు ఏదైనా గుడిసె కట్టుకొని ఆ తరువాత అది మార్చి చిన్న రూమ్ ఏదో వేసుకోడానికి ప్రయత్నం చేస్తే ఇంతవరకు పక్కా ఇళ్లు కట్టలేదు అని చెప్పి క్యాన్సిల్ అవుతుంది. నోటీస్ ఇచ్చి రిటర్న్ తీసుకుంటున్నారు. ఈ విధమైన కార్యక్రమాలు చేయడం మూలంగా ఈనాడు విపరీతమైన

వ్యతిరేకత వస్తావుంది. పేద ప్రజానీకం మీద ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టి కొన్న వేల మందిని జైల్లో పెడుతున్నారు. ఆ విధంగా వాళ్లు ఇబ్బంది పడుతున్నారు. సరౌండింగ్ ఏరియాస్‌లో మా దగ్గర ఇళ్ల పట్టాలు ప్రధానమైన సమస్య. మేము ఇచ్చిన పట్టాలు అన్ని క్యాన్సిలేషన్‌కు పెట్టినారు. కొత్తగా మీరు ఎలాట్‌మెంట్లు ఇవ్వడం లేదు. కొంత మందికి ఎన్నికలు రావడం మూలంగా పొజిషన్ ఇవ్వలేకపోయాము. వారికి ల్యాండ్ ఐడింటిఫై అయినది . సర్వే అయినది. ఏజన్సీ పర్మిషన్ తీసుకున్నాము. కాని వాటిని మాత్రం పొసిషన్ ఇవ్వకుంటే వాటిని కూడా రెజ్యూమ్ చేసుకొని ఆక్షన్ పెట్టడం మొదలు పెడుతున్నారు. ఈ విధమైన కార్యక్రమాలు అన్ని కూడా పేదవర్గాలకు వ్యతిరేకమైనటువంటి పద్ధతిలో ఈ ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. నేను కోనేరు రంగారావుగారి కమిటీ రిపోర్టును చూశాను చాలా చక్కగా వున్నది. ఆఫీసర్సు కాని వారు చాలా చక్కగా రిపోర్టు ప్రిపేర్ చేశారు. మొత్తం ఇష్యూస్ అన్ని డిస్కస్ చేశారు. ప్రతిసారి మనం ఉపన్యాసాలు ఇస్తూనే వుంటాము. కాని పరిష్కార మార్గం చెప్పరు. కాని ఇక్కడ మాత్రం స్పష్టంగా ఏ యే ఇష్యూస్ వున్నది అండర్ వాట్ యాక్ట్ ప్రొవిజన్ వున్నది, యాక్ట్‌కు వచ్చిన హర్డిల్స్ ఏమిటి, దానిని ఎట్లా పరిష్కారం చేయాలనేది, దానికి రెమిడీస్ కూడా రిపోర్టులో ఇచ్చారు. ఆ రెమిడీస్ అన్ని కూడా మీరు ఏమి చేయదల్చుకున్నారు. వాళ్లు ఇచ్చిన రిపోర్టులో, నాకు తెలిసి 4, 5 ఇష్యూస్ మాత్రం కాంట్రవర్షియల్‌గా ఉన్నాయి, అవి కొద్దిగా డిబేట్ చేయవలసిన అవసరం వున్నది. ఎందుకంటే ఎలాట్‌మెంటు ల్యాండ్‌ను మీరు తగ్గించి వేశారు. ఒక ఎకరం వుంటే చాలు అనే పద్ధతిలో వారు మాట్లాడినారు. లంక భూముల గురించి మాట్లాడినారు. ఇలాంటివి కొన్ని విషయాలు తప్ప చాలా వరకు పేదవర్గాలకు అనుకూలమైన పద్ధతిలో ఆ రిపోర్టు వున్నది. ఆఫీసర్సు చాలా చక్కగా రిపోర్టు ప్రిపేర్ చేశారు. కనుక రిపోర్టును మీరు ఏమి చేయదల్చుకున్నారు. ఆ రిపోర్టు ఇంతవరకు అసెంబ్లీలో కూడా పెట్టలేదు. ఎంత విచిత్రంగా వున్నది అంటే సీనియర్ క్యాబినెట్ మినిష్టర్‌గారిని చైర్మన్‌గా వేసి, చాలా ముఖ్యమైనటువంటి, చాలా సిన్సియర్ ఆఫీసర్సును మెంబర్సుగా కో ఆర్డినేట్ చేయమని పెట్టారు. వాళ్లు బాగా కష్ట పడ్డారు. ఫీల్డు విజిట్ చేసినారు. ప్రాక్టికల్ డిఫికల్టీస్ డిస్కస్ చేసినారు. దానికి సొల్యూషన్ కూడా చెప్పారు. ఆ రిపోర్టు మళ్లీ సిసిఎల్ఆర్‌కు పంపినారు. ఒక మినిష్టర్ గారి నాయకత్వంలో కమిటి వేసి అందులో సిసిఎల్ఆర్‌ను మెంబరుగా వేశారు. ఆయన సంతకం కూడా పెడతారు. మంత్రిగారు పెడతారు, క్యాబినెట్‌కు ఇస్తారు. క్యాబినెట్‌కు ఇస్తే రిమార్క్సుకు ఆ రిపోర్టును సిసిఎల్ఆర్‌కు పంపించి దీనిని ఎంతవరకు అమలు చేస్తాము. మీయొక్క రిపోర్టులో మీ కామెంట్సు ఏమిటి దీనిపైన అని చెప్పి సిసిఎల్ఆర్‌కు పంపించారు. ఆయన ఆల్రెడీ మెంబరు, ఆల్రెడీ ఆయన చూసినారు, ఆయనే రిపోర్టు ఇచ్చినారు. మళ్లీ ఆయనకే వీళ్లు పంపుతారు. తరువాత దాంట్లో కొన్ని అసాధ్యమైనవి ఇది సాధ్యము కాదని ఆయన మళ్లీ 6 నెలలు తరువాత వీళ్లకి రిపోర్టు పంపుతారు. ఈ విధంగా నవ్వులాట కాకపోతే ఇది అపహాస్యం చేయడం కాకపోతే మీ యొక్క సిన్సియారిటి ఏమిటి? దీని మూలంగా స్పష్టంగా అర్థం అవుతుంది. అదే మెంబరుకు ఇవ్వడం, ఆయన రిమార్క్సు తెప్పించే ప్రయత్నం చేయడం, దీనికి ఆయన ఇచ్చిన రికమెండేషన్సు, మళ్లీ ఆయన నెగిటివ్ రాయడం, ఎంత విచిత్రం ఒక వండర్ కాకపోతే ఏమిటి? ఆ విధంగా

చేయవలసిన అవసరం ఎందుకు వచ్చింది? ఆ విషయాన్ని ఈనాడు మంత్రిగారు చెప్పవలసినదిగా కోరుచున్నాను.

ఈనాడు మీరిచ్చిన సమాధానం సంతృప్తికరంగా ఇవ్వకుండా ఏదో డిబేట్ చేసేసి, ఎదురుదాడి చేయడం ప్రభుత్వానికి అలవాటు. ఏదైనా ఇష్యూ వచ్చేసరికి ఎదురు దాడి చేసి, గావుకేకలు పెట్టి, కాంట్రవర్సీ క్రియేట్ చేసుకుని, హౌసును కంప్లీట్ చేసుకుని వెళ్లడం అలవాటు. కాబట్టి స్పెసిఫిక్‌గా కొన్ని పాయింట్సు వారి జవాబు కోసం కోరుతున్నాను. స్పెసిఫిక్‌గా వాటికి జవాబు ఇవ్వాలి. అంతకు ముందు నాలుగైదు పాయింట్సు చెప్పాను. అదే విధంగా ఈ రోజు కూడా ఎసైన్‌మెంటు ల్యాండుకు యాక్టు తెచ్చాము. బిల్ నెం.35 పాస్ చేశాము. ఆ బిల్లులో స్పెషల్‌గా కొన్ని ఎమెండ్‌మెంట్సు తీసుకువచ్చాము. వాటి ప్రకారం మనం ఇచ్చిన అసైన్‌మెంట్‌తో ల్యాండ్స్ రమారమి 40 లక్షల నుంచి 50 లక్షలు ఉంటుందని ప్రభుత్వ అంచనా. 42 లక్షలు, Something like that, మనం అసైన్ చేశామని. సీలింగ్ ల్యాండ్ అయితే, సర్‌ప్లస్ 1975 లో తెచ్చిన యాక్టు ద్వారా కొన్ని లక్షల ఎకరాలు వస్తాయని అనుకున్నాము. దురదృష్టవశాత్తు 6 లక్షలు కంటే ఎక్కువ తేలేకపోయాము. ఆ 6లక్షల ఎకరాలు తీసుకురావడానికి యంత్రాంగం యాక్టుకి తూట్లు పొడిచి, పేదలకు దక్కకుండా చేసిన సందర్భం చారిత్రక సత్యం. యాక్టు వచ్చాక, మినిస్టరు గారి స్టేట్‌మెంటు న్యూస్‌పేపర్లో చూశాను, కనీసం ఆ 42లక్షలలో 5లక్షలకు పైగా అన్యాక్రాంతం అయినట్టు రిపోర్టు వచ్చిందని మీరన్నారు. ఎంత అయింది? మీ నోటీసులో ఎంత ల్యాండు చేతులు మారాయి? ఆ వివరాలు ఇవ్వాలి. స్టేట్‌మెంటులో అది లేదు.

ఇచ్చిన ల్యాండు రీ ఎసైన్ చేయడానికి ఒరిజినల్ ఓనర్‌కు ఇవ్వవచ్చును. లేదా ఎలిజిబుల్ పర్సన్‌కు ఇవ్వవచ్చును. ఆ విధంగా ఓనర్సు ఎంతమందికి ఇచ్చారు? లేకపోతే, ఒరిజినల్‌గా ఎవరూ లేకపోతే, ఈనాడు ముఖ్యమంత్రిగారు ఇచ్చిన భూములు చూశారు. ఓనర్సు లేరు. ఇంతకు ముందు జవాబు చెప్పిన దానిలో ఒరిజినల్ ఓనర్సు దొరకడం లేదన్నారు. ఒరిజినల్ ఓనర్సు దగ్గర తీసుకుంటే కదా! వీళ్లే కాగితాలు రాసుకుని, తీసుకున్నారు. వీళ్లే అనుభవించారు. ఓనర్ అంటూ వుంటే కదా. అటువంటి కేసులు ఎన్ని వచ్చాయి మీ దగ్గర? ఒరిజినల్ ఓనర్సు ఎంత మందికి ఇచ్చినారు? లేక ఎలిజిబుల్ పర్సన్స్‌కు ఎంత మంది కిచ్చారు?

చట్టంలో ఒక క్లాజు పెట్టుకున్నారు. ప్రభుత్వం నోటిఫై చేయవచ్చు. నోటిఫై చేసిన ఏరియాలో మళ్లీ ఒరిజినల్ ఓనర్‌కు ఇవ్వరు. ఎలిజిబుల్ పర్సన్‌కు కూడా ఇవ్వరు. అటువంటి ల్యాండును పబ్లిక్ పర్సస్‌కు ప్రిజర్వ్ చేసుకుంటామని క్లాజు పెట్టారు. ఆ విధంగా క్లాజు ప్రకారం ఎన్ని ఏరియాస్‌ను నోటిఫై చేశారు? ఒక న్యూస్ రిపోర్టు చూశాను. 26 మండలాలు కేవలం ఒక్క కడప జిల్లాలోనే చేశారని. అంటే ఎంత మిస్‌యూజ్ చేశారో ఈ ప్రావిజన్‌ని. ఒకసారి నోటిఫై చేసి వుంటే ఆ ప్రాంతంలో పేదల వద్ద ఉన్న భూములన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. అవునా? కాదా? ఎందుకు ఈ విధంగా నోటిఫై చేస్తున్నారు? దాని పర్పస్ ఏమిటి? ఏదైనా ఒక అర్బన్ ఏరియాలో వ్యవసాయ యోగ్యం కాని పొలాలు లేని చోట్ల అలాంటివి నోటిఫై చేయకుండా వదలిపెట్టి, మొత్తం రాష్ట్రంలో ఇష్టం వచ్చినట్లు మండలాలు నోటిఫై చేయడం. ఆ నోటిఫికేషన్

మూలంగా పేద ప్రజలకు ఉపయోగం లేకపోతే What is the purpose? టోటల్‌గా మీరు ఏదనుకుంటే అదే. పబ్లిక్ పర్పస్ అని ఒక క్లాజ్ పెట్టారు. ఇండస్ట్రీస్ కూడా పబ్లిక్ పర్పస్ అన్నారు. అంటే పేద వాడికి దక్కకపోవడం, ఇండస్ట్రీస్‌కు ఎలాట్ చేయడం. టౌన్‌షిప్‌ని కూడా పబ్లిక్ పర్పస్ అన్నారు మహానుభావులు. రేపు ఎక్కడైనా పేదవాడి భూమి లాక్కోవచ్చు. పబ్లిక్ పర్పస్ కోసం నోటిఫైడ్ ఏరియాస్‌లో ఎప్పుడో 20,30,40 సంవత్సరాల క్రితం ఇచ్చిన పొలాలు కూడా లాక్కుని తీసుకుంటారు. అది ఎంతవరకు సమంజసం? ఎన్ని ఏరియాస్ నోటిఫై చేశారు? ఏ ఏరియాస్‌లో ఎన్ని లక్షల ఎకరాలు తీసుకున్నారు? అదేవిధంగా, నోటీసు లిచ్చామన్నారు. ఈ విధంగా ఇల్లీగల్‌గా ట్రాన్స్‌ఫర్స్ అయిన చోట్ల నోటీసులు ఇచ్చామన్నారు. ఎన్ని రెస్యూమ్ అయినాయి? వాలంటరీ స్కీం పెట్టారు. 23వేలో, 25వేలో వచ్చాయని జవాబులో ఏదో ఇచ్చారు. మిగతా వాటి సంగతి ఏమిటి? 5 లక్షల పైన ఉందని అన్నారు. ఆ విషయాలు కూడా చెప్పాలి. పెద్దలు రంగారావుగారి కమిటీ రిపోర్టులో కొన్ని రికమెండేషన్సు ఫైనల్ ప్రావిజన్‌గాక మెన్షన్ చేయడం జరిగింది. ఒకవేళ ఎవరైనా ఎసైన్‌మెంటు ల్యాండ్స్ కొనుక్కున్నా, ట్రాన్స్‌ఫర్ అయినా, వేరియస్ రీజన్స్ వల్ల వాళ్ల హక్కులను మార్చుకుని తీసుకుంటే, that is totally prohibited under 1977 Act. ఆ చట్టం తీసుకువచ్చాము. మొన్న కొంత ఎమెండుమెంటు తీసుకువచ్చారు. ఆ పద్ధతిలో ఎవరైనా తీసుకుంటే, అనుభవదార్లు ఎన్ని సంవత్సరాల నుంచి అయితే, అనుభవంలో ఉందో దానికి రేటు కట్టి, ఫలప్రదం ఎంత వచ్చిందో, దానికి రెండు రెట్లు వాళ్ల వద్ద రికవరీ చేయాలని స్పష్టంగా ఉంది దానిలో. అయితే ఈనాడు 305 ఎకరాలు ముఖ్యమంత్రి గారు సరెండర్ చేశారని చెప్పారు. మార్నింగ్ చాలా చర్చ. మేము ఈ 305 ఎకరాలు సరెండర్ చేసేటప్పుడు మీరిచ్చిన రికమెండేషన్సు ప్రకారం, యాక్టు ప్రకారం, ఒకటి `This is totally illegal. రెండవది, Recovery of the entire cost. అలా రికవరీ చేశారా ముఖ్యమంత్రి గారి వద్ద? మాకు తెలిసిన సమాచారం కొంతవరకు ఉంది. వారు ఇన్‌కంటాక్సు రిటర్న్ కూడా ఫైల్ చేశారు. నాకు అగ్రికల్చర్‌లో 300 ఎకరాల పైన ఇంత ఇన్‌కం వచ్చిందని. మిగతాది, ఇన్ని సంవత్సరాలు ఇల్లీగల్‌గా అనుభవంలో ఉందో అన్ని సంవత్సరాలకు లెక్క కట్టి, మీరు ఇమీడియెట్‌గా కట్టాల్సిన అవసరం ఉంది. ఆ విధంగా ఎందుకు రికవరీ పెట్టలేదో, ఎప్పుడు పెడతారో చెప్పాలి. ఇది ఒక్క ఎగ్జాంపుల్. ఒక ముఖ్యమంత్రిగా, ఎగ్జాంపుల్‌గా జవాబులో చూశారు, ల్యాండ్ ఎసైన్ చేయడానికి ఒరిజినల్ ఓనర్సు లేరు కనక దానికి ఎకోపార్కు పెట్టుకోవడం, లేకపోతే ఐఐఐటి పెట్టడం. ఇడుపులపాయలో పెట్టడం. కడప వ్యవహారం చూస్తే, విచిత్రంగా ఉంది. అక్కడ ట్రిబుల్ ఐటి కావాలి. ఒక యూనివర్సిటీ కావాలి. మొత్తం పులివెందుల చుట్టూ రింగు రోడ్డు కావాలి. 4300 ఎకరాలను రకరకాలుగా పబ్లిక్ పర్పస్ కోసం ఎలాట్ చేశామని మీరు మాట్లాడుతున్నారు. పబ్లిక్ పర్పస్ అని చేయడం ఎంతవరకు సమంజసం? కడప జిల్లాలో పేదవాళు లేరా? ఎలిజిబుల్ పర్సన్స్ లేరా? ఎవరూ భూమి కావాలని అడిగిన వారు లేరా? అందరూ మీలాగా బ్రహ్మాండంగానే వున్నారా? ఎందుకు మీరు పేద వర్గాలకు ఇవ్వకుండా పబ్లిక్ పర్పస్ కోసం, ఆ ముసుగుతో మీ చేతులలో పెట్టుకోడానికి ప్రయత్నం చేస్తున్నారు? దానికి స్పెసిఫిక్‌గా ఆన్సర్ ఇవ్వాలి. మొత్తం ఓవరాల్‌గా ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అనుకోవడానికి ఇనీషియేట్

చేసిన కార్యక్రమాలు చాలా స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

మినిస్టరు గారు మాట్లాడేక మళ్లీ నాకు అవకాశం ఇవ్వాలి. ఇప్పుడు వారు కామ్‌గా ఉండి, తర్వాత రకరకాలుగా కండెమ్ చేయవచ్చును. We have certain information with us. మేము కూడా చెప్పడానికి అవకాశం ఇవ్వాలి. నేను స్పెసిఫిక్‌గా వారిని కోరేది, ఈనాటికి ముఖ్యంగా అవుట్‌సైడ్ పట్టాలు డిమాండు మొత్తం 40లక్షల మంది అప్లయ్ చేసుకున్నట్టు మావద్ద సమాచారం ఉంది. ఎంతమంది అప్లయి చేసుకున్నారు? ఆ సమాచారం ఇవ్వండి. ఎప్పటిలోగా వాళ్లకు పట్టాలిస్తారు? ఇనెలిజిబుల్ పర్సన్స్‌కు ఇవ్వమని కోరడం లేదు. కావాలంటే 'ఐరిష్ పద్ధతి' ఉంది. ఐడెంటిఫై చేయడానికి టెక్నాలజీ ఉంది. రెండవసారి పట్టాలు తీసుకోకుండా చూడొచ్చు. అందరకూ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి. ఎప్పటిలోగా ఇస్తారు? మా వద్ద మీటింగ్సు జరిగినపుడు దీని మీద గొడవ జరుగుతోంది. ఇక్కడ మినిస్టరుగారున్నారు. అక్కడకు వలసలు వస్తున్నారంటే, 8 సంవత్సరాల లోపల జవహర్‌నగర్ గ్రామంలో గతంలో ఒక్క మనిషి కూడా ఉండేవాడు కాదు. ఇప్పుడు 50 వేల మంది జనాభా వచ్చారు. అంతా పేదలు, రిక్షా కార్మికులు, నిర్మాణం చేసే పనివాళ్లు, కన్‌స్ట్రక్షన్ వర్కర్సు. వారు పొద్దంతా కష్టపడాలి. ఎక్కడో ఒక చోట వారు పడుకోవాలి. వారికేమో అందరికి సంపద ఉండాలి. వారికైతే రోడ్డు వేయాలి. ఇల్లుకట్టాలి. అన్నీ చేయాలి. సంపద సృష్టించాలి. ఇక్కడ మాత్రం పేదలకు కనీసం సాయంత్రం వరకూ పోయి పడుకోవడానికి 50 గజాల స్థలం కూడా ఇవ్వకుండా ఉన్నారు. పక్కన 6,000 ఎకరాలు ఉంది. మేము 300 ఎకరాలు గ్రామకంఠం క్రింద నోటిఫై చేసి ఇచ్చాము. ఈ రోజు ఇంకా కొన్ని వలసలు పెరిగి 7000, 8000 మందికి ఇవ్వకపోతే అది మేము తయారు చేసి ఇచ్చిన తరువాత ప్రభుత్వం మారింది. వారికి ఇవ్వడానికి ఏవీ చేయలేదు.ఎంత కఠోర పద్ధతిలో పోతున్నారంటే, కరెంటు లేకుండా చేస్తున్నారు. నీరు లేకుండా చేస్తున్నారు. ఈ విధంగా ఇంత రాక్షసత్వంగా పని చేస్తే, పేద ప్రజలు ఈ విధంగా ఇబ్బంది పడితే ఇక్కడున్న శాసనసభ్యులను కోరేదేమంటే, I am residing in that area. ఎవరైతే అరుస్తున్నారో, వారు ఎవరయినా ఫరవాలేదు. మనం అక్కడకి అరగంటలో వెళ్లి రావచ్చు. ఈ డిబేట్ అయ్యే లోపల పోయి రావచ్చు. ఒక కమిటిని వేయమనండి. అక్కడి పరిస్థితిని చూడవలసిందిగా కోరుతున్నాను. పిల్లలు గుడిసె బయట కూర్చుని ఉంటే కళ్ల నుండి నీరు వస్తుంది.

ఆ విధంగా వారిని ఇబ్బందులు పడుతూ ఉంటే, ప్రొద్దున్నే బుల్‌డోజర్స్‌తో వెళ్లి మొత్తం కూలగొట్టి, బయట వేసి నానా ఇబ్బందులు పెడుతున్నారు. ఒక్కసారి కమిటీని వేయమనండి, అటువైపు నుండి అరవడం కాదు. రేపు అక్కడ తెలుస్తుంది. మొత్తం సరౌండింగ్ ఏరియా అంతా ఇదే పద్ధతిలో ఉంది. పేద ప్రజలు ఈనాడు భూముల కోసం ఏ పార్టీవారు పిలిచినా వస్తున్నారు. ఈ రోజు కమ్యూనిస్ట్ పార్టీలు పిలుస్తున్నారు. తెలుగుదేశం పార్టీ పిలిపించినా వారు వస్తున్నారు. వారి అవసరాలు ఆ విధంగా ఉన్నాయి. పొద్దంతా కష్టపడితే నెలకు రూ. 2,000 కూడా రావు. సోషల్ ఎకనామిక్ స్టడీ చేయించాము. ఒకొక్కరి పరిస్థితి ఆ బస్తీలలో చూస్తూ ఉంటే తెలుస్తోంది. ఒక్కో రూమ్‌కి కిరాయి రూ. 800 అవుతోంది. వారు ఎలా బ్రతుకుతారు? ఎలా ఉంటారు?

కనీసం స్థలం ఇస్తే ఇంత గుడిసె వేసుకుంటామని చెబితే అది కూడా ఇవ్వకుండా నానా ఇబ్బంది పెడుతున్నారు. 40 లక్షల మంది ఉన్నారు. ఆ విధమయిన ప్రక్రియ ఈ ప్రభుత్వంలో ఉంది. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోంది. అదే విధంగా, అయినవారికి, తన బంధువర్గాలకూ, కావలసిన వారికి మాత్రమే వందలాది ఎకరాల పొలాలను ధారాదత్తం రాత్రికి రాత్రే చేస్తున్నారు. ఆ విధంగా ఇష్టానుసారంగా ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక రియల్ ఎస్టేట్ ప్రభుత్వంగా తయారయింది. భూములను ఆక్షన్ వేయడం, ఉన్న పేద ప్రజలను ఆ భూముల నుండి తొలగించడం, వాటిని అమ్ముకొని ఈ విధంగా ప్రభుత్వం దుర్మార్గంగా ప్రవర్తిస్తోంది. పేద ప్రజల విషయంలో వ్యతిరేకంగా, ఈ ప్రభుత్వ ప్రవర్తన ఉంది. You appoint a Land Commission. ఒక మంచి వ్యక్తిని పెడదాము. శంకరన్‌లాంటి ఎంతో నిజాయితీపరులైన అధికారులు ఉన్నారు. వారి ఆధ్వర్యంలో కమీషన్ పెట్టి ఎక్కడెక్కడ అవకతవకలు ఉన్నాయో, వాటిని బయటకు తీస్తారు. అవసరమైన పేద ప్రజలను ఐడెంటిఫై చేస్తారు. ఇల్లీగల్ ఆక్యుపెన్సీలు వుంటే, వాటిని ఖచ్చితంగా తీస్తారు. జిల్లాలవారీగా ల్యాండ్ కమీషన్ ఏర్పాటు చేస్తారు. **జిల్లాలవారీగా ల్యాండ్ కమీషన్ ఏర్పాటు చేసి దాని బ్రాంచీలు జిల్లాల వారీగా పెట్టి ఈ భూ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సదరు రెకమెండేషన్స్‌లో కూడా ఈ ల్యాండ్ కమీషన్ ఉంది.** దానిని ఖచ్చితంగా ఎప్పటిలోగా కాన్స్‌టిట్యూట్ చేస్తారు. దానికి స్టాట్యుటరి పవర్స్ ఇవ్వాలి, చూడాలి. లేకుంటే, ఇది జరగదు. యంత్రాంగం చేస్తుందని అనుకోవడం చాలా పొరపాటు. మన అనుభవం చెబుతుంది. యంత్రాంగంతో అయ్యే పని కాదు. వారికి సర్వాధికారాలనిచ్చి అక్కడికక్కడే డిసెషన్ తీసుకునే విధంగా, లాండ్ కమీషన్ ఏర్పాటు చేయాలనీ, అదే విధంగా, రంగారావుగారు ఇచ్చిన కమిటీ రిపోర్ట్ చర్చకు పెట్టి అందులో అమలుకు యోగ్యమైన, పేద ప్రజలకు అనుకూలమైన పనులన్నింటినీ వెంటనే చర్యలు చేపట్టాలని ఆ విధంగా పేద ప్రజానీకానికి అగ్రికల్చర్ ల్యాండ్ కాకుండా, ఇళ్ల స్థలాలకు సంబంధించి కమ్యూనిటి పర్పస్ అంటే, కమ్యూనిటి ల్యాండ్ అలాట్‌మెంట్ ఇవ్వడం, వీటిన్నంటిని ఏ విధంగా చేపడతారో సమగ్రంగా చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాను. ఈ ఆక్షన్స్ వెంటనే ఆపాలని, ఖచ్చితంగా పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను ఇచ్చినా, పర్పస్‌ఫుల్‌గా కమ్యూనిటి పర్పస్‌కి అలాట్‌మెంట్ చేసిన తరువాత అవన్నీ వాటి పాలసీ వచ్చే వరకూ ఎటువంటి ల్యాండ్ ఆక్షన్స్ పెట్టరాదని డిమాండ్ చేస్తూ, ఈరోజు ముఖ్యమంత్రిగారు ఇచ్చిన దాని మీద వారు జవాబు చెప్పాలని కోరుతూ నాకు ఇచ్చిన ఈ అవకాశానికి ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

# ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్

15-11-2007

అధ్యక్షా! యస్.సి, యస్.టి.ల సబ్ ప్లాన్ అమలు తీరు ఏ విధంగా వుండాలనేదాని పైన మన రాష్ట్రంలో చాలా రోజులుగా చర్చ జరుగుతోంది. ఈ సబ్‌ప్లాన్ ఐడియా ఈ రోజుకీరోజు వచ్చింది కాదు. చాలా సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం, ప్లానింగ్ కమీషన్ ఇవి అన్నీ కూడా అట్టుడుగు వర్గాలైనటువంటి యస్.సి, యస్.టి.లకు, తప్పకుండా వారి expenditure as per population ratio ప్రకారం కేటాయింపులు చేసి, అవి సక్రమంగా అమలు చేసే పద్ధతిలో యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలి. ఒక వ్యవస్థను స్థాపించాలని ప్లానింగ్ కమీషన్‌తో సహా guidelines వున్నాయి. కాని మన దగ్గర ఎందుకు ఈ డిమాండ్ వస్తుందో ఆలోచన చేస్తే, సమాజంలోని అట్టడుగు వర్గాలు ఇప్పటికీ విద్యకు, వైద్యానికి, కనీస వసతులకు నోచుకోని వర్గాలకు చెందిన వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవలసిన అవసరం వుందని రాజ్యాంగబద్ధంగా చాలా స్పష్టంగా చెప్పబడింది. ఆ విధమైన కేటాయింపులు సరిగా జరగడంలేదు. జనాభా దామాషాకు అనుగుణంగా కేటాయింపులు జరగడం లేదు. ఒక వేళ కేటాయింపులలో చూపెట్టినా, బడ్జెట్‌లో అవి ఖర్చు కావడం లేదు. ఎందుకంటే ఇది మన యొక్క అనుభవము. శాసన సభలో చాలా ఆర్భాటంగా మనం బడ్జెట్ ప్రవేశ పెడతాం. ఆర్భాటంగా ప్లాన్స్ తయారు చేసుకుంటాం. కాని Ultimate గా ఖర్చు చేసేది చూస్తే దానికి దీనికి పొంతనుండదు. అ విధంగా కాకుండా ఖచ్చితంగా సబ్‌ప్లాన్ వుంటే ఆ సబ్ ప్లాన్ ప్రకారం ఖర్చైతే, ఆ సబ్ ప్లాన్ సిస్టమేటిక్‌గా అన్నీ డిపార్ట్‌మెంట్‌లలో జరిగే వ్యవహారమే కాకుండా, స్వతహాగా సబ్‌ప్లాన్ క్రింద నిధులు ఉన్నట్లైతే కచ్చితంగా ఖర్చు చేసే అవకాశం వుంటుంది. ఈనాడు ఏమి జరగుతుంది, మీకు బాగా తెలుసు, మేము కూడా అడ్మినిస్ట్రేషన్‌ల చూసినాము.

ఎప్పుడైనా రిలీజ్ డబ్బులు వచ్చిన తరువాత వాటిని డబ్బులు కేటాయింపు ఒక ఎత్తైతే, దాని ఖర్చు మరొక ఎత్తు . ఎక్కడ తక్కువబడినా ఆర్థిక శాఖ వాళ్లు వెంటనే దెబ్బకొట్టేది వెల్‌ఫేర్ పైన. ఎందుకంటే నోరు లేని వాళ్లు, ఎవరూ అడగరు గనుక వెల్ఫేర్ శాఖకు రావలసిన రిలీజెస్ కోత పెడతారు. మీరు ఎప్పుడైనా చూడండి. ముందు కేటాయింపులు అక్కడ ఆటోమెటిక్‌గా తగ్గిపోతాయి. దాంతో దాని ప్రభావం ఎంత తీవ్రంగా వుంటుందో గ్రౌండ్‌లో మనము ఆలోచన చేసుకోవాలి. కనుకనే, ఈ వర్గాలకు చెందిన ప్రతినిధులందరూ సబ్‌ప్లాన్ తప్పకుండా వుండాలి. దానిని రెవ్యూ చేసే మెకానిజం తప్పకుండా వుండాలని డిమాండ్ ఇంకా చాలా విచిత్రంగా వస్తోంది. దానిని అర్థం చేసుకోవాలని మేము చెప్పదలచుకున్నాము. ఒక్కసారి మీరు ఆలోచన చేయండి, ముఖ్యమంత్రిగారు చెపుతున్నారు, మేము కూడా చాలా చెప్పాము, ఇతరులు చెప్పారు. **స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలైంది, ఇప్పటికి కుడా యస్.సి., యస్.టి. ల మరియు బి.సి.లలో విద్యా పరంగా చూస్తే, వారిలో యస్.టి.ల పరిస్థితి దారుణం. 60 నుండి 70 శాతం వరకు విద్యార్థులు ఇప్పటికీ పాఠశాల మానివేస్తున్నారు.** కాలేజి విద్యను చూస్తే ఎస్టీలు నాలుగు నుండి ఐదు శాతం మాత్రమే కనిస్తున్నారు. ఈనాటికి యస్.సి.లలో 46 శాతం మంది పిల్లలు పౌష్టిక ఆహారం అందని పరిస్థితిలో ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెపుతున్నది. ఆ విధంగా మన అభివృద్ధి అద్దంలో కనిపిస్తుంది. ఎన్నో స్కీములు పెట్టవచ్చు, అది ఇచ్చాము, ఇది ఇచ్చామని మీరు చెప్పవచ్చు, మేము చెప్పవచ్చు. కాని What is the net result. సమస్య తీరుతున్నదా లేదా? ఫలితాలు వస్తున్నాయా లేదా? అనే కోణంలో ప్రభుత్వం అలోచించాలని చెప్పదలచుకున్నాను. గనుక బడ్జెట్ కేటాయింపులు లేకుండా, ఆ పథకం, ఈ పథకం అని చెప్పినంత మాత్రాన వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయా? గనుక బడ్జెట్ కేటాయింపులు వుండాలి. పకడ్బందీగా అమలు చేసే యంత్రాంగం వుండాలి. దానిని రెవ్యూచేసే యంత్రాంగం కూడా వుండాలి. లేకపోతే కేటాయింపులు ఇచ్చినా అవి సక్రమంగా ఖర్చు పెట్టనట్లైతే, ఆ డబ్బు ఎక్కడకు పోతుందో తెలియదు. డి.పి.యఫ్.లో మిస్‌యూజ్ ఏ విధంగా జరిగిందో మనము చూసాము. గనుక కరెక్ట్‌గా నోడల్ ఏజన్సీస్ అన్నీ కూడా పకడ్బందీగా రెవ్యూ చేసుకోవడానికి సరైన యంత్రాంగం ఉండాలి. ఒక్కసారి గత మూడు సంవత్సరాల అనుభవమే చూస్తే, యాభై సంవత్సరాలది కాదు. ఈ మూడు సంవత్సరాలలో మనము ఇచ్చినటువంటి ప్లాన్ ప్రకారంగా, నాన్‌ప్లాన్ ఎవరైనా ఖర్చు పెడతారు. ప్లాన్‌లో కేటాయింపులు 2004-05 సంవత్సరానికి రూ.363కోట్లు కేటాయింపులు చేస్తే, ఖర్చు చేసింది కేవలం రూ.320 కోట్లు మాత్రమే మరియు 2005-06 సంవత్సరానికి కేటాయింపులు చూస్తే రూ.373 కోట్లు మీరు ప్లాన్‌లో పెట్టినారు, కాని కేవలం రూ.230కోట్లు మాత్రమే ఖర్చు అయ్యింది.

అధ్యక్షా! ఇక్కడ ఇచ్చిన ఫిగర్ నా యొక్క ఫిగర్స్ కాదండి, ఇదే శాసనసభలో మీ యొక్క మంత్రిగారు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, Minister for Social Welfare గారు ఒక ప్రశ్నకు సమాధానంగా ఇచ్చిన ఫిగర్స్‌నే నేను కోట్ చేస్తున్నాను, ఎక్కడ నుంచో సంపాదించినవి కావు. నేను ఒక్క విషయం చెప్పదలకున్నా. ముఖ్యమంత్రి గారు ప్రతి విషయంలో ఒక విషయాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. మీరు ఏమి చేసారు, మేమేమి చేసాము అది కాదు ఇక్కడ ప్రశ్న,

కొన్ని సందర్భాలలో మాకున్న పరిస్థితులను బట్టి ఆనాడు వున్న వనరులను బట్టి మేము చేసాము. దానికంటే మీరెంత పెంచారో అది చెప్పండి. ఆదాయం ఎప్పుడు నిలకడగా వుండదు. ఎల్లప్పుడూ పెరుగుతూ వుంటుంది. ఆదాయం పెరిగినప్పుడు అట్టడుగున వున్నవారి కొరకు ముందు కేటాయింపు ఎక్కువ చేస్తారా? ఇతర వర్గాలకు ఎక్కువ చేస్తారా? దానికి సమాధానం చెప్పండి, నాకు కావలసింది అది. అది వదిలిపెట్టి మీరేం చేసారు మేమేం చేసాము అనడం సబబుకాదు. మీరు పెంచిన దానిని నేను చూసాను 5శాతం, 10శాతం మీరు మాకంటే పెంచినారు, పెంచి మేము పెంచినాము కదా మీకంటే, మీరు ఏమి చేసినారు చెప్పండని చెప్పి అనడం, ఇది ఎక్కడి న్యాయం? అక్కడ ప్రజలు తిండి లేక ఎన్నో ఇబ్బందులు పడుతుంటే, వాళ్లకు కావలసిన you do better than us మాకంటే మంచి పనులు చేయండి. మాకంటే improve చేసుకోండి, ఎక్కువ నిధులు కేటాయించండి, మంచి పేరు తెచ్చుకోండి, అంతేగాని మీరు చేయలేదు గనుక మేము చేయమని మీరు చెపితే, మేము కూడా చెపుతాము. అత్యంత పేద వర్గాలకు సంబంధించిన సమస్య ఇది. ఈ నిర్ణయం మూలంగా మనం నోడల్ ఏజెన్సీ ఇచ్చేసి, as per population వారి జీవితాల్లో మార్పులు తీసుకొని రావడానికి చాలా అవకాశం ఉంది. అటువంటి ముఖ్యమైన సబ్జెక్టు మంత్రిగారి కంట్రోల్‌లో లేదు. వారు చెపుతున్నారు, మేము చెపుతున్నాము, అల్టిమేట్‌గా What is the result? కాబట్టి మానవీయ కోణంలో ఆలోచించమని రెక్వెస్టు చేస్తున్నాను. గతంలో మనం చూశాం, కేవలం పేపర్ల మీదనే అన్నీ ఉంటున్నాయి, కాని ఒక్కటి కూడా జరగడం లేదు. ఆ విషయాన్ని ముఖ్యమంత్రిగారు చూశారు, మేము చూశాం, Centrally sponsored schemes రోజు రోజుకి తగ్గిపోతున్నాయి. ఆ స్కీమ్స్‌కు రావలసినంత సొమ్ము రావడం లేదు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఇంకా తగ్గిపోయాయి. ఈ విషయంలో మీరు కేంద్ర ప్రభుత్వం మీద ఎంత ఒత్తిడి తీసుకుని రావాలో అంత ఒత్తిడి తీసుకుని రావడం లేదు. మీరు గట్టిగా చేయడం లేదని నేను గట్టిగా చెప్పదలకుకున్నాను. అందుకే Centrally sponsored schemes తగ్గిపోవడం, వాటికి రావలసిన డబ్బు రాకపోవడం జరుగుతోంది. దాంతో ఇబ్బందులు వస్తున్నాయి. స్టేట్ బడ్జెట్‌లో కూడా కేటాయింపులు తగ్గిపోతున్నాయి. ఈ సంవత్సరం బడ్జెట్ రూ.860 కోట్లు చూపించి, రూ.320 కోట్లు ఇస్తే ఎట్లాగండీ? ఏమి కావాలండీ పేద వర్గాలు? బడ్జెట్‌లో బ్రహ్మాండంగా ఫిగర్ చూపిస్తున్నారు. తీరా రిలీజెస్ దగ్గరకు వచ్చేసరికి కోత విధిస్తున్నారు. అందుకే నోడల్ ఏజెన్సీ పెట్టి as per their population బడ్జెట్ కేటాయించండి. వాళ్లు ఒక్క పైస కూడా ఎక్కువ అడగడం లేదు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు 25 శాతం ఉన్నారు. కాబట్టి ఆ పాపులేషన్ ప్రకారం ఏవయితే కేటాయింపులు ఉన్నాయో, వాటిని ఈ నోడల్ ఏజెన్సీకి ఆటోమేటిక్‌గా ఇచ్చేయండి. కాని మీరు నోడల్ ఏజెన్సీకి ఇచ్చేసి, దానికి ఎటువంటి ఫైనాన్షియల్ పవర్స్ ఇవ్వకపోతే ఏమి లాభమండీ? మీరు ఏదో ఒక కమిటీ వేస్తామంటారు. సి.ఎం.కి మించిన వ్యక్తి ఈ సిస్టమ్‌లో ఎవరు ఉంటారండీ? సి.ఎం. నాయకత్వంలో మీరొక ఒక కమిటీని వేస్తామని చెప్పినా ఉపయోగం ఉండదు. ఎందుకంటే, వారు అనేక కమిటీలకు ఛైర్మన్‌గా ఉంటారు. కాబట్టి వారికి వీలుపడదు. కాబట్టి నోడల్ ఏజెన్సీకే స్టాటిట్యూరీ పవర్స్ ఇవ్వండి. వారు తమ బడ్జెట్‌ను రీ అప్రాప్రియేట్ చేసుకునే అవకాశం కల్పించండి . ఒకవేళ ఏ డిపార్టుమెంట్ అయినా

ఖర్చు పెట్టకుండా పోతే, ఆ డిపార్టుమెంట్‌ను నిలదీసే అధికారం ఇవ్వండి. మనకు తెలియనది ఏమీ లేదు. 31 మార్చి ముందు ఏమి జరుగుతుందో మనకు తెలుసు. ఫైనాన్స్ డిపార్టుమెంట్ చివరి, పది, ఇరవై రోజుల ముందు బడ్జెట్ రిలీజ్ చేస్తారు. ఆ డబ్బులు ఖర్చు కావు. దాంతో బడ్జెట్ కేటాయింపులు ల్యాప్స్ అయిపోతుంది. దాన్ని తరువాతి సంవత్సరంలో ఖర్చు పెట్టే అవకాశం ఉండదు. ఈ తమాషాలన్నీ మనం ఎన్ని చూడలేదండీ? మీరు అధికారంలో ఉన్నా, మేము అధికారంలో ఉన్నా జరిగేది ఇదే. దాని కోసం మనం ఏ చెక్ పెట్టాలి, ఏ విధంగా ఈ పేద వర్గాలకు డబ్బు కేటాయించి, ఆ డబ్బు సక్రమంగా ఖర్చు పెట్టాలన్నదే కదా ఈ తాపత్రయం అంతా. ఆ విధంగా కాగితాల మీద ఒకటి, ప్రాక్టికల్‌గా జరిగేది ఒకటి. కాబట్టి ప్రాక్టికల్‌గా కరెక్టుగా జరగాలంటే, కంపల్సరీగా ఈ ఏజెన్సీకి పవర్స్ ఇవ్వాలి. రీ అప్రొప్రియేషన్ పవర్స్ ఇవ్వాలి. ఒకవేళ ఖర్చు కాని బడ్జెట్ కేటాయింపు ఉంటే, ఆ బడ్జెట్‌ను, in addition to the regular budget రీఅప్రొప్రియేట్ చేసుకునే అధికారం ఇవ్వండి. ఈ విధమైన అధికారాలు ఇస్తే, నోడల్ ఏజెన్సీకి ఒక అర్థం ఉంటుంది. లేకపోతే వట్టి కాగితాలకే మన ఉపన్యాసాలన్నీ పరిమితమవుతాయి. అల్టిమేట్‌గా వాళ్ల పరిస్థితి అదే విధంగా ఉంటుంది. ఎటువంటి మార్పు ఉండదు. ఇప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో.....మళ్లీ నేను ఏదైనా మాట్లాడితే, ఎన్నడో నేను ఏదో ఒక హాస్టల్‌లో పడుకుని, మాకు ఉపన్యాసాలిస్తున్నాడు అని చెపుతారు అధ్యక్షా, ఆ విధంగా ఎదురు దాడిచేయవచ్చు. మేము సరిగా చేసుకోకపోయి ఉండొచ్చు. ఈనాడు ప్రజలు మా మాటల్ని నమ్మలేదు, మీ మాటల్ని నమ్మారు, మిమ్మల్ని గెలిపించినారు, మమ్మల్ని ఓడగొట్టినారు. మరి గెలిచిన వాళ్లు మా కంటే బాగా చేయాలా? లేకపోతే Worst గా చేస్తారా? కనుక ఆ విషయం కూడా ఆలోచన చేయండి నేను ముఖ్యమంత్రికి గతంలో చెప్పాను, ఇప్పుడు కూడా చెపుతున్నాను, ఆయన ఇప్పుడు కూడా సభలో ఉన్నారు. అయ్యా! మీరు రోజు ఎన్నో జిల్లాలు తిరుగుతున్నారు. పక్కనే అయిదు నిమిషాల్లో వెళ్లి రావొచ్చు. మీరు ఒకసారి వెళ్లిరండి. మీరు నింబోలిఅడ్డలో ఉన్న హాస్టల్‌లో 400 మంది విద్యార్థుల పరిస్థితి చూసి రండి. ఒక వేళ మీరు satisfy అయితే , నేను ఈ సభలో సిగ్గుతో తలదించుకుంటాను. మళ్లీ వెల్ఫేర్ గురించి ఒక్క మాట కూడా ఇక మాట్లాడను. ఎస్సీ, ఎస్టీలకు చెందిన పి.జి. స్టూడెంట్స్ పశువుల కంటే దారుణంగా అక్కడ నివశిస్తున్నారు. వారికి ఏదో కొంత సహాయం దొరికేటట్లు ఏర్పాటు చేయమని మేము కోరితే, మేమేదో ప్రతి దానికి ఉపన్యాసాలు ఇస్తున్నామంటారు. మీరూ మాట్లాడక, మేము మాట్లాడకపోతే ఈ యొక్క విషయాలు ఎట్లా తెలస్తాయి? నేను ముఖ్యమంత్రిగారిని, ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. మనకు ఈనాడు ఉన్న సిస్టమ్‌లో, స్టాటిట్యూరీ పవర్స్ వారికి ఇవ్వండి, రీ అప్రొప్రియేషన్ చేసే అధికారం ఇవ్వండి. ఒకవేళ unspent amount ఉంటే, దాన్ని ఖర్చు పెట్టే పద్ధతిలో మీరు కొన్ని మార్పులు తీసుకుని వస్తూ జీ.ఓ.లు తీసుకుని రండి, తీసుకుని వస్తే దానికి ఉపయోగం ఉంటుంది. మనది వెల్ఫేర్ స్టేట్ అండీ. it is not a Police Raj. ఆ విషయాన్ని మరచిపోవద్దు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఏరియాల్లో కూడా కంపల్సరీగా ఈ మార్పులు తీసుకుని రావాలని కోరుతున్నాను. అదే విధంగా ఇతర బలహీనవర్గాలు, మైనార్టీలకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. కేటాయించిన నిధులు సరైన విధంగా ఖర్చు అయ్యేటట్లు చూడండి, ఇంతకు ముందు డబ్బులు లేనినాడు మీరు, మేము ఎన్ని ఉపన్యాసాలు చేసినా, నడిచిపోయింది. కాని ఈనాడు దేశంలో,

రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతున్న పరిస్థితుల్లో, 9 శాతం గ్రోత్‌రేటు సాధించాలన్న లక్ష్యంగా  పెట్టుకున్న పరిస్థితుల్లో ఈనాడు కోట్లాది రూపాయలు ఆర్థిక వనరులు వస్తున్న సమయంలో కూడా, మీరు కనీసం వాళ్లకు తిండి, బట్ట ఇవ్వకపోతే జాతి క్షమించదు. మీరు ఈనాడు చెపుతున్నారు. 70 లక్షల ఇళ్లు కట్టించామని. 50 శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలని Are you following it? ఆ జీ.ఓ.ను టేబుల్ మీద పెట్టమనండి. మేము కూడా ఏదో రకంగా expenditure చేశామనే పద్ధతిలో మాట్లాడవద్దు. సమయం ఇంకా మించిపోకముందే మనమందరం కళ్లు తెరవాలని నేను చెప్పదలచుకున్నాను.. ఈనాడు ధనిక పేదవర్గాల మధ్య గ్యాప్ విపరీతంగా పెరిగిపోతున్నది. అది మంచి పద్ధతి కాదు. అల్టిమేట్‌గా , అంబేద్కర్ చెప్పినట్లుగా వ్యవస్థ మీదనే నమ్మకం పోయినట్టయితే, ఆ యొక్క పేద వర్గాలు తిరుగుబాటు చేసి మీ యొక్క సౌధాలను కూల్చివేసే పరిస్థితి వస్తుంది. ఆ పరిస్థితి రాకుండానే కాస్త జాగ్రత్త పడి, ఇప్పటికైనా సరిచేసే ప్రయత్నం చేయమని చెపుతున్నాను. అంతే తప్ప, మసిపూసి మారేడుకాయ చేసే విధంగా కాగితాలకే పరిమితం చేయవద్దు. Let it be a practical thing . కంపల్సరీగా ఇది అయ్యేటట్లు మీరు చర్యలు తీసుకోవాలి. ఆ మేరకు మీరు మార్పులు తీసుకుని రావాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

# ఎస్.సి. హాస్టళ్ల స్థితిగతులు

16-11-2007

అధ్యక్షా! మంత్రిగారు చాలా విషయాలు చెప్పారు. అయినా నేను అనవసరమైన విషయాల ప్రస్తావన చేయదలచుకోలేదు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని జీఓ ఇష్యూ చేశారు. ఎస్ఇపి కంటే ఎక్కువ ఖర్చు పెట్టాలనే ఆలోచన ఉందని చెబుతున్నారు. అటువంటి ఆలోచన మీకు, మాకు ఉంది. ప్రతిపక్ష పార్టీలు కూడా అలా ఖర్చు చేస్తే బాగుంటుందన్నప్పుడు జీఓ ప్రాపర్‌గా ఇస్తే బాగుంటుంది. అందరనుకున్నది సక్రమంగా జరిగితే బాగుంటుంది. గత అనుభవాలు మనకున్నాయి. కేటాయింపులు చేసిన నిధులు ఏ విధంగా ఖర్చు అవుతాయనే దానిపై సరైన పద్ధతి లేదు. జనాభా ప్రాతిపదికపై రావలసిన నిధులు కూడా ఖర్చు కావడం లేదని ఈ ఉద్యమం జరుగుతున్నది. ఈ ఉద్యమం ఎందుకు? లాఠీ ఛార్జి ఎందుకు? అపోజిషన్ అడగవలసిన అవసరం ఏమి ఉంది? మాకున్న సమాచారం ప్రకారం లాఠీ ఛార్జీ జరిగిందని చెప్పాము. మాకు అభ్యంతరం లేదు. ఉద్యమం జరిగిందా, లేదా మీ దగ్గరకు ఆల్ పార్టీ డెలిగేషన్ వచ్చిందా, లేదా? ఇది వాస్తవం కాదా? కడుపు నొప్పి వస్తే మందు ఇవ్వమని డాక్టరు వద్దకు వెళతాము. సమస్య ఉంది కాబట్టి మీ దగ్గరకు వచ్చారు. పరిష్కారం చేస్తానని చెప్పారు. అది సక్రమంగా చేయమని అడుగుతున్నాము. మూడు సంవత్సరాల కాలంలో ప్లాన్‌లో ఎస్సిలకు సంబంధించి మాట్లాడుతున్నాను. హౌస్‌లో ఇచ్చిన ఇన్‌ఫర్మేషన్ ప్రకారం రూ.1100 కోట్లు ల్యాప్స్ చేశారు. ఖర్చు పెట్టలేదు. పాస్ చేశాము కాని యాక్చువల్‌గా ఖర్చు అయింది తక్కువ. 2004-05లో రూ.82 కోట్లు ల్యాప్స్ అయ్యాయి. అదే పద్ధతిలో 2005-06లో రూ.368 కోట్లు, 2006-07లో రూ.591 కోట్లు ల్యాప్స్ అయ్యాయి. కేటాయింపులు రూ.861 కోట్లు అయితే ఖర్చు అయింది మాత్రం రూ.365 కోట్లు. ప్లాన్‌లో కేటాయింపులు జనాభా ప్రాతిపాదికన ఉందా అంటే అది కూడా లేదు. భారతదేశం అంతటిలో అత్యధిక ప్లాన్ బడ్జెట్ ఉన్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్

అని ముఖ్యమంత్రిగారు ఢిల్లీలో సగర్వంగా చెప్పారు. ప్లాన్ బడ్జెట్ 24.6 శాతం ఉన్న ఎస్.సి., ఎస్.టి.లకు రూ.7.5 వేల కోట్లు కేటాయింపులు చేయాలి, ఆ విధంగా చేశారా? మీ లెక్కల ప్రకారం ఖర్చు అయ్యాయా? ఆఫీసులలో గ్రౌండ్‌లో ఒక రకంగా ఉన్నాయి. మీకొక రకంగా చెబుతున్నారు. ఫైనాన్సు డిపార్ట్‌మెంట్‌కు ఒక స్టాండ్ ఉంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీలకు ఫ్లో ఆఫ్ ఫండ్సు క్వార్టర్లీ రిలీజెస్ చూడండి. ఖర్చు కాకూడదని లాస్ట్ క్వార్టర్‌లో చేస్తారు. ఖర్చు కాకుండా ఉండాలని అలా చేస్తారు. మీరున్నప్పుడు, మేము ఉన్నప్పుడు అదే విధంగా జరిగింది. మార్చి 31కి ఖర్చు కాకుండా ల్యాప్స్ అయిన అమౌంట్ తేవాలి. ఈ ఏజన్సీ నిధులు కూడా ఆ విధంగా క్యారీ ఫార్వార్డ్ చేసే విధంగా అధికారాలు ఇవ్వాలి. మంత్రిగారు గంటసేపు సుధీర్ఘ ఉపన్యాసం చేసి చాలా విషయాలు చెప్పారు. మా మంత్రిగారు చెప్పిన దాని గురించి గ్రౌండ్‌లో లైవ్ టెలీక్యాస్ట్ చూసి ఎస్‌సి, ఎస్‌టి, బలహీనవర్గాలకు అవకాశం ఇచ్చారని అందరూ ఆనందించవచ్చు . డిపార్ట్‌మెంట్సుకు పంపించే ఇన్‌ఫర్మేషన్, ఫైనాన్సుకు పంపించే ఇన్‌ఫర్మేషన్ ఒకలా ఉండదు. తండాకు , గూడెంకు మెయిన్ రోడ్డు పోతుంటే ఆ రోడ్డు అంతా సబ్‌ప్లాన్‌లో చూపిస్తారు. అంతేకాక ఒక వాటర్ ట్యాంక్ కట్టి గ్రామానికి ఒక ఎక్స్‌టెన్షన్ ఇస్తారు. అదే తండాకి గూడెంకి ఎక్స్‌టన్షన్ ఇస్తారు.

అధ్యక్షా! ఆ జీవోను మాడిఫై చెయ్యమని కోరుతున్నాము. నిజంగా సిన్సియారిటీ ఉంటే, ఆ జీవోను మాడిఫై చెయ్యండి. కొంత వరకైనా అది ఉపయోగపడుతుంది. మేము బ్రహ్మాండంగా సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని చెబుతున్నారు. నిరుపేదలైన పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని మేము ప్రవేశపెట్టాము. ఈ ప్రభుత్వం 250 కోట్ల రూపాయలు దీనికి ఖర్చు పెడుతుంది, 120 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. 250 కోట్ల రూపాయలంటే నెలకు 20 కోట్ల రూపాయలన్నమాట. అన్నం తినే చిన్న పిల్లలు వాళ్లు. మధ్యాహ్న భోజన పథకానికి నాలుగు నెలలకు కూడా బిల్లులు లేవు, వీళ్లంట పరిపాలన చేసేది. మధ్యాహ్న భోజనం పథకం పెట్టించి, కేంద్ర ప్రభుత్వం కూడా దీనిని ఇంట్రొడ్యూస్ చేసే పద్ధతిని తీసుకొచ్చాము, 61 లక్షల మంది చిన్న పిల్లలు. నేను తిడితే ఏమి కోపం వస్తుందని అంటున్నారు. ఇటువంటి పరిపాలన ఉంది. రెడ్యానాయక్ గారు చెబుతుంటే ముఖ్యమంత్రి గారు చాలా ఆనందపడిపోతున్నారు. మీ పరిపాలన సక్రమంగా ఉంటే 310 మంది ఎందుకు చనిపోయారు, తిండి ఎక్కువై చనిపోయారా? 310 మంది పిల్లలు చనిపోతే మీకు, మాకు సిగ్గు ఉండాలి. మన పరిపాలనను చూసి మనం తలవంచుకోవాలి. ఈనాడు వసతులు లేక చనిపోయారు. డిపార్ట్‌మెంట్, హైకోర్ట్ ఇచ్చిన ఇన్‌ఫర్మేషన్ ప్రకారం **1700 హాస్టల్స్‌లో త్రాగడానికి నీళ్లు లేవు. ఇది మీ పరిపాలనలో చేస్తున్న గొప్ప కార్యక్రమాలు. ఒక హాస్టల్‌లో చెద్దర్లు కుట్టుకొని పడుకుంటున్నారు, ఈ మహానుభావులు సప్లై చేసిన దుప్పట్లు ఏ విధంగా ఉన్నాయంటే మనం దోమతెరలు పెట్టుకుంటాము కదా అట్లా మొత్తం రంధ్రాలున్నాయి.** ఇది కప్పుకుంటే చలి వేస్తుంది. ఆ విధంగా పిల్లలు చెబుతున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో చూడండి. నేను నిన్న కూడా రెడ్యానాయక్ గారికి చెప్పాను. ఈ పరిస్థితులు వేరు. గ్రౌండ్‌లెవల్‌లో ఇంకొక రకంగా ఉన్నాయి. 5300 హాస్టల్స్ ఉన్నాయి. నేమ్స్ రాసి, మీ ఛాంబర్స్‌లో పెడతాము. 294 మంది

మెంబర్స్‌తో లాటరీ తీయిద్దాము. ఆ విధంగా వారిని హాస్టల్స్‌కి పంపించండి. హాస్టల్స్‌లో సౌకర్యాలు బ్రహ్మాండంగా ఉన్నాయి అనంటే మాకు రాజకీయాలు లేదు, మేము నమస్కారం పెట్టి వెళ్లిపోతాము.

అధ్యక్షా! ఎంత దుర్మార్గంగా ఉన్నాయంటే అక్కడ అంత దుర్మార్గమైన పరిస్థితులున్నాయి. ఇక్కడేమో బ్రహ్మాండంగా మాటలు చెబుతున్నారు. పోనీ నేనంటే ఒక రాజకీయపార్టీ నుండి డిబేట్ చేస్తున్నాను. ఈనాడు NHRC నోటీసు పంపించింది చీఫ్ సెక్రెటరీ గారికి. మానవ హక్కులన్నీ రాష్ట్రంలో భ్రష్టు పట్టిస్తున్నారు, పిల్లలు చనిపోతున్నారని నోటీసు ఇచ్చింది. ఇంక ఇంతకంటే ఏమి కావాలి. మీ ముఖ్యమంత్రి గారికి, చీఫ్ సెక్రటరీ గారికి నోటీసు ఇచ్చింది.

అధ్యక్షా! గౌరవసభాధ్యక్షులని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. Please send a note to the Government. వాళ్లందరినీ కూడా రిక్వస్ట్ చెయ్యమని చెప్పండి. అక్కడ పడుకుంటే ఆటోమ్యాటిక్‌గా తెలుస్తుంది. I request you Speaker Sir, ముందు మీరు స్టార్ట్ చెయ్యండి. మీరు లాట్రీ తీసి ఆ లాట్రీలో వచ్చిన హాస్టల్‌కి వెళ్లండి. ఆ విధంగా అందరం వెళ్తే అందరికీ తెలిసి వస్తుంది. వాస్తవాలు బయటకి వస్తాయి. ఎంత మంది శాసనసభ్యులు వెళ్లారో, వారి పేర్లను రెండు నెలలకు ఈ హౌస్‌లో ప్రకటిస్తే అందరికీ తెలుస్తుంది. అది ఇంప్లిమెంట్ చెయ్యమనండి. సంక్షేమం గురించి బాగా చేస్తున్నామని ఇక్కడ మాట్లాడం కాదు. సంక్షేమం బాగా లేదు. మీరు అవలంభిస్తున్న పద్ధతులు బాగోలేవు. కాబట్టి ఈ జీవోను మాడిఫై చెయ్యండి. పేద ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకోక ముందే సరైన పద్ధతిలో ముందుకు పోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

# జస్టిస్ పున్నయ్య కమీషన్‌పై చర్చ

13-12-2007

అధ్యక్షా! గౌరవ ముఖ్యమంత్రి గారు ఇక్కడే ఉన్నారు. మాట్లాడిన సభ్యులందరూ కూడా పున్నయ్య గారి పైన ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేసారు. పున్నయ్యగారి కమీషన్ మేము వేసాము. తరువాత క్యాబినెట్‌లో ఆ రోజు కమీషన్ రిపోర్ట్ మీద డిస్కషన్ వచ్చింది. క్యాబినెట్ సబ్‌కమిటీకి ఆ రోజు నన్ను ఛైర్మన్‌గా వేసారు. ఇందులో ఏ పోర్షన్ డిలీట్ చెయ్యొచ్చు, ఏమి పెట్టొచ్చో స్టడీ చేయమని అన్నారు. ఆ రిపోర్ట్ అంతా నేను చూసాను. ఆ పెద్దాయన ఎంటైర్ స్టేట్ అంతా తిరిగాడు. ప్రతి సంఘటనను చాలా బ్యూటిఫుల్‌గా రికార్డ్ చేసారు. అది చూసిన తరువాత, నెక్స్ట్ క్యాబినెట్‌లో ఆ రిపోర్ట్ సబ్మిట్ చేసేటప్పుడు ఒకటే చెప్పాను. ఇందులో తొలగించవలసిన అంశాలు లేవు, దీనిని యాజిటీజ్‌గా ఆమోదించాలని నేను రికమండ్ చేసి, దానిని ఆమోదించాము. కమీషన్ ఛైర్మన్‌గా కాకుండా, వారు చేసిన కార్యక్రమాలను కాకుండా, వారికున్న కమిట్‌మెంట్ కాకుండా గౌరవంతో వారిని ఛైర్మన్‌గా పెట్టడం జరిగింది. ఇంతకు ముందు నరసింహయ్య గారు చెప్పారు. ఎంతో మందిని ఎన్నో కమీషన్స్ ఛైర్మన్‌లను పెట్టాము. వర్క్ ఇంత పర్‌ఫెక్ట్‌గా, ఇంత సిస్టమాటిక్‌గా, ఇంత ఎలాబరేటెడ్‌గా చేసిన కమీషన్ ఏదైనా ఉంటే దయచేసి చెప్పమనండి. ఆ విధంగా పనిచేసినటువంటి గౌరవనీయులైన వ్యక్తి అతను. పేద వర్గం నుండి, దళిత వర్గం నుండి ఆ స్థాయికి వచ్చిన వ్యక్తి చాలా తక్కువగా ఉన్నారు. గౌరవించదగిన వ్యక్తి ఆయన. వర్క్ పర్‌ఫెక్ట్‌గా చేస్తారు. మీ ఉద్దేశ్యాలు ఏమిటి, మీ ఇంటెన్షన్ ఏమిటి అని నేను వాటి జోలికి పోదలచుకోలేదు. ఆ విధంగా గౌరవప్రదమైన వ్యక్తులు చాలా తక్కువ మంది ఉన్నారు. అలాంటి ఆయన ఈనాడు, కమీషన్ హెడ్‌గా ఉన్నారు. చాలా సిన్సియర్‌గా ఆయన వర్క్ చేస్తారు. ఆయన కాలపరిమితి ఎనిమిది, తొమ్మిది నెలల కంటే ఎక్కువ లేదు. ఆయన మీద గౌరవంతోనైనా

తొమ్మిది నెలల తరువాత ఈ బిల్లును మీరు పెట్టుకోండి. ఆ యొక్క వయోపరిమితి అయిన 65 సంవత్సరాలు చాలా కమీషన్లకు పెట్టలేదు. ప్రస్తుతానికి నా దగ్గర ఇన్‌ఫర్మేషన్ కూడా లేదు. నాకు తెలిసినంతవరకు ఏజ్ లిమిట్ పెట్టలేదు. ఇది డెలిబరేట్‌గా ఆయనను తొలగించడానికి పెట్టుకున్నారు తప్ప మరొకటి కాదు. 9 నెలల తరువాత దీనిని ఏ విధంగా అమలులోకి తీసుకొస్తారో తీసుకురండి. దీనిని పెట్టడంవల్ల ఎఫెక్ట్ అయ్యే పర్సన్ గౌరవప్రదమైన వ్యక్తి, ఈ కాజ్ కోసం ఎంతో కష్టపడుతున్న వ్యక్తి, అలాంటి వ్యక్తిని తొలగించడంలో శాసనసభ చట్టం చేస్తున్నదంటే అది మంచి పద్ధతి కాదు. ఈ బిల్లును నేను టోటల్‌గా అపోజ్ చెయ్యడం లేదు. వారి పైనున్న గౌరవంతో, వారిని దృష్టిలో పెట్టుకోవాలని మనవి చేస్తున్నాను. ఈ యాక్ట్ మూలంగా పున్నయ్య గారు తొలగించబడ్డారు అనే అపవాదు మనం తెచ్చుకోవద్దని గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

# మైనారిటీల సంక్షేమం

5-7-2004

అధ్యక్షా! మైనారిటీ వెల్ఫేర్ బడ్జెట్‌ను మనం ఒకసారి చూసినట్లయితే అది చాలా తగ్గించారు. మేము మొన్న కూడా దీనిని రెయిజ్ చేశాం. గత సంవత్సరం పెట్టినంత కూడా ఈసారి పెట్టలేదు. మైనారిటీలు ప్రతి సంవత్సరం పెరుగుతున్నారు, చాలా మంది నిరుపేదలవుతున్నారు. చేతివృత్తులు చేసుకొని దినసరి వేతనాలు అందుకొని వారు జీవనం సాగిస్తున్నారు. వాళ్లకు బ్యాంకుల నుండి కూడా ఎటువంటి ఫైనాన్స్‌లు అందడం లేదు. కనీసం మనమైనా ఫైనాన్స్ కార్పొరేషన్‌లను స్ట్రెంగ్తెన్ చేసి వాటి ద్వారా రుణాలిప్పించాలని కోరుతున్నాను. మేము లాస్ట్ ఇయర్ ఫైనాన్స్ కార్పొరేషన్ల నుండి డబ్బులు తెప్పించాం. వీరి కోసం ఒక ప్రత్యేక ప్యాకేజ్ ఇస్తే తప్ప నార్మల్ కోర్సులో జరుగుతుందనుకుంటే చాలా తప్పు. కాబట్టి వారికి ఖచ్చితంగా ఎడ్యుకేషనల్ లోన్స్ ఇప్పించే ఏర్పాటు చేయాలని కోరుతున్నాను, ఎందుకంటే రోజురోజుకి విద్యార్థుల సంఖ్య చాలా తగ్గిపోతోంది. కావాలంటే మీరు స్టాటిస్టిక్స్ కూడా తెప్పించండి, నిరక్షరాస్యులు పెరిగిపోతున్నారు. it is the concerned of the whole society. అందరి కంటే కూడా మైనారిటీలు చాలా వెనుకబడిపోతున్నారు, పేదరికం పెరిగిపోతోంది, అనేక రకాల సమస్యలకు కూడా వారు గురవుతున్నారు, ఉద్యోగాలు కూడా లేకుండా పోతున్నాయి. దీనిపైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మనవి చేస్తున్నాను. అదే విధంగా ఇంతకు ముందున్న బడ్జెట్‌కు, ఇప్పటి బడ్జెట్‌కు ఎంత డిఫరెన్స్ ఉందో ఒకసారి చూడాలి. ఏదో దాటేసే ప్రయత్నం చేయకుండా, స్పెషల్ ప్యాకేజ్‌ను మైనారిటీలకు ఏర్పాటు చేసే యాక్షన్ తీసుకోవాలని కోరుతున్నాను. దాని కోసం స్పెషల్ ప్యాకేజ్ ఇవ్వాలని రిక్వెస్ట్ చేస్తున్నాను. అదే విధంగా వెల్ఫేర్ అంతా కూడా నెగ్లెక్ట్ చేయబడింది. వెల్ఫేర్ బడ్జెట్ కూడా నెగ్లెక్ట్ చేయబడింది. ఇది మంచిది కాదు. దయచేసి వెల్ఫేర్ డిమాండ్స్‌ని అడ్వాన్స్ చేయండి. షార్ట్ డిస్కషన్‌కి కూడా ఎలో చేయాలని మనవి చేస్తున్నాను.

# మైనారిటీల సంక్షేమం

13-07-2004

అధ్యక్షా! ప్రభుత్వం ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం రాష్ట్రంలో 11శాతం మైనారిటీలు ఉన్నారు. ఈరోజు రాష్ట్రంలోనూ, దేశంలోనూ మైనారిటీల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. రోజు రోజుకీ సమస్యలు పెరుగుతున్నాయి. సమాజంలో వీరికి సమానమైన వాటా రావడం లేదు. మన దేశంలో, రాష్ట్రంలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉంది. పేదరికం రోజు రోజుకు పెరుగుతోంది. ఉద్యోగ అవకాశాలు లేకుండా, వృత్తి నైపుణ్యం లేకుండా, విద్యాపరమైన అవకాశాలు లేకుండా, పేదరికంతో బాధపడుతున్న మైనారిటీల సంక్షేమం కోసం మనం పెద్ద ఎత్తున కార్యక్రమాలు తీసుకోకపోతే సమస్యలు ఇంకా జఠిలమౌతాయి. సమస్యలు పూర్తిగా మైనారిటీలకు సంబంధించినవిగా కాకుండా, యావత్ సమాజ సమస్యగా పరిగణించాలని కోరుతున్నాను. చాలా మంది మైనారిటీలు వారి పిల్లలను బడికి పంపించే పరిస్థితి లేదు. చిన్న చిన్న వృత్తులు, చేతి వృత్తులు చేసుకొంటూ, ఏపూటకు ఆ పూట సంపాదించుకొని భోజనం చేసే పరిస్థితి మైనారిటీల్లో ఉందని గుర్తు చేస్తున్నాను.

గతంలో ప్రభుత్వం 1993-94 సంవత్సరంలో రూ. 4.80 కోట్లు మైనారిటీ వెల్ఫేర్‌కు బడ్జెట్ ఇవ్వడం జరిగింది. ఈ బడ్జెట్‌లో వారికి సరైన బడ్జెట్ ఇవ్వలేదు. వారి యొక్క సమస్యల్ని సరిగా పరిష్కారం చేసే విధంగా ఆలోచన చేయాలని నేను తెలియజేస్తున్నాను. మా ప్రభుత్వం మైనార్టీస్‌కు బడ్జెట్ బాగా పెంచడం జరిగింది. గత సంవత్సరం మేము వారికి బడ్జెట్‌ను పెంచి రూ. 60 కోట్లకు తీసుకురావడం జరిగింది. బడ్జెట్ పెంచడమే కాకుండా, మౌలిక సదుపాయాలను కల్పించి, వారిలో విశ్వాసం పెంచడానికి, సమాజంలోని అన్ని వర్గాల వారితో సమానమైన అవకాశాలు ఇచ్చేందుకుగాను మా ప్రభుత్వం కృషి చేసింది. అలాగే వారికి కావలసిన విద్యాపరమైన అవకాశాలను కల్పించే విధంగా చేయాలని వారికి విద్యాసంస్థలను నెలకొల్పడం జరిగింది.

వారి మాతృ భాష అయిన ఉర్దూను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం, వారికి శిక్షణ ఇప్పించడం, స్కాలర్‌షిప్స్ ఇప్పించడం వంటి అనేక కార్యక్రమాలను మా ప్రభుత్వం చేపట్టింది. వాటన్నిటి రికార్డులు ఉన్నాయి. వాటితో బాటు వారికి ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, ఐటిఐలను ఏర్పాటు చేయడం జరిగింది. రెసిడెన్షియల్ స్కూల్స్, అవీ బాలికల కోసం ప్రత్యేకమైన రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. మేము చాలా కార్యక్రమాలు చేయడం జరిగింది. ఇవే కాదు వారికి ఇంకా చాలా కార్యక్రమాలు చేయవలసి ఉంది. వారికి కావలసిన కనీస వసతులను కల్పించవలసి ఉందని కోరుతున్నాను. షాదీఖానాలు తదితర కనీస వసతుల కల్పించేందుకు మేము బడ్జెటులో కేటాయించడం జరిగిందని తెలియజేస్తున్నాను.

ఒకప్పుడు మైనారిటీస్ హైదరాబాద్, దాని సరౌండింగ్ ప్రాంతాలలో చాలా ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. కర్ఫ్యూ పేరుతో మరి ఇతర విధాలుగా వారు చాలా ఇబ్బందులు పడ్డారు. మేము ఆ సమయంలో చాలా పకడ్బందీగా 'లా అండ్ ఆర్డర్' ను మెయిన్‌టెయిన్ చేసి వారికి రక్షణ కల్పించడం జరిగిందని తెలియజేస్తున్నాను. మేము వారికోసం చాలా కార్యక్రమాలు చేపట్టడం, సదుపాయాలు చేయడం జరిగింది. అయినప్పటికీ ఇది ఏ కొద్ది మందికో సంబంధించిన విషయం కాదు కాబట్టి ఇంకా చాలా కార్యక్రమాలను చేయవలసి ఉంది. కాబట్టి వాటిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించవలసి ఉందని కోరుతున్నాను. శరీరంలో ఒక భాగం బలహీనంగా ఉన్నప్పటికీ, మనం వికలాంగులుగానే కనపడటం జరుగుతుంది. ఆ విధంగా మన సోదరులయిన మైనార్టీలకు కావలసిన సదుపాయాలు కల్పించవలసిన బాధ్యతమనమీద ఉందని తెలియజేస్తున్నాను.

మీ ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీలకు చాలా తక్కువ నిధులను కేటాయించింది. అది అన్యాయమని తెలియజేస్తున్నాను. నేను కోరేది వారికి బడ్జెటును పెంచండి. అందుకోసం పెద్ద ఎత్తున స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టవలసి ఉందని, లేనట్లయితే వారిలో ప్రమాణాలు పెరగకపోవడం మూలంగా వారు చాలా ఇబ్బందులను పడవలసి వస్తుంది. వారిలో మహిళలలో లిటరసీ రేట్ చాలా తక్కువగా ఉంది. మహిళ విద్యపై ఓవరాల్‌గా వారిలో పర్సెంటేజ్ చాలా తక్కువగా ఉంది. **మైనార్టీస్‌లో లిటరసీ రేట్‌ను పెంచేలా తగు సదుపాయాలు కల్పించవలసి ఉందని నేను తెలియజేస్తున్నాను. ఆర్థికపరంగా చూస్తే మైనార్టీస్‌లో ఆస్తిపాస్తులు తక్కువగా ఉన్నాయి. కాబట్టి వారికి బ్యాంక్స్‌లో కూడా డబ్బులు ఎవరూ ఇవ్వడం లేదు. వారు రెక్కల మీద ఆధారపడి కష్టం చేసుకుని బ్రతుకుతున్నారు.** తప్ప వారికి బ్యాంక్స్ గానీ, ఇతర ఇన్‌స్టిట్యూషన్స్‌గానీ లోన్సను ఇవ్వడం లేదు. వృత్తిపరంగా వారికి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. తర్వాత ఫైనాన్స్ కార్పొరేషన్‌ను స్ట్రెంగ్తెన్ చేయాలి. ఆ విధంగా మైనారిటీలకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇంకా ఎక్కువ నిధులు కేటాయించాలని కోరుతున్నాను. నేషనల్ లెవెల్‌లో కేంద్ర ప్రభుత్వం కూడా గతంలో మైనారిటీస్‌కు కొన్ని ప్రత్యేకమైన నిధులు కేటాయిస్తున్నారు. మనం మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తే బాగుంటుంది. అప్పుడే వారు కూడా ఇంకా ఎక్కువ రిలీఫ్ ఫీల్ అవుతారు. ఎక్కువ సభ్యులు లాభం పొందడానికి అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నాను. గతంలో మేము రూ.48 వేల కంటే ఎక్కువ ఇచ్చాము. అది సరిపోదని, లక్షలాది మంది ఉన్న ఈ మైనారిటీ

ప్రజానీకానికి ఇంకా దానిని పెంచవలసిన అవసరం ఉందని నేను కోరుతున్నాను. గత 10, 15 రోజులుగా మనం అందరం ఈ విషయంపై డిబేట్ కావాలని అడగడం జరిగింది. మేము ముఖ్యంగా ప్రత్యేకంగా బడ్జెట్‌లో కూడా మైనారిటీల విషయమై ప్రత్యేక డిబేట్ కావాలని కోరాము. ఈ విషయమై ఒక విధాన నిర్ణయం తీసుకోవాలని, మేము సూచనలు చేస్తామని కోరిన తర్వాత ఈరోజు డిబేట్‌ను పోస్టు చేయడం జరిగింది. స్పీకర్ గారు అంగీకరించిన తర్వాత డిబేట్ పోస్ట్ చేయడం జరిగింది. అదే సందర్భంలో నిన్న ఇంత హడావిడిగా వారు, రాత్రికి రాత్రి టి.వి.లలో మేము చేశాము అన్న రీతిలో మినిష్టరు గారు ప్రకటన చేశారు. ఒక జీ.ఓ. ఇష్యూ చేశారు. మైనార్టీలకు 5 శాతం రిజర్వేషన్స్ పెట్టామని ప్రకటన చేశారు. వారిని బి.సి. ల కింద కేటగరైజ్ చేశామన్నారు. ఇంకొక కేటగిరీని సృష్టించి వారిని బి.సి.ల కింద పరిగణిస్తున్నట్లుగా ఒక ప్రకటన చేశారు.

అధ్యక్షా! ఈరోజు ఈ విషయమై డిబేట్ ఉందని, అది పోస్ట్ చేయబడిందనీ తెలుసు. నిన్న తమరు ఈరోజుకి పోస్ట్ చేసిన విషయం అందరికీ తెలుసు. శాసన సభలో అందరు సభ్యులూ ఈ విషయమై అనేక సూచనలు చేయాలనుకున్న సందర్భంలో ఈ ప్రభుత్వం ఎందుకు ఇంత తొందరగా హడావిడిగా ఈ జీ.ఓ. చేయవలసి వచ్చిందో తెలియ జేయవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. మీరు వారికి న్యాయం చేయడానికే ఈ జీ.ఓ. తీసుకు వచ్చారా? లేకపోతే మోసపూరితంగా ఏదో రకంగా మేము చేశామని చెప్పి చేతులు దులుపుకునేందుకు చేశారా అని అడుగుతున్నాను. మీరు ఈ విషయమై నిపుణులైన వారిని అడిగారా? అన్ని పార్టీల వారినీ అడిగారా? It is totally a defective G.O. that you have issued. It is nothing but to cheat the people so that you have issued the G.O. ఇది ఖచ్చితంగా, పూర్తిగా మోసపూరితమైన జీ.ఓ. అని ఈనాడు శాసన సభలో చెబుతున్నాను. దీనిని మీరు అవగాహన చేసుకోవాలి. సిన్సియారిటీ ఉంటే, నిజంగా మైనారిటీలకు సహాయం చేయడానికిగాను లీగల్‌గా అన్ని జాగ్రత్తలు తీసుకుని చర్యలు తీసుకోవాలి తప్ప, రాత్రికి రాత్రి హడావిడిగా, ఏమాత్రం, ఎటువంటి ఆలోచనా లేకుండా, ఈరోజు ఈ సభలో ఈ విషయమై డిబేట్ ఉందని తెలిసి, మేమేదో అడిగితే చేశామని కాకుండా, వారే ఇచ్చినట్లుగా భావించాలని ఈ విధంగా చేయడం ఏ విధంగా సమంజసమని, బాధ్యత గల ప్రభుత్వం చేయవలసిన పని ఇదేనా అని అడుగుతున్నాను. You have never applied your mind properly while issuing that G.O. అని చెప్పి మీకు తెలియజేస్తున్నాను. 50 శాతం కన్నా రిజర్వేషన్స్ మించి ఉండకూడదని సుప్రీం కోర్టు జడ్జిమెంట్స్ ఉన్నాయి. అందువల్ల మేము ఆనాడు మా పార్టీలో చాలా డిస్కషన్ చేసి, ముస్లిం సోదరుల సలహాలు తీసుకుని మేము 3 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగింది. ఎలాంటి లిటిగేషన్ లేకుండా మేము 3 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని ప్రకటన చేశాము. మరి మీరు ఈరోజు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చారు. వారి **ఆర్థిక, సామాజిక పరిస్థితుల ఆధారంగా చూసినట్లయితే 5 శాతం కాదు, ఇంకో రెండూ మూడు శాతం ఎక్కువ ఇచ్చినా మంచిదే. కానీ లిటిగేషన్ లేకుండా చేశారా? మీరు ఇచ్చిన ఈ 5 శాతం రిజర్వేషన్ మూలంగా 47 శాతం ఉన్న బి.సి. రిజర్వేషన్ 52 శాతానికి పెరుగుతుంది.** (అంతరాయం) వెంకటరెడ్డి

గారు తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ ఉంది అంటున్నారు. సుప్రీం కోర్టు 50 శాతం మాత్రమే రిజర్వేషన్స్ ఉండాలని చెప్పినప్పటికీ, వారు దానిని క్రాస్ అవడం జరిగింది కాబట్టి ఒక యాక్ట్ తీసుకు వచ్చి 9th షెడ్యూల్ పెట్టారు. మీరు ఈరోజు ఈ 9th షెడ్యూల్‌లో తీసుకు వచ్చారా? అలా కానప్పుడు దీనికి వాలిడిటీ ఉంటుందా? ఆ విధంగా చేయకుండా మేము పర్సెంటేజ్ ఇచ్చామని ఏదో కాగితం ఇస్తే దానిని పెట్టుకుని ఫ్రేం కట్టించుకోవడానికా? Has it constitutional validity? Let us do it sincerely. న్యాయం జరగాలి. న్యాయమైన విధంగా వారికి ఎక్కువ చేయండి. అంతే గానీ ఏదో చేశామని చేయడం కాదు. చేతులు దులుపుకోవడం కాదు. You never applied your mind. దీనిని మరొకసారి స్టడీ చేయాలని కోరుతున్నా. ఈ విషయమై క్లారిటీ ఇవ్వవలసిన అవసరం ఉంది. హడావిడిగా కాకుండా యాక్షన్ తీసుకోవాలని తెలియజేస్తున్నాను. దీని గురించి ఒక స్పెషల్ డ్రైవ్ తీసుకోవలసిందిగా నేను రిక్వెస్టు చేస్తున్నాను. వారికి ఎడ్యుకేషన్ విషయంలోనూ, ఈ అదే విధంగా ట్రెయినింగ్ ఇచ్చే విధంలోనూ డైరెక్టుగా ఒక స్పెషల్ డ్రైవ్ క్రింద కార్యక్రమాలు చేయాలని కోరుతున్నాను. దానికోసం మీరు గవర్నమెంటు ఆఫ్ ఇండియా నుంచి కొంత ఫండ్సు తీసుకురావడానికి అవకాశాలు ఉన్నాయి. మన దగ్గర కూడా ఇంకా ఎక్కువగా ఫండ్సు కేటాయించవలసిన అవసరం వున్నది. పెద్ద పాపులేషన్ ఉన్న మైనారిటీస్‌కు మీ ప్రభుత్వ హయాంలో 4 కోట్ల రూపాయలు కేటాయిస్తే మేము 60 కోట్ల రూపాయలు దాకా కేటాయించాము. You make it hundred crores now. ఇవి అన్నిటికి కూడా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోండి. మైనారిటిస్‌కు కాలేజిలు ఇచ్చారు, వాళ్ల పరిస్థితి ఏ విధంగా వుందో మీకు తెలియదా? ఒక బి.ఇడి. కాలేజిలో ఓపెన్ కేటగిరిలో వస్తే రిజర్వేషన్ కేటగిరిలో, వాళ్లు కాంపిటీటివ్ ఎగ్జామ్ పాస్ అయిన వాళ్లను తీసుకోవాలంటే మైనారిటీస్ కాలేజి వాళ్లు వాళ్లకి కావలసిన న్యాయం అయిన సీటుకు 30 వేల రూపాయలు తీసుకుంటున్నారు, రసీదులు మాత్రం 10 వేల రూపాయలకు ఇస్తున్నారని చెప్పి రిప్రజంటేషన్ తీసుకొని తిరుగుతున్నారు. ఇవాళ జనం అంతా మాకు రావలసింది కూడా ప్రభుత్వం ఇవ్వలేకపోతుందని చెబుతున్నారు. జీ.ఓ.లు ఇస్యూ చేశారు, వాటిని పకడ్బందీగా అమలు చేయండి. న్యాయమైన హక్కులను అమలు చేయండి. దానితోపాటుగా మిగతా రిజర్వేషన్స్ పకడ్బందీగా కానిస్ట్యూషన్ వాలిడిటి వచ్చే విధంగా మీరు వాళ్లకి ఇవ్వాలి తప్ప, మీరు ఏదో తప్పించుకొని తిరిగేటట్టు మేము ఇచ్చాము అని చెప్పి ఈ విధంగా ఇక్కడ కనబడతావుంది. I am doubting your sincerity. దీంట్లో ఏ మాత్రం కూడా మీ యొక్క మైండ్ అప్లయి చేయలేదు. దీనిపైన తగిన విధంగా జవాబు ఇవ్వాలి. ఏవిధంగా మీరు ఇంప్లిమెంటేషన్ చేయబోతున్నారు? మీరు ఏవిధంగా లీగాల్టి ఇవ్వబోతున్నారు, దీనికి కావలసిన లీగల్ హర్డిల్సు ఎట్లా ఎదుర్కోబోతున్నారు. అదే విధంగా 5 శాతం రిజర్వేషన్‌తోబాటు పూర్తిగా మైనారిటిస్ సమస్యలన్నీ రాష్ట్రంలో పరిష్కారం అయిపోతాయని మీరు భావిస్తున్నారా? దీని కంటే అదనంగా మీరు చేయదల్చుకుంది చెప్పాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

# మైనారిటీలకు రిజర్వేషన్‌లు

7-12-2005

అధ్యక్షా! తమరిని ఇబ్బంది పెట్టాలనో లేక ఏవో టెక్నికాలిటీస్‌ని తీసుకురావాలనో మా ఉద్దేశ్యం కాదు. అక్బరుద్దీన్ గారు మాట్లాడినా, మేము మాట్లాడినా ఒక విషయం ప్రభుత్వం అర్థం చేసుకోవాలని మా రిక్వెస్ట్. ముస్లిం మైనారిటీస్‌కి 5శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఈ ప్రభుత్వం ఆదరాబాదరాగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్, యాక్ట్ ఇవన్నీ కూడా సభలో చర్చ జరుగుతున్నప్పుడు మొదటి రోజే నేను చెప్పాను. ఏమాత్రం కూడా సరైన ఎక్సర్‌సైజ్ చెయ్యకుండా, తొందరపాటుతో మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేస్తున్నటువంటి రాజకీయ నిర్ణయమే తప్ప, దీంట్లో ఉన్నటువంటి న్యాయపరమైన విషయంలోకి లోతుగా వెళ్లడం లేదని చెప్పాను. గౌరవ ముఖ్యమంత్రి గారు, మినిస్టర్ గారు అప్పుడు హౌస్‌లోనే ఉన్నారు. మేము అన్నీ ఆలోచించాము, మాకు చిత్తశుద్ధి ఉంది, మేము ఖచ్చితంగా తీసుకొస్తామని ఆ రోజున వారు చాలా గట్టిగా చెప్పారు, వాదించారు. బి.సి. కమీషన్ రిపోర్ట్‌ని ఆధారం చేసుకొని ఈ రిజర్వేషన్ కమీషన్ రిపోర్ట్ లోపభూయిష్టంగా ఉందని కోర్టు వారు అక్షింతలు వేసారు. కనుక ఏ విధంగా అమలుచేయబోతున్నారో చెప్పవలసిన బాధ్యత ఆయనకు ఉంది. బి.సి. వెల్ఫేర్ మంత్రి గారు లేరు కాబట్టి ముఖ్యమంత్రి గారు క్లారిఫై చెయ్యాలి. ఈ హౌస్‌కి కాకుండా యావత్ రాష్ట్రానికి చెప్పాలి. ఎందుకంటే కొన్ని వేల మంది విద్యార్థులకు రిజర్వేషన్ వచ్చింది. హైకోర్టు వాళ్లకు కొంత టైం ఇచ్చారు. ఆ టైం కూడా అయిపోతుంది. కనుక ఈ రిజర్వేషన్ పొందిన విద్యార్థుల పరిస్థితి ఏమి కావాలో ఆలోచించాలి. ఇక్కడ మౌలికమైన టెక్నికాలిటీస్ ఉన్నాయని ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించి దానికి తగిన విధంగా జవాబు చెప్పాలి. ఈ విషయంలో వాళ్లు ప్రాపర్‌గా హోంవర్క్ చేయడం లేదు. ఒకే వొక హోంవర్క్ ఏమిటంటే, ముస్లిం మైనారిటీలకు ఫస్ట్ టైం

రిజర్వేషన్ ఇచ్చాము అని ఊరూరా చెప్పుకోడానికి, వాళ్ల ఓట్లు తీసుకోవడానికి, వాళ్లకు చాలా మంచి చేసామని ప్రాజెక్ట్ చేసుకోడానికి, ఈ డిబేట్ కూడా అదే సందర్భంలో వాడుకోవాలనే రాజకీయ ఉద్దేశ్యం తప్ప, సామాజిక కోణం నుండి వారి యొక్క పరిస్థితి బాగుపరచాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని నేను నిర్మొహమాటంగా చెబుతున్నాను. ఈరోజు కాంగ్రెస్ పార్టీ 5 శాతం రిజర్వేషన్ ముస్లిమ్స్‌కి ఇచ్చామని చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు. ముస్లిమ్స్ అనగానే 5 శాతం రిజర్వేషన్లు అంటున్నారు. కాని గత చరిత్ర ఒకసారి చూసుకోవాలి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 58 సంవత్సరాలు అయ్యింది. ఎక్కువ కాలం పాలించింది కాంగ్రెస్ పార్టీ కాదా అని నేను అడుగుతున్నాను. ఈ రాష్ట్రాన్ని కూడా వాళ్లే పాలించారు. 58 సంత్సరాలు తరువాత బ్యాక్‌వార్డ్ క్లాస్‌గా ముస్లిమ్స్‌ని మార్చడం మేము చేసినటువంటి అతి పెద్ద ప్రోగ్రెస్‌గా చెప్పుకుంటున్నారంటే అది ప్రోగ్రెస్సో లేక వాళ్లు మమ్మల్ని బ్యాక్‌వార్డ్ క్లాస్‌గా మార్చడం వల్ల మాకు స్కాలర్‌షిప్స్ వస్తాయి అని భ్రమ కలగజేసారు. ఈ విధంగా వాళ్ల పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవాలని సభ ద్వారా తెలియజేస్తున్నాను.

ఇంతగా దిగజారిపోయిన పరిస్థితుల్లో వారు ఎన్నో ఇబ్బందులనెదుర్కొంటూ ఈనాడు తమకు రిజర్వేషన్స్ కావాలని అడిగే పరిస్థితి వచ్చిందంటే వారి పరిస్థితి ఎంత దయనీయంగా వుందో ఒకసారి ఆలోచన చేయాలని కోరుతున్నాను. ఈ 58సంవత్సరాల కాలంలో ముస్లిం మైనారిటీల పరిస్థితి విద్యాపరంగా ఎంతగానో దిగజారిపోయింది. నిరుద్యోగులు వారిలో విపరీతంగా పెరిగిపోయారు. విద్యావకాశాలు లేక వారిలో చాలామంది వివిధ వృత్తులకు సంబంధించిన పనుల్లో జీవనం కొనసాగిస్తున్నారు. ఒకప్పుడు ప్రభుత్వోద్యోగాల్లో ఎంతో పెద్ద సంఖ్యలో వున్న వారు ఈనాడు చూద్దామన్నా సరే కనీసం సాంఘిక భద్రత లేని పరిస్థితి వుంది. శాంతిభద్రతల సమస్య కూడా వారికి ఎక్కువగా తలెత్తుతున్నది. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా మన ముస్లిం మైనారిటీ మిత్రులనే ఇబ్బంది పెట్టే పరిస్థితులున్నాయన్న విషయాన్ని మనం మరచిపోవద్దని తెలియజేస్తున్నాను. ఇచ్చిన వివరాల ప్రకారం వారి **సెన్సస్ ప్రకారం చూస్తే 82 లక్షల 36 వేల మంది ముస్లిం మైనారిటీల జనాభా వున్నట్లుగా ఈనాడు చెబుతున్నారు. అంత పెద్ద సంఖ్యలో వున్న వారికి ఒక ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చి ఏదో బ్రహ్మాండమైన కానుకగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమో ఒకసారి ఆలోచన చేయమని నేను అడుగుతున్నాను.** అదేవిధంగా వారికి మిగతా సదుపాయాల విషయాలలో కూడా ఆలోచన చేయాలి. ఈ రిజర్వేషన్స్‌పైన కూడా మీకు చిత్తశుద్ధి లేదు. మేము ఇదే హౌస్‌లో మా పార్టీ తరపున చెప్పాము. మూడు శాతం ఇస్తే అది 50 శాతం లోపలే వుంటుంది. 50శాతానికి క్రాస్ అయితే దానికి తగినట్లుగా యాక్ట్ చేయాల్సి వుంటుంది. యాక్ట్ తెచ్చి రాజ్యాంగపరమైన ప్రొటెక్షన్ కల్పించవలసి వుంటుంది. అలాంటి మౌలికమైన అంశాలున్నాయని మేము మొదటి నుండి చెబుతూనే వున్నా మొండిగా మీరు ఐదు శాతం రిజర్వేషన్స్ ఇచ్చారు. దానివల్ల మొత్తం రిజర్వేషన్స్ 51 శాతానికి చేరుకున్నందువల్ల తీరా హైకోర్టు మొట్టికాయలు వేయడం మొదలుపెట్టిందంటే మీరు దీనిలో ప్రాపర్ ఎక్సర్‌సైజ్ చేసి సరియైన రీతిలో చేయలేదని మీ చిత్తశుద్ధిని ప్రశ్నించడం మొదలుపెడితే అప్పుడు వాళ్లు దీనికి ఏమి చెబుతారంటే, అధ్యక్షా కావాలంటే ఆ ఒక్క శాతాన్ని తగ్గించండి

అప్పుడు 50 శాతం పరిధిలోకి వస్తుంది, ఇంత కంటే గత్యంతరం లేదు మా ప్రభుత్వానికి అని చెప్పి హైకోర్టులో చెబుతున్నప్పుడు ఆ పరిస్థితి చూస్తే ఈ విషయంలో వీరి సీరియస్‌నెస్ ఎంత వుందో తెలుస్తుంది. హైకోర్టా అధ్యక్షా, వీటిని చేయవలసింది. ఎంత పర్సెంటేజ్ వుండాలన్నది నిర్ణయించవలసింది న్యాయస్థానాలు కాదు అధ్యక్షా, ఇది ఒక రాజకీయ నిర్ణయం. చట్టసభలు చేయవలసిన కార్యక్రమం. మేము చెబుతూనే వచ్చాము. మీరు డిఫెక్టివ్‌గా బిల్లు తెచ్చారు. కేవలం పొలిటికల్‌గా బెనిఫిట్ కావడానికే ఈ డిఫెక్టివ్ బిల్లు పెడుతున్నారు. వారి అమాయకత్వాన్ని ఓట్ల రూపంలో సొమ్ము చేసుకోవడానికి చేసే ప్రయత్నం తప్ప మీకు చిత్తశుద్ధి లేదని మేము పదే పదే ఇదే హౌస్‌లో అనాడు చెప్పాము. ఈనాడు కూడా చెబుతున్నాము. ఈ రోజు కూడా మీకు చిత్తశుద్ధి లేకుండా కేవలం రాజకీయంగా బెనిఫిట్ కావడానికే మీరు తీసుకొస్తున్నారని గౌరవ ముఖ్యమంత్రి గారికి, వారి ప్రభుత్వానికి నేను తెలియజేయదలచుకున్నాను.

అధ్యక్షా! ఈనాడు ఒకసారి ఆలోచన చేస్తే పెద్ద సంఖ్యలో వున్న ముస్లిం మైనారిటీల పట్ల మీరు 1989 నుండి 1994 వరకు అధికారంలో వున్నప్పుడు చూపించిన ప్రేమ ఏమిటో ఒకసారి చెప్పాలని కోరదలచుకున్నాను. కనీసం సంఖ్యాపరంగా అయినా సరే వారికి కావలసిన సౌకర్యాలు కల్పించారా? వారి వెల్ఫేర్ గురించి ఏనాడైనా చిత్తశుద్ధితో మీరు బడ్జెట్‌లో పెట్టారా? దానిని మేము పెంచుకుంటూ వచ్చి రూ.38 కోట్లు చేశాము. లాస్ట్‌కు వచ్చేసరికి దానిని రూ.60 కోట్ల వరకు తీసుకొచ్చాము. అది చాలా పెద్ద బడ్జెట్ అని మేము గొప్పలు చెప్పడం లేదు. కాబట్టి మీరు వారి యొక్క సమగ్రమైన అభివృద్ధి కోసం ఆలోచన చేయాలి. మనం వారికి సౌకర్యాలు కల్పించే విషయంలో ఇంకా లోతుగా పోవడం లేదు. వాళ్లకు ఒక మసీదో, ఇంకొకటో ఇస్తే సరిపోతుందని అనుకుంటున్నాము. రాజకీయంగా ఎన్నికలు వచ్చినప్పుడు వారి ద్వారా ఓట్లు ఏవిధంగా వేయించుకోవాలని చేసే ప్రయత్నమే తప్ప చిత్తశుద్ధితో మనం వారి సమస్యల పట్ల డెప్త్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం లేదు. ఈనాడు మీరు పెట్టిన బి.సి. కమీషన్ పైన టోటల్‌గా హైకోర్టు తప్పు పట్టిన తరువాత మళ్లీ మీరు బిసి కమీషన్‌కు సర్వే చేయాలని చెప్పారు. అసలు వారు ఏమి సర్వే చేశారు? ఎంతమందిని ఏ విధంగా వారి ఆర్థిక పరిస్థితిని చేశారు? What is the social condition of the Muslims in the State? అనేది లోతుగా పరిశీలన చేశారా? వారు రాజ్యాంగబద్ధంగా వున్న నియమాలను పాటించారా? ఏ విషయంలోనైనా నియమాలు పాటించారా అన్నది చెప్పవలసిందిగా నేను గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. ఏదో ఐదు శాతం రిజర్వేషన్ పెట్టాం, మాకు ఓట్లు వేయండని చెప్పుకుంటూ ఊరూరూ తిరగడమే కాని మీరు లోతుగా రిజర్వేషన్సే కాకుండా వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులపైన మీరు ఏ చర్యలు తీసుకోదలచుకున్నారు? ఇప్పటికైనా జరిగిపోయిందేమీ లేదు. ఈ విషయంలో మీరు ఎలా వుండదలచుకున్నారు? ఏం చేయదలచుకున్నారు?

ఈ రోజు హౌస్‌లో ఒక నోట్ ఇచ్చారు అధ్యక్షా. వాటీజ్ ది నోట్ అధ్యక్షా? 12 పేజీల నోట్ అధ్యక్షా ఇది. క్లియర్‌కట్‌గా మేము నిన్న కూడా చెప్పాం. జరిగిన రిజర్వేషన్ ఏమిటి? వారికి వున్న వెల్ఫేర్ మెజర్స్ సంగతి ఏమిటి? తీసుకోబోయే వాటి సంగతి ఏమిటి? ఇవన్నీ

మనం డిస్కస్ చేద్దామనుకున్నాం అధ్యక్షా. కాని ఇందులో ఏ విధంగా వుందంట, ఎవరైనా నిరుద్యోగులు ఏదైనా ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌కు పోతే ఆ డిపార్ట్‌మెంటు వారు ఇచ్చే లోన్స్, వెల్ఫేర్ స్కీమ్స్ గురించి, ఆ స్కీమ్స్‌లో 20 శాతం మేం సబ్సిడీ ఇస్తాం, 80 శాతం బ్యాంకులిస్తారు. Is this the way అండీ? శాసనసభ్యులకు తెలియజేయవలసిన నోట్ ఇదేనాండీ? అసలు టోటల్‌గా మీరు బడ్జెట్ కేటాయింపులు ఎంత చేశారు? వారికి ఎన్ని కేటాయింపులు చేసి వారి ఆర్థిక పరిస్థితిని ఏ విధంగా మెరుగుపరచి వారిని ఏ విధంగా ముందుకు తేదలచుకున్నారు? ఎన్ని స్కూల్స్ ఓపెన్ చేశారు? వున్న స్కూల్స్ సరిపోతాయా? భవిష్యత్తులో వారికేమైనా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారా? ఈ రోజు ముస్లిం అమ్మాయిల పరిస్థితి దారుణంగా వుంది. చదువు లేకుండా చాలామంది వున్నారు. వారిలో వున్న అవిద్యను ఒకసారి చూసినట్లయితే అది చాలా ఎక్కువగా వుంది. వాళ్లలో విద్య అనేది దాదాపుగా జీరో పర్సెంటేజి వుంది. అలాంటి వివరాలు ఇస్తారనుకున్నాము. ఎంత లిటరసీ రేట్ వుంది? ఎంతమంది మాల్ న్యూట్రిషన్‌తో బాధపడుతున్నారు? ఎంతమందికి కనీసం పక్కా ఇళ్లు లేవు? వాళ్ల పరిస్థితి ఏ విధంగా వుంది? ఇది కావాలండీ మనకు ముస్లిం మైనారిటీల గురించి.

ఇది ఏదో ప్రతిసారి బడ్జెట్‌లో మొక్కుబడిగా చేసే కార్యక్రమాల గురించి ఒక టైపిస్టుకు చెబితే టైపు కొట్టి పంపించినట్లుంది. ఈ విషయంలో ప్రభుత్వానికి ఎంత సీరియస్‌నెస్ వుందో నేను చెప్పదలచుకున్నాను. కాని మీరు ఈరోజు బి.సి. కమీషన్ ఇచ్చిన దానిపై ఎందుకు ప్రాపర్‌గా చేయలేదు? ఏదో చేయడానికి మీకు రిపోర్టు కావాలి కాబట్టి బిసి కమీషన్ నుంచి ఆదరాబాదరాగా ఒక రిపోర్టు తీసుకొని దానిని బేస్ చేసుకొని ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తే అది కోర్టులో నలిగి పోయి హైకోర్టులో ఇంకా తేలని పరిస్థితి ఏర్పడింది. ఈనాడు కూడా కోర్టులలో ప్రాపర్‌గా ప్రెజెంటేషన్ చేసే పరిస్థితి ఈ ప్రభుత్వానికి లేదు వారిలో విద్యా శాతం తగ్గిపోతున్నది. వారిలో వున్న సోషల్ కండిషన్స్ మూలంగా వారిలో చదువుకునే వారి సంఖ్య తగ్గిపోతున్నది. నిరక్షరాస్యులైన వారి పిల్లలు ఎక్కడ చూసినా మనకు కనపడతారు. పండ్లు, కూరగాయలు అమ్ముకుంటూ, ఇళ్లలో, దుకాణాల్లో పనిచేసుకుంటూ, మెకానిక్‌లుగా పని చేసుకుంటూ, అసలు ప్రపంచానికి వారికీ లింకు లేకుండా తెగిపోయినట్లు టోటల్‌గా ఈనాడు no way, they are concerned because they are not getting anything out of the Government schemes. వారికి ఇప్పుడు కూడా ఏమీ రావడం లేదు. అలాంటి వివరాలు మీరు చెప్పండి.

అధ్యక్షా! మీకు కూడా తెలుసు. వారు ఎప్పుడు కూడా మాకు ఇది కావాలని చెప్పి ఎక్కడైనా గవర్నమెంట్ డిపార్ట్‌మెంటుకు వచ్చి అడిగే పరిస్థితిని కూడా మరచిపోయేలా చేశారు ఈ 50 ఏళ్ల పరిపాలనలో. వారు టోటల్‌గా ఏదో తమ కాళ్లమీద తామే నిలబడి వాళ్లకు తెలిసిన విద్యనో, వృత్తినో, వ్యాపారాన్నో పనినో నమ్ముకొని వాళ్ల జీవనోపాధిని పొందుతున్నారు. ఈనాడు హైదరాబాదులో కాని, ఇతర పట్టణాలలో కాని వాళ్ల కుటుంబాలు ఒక చిన్న రూములో ఐదారుమంది పిల్లలతో కలిసి జీవిస్తూ కనీసం వారికి మరుగుదొడ్డి లాంటివి కూడా లేకుండా భయంకరమైన వాతావరణంలో అనాగరికమైన పరిస్థితులలో దుర్భరమైన స్థితిగతుల నడుమ

తమ బ్రతుకులు వెళ్లదీస్తున్నారు. అలాంటి వారికి సంబంధించి వాళ్ల జీవితాలు మెరుగుపడడానికి శాశ్వతమైన కొన్ని కార్యక్రమాలు ఏ విధంగా తీసుకుందామో వాటి గురించి ఆలోచన చేయాలి తప్ప ఏ మాత్రం చిత్తశుద్ధి లేకుండా ఏదో ఆదరాబాదరాగా ఐదు శాతం రిజర్వేషన్ ఇచ్చామని చెప్పి పదిసార్లు చెప్పుకోవడం కాకుండా దానిని సిన్సియర్‌గా చట్టపరంగా చేయాలి.

అధ్యక్షా! ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో మీకు సలహాదారులు లేరా? లాయర్స్ కరువయ్యారా? మీ అడ్వకేట్ జనరల్ కళ్లు మూసుకొని కూర్చున్నారా? మీకు ఎన్నోసార్లు హైకోర్టు మొట్టికాయలు వేస్తూ వుంటే కూడా జవాబు చెప్పలేకపోతున్నారు. ఏదోరకంగా చేశాము కనుక మమ్మల్ని వదిలెయ్యండనే ధోరణిలో మీరు పోతున్నారు తప్ప మీ పార్టీ కాని, మీ ప్రభుత్వం కాని ఈ విషయంలో ప్రాపర్‌గా సూచన చేయలేకపోయారా? లేకపోతే వారికి ఏదోరకంగా ఇచ్చేస్తే ఇది ఎట్లాగూ కోర్టులో నిలబడదు కాబట్టి ఆ తరువాత దానిని కోర్టుల మీద తోసేయొచ్చనే వుద్దేశం ఇందులో కనపడుతుంది తప్ప మీకు ఇందులో ఏమాత్రం సిన్సియారిటీ లేదనే నేను స్పష్టంగా ప్రభుత్వం దృష్టికి తీసుకురాదలచాను. కాని Do it in a sincere way. కనుక ఇప్పటికే ముస్లిం మైనారిటీ ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి వారి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలి. ఇప్పుడున్న బడ్జెట్ కేటాయింపులు సరిపోవు కాబట్టి వారికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. వాళ్లకు ఎక్కువ సంఖ్యలో ఉర్దూ మీడియమ్ స్కూల్స్, మరియు రెసిడెన్షియల్ స్కూల్స్, ఐటిఐలు లాంటి టెక్నికల్ స్కూల్స్ లాంటివి మరింత ఎక్కువగా ఏర్పాటు చేసి వారి పిల్లలు బాగా చదువుకునే విధంగా ప్రోత్సహించాలి. కనుక ఇలాంటివన్నీ తప్పనిసరిగా మీరు చిత్తశుద్ధితో చేసినప్పుడు మేము తప్పకుండా అప్రిషియేట్ చేస్తాము.

**ఏదో కంటితుడుపుగా, రాజకీయ లబ్ధి కోసం చేసే కార్యక్రమాలు దయచేసి చేయవద్దు. 58 సంవత్సరాల తర్వాత వారిని బ్యాక్‌వర్డ్ క్లాస్‌గా మార్చడం జరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటు, తలవంపని ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను.** రాజ్యాంగం అమలులోకి వచ్చిన పది సంవత్సరాల కాలంలోనే దేశంలో ఉన్నటువంటి రిజర్వేషన్స్ పోవాలి, సమసమాజం ఏర్పడుతుంది, అప్పుడు ఎలాంటి రిజర్వేషన్స్ లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు, సంపదను సమానంగా పంచుకునే అవకాశం, అన్ని రంగాలలో సమాన అవకాశాలు ఈ దేశ ప్రజలకు దొరకాలని మన రాజ్యాంగ నిర్మాతలు ఆరోజు కలలు కన్నారు, ఆ దిశలో పని చేయాలని నిర్దేశించడం జరిగింది. కాని దౌర్భాగ్యమేమంటే, ఈ దేశానికి స్వార్థపూరితమైన నాయకత్వం రావడం, చట్టసభలలో పేద ప్రజల రెప్రజెంటేషన్ లేని కారణంగా, సామాజికంగా అనేక రంగాలలో ఇబ్బందులు పడుతున్న ప్రజల ప్రాతినిధ్యంలేని కారణంగా, సమగ్రమైన ప్రణాళికలు తయారుచేయని కారణంగా ఈనాడు పేదరికంలో ఉన్న అన్ని సెక్షన్స్ వాళ్లు మేము బిసిలుగా మారిపోతాం, ఎస్‌సి, ఎస్‌టి లుగా మారిపోతామనే పరిస్థితికి దిగజారితే, ముస్లింలను బిసిలుగా మార్చి బ్రహ్మాండమైన పని చేశామని చెప్పుకుంటే అది తలవంపైన, సిగ్గుచేటైన విషయం తప్ప మరొకటి కాదు. కనుక చేయదలుచుకుంది ప్రాపర్‌గా చేయండి. వారికి రిజర్వేషన్ కావాలని కోరుతున్న విషయాన్ని మేము వ్యతిరేకించడం లేదు, కావలసిందే. కాకపోతే ప్రాపర్‌గా చేయండి, చేసేదేదో

పర్‌ఫెక్ట్‌గా చేయండి, చట్టబద్ధంగా చేయండి. అది కోర్టులలో పడిపోతే, వాళ్ల తంటాలేవో వాళ్లే పడతారు, మేము ఇద్దామనుకున్నా కోర్టులు అడ్డుపడ్డాయని వాళ్ల మీదే తోసేయడం సబబు కాదు. ఇప్పటికే వారిని చాలాసార్లు మోసం చేశారు. ఈ ప్రభుత్వానికి తెలిసో, తెలియకో, మరి కావాలనో బిసి లకు, మైనారిటీలకు మధ్య అగాధం ఏర్పడేలా ప్రయత్నం చేస్తోంది. కొన్ని స్టేట్‌మెంట్లు చేస్తున్నారు, బిసిలంటే మైనారిటీలకు వ్యతిరేకమనో, మేము మైనారిటీల మీద ప్రేమ చూపిస్తున్నాం దాన్ని బిసిలు వ్యతిరేకిస్తున్నారని చెప్పి తగాదాలు పెట్టడం తప్ప మరొకటి కాదు. వీరిద్దరి మధ్య తగాదాలు పెట్టడానికి ముస్లింలను బిసిలుగా మార్చాం కాబట్టి వీరికి కూడా బిసిల బడ్జెటులోంచే ఖర్చు పెడతామని చెప్పి ఈ ప్రభుత్వం డెలిబరేట్‌గా కుట్ర చేస్తున్నారే తప్ప మరొకటి కాదని తెలియజేస్తున్నాను. ఒకవేళ పర్సంటేజీ పెడితే సెపరేట్‌గా వారికి కేటాయింపులు ఇవ్వాలి. ఆ కేటాయింపుల్లోంచి స్కాలర్‌షిప్స్ గాని, మిగతా ఆర్థికపరమైన బెనిఫిట్స్ పెంచాలే తప్ప ఏదో రకంగా ఉన్న బిసి బడ్జెటు నుంచే ఇస్తామంటే సమంజసం కాదు. అసలు బిసిలకే సరైన బడ్జెటు కేటాయింపులు లేవు. బిసిలకు అన్యాయం జరుగుతోంది. రేపు డిబేటులో ఆ విషయాలన్నీ మాట్లాడుతాం. ఒకవైపు బిసిలకు ఈవిధంగా అన్యాయం జరుగుతుంటే, మళ్లీ ఆ డబ్బులోంచే ముస్లింలకు కూడా కేటాయిస్తామని చెప్పి వారి ఇరువురి మధ్య తగాదాలు పెట్టి, వారిని ఓటు బ్యాంకుగా మార్చుకోవడం దారుణం. ఇవి రాజకీయంగా, బాధ్యతాయుతంగా చేసే కార్యక్రమాలు కాదని తెలియజేస్తున్నాను. రిజర్వేషన్స్ ప్రాపర్‌గా చేయండి, మోసం చేయవద్దు. రాజకీయ ఎత్తుగడగా దీన్ని వాడుకోవద్దు. దీన్ని ఘనకార్యమని చెప్పుకోవద్దు. మైనారిటీలకు బడ్జెటు కేటాయింపులు పెంచండి, వృత్తిపరమైన, విద్యాపరమైన సంస్థలు పెంచండి. వారికి ఎక్కువ విద్యను ఇవ్వండి, వారిలో ఉన్న పేదరిక నిర్మూలనకు ప్రత్యేకంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు ప్రకటించి అమలు చేయండి. కనీసం వచ్చే బడ్జెటులోనైనా ఆ కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రభుత్వ ఫిగర్స్ అన్నీ కూడా తప్పుగా ఉన్నాయి. వీళ్లు సిన్సియర్‌గా వర్క్ చేయరు. ఇప్పటికీ గట్టిగానే చెబుతున్నాను, ఈ యాక్టను డెఫిక్టివ్‌గా తెచ్చారు. ఆరోజు ముఖ్యమంత్రిగారి సమక్షంలో అడ్వకేటు జనరల్ ఉన్నపుడే ఈ విషయాన్ని చెప్పాను. మీరు ప్రాపర్‌గా, సరైన ఎక్సర్‌సైజ్ చేయడం లేదని చెప్పాను. మీ ఏకైక ఆలోచన ఎలాగైనా మేము చేశామని చెప్పి ఓట్లు వేయించుకోవాలనే ఆలోచన తప్ప మీకు సిన్సియారిటీ లేదని ఆరోజే చెప్పాం, ఈనాటి వరకూ అది తేలడం లేదు. ఇప్పటి వరకూ ప్రాపర్‌గా చేయకుండా ఇంకా మోసం చేసే పద్ధతిలోనే ప్రభుత్వం పోతోంది, చేయదలిస్తే సిన్సియర్‌గా చేయమని ఈ ప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

# వ్యవసాయం - విద్యుత్ సమస్యలు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం, విద్యుత్ రెండూ కీలకరంగాలే! వీటిల్లో సమస్యలు అనేకం. జనాభాలో 60% జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వ్యవసాయ రంగంలో సమస్యలపై అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారానే రైతాంగ ప్రయోజనాలు కాపాడడం సాధ్యపడుతుంది. ఇక పారిశ్రామికరంగం మొదలుకొని వ్యవసాయం, గృహావసరాల వరకు విద్యుత్ పాత్ర అపరిమితం! ఈ రెండు రంగాల్లోని సమస్యలపై సాగిన ప్రసంగాలు.

ఆహారం జీవనావసరం.
మానవాభివృద్ధికి మౌలిక సదుపాయాలు అత్యంత కీలకం.

# వ్యవసాయరంగం - రైతాంగ సమస్యలు

22-6-2004

అధ్యక్షా! ఈరోజు ముఖ్యంగా వ్యవసాయరంగం ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు అందరికీ తెలిసినవే. రాష్ట్రంలో 65 శాతం ప్రజానీకం వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం అతి ముఖ్యమైన రంగం. ఈ కీలక రంగంలో చాలా పరిణామాలు ఇప్పుడు వస్తున్నాయి. దీని యొక్క ప్రభావం అంతా కూడా ఆర్థిక వ్యవస్థ పైనే కాక ప్రతిరోజు వారి యొక్క జీవనం పైన పడుతుంది. వీటన్నింటికి నేను ఇక్కడ ఎవరినో బ్లేమ్ చెయ్యాలనో లేకపోతే ఇంకెవరో దీనికి కారకులనో చెప్పడానికి సిద్ధంగా లేను. ఈ విషయం పై టోటల్‌గా మనం ఒకసారి ఆలోచించాలి. అగ్రికల్చర్ సెక్టార్‌లో వస్తున్నటువంటి మార్పులు, అదే విధంగా దాంట్లో తీసుకురావలసిన మార్పుల గురించి మనం ఒకసారి మాట్లాడుకోవాలి. మొదట్లో అగ్రికల్చర్ సెక్టార్ అనేక ఒడిదుడుకుల్లో ఉంది. ఉత్పత్తులను పెంచాలనే ఏకైక ధ్యేయంతో మొదటి నుండి మన ప్లానర్స్ బాగా దృష్టి పెట్టారు. ఎందుకంటే మనకున్నటువంటి కోట్లాది జనానికి తిండి గింజలు తీసుకురావాలి. అది కూడా అఫర్డబుల్ ప్రైస్‌తో తక్కువ ధరకు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ప్లానింగ్ ఉంది. ఫలితంగా ఇతర రంగాలకు వ్యవసాయానికి చాలా వ్యత్యాసం ఏర్పడుతుంది. ఇతర రంగాలలో చూసినట్లయితే ప్రొడక్షన్ కాస్ట్‌ను బట్టి ప్రొడ్యూసరే డిసైడ్ చేస్తారు. కాని ఈ పరిస్థితి అగ్రికల్చర్ సెక్టార్‌లో కనిపించలేదు. ఇక్కడ ప్రొడ్యూసర్ చేతిలో తన కాస్ట్ ఏమి లేదు. కనుక కాస్ట్ బేస్డ్‌గా ప్రైస్ రావడం లేదు. ఆ విధంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. గ్రీన్ రివల్యూషన్ తరువాత మనకు వచ్చినటువంటి పరిణామాలు దేశంలో చాలా మార్పులకు దోహదం చేసింది. నేడు మనకు కావలసినటువంటి ఆహారోత్పత్తి అనుకూలంగా, సరిపోయేలా వస్తున్నా ఉత్పత్తి చేస్తున్నటువంటి వ్యక్తికి వారి జీవన ప్రమాణాలు పెరగడం లేదు. కనుక వాటి కోసం మనం ఏమి చెయ్యాలో ఆలోచించుకోవాలి. అందరూ కూడా రాజకీయాలకు

అతీతంగా ఆలోచించి ఈ సమస్యకు పరిష్కారం మార్గం ఏమిటో కనుక్కోవాలి. ఈ సమస్యలు ఇతర డెమోక్రటిక్ దేశాలలో ఎక్కడ వచ్చినా కొన్ని అంశాలు అందరికి సంబంధించిన అంశాలుగా పరిగణించి దానికి పరిష్కారం మార్గాలు చేపడతారు. ఎబౌవ్ రాజకీయానికి అందరం ఎదిగి ప్రతి విషయం కూడా రాజకీయంగా ఎదుర్కోవడం అలవాటుగా మారింది. గత ఎన్నికలు ప్రధానమైన రాజకీయ అంశంగా మనకు ఈనాడు ఉన్నటువంటి అధికారాన్ని బట్టి దీనిని తీసుకొని మన ముందుకు వచ్చింది.

అధ్యక్షా! ఈనాడు వ్యవసాయ రంగంలో వస్తున్నటువంటి పరిణామాలు, అదే విధంగా దేశంలో వస్తున్నటువంటి పరిణామాలు ఒకసారి మనం విశ్లేషణ చేసుకొని ఇంతటితో ఈ సమస్య ఆగిపోతుంది అని, ఓవర్‌నైట్‌లో దీనిని మార్చేస్తామని వారి ఊహలు ఉండవచ్చు. కాని మేము ఆ విధంగా లేము. దీని కోసం పకడ్బందీగా లాంగ్‌టర్మ్ ప్రోగ్రామ్ ఉంటే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదని మనవి చేస్తున్నాను. గత ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఒకటి లాంగ్‌టర్మ్ ప్రోగ్రామ్ మరొకటి షార్ట్‌టర్మ్ ప్రోగ్రామ్ క్రింద దీనిని విడదీసుకున్నాం. దీనిలో వాళ్లు చేసిన ప్రచారాలు, విధానాల వల్ల రైతాంగానికి మేము ఏమి చెయ్యలేదని, వ్యవసాయ రంగాన్ని ఏమాత్రం కూడా పట్టించుకోలేదని, ఏదైనా చేస్తే రైతు రాజ్యాన్ని మేమే తీసుకొచ్చామని వాళ్లు మాట్లాడుతున్నారు. కాని తీసుకున్న చర్యలు ఏమిటి? గత ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి, వ్యవసాయ ఫలితాలు ఏ విధంగా ఉన్నాయి? ఏ విధంగా చేస్తే ఉపయోగపడుతుందని ఆలోచన చేసే విధానాలతో ముందుకు పోవడం లేదని తెలియజేస్తున్నాను. ఇది సరిపోదన్నట్లుగా దానిని కాంప్లికేట్ చేసే నిర్ణయాలను తీసుకొంటున్నారు. ఇంకా సమస్యలు యాడ్ అవుతున్నాయి తప్ప సమస్యలను పరిష్కరించే దిశలో లేరని ఘంటాపథంగా చెబుతున్నాను. I can give you a few examples also.

ఇంతకు ముందు మీరు చెప్పారు. ఈనాడు రుణ సదుపాయాల గురించి తెలియజేశారు. అగ్రికల్చర్ సెక్టార్‌లో మేజర్‌గా చూసినట్లయితే నూటికి 92 శాతం రైతాంగం అంతా కూడా తమ పెట్టుబడికి ఏదో విధంగా అప్పు రూపంలో తెచ్చుకుంటున్నారు. ఒక 8 శాతం మాత్రం వారి స్వంత పెట్టుబడితో వ్యవసాయం సాగిస్తున్నారు. 92 శాతం మంది వడ్డీ పైనే ఆధారపడి ఏదో ఒక ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ కోసం ప్రయత్నం చేస్తుంటారు. కనుక వారికి తక్కువ వడ్డీతో వారికి అందుబాటులో టైమ్‌లీ క్రెడిట్ ఏ విధంగా అందించాలో ఆలోచన చేయాలి. ఈ దిశలో మీరు ఏ ప్రయత్నం చేశారని అడగదలచుకున్నాను. ఈ ఎన్నికలలో మూడు శాతం వడ్డీకి రుణాలు ఇస్తామని వాగ్దానాలు చేశారు. టైంలో క్రెడిట్ ఇప్పిస్తారని అనుకొంటున్నాను. మా టైంలో మేము చేశాము. 160 కోట్ల రూపాయల వడ్డీ మాఫీ చేశాము. కావలసిన రుణ పరపతిని పెంచే ప్రయత్నం చేసి 7900 కోట్ల రూపాయలను గత సంవత్సరంలో రుణ పరపతిని తెచ్చాము. దానికోసం కావలసిన డ్రైవ్ చేశాము. సంవత్సర కాలంలో పదకొండు వేల కోట్ల రూపాయల వరకు మేము రుణప్రణాళికను సిద్ధం చేశాము. పదకొండు వేల కోట్ల రూపాయలు

ఇవ్వగలరా? గత అనుభవంలో ఎప్పుడు కూడా బ్యాంకర్స్ కాని, ఎస్.ఎల్.బి.సిలో తీసుకున్న నిర్ణయాలు కాని 70-80 శాతానికి ఎక్కువ కూడా ఏనాడు ఇవ్వలేకపోయారు. ప్రస్తుత సంవత్సరం అనుకున్న ప్రకారంగా రుణాలను రైతాంగానికి ఇవ్వలేకపోతున్నారు. అయితే, ఈ సంవత్సర కాలంలో (అంతరాయం)

అధ్యక్షా! మీరు రుణాల గురించి ఏమి ఆలోచించారు? నిన్న ఒక బిల్లు తీసుకొచ్చారు. బిల్లు తీసుకొచ్చి రుణాలన్నిటిని ఆరు నెలల దాక మాఫీ చేస్తామన్నారు. వెరీ డిఫెక్టివ్ బిల్ తీసుకొచ్చారు. దాని యొక్క ఉద్దేశ్యం ఏమిటి? ఆ బిల్లు చివరికి ఏ విధంగా దారితీస్తుందో తెలియదు. అది చాలా కాంప్లికేట్ అవుతుందని. ఈనాడు రైతుల దగ్గరకు వెళ్లినప్పుడు, ఫెర్టిలైజర్స్ దగ్గరకు వెళ్లినప్పుడు రకరకాల పెస్టిసైడ్స్ కానివ్వండి అదే విధంగా ప్రైవేట్ వ్యాపారస్థుల దగ్గర చేతి బదులు క్రింద నూటికి అరవై అయిదు శాతం తీసుకుంటున్నారు. ఈ విధంగా అన్‌ఆర్గనైజ్డ్ సెక్టార్ నుండి వస్తుంది. నిన్న మీరు తీసుకున్న చర్యతో ఆల్టర్నేట్ మీరు ఏమి ప్రపోజ్ చేస్తారు. ఈనాడు 20 నుండి 25 వేల కోట్ల రూపాయలకు పరపతి అవసరం. ఆ 25 కోట్లలో బ్యాంకులతో చెప్పినా, బ్యాంకు వ్యవస్థ ద్వారా ఇన్‌స్టిట్యూషనల్ క్రెడిట్ ఎంత తీసుకున్నా 7-8 కోట్ల కంటే ఎక్కువ ఇప్పించజాలరు కనుక ఆల్టర్నేట్ అరేంజ్‌మెంట్ చాలా అవసరం. ఫెర్టిలైజర్ షాపులో నాలుగు బస్తాల ఫెర్టిలైజర్స్ దొరకకుండా అదే విధంగా ఏ బ్యాంకుకు వెళ్లినా చేతి బదులు దొరకకుండా ఉండే పరిస్థితులు రేపు రాబోతున్నాయి. What is the alternate arrangement for that? అని అడగదలచుకున్నాను. ఈనాటికి కూడా స్పష్టత లేదని నేను తెలియ జేసుకుంటున్నాను. ముఖ్యమంత్రి గారు బ్యాంకర్స్, ఎస్.ఎల్.బి.సి. మీటింగ్‌కి వెళ్లినప్పుడు రీషెడ్యూల్ చెయ్యండి, ఇంటరెస్ట్ రేట్లను తగ్గించండి, మేమంతా ప్రాజెక్టులకు మాట ఇచ్చాము కనుక ప్రాజెక్టులకు ఫైనాన్స్ చెయ్యండి అన్నప్పుడు బ్యాంకర్స్ కూడా కావలసిన రుణ పరపతిని కలుగజేస్తామన్నారా? రీ షెడ్యూల్ చేస్తామన్నారా? వాళ్లు బయటకు వచ్చి సాధ్యం కాదన్నారు తప్ప మీరు అడిగినా దానికి ఏమి అంగీకరించలేదని మనవి చేస్తున్నాను.

స్పీకర్ సార్, నిన్న కూడా మేము చెప్పాం. ఇది చాలా కీలకమైన విషయం, గ్రామాలలో ఎక్కడా రుణం దొరకడం లేదు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకర్స్ దగ్గరికి వెళితే, ఆ బ్యాంకర్స్ కూడా మీటింగ్స్ పెట్టుకొని రోజూ ప్రభుత్వం చేస్తున్నటువంటి ప్రకటనలు చూపిస్తున్నారు. హోల్ హౌస్ అంతా ఉన్నారు. మా వాళ్ల ఆందోళన రాజేశ్వరరావుగారు చెప్పారు. ముఖ్యమంత్రిగారు ఇక్కడ ఉన్నారు. అనుభవజ్ఞులైన మెంబర్స్ ఉన్నారు. నిజంగా మంత్రిగారు మాట్లాడిన దానికి సందర్భం ఉందా? ఆయన మాట్లాడిన రెండు విషయాలు కరెక్ట్ అని అనుకుంటే,

స్పీకర్ సార్, ఛైర్ ఒకసారి రూలింగ్ ఇచ్చిన తరువాత (అంతరాయం)

స్పీకర్ సార్, మేము నిన్న చెప్పాము. ఈరోజు కూడా సమయం ఎక్కువ తీసుకోడానికి మేము ప్రయత్నం చేస్తున్నామని అనడం పొరపాటు. సబ్జెక్ట్‌కు వున్న ప్రాముఖ్యాన్ని మాత్రం

మేము చెబుతున్నాము. వాళ్లు 12 పేజీల స్టేట్‌మెంట్ ఇచ్చారు. 12 పేజీల స్టేట్‌మెంట్ ఇచ్చి, 5 నిమిషాలలో క్లారిఫికేషన్ అడిగి కూర్చోమంటే ఎలా సాధ్యం. ఇది ముఖ్యమైనటువంటి ఇష్యూ. రాజకీయంగా ప్రాధాన్యం వున్న అంశాన్ని 5 నిమిషాలలో మాట్లాడమనడం మాకు చాలా ఇబ్బందిగావుంది. సాధ్యమైనంత త్వరగా మేము కంప్లీట్ చేస్తామని గౌరవ సభ్యులకు తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా! గ్రామాలలో వున్నటువంటి పరిస్థితులు చూసినట్లయితే పెట్టుబడి అనేది దొరకకుండా వుంది. బ్యాంకర్ల దగ్గర దొరికేది. వీళ్లు ఇచ్చిన స్టేట్‌మెంట్ మూలంగా రుణాలు ఇవ్వడానికి ఏ బ్యాంకరూ ముందుకు రావడం లేదు. వున్నటువంటి రుణ ప్రణాళిక కూడా పూర్తిగా వీళ్లు అమలుచేస్తారా అనేది అనుమానంగా వుంది. అదే విధంగా నిన్నటి బిల్లుతో, వారు చెబుతున్న మాటలతో ఎవరైనా వడ్డీ వ్యాపారస్తులు వున్నా సరే, దాని ప్రభావం వున్న వారు ఇక సిస్టం ఆలోచించాలి. నిన్న బిల్లులో మాకు సరైన అవకాశం ఇవ్వలేదు. మా రాజేశ్వరరావుగారు కూడా ఆ బిల్లు డెఫినిషన్ చెప్పలేకపోయారు. ఈ చట్టం తీసుకువచ్చిన తరువాత అప్పు తీసుకున్న వారు ఎవరు, ఇచ్చిన వారు ఎవరు అనేది కూడా డిఫైన్ చేయలేదు. ఒకవేళ యాక్ట్‌ను ఎవరైనా అమలు చేయలేకపోతే ఎలా శిక్షించబోతున్నారో కూడా చెప్పాలి. యాక్ట్‌ను ఎందుకు తీసుకువచ్చారు, దాని పర్పస్ ఏమిటో వాళ్లకు అయితే అర్థమయింది కాని మాకు మాత్రం అర్థం కాలేదు. బిల్లు పరిస్థితి ఆ విధంగా వుంది, దాని పరిణామం మాత్రం గ్రామాలలో వెంటనే కనబడుతోంది. రేపటినుండి ఏ ఫర్టిలైజర్ షాపులో కూడా రైతులకు డబ్బు ఇచ్చే వారు కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. దానితో ఈ క్రైసిస్ వస్తుంది. కనుక మీరు ఒకటి తరువాత ఒకటి యాడ్ చేస్తున్నారు. బ్యాంకర్లు ఇవ్వకపోతే ఉచిత ప్రభుత్వం వచ్చింది, ఏమి ఉచిత నిర్ణయాలు తీసుకుంటుందో మాకు తెలియదని మెల్లగా అంటున్నారు. **రైతులకు డబ్బులు ఇవ్వని పరిస్థితులలో రైతుమిత్ర సంఘాలు ఏర్పాటు చేసినా, వాటిలో మనకు వున్న టెనెంట్స్‌ను కూడా పెట్టించాము. వారందరికీ టైం లోపల క్రెడిట్ వచ్చేలా ఏర్పాటు చేయాలి.** దాని కోసం మీరు ఆలోచన చేయాలి. ఈ స్టేట్‌మెంట్‌లో ఏముంది? మేము వీళ్లకు దరఖాస్తులు పెట్టమని, బ్యాంకులకు దరఖాస్తులు పెట్టమని నాబార్డును అడిగాము. ఫైనాన్స్ మినిష్టరు గారిని అడిగాము. ఈ ప్రభుత్వం తరపున మీరు ఏమి చొరవ తీసుకున్నారు? ఏమి ఆల్టర్‌నేటివ్ చేశారు? గాలిలో దీపం పెట్టి దేవుడికి దండం పెట్టినట్లు మీరు చర్యలు చేపడుతున్నారు తప్ప, ఇంతవరకు మీరు చేబడుతున్న చర్యల మూలంగా సిస్టమ్ మరింత కాంప్లికేటెడ్ అయినదని మీకు తెలియజేస్తున్నాను. కనుక ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత స్వయంగా మీరు తీసుకున్న చర్యలు ఏమిటో స్పష్టంగా చెప్పాలి. మా ఆర్క్యుమెంట్ వినాలి. మేము 50 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇచ్చాము. ఈరోజున వేరుశనగ విత్తనాలు, సోయాబీన్స్‌కు మాత్రమే సబ్సిడీ ఇచ్చి మిగతా వాటికి ఇవ్వమని మీరు అంటున్నారు. విత్తనాలకు మేము ఇచ్చాము, మేము తీసుకున్న చర్యలు కూడా మీరు ఎందుకు తీసుకోలేదు? ఏదో గొప్పగా చేస్తామని చెప్పి, ఈ రోజున ఎందుకు చేయలేదని మేము అడుగుతున్నాము. ఈనాడు మాటలు తప్ప, ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఒక వ్యక్తి తనకు ఏదో మంచి

జరిగితే దేవుడికి సంతర్పణ చేస్తామని మొక్కుకున్నాడు. మంచి జరిగినందున సంతర్పణ చేయాలని, ఏమి చేస్తే బాగుంటుందనే ఆలోచన చేస్తాడు. సంతర్పణ చేయాలంటే డబ్బు కావాలి, మిఠాయిలు కావాలి. ఏమి చేయాలా అని ఆలోచిస్తూ వుంటే వాళ్లకు ఎవరో పెద్దలు రోశయ్యగారి లాంటి మిత్రులు వుండి, దీనికి అంత టెన్షన్ పడడం ఎందుకు, మేము లేమా, దీనికి ఏదో ఒక మార్గం చెబుతామని చెప్పారు.

సరే నేను ఏదో ఒక మార్గం చూపిస్తాను, రాగి చెంబుతో నీళ్లు తీసుకొనిరా అని చెప్పి, అతన్ని తీసుకొని ఆ ఊరిలోని మిఠాయి షాపు వద్దకు పోయినాడట. ఆ మిఠాయి షాపులోని మొత్తం లడ్డూలు, జిలేబి సంతర్పణ చేయించి, నమస్కారం పెట్టించేటప్పుడు, ఆ షాప్ ఓనర్ "నా షాప్‌లో వున్న స్వీట్స్‌తో మీరు ఎలా సంతర్పణ చేస్తారు" అని అడిగాడు. దానికి ఆ సంతర్పణ చేయించిన వ్యక్తి " మీరు తయారు చేసినవి నలుగురు కొనుక్కునేవే కదా. దేవాలయాలలో కూడా ప్రసాదం అమ్ముతున్నారు. మీరు ఎలాగూ అమ్ముతారు. మేము సంతర్పణ మాత్రం చేసుకున్నాము" అన్నారట. మీరు చెప్పేది అదే విధంగా వుంది. మీరు స్వయంగా ఏమి చేస్తారనేది చెప్పండి. పాత బాకీలు ఎత్తివేస్తున్నారా? బ్యాంక్‌ల వారితో లెండింగ్ రేట్ గురించి చర్చించారా? బ్యాంకుల వారి లెండింగ్ రేట్ 6 శాతం, అడ్మినిస్ట్రేటివ్ కాస్ట్ 2.7 శాతం, ఇంతకంటే తగ్గించే పరిస్థితి లేదని చెబుతున్నారు. గవర్నమెంట్ కాబట్టి మీరు తగ్గించాలి. గవర్నమెంట్‌గా మీరు సబ్సిడీ ప్రొవైడ్ చేయాలి. మూడు శాతం ఇంటరెస్ట్ రేటుకు యిస్తామని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేశారు. దాని గురించి ఇప్పుడు మీరు మెన్షన్ చేయలేకపోతున్నారు. రూ.660 కోట్లు అవుతాయనేది అంచనా. అందుకోసం తగు ఏర్పాట్లు చేయవలసిందిగా మిమ్ములను కోరుతున్నాను.

సీడ్ యాక్ట్ తెస్తామని అన్నారు. సీడ్ యాక్ట్‌ను సంబంధించి క్లారిటీ వుందో లేదో తెలియదు. సెంట్రల్ యాక్ట్ తెస్తామని అంటున్నారు. దాని గురించి క్లారిఫై చేయాలి. **50 శాతం సబ్సిడీపైన విత్తనాలు యివ్వాలనేది మా డిమాండ్. ఆ రకంగా మేము యిచ్చాము. మేము రైతాంగం కోసం ఎన్నో కార్యక్రమాలు చేశాము. అయినా ఇంకా చేయవలసినవి చాలా వున్నాయి.** వాటి గురించి చెప్పడానికి తమరు సమయం యివ్వడం లేదు. మేము చేపట్టిన కార్యక్రమాలను కూడా మీరు కొనసాగించకుండా డినై చేస్తున్నారు. తప్పకుండా చేపట్టి కొనసాగించాలనేది మా డిమాండ్. దయచేసి అన్ని రకాల విత్తనాలను 50 శాతం సబ్సిడీకి యివ్వాలని కోరుతున్నాము. మేము నాలుగు శాతం వడ్డీ అని అంటే, మూడు శాతం వడ్డీ అని మీరు అన్నారు. మూడు శాతం వడ్డీ రేటుకు రైతులకు ఇమీడియేట్‌గా రుణాలు యివ్వాలి. గతసంవత్సరం మేము గతంలో తీసుకున్న రుణాలపైన వడ్డీని మాఫీ చేశాము. అదే రకంగా ఈ సంవత్సరం కూడా వడ్డీ మాఫీ చేసేందుకు గాను చర్యలను చేపట్టవలసిందిగా కోరుతున్నాను. మీ తొందరపాటు చర్యల కారణంగా యిప్పటికే రైతాంగం విపరీతంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గతంలో జరిగిన ఆత్మహత్యలతో కంపేర్ చేసినట్లయితే ఆత్మహత్యల రేటు పెరిగింది. ప్రతి రోజు 15 మంది యిప్పటికీ చనిపోతున్నారు. మేము పేర్లతో సహా ఇచ్చాము. ఆత్మహత్యలకు కారణాలు మీకు తెలియడం

లేదు. వాటిని ఎలా అపాలో మీకు తెలియడం లేదు. కొత్త నిర్ణయం కారణంగా మీకు కొత్త సమస్యలు వస్తున్నాయి. ఆనాడు జరిగిన ఆత్మహత్యలకు సంబంధించి సోనియాగాంధీని, ఇతర నేతలను తీసుకువచ్చారు. ఒకటికి పదిసార్లు ఢిల్లీకి వెళ్లారు. ఇప్పుడు కూడా సోనియాతో, మన్మోహన్ సింగ్‌తో మాట్లాడి వారిని చెప్పమని చెప్పండి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఖచ్చితంగా ప్రత్యేకమైన ప్యాకేజ్‌ని యివ్వవలసిందిగా వారిని అడగండి. వారు తప్పకుండా యిచ్చే విధంగా వారిపై ప్రెజర్ తీసుకురండి. క్రెడిట్‌కు సంబంధించి ప్రతి రైతుమిత్ర సంఘానికి లక్ష రూపాయల చొప్పున యివ్వండి. ఆ విధంగా క్రెడిట్ ఎవైలబిలిటీ తీసుకురావాలని మిమ్ములను డిమాండ్ చేస్తున్నాను.

అధ్యక్షా! మారిటోరియం యింటర్వెల్‌కు సంబంధించి, ప్రైస్‌కు సంబంధించి ఏమి చర్యలు తీసుకోబోతున్నారు? మా ప్రభుత్వంలో ప్రతి ఒక్క కమోడిటీ ప్రైస్‌కు సంబంధించి స్టెబిలైజేషన్ కొరకు ప్రయత్నాలు చేశాము. మీరు ఏవిధమైన చర్యలు తీసుకోబోతున్నారో స్పష్టంగా మెన్షన్ చేయాలి. ఇది చాలా యింపార్టెంట్ సబ్జెక్ట్. రైతాంగం ఈనాడు అనేక రకాల యిబ్బందులు పడుతున్న తరుణంలో సమగ్రమైన సమాధానం యివ్వవలసిందిగా కోరుతున్నాను. ముఖ్యమంత్రిగారు కూడా సభలోనే వున్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగారు కూడా వున్నారు. ఎన్నికల్లో చెప్పాము ఏదో చేసేయ్యాలనే తొందరపాటుతో క్లారిటీ లేకుండా చేస్తున్నారు. అందువల్ల నిదానంగా కూర్చొని, స్పష్టమైన ఆలోచన చేసి సరియైన విధంగా సమస్యకు పరిష్కార మార్గాలు కనుక్కోవలసిందిగా కోరుతున్నాను. అందుకోసం అందరి సూచనలు తీసుకొని అమలు చేయాలని కోరుతూ నేను డిమాండ్ చేసిన వాటికి సరియగు విధంగా మంత్రిగారు సమాధానం చెప్పాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

# వ్యవసాయ రుణ ప్రణాళిక

21-7-2004

స్పీకర్ సర్, రాజేశ్వరరావుగారు చెప్పినట్లుగా దీంట్లో ఒక స్ట్రైట్ క్వశ్చన్ అడగదలచాను. కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న నిరుపేదలు, భూమి లేని వారి లిస్ట్ తయారు చేయటానికి మీరు ఒక కమిషన్‌ను వేయండి. You constitute a Commission. ఒక టైమ్ బౌండ్ ప్రోగ్రామ్ పెట్టుకుని స్టేట్ వైడ్‌గా సాగుచేస్తున్నవారి లిస్ట్‌ను ప్రిపేర్ చేయండి. అందుకు పాలసీ ఏ విధంగా పెట్టాలో, హక్కులు ఏ విధంగా కలుగ చేయాలో, దేవాలయాల పరిస్థితి ఏమిటో తెలుసుకోవటానికి, వాస్తవంగా సాగు చేసుకుంటున్న నిరుపేదలను ఐడెంటిఫై చేయాటానికి ఒక ల్యాండ్ కమిషన్‌ను వేస్తే సాధ్యపడుతుంది.

మాకేమి ప్రొటెస్ట్ చేయాలని కాదు. దీనికి సొల్యూషన్ కావాలి. మంత్రిగారు ప్రాపర్‌గా సమాధానం చెప్పాలి. మా ఆందోళన గ్రామాలలో రూ. 11వేల కోట్లకు ఈ సంవత్సరం క్రెడిట్ ప్లాన్ తయారు చేశారు. ఈ రూ. 11వేల కోట్లు అవసరం అని అంగీకరించి, బ్యాంకర్లు ఒప్పుకున్న తరువాత ఈనాడు గ్రామాలలో ఎవరికీ అప్పు పుట్టడం లేదు. మీరు తీసుకుని వచ్చిన యాక్ట్ ఫలితంగా గ్రామాలలో ప్రైవేటు వారి దగ్గర అప్పు పుట్టడం లేదు. ఫెర్టిలైజర్ షాపులలో ఏమీ దొరకని పరిస్థితి చేశారు. ఆల్టర్నేటివ్ చూడకుండా మీరు చేసిన కార్యక్రమానికి రూ. 25 వేల కోట్ల నుండి రూ. 30 వేల కోట్ల వరకు అవసరం ఉంటే, రూ. 11వేల కోట్ల వరకు క్రెడిట్ ప్లాన్ తయారుచేశారు. ఇంతవరకు ఎవరి దగ్గర కూడా బ్యాంకుల ద్వారాగానీ కోఆపరేట్ సెక్టారు ద్వారాగానీ రైతాంగానికి అప్పు పుట్టడంలేదు. దీనిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? మీరు నాబార్డ్ ఇచ్చిన గైడ్‌లైన్స్ క్రిందివరకు తీసుకుని పోకుండా, అమలు చేయడంలో ఏ మాత్రం సీరియస్‌నెస్ చూపించడం లేదు. ముఖ్యమంత్రిగారి తరఫున 5 శాతం ప్రకటన చేయిస్తామని

అంటే, మేము కూడా ఇచ్చాము. ఇది కొత్తదేమీ కాదు. ఇవ్వడానికి మాకు అభ్యంతరం లేదు. ఇవ్వాల్సిన అవసరం ఉంది. మూడు శాతం, పావలా వడ్డీకి ఇస్తామని అన్నారు. దానిని వ్యతిరేకించడంలేదు. You must do it. గ్రామాలల్లో అప్పులు పుట్టని దానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? ఏ బ్యాంకుల ద్వారా ఏ జిల్లాల్లో ఎన్ని అప్పులు ఇచ్చారు? సభకు చెప్పాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. మేము ప్రొటెస్ట్ చెప్పలేదు అధ్యక్షా, నిజంగా ఆందోళనగా ఉంది. ఈ హౌస్‌లో ప్రొటెస్ట్ చేయడానికి కూడా.

అధ్యక్షా! మా అభిప్రాయం ఒకసారి మీరు వినాలి. మీ ఛైర్‌కు మేము ఏమన్నా చెప్పుకోవాలి. మాకు సరైన సమాధానం రానప్పుడు ప్రొటెస్ట్ చేద్దామని లేచాను. ప్రొటెస్ట్ చేసినపుడు మంత్రిగారు రెస్పాండ్ అయ్యారు. సరైన సమాధానం దొరికితే కామ్‌గా ఉందామని మా ఉద్దేశ్యం. కానీ సరైన రిప్లయి రాలేదు. సెకండ్ టైం ప్రొటెస్ట్ చేద్దామని ఆలోచిస్తే, మాకు మైక్ ఇవ్వడానికి ఇంతసేపు అయితే మా పరిస్థితి ఏమిటి ఈ హౌస్‌లో.

**పాయింట్ ఆఫ్ ఆర్డర్‌పై ప్రభుత్వాన్ని నిలదీసిన సందర్భం:**

Sir, please see rulae 302(2), "Point of order may be raised in realtion to the business before the House at the moment" I am raising that point of order. Sir. What is the business before the House ? Speaker may clarify it. There are two items of business before us as per my knowledge. One is going on the subject of drought. The second is Hon'ble Minister for Major Irrigation is supposed to give reply, which was postponed yesterday. whether you clubbed both of them or taken up separtely so that we can prepare for them?

అధ్యక్షా! ఇప్పుడు రెండూ క్లబ్ చేసి మేజర్ ఇరిగేషన్ డిమాండ్స్ పైన కూడా ముఖ్యమంత్రి గారు రిప్లయ్ ఇస్తున్నట్లా ? అదే విధంగా డ్రాట్ పైన మాత్రమే ఇచ్చినట్లా ? ఇరిగేషన్ ప్రాజెక్టులు 5,10 సంవత్సరాలలో కట్టవచ్చు.

అధ్యక్షా! Now are we continuing with the discussion on the drought ?

**రైతుల ఆత్మహత్యలు, కరువు పరిస్థితులు-ప్రాజెక్టులు-ఎత్తిపోతల పథకాలపై:**

అధ్యక్షా! ఒక్క విషయం, మాకు అవగాహన లేకపోవచ్చు. ఎలక్షన్స్‌కు ముందు, వారు ప్రమాణ స్వీకారం చేయకముందు గత ఆరు నెలల డేటా తీసుకోండి. మీ దగ్గర ఆ డేటా వుండే వుంటుంది. వారు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఈనాటి వరకు 900 మంది రైతులు చనిపోయినట్లుగా మాకు సమాచారం వుంది. అధికారిక సమాచారం మీరు చెప్పండి. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రంలో ఆత్మహత్యలు జరగడానికి వీలులేదని చెప్పిన తరువాతనే ఎందుకు ఆత్మహత్యలు పెరిగాయి? ఈ రోజు కూడా 20 మంది చనిపోయారు. క్లారిఫికేషన్ ముందుగా, తమ దృష్టికి ఒక విషయాన్ని తీసుకురావాలని కోరుతున్నాను. గౌరవ

ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ, రైతుల ఆత్మహత్యలు ఏ విధంగా జరిగాయనేది మాకు అర్థం కావడం లేదని వారి అభిప్రాయం తెలిపారు. ఏ విధంగా అర్థం కావడం లేదని, 'ఆంధ్రజ్యోతి'లో రిపోర్ట్‌ని చదివారు. ఈ డిబేట్‌కి, వారు చదివిన దానికీ రెలవెంట్‌గా ఏముందో మాకు అర్థం కావడం లేదు. మేము అర్థం చేసుకున్న దాని ప్రకారంగా, రైతుల సమస్యలు అవగాహన లేనివారు, రైతులు కాని వారు రైతుల సమస్యలు మాట్లాడుతున్నట్లుగా చదివి వినిపించారు. నేను అనుకునేదేమిటంటే, ఎవరికి ఎంత అవగాహన ఉంది, ఎవరికి ఎంత అనుభవం ఉంది. ఎవరు రైతు, ఎవరు రైతు కాదు, డిక్షనరీలో రైతంటే ఎవరు అన్నది చెప్పాలంటే చాలా సమయం పడుతుంది. సమయాన్ని నేను వృథా చేయదలచుకోలేదు. నార్మల్‌గా మా ప్రాంతంలోని గ్రామాలలో ఉన్న భూస్వాములు మాట్లాడే పద్ధతిలో వారు మాట్లాడుతున్నారు. నిజంగా మేమెంతో హర్ట్ అయ్యాము. లేదూ, పంచ కట్టుకొన్నవారు రైతు, పాంటు వేసుకున్న వారు రైతు కాదు అంటే అది ప్రోపర్ కాదు. వారు ఈ సందర్భంలో చెప్పవలసింది కాదు. ఈ సందర్భంలో చదవాల్సింది ఇది కాదని చెప్పదలచాను. వారు ఈనాడు ఎన్నో విషయాలు చెప్పారు. అవన్నీ ఫుల్‌ఫిల్ కావాలని కోరుతున్నాను. ఒకవైపు రాష్ట్రంలో నీరుంది. రెండవ వైపు నీటిని దాచుకోలేని పరిస్థితి ఉంది. ఉన్న ఇబ్బందులను అధిగమించాలి. ఇంకా బాగా చేయాలని కోరుతున్నాను. అది సక్సెస్ కావాలని కోరుతున్నాను. ప్రాక్టికల్‌గా మనం మాట్లాడేదానికి, వాస్తవానికి రియలిస్టిక్‌గా ఉండాలి. దేనికయినా ఫండింగ్ కావాలి. టెక్నికల్‌గా సపోర్టింగ్ స్టాఫ్ కావాలి. ఈ రెండూ ప్రభుత్వంలో కొరతగా కనబడుతోంది. ఎల్లంపల్లి శంఖుస్థాపన చేస్తామన్నారు. రూ.15 కోట్లు పెట్టారు. పోలవరంకి రూ.1 కోటి పెట్టారు. ఇచ్చంపల్లికి రూ.1 కోటి పెట్టారు. ఈ విధంగా గోదావరి పైన ఉన్న ప్రాజెక్టులన్నీ ఒకటి, రెండు కోట్లు పెట్టి 3,000 టియంసి నీళ్లు తెస్తామని, ప్రయత్నం చేస్తున్నామని మాట్లాడారు. ఏ ధైర్యంతో మాట్లాడినా, మాకు ఎవరికి తెలియకుండా ఏదయినా ఫండింగ్ ఏజెన్సీవారు అరేంజ్ చేస్తూ ఉంటే, మేము తప్పకుండా వారిని గౌరవిస్తాము. ఇక నేను చెప్పేదేమంటే గోదావరికి సంబంధించి రెండు ఇష్యూస్ ఉన్నాయి. సురేష్ ప్రభుగారి నాయకత్వంలో ఇంటర్ లింకేజ్ వచ్చినప్పుడు మేము ఒక ఆబ్జక్షన్ రెయిజ్ చేసాము. ఎట్టి పరిస్థితిలోనూ గోదావరిని వెనకబడిన ప్రాంతాలకు ఇవ్వాలి. దాదాపు 80 శాతం వరకూ గోదావరి నది తెలంగాణా జిల్లాల నుండి పోతుంది. తీవ్ర దుర్భిక్ష ప్రాంతమైన తెలంగాణా ఎట్టి పరిస్థితిలోనూ ఎంటైర్ ప్లాన్ చేంజ్ చేస్తే తప్ప ఒప్పుకోమని చాలా క్లియర్‌గా చెప్పాము. ఆ విధంగా ప్లాన్ చేసి ఆ బ్యాక్ గ్రౌండ్‌లో మాట్లాడుతున్నారా, లేదూ, ముఖ్యమైన ఫైనాన్స్ ఏజెన్సీల ద్వారా అప్రోచ్ అవుతున్నామంటే, ఆ ధైర్యం ఉంటే, మేము తమ ద్వారా వారిని కోరేదేమంటే, ఎట్టి పరిస్థితులలో అయినా ఈ ఆప్‌ల్యాండ్‌లో ఉన్న ప్రాజెక్ట్ ఖచ్చితంగా ఈ ప్రాంతంలో ఇస్తున్నాము. పోలవరం కూడా కావాలి.

కాకపోతే ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులపై మీరు క్లారిటి ఇవ్వాలి. లిఫ్ట్ తప్ప మరో అవకాశం లేదు. ఖచ్చితంగా లిఫ్ట్ చేయాల్సింది. ఇచ్చంపల్లి కట్టినా లిఫ్ట్ చేయాల్సిందే. లిఫ్ట్ ఒకటే దీనికి ప్రత్యామ్నాయం. గోదావరి వాటర్ ఒక్కటే నేడు అందుబాటులో ఉంది. మూడు సంవత్సరాలుగా గ్రాఫ్ట్ వర్క్ జరిగింది. స్పెసిఫిక్ ప్రాజెక్టు మీ దగ్గర ఉంది. ఫైనాన్సెస్ గురించి

ప్రయత్నం చేయండి. వాటర్ అవైలబిలిటీ లేదు లిఫ్ట్‌కి పవర్ కావాలని అంటున్నారు. పవర్ విషయం ప్రాజెక్టు ఇంటర్నల్ పార్ట్‌గా చేయండి. పవర్ ప్రాజెక్టు కాస్ట్ కూడా ఇంటర్నల్‌గా, ప్రాజెక్టు కాస్ట్‌గా వేయండి. డ్యామ్స్ యొక్క స్ట్రక్చర్ కట్టాలంటే డబ్బు అవుతుంది. లిఫ్ట్‌కి డబ్బు అనవసరం లేదు. పవర్‌ని ఇంటర్నల్ పార్ట్‌గా చేయాలి. ఆ విధంగా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని అడుగుతున్నాను. టైమ్ బౌన్డ్ ప్రోగ్రామ్ ఏమిటి? ఫైనాన్స్ ఏమిటి? క్లియరెన్సెస్ చాలా వరకు ఉన్నాయి వీటిపైన దృష్టి ఎట్లా కేంద్రీకరిస్తున్నారు? తెలంగాణా జిల్లాల్లోని ఈ అప్ ల్యాండ్స్ పై ఎట్టి పరిస్థితుల్లోనైనా వాటర్ రావాలి. ఆ తరువాత ఇంటర్ లింకేజీ గురించి ఆలోచన చేయాలి. ఆ పద్ధతిలో ఇంటర్ లింకేజీ గురించి ఆలోచన చేయండి. లిఫ్ట్ కావాలంటే, ఏ శ్రీశైలం ఇద్దామో, ఇంకో అప్‌ల్యాండ్ తీసుకొని వెళదామో అని కాదు. ఈ ప్రాంతంలో ఖచ్చితంగా లిఫ్ట్ కావాలి. కావల్సినంత వాటర్ ఇచ్చంపల్లి, దేవాదుల దగ్గర ఉంది. 150 నుండి 200 టి.ఎమ్.సి.ల నీటిఫ్లో ఉంది. దానిని లిఫ్ట్ చేయడానికి కాంప్రెహెన్సివ్ ప్రోగ్రామ్ ఏమైనా చేశారా? చేస్తే ఏ దశలో ఉంది? అటువంటి ఆలోచన ఉందా? ఒక్క పోలవరం కడతామని, ఇచ్చంపల్లికి పర్మిషన్ లేదు, ఇంటర్ స్టేట్ సమస్యలు ఉన్నాయని దాటవేసే ప్రయత్నం చేస్తారా? ఈ విషయాలు స్పష్టం చేయాలని కోరుతున్నాను.

# రైతులకు కనీస మద్దతు ధర

18-3-2005

స్పీకర్ సార్, ఇదే హౌస్‌లో మనం చాలా సార్లు రైతులకు కనీస మద్దతు ధరల గురించి డిబేట్ జరుపుకున్న సందర్భంలో మేము దానిపైన ప్రస్తావన చేసినప్పుడు స్పీకర్ గారు మీరు అగ్రికల్చర్ డిమాండ్లపై జరిగే చర్చలో లేవనెత్తినప్పుడు దీనిపై మీకు చాలా క్లారిటీగా, శాటిస్ఫాక్టరీగా క్లారిఫికేషన్స్ వస్తాయని పదే పదే చెప్పారు. కాని ఇప్పుడు మంత్రి గారిని చూస్తే వాటి గురించి వన్ మినిట్ కూడా చెప్పకుండా ఏవో ఒకట్రెండు విషయాలు మాత్రం చెప్పికూర్చున్నారు. It is a major issue సార్. మన రాష్ట్రంలో మిర్చి రైతులు, పత్తి రైతులు కనీస మద్దతు ధర లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా మనం చూస్తున్నాం. ఇప్పటికే రెండు వేల కోట్ల రూపాయలు మన రైతాంగం నష్టపోయిన పరిస్థితి వుంది. కనీసం ఇప్పటికైనా వాళ్లకు కనీస మద్దతు ధర దొరకకుంటే మరో రెండు వేల కోట్ల రూపాయల వరకు నష్టపోయే పరిస్థితి కనపడుతున్నది. ఎందుకంటే వీటికి సంబంధించి ధరలు చూస్తుంటే రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. కనుక రైతాంగానికి కనీస మద్దతు ధరలను కల్పించే విషయంలో ఏమి చేయదలచుకున్నారు? ఎట్లా కొనబోతున్నారు? ఎప్పుడు కొనబోతున్నారు? దీనికి ఎక్కడెక్కడ ఏయే యార్డ్స్‌లో బ్రాంచీలు ఓపెన్ చేయబోతున్నారు? ఎంత డబ్బు దీనికోసం కేటాయించ బోతున్నారు? వీటిని ఏరకంగా కొన బోతున్నారు? కొనడానికి ఇప్పటికే ఏమి ఏర్పాట్లు చేశారు? ఇలాంటి విషయాలన్నీ చాలా స్పష్టంగా చెప్పాలి కద సార్? ఎందుకంటే We are under the impression that అగ్రికల్చర్ డిమాండ్లపై చర్చ జరిగే సందర్భంలో మేజర్‌గా దీనిపైన మంత్రి గారు ఎంతో క్లారిటీ ఇస్తారని చెప్పి మేం ఆశించాం. కాని దాని మీద ఏదో రొటీన్‌గా ఒకట్రెండు విషయాలు మాత్రం చెప్పి

కూర్చున్నారు అధ్యక్షా. ఇది దారుణం. నేను గౌరవ అగ్రికల్చర్ మినిస్టర్ గారిని అడగ దలచుకున్నదేమంటే మీరు టోటల్ డీటెయిల్స్ ఇవ్వండి. ఎప్పటి నుండి పర్చేజ్ చేయ దలచుకున్నారు? ఎందుకంటే ఇప్పటికే మన రైతాంగం రెండు వేల కోట్ల రూపాయల వరకు నష్టపోయారు. మరో రెండు వేల కోట్ల రూపాయల వరకు నష్టపోయే పరిస్థితి కూడా ఈనాడు మనకు కనపడుతున్నది కాబట్టి మీరు మార్కెట్‌లో ఎప్పటిలోగా ఎంటర్ అవుతారు? దీని కోసం ఎంత డబ్బు కేటాయించనున్నారు? ఏయే సెంటర్స్‌లో కొనదలచుకున్నారు? వీటి గురించి స్పష్టంగా చెప్పాలి. దానిపైన మేము ఏదైనా క్లారిఫికేషన్స్ అడుగుతాం. అది చెప్పకుండా ఏదో ఒకటి రెండు, విషయాలు మాత్రం రొటీన్‌గా చెప్పి కూర్చోవడం అనేది దారుణం అన్యాయం, అధ్యక్షా. అట్లా కాకుండా మేము అడిగిన అన్ని విషయాలపైన క్లారిటీ ఇవ్వాలని గౌరవ వ్యవసాయశాఖ మంత్రి గారిని నేను కోరుతున్నాను.

# వరికి మద్దతు ధర

20-11-2007

అధ్యక్షా! ఈ రోజు రైతాంగం ఆందోళనతో ఉన్నారు. అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ధర కావాని కోరుతున్నారు. ఇంత జరిగిన తరువాత అధికార పార్టీ మేము ఏదో కావాలని అన్నట్లుగా ముందుకు వచ్చినట్లు పత్రికా ప్రకటన ఇచ్చారు. అటువంటప్పుడు ఇంత చర్చ జరిగినా, ఈ సెషన్ మొత్తంలో అంతా చూస్తే దాని మీద చర్చ జరుగుతోంది. వరికి రూ. 1,000 మద్దతు ధర కావాలని, పత్తి, ఇతర పంటలు చర్చకు ఉన్నాయి. వాటి మద్ధతు దర మీద చర్చ జరుగుతోంది. దీనికి ఏదో రకమైన సరైన సమాధానం ఇవ్వాలి. వారు మైక్ తీసుకున్నప్పుడు మమ్మలను తిట్టడానికే తీసుకుంటారు మీరు ఏమి చేశారు. మేము ఏమి చేశామని చెప్పుకోవడానికి ఈ విధమైన పద్ధతి ఎంతవరకూ సమంజసంగా ఉంటుంది. ప్రభుత్వం ద్వారా స్పష్టమైన సమాధానం రావాలని తమ ద్వారా కోరుతున్నాను. రూ. 1,000 మద్ధతు ధర ఇవ్వడానికి సరైన విధంగా స్పందించి ఆ విధంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువస్తాము లేకుంటే సరైన ఏర్పాటు చేస్తామని చెబుతారా? ఇదే విధంగా మిగతా వ్యవసాయోత్పత్తులు పత్తి, వేరుశనగ, చెరకు, మొక్కజొన్న వీటి పరిస్థితి ఏమిటి? రైతు ప్రభుత్వం మాది, రైతులను మేము ఉద్ధరిస్తామని చెబుతున్నారు. మూడున్నర సంవత్సరాల వారి పరిపాలనలో 4,000 మంది ఎందుకు చనిపోయారు? రైతుల పరిస్థితి రోజురోజుకూ ఎందుకు దిగజారిపోతోంది. అనేక యజ్ఞాలు చేసామని అంటున్నారు. ఇన్ని వర్షాలు పడినా, వరిసాగు తగ్గుతోంది. రేపు వారు , మేము తినడానికి తిండి లేని పరిస్థితులు రాష్ట్రంలో, దేశంలో వస్తాయి. కనీస మద్ధతు ధర ఇవ్వకపోతే ఇబ్బందులు వస్తాయని అందరూ ఆందోళన చేస్తున్నాము. అది వదలిపెట్టి ఎదురుదాడి చేసి రెండుమాటలు చెప్పి అసెంబ్లీ మొత్తం మీద అయిందని చెప్పి దీనిని క్లోజ్ చేసి బయటపడదామని చెబుతున్నారు. ముఖ్యమంత్రిగారు సమాధానం నిన్న ఎలాబరేట్‌గా చెప్పి మాకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన తరువాత అందరం కలిసి ఢిల్లీకి వెళదామని అంటే బాగుంటుంది. ఎందుకంటే ఉత్తర భారతదేశంలో అందరూ

అలా చేశారు. రూ.1,000 గోధుమలకు సంబంధించి చేశారు. వీరికి ఎందుకు చేతకావడం లేదు? వారి పార్టీ మంత్రులు, ఎం.పీ.లు లేరా? ఏదైనా అడగమనండి. స్వామినాథన్ కమిటి రిపోర్ట్ చూసి చెప్పమనండి. ఏ బేసిస్ మీద అక్కడ ఎక్కువ ఇస్తారు, ఏ బేసిస్‌లో మనం తక్కువ ఇస్తామనేది అడగడం లేదు. మేమే కాదు. అన్ని పక్షాలు అడుగుతున్నాయి. ఈ రోజు వారి పద్ధతి ఎలా ఉందంటే, గంటకో తీరుగా. ఇక్కడ అసెంబ్లీ నడుస్తూ ఉంటే, బయట ముఖ్యమంత్రిగారు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి రూ. 750 కరెక్ట్ , అంతకన్నా ఎక్కువ ఇవ్వము. గోధుమలకు ఈ సంవత్సరానికి ఇచ్చామని తప్పుదారి పట్టించే విధంగా వుంది. వారు పంపించే ప్రతిపాదనలలో వారికి ఎక్కడ కూడా చిత్తశుద్ధి లేదు. ఈనాడు ప్రతిపక్షం మొత్తం, రైతాంగం మొత్తం ఆందోళన చెందుతున్నారు. ఉద్యమం జరుగుతుంటే, అప్పుడు వారు కళ్లు తెరచి మేము రూ. 1,000 ఇవ్వలేమని వారు మాట్లాడుతున్నారు. ఆదే ఎం.పి.లు చెబుతున్నారు. వారి మంత్రులు మాట్లాడుతున్నారు. వారి పార్టీకి చెందిన ఒక యం.పి. అయితే నేను ముందుకు వస్తాను పోదాం పదండి, రైతులారా మనం రోడ్డున పడదాం, ఢిల్లీలో ఎందుకు ఇవ్వరని చెప్పి. ఈనాడు వారి పార్టీ ఎం.పీ. చెప్పినా వారు ఎందుకు ముందుకు రారు. ప్రభుత్వ పరంగా ఏమి చొరవ తీసుకుంటున్నారో చెప్పమనండి. ఈ విషయాలు చెప్పకుండా, హరికథలకు పోయి ఇక్కడ వారిని మేము, మమ్ములను వారు తిట్టి, అసెంబ్లీ మూసివేసుకొని పిల్లల మాదిరిగా అల్లరి చేసే కార్యక్రమం కింద చేయడానికి కాదు. ఇది బ్రతుకు తెరువు సమస్య, జీవన్మరణ సమస్య. అర్థం చేసుకొని దానికి జవాబు చెప్పమనండి. ఇస్తారా, ఇప్పించ గలుగుతారా, వారికి చేతనవుతుందా, లేకుంటే వారికి చేతకాక పోతే మమ్ములను తేల్చుకోమంటారా చెప్పాలని కోరుతున్నాను. ఏదో హరికథ చెప్పి తప్పుదారి పట్టించవద్దని తమ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

# ఎరువుల సమస్యలు

16-02-2008

స్పీకర్ సర్, మా సభ్యులు చాలా స్పష్టంగా ఎరువులు దొరకకుండా రైతాంగం చాలా ఇబ్బందులు పడుతున్నారని, అదనంగా డబ్బిచ్చి కొందామన్నా ఎరువులు వేరే రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, పేరుకు మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో లక్షల టన్నుల ఎరువులు దొరుకుతున్నాయని చెబుతున్నారు కాని రైతాంగానికి మాత్రం అవసరమైన ఎరువులు దొరకడం లేదని చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఏదో ఒక జిల్లాలోనో, ఒక ప్రాంతంలోనో ఎరువుల సప్లై లేకపోవడం వల్ల దొరకడం లేదంటే అర్థం చేసుకోవచ్చు కాని యూనిఫామ్‌గా అన్ని ప్రాంతాలలో ఇదే పరిస్థితి వుందని రాష్ట్ర వ్యాప్తంగా వార్తా పత్రికలలో వచ్చింది. రైతాంగం ఆందోళన చెందుతున్నా ఎవరూ సరిగా పట్టించుకోలేవడం లేదు. భవిష్యత్తులో కొంటాం, బఫర్ స్టాక్ పెడతాం అని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల రైతాంగం ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేస్తామన్న హామీ ఇవ్వడం లేదు. ఇవ్వడమే కాదు దానిని ఆచరణలో కూడా పెట్టాలి. మీరు హామీలు ఎన్నో ఇస్తారు. కాని వాటిని ఆచరణలో పెట్టడం లేదు. అయితే మీరు సప్లై ఎక్కువ పెట్టాం అని తప్పుదారి పట్టించే పద్ధతుల్లో మాట్లాడుతున్నారు. కాని వాస్తవాలు ఇంకొకరకంగా వున్నాయి. రైతులకు సరియైన ఎరువులు టైమ్‌లో కావాలి. ఏ టైంలో అవసరమైన ఎరువులు ఆ టైంలో అవసరమైన మేరకు ఇవ్వకుంటే దాని ఉపయోగమే వుండదు. కనుక ఆ విధమైన చర్యలు చేపట్టాలని మంత్రి గారిని డిమాండ్ చేశాము. దానిపై మంత్రి గారిని సమాధానం చెప్పమనండి. వారు సరియైన జవాబు చెబితే మేము కూర్చుంటాము. మా దగ్గర జవాబు లేదు మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి అంటే మేము మా ప్రొటెస్ట్ రిజిస్టర్ చేస్తాము. Let him first

react.

దురదృష్టం అధ్యక్షా, మా ప్రొటెస్ట్ రిజిస్టర్ చేయవలసివస్తోంది. అధ్యక్షా, ఒక విషయాన్ని మంత్రి గారిని అడగదలచుకున్నాను. మా తొమ్మిది సంవత్సరాల పాలనలో ఎప్పుడూ అడ్వాన్స్ ప్లానింగ్ అంటూ జరిగేది. ఎక్కడెక్కడ అవసరాలు ఏవిధంగా వున్నాయో దానికి తగ్గట్టుగా ఎరువుల ఫ్యాక్టరీల నుండి, చెప్పాలి సర్, అసలు వీళ్లు ఎంత అసమర్థతతో పని చేస్తున్నారో చెప్పాల్సిన అవసరమున్నది. **రైతాంగానికి అవసరమైన ఎరువుల సరఫరా గురించి పట్టించుకోవడం లేదు. ఎరువుల షార్టేజ్ వున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అవి బ్లాక్ మార్కెట్‌లోకి తరలిపోతున్నా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.** ఈనాడు ఎరువుల ఫ్యాక్టరీ వాళ్లు, డీలర్లు కుమ్మక్కై కృత్రిమమైన షార్టేజ్‌ను క్రియేట్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ మన దగ్గర రైతాంగానికి దొరకకుండా చేస్తున్నారు. ఎవరైనా పోయి అడిగితే అవసరం లేని వాటిని టైఅప్ చేసి వాటిని కూడా తీసుకోవాలన్న పద్ధతుల్లో మాట్లాడుతున్నారు. ఏ మాత్రం వాటిపైన రాష్ట్ర ప్రభుత్వానికి నియంత్రణ లేదు. ఈనాడు కేంద్ర ప్రభుత్వం కాని, రాష్ట్ర ప్రభుత్వం కాని నిస్సహాయంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు.

ఇప్పటికైనా సమగ్రమైన, సరియైన ప్రణాళిక లేకుండా ఏదో గాలి మాటలు మాట్లాడే పద్ధతుల్లో చేస్తున్నారు. 1989లో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు ఎరువుల షార్టేజ్ ఏర్పడింది. అప్పుడు అడిగితే లాఠీ చార్జ్ చేయించారు. ఇవ్వాళ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గత మూడేళ్లలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ప్రత్యేకంగా ఈ సంవత్సరం మరింత ఇబ్బంది ఏర్పడింది. ఎరువుల ఫ్యాక్టరీలు, డీలర్లు కుమ్మక్కై రైతాంగానికి ఇబ్బందులు కలిగిస్తూ వుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిపై నియంత్రణ చేసేందుకు ఎలాంటి ప్రణాళికలు లేకుండా నిస్సహాయతను, నిర్లక్ష్యాన్ని చూపిస్తున్నందుకు మేము నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాము.

# సహకార సంఘాల బిల్లు

21-6-2004

అధ్యక్షా! ఈ రోజు మా రామకృష్ణుడుగారు లేవదీసింది యాక్టుకి సంబంధించిన, బిల్లుకి సంబంధించినది. మేము మా అభిప్రాయం చెబుతాము. But the procedure we are talking. What kind of procedure they must follow కనీసం మీరు కూడా చెప్పాలి. Let them follow the procedure. ప్రాక్టీసెస్ ఉన్నాయి. అవేమీ లేకుండా మా ఇష్టానుసారం ఎప్పుడు ఆలోచన వస్తే అప్పుడు వెంటనే ప్రకటనలు చేస్తామని అంటే ఎట్లా? ఎప్పుడు ఆలోచన వస్తే అప్పుడు చేస్తాం అంటే ఎలా? పబ్లిక్ మీటింగులో చెప్పినట్లు శాసనం అంటే ఎలా? స్పీకరు గారూ, ఫస్టు బిల్లు ఇంట్రడ్యూస్ చేయడంలో రెండు లాంగ్వేజెస్‌లో చేశారు.

What is Bill? It is not a debate. They are going to pass the Bill. ఎప్పుడయితే బిల్ పాస్ చేస్తున్నామో అప్పుడు ఫండమెంటల్‌గా బిల్ లో ఉన్న డిఫెక్ట్స్‌ను కనీసం మంత్రి గారు తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడం లేదు. Let him verify whether the English version covered 'Co-operative institutions'. నిజంగా కోపరేటివ్స్‌ను ఇందులోకి తీసుకు రాదలచుకుంటే he must first Introduce the amendment. ఆ విషయం చెప్పమనండి. టోటల్‌గా డిఫెక్టివ్ బిల్ పెడితే ఎలా?

అధ్యక్షా! ఎప్పుడైనా బిల్లు ఇంట్రడ్యూస్ చేసేటప్పుడు టోటల్‌గా క్లాజ్ వారిగా తమరు సమీక్ష చేస్తారు. బిల్లు ఇంటర్‌డక్షన్‌లో ఇంగ్లీష్ వర్షన్ ఎగ్జంప్షన్ ఇస్తామని స్పష్టంగా చెప్పారు. ఇన్‌సిస్ట్యూషన్ ఆఫ్ ద క్రెడిట్ కాకుండా ఇటీజ్ టోటల్లీ ప్రయివేట్ ఇన్‌సిస్ట్యూషన్స్, వాళ్ల ఆబ్జెక్టివ్స్‌లో

కూడా చెప్పారు. తెలుగు వర్షన్ ఆబ్జెక్టివ్స్‌లో పెట్టారు. తెలుగులో సహకార సంఘాలతో సహా అని చాలా స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం నిజంగా సహకార సంఘాలను ఇందులో ఇన్‌క్లూడ్ చేయదల్చుకుంటే మాకు అబ్జక్షన్ లేదు. We welcome it. We will give amendment for that. Let them clarify. What is the intention of the Government? ఆ ఇన్‌టెన్షన్ కరెక్టు లేకుండా, మీరు క్వొశ్చన్ అడగండి, నేను క్లారిఫికేషన్ ఇస్తాను అంటే ఎలా క్లారిఫికేషన్ కాదు, బిల్లు పాస్ చేయబోతున్నాము. తెలుగు వర్షన్‌లో పాస్ చేయబోతున్నామా? ఇంగ్లీష్ వర్షన్‌లో పాస్ చేయబోతున్నామా? ఫండ్‌మెంటల్‌గా బిల్లులో ఉన్న ఉద్దేశ్యం ఏమిటో క్లాజ్ వారిగా we have to discuse. It is not just for technicalities.

అధ్యక్షా మంత్రిగారు నాన్ సీరియస్‌గా ఈ బిల్లు ప్రవేశపెట్టారు. మంత్రులు ఒక బిల్లు ప్రవేశపెట్టేటప్పుడు క్లాజ్ వారిగా చదువుకుని సంతకాలు పెడతారు.

స్పీకర్‌గారు తమరు కొంచెం అర్థం చేసుకోవాలి. ఎప్పుడైతే చట్టం చేయబడుతుందో, దానియొక్క ప్రభావం ఉండబోతోంది. ఇందులో వారు చెబుతున్నట్లు క్లాజ్ 4 ఒకసారి మీరు చూడండి, వారు ఏమి చెప్పారో, సహకార సంఘము లేక ఋణదాత లేక వడ్డీ వ్యాపారి నుండి వ్యవసాయము మరియు వ్యవసాయ భూమిసాగు నిమిత్తము తీసుకొనిన లేక బాకీపడిన ప్రతియొక్క ఋణముపై వడ్డీతో సహా ఈ చట్టము ప్రారంభమైన తేది నుండి ఆరు మాసముల కాలవ్యవధి వరకు ఋణముల చెల్లింపు నిలుపుదలను ప్రకటించవలెను. ఇక్కడ మీరు చూస్తే అసలు క్లాజ్ చదవకుండా ఇక్కడకు వచ్చేసి బిల్లు పాస్‌చేయండి అని చెప్పారు. ఈ ముఖ్యమైన సమస్యను ప్రభుత్వం నాన్ సీరియస్‌గా తీసుకుంటున్నారు. అవగాహన లేకుండా ఇక్కడకు వచ్చారు.

There is a contradiction between two sections.

స్పీకర్‌గారూ, వారు క్లాజ్-3 ఒక్కసారి చదవమంటున్నారు. క్లాజ్-3లో ఒకటి చెప్పి, క్లాజ్-4లో మరొకటి చెప్పి ఈ సభలో బిల్స్ పాస్ చేయాలంటే అసలు ఏ క్లాజెస్ తీసుకోవాలి? జనం ఏమనుకుంటారు? కోర్టుకు వెళితే ఈ చట్టం నిలుస్తుందా?

అధ్యక్షా! గౌరవసభ్యులు గత 10 సంవత్సరాలలో 3000 మంది రైతులు ఈ రాష్ట్రంలో చనిపోయారని వారు చెబుతున్నారు. మేము చాలా క్లియర్‌గా వారి ప్రభుత్వం వచ్చిన తరువాత 462 మంది చనిపోయారని గ్రామాల వారీగా, పేర్లు, అడ్రసులతో సహా ఈ రోజు మేము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము. ఆల్రెడి ఆ సమాచారం ఇచ్చాము కూడా. 3000 మంది చనిపోయారని వారు చెబుతున్నారు. గవర్నమెంటు వారి చేతిలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వారి యొక్క మిత్ర పక్షం ఇద్దరూ కలసి ఉన్నారు. ఆ 3000 మంది ఎక్కడి వారు? ఆ ఫిగర్ ఎక్కడి నుంచి వచ్చింది? ఆ పర్టిక్యులర్స్ ఎక్కడి నుండి వచ్చాయి? చెప్పండి. Government is in your hands. ఇక్కడ రాజకీయంగా ఉపన్యాసాలు చేసుకుని లేనిపోని నెంబర్ చెప్పి ప్రజలతో లేనిపోని అనుమానాలు రేకెత్తించే విధంగా చెబుతున్నారు. ఆ తప్పుడు ఫిగర్ ఎక్కడినుంచి

వచ్చిందో చెప్పమనండి.

అధ్యక్షా! రెవెన్యూ మినిస్టరు గారు మాట్లాడుతూ, నేను మూడు వేల మంది వివరాల గురించి, ఇంతకు ముందు బాగా కోపం చేశానని అన్నారు. గవర్నమెంటుని అడిగితే గత ప్రభుత్వ హయాంలో 9సంవత్సరాలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ప్రధానమైన రాజకీయాంశంగా మొన్న ఎన్నికలలో చేశారు. ఈ రోజు ప్రభుత్వం మీ చేతుల్లోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వమూ, మనమందరమూ కూడా తెలుకోవాలి. ఎంత మంది చనిపోయారు? మూడు వేలు, నాలుగు వేలు అంటున్నారు. సోనియా గాంధీ గారిని అనంతపురం తెచ్చారు. పెద్ద రాజకీయం చేశారు. మేము ఆ రోజు నుంచి చెప్పాము, వినిపించుకోలేదు. ఎన్నికలలో ప్రధానమైన అంశంగా చేశారు. ఎంతమంది రైతాంగం చనిపోయారు? ఈ రోజు మేము లిస్టు ఇచ్చాము, 466 మంది చనిపోయారని, వారి అడ్రసులు, పేర్లు, గ్రామాలతో సహా. మీ ప్రభుత్వం వచ్చేక జరిగిన వాటి వివరాలు ఇచ్చాము. అది కూడా వెరిఫై చేయండి. ఖచ్చితంగా ఎంతమంది చనిపోయారో దయచేసి స్పష్టం చేస్తారా? So that people must know. ఈ విధంగా మిస్లీడ్ చేసి, ఏదో జరిగిపోయిందని కాదు. అది ఎంతవరకూ వాస్తవమో మీరిప్పటికైనా చెప్పండి.

# విద్యుత్ రంగం

**20-7-2004**

స్పీకర్ సార్, ఈరోజు ముఖ్యమైన, అతి కీలకమైన సెక్టారు గురించి మనం డిబేట్ చేస్తున్నాం కాబట్టి క్లారిఫికేషన్స్‌కు టైము ఇవ్వడమన్నది చాలా అవసరం. పవర్ చాలా కీలకమైన సెక్టార్. పెద్దలు రోశయ్యగారు చాలా విషయాలు చెప్పారు, మేము రిక్వెస్ట్ చేసేదేమంటే, ఇది చాలా ముఖ్యమైన సెక్టార్, టోటల్‌గా మన రాష్ట్ర భవిష్యత్తు, మన రాష్ట్ర ఎకానమీ అంతా కూడా ఆధారపడిన సెక్టారు కాబట్టి దీన్ని చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలని కోరుతున్నాం. వాళ్లు చాలా విషయాలు చెప్పారు. గౌరవ ముఖ్యమంత్రిగారు సభలో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ సభ ముందు పెట్టిన ఆ స్టేట్‌మెంటులోని నాలుగవ పేజీలో చాలా క్లియర్‌గా చెప్పారు.

" In 2002 when the Government of India Commissioned the first rating exercise for the power sector, AP stood first amongst all states based on several financial, operational, commercial and Government initiatives based analysis by CRISIL, a reputed independent rating agency. In 2003, AP continued to rank high and stood very close second to Delhi. The ranking of AP is likely to be restored to number one place after completion of examination of certain parameters wrongly interpreted by CRISIL.

పవర్ సెక్టారులో ఎవరు ఒప్పుకున్నా ఎవరు ఒప్పుకోకపోయినా కొన్ని బాధలున్నా, ఆంధ్రప్రదేశ్ యావత్ భారతదేశంలోనే పవర్ రిఫామ్స్‌లో, పవర్‌కు సంబంధించి వచ్చిన అనేక

మార్పులలో We are leaders అనే వాస్తవాన్ని మీరు కూడా అంగీకరించారు. దీంట్లో చాలా మార్పులు తీసుకొన్నాం. చాలా ఇబ్బందులు పడ్డాం. వాస్తవాన్ని ఈ రోజు రోశయ్యగారు ఒప్పుకున్నారు. మీరు రైతాంగానికి ఫ్రీ పవర్ ఎనౌన్స్ చేశారు. అదే విధంగా కరెంట్ పాత బకాయిలు మాఫీ చేశారు. మేము రైతుల ముక్కుపిండి కరెంటు ఛార్జీలు వసూలు చేశామని మీరంతా చెప్పారు. మేము నిజంగా ఆ విధంగా రైతుల ముక్కు పిండి వసూలు చేసుంటే రూ. 1300 కోట్ల బకాయిలు ఉండేవి కావు కదా! అగ్రికల్చర్ సెక్టారులో ఆరోజు పవర్ డిమాండ్ రూ. 250 కోట్ల నుంచి రూ. 350 కోట్లుంది. నిజానికి ఆ రోజుల్లో మేము అందరి దగ్గర నుంచి వసూలు చేసి వుంటే రూ.1300 కోట్ల బకాయి వుండేది కాదు కదా. ఆ రోజు రైతుల బాధలు గుర్తించి, వారిని ఎక్కువగా ఇబ్బందులు పెట్టకుండా దాన్ని పోస్ట్‌పోన్ చేస్తూ వచ్చాం. మీరు వచ్చిన తర్వాత బకాయిలను మాఫీ చేశారు. అది కూడా కాగితం మీద మటుకే చేశారు. మీ పాలసీ ప్రకారం చేశారు. అయితే మా రిక్వెస్ట్ ఏమంటే, ఇది ఎంతో కీలకమైన సెక్టార్. ఐదు సంవత్సరాల తర్వాత ఇటువంటి కామెంటునే వ్రాసుకుంటే చాలు మాకు. మీరు ఈ పవర్ సెక్టారును ఖచ్చితంగా పాడు చేస్తారనే అనుమానం మాకుంది. ఈ సెక్టారును పాడు చేయబోతున్నారు దీనిపై టోటల్ అవగాహనతో మీరు పోవడం లేదు. I want to go on record on this date. వచ్చే సంవత్సరాలలో మాట్లాడుకోవచ్చు, మీరు రెండు నెలల నుంచే అధికారంలో వున్నారు కాబట్టి వేరే వాటిల్లోకి వెళ్లడం లేదు. కాని గ్రామాలలో ఆల్‌రెడీ crisis start అయింది. సరైన మేనేజ్‌మెంట్ మీరు చేయడం లేదు. సరైన రెగ్యులేషన్ లేదు, అథారిటీస్ అన్నీ పోతున్నాయి. ఎవరి ఇష్టానుసారంగా వారు వ్యవహరిస్తున్నారు. పవర్ సెక్టార్ కొలాప్స్ అయ్యే పరిస్థితి, ప్రమాదం మెల్లమెల్లగా కనబడుతోంది. కనీసం ఇప్పటినుంచైనా సిస్టమేటిక్‌గా చేయకపోతే మీరు ఇచ్చే ఫ్రీ పవర్ కారణంగా మొత్తం సెక్టారే కొలాప్స్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సెక్టార్‌లో తీసుకున్న రీఫామ్స్‌ను కంటిన్యూ చేస్తామన్నారు, దానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను కాని సిన్సియర్‌గా మీరు ఎఫర్ట్స్ పెట్టకుంటే ఈ సెక్టారంతా పాడవుతుంది.(అంతరాయం) టోటల్‌గా మాకు ఒక కొత్త సిద్ధాంతాన్ని చెప్పారు రోశయ్యగారు. అనుభవజ్ఞులైన రోశయ్యగారు మాట్లాడితే నేను వింటున్నాను. సబ్సిడీ ఎందుకు ఇస్తున్నారంటే, లాసెస్ వస్తున్నాయి కాబట్టి సబ్సిడీ ఇస్తున్నామని వారు చెబుతున్నారు. రోశయ్యగారు చెప్పిన సందర్భంలో నాలుగు లక్షల అగ్రికల్చరల్ కనెక్షన్స్ లేవు. ఈ రోజు 23 లక్షల అగ్రికల్చరల్ కనెక్షన్స్ ఉన్నాయి. 29.5 శాతం పవర్ కన్‌జంప్షన్ అగ్రికల్చర్ సెక్టారుకే పోతోందనే సంగతిని మీరు మరచిపోవద్దు. అంత పెద్ద ఎత్తున ఇస్తున్నపుడు ఈ క్రాస్ సబ్సిడీ పెంచి ఇస్తున్నామే తప్ప మరొకటి కాదు. ఆ విషయాలు తర్వాత చర్చించుకుందాం. మా రిక్వెస్టల్లా ఏమంటే, ఈ సెక్టారు కొలాప్స్ కాకుండా కాపాడితే చాలు. కొత్తగా యాడ్ చేయకున్నా కొలాప్స్ కాకుండా తగు విధంగా చర్యలు తీసుకోవాలని రిక్వెస్ట్ చేస్తున్నాం. నేను ఇప్పుడే ఏ క్లారిఫికేషన్స్ అడగను, next year budget సమయంలో చాలా క్లారిఫికేషన్స్ అడుగుతాను. ఇప్పుడు కేవలం వాళ్లను రిమైండ్ చేస్తున్నాను. record purpose కోసం నేను మీ ముందు మాట్లాడానని తెలియజేస్తున్నాను.

# విద్యుత్ బిల్లుల మాఫీ

**14-3-2005**

అధ్యక్షా! ఇది లక్షలాది మందికి సంబంధించిన సమస్య, ఇందులో ఉన్న టెక్నికాలిటీస్‌లోకి వెళ్లవద్దని రోశయ్య గారిని రిక్వెస్ట్ చేస్తున్నాను. క్యాబినెట్ రిజొల్యూషన్ ఉంది. దాంట్లో వీటిని మాఫీ చేశామని, మేము ఆనాడు చెపితే, కనుక్కొని వచ్చి ఇక్కడ చెపుతానని రోశయ్యగారు చెప్పారు. ఈ విషయమై ఆయన క్లారిఫికేషన్ ఇవ్వాలి. ఈరోజు రైతాంగానికి రూ. 1200 కోట్లు మాఫీ చేశారు. సమాజంలో అట్టడుగు వర్గాల వారైన ఎస్.సి. ఎస్.టి.లే అసలైన, నిజమైన అన్నదాతలు. దుక్కి దున్ని, మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి, నారు పోసి, నీరు పోసి పొలాల్లో పనిచేసేది వీరే. ఇటువంటి అన్నదాతలకు సంబంధించిన బిల్స్‌ని మాఫీ చేసే విషయంలో ఈ విధమైన కఠిన వైఖరి చేపట్టడమన్నది, ఈ ప్రభుత్వానికి మంచిది కాదని తెలియజేస్తున్నాను. మీరు ఎప్పుడు బకాయిలు మాఫీ చేస్తారా అని ఈ నిరుపేదలు ఆశతో చూస్తున్నారు. వీరి బిల్స్‌ని ఖచ్చితంగా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నాను. తండాల్లో విద్యుత్ కనెక్షన్స్ కట్ చేయబడి ఉన్నాయి. వీటిని వెంటనే రెస్టోర్ చేయాలి. నిజమైన అన్నదాతలైన వీరికి ఖచ్చితంగా బిల్లులను మాఫీ చేయాలని కోరుతున్నాను.

అధ్యక్షా, గౌరవసభ్యులు డా.జి.చిన్నారెడ్డి గారు మాట్లాడుతూ మా ప్రభుత్వం చాలా బ్రహ్మాండంగా చేస్తుంది, మీ ప్రభుత్వ టైంలో చాలా రేట్స్ పెంచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున గతంలో చేసిన వాగ్దానాలను గుర్తుచేస్తూ ఇప్పుడు ఏమి జరుగుతుందో చెబుతారని నేను అనుకున్నాను. మొత్తం ఎంటైర్ మెంబర్స్ గవర్నమెంట్ రిప్లై చదివారో చదవలేదో నాకు తెలియదు కాని ఈనాడు ఒకసారి ఇది చదివినట్లయితే కంప్లీట్‌గా, (ట్రెజరీ బెంచెస్ నుండి

అంతరాయం)

ఇది అతి కీలకమైన సమస్య. ఒక వైపు ఏమో పవర్ సప్లై రాష్ట్రంలో సరిగ్గా లేదు. ఎటుచూసినా అయిదారు గంటలు కంటే సక్రమంగా ఎప్పుడూ ఇవ్వడం లేదు. రోజుకి నాలుగు సార్లు పోతున్నది. గతంలో ఎన్నికలప్పుడు పవర్ పైన డిబేట్లు, డిస్కషన్లు జరిగాయి. ఈనాడు మొత్తం ఎంటైర్ పాలసీని రివర్స్ చేస్తూ రైతాంగాన్ని మోసం చేసి మేమేదో దెబ్బతీసామని మాట్లాడుతుంటే, ఈనాడు నేను ఒక్కటే అడుగుతున్నాను. రోశయ్య గారు, ముఖ్యమంత్రి గారు కూడా ఇక్కడ ఉన్నారు. I am asking one clarification. ఈ ఇంప్రూవ్‌మెంట్‌లో, పాలసీ డాక్యుమెంట్‌లో by 2006.

సార్ పచ్చి మోసం ఇదంతా! 2006 నాటికి మొత్తం మోటర్లు, పంపుసెట్లు, పైపులు, ఫుట్‌వాల్వ్‌స్ అన్నీ మార్చుకోవాలని కండిషన్స్ పెట్టారు. ఆ విధంగా మార్చుకోకపోతే మేము ఇస్తున్న ఫ్రీ సప్లై ఉండదని చాలా స్పష్టంగా డాక్యుమెంట్‌లో పెట్టారు. అధ్యక్షా, మీకు కూడా తెలుసు, ఒక రైతుకు 5 హెచ్.పి. మోటర్ కొన్నా పంపు సెట్టు మార్చు కోవాలనుకున్నా ముప్పై వేల రూపాయలు ఖర్చు అవుతుంది.

అధ్యక్షా, నేను గవర్నమెంట్‌ను ఒక క్వశ్చన్ అడుగుతున్నాను. ఫైనాన్స్ మినిస్టర్ గారు లెక్కల్లో చాలా ఎక్స్‌పర్ట్. ఈరోజు మొత్తం రాష్ట్రంలో 22 లక్షల పవర్ కనెక్షన్స్ ఉన్నాయి. వీళ్లు ఏమి కండిషన్స్ పెట్టారంటే, వచ్చే సంవత్సరం అంటే 2006 కల్లా ఉన్నటువంటి పంపు సెట్లు, పైపులు అన్ని మార్చుకోవాలి. లేకపోతే ఫ్రీ కరెంటు ఇవ్వమని అంటున్నారు. ఒక్కొక్క రైతుకు ముప్పై వేలు ఖర్చు అవుతాయి. ముప్పై వేల మీద నార్మల్‌గా ఈ టెన్ పర్సెంట్ రేట్ ప్రకారం ఇంట్రస్ట్ పెడితే మూడు వేల రూపాయలు రైతు మీద భారం పడుతుంది. కరెంట్ బిల్లు ఎంత కడుతున్నారంటే స్లాబ్ ప్రకారంగా సంవత్సరానికి, 5 హెచ్.పి. ఉన్న వాళ్లు 15 వందలు కూడా కట్టడం లేదు. దానికంటే డబుల్ ఈ రోజు వాళ్ల మీద పడుతుంది. 6900 కోట్ల రూపాయల భారం వేయబోతున్నారు. రైతాంగం పైన! ఆ విధంగా చేసుకోకపోతే మేము ఫ్రీ కరెంట్ ఇవ్వమని అంటున్నారు. చాలా స్పష్టంగా ఈ డాక్యుమెంట్‌లో చెప్పారు. ఇది వాస్తవమా?

# హైడల్ పవర్ ప్రాజెక్టులు

11-03-2005

స్పీకర్ సార్, ఈరోజు ముఖ్యంగా ఈ హైడల్ పవర్ ప్రాజెక్టు మీద చర్చ జరుగుతోంది, నేను వేరే విషయాలు చెప్పదలుచుకోలేదు . స్ట్రెయిట్‌గా గవర్నమెంటును అడుగుతున్నాను, becuase I don't want to take much time. ఇతర సభ్యులు చాలా విషయాలు మాట్లాడారు. నేను హైడల్ పవర్ ప్రాజెక్టుకు మాత్రమే కన్‌ఫైన్ అయి స్ట్రెయిట్‌గా కొన్ని విషయాలు అడుగుతాను. ఆరోజు ప్రాజెక్టు స్టార్ట్ అయిన తర్వాత ఇమ్మీడియేట్‌గా మన స్టేట్ కన్‌సర్న్ ఆఫీసర్స్ ఎస్.ఇ.లు,ఇ.ఇ.లు అక్కడ ఇన్‌స్పెక్ట్ చేసి ఆ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత సుబ్బారెడ్డి అనే వ్యక్తి అక్కడ పవర్ ప్రాజెక్టును స్టార్ట్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు వచ్చినట్లయితే ఆర్‌డిఎస్‌కు కంప్లీట్‌గా వాటర్ రాకుండా పోతుంది, మన స్టేట్ ఇంట్రెస్ట్ దెబ్బతింటుందని, ఆర్‌డిఎస్ ఆయకట్టుదారులకు తీరని నష్టం జరుగుతుందనే విషయాన్ని చాలా స్పష్టంగా ప్రభుత్వానికి తెలియజేశారు. సార్, నా దగ్గర లెటర్స్ వున్నాయి, నేను వాటిని టోటల్‌గా చదివి వినిపిస్తాను. పాయింట్ బై పాయింట్ చదివి వినిపిస్తాను. ఈరోజు వాళ్లు 1083 లెవెల్ దగ్గర కట్టారు, 1089 దగ్గర వుంటే తప్ప వాటర్‌పుష్ కాదు, 1089 లెవెల్ దగ్గర వుంటేనే కాల్వలో 850 క్యూసెక్స్ వాటర్ వస్తుంది. ఆవిధంగా 140 కిలోమీటర్ల వరుకు నీరు పోతుంది. వాళ్లు 1083 లెవెల్‌లో కట్టుకున్నారు. దాని వల్ల ఆర్‌డిఎస్‌కు చుక్క నీరు కూడా రాదని 6.1.2005 నాడు అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. ఆ తర్వాత మినిష్టర్‌గారు రెండు లైన్స్‌తో ఒక లెటర్ వ్రాశారు, మీరు ఈ విధంగా చేస్తున్నారు అన్యాయంగా, దీని మీద

మాకు కొంత సమాచారం కావాలి, ఈ విషయంలో మాకు అప్రెహెన్షన్, అనుమానం వుందని వ్రాశారు. అధికారులు అక్కడికిపోయి ఏ లెవెల్‌లో ప్రాజెక్టు కడుతున్నారు, ఎక్కడ కడుతున్నారని మొత్తం అఫీషియల్ రికార్డ్సు చెక్ చేసిన తర్వాతే ప్రభుత్వానికి తెలియజేశామని చెబుతున్నారు. Why I am telling this is, again the Government have stated that they are sending the same to a Technical Expert Committee. మళ్లీ ఎక్స్‌పర్ట్స్ కమిటీని పంపిస్తామని చెబుతూ కాలయాపన చేయడానికి ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆల్రెడీ అక్కడున్న ఇంజినీర్స్ టెక్నికాలిటీస్ అన్నీ డిస్కస్ చేసిన తర్వాతే మీకు ఉత్తరం వ్రాసిన విషయం వాస్తవం కాదా? ఆ తర్వాతే మీరు ఒక అబ్జక్షన్ రెయిజ్ చేశారు. ఆవిషయంపై ఇప్పటివరకు ఫర్‌దర్‌గా ఎటువంటి యాక్షన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకోలేదని. నిన్న కర్ణాటక రాష్ట్రమంత్రిగారు ఒక స్టేటుమెంటు ఇచ్చారు, నేను చెప్పడం కాదు. మినీ హైడల్ ప్రాజెక్టును అడ్డుకునే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కర్ణాటక జలవనరుల శాఖామంత్రి మల్లిఖార్జున ఖార్గే స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖా మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఈ ప్రాజెక్టును నిలుపుదల చేయాలని లెటర్ వ్రాసిన మాట వాస్తవమే, మళ్లీ ఆ అంశాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తావించకపోవడం వల్ల దీని ఫర్‌దర్‌గా మేము యాక్షన్ తీసుకోలేదన్నారు, this is what he quoted yesterday. మనం దీని మీద మళ్లీ పర్స్యూ చేయలేదు, యాక్షన్ తీసుకోలేదనే విషయం చాలా స్పష్టంగా కనబడతోంది. ఈ రోజు ఖచ్చితంగా దీంట్లో రెండవ అనుమానం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా ఒక కరువు జిల్లా. ఈ **ఆర్‌డిఎస్‌కు సంబంధించిన ప్రాజెక్టు 1938లో నిజాం పరిపాలనలో కట్టిన తర్వాత, స్టేట్స్ రీఆర్గనైజేషన్‌లో బౌండరీస్ అక్కడికి పోయాయి తప్ప, లేకపోతే ఎంటైర్ ప్రాజెక్టు మన రాష్ట్రానికి, మహబూబ్‌నగర్‌కు చెంది వుండేది.** మొత్తం 93 శాతం వాటర్ దక్కింది. ప్రాజెక్టు వాళ్ల ఏరియాలో వుంది కాబట్టి మేనేజ్‌మెంటు వాళ్ల దగ్గర పెట్టుకున్నారు తప్ప మరొకటి కాదు. కరువు జిల్లా అయిన మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్‌డిఎస్ ద్వారా 87 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి వుండగా, ఇప్పటికీ సరిగా నీళ్లు రావడం లేదు. వచ్చే 30, 40వేల ఎకరాలలో టోటల్‌గా ఒక్క ఎకరానికి కూడా ఇప్పుడు నీరు రాని పరిస్థితుల్లో, ఈ పవర్ ప్రాజెక్టును అపాలని గట్టిగా ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ శాసనసభ్యులు వాదిస్తారనుకుంటే, చిన్నారెడ్డిగారు మాట్లాడుతూ, ఈ పవర్ ప్రాజెక్టు వచ్చినా ఫరవాలేదు, పవర్ ప్రొడ్యూస్ చేసిన తర్వాత మళ్లీ ఆ వాటర్‌ను ఆర్‌డిఎస్‌లోకి లిఫ్ట్ చేసి ఇచ్చే విధంగా చేయాలని చెబుతున్నారు. ఈ వెనుకబడిన ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులు చేసిన మూలంగా, స్వార్థ పూరిత ప్రయోజనాల కోసం చేసిన దగాల మూలంగా తెలంగాణా ప్రాంత ప్రజలు పూర్తిగా అన్యాయానికి గురయ్యారు, ప్రతి సందర్భంలో కూడా మోసపోయారు. మళ్లీ ఈనాడు అమాయక ప్రజలను అదే విధంగా మోసం చేస్తున్నారు. అందుకే స్ట్రెయిట్‌గా ఒక క్వశ్చన్ అడుగుతున్నాను.

వారి తోడల్లుడు నిన్న పవర్ ప్రాజెక్టు మీద డిబేటు జరుగుతున్న సమయంలో ఆసెంబ్లీలోనే ఉన్నాడని ఈ రోజు పేపర్‌లో కూడా వచ్చింది. ఇప్పుడు ముఖ్యమంత్రిగారు ఒక్క మాట చెబితే

పని ఆగిపోతుంది. వారి ప్రోద్భలంతో అక్కడ ప్రాజెక్టు అవుతుంది. ముఖ్యమంత్రిగారూ, మహబూబ్ నగర్ జిల్లాకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది, ఆయనను ఆపాలి. ఈ ప్రాజెక్టు మహబూబ్ నగర్ ప్రాంతానికి గుదిబండలాగా తయారవుతుంది. మీరు మీ తోడల్లుడి యొక్క ఇంట్రెస్టు కాపాడడానికి ఇంత దుర్మార్గమైన పని చేయకూడదు. దీనిని ఇమ్మీడియట్‌గా స్టాప్ చేయించాలి. ఆవిధంగా యాక్షన్ తీసుకోవాలి. Sir, I want direct answer from the Chief Minister. (అంతరాయం )

Sir, our demand is that there is no other way out expect stopping this project. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితులలో ఆపాలి. దానికి ఏమి చర్య తీసుకున్నారు? ఒకవైపు డబుల్ గేమ్ ఆడుతున్నారు. ప్రభుత్వం సరిగా మాట్లాడదు. వాటీజ్ ది యాక్షన్? మీరు ఏ విధంగా యాక్షన్ తీసుకుంటారు? Yes, there are options. ఆప్షన్స్ లేవని అంటున్నారు. సజెషన్ ఇస్తామంటున్నారు. ఇది టోటల్‌గా ఇంటర్ స్టేట్ ప్రాజెక్ట్. అక్కడ పవర్ ప్రాజెక్ట్ పెడుతున్నాము. I would like to submit that the entire 93% of the interest is concerned to the Andhra Pradesh Government. మీరు ట్రిబ్యునల్ లోపల ఎలా ఆపాలి. ఇమ్మీడియట్‌గా కోర్టుకు వెళతారా? అక్కడ మీ ప్రభుత్వం ఉంది. మీరు ఆబ్జక్షన్ అప్రాప్రియేట్‌గా చేశారా? ముఖ్యమంత్రిగారు ఒక్క మాట చెబితే బాగుంటుంది. నిన్ననే ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ సోనియా గాంధీగారు సీతమ్మంత మంచిదని పొగిడారు. ఒక్క మాట చెప్పుమనండి. స్వయానా వారు చెప్పాలి. అయిన ఒక్క మాట చెబితే ఎందుకు స్టాప్ చేయరు? ఈపవర్ ప్రాజెక్ట్ ఎందుకు స్టాప్ చేయరు? ఇదెంత అన్యాయం?

స్పీకర్ సార్, I hope you will not adjourn the House as per our discussion. అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు టూ టైమ్స్ ఒక పర్సనల్ విషయాన్ని ఇక్కడకు తీసుకు వస్తున్నారు. అధ్యక్షా, వారు స్పష్టంగా రెండు సార్లు అన్నారు. ఎక్కడో వార్తలో వస్తే ఇక్కడ హౌస్ లో సరిగా లేపలేదని అన్నారు. బహుశా వారు మరచి పోయి ఉంటారు. When I was Home Minister, హోం మినిష్టరుగా ఉన్నప్పుడు ఈ సబ్జెక్టు వచ్చింది. కొంత మంది కావాలని చెప్పి దీనిని ఏదో రకంగా, కొంత పుకార్లు పుట్టించి, చేయాలనే ఉద్దేశ్యంలో చేస్తారు. అధ్యక్షా, రాజకీయాలలో ఉన్నప్పుడు రకరకాల కార్యక్రమాలు చేస్తారు. ఆవిధంగా వచ్చినప్పుడు హౌస్‌లో ఈ డిస్కషన్ వచ్చింది. I want to recall the things happened during that time. హౌస్‌లో డిస్కషన్ వచ్చినపుడు ఇమీడియట్‌గా సిబిఐ ఎంక్వయిరీ వేశారు.

The day to day investigation has been done under the suprvision of High Court. బహుశ ఆంధ్రప్రదేశ్ హిస్టరీలో ఏ కేసులో ఏది కూడా ఇంత సీరియస్‌గా కంప్లీట్‌గా ఇన్‌వెస్టిగేషన్ చేసినది లేదు. ఆరకంగా under the supervision of High Court జరిగింది. గౌరవ ముఖ్యమంత్రిగారిని నేను ఒకటి అడగదల్చుకున్నాను. Now, you are the Chief Min-

ister of the State. మీరు 1, 2 సార్లు ప్రస్తావన తీసుకొచ్చారు, ఇన్‌డైరక్టుగా ఏదో చెబుతున్నారు. నేను ఎలిగేషన్ అనుకుంటేనే చెబుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మీ దగ్గర వున్నది. ఆ రోజు జరిగిన సంఘటనపై ఆ అమ్మాయి చనిపోయినపుడు కనీసం మా పిల్లలు ఈ రాష్ట్రంలో ఉన్నారని ప్రూవ్ చేస్తే నేను రాజకీయాల నుంచి సన్యాసం తీసుకుంటాను. ఎక్కడో అమెరికాలో చదువుకుంటుంటే పిల్లలు ఎవరో ఒకరు చెప్పినారు, ఎదో పేపర్లో రాశారని చెప్పి, అది కూడా ఊహాజనితంగా రాసినట్టు చెప్పి మీరు ఆ రోజు తీసుకొని వచ్చి నానారభస చేయడానికి ప్రయత్నాలు చేసినారు. అసెంబ్లీ రికార్డులో స్పష్టంగా వున్నది. వారు అపోజిషన్ లీడర్‌గా ఉన్నప్పుడు వారిని నేను ఆప్షన్ అడిగినాను.జుడిషియల్ ఎంక్వైరీనా, సిబిఐ ఎంక్వైరీ కావాలా which enquiry do you want ? ఏమి ఎంక్వైరీ వేస్తారో వేసుకోండి నాకు అభ్యంతరం లేదని చెప్పారు. మిగతా అపోజిషన్ వాళ్లు సిబిఐ ప్రిఫర్‌బుల్ అని చెప్పారు. ఆ విధంగా సిబిఐ ఎంక్వైరీ వేశాము. సిబిఐ ఎంక్వైరీ జరిగింది. దాని పైన హైకోర్టు టేకప్ చేసింది. ఇంత జరిగిన తరువాత ఈరోజు మీరే అధికారంలో ఉన్నారు, ఆ సంఘటన జరిగినప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లయితే నేను రాజకీయాల నుంచి వెళ్లిపోతాను. నేను వాళ్ల సన్ మీద కానియండి, వారి మీద కానియండి unless and until there is substantial evidence, I never enquired into the matter. ఎవరన్నా ఇన్‌ఫర్మేషన్ ఉంటే తప్ప. సూట్‌కేసు బాంబ్ కేసు అప్పుడు I told very clearly to the police officers that unless there is proper information, I will not pursue అని నేను చాలా స్పష్టంగా చెప్పాను. If you do not have proper information, do not initiate action. This is what I told them. మీరు ఈరోజు అవిధంగా అనవసరమైన విషయాల్లో ఇది అంతా వారు ట్యాక్టిస్ చేస్తున్నారు. ఎవరు గట్టిగా మాట్లాడితే వాళ్ల యొక్క గొంతు నొక్కాలనే దాని మీద ఏదో రకమైన టాక్టీస్ ఏదీ అనజాలక చేస్తున్నారు. ఇటువంటి విషయాల్లో అభూత కల్పనలు ఒక ముఖ్యమంత్రి లెవెల్లో ఉన్నటువంటి వ్యక్తి ఈవిధంగా మాట్లాడం ధర్మం కాదు. అతను ఒక చాలెంజీ ఇస్యూ చేశారు. మేము మొత్తం రాష్ట్రంలో బ్రహ్మాండమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు కడుతున్నాము అన్నారు. మేము అడిగిందేమో ఆర్‌డిఎస్ మీద దీని మీద జ్యుడిషియల్ ఎంక్వైరీ వేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఆరోజు కూడా ఇరిగేషన్ ప్రాజెక్టుల మీద చాలా స్పష్టంగా మాట్లాడుతూ నేను ఆఫర్ చేశాను. I am sticking on to my allegation that more than thousand crores of rupees have been misused. ఇది ఒకవేళ కాదు అనుకుంటే మేము అందరం రాజకీయాలను వదిలివేస్తాము. (Interruptions)

కోట్ల రూపాయలు దోచుకు తింటున్నారు. ఈ ప్రాజెక్టులు ఈయన సొంతం కోసం డబ్బుల కోసం కడుతున్నాడు. కనుక ప్రాజెక్టుల పేరుతో దోపిడిని ప్రూవ్ చేయలేక పోయినట్లయితే తెలుగుదేశం పార్టీ మొత్తం పార్టీ ఇక్కడ నుంచి వెళ్లిపోతాము. మొత్తం రాజీనామా చేస్తాము ఎగైన్ యాక్సెప్ట్ చేయమని చెప్పి నేను ఛాలెంజ్ చేస్తున్నాను. రాజశేఖరరెడ్డిగారిది పచ్చిమోసం.

I want to clarify one thing to Rosaiah garu. ముఖ్యమంత్రిగారు ఏమి చెప్పారు హైకోర్టు, సుప్రీం కోర్టు ప్రస్తావన ఇక్కడ తెస్తున్నారు. అది ఏదో వీళ్లు చేసే పనులకు అన్నిటికి ఆమోదముద్ర వేసినట్లుగా చెబుతున్నారు. అక్కడ ఉన్నటువంటి ఒకే పాయింటు, అక్కడ కాంట్రాక్టు ఇచ్చారు. మీరు కాంట్రాక్టు కాన్సిలేషన్ చేయాలి. అవి ఇమ్మీడీయట్‌గా చెప్పిన తరువాత క్యాన్సిలేషన్ చేయకుండా వర్క్స్ అవార్డు చేశారు. వర్క్స్ అవార్డు చేసినందుకు వాళ్లు ఏమి అన్నారు మాకు నష్టం వస్తుంది. కనుక ఇది క్యాన్సిలేషన్ చేయకూడదు అనే దానిపైన హైకోర్టు అన్నది ఆల్‌రెడీ అవార్డు చేసి వుంటే మాత్రం You allow them, ఇవి అన్ని సుప్రీం కోర్టు బలపర్చింది that is the only limited point before the court. ఇక్కడ మేము అంటున్నాము టోటల్‌గా వేల కోట్ల రూపాయలు మీరు అవినీతికి పాల్పడుతున్నారు. టెండర్సులో అవినీతి జరుగుతోంది. మా పార్టీ తరపున మేము ప్రూవ్ చేస్తాము వేల కోట్లరూపాయలు తింటున్నారు. ప్రతి రోజు ఆఫీసర్సు గురించి చెప్పారు. వాళ్లు ఏమి అంటున్నారు అంటే ఆఫీసర్ల గురించి ఎలిగేషన్ చెబుతున్నారు. I stand by it, including your officer, which I have mentioned in this House. వాళ్లతో సహా ఖచ్చితంగా ఏజంట్లుగా వాళ్లు ఉన్నారు. వాళ్లు డబ్బులు వసూలు చేసి ఇస్తున్నారు. మేము ప్రూవ్ చేస్తాము..

గౌరవనీయలు రోశయ్య గారిని ఒకటి అడుగుతాను. He is the Fiance Minister of the state. నేను వేరే విషయాల గురించి తరువాత మాట్లాడుతాను. As a Finance Minister వారిలో ఉన్నటువంటి ఇద్దరు సీనియర్ మినిష్టర్స్‌ను మీ దగ్గర ఫైల్సు తీసుకొని రమ్మనమనండి, let him bring the relevent files to your chambers. కనీసం మీ దగ్గర డిస్కస్ చేద్దాము. మీ దగ్గర ఒకవేళ ప్రూవ్ చేయకపోతే మేము వెనుక్కు అవుతాము తప్పనిసరిగా, ఎన్నో వందల కోట్లు తింటున్నారు. ఎట్లా ఎస్టిమేట్సు మారుస్తున్నారో. ఈ విధంగా వేల కోట్ల రూపాయలు తింటున్నారు. మీ దగ్గర కూర్చొందాము, ఎలిగేషన్ ప్రూవ్ చేయకపోతే ఎలిగేషన్ మేము వెనక్కి తీసుకుంటాము. రాత్రికి రాత్రే ఎస్టిమేట్సు మారుస్తున్నారు. వేల కోట్లరూపాయలు తింటున్నారు. మీ యొక్క సమక్షంలో పరిశీలిద్దాము. We are not asking any thing more than that. అధ్యక్షా, ఇది మా బాధ్యత కూడా. డిబేట్‌కు సంబంధించి తప్పకుండా పార్టిసిపేట్ చేస్తాము. ఉదయం అతి కీలకమైన అంశం పైన చర్చ జరిగిన తరువాత ప్రభుత్వం మా డిమాండ్స్‌కు సంబంధించి ఏమీ చెప్పకుండానే హౌస్ ఎడ్జర్న్ చేసింది. మీరు ఎడ్జర్న్ చేశారు. ప్రతి నిమిషం మాకు సంబంధించిన రికార్డులను స్ట్రెయిట్ చేస్తూనే ఉన్నారు, మేము ఉదయం నుండి చూస్తున్నాము. ఛైర్ మీద ఉన్న రెస్పెక్ట్‌తో మేము కూడా చాలా కామ్‌గా ఉంటున్నాము. అధ్యక్షా, మేము రిక్వెస్టు చేసేదేమిటంటే, గౌ॥ముఖ్యమంత్రిగారు ఇక్కడే ఉన్నారు. ఇది చాలా కీలకమైనటువంటి అంశం. ఎందుకంటే ప్రాజెక్టును ఆపలేదు, ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. కనుక కనీసం ఇప్పుడైనా సరే ముఖ్యమంత్రిగారిని, రోశయ్యగారిని కోరేది, ఆల్ పార్టీ డెలిగేషన్‌ను ఒక దానిని ఏర్పాటు చేసి, రేపో, ఎల్లుండో ఎప్పుడైనా సరే, అక్కడకు వెళదాము,

అక్కడ జరుగుతున్న ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరిగే డామేజ్ తెలుస్తుంది. అక్కడికే కాకుండా, ఢిల్లీకి కూడా వెళ్లదాము, ఆ ప్రాజెక్టు పనులను ఆపడానికి ప్రయత్నం చేద్దాము. దానికి అస్యూరెన్స్ ఇవ్వమనండి. అది చెప్పిన తరువాత తప్పకుండా, we are ready to participate in all debates. Afterall, ఈ హౌజ్ అందరిదీ, వారిదే కాదు. We are all part of this House. వట్టిగా వాళ్లలాగా అల్లరి పెట్టేందుకు రాలేదు. ఇప్పటికే కరవుతో అల్లాడుతున్న ప్రదేశం అది. తీరని అన్యాయం జరుగుతున్నది. ఖచ్చితంగా దీనిపైన చర్చ తీసుకోవాలి. మమ్మల్ని వ్యక్తిగతంగా వాళ్లు ఎన్నో విధాలుగా మాట్లాడుతున్నా, మేము భరిస్తున్నాము పొద్దుటి నుండి. ఎందుకంటే ముఖ్యమైన ఈ అంశాన్ని డీవియేట్ చేయవద్దని. ఆర్‌డిఎస్ యొక్క ఈ సమస్యకు పరిష్కారం దొరకాలని మేము భరిస్తూ వస్తున్నాము. ఇప్పుడు సత్యనారాయణరెడ్డిగారు ఏమి మాట్లాడారండీ? వాళ్ల టిఆర్ఎస్ పరిస్థితి ఏమిటీ, వాళ్ల వ్యవహారం ఏమిటో ఒకసారి తెలుసుకోమనండి. చివరకు రాజశేఖర్‌రెడ్డి వారి చేతికి చిప్ప ఇస్తాడు. నాలుగు రోజుల్లో వారికే తెలుస్తుంది. అధ్యక్షా, కనీసం ఇప్పుడైనా సరే, ఆల్‌పార్టీ డెలిగేషన్‌కు యాక్సెప్ట్ చేయమనండి. చేసిన తరువాత then you can take VAT Bill for discussion. We will participate.

# విద్యుత్ ఇబ్బందులు

**24-2-2006**

స్పీకర్ సార్, నిన్న చాలా మంది గౌరవ సభ్యులు ఈ ఎలక్ట్రిసిటీ వల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి మాట్లాడారు. మినిష్టర్‌గారి రిప్లైలో మేము ఎక్స్‌పెక్ట్ చేశాం, తప్పనిసరిగా కొంత కన్సిడరేషన్ వస్తుందని. ఎందుకంటే మనం శాసనసభా సమావేశాలలో వున్నాం ఇపుడు. గ్రౌండ్ రియాలిటీ వాళ్లకు తెలియదని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే ప్రభుత్వ యంత్రాంగం వుంది, ప్రజాప్రతినిధులున్నారు. నిన్న మాట్లాడిన ప్రతి ఒక్క సభ్యుడు కూడా పార్టీలకు అతీతంగా రిక్వెస్ట్ చేశారు. గ్రామాలలో పరిస్థితి దారుణంగా వుంది. ఈసారి వర్షాలు బాగానే పడ్డాయి, భూగర్భ జలాలు కూడా పెరగడంతో రైతులు మోటార్లు పెట్టి పంటలు వేసుకున్నారు. ఈ రోజు వీళ్లు ఇస్తున్న ఏడు గంటలు కూడా రెండు దఫాలుగా ఇస్తున్నారు, దాని మూలంగా చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ముఖ్యమంత్రిగారు కాని ప్రభుత్వం కాని వరి వేయకూడదని ప్రచారం చేశారు. అయినప్పటికీ కొంతమంది వరి వేశారు. కొన్ని ప్రాంతాలలో వరి వేయలేదు. ఆరుతడి పంటలు మిర్చి, మొక్కజొన్న వేసినప్పుడు రాత్రి పూట నీరు పెట్టాలంటే రైతులు చాలా ఆందోళన పడుతున్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ కరెంటు మాకు రెండు గంటలు పెంచిపించండి, ఎలాగోలా బయటపడతామని కోరడం జరిగింది. దయచేసి ప్రభుత్వం పూర్తిగా ఇవ్వజాలమనే ఆలోచన చేయవద్దు. శ్రీశైలంలో 854 అడుగులకు దించవద్దని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినట్లు మాకు తెలుస్తున్నది. మా దగ్గర ఉన్న వాటర్‌ను ప్రాపర్‌గా యుటిలైజ్ చేస్తే, సాగర్‌లో కూడా ప్రిజర్వ్ చేసుకోవచ్చు. అది సముద్రంలోకి విడువవలసిన పని లేదు. 854 అడుగుల

కంటే దించి వాడిన సందర్భాలున్నాయి. మే నెల వరకు వాడుకోవడం కోసం నిలుపుదల చేశామని అన్నారు. మార్చి ఎండింగ్ వరకు మెయింటెయిన్ చేయండి. డిమాండ్ ఈ విధంగా వస్తుందని తెలిసి కూడా కంటింజెన్సీ ప్లానింగ్ వరకు మెయింటెయిన్ చేయండి. డిమాండ్ ఈ విధంగా వస్తుందని తెలిసి కూడా కంటింజెన్సీ ప్లానింగ్ చేయలేదు. పన్నెండు గంటలు, తొమ్మిది గంటలు కరెంటు ఇస్తామన్నారు. ఇప్పుడు 7 గంటలకు మించి ఇవ్వమని అంటున్నారు. మాకు లెక్కలు తెలియక కాదు. మీకు లెక్కలు తెలియక కాదు. గంటకు 1600 మిలియన్ యూనిట్సు కరెంటు ఉత్పత్తి అవుతుంది. రెండు గంటలు తగ్గిస్తే మీరు ఇస్తున్న రూ. 829 కోట్లు మిగులుతాయి. మీరు 400 కోట్లు మాత్రమే ఫ్రీ కరెంట్ ఇస్తున్నారు. పంటలు వేసుకునే టైమ్‌లో అయినా మీరు కరెంటు ఇవ్వాలని కోరుతున్నాను. మినిష్టరు గారికి వారిని లెక్క చెప్పమని అనండి. ఈ రోజు మీరు ఎన్ని కేసులు పెట్టారు? మేము పెట్టలేదని అన్నారు. ఒకసారి జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తి చెప్పాడు. సెంట్రల్ జైలులో 25 శాతం మంది కరెంటు కేసుల వారున్నారు. నేను వెరిఫై చేయలేదు. ఎన్ని కేసులున్నాయో మీరు వెరిఫై చేసి చెప్పండి. మేము కరెంటు బాకీలు ముక్కుపిండి వసూలు చేసినట్లయితే రూ. 1200 కోట్లు ఎలా ఉంటాయి. మేము మూడు, నాలుగు సంవత్సరాలు సరిగా వసూలు చేయలేదు. కాబట్టి రూ. 1200 కోట్లు మిగిలిపోయాయి. తరువాత మాఫీ చేయడం జరిగింది. లేదంటే రూ. 400 కోట్లని కదా డిమాండ్. టూ స్పెల్స్‌లో ఇవ్వడం వల్ల ఒక మడి పారుతుంది. మరల ఆన్ చేసినప్పుడు మరల అదే మడి పారుతుంది. రెండవ మడికి సరిగా నీరు పారడం లేదు. ప్రభుత్వం ఖచ్చితంగా తొమ్మిది గంటల కరెంటును కంటిన్యూగా రెండు నెలలు ఇస్తే బాగుంటుంది. (అంతరాయం)

అధ్యక్షా! మా సభ్యుల ఉద్దేశ్యం మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని కాదు. ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. మంత్రిగారు మాట్లాడినప్పుడు, నాకు అవకాశం ఇస్తారనుకొన్నాను. కానీ ఇక్కడ ఉన్న పరిస్థితుల్లో అది జరగలేదు. మేము కరెంటు విషయంలో రెండు, మూడు డిమాండ్స్ చేశాము. 9 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ రైతులకు ఇవ్వమని కోరాము.

# గోదావరి పై జల విద్యుత్ ప్రాజెక్టులు

**9-12-2005**

అధ్యక్షా! గోదావరి వాటర్‌పైన రెండు జల విద్యుత్ ప్రాజెక్టులు తీసుకోవడానికి అవకాశం ఉందని మేము అధికారంలో ఉన్నప్పుడు గోదావరి వాటర్ యుటిలైజేషన్ ఆధారిటీ స్పెసిఫిక్‌గా ఐడెంటిఫికేషన్ చేయడం జరిగింది. ఏరియాస్ ఐడెంట్‌ఫై చేసి ఇన్‌వెస్టిగేషన్స్ స్టార్ట్ చేయడం జరిగింది. దుమ్ముగూడెం, సింగరెడ్డిపల్లిలో హైడ్రో ప్రాజెక్టులు కడితే 700 మెగావాట్లు పైన జల విద్యుత్ వచ్చే అవకాశం ఉందని చాలా స్పష్టంగా అధికారులు చెప్పడం జరిగింది. దుమ్ముగూడెం పైన టోటల్‌గా సర్వే చేయడం జరిగింది. దీనిపైన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయడం జరిగింది. డిపిఆర్ తయారు చేయాలంటే ఎంత టైమ్ పడుతుందో అందరికీ తెలుసు. దాని ప్రకారం 352 మెగావాట్సు, రూ. 3165 కోట్లతో మనం జల విద్యుత్ ప్రాజెక్టు దుమ్ముగూడెంలో తీసుకోవడానికి అవకాశం ఉంది. దానికి సంబంధించి ఆస్ట్రియన్ గవర్నమెంట్ ఎయిడ్ వస్తుందంటే ఆరోజు ఆ గవర్నమెంట్ నెగోషియేషన్ చేసింది. ఈ గవర్నమెంట్ వచ్చిన తరువాత స్టిల్ టుడే ఏ ఒక్క ప్రోగ్రెస్ జరగలేదు. డిపిఆర్ కంప్లీట్ అయిన తరువాత ఎనీ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్, జపనీస్ సంస్థ వారు, అనేక సంస్థల వారు ఎయిడ్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. జవాబులో మినిస్టరుగారు ఇన్ ప్రిన్సిపుల్ క్లియరెన్సు వచ్చిన తరువాత దుమ్ముగూడెం పవర్ ప్రాజెక్టు కడతామని అంటున్నారు. ఈ రోజు రాష్ట్రంలో చేపడుతున్న 26 ఇరిగేషన్ ప్రాజెక్టులలో మూడు ప్రాజెక్టులకు తప్ప వేటికి క్లియరెన్సులు లేవు. అయినప్పటికి ఆ ప్రాజెక్టులను ఎలా చేపడుతున్నారు? వీటిని ఎందుకు చేపట్టడం లేదు? గోదావరి ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? ఏదైనా అంటే ప్రాంతీయ తత్వం అంటున్నారు. Is it not the negligence on the part of the Government? రెండు ప్రాజెక్టులకు 700 మెగావాట్స్, 200 పర్ డే అంటే మామూలు విషయమా?

మీకు అసలు ప్రాజెక్టు చేపట్టకూడదని ఉంటే దానికి మా వద్ద జవాబు లేదు. టోటల్‌గా ఇది హైడ్రోపవర్ జనరేషన్. గోదావరిలో ఈ పాయింట్‌లో నీరు పుష్కలంగా ఉంది. రెగ్యులర్ పవర్ జనరేషన్‌కు అవకాశం ఉంది. డిపిఆర్‌లో వయబిలిటీ కాకుండా ఫైనాన్సు చేస్తామని ఇన్‌స్టిట్యూషన్సు ముందుకు వచ్చాయి. you find out from your APGENCO, వారు చేపట్టకపోతే మేము చేపడుతామని చెప్పింది. అది వయబుల్ ప్రాజెక్టు అని చెప్పింది. గోదావరి పైన మిగతా మెట్ట ప్రాంతాలకు లిఫ్ట్ తప్ప వేరే అవకాశం లేదు. ఏదైనా అంటే రాజకీయం అంటారు. డిపిఆర్ ప్రిపేర్ అయి నాలుగు సంవత్సరాలు అయింది. దీనికి సంబందించి కమిటీ వేశారు. దాని గురించి మాట్లాడడం లేదు. ఆస్ట్రియన్ గవర్నమెంట్ ఎపిఇటి సంస్థ ద్వారా ఇచ్చిన దానికి కృష్ణా ప్రాజెక్టు కమీషనర్ హరీష్‌కుమార్ అధ్యక్షతన స్టడీ చేయమన్నారు. ఇంకొకరిని గవర్నమెంట్ ఆఫ్ ఇండియాను స్టడీ చేయమన్నారు. కాగితాలన్నీ అటూ ఇటూ పంచిపెట్టారు. ఒకరు మూడువేలు అంటున్నారు. లేదు అంతకంటే తక్కువ అంటున్నారు. ఇన్‌స్టిట్యూషన్స్ మేము చేపడతామని అంటున్నారు. ప్రయివేటు వారు మేము చేపడుతామని అంటున్నారు. ఇన్ని విధాలుగా అవకాశాలుంటే అసలు చేపట్టకూడదనే ఇంటెన్షన్ ఉందా? టైమ్ లేకనా? ఇవి రెండు నీటితో తయారు చేసే హైడెల్ ప్రాజెక్టులు ఎవరైనా వదిలిపెడతారా? బ్యాక్‌వర్డ్ ఏరియాలో తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. ఈయన మంచి మిత్రులు అంటున్నారు. నేను 700 మెగావాట్సు అన్నారు. వారు 500 మెగావాట్సు అన్నారు. వాటిని ఎప్పుడు చేపడుతున్నారో చెప్పమనండి. లాస్ట్ ఐదు సంవత్సరాలలో ఐడెంటిఫై చేయడానికి ఇన్ని సంవత్సరాలు పడుతుందా? (అంతరాయం) డిపిఆర్ ప్రిపేర్ అయింది. మాకున్న లేటెస్ట్ ఇన్‌ఫర్మేషన్ ప్రకారం పోలవరం హైట్ మూలంగా బ్యాక్‌వాటర్ రావడంతో దీని కెపాసిటీ తగ్గించి ఇది వయబుల్ కాదని చెప్పడానికి చూస్తున్నారని తెలిసింది. అది ఎంతవరకు కరెక్ట్? ఈ రెండు ప్రాజెక్టులను ఎప్పటిలోగా చేపడుతున్నారు? లిఫ్ట్ కావాలి కనుక ఈ రెండింటిని టోటల్‌గా ఇరిగేషన్ దానిలో ప్రొటెక్ట్ చేసి, వచ్చే పవర్‌ను లిఫ్ట్‌కు వాడాలని సంకల్పించాము. ఆ పద్ధతిలో కొనసాగుతున్నారా? జెన్‌కో ద్వారా చేపడుతారా? లేదా ప్రయివేటు వారికి ఇచ్చే ఆలోచన ఉందా? ఎప్పటిలోగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతారో తెలపాలని కోరుతున్నాను.